Reddy, received support from all sections of Lok Sabha including Sri. Y.B. Chavan, the then Home Minister.

That this was taken as correct and true is evidenced by no other than the architect of Vishal Andhra, Sri Neelam Sanjiva Reddy. Speaking in the hallowed precincts of the Lok Sabha, from the elevated position of the Speaker of the House as he then was, he stated:

It is already very late. As I said in the beginning itself, this debate has been very useful. I have been throughout sitting here and hearing the speeches. It is very delicate for me to take any action n this issue. I am a guilty party; let me own it. I have been a signatory to this agreement and if it is not fulfilled, I feel, something unfortunate has happened and it must be corrected. I do not know how it can be corrected. It must be corrected. As a signatory to it, I feel guilty (pages 407 & 408, Lok Sabha Debates on 1st April, 1969)

No more need to be said that the demand for a separate Telangana should be conceded by bifurcating Andhra Pradesh just as Punjab was in 1966. If the people of that state could not endure the discrimination over ten years, the people of Telengana have endured it for over 53 long years. Enough is enough!! This aspect deserves serious consideration by the SriKrishna Committee.

Courtesy - Sri M. Narayan Reddy, Ex-M.P.



Excerpts from the representation made by Sri Y Qureshi to the Justice B.N. Sri Krishna committee on Telangana

While it is , no doubt true that the people of Telangana and those of rest of the state of Andhra Pradesh speak the same language Telugu,.But it must be appreciated that the people of these two regions Viz , Telangana and Andhra had been living under two different traditions , cultures and political powers at least for last over 200 years. The states reorganization commission unanimously accepted that the region of Telangana has had it own cultural identity and traditions and that the demand of this region being created as a separate Telangana State was very much justified. The members of the states reorganization commission unanimously expressed their views for recognition of distinct and separate identity both of culture and tradition, more particularly by the social and economic conditions of the region.

It is a matter of History which no body can deny that all the statutory safeguards provided for in the states reorganization Act. Have been honoured more in their breach than complying there with. The result was the people of this region were betrayed, exploited and oppressed both economically and socially and more particularly in the field of employment and in harnessing the natural resources. It cannot be gain said that these exploitations lead to several agitations and each time the union of India attempted to suggest and provide some remedy or other , under the name and guise of gentlemen'sAgreeement ", creation of a separate "Telangana Regional Committee"etc . It is again a matter of history and cannot be denied by any person having any conscience or claimed to be committed to constitutional concept of EQUALITY, that EVERY ONE of the so called guarantees, remedies or attempts to solve the sufferings of the people of Telangana have been violated to the extreme extent.

Any person having a conscience and committed to any sense of justice will appreciate how much in justice and

exploitation had been done in the matter of employment not only in the executive branch of the state but also in the judiciary. It may appear to be ironical, but it is very much true, than even the so called autocrat and despotic ruler of Hyderabad i.e. H.E.E. the Nizam had much greater sense of justice and commitment to tee concept of 'welfare state'. The irrigation system developed by him was legendary. The construction of Nizam Sagar, O'Hara, Dindi, Palair and other Amicus on Majeera River and the system of irrigation in the other Districts by harnessing the Small River and streams was amazing. Not a drop of water from the irrigation system developed by him was allowed to go waste.

The government had sold more than fifty thousand acres of erst while ' sarfekhas 'land around the city of Hyderabad having converted it into "Government land 'worth more than TEN LAKHS CRORES of rupees now let us look at the fields which are often claimed as development of Hyderabad city. In the guise of developing film industry vast extents of lands have been given either free of cost or at nominal rates. This is the same case of any other industry in and around Hyderabad . In order to save the time of the readers, repetition of names of industries in avoided:but with out any fear of contradiction it can be stated that as on today the land these industries or entrepreneurs got from the government either free of cost or at just nominal cost will constitute more than seventy five percent of all their Assets in and around Hyderabad City. Even in the case of developers of land i.e., the so called colonizers in and Hyderabad City, it is the land of Telangana area with which they became millionaires. Can any of them account for any investment worth the name at any rate any investment which could be compared to the profit the derived from these ventures utilizing the land of Telengana.

Now let us address ourselves to the oft repeated slogans and claims of the "Samaikhya Vedas" that tee city of Hyderabad was improved after the formation of the State of A.P. than what it was during erstwhile Hyderabad State. The statement or claim as the case may be is either out of ignorance of historical and geographical knowledge or out of sheer

caprice. It is a matter of history that the City of Hyderabad was the Fourth largest City in India, i.e., after Calcutta Bombay and Madras even during the third and fourth decades of the last century. It was much bigger tan Delhi. The cities of Bangalore, Ahmedabad and Delhi have grown only after independence.

Now let us look at the fields which are often claimed as development of Hyderabad city. In the guise of developing film industry vast extents of lands have been given either free of cost or at nominal rates. This is the same case of any other industry in and around rates. This is the same case of any other industry in and around Hyderabad. In order to save the time of the readers, repetition of names of industries is avoided; but with out any fear of contradiction it can be stated that as on today the land these industries or entrepreneurs got from the government either free of cost or at just nominal cost will constitute.

Any person, who had visited Hyderabad earlier to 1956, would agree that Hyderabad was the most beautiful city in India with about 300 lakes in and around Hyderabad city. Can any body deny that Hussain sagar was the most feature and landscape of this city? In the guise of laying of roads across the lake (Necklace Road and development of parks ie., Lumbini park, NTR gardens, Sanjeevayya park), the capacity of the sake in terms of content of volume of water, has been reduced to one fourth of its original capacity Hussainsagar was known to be the LUNG of the Twin cities of Hyderabad and secunderabad. Can any sane person claim this to be a dev element in any sense of the expression "development of a city 'or its population. This is the case of almost all the other three hundred and odd lakes in and around Hyderabad city. Almost all of them have been allowed to be occupied by people affiliated with "land mafia" and most of them from outside Telangana area.

The other basic concepts of a 'welfare State 'are Education and Health. Both these fields of state function have been privatized Osmania General Hospital. Hyderabad, Gandhi Hospital at secunderabad and many other government Hospitals have been totally neglected and corporate

Hospitals like Apollo, care, yeshiva, are being encouraged and allowed to be dev eloped at the cost of all the government Hospitals. In the process the government Hospitals are neglected there by denying .Medical relief to the poor and down trodden. On account of more and more Privatization of education, rich influential and persons in power get their ; children admitted in costly private corporate educational institutions and finally get shot up into all Professional institutions (Medicine , Engineering , Law, Business etc). This may be common in the both the areas (Telangana & Andhra) but speaking for Telangana area , It is significant that Almost All the erst while reputed government Hospitals and educational institutions taking care of the poor people have been virtually r endured use less . Still the slogan of dev elopement of the region goes on. The above narration is just a synopsis of a long story of depredation of social economic, educational and cultural life of the people of Telangana.

The concept of "Secularism "which was introduced in the Indian Constitution in 1972 by the 42nd Amendment was very much in vogue in the Hyderabad state. Although headed by Muslim Monarch, the Government was absolutely secular. The penal laws, the property laws relating to contract and all other civil laws were common to all people. The matters relating to All religions, Hindus , Muslims, Christians, Parsis, jains Etc were administered by only one department known as "UMOOR-E_MAZHABI " i.e., ecclesiastical department, which was almost always headed by a Hindu Minister. The preservation of Hindu Temples and Archeological Monuments like Ajanta Ellore, palampet and thousand pillar Temples in Warangal District and the state Management of Bhadrachalam Temple are but a few examples of the "Secular" Commitment of the state. The Social, religious and political life of the community was absolutely harmonious except for a short period of thirteen months from August, 1947 to September, 1948 which had occasioned on account of the mischievous provocation of the departing British Government provoking All the Native States to declare their 'Independence' and to join the Indian union which is a matter of History.

Now let us also have a glimpse on the attacks on the social and cultural and cultural aspects of the Telangana people subjecting them to humiliation and degradation. Taking advantage of their total control on Film field and Electronic Media the people from Andhra area had subjected the people of Telangana area in to enormous amount of humiliation and degradation. Every bad character in films, serials and advertisement s is depicted to be belonging toTelangana region purporting to use the Telangana dialect . Even in songs the character of Telangana people including women are attached. Can there be a valid defense or justification of the song-entitled 'Nizam pori". Of course it may also show the lack of culture and character on the part of those depicting such pictures and broad castings such dialogues and songs, but the purpose and intention is obviously to hurt and humiliate the people of Telangana.

In the background of such prolonged economic deprivation and sustained attacks on the social and cultural lives of the people of Telangana, how can any sane person accept the continuation of the forced merger of these two regions. The people of Telangana have suffered these losses and tolerated these humiliations too long and no power on earth can prevent their demand for separation and restoration of their earlier position existing on 1st November, 1956 minus those regions which where Maharashtra and Karnataka.

While the demand for separation is physically feasible and legally possible but unification by force is not possible either physically or legally. It would have been possible only with a spirit of mutual give and take and mutual respect and consideration for each others interest which have been totally absent for all these five and half decades. Now it is too late and absolutely impossible to repair the same and any attempt at that would be futile. It is in the interest of the people of both the regions to agree to separate peacefully before the matters become worse.

(Courtesy - Sri Y.Qureshi)

ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాల రోజుల్లో
ఆంధ్రా తెలంగాణా విభజన గురించి
కవి సమ్రాట్ **విశ్వనాథ సత్యనారాయణ** గారి
అభిప్రాయం

"అన్నదమ్ములు విడిపోతామంటే మునసబ్ కరణాలు తమ
లెక్కలకు ఇబ్బంది కలుగుతుందని వారించ ప్రయత్నించినట్లు
ఉద్యమం అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది."

"ఇప్పటి పరిస్థితులలో ఆంధ్ర, తెలంగాణా విభజన సమంజసమే.
ఇది నా అభిప్రాయం కూడా."

తెలంగాణా సాంస్కృతిక అస్తిత్వ పోరాటం

తెలుగు విభాగం



Fortified Pillar of Satavahana period
at Bodhan, Nizamabad Dist.,
Telangana

తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వ పోరాట శంఖారావం
తెలుగు విభాగ ప్రవేశిక

– సామల సదాశివ

ఐదారేండ్ల కిందట పైదాయిషీ హైద్రాబాదీ పరవస్తు లోకేశ్వర్ రాసిన "సలాం హైద్రాబాద్" అనే నవలకు ఒకటిన్నర పేజీల ముందుమాట రాసినాను. అందలి మొదటి పేరాగ్రాఫ్ ఇక్కడ ఉటంకిస్తాను.

"బిష్ణు అజ్ నై చూ౮ హికాయత్ మీకునద్"

"పిల్లనగ్రోవి ఏదో కథ చెప్తున్నది. విను." అంటూ జగత్ప్రసిద్ధమైన తన మస్నవీ కథలు చెప్పటం మొదలు పెట్టినాడు మౌలానా రూమీ. వెదురు పొదలోంచి వేరు చేయబడిన వెదురు ముక్క మూగగా పడి వున్నది. ఉలుకదు – పలుకదు. ఎవరైనా పలికించాలని ఊదితే బర్ బర్ అనే సవ్వడే కాని ఒక్క సుస్వరం వెలువడదు. అన్నీ అపస్వరాలే. ఎవరైనా వెక్కిరిస్తే, పరిహసిస్తే సహించుకుంటుంది. సర్దుకుపోయి పడివుండటం అలవాటయింది దానికి. సహించటం ఎంతకాలం? సర్దుకు పోవటమైనా ఎంతకాలం? తన మూలాన్నే తనకు కాకుండా చేసిరి కదా అని లోలోపలే కుమిలి కుమిలి ఏడ్చింది. ఎంతగా ఏడ్చిందంటే ఎడద చిల్లులు పడింది. అప్పుడు పలికిందయ్యా! అన్నీ సుస్వరాలే. సప్తస్వరాల సరాగాలతో తన సంగతులు పలికింది. పదిలంగా వున్న తన పొదను చూసుకొని పరవశించి కథలు చెప్పింది. ఆ కథలే మౌలానా రూమీ మస్నవీ.

తన మూలమైన తెలంగాణాలోనే తమను పరాయి వాళ్లను చేసి, ఇక్కడి వనరులన్నీ తమవైపు తిప్పుకొని, ఆదాయ మార్గాలన్నీ తమ వారికే కట్టబెట్టి, తమ మీద అధికారం చెలాయిస్తున్న ఆంధ్రుల వలన కలిగే బాధలను, బాధితులైన తెలంగాణావాదులు, తెలంగాణా మేధావులు, తెలంగాణా రచయితలు, తెలంగాణా కవులు ముక్త కంఠంతో తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వ పోరాటానికి శంఖారావాన్ని పూరిస్తున్నారు వినండి.

తాము జన్మించిన తెలంగాణాలోనే తాము రెండవ తరగతి పౌరులుగా జీవించవలసి వచ్చిన పరిస్థితు లేర్పడినందువలన తమ తెలంగాణా ఎంత నష్టపడ్డా ఇంకా కళ్ళముందు కనిపిస్తూనే వున్నది గనుక, తామే పాలిస్తూ దీన్ని యధాపూర్వ స్థితికి తేవచ్చునన్న ఆశతో పూరిస్తున్నారీ శంఖారావాన్ని వినండి.

సూఫీ మత ప్రతిపాదితమైన జగద్విఖ్యాత మస్నవీని రచించిన మౌలానా రూమీ పూర్తి పేరు మౌలానా జలాలుద్దీన్ రూమీ. ఇతడు తన సతీర్థ్యుడైన హిస్సామొద్దీన్ జియావుల్ హఖ్ తో అంటున్నాడు 'బిష్ణు' అని. అంటే మౌలానా రూమీ వక్త, జియావుల్ హఖ్ శ్రోత. వక్తగా మౌలానా మస్నవీ కథలన్నీ జియావుల్ హఖ్‌కు

చెప్పినాడన్న మాట. మొలానా కంటే రెండు వందల సంవత్సరాల పూర్వపు తెలంగాణా మహాకవి పాల్కురికి సోమనాధుడు ఈ సాంప్రదాయాన్ని ప్రారంభించినాడు. సోమనాధుడు తాను చెప్పిన కథలు ఒక శ్రోతకు వినిపించినాడు. సోమనాధుడు తెలంగాణా మహాకవి. ఆంధ్రుల ఆదికవి నన్నయ కంటే పూర్వుడు. శివశ్రీ బండారు తమ్మయ్య, నిడదవోలు వెంకట్రావు మొదలైన కొందరు శైవమతాభిమానులు మాత్రం సోమనాధుని వంటి ఆరాధ్యకవుల గురించి ఉత్సాహంగా చెప్పినారు. సోమనాధుడుండగా నన్నయ ఆదికవి ఎట్లా అయినాడు? నన్నయ కంటే కొంచెం పూర్వుడేమో అనిపించే నన్నెచోడున్ని గురించి కొందరటు కొందరిటు చర్చిస్తూ ఉండగానే నన్నయాభిమానియైన ఒక పండితుడు, "నన్నె చోడుడనే కవే లేడు. అదంతా నన్నెచోడుడనే కవి రాసినాడని ఒక తాళపత్ర గ్రంథాన్ని ఉద్ధరించి దాన్ని పరిశీలించి, పరిశోధించి, ముద్రింపజేసి, పీఠిక రాసి ప్రచారం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి మానవల్లి రామకృష్ణకవి రచించిన పద్యకావ్యమే ఆ 'కుమార సంభవం'." అంటూ ఆంధ్రా యూనివర్శిటీలో ఒక సిద్ధాంతవ్యాసం సమర్పించినాడని విన్నాను.

పోతన వరంగల్ జిల్లాలోని బమ్మెర నివాసి యని తెలంగాణాలో అందరికీ తెలుసు. ఆంధ్రులైన శేషాద్రి రమణ కవులు పోతన వరంగల్లు జిల్లా లోని బమ్మెర నివాసి అని ఆధారాలతో నిరూపించినారు. అయినా అతడు ఒంటిమిట్ట వాడని ఒక వాదం లేవదీసినారు సీమాంధ్రులు. ఇంకా వాదిస్తున్నారు. అంతటి మహాకావ్యాన్ని ఒక తెలంగాణా కవి రచించినాడన్న సత్యాన్ని సీమాంధ్ర విద్వాంసులు సహించలేక పోతున్నారు. తెలంగాణాకు చెందిన మిగతా సంస్కృతాంధ్ర లాక్షణికుల గురించి, కవుల గురించి ఈ శంఖారావంలోనే కొందరు రచయితలు, మేధావులు నినదిస్తున్నారు. అదంతా వినండి.

తెలంగాణా సాహిత్య వాతావరణంలో సాహితీపరుల వెంట, రచయితల వెంట, కవుల వెంట, పండితుల వెంట తిరిగి ఇక్కడి తిండి తిని, ఇక్కడి నీళ్ళు తాగి ఇక్కడ అంటే ఈ తెలంగాణా ప్రాంతంలో కవులు పూజ్యము అంటూ రాసినాడు. ఒక చెవిటి గుడ్డి పండితుడు. అతని పేరెందుకు గానీ, వున్నది గనుక చెప్తాను వినండి. అతనిపేరు ముదుంబ రాఘవాచార్యులు. అతని రాతలు చదివిన తెలంగాణా వైతాళికుడు, గోలుకొండ పత్రికాధిపతి సురవరం ప్రతాపరెడ్డి మహోదయులు బాధపడి ఇదిట్లా వదిలిపెడితే మంచిది కాదని భావించి, తాను పరిశ్రమించి, తన అనుయాయులను నలుకెలకులకు పంపి, పరిశీలించి, పరిశోధించి 'గోలుకొండ కవుల సంచిక' అంటూ ఒక కవుల సంచిక వెలువరించినాడు. ఆ వివరాలన్నీ కొందరు బాధిత రచయితలు, మేధావులు విశదంగా నినదించి వున్నారు. వినే ఓపిక వుండాలె కానీ అవన్నీ వినవచ్చు. ఆ కాలంలో ఉద్యోగరీత్యా హైదరాబాదులో వున్న ముగ్గురు ఆంధ్రులు ఒక మూకగా జేరి అప్పటి దక్కన్ రేడియో నుంచి నిజాంను పొగడుతూ పలు ప్రసంగాలు చేసేవాళ్లు. తమ సంస్కృతిని, తమ భాషా సాహిత్యాలను

గురించి గొప్పగా చెప్పుకునే వాళ్ళు. ఇక్కడి సంస్కృతిని గురించి కానీ, భాషా సాహిత్యాలను గురించికానీ పల్లెత్తుమాట అనేవాళ్లు కారు. పైగా ఇక్కడివాళ్లను పరిహసించే వాళ్లు. ఆ ముగ్గురిని ఆనాటి బాధితులు "రాకాసి మూక" అని చాటుమాటుగా నిందించుకున్నారు. ఆ ముగ్గురిలో ఒకరు రాయప్రోలు సుబ్బారావు, ఇంకొకరు కాసింఖాన్, మూడోవ్యక్తి సీతారామయ్య కురుగంటి.

అప్పటి తెలంగాణా విద్వాంసులకు ఎంత మనస్తాపం కలిగిస్తే, ఆదరణీయులైన ఆ ముగ్గురిని రాకాసి మూక అన్నారో! తెలంగాణా విద్వాంసులు సంస్కారహీనులు కాలేదెన్నడు.

కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారు, తామూ, తమ అల్లుడు కలిసి రాసిన 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' అనే గ్రంధంలో తెలంగాణా ప్రౌఢ కవులను గూడా చూడలేకపోయినాడు. ఆ గ్రంథంలో ఒక చోట హన్మకొండ కాలేజ్ ఎట్ హైస్కూల్లో పనిచేసిన ఉదయరాజు శేషగిరిరావు గురించి ఒక మాట రాసినాడు. "ఇతన్ని ఈ ప్రాంతంలో కొందరు అపర చేమకూర అంటారట" అని. శేషగిరిరావుగారు సంస్కృతాంధ్రాల్లో గొప్ప పండితుడు. ఇంగ్లీషులోనూ, ఉర్దూ ఫారసీలలోనూ పండితుడు, ప్రౌఢకవి. అతని రచనలేవీ అచ్చు కాలేదప్పటికి. కాళీదాస విరచితమైన అభిజ్ఞాన శాకుంతలాన్ని ఉర్దూలో అనువదిస్తే అందులో కొంతభాగం కాలేజి మేగజైన్‌లలో అచ్చయింది. చేమకూర వేంకటకవిలాగా శేషగిరిరావులో చమత్కార సంభాషణ మధికం. కాబట్టి అతన్ని ఎవరైనా 'అపర చేమకూర' అంటే సమంజసమే. అతన్ని కొంత చదివి వుంటే సీతారామ భట్టాచార్యుల వారికి "అంటారట" అని అనవలసి వచ్చేది కాదు.

ఇక్కడొక ముచ్చట.

నేను 1947 వరకు హన్మకొండ కాలేజ్ ఎట్ హైస్కూల్‌లో చదువుతున్న కాలంలో పూ॥ శేషగిరిరావు మాకు తెలుగు, సంస్కృతం నేర్పేవారు. ఆంగ్లంలోకానీ, ఫారసీలో కానీ మాకు తెలియని పదమేదయినా అడిగితే తడుముకోకుండా వెంటనే సమాధాన పరిచేవారు. 1954లో నేను హన్మకొండ లష్కర్ బజార్ హైస్కూల్‌లో పనిచేస్తున్న కాలంలో అతడు ఉద్యోగ విరమణ చేసి అక్కడే వుండేవారు. సాయంత్రం స్కూలయిన తరువాత నేనుండే కిషన్‌పురా వెళ్లాలంటే అతనింటి ముందటి నుంచే వెళ్లాలి. నాకోసమే చూస్తున్నట్లు కూర్చుండి, "సదాశివ్! నాలుగు పద్యాలయిసయి విని వెళ్లువురా!" అని పిలిచేవాడు. తప్పదు, ఇంటికి వెళ్లిన వెంటనే చాయ్ తెప్పించి తన ప్రౌఢ కవిత వినిపించేవారు.

ఒకనాడు, "నవ్యాంధ్ర సాహిత్య వీధుల్లో కురుగంటి సీతారామయ్య మిమ్మల్ని "అపర చేమకూర" అన్నాడు అని చెప్పినాను. వారు బాగా సంబరపడిపోయి, "అట్లాగా సదాశివ్! అంత గొప్ప పుస్తకంలో నా పేరున్నదా? రేపు లైబ్రరీకి వెళ్దాంరా!" అన్నారు. మర్నాడు ఆదివారమైన హైస్కూల్ లైబ్రేరియన్ ఇంటికి వెళ్లి, అతన్ని

స్కూలుకు వెంబడించుక పోయి, మీఠాఖారా తినిపించి, చాయ్ తాగించి, నవ్యాంధ్ర సాహిత్య వీధుల్లో తమ పేరు చూసుకొని, మురిసి పోయినారు. అంతటి ప్రౌఢ చమత్కార కవి తెలంగాణా వాసి, అల్పసంతోషి.

ఆదిలాబాదు జిల్లా చెన్నూరు తాలూకాలో తెలుగు పండితుడుగా వానమామలై వరదాచార్యులు పనిచేసినారు వారి కవిత్వం ధారాశోభితమైనది. అత్యంత మధుర మనోహరమైనది. వారు చాలాకాలం శ్రమపడి పోతన అనే మహాకావ్యం రచించినాడు. పోతన జీవితచరిత్ర అది. ఆ కావ్యాన్ని సమీక్షించిన భారతి పత్రిక సమీక్షకులు, "ఇతనికి ఈ ప్రాంతంలో అభినవ పోతన అనే బిరుదు కలదట" అని సెలవిచ్చినాడు. ఆ కవిని శ్రద్ధగా చదివి వుంటే సమీక్షకునికి ఆ మాట అనవలసి వచ్చేది కాదు. అంతటి కావ్యం రాసిన వరదాచార్యులవారు తెలంగాణా ప్రాంతపు అభినవ పోతననేనా? అయితే దువ్వూరి రామిరెడ్డీ, జాషువా అన్ని ప్రాంతాల కవి కోకిల లెందుకు? నాళం కృష్ణారావు అన్ని ప్రాంతాల మధురకవి ఎందుకు? పుట్టపర్తి నారాయణాచార్యులు అన్ని ప్రాంతాల వారికి సరస్వతీ పుత్రుడే ఎందుకు? సంస్కృతీ సాహిత్యాల సందర్భంలో కీర్తి ప్రతిష్ఠల సందర్భంలో, ఆ ప్రాంతం ఈ ప్రాంతం, అంటూ మేమూ మీరూ, అంటూ స్పష్టంగా మాట్లాడే సీమ విద్వాంసులు, కోస్తా విద్వాంసులు తెలంగాణా విషయం వస్తే మనం మనం తోబుట్టువుల మన్నట్లు ఎందుకు ప్రవర్తిస్తారో! మన మన్నమాటే తప్పు. మీరూ, మేమూ అంటేనే ఒప్పు. మీ సంస్కృతి వేరు, మా సంస్కృతి వేరు, మీ ఆహార్యం వేరు, మీ భాష వేరు, మా భాష వేరు, మీ యాస వేరు, మా యాస వేరు. ఇదంతా వైనం వారిగా వివరిస్తూ నినదించినారు తెలంగాణాకు చెందిన బాధిత మేధావులు శ్రీ కె.శ్రీనివాస్, డా॥ గంధ్ర లక్ష్మణరావు, ఆచార్య రవ్వా శ్రీహరి, డా॥ వెల్చాల కొండలరావు మొదలైన వాళ్లు సవివరంగా నినదిస్తున్నారీ తెలంగాణ అస్తిత్వ పోరాట శంఖారావంలో వినండి బిష్ణు.

తెలంగాణా మీదికి ఆంధ్రులను తెచ్చినప్పుడే ఇక్కడి వాళ్ళు తమ అసమ్మతిని తెలిపినారు. ఈ పొత్తు కుదరదని తెగేసి చెప్పినారు. "ఇది కలసివచ్చే కాపురం కాదని మాకూ అనిపిస్తున్నది. ఎన్నో షరతుల మీద ఈ కాపురాన్ని యేర్పాటు చేసినాము. ఎప్పుడెవరికి ఇక కలిసి వుండలేమని అనిపిస్తే అప్పుడు ఎవరికి వారే విడిపోవచ్చు" అని హామీ ఇచ్చినారప్పటి పెద్దలు. కలిసిరాని కాపురమైనా అర్ధశతాబ్దికిపైగా ఓర్చుకున్నారు తెలంగాణా వాళ్లు. మధ్యమధ్య తిరుగుబాటు బావుటా ఎగురవేసినా న్యాయం చెప్పే వాళ్లెవరు తమ వెనక లేనందున వెనక్కి తగ్గవలసి వచ్చింది. ఇప్పుడు ఆంధ్రులు పెడుతున్న బాధ అసహ్యమైనది. మేమిక సహించుకోలేమంటున్నారు తెలంగాణావాళ్లు అందరు కలిసికట్టుగా తెలంగాణా అస్తిత్వ పోరాట శంఖారావం పూరిస్తున్నారు. తమ కష్టాలను, తమ నష్టాలను, తమ బాధలను వినగలిగిన వాళ్లకు నివేదించుకుంటున్నారు. ఎవరు వింటారు? ఎవరు కంటారు? బధిరాంధక సమూహమిది. వాళ్లకు తమ గొప్పలు దప్ప ఇతరుల్లో ఏదున్నా చూచే తీరికగానీ, వినే ఓపికగాని లేదుగదా!

హైదరాబాదు రాష్ట్రం అన్నపూర్ణలాంటిది. ఇక్కడ బ్రతుకడానికి ఎందరెందరో వచ్చినారు మన దేశంలోని నలుమూలలనుంచి వచ్చి ఇక్కడే స్థిర పడ్డారు. ఇక్కడి సంస్కృతితో మమేకమైనారు. హైదరాబాదు నగరమే గాదు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఇక్కడి ఆర్థికాభివృద్ధికి సంస్కృతీ వికాసానికి తోడ్పడ్డారు, తోడ్పడుతున్నారు కూడా.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూను బోధనా భాషగా మార్చే సంకల్పం కలిగినప్పుడు నిజాం ఆహ్వానం మీద ఉత్తరాది నుంచి ఎందరో ఉర్దూ విద్వాంసులు, కవులు, పండితులు హైదరాబాదు వచ్చినారు. అప్పట్లో ఉత్తరాది నుంచి వచ్చిన వాళ్ల భాష ఉర్దూ. హైదరాబాదు వాసుల భాష దఖని. హైదరాబాదు వాసులు కొందరు ఉర్దూ మాట్లాడినా, ఉర్దూలో కవిత చెప్పినా అందులో దఖనీ యాస ఉండేది. కాబట్టి ఉత్తరాది నుంచి వచ్చిన ఉర్దూ పండితులు, కవులు, దఖనీ ఉర్దూ పండితులను, కవులను పరిహసించేవాళ్లు. ఆ పరిహాసానికి ఖిన్నులైన హైదరాబాదీయులు "నాన్ ముల్కీ గోబ్యాక్" అనే ఉద్యమాన్ని లేవదీసినారు. నాన్ ముల్కీలన్నది ఉత్తరాది నుంచి వచ్చిన ఉర్దూ వాళ్ళనే కానీ, గుజరాతీలను కాదు, మార్వాడీలను కాదు, బొందిలోళ్లను కాదు, ఫారసీలను కాదు, బంజారాలను కాదు, హబ్షీలను కాదు, రోహిలాలను కాదు, మహారాష్ట్రులను కాదు, కన్నడిగులను కాదు. కానయితే మహర్షి కార్వే అధ్యక్షతన జరిగిన ఒక భాషాపరమైన మహాసభలో ఉర్దూ, మరాఠీ, కన్నడం మాట్లాడిన వక్తలను సభికులు విన్నారు, కానీ తెలుగు మాట్లాడిన వక్తలను ప్రత్యేకించి మహారాష్ట్ర శ్రోతలు "తెలంగీ బేఢంగీ" అని పరిహసించినారు. దానికి ఖిన్నులైన తెలుగువాళ్లు తమ భాషాపరమైన ఉద్యమాలు కొన్ని లేవదీసినారు. అవన్నీ చప్పున చల్లారిన వివాదాలే. కానీ ఉద్యోగాలకో, వ్యవసాయానికో, రాజకీయాలకో హైదరాబాదు రాష్ట్రానికి వలస వచ్చిన సీమాంధ్రులు, కోస్తాంధ్రులు మాత్రం తెలుగు వాళ్ళను బహువిధాలుగా పరిహసించి బాధపెట్టినారు. ఆ కారణంగా బాధితులైన తెలంగాణీయులు – తెలంగాణాలో స్థిరపడ్డ మార్వాడీలు, గుజరాతీలు, ముస్లింలు, తెలంగాణా వాసులతో కలిసి "ఆంధ్రా గో బ్యాక్, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్" అనే ఉద్యమాన్ని లేవదీసినారు. 1952 ప్రాంతంలో జరిగిన ఆంధ్రా గో బ్యాక్ ఉద్యమానికి సారధ్యం వహించిన పెద్ద మనిషి రాజా పన్నాలాల్ పిత్తీ. అతడు హైదరాబాదు మూలవాసి కాదు. తరువాతి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నవాడు అతని కొడుకు, రాజా బద్రీ విశాల్ పిత్తీ. ఎక్కడి నుండో వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డ వాళ్లు హైదరాబాదు నగరాన్ని, రాష్ట్రాన్ని తమదను కున్నారు. కానీ సీమాంధ్రులు, కోస్తాంధ్రులు మాత్రం ఇదంతా తాము దోచుక తినటానికే అని భావిస్తున్నారు.

ఈ వివరాలన్నీ వినండి. ఈ తెలంగాణా అస్తిత్వ పోరాట శంఖారావంలోని నాదాలను వినండి.

ధర్మయుద్ధం

– చుక్కా రామయ్య
ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు

ఒక ప్రాంతం నాగరికత, సంస్కృతులు పండితుల మెదళ్ళల్లో అల్లబడవు. అది సామాన్యుని చేనేత మగ్గం నుంచి, బాడిశ పదును నుంచి, కంసాలోళ్ల కొలిమి మంటల నుంచి రాజేయబడతాయి. ఊరు, వాడల్లో ఉన్న సకల వృత్తుల సమస్త చిహ్నాలు సంస్కృతికి నిదర్శనంగా నిలబడతాయి. అవే కొత్త నాగరికతకు పాదులు వేస్తాయి. అందుకే నాగరికత, సంస్కృతులు పండితుల ప్రవచనాలతో రావు. పొలాల్లో నాట్లేసే పల్లెపడుచుల నోటి నుంచి, ఆ లచ్చుమమ్మల మట్టి పాదాల నుంచి, పంటచేలల్లో కలుపు మొక్కలను తీసే ఆ శ్రమచేతుల వేళ్ల కొసల్లనుంచి అవి పుట్టుకొస్తాయి. ఆ లచ్చుమమ్మల పాదాల ధూళినుంచి ఎగుస్తున్న పాటలు విశ్వవిద్యాలయాల అకడమిక్ దర్బారుల్లో దిద్దబడవు. తెలంగాణలో నాగరికత ఆ ప్రాంతంలోని ప్రతి అంగుళంలో గర్భితమై ఉన్నది. ప్రకృతిలో కనిపించేవి, మన సమాజంలో ఉండే అసమానతలన్నీ ఇక్కడి నాగరికతలో ప్రతిఫలిస్తాయి.

మల్లమ్మను ఫ్యూడల్ సమాజంలో మల్లీ, పోచమ్మను పోచీ అంటారు. సమాజంలో ఉండే అసమానతలు నాగరికతలో కనపడతాయి. వ్యవసాయంలో ట్రాక్టర్లకన్నా నాగళ్లు ఎక్కువగా కనపడతాయి. చెరువులు ఎక్కువ కాబట్టి తెలంగాణలో ఎక్కడ చూసినా కట్టమైసమ్మలు, బతుకమ్మలు కనపడతారు.

ఒక ప్రాంతం నాగరికత కొన్ని తరాల ప్రజల జీవితంతోటి అల్లుకుని పోయి ఉంటుంది. ఈ ఆస్తిని ప్రతి తరం వచ్చే తరానికి ఇస్తూ వెళ్తుంది. తన వొంటిపై చేయివేస్తే భరిస్తాడు. తన ఆస్తిని దోచుకుంటే భరిస్తాడు. నాగరికతపై ఎవడైనా చేయివేస్తే సహించటం కష్టం. ఇది వ్యక్తి ఉత్పత్తితో ప్రాప్తించే కొన్ని తరాల ఆస్తి, కొన్ని ప్రాంతాలు దున్నిన మాగాణి. ప్రజల నాగరికతను, సంస్కృతిని, యాసను, భాషను గేలిచేయటం గానీ, తక్కువ చేయటం కానీ, తమ సంస్కృతిపై ఆధిపత్యాన్ని చలాయిస్తుంటే చూస్తూ వూరుకోవటం, మౌనంగా ఉండటం కానీ ధర్మం కాదు. ఆధిపత్యంపై తిరగబడుతూ ఆత్మగౌరవం కోసం పెనుగులాడటంతోనే ధర్మయుద్ధం మొదలవుతుంది. ఇది ధర్మం. న్యాయం కాదు. ధర్మానికి న్యాయానికి తేడా ఉన్నది. ధర్మం సుప్రీం కోర్టులాంటి ఉన్నత న్యాయస్థానాల్లో తేల్చబడదు. ఓట్ల పెట్టెతో నిర్ణయించేది కాదు. అది గుండెల నుంచి వచ్చే ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస లాంటిది కాబట్టే దానిని ధర్మం అంటున్నాం. ఎన్నో ఏళ్ళనుండి మొత్తుకున్నా అర్థంకాని 'గజినీ గోరీ'లకు అర్థమయ్యేదే 'తెలంగాణా అస్తిత్వ పోరాట శంఖారావం'. ఇది ఒక క్రియకు ప్రక్రియ. దాన్ని పెకిలించే ప్రయత్నం చేస్తే పోరాటం తప్పదు. ఎంతో

పరాక్రమవంతులైన రాజులు ఎన్నో ప్రాంతాలను ఆక్రమించుకొని రాజ్యాలేలారు కానీ అక్కడి నాగరికత జోలికి మాత్రం వెళ్లలేదు. ఒక ప్రాంత నాగరికత భయంతో వణుకుతుంటే ఆ గడ్డలో పుట్టిన మనిషేకాదు అక్కడి ఏ జీవైనా పెనుగులాడి తీరుతుంది. అదే ఈ సన్నివేశం. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న అస్తిత్వ పోరాటం అదే. సాహిత్య సాంస్కృతిక రంగాలే ఈ అస్తిత్వ పోరాటానికి ఊపిరులయ్యాయి.

వెల్చాల కొండలరావు సంపాదకత్వంలో "తెలంగాణా అస్తిత్వ పోరాటం" అనే పుస్తకం వెలువరిస్తున్నారు. దీనిని ధర్మయుద్ధం అని కూడా వారంటున్నారు. అది నా ఉద్దేశ్యంలో కూడా అక్షరాలా నిజం. యుద్ధం ఎపుడయితే న్యాయబద్ధమైంది అవుతుందో అపుడది ధర్మయుద్ధమే అవుతుంది. దానికి ముందు చేసే హెచ్చరికనే మనం 'శంఖారావం' అంటాం. యుద్ధం రాగూడదు, జరగగూడదనుకుంటే ఈ శంఖారావాన్ని విని సర్దుకొని ధర్మానికి తలవంచడం వివేకం. శంఖారావం ధర్మయుద్ధానికి తుది హెచ్చరిక లాంటిది కనుక, అకస్మాత్తుగా యుద్ధానికి దిగక హెచ్చరిక చేసి యుద్ధానికి దిగడం పుణ్యం, పురుషార్థం అనిపించుకుంటుంది, అలా చేబట్టే యుద్ధమే భారతీయ సంస్కృతిలో ధర్మమైంది అవుతుంది.

ఈ పుస్తకం నిండా తెలంగాణకు చెందిన సంస్కృతి, సాహిత్యం, శిల్పసంపద, నాటకరంగం, కళాసంపద, తరతరాల తెలంగాణ చరిత్రంతా వుంది. అలాగే తెలుగు మాట్లాడే రెండు ప్రాంతాల మధ్య ఉన్న తేడాలు, సాంస్కృతిక ఆధిపత్యాలు, వెనుకబడిన, వెనుకపడేసిన తెలంగాణకు సంబంధించిన అనేక వాదాలు, తర్కాలు, నిజాలు, సత్యాలు ఈ పుస్తకం నిండా నిండి వున్నాయి. తెలంగాణ సెంటిమెంట్‌పై వ్యాసాలున్నాయి. తెలంగాణ దేవాలయాలపై వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన వ్యాసాలున్నాయి. తెలంగాణ పండుగల, జాతరల దగ్గరనుంచి ఈనాడు జరుగుతున్న ప్రజాందోళనల వరకు ఈ పుస్తకంలో వున్నాయి. ఎందుకు సీమాంధ్ర ప్రాంతంవారు సమైక్యాంధ్ర కావాలని కోరుతున్నారు? అది భాష కొరకా? రాజకీయాల కొరకా? అన్న అంశంపై వెల్చాల కొండలరావు సుదీర్ఘమైన వ్యాసాలు రాశారు. రెండు ప్రాంతాల మధ్య జరుగుతున్న సాహిత్య, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యారంగ అంశాలపై ఎన్నెన్నో విశ్లేషణలతో వెల్చాల రాసిన దాదాపు 25 వ్యాసాలు ఇందులో వున్నాయి. వీరితో పాటు సాహిత్య రంగానికి చెందిన ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య ఎస్వీ రామారావు, డా॥ ఎన్.గోపి, సామల సదాశివ, ప్రొ॥ జయధీర్ తిరుమలరావు, కె.శ్రీనివాస్, కె. విజయరామారావు, ప్రొ॥జి. హరగోపాల్, అంపశయ్య నవీన్, వెల్చాల జగపతిరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, కోరాడ రామకృష్ణయ్య, గంద్ర లక్ష్మణరావు లాంటి ప్రముఖులు ఒకప్పుడు, ఇప్పుడు రాసిన వ్యాసాలు ఇందులో పొందుపర్చడం, ఆంగ్లేయ విభాగానికి ప్రొ॥ జె.వి. రాఘవేంద్రరావు చక్కని ముందుమాట వ్రాయడం ఈ పుస్తకానికి ఎంతో వన్నె తెచ్చింది.

చాలా కీలకమైన చారిత్రక, వర్తమాన అంశాలు ఈ పుస్తకంలో పొదగబడ్డాయి. దీనిలో తెలుగుతో పాటు ఇంగ్లీషులో వచ్చిన అనేక వ్యాసాలు కూడా చేర్చారు. ఇంగ్లీషు, తెలుగు రెండు సమభాగాలుగా వున్నాయి. వీటిని ఒకే పుస్తకంలో కాకుండా వేర్వేరుగా వేస్తే మరింత బాగుండేదేమోనని భావిస్తున్నాను. కీలకమైన సమాచారం ఒకేచోట దొరకడం కూడా ఎంతో అవసరమని భావించి ఆ దృక్కోణంతో ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల వ్యాసాలు ఒకేచోట చేర్చి వుంటారు వెల్చాల వారు.

ఏ కోణంనుండి చూసినా ఈ పుస్తకం నిండా విలువైన సమాచారం ఉంది. ఇది అస్తిత్వ ఉద్యమంలో ముందుకు సాగిపోతున్న వారికి ఒక ఆయుధంగా ఉపయోగపడుతుంది. ఏ ప్రాంతం వారైనా ఈ పుస్తకాన్ని చదివి తెలంగాణ చరిత్రను సవివరంగా తెలుసుకొనవచ్చును. ఇది తెలంగాణ చరిత్రకు, సంస్కృతికి నిలువెత్తు దర్పణం. ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయడమంటే కొన్ని వందల సంవత్సరాల తెలంగాణ చరిత్రని ఆకళింపు చేసుకోవడమే. ఇలాంటి మంచి సంకలనాన్ని అందించిన వెల్చాల కొండలరావుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

కొందరు పుణ్యక్షేత్రాలను దర్శించి పుణ్యాత్ములవుతారు. కొందరు పుణ్యకార్యాలను చేసి గొప్పవారవుతారు. కొందరు పుణ్యక్షేత్రాలు కార్యాలనే ఉత్పత్తి చేసి తమ వర్తమాన, కాలానికి రాబోయే కాలానికి స్ఫూర్తినిస్తారు. అలాంటి పుణ్యక్షేత్ర, పుణ్యకార్య ఉత్పాదనా కోవకు చెందినదీ పుస్తకం.

- తమపై సాగుతున్న సీమాంధ్రుల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భాషా పరమైన ఆధిపత్యం నుండి విముక్తి కావడానికి, ఆత్మగౌరవంతో జీవించడానికి తమ సంస్కృతిని, భాషను అధికార భాషగా పెంపొందించుకోవడానికి తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారు. ఇవి సమైక్య రాష్ట్రంలో సాధ్యమైతే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉండేది కాదు. తెలంగాణ ప్రాంత సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక భాషాపరమైన ఆధిపత్యం సీమాంధ్ర ప్రజలపై సమైక్య రాష్ట్రంలో కొనసాగి ఉంటే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ఎప్పుడో మొదలై వుండేది.

కొందరు తెలంగాణ రాష్ట్ర వాదాన్ని ఆర్థిక వాదంగా కుదిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి చెందలేదా అని ప్రశ్నిస్తున్నారు. తద్వారా అసలు సమ్య పక్కదారి పడుతున్నది. అన్ని రంగాల్లో సాగే సీమాంధ్ర ఆధిపత్యాన్నుండి విముక్తి కోసమే తెలంగాణా రాష్ట్ర ఉద్యమం సాగుతున్నది. తెలంగాణ భాష అధికార భాషగా సమైక్య రాష్ట్రంలో సాధ్యమా? ఇదొక్కటి సాధ్యపడితే చాలా సమస్యల పరిష్కారం తేలికవుతుంది. పాఠ్యపుస్తకాల్లో, పత్రికల్లో, రేడియో, టీవీల్లో, సినిమాల్లో అన్ని స్థాయిల్లో తెలంగాణా భాషను సమైక్య రాష్ట్రంలో వాడితే ఆ పరిణామం వేరుగా ఉండేది. భాష పేరిట ఒకటైనాం అని చెప్పే వాళ్ళు అన్ని స్థాయిల్లో తెలంగాణా భాషను, సంస్కృతిని నిరాకరించారు. అందువల్ల భాష, సాంస్కృతిక, మానసిక వైవిధ్యం వైరుధ్యంగా దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్నది.

– సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు

మా తెలంగాణ

– డా॥ కొండలరావు వెల్చాల

మా తెలంగాణ!
కోటి లింగాల పుణ్యక్షేత్ర స్థాన.

మా తెలంగాణ!
కోటి సిరిసంపదల ఖజాన.

మా తెలంగాణ!
కోటి ఔదార్య ఔన్నత్యాల ఠికాన.

మా తెలంగాణ!
కోటి కవన కోయిలల ఆషియాన.

మా తెలంగాణ!
కోటి రసరాగరమ్యాల నజరాన.

మా తెలంగాణ!
కోటి సాహిత్య, సారస్వత, సంగీతాల ఘరాన.

మా తెలంగాణ!
కోటి త్యాగ, యాగ, సహన సంయమనాల సుహాన.

మా తెలంగాణ!
కోటి సంస్కార, సౌశీల్య, సచ్ఛీలతల ఉద్యానవన.

మా తెలంగాణ!
కోటి జ్ఞాన ధ్యాన-దాన అభిమానాల జాణ, ప్రసూన.

మా తెలంగాణ!
కోటి వితరణల, అతిథి సత్కారాల, మర్యాదల సోన.

మా తెలంగాణ!
మా దాశరథి కొనియాడిన కోటి రత్నాల వీణ.

మా తెలంగాణ!
మా కాళోజీ, మా స్వేచ్ఛా స్వాతంత్ర్య అస్తిత్వ ఆత్మగౌరవ గొడవను
'నా గొడవ' యని రచించిన, వచించిన నివేదన.

మా తెలంగాణ!
స్వపరిపాలన, సుపరిపాలన కొరకు
ముక్కోటి గొంతుకలతో మూకుమ్మడిగా ధ్వజమెత్తిన ప్రభంజన.

(జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ కమిటీ ఎదుట పాడి వినిపించిన పాట)

చూడు తెలంగాణ

పల్లవి : చూడు తెలంగాణ చుక్క నీళ్ళు లేని దానా
నా గోడు తెలంగాణ బ్రతుకు పాడైన వీణా
ఇది దగా పడ్డ దరువు మాకేది బ్రతుకు దెరువు
అరె... నినాదాలు కావు దేశ పునాదులే కదలాల ॥చూడు॥

చరణం 1: ఉత్తరాన గోదావరి ఉప్పొంగి ఉరుకనేమి
దక్షిణాన కృష్ణమ్మ దర్జాగా పారనేమి
నీళ్ళులేక నోళ్ళు తెరిచె బీళ్ళను చూడు
మా పల్లెలన్ని బోసిపోగ తల్లడిల్లుతున్న తల్లీ ॥చూడు॥

చరణం 2: రెండు జీవనదులు కలిసి నిండుగ ఇలపారిన
సమైక్యాంధ్ర సాకులతో తెలంగాణ మారెనా!
కంచె చేను మేసినట్లు పంచజేరి వంచించగ
గుండె పగిలి కన్నీళ్ళతో మండే ఆకలి కేకలు ॥చూడు॥

చరణం 3: అధికారం చెలాయించ ఆంధ్ర పాలనేనా?
అడుగడుగున అవమానం తెలంగాణకేనా
మ్తా ప్రతిభకు సున్నా జుట్టి మా హక్కులు కొల్లగొట్టి
చాపకింద నీరులాగా సాగుభూములాక్రమించ ॥చూడు॥

చరణం 4: అరె... మండె ప్రతి గుండె చూడు తిరుగుబాటు జెండలెత్తి
పదం పదం కలిపి జనం కదనానికే కాలుదువ్వి
పోరుదారిలోన ప్రతి ఊరువాడ కదులుతుంది
ప్రజా తెలంగాణ కొరకు ప్రాణాలనె ఒడ్డనుంది॥చూడు॥

'ప్రజాకవి' డా॥అందెశ్రీ

(తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన జస్టిస్ శ్రీకృష్ణకమిటీని
కలిసిన ప్రతినిధి బృందంతో పాల్గొని డా॥ అందెశ్రీ ఆలపించిన గీతం)

శంఖారావం

– డా॥ కొండలరావు వెల్చాల

అన్నల్లారా! అక్కల్లారా!
తమ్ముల్లారా! చెల్లెల్లారా!
పిల్లల్లారా! పెద్దల్లారా!
తెలంగాణ ముద్దుబిడ్డల్లారా!
ప్రియతమ విద్యార్థినీ విద్యార్థుల్లారా!
రండీ! రండీ! ఎలుగెత్తండీ!
'స్వేచ్ఛే' 'స్వేచ్ఛే' కావాలనండి.
ఆత్మగౌరవమె మా ఆయుధమనండి.

వినబడలేదా శంఖారావం?
వీధి వీధినా విప్లవవాదం?
కనబడలేదా తెలంగాణ పతాకం
తళతళలాడుతు, తారట్లాడుతు,
రెపరెపలాడుతు, పైపైకెగురుతు?
"పదండి ముందుకు, పదండి తోసుక
కదం తొక్కుతూ, పదంపాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ!"

యువకుల్లారా! యువతుల్లారా!
స్నేహితులారా! బంధువులారా!
పల్లెల పట్టణ వాసుల్లారా!
ఎచటున్నా ఈ ప్రాంతీయుల్లారా!
కులాల హద్దులు చెరిపేస్తూ,
మతాల ఒడ్డులు మలిపేస్తూ,
పార్టీల పరిధులు దాటేస్తూ,
వచ్చింది చెబుటకు టైమొచ్చిందీ,
"మీ పొత్తూ హత్తూ మాకొద్దూ వద్దని,
ఇక నమ్మమునమ్మము మీ వాగ్దానాలని,
ఇక చాలు చాలు మీ 'పంగనామాలని',
మీ నిలువు దోపిడిక తాళలేమని,
'వడకత్తెరలో పోకగ' బ్రతకజాలమని"
కలిసికట్టుగ చెబుటకు టైమొచ్చిందీ.

స్వేచ్ఛందరిదీ మీదే కాదని,
స్వాతంత్ర్యమె మాకిక గత్యంతరమని,
విడివడి ముందిక కలిసుందామని,
ముడిబడి సాగుట సాధ్యం కాదని,
కాదంటే సమరమె సంధే లేదని,
'ధర్మ యుద్ధమే' చేబడుతామని,
సాధించే వరకూ నిద్రే పోమని,
మా ఓటూపాటిక స్వేచ్ఛ కొరకెయని,
'ఖబర్దారనీ', కలహము వద్దని,
హెచ్చరించుటకు సీమాంధ్రనేతల,
వచ్చిందీ ఇక టైమొచ్చిందీ.

ఆశారాజు, 'రాజా హైదరాబాదీ'

(పొగల్ షాయర్ కావ్యం నుండి, రచయిత ఆశారాజుగారి సౌహార్ద్రంతో)

హైదరాబాద్ మేరీ జాన్

నా ఇల్లును కూల్చి
మాల్స్ కంట్టిందెవరు?
నా వాకిట్లో
స్టూడియోలు నిర్మించింది ఎవరు?
నా గల్లీలను మాయం చేసి
కాలనీలు పెంచుకొన్నదెవరు?
దీన్ని కబ్జా అంటారా!
దౌర్జన్యమంటారా!

నా భాషను
బఫూన్లతో మాట్లాడించి
పరిహాసం చేసిందెవరు?
కళాఖండం లాంటి
నా హైద్రాబాదును
పచారుకొట్టులాంటి
బెజవాడను చేసిందెవరు?
దీన్ని కుట్ర అంటారా!
కుటిలమంటారా!

మేరే ప్యారే దోస్తో!
నాది అస్లీ హైద్రాబాద్
నువ్వు తీన్ పాంచ్ చెయ్యకు
తల్లిలాంటి నా గండిపేట నీళ్ళకు
అవమానం జరుగుతుంది
జెరా బచ్‌కే రహ్‌నా!
సలాం కరేతో గులాం నహీ సమజ్ నా!

నా కాలిమీద
నీ కాలుపెట్టి తొక్కితే
నయాపూల్ నిద్రలేస్తుంది
ఆగే పీఛే దేఖ్‌కే చల్‌నా!
ఈ మోడ్ ఖతర్నాక్ మోడు!

బంతిపూల తోటలో
కర్రీస్ పాయింట్లు పెట్టి
ఖూబ్‌సూరత్‌ను
కచ్‌రా చేసావు
నీ అచార్ పచార్‌కో
మార్ గోలీ!
నా బిర్యానీ తిని
దునియా ఖుషీ అవుతుంది
చార్మినార్ మీద
చుక్కలు దిగుతాయి
బస్సు బుకింగ్ కౌంటర్లు తెరిచి
వెన్నెలను అమ్మేయకు!

ఇది అత్తర్ నగరం
కంపు రాజకీయాలతో
బీమార్ పెంచకు!
దోస్తీ చేసినవాళ్ళను
ధోకా చెయ్యకు!
ఇక్కడి జనాలది
భోళా గుణం
నా గిన్నెలోనే తిని
నీ ఎంగిలినీళ్ళను
నా ముఖం మీద కొట్టకు!
కరచాలనం చేసిన చేతిని
కపటంతో నరకకు!

చిర్నవ్వు లాంటి
ఇరానీ హోటళ్ళను లేపేసి
క్లబ్బులూ పబ్బులూ పెట్టావు

మలాయి చాయినీ
మస్కా బన్నునీ
టిఫిన్ సెంటర్ల కింద తొక్కేశావు
షామియానాను పడగొట్టి
సంగీతాన్ని నిలిపేసావు

నన్ను నెట్టివేస్తూ నెట్టివేస్తూ
నేను నిలుచున్న నీడను లాక్కున్నావు
జరుగుతూ జరుగుతూ
చివరిమెట్టు దాకా జారాను
ఇప్పుడు ఉల్టా తిరుగకపోతే
నాకు బతుకు తెరువు లేదు
నా మ్యూజియంని
రవిక గుడ్డముక్కలమ్ముకొనే
మ్యాచింగ్ సెంటర్ చేసిందెవరు?
కాశ్మీరు బులాఖీలాంటి
నా ట్యాంకుబండును
పాపడ్లు కాల్చే
గాజుగుడిసెలుగా మార్చిందెవరు?
సంగీత కచేరి జరిగేచోట
రికార్డు డాన్సుల సంస్కృతి ఎక్కడిది!

నా భాగ్యనగరం
తెలంగాణ కిరీటం
కోహినూర్ వజ్రంలాగా
కొల్లగొట్టాలని చూస్తున్నదెవరు?
నా దివాన్‌ఖానాలో కూర్చుండి
నన్ను బయట నిలుచోబెట్టిందెవరు?
నా గోడమీది అద్దంలో
నీ ముఖం కనిపించడం మంచిది కాదు!

నా హైద్రాబాద్
సీతాకోకచిలుక,
దాని రెక్కలకు కత్తులు కట్టి
కోడిపందాలు ఆడకండి,

రాత్రి ముషాయిరా జరిగేవేళ
నీ బోరియా బిస్తర్
నా పలంగ్ మీద కనిపించొద్దు,
అలాయి బలాయిని అర్థం చేసుకుంటే
గోలకొండ ఖుదాఫీజ్ చెపుతుంది.

దయచేసి
నా హైద్రాబాద్‌ను
సజీవ శిల్పంగానే వుండనివ్వండి
ప్రైవేటు సర్వీసుల
'అడ్డా'ను చేయకండి.

నా జాగాలో నేను
షాయరీ రాసుకొంటాను
నీ జాగాలో నువ్వు
సినిమా బొమ్మలమ్ముకో!
నా హైద్రాబాద్‌ను
హైద్రాబాదుగానే వుండనివ్వండి.

పక్కా హైదరాబాదీ

ఈ హైదరాబాద్ మాది,
దీని అందం
స్వంతంగా మాది.

ఒకరు దీన్ని
జేబుల పెట్టుకొంటామంటరు,
ఒకరు కాకెంగిలి జేసి
పంచుకొంటామంటరు.

మేం
కండ్లకు
కనబడ్తలేమా!

ఒక దినమేమో బందు,
ఒక వారమేమో కర్ఫ్యూ,
ఒకనాడన్నా వచ్చి

ఏమైందని
మా దిక్కు చూసిండ్రా!
ఒకరు
చింపుకుంటామంటరు,
ఒకరు
కోసుకుంటామంటరు,
మేం గిలగిలా కొట్టుకొంటుంటే
మీరు
కిలకిలా నవ్వుకుంటరు,
ఇది
గాలికి
కొట్టుకొచ్చిన
పిట్టగూడా!

మేం
కిందా మీదా పడి
కట్టుకొన్న
రంగ్‌మహల్!
హైదరాబాద్
ఖాస్ మాది!

ఈ గల్లీలల్ల ఏమున్నదీ,
ఈ సందులల్ల ఎట్లున్నరూ,
మీకెవ్వరికి ఎప్పుడు బట్టింది,
మీకేం మంట బుట్టింది,
హైదరాబాద్
కసం సే మాది!

అన్ని జాగలల్లకు
బస్సులు లేకపాయే,
మా పిల్లల కోసం
మంచి బడులు రాకపాయే,
ఏం తింటున్నరో చూసిండ్రా?
ఎట్లా చస్తున్నరో, వెంట వచ్చిండ్రా?

ఒకరు
రంగు వేసినమంటరు,
ఒకరు బొమ్మలు చెక్కినమంటరు,
ఒకసారన్నా, నిలబడి
మా హాలత్ చూసిండ్రా!
హైదరాబాద్ కుద్దు మాది!

బోనాల పండక్కి
ముత్యంలా
కడుక్కొంటం,
రంజాన్ ఈద్‌కి
షామియానా
పందిరి వేసుకొంటం.

కూలిన గోడల్ని
మన్ను పిసికి కట్టిండ్రా!
మూసుకుపోయిన మోరీలను
నడుము వంచి, సాపు చేసిండ్రా!

మురికికిలనే తిరిగినం,
వాసన్లనే గడిపినం,
హైదరాబాద్
హర్‌కీజ్ ఎవర్దీ కాదు!
ఇది మాది!

చార్‌మినార్ సున్నంల
ఖుష్బూ చూసిండ్రా?

లాడ్‌బజార్
గాజుల కతలు విన్నారా?

శాలిబండకు
గోలకొండకు
సంబంధముందా?

కిల్వత్ నుండి బయలుదేరితే
కందికల్ గేటు చేరుకొంటామా?

రంగేలి కిటికీ తెరిస్తే
మోతి దర్వాజా కనబడుతోందా?

ఫలక్‌నుమా అద్దంలో చూసుకొంటే
తల కనబడుతుందా,
మొండం కనబడుతుందా?

పున్నమి రాత్రుల్లో, చంద్రుడు
పురానాపూల్ మీద వుంటాడా?
బసంత్ హవేలీలో దిగుతాడా?

మూసీనది నిండుగ పారుతే
మనసు మురిసిపోతుందా
గుండె వొణికి పోతుందా?

ఇక్కడి బతుకుల్ని
చూసిందీ లేదు
బాగు చేసిందీ లేదు.

ఒకరు
రెక్కబట్టి లాగుతరు,
ఒకరు
జుట్టుబట్టి గుంజుతరు.

ఈ మోంబత్తికి, చేతులు
అడ్డం పెట్టకపోతే పెట్టకండి
దయచేసి, రాజకీయం చేసి
దీపం ఊదెయ్యకండి.

హైదరాబాద్
మాది,
పట్నం
మా పాతబస్తీ వాళ్ళది!

వన్నెలు చిన్నెలు
లేకపోతే లేకపాయే
పాతబస్తీని
ఎవ్వరికీ ఇవ్వం
మాదే మాదే
ఈ హైదరాబాద్ మాదే!

గజల్‌లాంటి
పాతనాగరాన్ని తప్ప
మరే హైటెక్కునీ
ముసిరిన మార్కెట్టునీ
మాల్ గోల్‌మాల్‌నీ
హైదరాబాద్ అనలేం
బేషక్!
హైదరాబాద్ మాది!

ట్యాంక్‌బండ్‌ని
ఫ్లాట్లు చేస్తే ఊరుకోం,
ఆర్ట్స్ కాలేజీని
అపార్టుమెంట్లుగా మారిస్తే ఒప్పుకోం,
అవి కాటుక దిద్దిన కళ్ళు
కారం జల్లుతే నోరు మూసుకోం,
హైదరాబాద్ మీది కాదు,
మీది కూడా కాదు!
హైదరాబాద్ మా అమ్మది,
మా తాతది,
మా ముత్తాత తాతది
పాతబస్తీ,
ఇక్కడి అమాయకులది
ఆవాజ్ చెయ్యకండి
హైదరాబాద్ మాది!

ముషాయిరా లాంటి
జీవితం మాది
ప్రేమించే గుణం మాది
సర్దుకుపోయే సహనం మాది
బిల్‌కుల్!
హైదరాబాద్
మాది!

చార్‌మినార్ ఎక్కి చూస్తే
కనుచూపు మేరా,ఆకాశం మాది
కనువిందు చేసే, నేల అందం మాది

బరోబర్!
ఈ హైదరాబాద్ మాది!

యేతో ప్యార్ హై!

హం షికాయత్ కర్తే హై
కభీ నఫ్రత్ నహీ కర్తే!

హం గుస్సాతో కర్తే హై
మగర్ బద్నాం నహీ కర్తే!

హం రూఠ్‌భీ జాతే హై
లేకిన్ బే ఇజ్జత్ నహీ కర్తే!

మాc ఆఖిర్ మాc హోతీ హై
హం నీలాం నహీ కర్తే!

యే సప్నా హమ్నే జగాయా హై
కిసీకా భీఖ్ నహీ!

హం హైదరాబాదీ హై
హైదరాబాద్ సే ప్యార్ హీ కర్తే!

ఇది కవి నివాసం

హైదరాబాద్!
ఒక చాందినీ మహల్!
పండగ సందడిగా వెలిగే
ఒక మహిఫిల్!
ఆకాశం మతి పోగొట్టే
తారల ముజ్రా!
హైదరాబాదంటే
పురాతన మట్టిలోంచి
ప్రేమగా వీచే
సుగంధ సమీరం.

మిత్రులు మాట్లాడుకుంటే
గజల్ గురించే,
గల్లీలో కలుసుకుంటే
దోస్తానా గురించే,
సలాం చేసి కుశలమడిగితే
దావత్ గురించే,
హైద్రాబాదంటే
సాసర్లో పోసుకొని
ఊదుకుంటూ తాగే
గరం చాయి.

ఇది వ్యాపారం చేసే
బాజారు కాదు,
ఆప్తులు తప్పిపోయే
'మేళా' కాదు,
అత్తరు చల్లుకొనే
కమ్మని ఆలింగనం,
'బతాసులు' దొరికే
స్వప్నలోకం.
హైదరాబాదంటే
రాఖీలు పేర్చిన
దీపాల షామియాన.

కలిసుండే బతుకుల్ని
కబ్జా చేయడం తెలియదు,
మరిచిపోయి కూడా
ధోకా యివ్వడం రాదు.

అతిథుల కోసం
ఇల్లమ్ముకోవడం తెలుసు,
ఇచ్చిన మాటకోసం
పస్తులుండడం తెలుసు,

హైద్రాబాదంటే
గ్లాసెడు నీళ్ళడిగితే
గండిపేటనే దానం చేయడం.

హైదరాబాదీలు
దిల్‌దార్ ఇన్సాన్లు,
నిలుచున్న నీడను త్యాగం చేసి
గోల్కొండను రాసిస్తారు,
మూసీనది ఎండిపోయినా
గుండెను తోడి పోస్తారు.

హైద్రాబాదంటే
నిన్నూ నన్నూ కలిపే
చార్మినార్ పరిమళం,
పువ్వును ముల్లును
పాన్‌తో నమిలే
ఒక 'షాయర్' నివాసం.

సలాం హైదరాబాద్ సలాం నుండి కొన్ని పంక్తులు

నేను ఒక్క నగరం గురించే
మాట్లాడదలచుకోలేదు
ఇక్కడి మనుషుల గురించి కూడా
మాట్లాడదలుచుకున్నాను -
ఏడీ
అర్ధరాత్రి చార్మినార్ నుండి
లాల్‌దర్వాజా తీసుకెళ్ళే పెద్దమనిషేడీ?
వర్షంలో తడిసి, చీకటిలో వొంటరిగా
వెళ్తుంటే
ఇంట్లోకి పిలిచి, కొంగుతో తుడిచిన
ఆ ప్రేమమూర్తి ఏదీ!

నేను రిక్షా దిగి చిల్లరకోసం
వెదుకుతూంటే
పరుగెత్తుకొచ్చి చిల్లరిచ్చే
ఆ పాన్‌షాప్ సోదరులేరీ?
ఎవర్నని వెదికేదీ?
ఎక్కడని వెదికేది?

ఈ నగరం
కాళ్ళూ చేతులూ నరుకుతుంటే
మిగిలిన శిథిలాల్లో
నా ముఖాన్ని ఎక్కడని వెదుక్కునేది?
అంతటా ముళ్ళకంచే వ్యాపించింది
నా పాతనగరం మీద వల విసిరారు
ఒకొక్క సౌందర్యాన్ని అమ్ముకుని
హైదరాబాద్‌ని లేకుండా చేస్తున్నారు.

ఆవారా షాయర్ నుండి కొన్ని పంక్తులు

అసలు హైదరాబాదంటేనే -
ఓ రాజకుమారి అందం
హిందీ పాటల లోతైన గాయాల
సముదాయం
మనస్సునే చెయ్యిగా చేసి సలాంచేసే
సంస్కారం
ఎదుటి మనిషిని ఆత్మీయంగా
పలకరించే సంప్రదాయం

ఇవన్నీ లేకుంటే -
హైద్రాబాదు కూడా అరణ్యమే!
అన్ని నగరాల్లాగే మనుషులు తిరిగే
భయంకరమైన ఎడారే!

తెలంగాణ శిల్ప సంపద

– మార్సెల్లా హార్డీ

వరంగల్లులోను, దానికి సమీపంగా ఉన్న హనుమకొండలోను దక్షిణభారతం అంతటిలోను ప్రశస్తములని చెప్పదగిన శిల్పాలు, చెక్కడాలు కనిపిస్తాయి. ఇవి ప్రస్తుతం మైసూరు రాష్ట్రంలో ఉన్న బేలూరు, హాలిబిడ్ శిల్పాలతో సరిపోల్చదగినవి. ఈ శిల్పాలన్నీ హొయసలుల కాలంలో చెక్కారు. నిజంగా కాకతీయులతో పోల్చినప్పుడు హొయసలుల శిల్పాలు తక్కువే. అయితే హొయసల శిల్పాలకు వచ్చిన కీర్తి ప్రతిష్ఠలు కాకతీయ శిల్పాలకు రాలేదు. కాకతీయ శిల్ప ప్రాశస్త్యం ఉగ్గడించడానికే నేనీ తారతమ్య పరీక్ష చేస్తున్నాను.

వరంగల్ వెళ్లడం చాల తేలిక. రోడ్డు దారి ఉన్నదిగాని రైల్లో ప్రయాణం చేస్తే ఇంకా త్వరగా వెళ్లవచ్చును. అయితే అక్కడికి జేరుకునే సమయం మాత్రం భోజనాది సౌకర్యాలకు అనుకూలంగా ఉండదు. కాని కాకతీయాంధ్ర రాజులు రాజధాని నిర్మించాలను కునే రోజుల్లో అలాంటి అసౌకర్యాలేవీ లేనేలేవు. కనకనే ఆ ప్రదేశం రాజధానీ నిర్మాణానికి అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని నిశ్చయించారు.

కాకతీయులకు ఆ ప్రదేశంలో పుష్కలంగా రాయి దొరికింది. ఒరంగల్లంతా ఒక్క రాతితోనే చెక్కారనే జనశ్రుతి అనుశ్రుతంగా వస్తున్నది. ఈ పెద్దరాయి బ్రహ్మాండంగా నిలబడి ఉండి, ఈ ప్రదేశం రాజధానీ నిర్మాణానికి అనువైనదని సూచించి ఉంటుంది. అయితే కాకతీయు లిక్కడి శిల్ప సంపదతోనే సంతృప్తి పడలేదు. అమూల్యమయిన కళాసంపత్తికూడా వారికి ఆసరా అయింది. ఇంతేకాక అనేక వర్ణాల శిలలు కూడా ఇక్కడికి తెప్పించారు. ఇక్కడి శిల్పాలలో ఇది ప్రత్యేకంగా పరిశీలించవలసిన విషయం. బహుశః కాకతీయ శిల్పులీ విషయంలో ప్రత్యేక నైపుణి సంపాదించి ఉంటారు.

క్రీస్తుశకం 11వ శతాబ్ది మొదలు 13 శతాబ్దిదాకా కాకతీయులీ ప్రదేశం పరిపాలించారు. వీరు హొయసలులకు కొంచెం తరువాత కాలంవారు. ఈ ఇద్దరిశిల్పాలలోను విస్పష్టమైన పోలికలు కనిపిస్తున్నాయి. కొన్ని రకాల ప్రత్యేక శిల్పాలిద్దరిలోను ఒకే విధంగా ఉన్నాయి. ఈ రెండు ప్రదేశాలలోను ఉండే శిల్పులకు కొన్ని సంబంధం బాంధవ్యాలుండి ఉండాలని తోస్తుంది. బహుశః కర్ణాటక కాకతీయ శిల్పులందరు మొట్టమొదటిగా హొయసల శిల్పుల దగ్గర కొంత అనుభవం గడించారని అనుకున్నా అనుకోవచ్చును.

హొయసల కాకతీయ శిల్ప పద్ధతులలో పోలిక లతో బాటు కొన్ని ప్రత్యేక లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. హొయసల లెప్పుడు ఒకే రకమయిన రాతిమీద

పనిచేస్తూండే వారు. కాకతీయులకు వేర్వేరు రకాల రాళ్లమీద చెక్కడం అలవాటు. కొన్ని ప్రత్యేకోద్దేశ్యా లతో వీరే వేర్వేరు శిలలమీద చెక్కడాలు సాగించేవారు. బేలూరు, సోమనాధపురాల శిల్పుల లతలు, మృగాలు చెక్కడంలోను, వీటితో దేవాలయ కుడ్యాలలంకరించడం లోను ప్రత్యేక నైపుణ్యం ప్రదర్శించారు. కాకతీయ శిల్పులు దీర్ఘరేఖ వైవిధ్యంలో తమ విన్నాణం ప్రదర్శించారు. ఇంతేకాక చతురస్రజాది రేఖాశిల్పాలలో కూడ వీరి ప్రత్యేకత కనిపిస్తుంది. వరంగల్లులో మాలికలు, నక్షత్రాకార పుష్పాలు మొదలైన నగషీ పనులెక్కువగా కనిపిస్తాయి. వల్లీ శిల్పంలో ఇక్కడ కనబడినంత ప్రత్యేక నైపుణి మరెక్కడా కనబడదు. ఇక్కడ చెక్కిన నృత్య భంగిమల వరసలు చారిత్రకంగా చాలా ముఖ్యమైనవి. కళాదృష్టితో చూచినా వీటి ప్రత్యేకత గొప్పదే. వరంగల్లు చక్రవర్తులు ప్రతి ఏటా పూరీ జగన్నాధానికి కొంతమంది నర్తకులను పంపించేవారు. అందుచేత ఈ శిల్ప భంగిమలలో శాస్త్రీయ నృత్యభంగిమలు పరిశీలించవచ్చును.

ఇక్కడి శిల్పాలలో జైన శిల్ప పద్ధతుల పోకడు కనిపిస్తాయి. ఇది చారిత్రకంగా చాలా ముఖ్యమైన విషయం. షితాబ్ మహలు దగ్గర సమీకరించిన కొన్ని విరిగిన విగ్రహాలను బట్టి ఇది పరిశీలించవచ్చును. వీటిలో కూడా గొప్ప శిల్ప చాతుర్యమున్నది. ఇక్కడ స్తంభ శిఖరాలు మొదలైనచోట్ల ఒక చిత్రమైన శిల్పం కనిపిస్తుంది. దీనిలో ఒక మనిషి సింహాన్ని బల్లెంతో పొడుస్తూంటాడు. హొయసల శిల్ప సంప్రదాయంలో ఇల్లాంటి శిల్పాలెక్కువగా ఉన్నాయి. ఆ రకమైన శిల్పాలిక్కడ కనబడడం ప్రత్యేకంగా గమనించదగిన విశేషం. వరంగల్లులో చాలాచోట్ల దీనిని కుడ్యాలంకారంగా వాడారు.

ప్రస్తుతం వరంగల్లు దేవాలయం పూర్తిగా ఖిలమై పోయింది. ఇప్పుడీ దేవాలయం పేరిట నిలబడినవి కొన్ని స్తంభాలు మాత్రమే. ఢిల్లీనించి మహమ్మదీయులు దండెత్తి వచ్చినప్పుడిది పూర్తిగా ధ్వంసమై పోయి ఉంటుంది. అయితే దీనికి సమీపంగా ఉన్న హనుమకొండ దేవాలయాన్ని బట్టి మనం వరంగల్లు దేవాలయం వైభవం ఊహించుకోవచ్చును. ఇది వెయ్యి స్తంభాల దేవాలయము. మొట్టమొదట హనుమకొండే కాకతీయులకు రాజధానిగా ఉండేది. అయితే ఇది వరంగల్లంత పెద్ద పట్టణం కాదు. క్రీడారామంలో దీని వర్ణన కనిపిస్తున్నది. హనుమకొండ దేవాలయంలో ఒక గొప్ప దేవాలయానికి ఉండే లక్షణాలన్నీ ఉన్నాయి. అనేక స్తంభాలు కలిపి అందంగా ఒక సమూహం కింద మార్చిన విధాన మీ వెయ్యి స్తంభాల మండపంలో కనిపిస్తుంది. మూలనున్న స్తంభాల పై భాగంలో డాలుతో ముందు కురకడానికి సిద్ధంగా నిలబడినట్లున్న యోధశిల్పాలు కనిపిస్తాయి. ఇవి కాకతీయులు ప్రత్యేకంగా చెక్కిన విగ్రహాలు. ఇల్లాగే నల్లరాతిలో చెక్కిన నంది విగ్రహాలు కూడా కాకతీయ శిల్ప పద్ధతిలో ప్రత్యేకంగా పరిగణింపదగినవే. ఈ విగ్రహాలన్నీ కంచు

మ్రోగినట్లు ప్రతిధ్వనిస్తాయి. ఇక్కడి శిల్పులెక్కువ శిల్పనైపుణి ప్రదర్శించ వలసినప్పుడు ఈ ప్రత్యేక శిల వాడారు. వర్ణ విభేదం కనబరచవలసినప్పుడీ శిల్పులు కొంచెం ఎరుపురంగు గల రాయి వాడారు. ఈ రాతి రంగు నల్లజాతి రంగుతో చాలా సొగసుగా కలసిపోతుంది. ఈ రెండు రకాల రాళ్ళతోనూ నిర్మించిన స్తంభశిఖరాలు చాలా సొగసుగా ఉంటాయి. వీరు తమ శిల్పాలలో బూడిద రంగు రాయి కూడా వాడుతూంటారు. ఇది బాహ్య శజల్పాలకు బాగా ఉపకరిస్తుంది. కొంచెం మోటు రాయి కావడం వల్ల ఎండ వానల తాకిడికి నిలబడుతుంది. ఇక్కడి శిల్పాలలో కొంచెం బూడిద రంగు కలిపిన ఆకుపచ్చ రాతితో నిర్మించిన తోరణాలు ప్రశస్తమైన శిల్పాలు. ప్రతిభ, పనితనము మొదలైన వాటిని బట్టి చూస్తే ఇవి భారతీయ శిల్ప సంపత్తిలో ఉత్తమోత్తమమైనవని చెప్పవచ్చును.

రాయచూరు దుర్గం కోటగోడలపై మలిచిన శిల్పాలను బట్టి, ఈ కాలంలో శిల్పుల పనితనం పరిశీలించవచ్చును. ఇక్కడ ఒక పెద్ద బ్రహ్మాండమైన శిల్పం కనిపిస్తుంది. ఒక పెద్ద రాతిని పెద్ద పెద్ద మహిషాలు, మనుషులు లాగూతున్నట్లుంటుంది. ఈ శిల్ప రేఖలలో ఈ జంతువుల ప్రయత్నం అత్యద్భుతమైన జీవశక్తితో కళకళలాడుతూంటుంది. ఇక్కడ మరి ఒక శిల్పమున్నది. ఇది శిల్ప దృష్ట్యా అంతగా ముఖ్యమైనది కాదు గానీ, చారిత్రికంగా చాలా ముఖ్యమైనది. ఈ శిల్పంలో ఒక రథపంక్తిని గుఱ్ఱాలు లాగుతూంటాయి. ఈ రథాలలో మొట్టమొదటి రథం నడిపించే వ్యక్తి రుద్రమదేవి, ఈమె ముప్పై సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగా తన రాజ్యం పరిపాలించింది. ఈమె కీర్తి దిగంతాల వరకు వ్యాపించింది.

ఒకప్పుడు మానవజాతి శాశ్వతమైన విషయాలపై తన దృష్టి కేంద్రీకరించింది. చిత్రకారులు దీనికి మహాశిలాయుగమని పేరు పెట్టారు. తాత్కాలికమైన తళుకు బెళుకుల వెంట పరుగెత్తే ఈ రోజులకు, ఆ రోజులకు చాలా తేడా కనిపిస్తుంది. నరవానరాలకొక ప్రత్యేకమైన భేదం కనిపిస్తుంది. నరుడు చాలాకాలం ఒక విషయం మీద కేంద్రీకరించగలడు. అయితే ఈ రోజుల పరిస్థితిని బట్టి చూస్తే మానవుని విషయంలో చెప్పినది నిజమేనా అనిపిస్తుంది. బహుశః మళ్లీ కొంతకాలానికి మానవజాతి శాశ్వతత్వాన్వేషణలో పడవచ్చునేమో అనిపిస్తుంది. అయితే ఆ కాలంలో మానవులు జీవ జంతువులను శిల్పాలు మలచగలిగినంత శక్తి సంపాదించలేకపోవచ్చును. కాని మళ్ళీ కాకతీయ శిల్ప సంపద వంటి మహత్తర సృష్టి సాధించగలరని నిస్సందేహంగా చెప్పవచ్చును.

(కిన్నెర : సంపుటము4, సంచిక9, సెప్టెంబరు 1952 నుండి – శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

తెలంగాణము ప్రాచీన శిల్పకళ

- శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు

ప్రాచీనాంధ్ర శిల్పమును గూర్చి ఇప్పటికి కొన్ని శతాబ్దుల పరిశోధన జరుగుచునే యున్నది. కాని తెలంగాణమునకు యీ సందర్భమున ఎట్టి స్థానము నొసగవలెనో సునిశ్చితము కాలేదు. తెలంగాణమునందలి శిల్పమును సరిగ పరిశీలించి ననేకాని ఈ విషయము తేలదు. ఆ పని ఇంకను సమగ్రముగ జరుగనే లేదు.

"శిలాయుగ"మని పేరుగాంచిన చరిత్ర కందరాని చాలా ప్రాచీన కాలమునుండియు గూడ తెలంగాణము నందు శిల్పమును, చిత్రకళయు గాన్పించుచున్నవి. శిలాయుగము నాటి నాగరికత, సంస్కృతి ఎక్కువగా తెలంగాణము నందును దక్కను నందలి కొన్ని ఇతర ప్రాంతములందును మాత్రమే గాన్పించుచున్నవి. కాబట్టి మానవుని సృష్టికిని, నాగరికతా ప్రథమ పాఠములకును ప్రథమ రంగభూమి యీ ప్రాంతమే అని నిర్ణయించుటకు కూడ తగినంత ఆధారము లేకపోలేదు.

తెలంగాణమున కనతి దూరమున రాయచూరు జిల్లా కొప్పల్ గ్రామము నందుస , లింగ్‌సుగూరు తాలూకా మస్కీ యందును అశోక శాసనములు గన్పించుచున్నందున ఈ ప్రాంతమంతయు అశోక చక్రవర్తి పరిపాలన క్రిందనుండెనని చెప్పవీలున్నది. కాని మౌర్యుల నాటివని నిష్కర్షగా చెప్పవీలుగల కట్టడములు కాని, శిల్పము కాని ఇతర విశేషములు కాని ఇంతవరకును తెలంగాణమునందు బయట పడలేదు.

ఇప్పటికి మనకు తెలిసినంతవరకు ప్రాచీనతను చారిత్రక సామగ్రియనదగు వస్తు విశేషములు క్రీ.పూ. రెండవ శతాబ్ది నాటివి. నాడు ఈ ప్రాంతము శాతవాహనుల పరిపాలన క్రింద నుండెను. వీరు సుమారు నాలుగు వందల ఏబది సంవత్సరములు అఖండముగ పాలనము సాగించినందున అజంతా యందలి ప్రాచీనతను కాలము నాటి 9,10,12,13, సంఖ్యలు గల గుహాలయములును, పిఠల్ ఖోరా గుహాలయములను, మస్కీ, కొండాపూరు, గాజులబండ, ఫణిగిరి, పెదబంకూరు మొదలగు చోటులందు ఖనన పరిశోధనయందు బయలు వెడలిన కుండపెంకులు, మట్టి బొమ్మలు, ఇతర వస్తువులును; అచ్చటచ్చట దొరకిన సీసపు నాణెములును ఇతర ప్రాచీనతమ నాణెములును - ఇవన్నియు ఆంధ్ర శాతవాహన యుగమునకు చెందినవే అనవచ్చును.

ఈ ప్రాచీనాధారముల పరిశీలించి గుహాలయ నిర్మాణ వస్తు పద్ధతిని గూర్చియు, బౌద్ధ స్థూప విహారాది నిర్మాణ వాస్తు పద్ధతిని గూర్చియు యెన్నియో అంశములను విశదీకరింపవచ్చును. గ్రంథ విస్తర భీతిచే ఒక్క శిల్పమును గూర్చి మాత్రము కొంత ఇట పరిశీలింతము. ఇందును కూడ ఒక్క తెలంగాణమును

మాత్రమే ప్రకృతము ఏకైక లక్ష్యముగ గ్రహించినందున ఆంధ్ర శాతవాహనుల నాటి అజంతా గుహలను, అందలి శిల్పమును ఇట పరిశీలించుటకు వీలు లేదు. సమకాలికములైన అమరావతి మున్నగు ఆంధ్ర ప్రాంతములందలి వాస్తు శిల్ప వైఖరిని, అజంతా, పిథళ్‌ఖోరా వైఖరికిని కల సంబంధములను, తారతమ్యములను చర్చించుటకు గాని, తెలంగాణ వాస్తు శిల్ప పద్ధతులు ఏరీతిగ వీనితో సన్నిహిత సంబంధము కలవో ఏ కారణములనుబట్టి అజంతా, తెలంగాణ, అమరావతి ఇవన్నియు ఒకటే కళాసంప్రదాయమునకు చెందినవని ధృవపరుపగలమో విశదీకరించుటకును వీలులేదు. వివిధ ప్రాంతములందు నానావిధ పరిసర ప్రభావములకు లోనైనందున దేశకాలానుగుణముగ కొద్దిపాటు మార్పులు ఈ వివిధ ప్రాంతములందలి వాస్తు పద్ధతులందు గాన్పించినను ఇవన్నియు స్థూలదృష్టికి గోచరించు స్వల్ప భేదములే కాని, సూక్ష్మముగ పరిశీలించిన యెడల వీనియన్నిటి యందును అంతర్వాహినిగ గాన్పించు అభిన్నలక్ష్యము, దృక్పథము, నిర్మాణవైఖరి మొదలగు అంశములన్నియు ఇవి ఒకటే వాస్తు సంప్రదాయమునకు శిల్ప సాంప్రదాయమునకును చెందినవని చాటి చెప్పునవని ఋజువు పరచుటకు గూడ ఇచ్చట అవకాశము చాలదు.

దిఙ్మాత్రముగ సూచించుటకు ఇట ఆంధ్రశాతవాహన యుగమునాటివని చెప్పదగు మట్టి బొమ్మలను మాత్రము కొంత పరిశీలింతము. ఇవి చాల వరకును మస్కీ, కొండాపూరు మొదలగు ప్రదేశములందు ఖననపరిశోధనయందు బయటపడిన వస్తువులగుటవలన ప్రాచీన కాలమునాటివేయని తలపవచ్చును. వీనితో పాటు దొరకిన సీసపు నాణెములు, కుండపెంకులు మొదలగు సామగ్రిని బట్టి ఇవి ఆంధ్ర శాతవాహన యుగమునాటివని కూడ నిశ్చయింపవచ్చును.

మట్టి బొమ్మలలో కూడ మానవాకృతి యెంత సౌష్ఠవముగ నిర్మింపబడెనో కొండాపూరునందు దొరకిన ఐదారు మట్టిబొమ్మలను చూచినచో విశదమగును. వీనిలో కొన్ని కొన్ని బోధిసత్వుని మట్టి విగ్రహములని చెప్పుచున్నారు. బుద్ధ విగ్రహమునకు తలపై వెంట్రుకలు కురుచగ ఉంగరములవలె చుట్టలు చుట్టలుగ నుండుట శిల్ప సాంప్రదాయము. ఈ బొమ్మలయందు కూడ వెంట్రుకలు ఈ రీతిగనే ఉన్నందున ఇవి భోదిసత్వుని ప్రతిమలని చెప్పవచ్చునేమో. దేవతా ప్రతిమలని ఒప్పుకొనినను రూపురేఖలను బట్టే శిల్పి వాటి జన సామాన్యపు వైఖరిని యథతథముగ చిత్రించినట్లు గన్పడు చున్నది. దక్షిణాపథమునందును, దక్షిణ దేశము నందును, నేటికిని గాననగు మానవరూపురేఖలకును, ఆర్యజాతి రూపు రేఖలకును ఉన్న తేడా శిల్పమునందు కూడ అనాదిగ గన్పడుచున్నది. బుద్ధబోధిసత్వులను చిత్రించునపుడు ఆర్యజన రూపురేఖలను చిత్రించుటకు బదులు దాక్షిణాత్యులకు సహజమైన కోలమొగం, లావుపాటి పెదవులు, చప్పిడిముక్కు మొదలగు శిల్ప విశేషములను చూపినందున

దక్షిణ శిల్ప సాంప్రదాయం ఆనాటికే అనల్పవృద్ధి గాంచి ఒక ప్రత్యేకతను సంపాదించుకొని పామరదశకు సహజమగు అనుకరణాది లోపములను వదలివైచి స్వతస్సిద్ధమగు సమగ్రప్రభతో విరాజిల్లుచుండెననుట స్పష్టం.

మనోభావములను వ్యక్తం చేయుటలో శిల్పి ఇందు చూపిన సామర్థ్యం ప్రశంసనీయం. చిత్తవృద్ధి నిరోధమే పరమ లక్ష్యముగ పరిగణించిన ప్రశాంత భావమును, అంతర దృష్టియు కల ఈ మూర్తులు తప్పక బోధిసత్వుని మూర్తులే యని చాటి చెప్పుచున్నవి. ఫాలభాగమున రాణించు లలాట పట్టము, పెద్దపెద్ద కుండలములు, ఉష్ణీషం వలె శిరము నధిష్ఠించిన వెంట్రుకల కొప్పు, మెడపైన వ్రేలియున్న జడలు మొదలగు అంశములన్నియు శిల్పికి అలంకారములపై నెట్టి మక్కువ కలదో ఋజువు పరచుచున్నవి. వెంట్రుకలను యెన్ని రకములుగ కొప్పులుగట్టి జడలల్లి ఆనాడు అలంకరించుకొనుచుండిరో ఈ మట్టిబొమ్మలను మాచిన యెడల తెలియగలదు. ఏ రెంటియందును ఒక పద్ధతి కానరాదు. కాని దేనికి అదే అందముగ కనిపించుచున్నది.

నాటి శిల్పులు అలంకార ప్రియులు అనుటకు మనకు దొరికిన వందలకొలది ఆభరణములే తార్కాణం. బంగారముతోను, రాగితోను చేసిన ఆభరణములే కాక దంతముతోను, గవ్వలతోను చేసిన ఆభరణములు కూడ చాల దొరికినవి. మట్టితో చేసిన పూసలు, హారములు, కంకణములు, వలయములు అసంఖ్యాకంగ దొరికినవి. అందచందములలో ఇవి బంగరు ఆభరణములకు గాని, దంతపు ఆభరణములకు గాని ఎంతమాత్రమును తీసిపోవునవి కావు. ఇక రత్నములలో కార్నలియన్, అమెథిన్, ఓనిక్స్, జేడ్, స్ఫటికం, లాపిస్, లజూలీ మొదలగు రత్నములును (నానా రూపములుగ తీర్చిదిద్దినవి) దొరకినవి. (ముఖ్యముగ బాకువలె తీర్చిన అందమైన రత్నమును చూడనగును.) కుండలములును, ఉంగరములును ఎక్కువగ రాగితో చేసినట్లుగ గన్పించుచున్నవి. దంతపు కంకణముల పైనను, వలయములపైనను చిత్రవిచిత్రములుగ రేఖలు గీచియుండినందున ఈ రేఖల సొబగు శిల్పకౌశల్యమును చాటి చెప్పుతున్నది.

రెండుమూడు బొమ్మలలో కాననగు మందహాసము మానవాతీతమగు ఆనందపారవశ్యకతను జూపుచున్నది. యోగ సమాధియందుండినట్లు చూపు బొమ్మలు కూడ కొన్ని దొరికినవి. భౌతిక దేహమును సర్వాంగ సౌష్ఠవముగ మట్టితో తీర్చిదిద్ది తయారుచేయుటయే కాక మానవసహజమగు హావభావ విలాసములను రూపురేఖల నుండి వెలిబుచ్చుటను, దుర్గమపథకములను ద్రొక్కి నిర్వాణద్యాతీతావస్థను సాధించిన స్థితప్రజ్ఞను, సాధన సమగ్రతను, ఆధ్యాత్మిక సంపత్తిని కూడ వ్యక్తపరచుటకును శిల్పికి సాధ్యమాయెననుట స్పష్టం.

కేవల మొక్క ఆధ్యాత్మికదృష్టియందే మునిగి ఆనాటి శిల్పి సామాన్య

మానవచిత్తవృత్తులను, శృంగారాది నవరసములను వదలివేయలేదు. హాస్యరసములను జూపుట శిల్పికి దుష్కరం కాజాలదు. కాని బోధిసత్వుని ఉదాత్త లక్షణములను మూర్తింపచేసిన శిల్పియే నవ్వుపుట్టించు మట్టి బొమ్మలను కూడ తయారుచేయకల్గుట విశేషమే. పొడుగాటి వెంట్రుకలు వ్రేలాడుచు గిరజాలవలె చివరి ఉంగరములుగ తిరిగి నవ్వు లొలికించు కొన్ని మట్టిబొమ్మలు సామాన్యశిల్పి నిర్మితము లనజాలము. కుబేరుడు, హారతియని కొందరు గుర్తించిన మట్టిబొమ్మలు కూడ ఈ తెగకు చెందినవే.

ప్రాచీన శాతవాహన శిల్పమును సమగ్రంగ చర్చించి, తరువాత కాలమునాటి శిల్పమునకు ఈ శిల్పము ఏరీతిగ పునాదివంటిదో విపులముగ చర్చించు టకు యీ వ్యాసమున సాధ్యము కాదు. శాతవాహన యుగమునకు పిదప మధ్య యుగమునాటి శిల్పము వరకును మనకు తగినంత సామగ్రి దొరకనందున శిల్ప చరిత్ర సమగ్రముగ నిర్ణయించుటకు వీలులేదు. కాని సూక్ష్ముగ పరిశీలించినచో ప్రాచీన యుగము నాటి శిల్పవైఖరియే మధ్యయుగము నాటి శిల్ప వైఖరిగ పరిణమించినదని నిస్సందేహముగ చెప్పవచ్చును.

మధ్యయుగమునందలి శిల్పము చాలవరకు హైందవ శిల్పమే. బౌద్ధము, జైనముకూడ అచ్చటచ్చట విలసిల్లినట్లు చారిత్రకాధారములున్నను హైందవమతము పునరుజ్జీవనము నొందినందున బౌద్ధ, జైనములకు ప్రజాదరణ తగ్గి జీర్ణదశ యందుండెను.

హైందవమతము పునర్విజృంభణము పొందిన ప్రారంభదశలో శిల్పమునందు ఉద్వేగగతియు, విప్లవతయు, కొంచెమధికముగ గాన్పించుచున్నది. ఎల్లోరా గుహలయందలి శిల్పంనందు ఈ అంశము సుబోధముగుచున్నది. క్రీ.శ.8, 9 శతాబ్దాల నాటి ఎల్లోరా యందలి హైందవ శిల్పము బౌద్ధజైన శిల్పములతో స్పర్ధ వహించి, విజిగీషువునకుండు సహజ ఔద్ధత్యమును, ఉద్వేగగయును, ఒక విధమగు ధిక్కారపూరిత విప్లవ భావమును వెలిబుచ్చుచున్నట్లు గాన్పించు చున్నవి. కాని క్రీ.శ.10–13 శతాబ్దులనాటి శిల్పమునందు ఈ చిత్తక్షోభ నశించి, రాగద్వేషములు శమించి, అఖండ విజయము నొందిన విజేత యందు గాన్పించు గాంభీర్యత, సంపూర్ణతమాత్రం కాన్పించుతున్నది.

ఉత్తమదశ నొందిన కళాస్వరూపము సంపూర్ణత్వమును శాశ్వత స్థాయిగ జేసికొనజాలక కాలక్రమముగ పరిణమిల్లి, గతానుగతికముగ వచ్చు నిర్జీవానుకరణముతోను, శిల్ప సమయములతోను నిండి పేలవముగ మారిపోవును. కాని మధ్యయుగము నాటి దక్కను శిల్పము – ముఖ్యముగ కాకతీయ శిల్పము – ఇట్టిది కాదు. చైతన్య శక్తియు, ఉత్తమ శిల్ప లక్షణమగు ద్రవతయు ఈ శిల్పమున క్రీ.శ.పదవ శతాబ్దమునుండి సుమారు మూడు నాలుగు శతాబ్దులకాలము కన్పించుచునేయున్నది.

సౌందర్య పిపాసియగు మధ్యయుగ శిల్పికి సౌష్ఠవ నిర్మాణమును.

లయానుసారియగు అంగవిన్యాస వైఖరియు మాత్రమే సంతృప్తి నొసగజాలక పోయెను. అతని దృష్టి కేవలము సుందరాంగముల సంకుచిత ప్రపంచమును దాటిపోయి జీవితమునందున్న బిగి, పరిపూర్ణత మొదలగు విశాల భావములను జీర్ణం చేసుకొని, సౌందర్యమునొక విశాల దృక్పథముతో అవగాహన చేసికొన యత్నించినట్లు తోచుచున్నది.

మధ్యయుగము నాటి శిల్పరాజములు అసంఖ్యాకములు. మచ్చునకు ఐదారుదాహరణములను మాత్రము ఇక్కడ చూపవచ్చును. అగ్రస్థానము రామప్ప దేవాలయమునందలి నాలుగు ప్రతిమలకు ఒసగవచ్చును. ఈ ప్రతిమలు ఇంచుమించుగ మానవ పరిమాణమున పెద్ద పెద్ద విశాల ఫలకముల పైన నిర్మింపబడినవి. ఇవి సాంచీ తోరణముల మీదను వరంగలు తోరణద్వారముల మీదను ఉన్న యక్ష ప్రతిమల వలె స్తంభాగ్రమునుండి ఏటవాలుగ నిలబడి పైనున్న దూలములను మోయుచున్నట్లు అమర్చబడిన బ్రాకెట్ ఫిగర్స్ అను పార్శ్వ ప్రతిమలు వాస్తు సాంప్రదాయాను సారముగ ఏర్పరుపబడినను ఇవి కేవలము అలంకారికములే గాని వీనినుండి వాస్తురీత్యా ఎట్టి ప్రయోజనము లేదు. ఫోటో చిత్రములకును యవనశిల్పమునకును అలవాటు పడిన వారికి ఈ ప్రతిమల యందలి అంగసౌష్ఠవము కొంతవరకు స్వభావోక్తి నతిక్రమించి పోయినదనియు, ముఖ వైఖరి వాస్తవికత ననుసరించుట లేదనియు తోపవచ్చును. కాని అంగ భంగిమయు హస్త ముద్రలును ప్రస్ఫుటముగ చైతన్య విన్యాసమును స్పందించుచున్న జీవకళను అభివ్యక్తము చేయుచున్నవి. ఈ ప్రతిమలు స్ఫురింపజేయు యవ్వనోద్వేగతయు, లయ స్వరూపమును, ఉత్తమ కళ యొక్క లక్షణములే. దేహ స్వరూపమునందు సరళరేఖలు, కోణములు కానరాక వంపులు, మలుపులు, సమ్మేళనము చెంది చిత్తవృత్తి యొక్క లావణ్యమును ఆనందాతిశయ పారవశ్యతయును స్ఫురింపజేయుచున్నవి. ఈ అంశములు ఇంతకు పూర్వపు శిల్పమున కానరావు.

యౌవనౌద్ధత్యమును, అనిరుద్ధ చిత్తవృత్తియు ఈ పార్శ్వ ప్రతిమలయందే కాక ఈ దేవాలయములందు మరియొక భాగమున కల 'నాగిని' ప్రతిమ యందును గాన్పించును. ఈ మూర్తిని నగ్నముగ చూపి శిల్పి ఎట్టి ఆభరణములును, వేషభూషాదులును చూపజాలని సౌందర్యమును ఒక్క అంగవైఖరి యందే చూపగల్గినాడు. ఇంద్రియ నిగ్రహమును, అహంభావ రాహిత్యమును మానవునికి ఏకైక లక్ష్యముగ శాసించినను హైందవ సంఘము నాగకన్యకలకును, అప్సరో భామినులకును, గంధర్వాంగనలకును, సమగ్ర సౌందర్య విన్యాసమును శృంగార భావ పరిపూర్ణతయును ఆపాదించి యున్నది. చిత్తోద్రిక్తతయు, సుఖానుభూతిని నిరవరోధముగ వెలిబుచ్చు అంగవైఖరియు ఈ నాగిని ప్రతిమయందు కననగును. ఆ ఒయ్యారంపు కులుకు సంపూర్ణ స్వేచ్ఛతో చాచి యుంచిన ఆ కాళ్ళు, చేతులు

కొంచెము పైకెత్తి తన పయోధరములను సంపూర్ణ వికసితములుగ జేసిన ఆ సుందరాంగి భంగిమయు శిల్పి కౌశల్యమును చెప్పకయే చాటుచున్నది. చిత్తోద్వేగతయే ప్రధాన లక్ష్యముగ నున్న యీ శిల్పమునందు వక్షోభాగము నుండియు నితంబ ప్రదేశము వరకును తీర్చి దిద్దిన అవయవ భంగిమ వలన ఒక వినూత్న చైతన్యము స్పందించుచున్నట్లు స్ఫురింపజేసి యౌవనౌద్ధత్యమును ఇతోధికముగ రాజింపజేయుచున్నది. ఇందు కేవలము ఇంద్రియ చాపల్యమును స్ఫురింపజేయు కామోద్రిక్తత ఎంతమాత్రమును కానరాదు. ఈ వ్యక్తి మానవభిన్నయైన నాగనికయను నంశమటుండ ఈ నాగనిక చేతనున్న పడగ విప్పిన పామును, మెడచుట్టను మెలివేసిన పాములను ఈ శిల్పమునకు సామాన్యకాముకి జన సంబంధమైన వాతావరణమునకు భిన్నమైన ఒక విశిష్ట భౌతికాతీత వాతావరణమును సృష్టించి ప్రేక్షకుని చిత్తవికారమును కళా ప్రపంచమునకు సంచాలితము చేసి రక్తి గట్టించుచున్నది. సుఖ సాగరమున మునిగియున్న ఈ సౌందర్యరాశి నాగ సాంగత్యమును గోరుచున్నదేమో! తన సుకుమార కోమల గాత్రములచే మానవాతీత స్థితియందుమాత్రమే రంభాదులవలె పరిష్వంగ మొనర్చునేమో? అభినయ కౌశలమొప్పు వ్రేళ్ళ మధ్యన అంత ఒయ్యారముగ ఫణిరాజును పట్టుకొనియున్న ఈ నాగనిక సామాన్యమానవునిపై దృష్టినైన బరపునా? ఎంతో సూక్ష్మముగ పరిశీలించి, రచించినగాని కామాంధకారమునకు ఎడమీయు ఈ నగ్నస్త్రీరూపము ఇట్టి ఉత్తమ శిల్ప నిదర్శనముగ పరిణమించి యుండదు.

స్త్రీమూర్తిని చిత్రించుటలో భారతీయ శిల్పికి ఎందున సాటిగానరాదు. అధునాతన పాశ్చాత్య శిల్పమునందు – ముఖ్యముగ సాంకేతిక వాదమనియు చిత్తాంకిత వాదమనియు చర్చింపబడుచున్న పాశ్చాత్య సంప్రదాయములందు ప్రాచీన భారతీయ శిల్ప ప్రభావము కొంతవరకు ప్రసరించి యుండుటవలన కాబోలు ప్రకృతి యనుకరణమున కీనాటివరకు ఒసగిన అత్యధిక ప్రాధాన్యత తగ్గి, జీవ చైతన్యమును, భావోద్వేగతను ప్రస్ఫుటము చేయగల శిల్ప చిత్ర పద్ధతులు – అవి వాస్తవికతా నిరూపణకు వేరు దారి త్రొక్కినను సరే – అనుసరింపబడుచున్నవి, 'ఒత్తుకొనివచ్చు కటి కుచోద్భత్తి చూచి. తరుణి తను మధ్య మెచటికో తరలిపోయె" నని ప్రశస్తిగాంచిన స్త్రీమూర్తి తెలంగాణ శిల్పమునందెందు జూచినను గాంచనగును. ఈ పద్ధతి నిన్నటి మొన్నటి వరకును ప్రాచ్య మౌధ్యమునకు, సత్యేతరమగు అతిశయోక్తికి నిదర్శనమని పాశ్చాత్యులచే నిరసింపబడుచుండెను. కాని భావస్ఫురణకు కవివలె శిల్పియు కూడ కొన్ని అంశములను ఉత్ప్రేక్షచేసియో, అతిశయముగ జెప్పియో; మరికొన్ని అంశములను సంకుచిత పరచియో, భావద్యోతకమునకు యెంతయో శ్రమపడిన కాని తన అమోఘ సందేశమును అందజేయజాలడను అంశము ఇప్పటికి క్రమముగ బోధపడుచున్నది.

పానుగల్లునందలి శిల్పములను రెంటిని ఇందు పరిశీలింప తప్పదు.

గణపతి మూర్తియు, నటరాజమూర్తియు కానరాని దేవాలయమే లేదని చెప్పవచ్చును. కాని పానుగల్లునందున్న ఈ శిల్పములు రెండును సాటిలేనివని చెప్పవచ్చును. మూషిక వాహనుడైన ఈ ప్రసన్న గణపతి, ధ్యానశ్లోకములందును లక్షణ గ్రంథములందును నిర్వచించిన రీతిగ నిర్మించబడినను, ఇతని లంబోదరత్వము కాని, కడకు మూషిక వాహనత్వము కూడ, హాస్యమును బుట్టించుటలేదు. ఇతని ఆకారాది విశేషములన్నియు విపరీతసరణీవని కూడ దోచుట లేదు. వాహనమునకు క్రిందనున్న రేఖాచిత్రమును, దక్షిణ పార్శ్వముననున్న కదళీ ఖండమును ప్రధానలయను అనుసరించుచు జీవకళ ఉట్టిపడు ఈ చిత్రమునకు ఒక విశిష్టస్థానమును ఒసగుచున్నవి. రేఖల సొబగు, గతియుతముగ ఒక ప్రధానలయ ననుసరించి నిర్ణీతము జేయబడి యున్నదని ఈ వంపులు తీరియుండు పద్ధతిని బట్టియే నిరూపించవచ్చును. గజాననుని తొండం వామభాగమునకు తిరిగి యున్నందున కదళీఖండం దక్షిణభాగాన ప్రారంభమై చక్కగ నిలుపున పై వరకు నిలచి, ప్రభావళివలె అతని కిరీటం పైన ఒక భాగం క్రిందకు వంగి చుట్టినను రెండవభాగం పైకెగసి లయానుబద్ధంగ వామహస్తము నందలి చక్రరూపమునన్నున్న అక్షామాలతో శృతిగలయుచున్నది. గణపతి స్థూలదేహమును, తదను రూపమగు మూషికమును చిత్రనందు దిగువభాగం నాక్రమించియున్నను తీగెల వలె పైనున్న, ఈ వంపుల రేఖలు చిత్రమునకు ఒక సమస్థిత భావమును కల్పించుచున్నది. పునాది పాయంగ మూషికమునకు క్రిందనున్న రేఖా రచన చిత్రాన కంతటికిని ఒక ప్రధానభూమిక నేర్పరచుచున్నది.

శివమూర్తి ఎన్ని రూపాలుగనో యున్నను నటరాజమూర్తి యందున్న సౌందర్యం, చైతన్యం, లయవిన్యాసం ఏ ఇతర ఉత్తమ కళానిదర్శనం లందును కానరాదు. నాటరాజమూర్తి పల్లవ లోహమయ మూర్తుల యందును, ఎల్లోరా గుహల యందలి అర్ధాభాస చిత్రములందును జగత్ప్రసిద్ధి గాంచినది. పల్లవ శిల్పమును గూర్చిన ప్రస్తావన ఇట అప్రసక్తము. కాని ఎల్లోరా శిల్పంనందుగల నటరాజమూర్తి యందు గాన్పించు క్రోధంగాని, క్రౌర్యంగాని, ప్రతీకార వాంఛగాని పానుగల్లు శిల్పంనందు కానరావు. ఇచట కూడ శివ పాదముల క్రింద ఒక వ్యక్తి చిత్రింపబడియున్నది. కాని ఈ శివమూర్తి అసుర సంహారం చేయుచు, శత్రువును కాలిక్రింద నలిపివేయు చున్నాడనుటకన్న ప్రళయతాండవ మొనరించుచు పాదకమలముల క్రిందనున్న పుణ్యవ్యక్తిని తన్మయత్వ నొందించి పవిత్రీకృతం చేయుచున్నాడన వచ్చును.

(కిన్నెర: సంపుటము 3, సంచిక 9, సెప్టెంబరు 1951 నుండి- శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

తెలంగాణ సీమ : కవుల దర్శనము

– డి. రామలింగం

జయస్తే విశాలాంధ్ర జననీమతల్లికా! శ్రియస్తే తెలంగాణ చికురనవమల్లికా!

అని మహాకవి శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారిచే వినుతింపబడిన తెలంగాణ సీమ ఆంధ్ర సంస్కృతికి కాణాచి. ఇక్కడి ప్రతి అంగుళం భూమి చరిత్ర కందని కాలంవరకు – అంటే మూడు నాలుగు వేల సంవత్సరావల వరకు ఆంధ్రుల ఆచార వ్యవహారాలను, ధర్మాభిరతిని, శిల్పకళానైపుణ్యాన్ని, చిత్రకళా విన్యాసాలను, సంప్రదాయాలను, నడవడులను, అందచందాలను, సభ్యతను చాటుతూ ఉటుంది. ఒకానొక చరిత్రకారుడన్నట్లు తెలంగాణాలోని ప్రతి చెట్టు, పుట్ట, రాయి, రప్ప, గుట్ట, మిట్ట ఆంధ్రుల చరిత్ర తాలూకు ఉదంతాలను వ్యక్తపరుస్తూ ఉంటాయి. ఆంధ్రులకు పవిత్రమైన భూమి, ఆవేశ మిచ్చే ప్రదేశము తెలంగాణా. ఇట్టి పుణ్యభూమిని ఇచటి కవులు తీరు తీరులుగా దర్శించి, ఇక్కడ వెలసిన శిల్పకళా లక్ష్మికి నిరాజనము లిచ్చి, ఇచటి ప్రాచీన వైభవాన్ని సగర్వంగా కీర్తించారు. 'రామప్ప గుళ్ళలో రవణించు మూర్తుల, యందచందబుల నాకళించి! పాకాల చెరువులో బాలనురుగుల తేట, సరస మాధుర్యంబు సంగ్రహించి" ఈ ప్రాంతం కవులు వైతాళిక గీతాలు పాడారు. ఇట్టి రచనలలో నాకు లభించిన కొన్నిటిని ఈ వ్యాసంలో ఉదహరిస్తాను.

తెలంగాణా ప్రప్రథమ ప్రజాకవి అని పలువురి ప్రశంసలకు పాత్రుడైన శ్రీ కాళోజీ నారాయణరావు ఓరుగల్లు నగరంలో జరిగిన దశమాంధ్ర మహాసభ స్థాయి సంఘ సమావేశానికి విచ్చేసిన ప్రతినిధులకు స్వాగతం చెబుతూ

పోతన నాగలి చాలుబారినా
పుణ్య క్షేత్ర మిద్దీ,
ఖ్యాత చరిత్రుని విద్యానాథుని
గాంచిన దేశంబూ.
ప్రతాపరుద్రుడు పరిపాలించిన
పట్టణరాజంబూ,
తొమ్మిది లక్షల ధనుర్ధరులకూ
దొరయై వెలిగాడూ,
కొమ్ములు తిరిగిన యోధులెందరో
కొల్చుచుండి రతని,
పతాకమెత్తీ ఆంధ్ర చరిత్రము
ప్రకటించే నతడూ,
పూతచరిత్రులు, ధీరులు వీరులు

పుట్టిన చోటిద్దీ,
పాడిపంటలకు పెట్టిన పేరై
వర్ధిల్లిన పుడమి.
కాలవశంబున పూర్వ వైభవము
గంగను కలిసినదీ,
కోలుపోయి మా సర్వస్వంబును
గుందుచు నున్నాము.

అని సభాసదులకు తెలంగాణీయుల గోడు విన్నవించుకొన్నారు.

ప్రాచీనాంధ్ర నగరాలలోని ఆంధ్రులకు శాశ్వత కీర్తిని తెచ్చి పెట్టిన కాకతీయ సామ్రాజ్యానికి రాజధానియైన ఓరుగల్లు నగరం చరిత్రప్రసిద్ధి కెక్కిన నగరాలలో ముఖ్యస్థానాన్ని అలంకరిస్తుంది. ఈ నగరాన్ని చూచి, దీని కథలు, గాథలు విని తన హృదయావేదనను ప్రకటించని తెలుగు కవి లేడు. తెలంగాణా సారస్వత రంగంలో ప్రముఖులైన శ్రీ దేవులపల్లి రామానుజరావు ఈ నగరాన్ని గూర్చి వ్రాస్తూ:

ఆంధ్ర నగరీయని అల్లారుముద్దుగా
పిలిచె విద్యానాథ డెలమి నీమె
అల్లుని స్వేచ్ఛకై నెల్లూరి నెరజాణ
పఠియించె నిచటనే భారతంబు
జానుతెనుంగున శైవ ప్రబంధము
ల్మొలకెత్తి యిచటనే మొగ్గ దొడగె
సుందరమందార సుమదామ మొక్కటి
పోతన గ్రుచ్చె నీ పొలమునందు

ఆర్ద్రహృదయాన నెందరో ఆంధ్రకవులు
ఆలపించిరి యిచటనే ఆత్మగీతి
తలచినంతనె మేనెల్ల పులకరించు
అక్కటా నాటి శోభ యేమాయె నేడు!

అని వితర్కించుకొని తెలంగాణ దుస్థితికి కారణాల నరసి మాతృభాషాభ్యాప్తికి సేవచేయ నుత్సహించి తదాదిగా అదే కృషిలో నిమగ్నులై ఉన్నారు.

ఓరుగల్లు శిల్పసంపద అనన్య సామాన్యమైనది. చారిత్రకంగా ఈ నగరానికెంతటి ప్రశస్తి కలదో దీని శిల్పకళా సంపద కూడా అంతే ప్రశస్తి గాంచినది. ఈ శిల్పసంపదను గూర్చి శేషాద్రి రమణ కవులు ఎన్నడో వ్రాసిన పద్యం ఇది :

చెదరి వీథులబడ్డ సింహవిగ్రహములు
గజరాజముల మేనగలిపికొమ్ము

బల్లెంబుగొని క్రొచ్చవచ్చు రాహుతుమేను
శిథిలాశ్వ తనువులో జేర్చుకొమ్ము
కూలిపోయిన శిలాకుంభముల మహోన్న
తద్వారా శిఖరముల దార్చుకొమ్ము
విరిగిన రమణీయ విగ్రహావళి దేవ
నిలయ సీమలలోన నిలుపుకొమ్ము

ఆవల కనుదోయి మూసి మహాంధ్ర నగర
దివ్యతర రూపరేఖ చిత్రించుకొమ్ము
ఆంధ్రసోదర నీకు మహాంధ్ర నగర
గురుతర మహస్సు మదిలోన గోచరించు.

ఓరుగల్లు కోట ఆంధ్రదేశములోని ప్రఖ్యాత దుర్గములలో ఒకటి. ఇది 12వ శతాబ్దంలో గణపతిదేవునిచే నిర్మించబడింది. గణపతిదేవుని అనంతరం ఆయన కుమార్తె రుద్రాంబ ఓరుగల్లు కోటను బాగా దృఢపరచి శత్రుదుర్భేద్యంగా చేసింది. ఈనాడీ కోటను చూస్తే హృదయం ఉద్విగ్నమవుతుంది. పూర్వపు కాకతీయ సామ్రాజ్య చరిత్ర ఒక్కుమ్మడిగా స్ఫురించి గగుర్పాటు కలుగుతుంది. "పోతన చరిత్ర" కావ్యకర్త శ్రీ వానమామలై వరదాచార్యులవారు ఓరుగల్లు కోటను ప్రస్తావిస్తూ:

కుక్కలు జింపువిస్తరిగ గూలిన ఓర్గలు కోట గంటివే
ముక్కున బ్రాణముండియును మూతికి మీసముగల్ల నాంధ్రాడా
తక్కిన మాట లేమిటికి తన్నిన వెన్నున చప్పుడాయె ని
ప్పెక్కడనో యటంచు వెనకేనియు చూడని సోమరుల్ నృపుల్
దిక్కయి దీని కింత గతి దెచ్చిరి! కాకతి బెబ్బులుల్ రుసల్
గ్రక్కెడి చోట గర్జిలెడి గడ్డపుమేకలు గూబమూక లిం
దొక్కకరంబు ఫాలమున నుంచెదు నా బహుపాపమంచు ఆ
చుక్కల చందమామ తలనూపడె తిరిగి ప్రతాపరుద్రుడై. అన్నారు.

కాకతీయ రుద్రదేవ చక్రవర్తి లలిత కళాభిమాని. ఇతడు రాజధానియైన హనుమకొండలో వెయ్యిస్తంభాల గుడి అని వ్యవహరింపబడుతూ ఉన్న దేవాలయాన్ని అతి రమణీయంగా నిర్మించాడు. క్రీ.శ.1163లో చిత్రభాను సంవత్సరాన ఈ ఆలయనిర్మాణం జరిగింది. వెయ్యి స్తంభాల దేవాలయంలో మూడు దేవాలయాలను కలుపు మండపంలో స్తంభములపైగల లతా వితానం, సుమమాలికలు, గొలుసుల చక్కదనం అపురూపమైనది. మండపముపై జీవకళ లుట్టిపడు దేవతామూర్తుల శిల్పం వర్ణనాతీతం. ఈ శిల్పాన్ని వరదాచార్యుల గారిలా ప్రస్తుతించారు :

నీలపు రాలదంతముల నీడలు కన్పడ చెక్కినట్టి దే
వాలయమూర్తులం వడియవైచిన తుమ్మెద వన్నియల్ కలా
శాలలు గట్టుకొన్న విటు; చేయడ చప్పున జారు శిల్ప ఖం
డాలన్రవత్కలాధనుల నాట్యములాడుట నేత్రపద్మముల్.

వెయ్యి స్తంభాల దేవాలయంలో వాసుదేవరకు అభిముఖంగా ఉన్న నంది చూడవలసిన శిల్పాలలో ఒకటి. ఇది పడుకున్నట్లుగా ఆరడుగుల ఎత్తున చెక్కబడింది. దాదాపు ఎనిమిది వందల సంవత్సరాలుగా కాలవిపర్యాసాలన్నిటికీ తట్టుకొని నిల్చింది ఈ నంది. దీని ప్రతి అవయవము ఎంతో సొంపుగా చెక్కబడింది. ఆంధ్రదేశ ప్రాచీన పశుసంపద కిది తార్కాణమేమో అనిపిస్తుంది. వరదాచార్యులవారు దీనిని గూర్చి వ్రాసిన ఈ మూడు పద్యాలు చిత్తగించండి :

కదిలెడిని మూపురం బద్దో గంగడోలు
వ్రేలునటుదోచు చెవులూపు విధమగుపడు,
పంచకరిగిన కొమ్మునాడించదు గిద,
ప్రాణమున్న యాబోతిది! ప్రతిమగాదు.

ఎందునుగాంచ నందెకను నేమి చివాలున లేచి రాదుగా
అందెలు గజ్జియల్ గొలుసులామెడ గంటలు మారుమ్రోగ ని
ట్లందముగా పరుండి నెమరానుచు జీవముగ్రక్కుచున్న నీ
నందినిగాంచి మర్లుగొని నాకెడి రాయెదయైన ధేనువుల్.

నీళ్లుమేత ముట్టక నంది నేలబట్టి
కినిసి పడియున్న దేటికీ తెలుగునేల?
ఆంధ్ర సామ్రాజ్యమిచటికి నస్తమించె
గోవులను పీకికొని తిను ఘోరకాల
మరుగుదెంచుట దలచి బండగుచు కూలె!

వెయ్యి స్తంభాల గుడి కాకతీయుల శిల్పకళా సంపదకు ఒరవడి. దేవాలయద్వార శాఖలపై రమణీయ శిల్ప విన్యాసాల వెలయించుట కాకతీయ శిల్పమునందలి వైశిష్ట్యం. దేవాలయం లోపలి నర్తకుల దివ్యమూర్తుల అంగవిన్యాసాలు అపురూపములు. వీనిని చూడగానే ఎంతటి మితభాషికైనా మాటలు పెకల్చుకొని వస్తాయి. వరదాచార్యులవారంటారు :

కలకలలాడు లే నగుమొగమ్ముల జీవములొలక్క నాట్యముల్
సలిపెడి శిల్పకామినుల జారెడి చీరెల కోర్కులూర న
వ్వలు నగుచెంత కాలమిటు లుండురయారె ఇదెంత వింత వీ
రల గిలిగింత బెట్టిన కరమ్ముల శిల్పి అదెంత చిలిపియో!

తెలంగాణాలో ఆలంపూరు సుప్రసిద్ధ యాత్రాస్థలం. ఇది రాయచూరు జిల్లాలో తుంగభద్రా నదీతీరాన ఉన్నది. శ్రీశైల పశ్చిమద్వారమని, దక్షిణకాశియని ఖ్యాతిగాంచినది. ఇక్కడ భారతవర్షములోని మతశాఖ లన్నిటికీ సంబంధించిన దేవతా మూర్తులుండడం ఒక విశేషం. శ్రీ కేశవపంతుల నృసింహశాస్త్రి గారు ఈ క్షేత్రాన్ని గూర్చి వ్రాస్తూ :

తలప శ్రీశైల పశ్చిమ ద్వారమగుచు
వరలి బ్రహ్మేశ్వరాఖ్యాన పరమశివుని
కాపురంబున దక్షిణ కాశియగుచు
బొలువుమీరును మా యలంపురము సతము.

అన్నారు. ఇచట ప్రాచీన చాళుక్య, పశ్చిమ చాళుక్య, కాలచుర్య, కాకతీయ, తెలుగు చోళ, విజయనగర సార్వభౌముల కాలంనాటి శాసనాలెన్నో ఉన్నవి. ఈ శిలాశాసనాలను గ్రంథరూపంలో వివరించిన శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారు ఆలంపూరు క్షేత్రాన్ని దర్శించవచ్చినవారితో అంటారు :

శాతవాహన రాజులీ తటంబున నాంధ్ర
సామ్రాజ్య బీజముల్ చల్లినారు
చాళుక్య కురరాజ చంద్రులీ గడ్డను
తమ దానధారల తడిపినారు
చోళ సామంతు లిచ్చోటనే ధర్మ స
స్యములకు తగుప్రోది సలిపినారు
మత్తారులను గోసి మా తుంగభద్రలో
కాకతీయులు కత్తి కడిగినారు.
విజయనగరాననీశుల్ విపులమీద
పున్నెములపంట పెనురాశి బోసినారు
పుణ్య గుణభూమి మా అలంపూరు సీమ
స్వాగతము బల్కె మీకు సుస్వాగతంబు.

నేడు తెలంగాణా యువకవులలో దాశరథి అగ్రగణ్యుడు. తెలంగాణా పేరు చెప్పగానే కవులలో చప్పున స్ఫురణకు వస్తాడు. తెలంగాణాయే దాశరథి. దాశరథియే తెలంగాణ మనునట్లుగా ఈయన రచనలు చేశాడు. "నా తెలంగాణ కోటి రత్నాలవీణ" అని ఈయన గొంతెత్తి చాటాడు. ఎక్కడ కవి సమ్మేళనంలో పాల్గొన్నా మొదట తాను వ్రాసిన ఈ మూడు పద్యాలు చదివి తరువాత ఇతర రచనలేవైనా చదువుతాడు :

కోటి తెలుగుల బంగారు కొండక్రింద
పరచుకొన్నట్టి సరసు లోపలవసించి

ప్రొద్దుప్రొద్దున అందాల పూలుపూయు
నా తెలంగాణతల్లి కంజాతవల్లి.

వేయిస్తంభాలగుడి నుంచి చేయిసాచి
ఎల్లోరా గుహలందున పల్లవించి
శిల్పి ఉలిముక్కులో వికసించినట్టి
నా తెలంగాణ కోటి పుణ్యాల జాణ.

మూగవోయిన కోటి తమ్ములగళాల
పాట పలికించి కవితాజదమ్ము కూర్చి
నా కలానకు బలమిచ్చి నడిపినట్టి
నా తెలంగాణ కోటి రత్నాల వీణ!

చిరుతప్రాయంనుంచే కవితారచన చేస్తూ వచ్చిన ఈయన తెలంగాణాలోనేకాక యావదాంధ్రమునకు సంబంధించిన సంఘటనలను, చారిత్రక విశేషాలను ఇతివృత్తాలుగా తీసుకొని ప్రౌఢమైన రచనలు చేశాడు. హైద్రాబాదు ప్రజాపోరాటంలో బందీయై నిజామాబాదు సెంట్రలు జైలులో కారాగారావాసశిక్ష అనుభవించాడు. అది అసలు కారాగారము కాదు. ఇందుపుర దుర్గమని మహారాష్ట్ర వీరుడు ఛత్రపతి శివాజి అనుచరుడైన రఘునాథరాయలు కట్టించిన కోట. దానినే నిజాం నిరంకుశ ప్రభుత్వహయాంలో జైలుగా మార్చారు. అది తెలిసి దాశరథి ఇలా తలపోశాడు.

నశియించెన్ రఘునాథయోధుని దివాణమ్ముల్; మహారాష్ట్ర వీ
రశివాజీ గురురామదాస రసనాగ్రవ్యగ్రమంత్రౌఘముల్
నశియించెన్ రఘునాథ దేవళము లీనాడీ నిజాంరాక్షసీ
నిశితాసిన్ బడి బందిఖానయయి కన్పించెన్ వికారమ్ముగా.

తెలంగాణా శిల్పకళా సంపదకు ప్రభావితమైన దాశరథి లేఖినినుండి ఉత్తమమైన పద్యాలు వెలువడినవి. అయితే ఈయన ప్రత్యేకంగా ఏదో ఒక్క శిల్పమునే వర్ణిస్తూ వ్రాయలేదు. రామప్ప గుళ్ళగోడలపై తీర్చిన లతావలయాలు, దేవతామూర్తులు, నాట్యము చేయు కాంతల వివిధములగు భంగిమలు, గణపురం నృత్యమూర్తులు, పానుగల్లు శిల్పకాంతలు, పాలంపేట శిల్పఫలకములు, వేయిస్తంభాల దేవాలయద్వారంపై వివిధ భంగిమలతో నృత్య వాద్య ప్రదర్శనం గావిస్తున్న స్త్రీ మూర్తులు, ఔరంగాబాదు గుహాలయంలోని యక్షిణీ కిన్నెరలు, ఆలంపూరు నటరాజ విగ్రహము, ఇంకా ఎన్నెన్నో ఉన్నాయి శిల్పకళాఖండాలు. "తాజమహలు నిర్మాణానికి రాశైత్తిన కూలీలెవ్వరో" అను అభ్యుదయ దృక్పథాన్ని అనుసరించి ఈయన తెలంగాణా శిల్పాలనుగాక శిల్పినే కీర్తిస్తూ "శిల్పి" అను పద్యాలు వ్రాశాడు. ఈ పద్యాలను

ఈయనే స్వయంగా చదివి వినిపిస్తే శిల్పి పనివాడితనమంతా ఒక్కసారి శ్రోతల కళ్ళముందు ప్రదర్శింపజేసినట్లవుతుంది. శిల్పిని సంబోధిస్తూ అంటా దీయన :

నినుగని కొండలన్ని రమణీకుచపాళికలై, కపోల మో
హనఫలకమ్ము లై, భ్రుకుటులై, కుటిలాలకజాలమై, సురాం
గలనయి రూపుదిద్దుకొనగా ఉలితో అమృతముచల్లి, జీ
వనములు పోసిపోయెదవు బ్రహ్మవు శిల్పి కులావతంసమా!

తెలంగాణాలో మంజీరానది ప్రవహిస్తూంది. ఈ నది బాలగిరి కనుమల్లో ఉద్భవించి, తెలుగింటికి జారివచ్చిన తెలంగాణా ముద్దుబిడ్డ. దీనికి నిజామాబాదు జిల్లాలో ప్రాజెక్టు కట్టబడింది. అదే నిజాంసాగర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు వల్ల మూడు లక్షల ఎకరాల ఎర్రని ఎడారి పచ్చని పంటచేనుగా పరిణమించింది. దీనినుంచి విద్యుచ్ఛక్తి కూడా ఉత్పత్తి అయి అనేక పట్టణాలకు కాంతిని ప్రసాదిస్తున్నది. గంజి దొరకని కర్షకులకు అపరంజి దింపిన నదీమతల్లి మంజీర. ఈ నదిని గూర్చి దాశరథి చక్కని ఖండకావ్యం వ్రాశాడు. మంజీరతో ఈయన అంటాడు :

ఎవరి గజ్జెల రవళివే నీవు! మంజీర
ఎవరి కజ్జెల భాష్పధారవే! మంజీర
నీవు పారినదారిలో పెక్కు దండాలు
నీవు జారిన జాడలో అమృతభాండాలు
నీవు దూకిననేల మాకు విద్యున్మాల
నీకు ప్రాకిన పథము మాకు చైత్రరథమ్ము
ఎవరికొరకయి పరుగులెత్తి వచ్చితివి?
ఎవరిజూచి తటాకమై నిల్చిపోతివి?
నా తెలుగునింగి నీడల నడచి నడచి
తెలుగు నడతలు నేర్చుకోగలిగినావు.

ఆకలితీర్చుకన్న ఘనమైన మహాయజనమ్ము కాన మీ
లోకమునందు; నీ మనసులో నొకనాడు తదీప్సితమ్ము చీ
కాకొనరింప వాకవయి, కాలువవై, ఝరివై, తటాకమై,
మాకొర కేగుదెంచితిసుమా! కమనీయపయోభరమ్మునన్.

మెదకు మండలంలో ఒకచోట మంజీరానది ఏడు పాయలుగా చీలుతుంది. ఏడు పాయలుగా మంజీర చీలినచోట 'ఏడు పాయల దుర్గాదేవి' వెలిసింది. అక్కడ యేటేటా జాతర జరుగుతుంది. కవి మంజీరను ప్రశ్నిస్తాడు:

ఎవ్వరే యెదురొచ్చి ఏడుపాయలుచేసి
రవ్వల్ల వీణగారాగమెత్తిని నిన్ను?

"ఏడుపాయల దుర్గ" ఏమన్నదే నిన్ను?
యేమన్నదే నిన్ను యేడుపాయల దుర్గ?

మంజీరకు మౌనభంగం కలిగి చల్లని చూపుల జల్లులతో అంటుంది :

"ఏడు పాయల దుర్గ యెదురుగా వచ్చింది
పాడుకొమ్మన్నాది, పరుగులిడమన్నాది
స్వరమొక్కపాయగా సాగిపొమ్మన్నాది
బంగారు పండించి ప్రజలకిమ్మన్నాది."

కవి అంటాడు :

"మంజీరామ తల్లి
తెలంగాణా రైతుల కల్పవల్లి"

కృష్ణ, గోదావరి, తుంగభద్ర, కిన్నెరసాని నదులు ఇటు తెలంగాణాలోను, అటు ఆంధ్రప్రదేశంలోనూ ప్రవహిస్తున్నాయి. ఇవి కొన్ని కొన్ని చోట్ల ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్రాలకు ఎల్లలుగా కూడా ఉన్నవి. ఈ నదీమార్గాలలో ఒక ఒడ్డువైపు ఉండే ఆంధ్రులు ఒక రాష్ట్రంలోను, అదే నది అవతలి ఒడ్డున వున్న ఆంధ్రులు మరో రాష్ట్రంలోను ఉండడం అసహజంగా కన్పట్టింది దాశరథికి. ఆ నదులచెంత నిలబడి అటూ ఇటూ ఒడ్డులను పరికిస్తే రెండు ప్రాంతాలూ ఏకం అయ్యేటట్లే కనిపించాయి ఈయనకు. కనుకనే మహోద్రోదయం కొరకై మాతృభూమితో ఇలా అన్నాడు :

తుంగభద్రానదీ భంగమ్ము లిరుకేల
లొరపారుచు రుచు లరసియుచుండ
కృష్ణవేణీ తరంగిణీ నాలుకలుసాచి
దరులరెండిట మజాలరసిపోవ
గోదావరీ వీచికాదివ్య హస్తమ్ము
తిరుకెలంకుల మన్ను తరచుచుండ
బోటికిన్నెరసాని మాటిమాటికి పొంగి
రెండు క్రేవల దరులండగొనగ

ఇటునటును తెల్గునేల లారటముజెంది
కలిసిపోజూచుచున్న యట్టులనె తోచు,
కలిపివేయుము నా తెలంగాణ తల్లి
మూడుకోటుల నొక్కటే ముడి బిగింది!

(కిన్నెర : సంపుటము 6, సంచిక 7, జూలై 1954నుండి- శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

తెలంగాణా నాటకాలు

– కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు

ఉత్తమ నాటక రచన యాంధ్రదేశమున నర్ధ శతాబ్దికి పూర్వము లేదు. నాటకపితా మహునితో నారంభమై క్రమముగ నభివృద్ధి నొందుచు గత శతాబ్దిలో నాటకములు కొల్లలుగ నవతరించినవి.

తెలంగాణమునందు గత రెండు మూడు శతాబ్దులలో సంస్కృతకవులు కొందఱు నాటకకర్తలై వలసినారు. అందు ముఖ్యముగా పేర్కొనదగిన వారు వనపర్తి సంస్థాన ప్రభువులలో నొకరగు శ్రీ అష్టభాషా బహిరీ గోపాలరావుగారు. వీరు పదియేడవ శతాబ్ది మధ్యకాలమువారు. ఈ రాజకవి సంస్కృత కవిరాజై "రామచంద్రోదయము" అను నొక యమక కావ్యమును సంస్కృతమున ప్రౌఢశైలిలో రచియించి యది సుబోధ మగుటకుగాను దాని వ్యాఖ్యను గూడ రచియించెను. శ్రవ్య కావ్యమేగాక "శృంగారమంజరీ బాణము" అను నొక దృశ్య ప్రబంధమును గూడ ఆయన రచియించినారు. ఈ రెండు గ్రంథములు ముద్రితములై సంస్థాన పుస్తకాలయములో నున్నవి. ఎనిమిది ప్రాకృతభాషల నెరిగినవాడగుటచే నాతనికి "అష్టభాషా" అను బిరుదము వచ్చినది.

గత శతాబ్దిలోను, ఈ శతాబ్దిలోనూ గద్వాల, వనపర్తి, సురపురము, ఆత్మకూరు, గోపాలపేట మున్నగు సంస్థానములందు శాస్త్రవిద్వాంసులు, కవులు వెలసినారు. తెలంగాణములోని కెల్ల మహబూబు నగరము జిల్లాలో అనేకులు విద్వాంసులు వెలసినారు. వారిలో ప్రౌఢసరస్వతి బుక్క పట్టణము శ్రీనివాసా చార్యులు (వీరు ఆత్మకూరు వాస్తవ్యులు), వనపర్తిలో శ్రీ హొసదుర్గము కృష్ణమాచార్యులు మున్నగువారు అనర్గళమైన సంస్కృత కవితాధారచే తెలంగాణమునే గాక భారతదేశమున పలుతావుల పండితుల నలరించి నారు. ఇలాగే తెలుగు కవులుగూడ ప్రౌఢశైలిని బహుళ గ్రంథములు రచియించినవా రనేకు లీ సీమలో నున్నారు.

నాటక కర్తలనుగూర్చి చెప్పవలసి వచ్చినపుడు తెలంగాణమునందు కొందఱు ఈ శతాబ్దిలో సంస్కృత నాటకములను తెనిగించినవారున్నారు. వారిలో కీర్తిశేషులు మాదిరాజు విశ్వనాథరావుగారు కాళిదాస శాకుంతలమును తెనిగించిరి. అది అముద్రము. నేను, వారును కలిసి బిల్హణుని "కర్ణసుందరి" అను నాటికను తెనిగించితిమి. అది ముద్రితము.

ఈ దశాబ్దిలో తెలంగాణమున స్వతంత్ర నాటకములు అవతరించినవి కాని, ఇతర సాహిత్య విభాగములకున్న రచనా వ్యాప్తి నాటక విభాగమునకు లేదు. ఉత్తమ నాటక స్థాయికి చెందినవి తెలంగాణమున చాల కొద్దిగా నున్నవి. వనపర్తి వాస్తవ్యులు కీర్తిశేషులు శ్రీ మాదిరాజు విశ్వనాథరావుగారి "ఉచ్చల" నాటకము, కీర్తిశేషులు శ్రీ

సురవరం ప్రతాపరెడ్డిగారి "తుకారం" నాటకము ఉత్తమశ్రేణికి చెందినవి. శ్రీ ప్రతాపరెడ్డిగారు నాటక రచనయందేకాక వివిధ సాహిత్య ప్రక్రియలను స్వీకరించి వానిని పరాకాష్ఠనందించిన సహజ ప్రతిభాపాండితీ విలసితుడు. ఈయన త్రొక్కని సాహితీపథము లేదు.

సురవరంవారు, మాదిరాజు వారల తరువాత ఎన్నుకోదగిన నాటకకర్తలు కొందఱు గలరు. వారు రచించిన నాటకములలో శిష్టవ్యావహారిక భాష వాడబడినది. వానిలో కొన్ని తెలంగాణమున నచ్చటచ్చట ప్రదర్శింపబడి రసికుల హృదయములను చూఱగొన్నవి. అట్టి నాటక రచయితలలో ఎన్నుకోదగిన వారు శ్రీ భాగి నారాయణమూర్తి గారు. వీరు హృదయంగమమైన వ్యావహారిక భాషలో రసికుల హృదయాకర్షకమగు భావములతో "పరీక్ష చదువు, డాక్టర్ యజ్ఞ" అను రెండు రసవత్తర నాటకములను రచియించినారు. అవి యిప్పుడు ప్రచారమున నున్నవి. వీరు నాటకములే కాక చక్కని ఖండకృతులు గూడ గూర్చినారు. శ్రీ చిల్లర భావనారాయణరావుగారు "కళాభిమాని, దేశద్రోహం, ఉప్పెన, కామందు, పరిణామం, కొత్తమనిషి" అను నాటకములను, ఇతర ఖండ కావ్యములను వ్రాసినారు. వీరును రచనలో భాగికి ఱేడగువారు. శ్రీ ఎ.ఆర్.కృష్ణగారు "అరగంటలో అదృష్టం, ఎక్కడికి, కల్లోలం, దేశంకోసం, చేసిన నేరం" మున్నగు నాటకములను వ్యావహారికాంధ్రమున రచయించినారు. వీరు చక్కని కథానికా రచయితలు గూడ. వీరి శైలి మృదుమధురమై సర్వజనానురంజకంగా నుండును. ఆ తరువాత పేర్కొనదగిన యువకవి శేఖరుడు శ్రీ సి.నారాయణరెడ్డి. ఈయనకు ఉగ్గుపాలతోనే కవిత్వ మబ్బినదా యనునంత కవితాప్రతిభ రచనలో వెల్లివిరియుచుండును. రసికులైన విద్వత్కవులు మెచ్చు సలక్షణ కవితాధార భావనాశక్తి, రచనా పాటవము నారాయణరెడ్డి కవితలో ప్రతి పదమునందును వెల్లివిరియుచుండును. ఈతడనేక పద్యగేయ ఖండకృతులే కాక "ఋతువులరాణి, నవ్వని పువ్వు, వలపురేడు, అజంతా సుందరి, సుగాత్రి" అను నాటికలు గూడ రచియించినాడు. ఇతడింకను నభివృద్ధి నంది తెలంగాణమునకు మణిపూస కాదగు కవితాబీజము లితనిలో గలవు. శ్రీ గిడుతూరి సూర్యం గేయకవిత్వ రచనలో నిపుణుడు. ఈయన "ఆహుతి, మానవుడు" అను నాటికలను రచియించి రసికుల మన్ననలందినాడు. ఇటీవల జరిగిన ఆల్ఇండియా రేడియో నాటికల పోటీలో నీతని "కన్నబిడ్డలు" అను నాటికకు తృతీయ బహుమతి లభించినది. శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు "ఏడుసున్నలు, రెండు నాలుకలు, ఇదీ తంతు, ప్రతిధ్వనులు" అను నాటికలను రచియించినారు. వీరు సుప్రసిద్ధ కథకులు. శ్రీ భట్టిప్రోలు జయరామారావు "త్యాగయ్య, అప్పాజీ, అవసానం, పన్నా, ఆంధ్రప్రతిభ" అను నాటకములను వ్రాసి చారిత్రక నాటకకర్తలలో పేరొందిన ప్రతిభావంతుడు. శ్రీ సురమౌళి "కులంనిసా", శ్రీ కవిరాజమూర్తి "మార్పు", శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి

"మేధావి" అను నాటకములను రచియించినారు. "చిరు గజ్జెలు" అను పుస్తకములో శ్రీమతి యశోద, శ్రీ వట్టికోట, శ్రీ సురమళి, శ్రీ నారాయణరెడ్డిగారల కృతులు వెలసినవి. వట్టికోట కథానికా రచనమున గూడ అందెవేసిన చేయి. ఆ తరువాత ముఖ్యముగా నెన్నదగిన యువ రచయిత శ్రీ కె.ఎల్. నరసింహారావు. ఈయన వచనశైలి చాల హృదయంగమముగా నుండును. ఈయన "గెలుపు నీదే, ఆదర్శలోకాలు, ఒకరోజు, కాలప్రవాహం" అను నాటికలను రచియించి చిఱుత వయసుననే చక్కని నైపుణ్యము సంపాదించి యశము గడించినారు.

1. ఇండియన్ నేషనల్ థియేటర్; 2. విజయకళా సమితి; 3. నవ్యకళా సమితి; 4. సన్మిత్ర నాట్యమండలి; 5. విస్తృత నాట్యమండలి; 6. జయహిందీ నాట్యమండలి; 7. కాకతీయ కళాసమితి; 8. జనతా కళామండలి; 9. ఆంధ్ర విజ్ఞాన సమితి; 10. ఆర్.టి.డి. ఎంప్లాయీస్ యూనియన్; 11. ఇన్‌కంటాక్స్ ఎంప్లాయీస్ యూనియన్; 12. వివిధ కళాశాలల ఆంధ్ర విద్యార్థి సమాజము; 13. దుర్గా ఎమెచ్యూర్సు; 14. చిక్కడ్‌పల్లి ఎమెచ్యూర్స్; 15. వెంకటేశ్వర కళాసమితి; 16. ఆంధ్రాభ్యుదయ కళాసమితి మున్నగు నాటక సంఘములు తెలంగాణములో వివిధ నాగకములను ప్రదర్శించుచు నాట్య కళాపోసణమును చేయుచు రచయితల నుత్సాహ పఱుచుచున్నవి.

ఇంకను ననేకులు రేడియో నాటకములను రచియించి ప్రసారము చేసినవారు. శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి మున్నగువారున్నారు. వీరేకాక ప్రతిభా వంతులైన రచయితలెందరో వెలుగులకు రానివారు తెలంగాణములో కలరు. రచయితలకు ప్రోత్సాహము గలిగించుచు "ఆంధ్ర సారస్వత పరిషత్తు, సాధన సమితి, తెలంగాణా రచయితల సంఘము" మున్నగు సారస్వత సంస్థలు కృతులను రచియింపజేసి తెలంగాణా సాహిత్యరంగమున నొక నూత్నోత్తేజమును గలిగించుచు సారస్వతసేవ సలుపుచున్నవి. – పరిశోధన (డిశంబరు–జనవరి 1955)

(కిన్నెర : సంపుటము 7, సంచిక 1, జనవరి 1955 నుండి– శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)



తెలంగాణాలో తెలుగు భాషా సాహిత్యాల వికాసం

- కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన తెలంగాణా, తెలుగు సాహిత్యానికి అమూల్యాలంకారాలను చేకూర్చినది. పోతన, పండితారాధ్యుడు, పిల్లలమర్రి పినవీరభద్రుడు, గోపన్న మొదలగు సాహితీవేత్తలు తెలంగాణాలోనే జన్మించినారు. అయితే కొంతకాలం తరువాత ఈ సీమ అనేక కారణములచేత మరుగున పడిపోయినది. ఈ శతాబ్దారంభంలో హైద్రాబాదు రాష్ట్రంలో ఆంధ్రసారస్వతోద్యమానికి మూలపురుషుడు దనదగిన కీ.శే. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు తెలుగు భాషా వికాసానికి చక్కని పునాదులు వేసినారు. ఆయన కృషి మూలగానే 1901లో హైద్రాబాదు నగరంలో కృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయం స్థాపించబడింది. ఆ తరువాత తెలంగాణా జిల్లాలలో అనేక గ్రంథాలయములు నెలకొల్పబడినవి. హైద్రాబాదు రాష్ట్రంలో మొట్టమొదటి ప్రచురణ సంస్థ అయినట్టి విజ్ఞానచంద్రికా గ్రంథమాలను వారే 1907లో స్థాపించారు. లక్ష్మణరావుగారు ప్రారంభించిన గ్రంథాలయోద్యమమే తెలంగాణాలో సారస్వత, సాంఘిక, రాజకీయ చైతన్యానికి మూలకందమైనది. 1948లో శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు గారు ఆంధ్ర చంద్రికా గ్రంథమాలను స్థాపించి ఉత్తమమైన విషయాలకు సంబంధించిన గ్రంథములను ప్రచురించారు. 1948 సెప్టెంబరు, నెలకు పూర్వం ఇతర ప్రాంతీయ భాషలవలెనే తెలుగుభాషకు కూడా ప్రభుత్వాదరణ లేకపోయింది ఈ లోపమును గుర్తించి, సారస్వతాభి మానులైన కొందరు యువకులు ఆంధ్రసారస్వత పరిషత్తు అనుపేర నొక సంస్థను స్థాపించి తెలుగుభాషా ప్రచారము చేయ మొదలు పెట్టినారు. పరిషత్తు స్వయముగా పాఠ్యప్రణాళికలను, పాఠ్యగ్రంథములను తయారుచేసి తెలంగాణములోని వివిధ కేంద్రాలలో తెలుగు పరీక్షలను జరుపనారంభించినది. అక్షరాస్యులు కానివారికి మాతృభాషను బోధించుట, రాష్ట్రాంధ్రులలో మాతృభాషాభిమానమును పెంపొందించుట, ప్రాచీన తాళపత్ర గ్రంథములను ప్రకటించుట, ఆంధ్రభాషాభివృద్ధికై సర్వ విధముల కృషి చేయుట పరిషత్తు యొక్క ముఖ్యాదర్శాలు. 1948 తరువాత పరిషత్తు ప్రభుత్వ ఆర్థిక సహాయమును పొంది వయోజన విద్యావ్యాప్తికి కూడా కృషి చేయ నారంభించినది. ఇప్పుడు పరిషత్తుకు రాష్ట్రంలోను, రాష్ట్రం వెలుపలను అనేక శాఖలున్నవి. పరిషత్తు యొక్క ప్రవేశ, విశారద పరీక్షలు హైద్రాబాదు ప్రభుత్వంచే గుర్తింపబడినవి.

ఆంధ్ర సారస్వత పరిషత్తుగాక తెలంగాణాలో అనేకమంది రచయితలు సభ్యులుగా నున్నటి సారస్వత సంస్థలు మరి రెండు ఉన్నవి. వీనిలో మొదటిది సాధన సమితి. ఇది 1936లో స్థాపించబడింది. ఈ సంస్థలో ప్రముఖ కథా

రచయితలు, కవులు సభ్యులుగా నున్నారు. ఆ తరువాత రాష్ట్రంలోని ప్రధానమైన సాహితీ సంస్థలలో తెలంగాణా రచయితల సంఘం చెప్పుకోదగినది. ఈ సంఘానికి జిల్లాలలో కూడా శాఖలున్నవి, సాహితీ గోష్ఠులద్వారా, కవి సమ్మేళనాలద్వారా ఈ సంస్థ తెలుగు సాహితీ వికాసానికి కృషి చేయుచున్నది. ప్రజలలో మంచి పేరు ప్రఖ్యాతులు గల కవులు, రచయితలు ఈ సంఘమునకు సభ్యులుగా నున్నాను.

ప్రముఖ సారస్వత సంస్థలలో విజ్ఞాన వర్ధనీ పరిషత్తు ముఖ్యముగా పేర్కొనదగినది. కీ.శే. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు ఈ పరిషత్తును స్థాపించారు. సికింద్రాబాదు నవ్య కళాసమితి విజయకళా సమితి మున్నగు సంస్థలు తెలుగు నాటక కళోద్ధరణకై ప్రశంసనీయమైన కృషి చేస్తున్నవి.

గత పదేండ్లలో తెలంగాణాలో తెలుగుభాష గణనీయమైన అభివృద్ధి ప్రచారములను గాంచినది. ఈ కాలంలోనే హైదరాబాదు ప్రభుత్వం నిరక్షరాస్యతా నిర్మూలనకు వయోజన విద్యా తరగతుల ద్వారా కమ్యూనిటీ ప్రాజెక్టు ప్రాంతాలలో సంగీత సారస్వత కార్యక్రమాల ద్వారా, 1953 సెప్టెంబరు నెలలో ప్రవేశపెట్టబడిన నిర్బంధ ప్రాథమిక విద్యా చట్టమును కొన్ని నిర్ణీత ప్రాంతాలలో అమలు పరచుట ద్వారా, తెలుగు భాషకు అమూల్యమైన సేవ చేసినది.

ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బోధనా భాషగా తెలుగును ప్రవేశపెట్టడం వల్ల రాష్ట్రంలో ఆంధ్రభాషాభివృద్ధికి చక్కని అవకాశము లేర్పడినవి.

కీ.శే. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు ప్రారంభించిన గ్రంథాలయోద్యమం ఇప్పుడు ప్రభుత్వ ప్రోత్సాహమును, సహాయమును విరివిగా పొందుచున్నది. ప్రస్తుతం విద్యాశాఖ డైరెక్టరుగా నున్న శ్రీ సేతు మాధవరావు, ఐ.ఎ.యస్. గారు స్వయంగా దీనికై కడు శ్రద్ధతో కృషి సలుపుచున్నారు. పాఠశాలల లైబ్రరీలలోను, ప్రభుత్వ ప్రైవేటు గ్రంథాలయాలలోను తెలుగు పుస్తకముల సంఖ్యను పెంచించడానికి ఆయన సర్వ ప్రయత్నములు చేస్తున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం : ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా ప్రాంతీయ భాషల ప్రాధాన్యమును గుర్తించి వాటిని కాలేజీ నిర్బంధపఠనీయ భాషలుగా చేసినది. అంతేగాక విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ భాషల పి.హెచ్.డి. రీసెర్చి తరగతులు ప్రారంభింపబడినవి. తత్ఫలితంగా ఇద్దరు లెక్చరర్లు – శ్రీ దివాకర్ల వెంకటావధాని గారు నన్నయకు పూర్వపు తెలుగు వాఙ్మయమును గూర్చియు, శ్రీ బి.రామరాజు గారు తెలుగు జానపద సాహిత్యమును గూర్చియు పరిశోధనలు సల్పుతున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క తెలుగు, సంస్కృత వ్రాతప్రతుల విభాగము తెలంగాణములోని కొన్ని ముఖ్యమైన వ్రాతప్రతులను పరిశీలించి పరిష్కరిస్తున్నది. ఈ విభాగమునకు రిటైర్డు ప్రొఫెసరు శ్రీ కురుగంటి సీతారామయ్య గారు అధిపతిగా నున్నారు. **– నేటి హైద్రాబాదు (ఫిబ్రవరి 1954)నుండి**

శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం

ఇరువదియైదు సంవత్సరాల క్రితం ఈ భాషా నిలయపు రజితోత్సవము జరిగినప్పుడు నేను గౌరవ కార్యదర్శిగా పనిచేయు గౌరవము లభించింది. స్వర్ణోత్సవ సందర్భంలో నాకు నిలయాధ్యక్షత పదవినేగాక ఈ సమావేశమునకు అధ్యక్షుడుగా నుండు గౌరవము నొసంగిన మిత్రులకు నే నెంతయు కృతజ్ఞతాబద్ధుడను. నాకు యీ నిలయంతో గల సన్నిహిత సంబంధమువలన వారి యాజ్ఞ నంగీకరించక తప్పినది కాదు.

లోకమునందు యే జాతికేనియు భాష ప్రాణము వంటిది. సంస్కృతి యను పదములో అనేక విషయములు యిమిడి యున్నను వేషభాషలు ముఖ్యంగా గమనింపబడు చుండును. వేషము జాతికి కేవలం బాహ్యావిష్కారమగుటచే దానిని ఎప్పటికప్పుడు యిష్టానుసారముగా మార్చుకొన వచ్చును. కాని భాష ఆంతరంగిక మగుటచే మార్చుకొనరానిది. ఒకవేపు దేశకాల పాత్రముల ననుసరించి అనివార్య కారణముల వలన భాషలో మార్పు కలిగెనేని అట్టి మార్పే సంస్కృతియందు వెంటనే ప్రతిఫలించును. భాష సచేతనమై దినదినాభివృద్ధి గాంచుచుండునేని ఆ జాతియు నట్లే పురోగమనము చేయు చుండును. దురదృష్ట వశమున భాషయే పతనావస్థకు గురి అయ్యెనేని ఆ జాతియూ పతనము వంకకు మొగ్గక తప్పదు. ఈ పరస్పర సంబంధము ఒక చారిత్రక సత్యము.

భాషా నిలయం పుట్టుక

కాకతీయుల కాలమున మహోజ్జ్వలముగా వెలుగొందిన ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మి వలెనే ఆనాటి ఆంధ్ర భాషా సారస్వతము అత్యుత్తమ దశ నంది వెలుగొందినది. ఈ తెలంగాణా ఆనాటి ఆ ఆంధ్ర సారస్వతమునకు విహార రంగమై విలసిల్లినది. భాగవతము, రామాయణము, బసవ పురాణము, మార్కండేయ పురాణము మొదలుగా గల శతాధిక గ్రంథములు ఆంధ్ర వాగ్దేవికి అనర్ఘాలంకారములూ విలసిల్లినవి. కాని కాకతీయరాజ్య పతనానంతరము ఆంధ్ర భాషామతల్లియూ పతనోన్ముఖియై రాను రాను క్షీణదశకు వచ్చినది. ఇప్పటికి ఏబది సంవత్సరములకు పూర్వము హైదరాబాదు రాష్ట్రము నందలి తెలుగుభాష విషమ పరిస్థితిని గమనించి ఇంగ్లీషు, ఉర్దూ భాషలకున్న చెల్లుబడిలో శతాంశమేననియు ప్రాముఖ్యము లేక "ఉద్ధతుల మధ్య పేదకు నుండ తరమే" యను నార్యోక్తి ననుసరించి అదశ్యప్రాయమగుచున్న భాషామతల్లిని పునరుద్ధరించుటకై ఈనాడు స్వర్ణోత్సవమును నెరపుకొనుచున్న శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము జన్మించెను. అన్ని సాధనములు అన్యోపాయములును అనాచరణీయములై అనుపయుక్తములుగా కన్పటినందున ఆంధ్ర భాషా ప్రచారమునకును, ఆంధ్ర సారస్వత

పునరుద్ధరణము నకును గ్రంథాలయోద్యమమే తరుణోపాయముగా తోచినది నాటి పెద్దలకు. సర్వతోముఖమగు ఆంధ్రోద్యమ పరిశ్రమలందు గ్రంథాలయోద్యమము ఆంధ్రుల ప్రత్యేక సభ్యతను వికసింప జేయుటకు మిక్కిలి అనువైన దగుట చేతను, వారి విలక్షణ జాతీయ స్వభావమునకు అనుకూలమైన దగుటచేతను ఆంధ్ర జనసామాన్యముచేత స్వాగతము పడసినది. ఇంకను గ్రంథాలయోద్యమము జనాకర్షణ దశ నొందని కాలముననే విశాలమగు విజ్ఞాన ప్రేమచే ప్రేరితులై ఆనాటి మన పెద్దలు ప్లవనామ సంవత్సర శ్రావణ బహుళ తదియ భానువారమునకు, ఆంధ్రభాషా నిలయము రామకోటిలోని కీర్తిశేషులు శ్రీ రావిచెట్టు రంగారావుగారి భవనములో స్థాపించబడింది. తరువాత దినదినాభివృద్ధి నొందుతూ క్రమక్రమంగా ఇప్పటి రూపు రేఖలను దిద్దుకొన్నది.

ఈ నిలయమును స్థాపించిన పెద్దలలో నేటి మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షులు శ్రీ రాజా నాయిని వెంకట రంగారావుగారును, కీర్తిశేషులు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారును ముఖ్యులు. కీర్తిశేషులు ఆదిపూడి సోమనాథరావుగారు, మైలవరపు నరసింమ శాస్త్రిగారను పండితద్వయము వారితో సహకరించినవారిలో గణనీయులు. ఈ అయిదుగురి నిరంతర కృషి సేవా ఫలితముననే ఈ భాషా నిలయము అనేక బాలారిష్ట దోషముల నుండి తప్పించుకొని తన యస్థిత్వమును నిలుపుకొన్నది.

స్థాపనోద్దేశం :

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయము అను పేరునందే ఈ నిలయ స్థాపనోద్దేశం ఇమిడి ఉన్నది. రాష్ట్రమునందు అత్యంత దుస్థితినందున్న తెలుగు భాషను భాషా ప్రచారము ద్వారా తిరిగి శ్రీకృష్ణదేవరాయలు కాలమునందు ఆంధ్రభాషకు సిద్ధించిన ఉచ్చదశకు ఉద్ధరించుటయే ఈ నిలయము యొక్క ప్రధాన ఉద్దేశము. కావుననే ఈ భాషా నిలయ స్థాపనము తెలంగాణము నందలి ఆంధ్రభాషా వికాసనోద్యమమునకు అంకురార్పణమై వెలసినది. ఈ నిలయ స్థాపనతో ప్రారంభింపబడిన గ్రంథాలయోద్యమము నిజముగా తెలంగాణము నందలి ప్రప్రథమ ఆంధ్రోద్యమమని చెప్పుట అతిశయోక్తి కాదు. ఈ నిలయ స్థాపనము తెలంగాణా ఆంధ్రులలో ఒక నూతనోత్సాహమును రేకెత్తించెను. 1904 సంవత్సరములో శ్రీ లక్ష్మణరావుగారి ప్రోత్సాహముననే హనుమకొండ లో శ్రీ రాజరాజనరేంద్ర భాషా నిలయము స్థాపించబడెను. 1905లో సికిందరాబాదు నగరమందు ఆంధ్ర సంవర్ధనీ గ్రంథాలయము, 1918లో ఓరుగల్లునందు శబ్దానుశాసన ఆంధ్రాభాషా నిలయమును సంస్థాపితము లయ్యెను. ఈ విధముగా ఈ గ్రంథాలయోద్యమమే తెలంగాణమునం దంతటను వ్యాపించి ఈ గ్రంథాలయపు రజితోత్సవము అనగా 1927 వరకే హైదరాబాదులో ఏడు, సికిందరాబాదులో నాలుగు, ఆతరాఫ్‌బల్దా జిల్లాలో రెండు, వరంగల్ జిల్లాలో పదేను, కరీంనగర్ జిల్లాలో తొమ్మిది, నల్గొండ జిల్లాలో పదమూడు,

మహబూబ్‌నగర్ జిల్లాలో అయిదు, మెదక్ జిల్లాలో అయిదు, నిజామాబాదు, ఆదిలాబాదు, రాయచూరు జిల్లాలలో ఒక్కొక్కటి చొప్పున గ్రంథాలయములు స్థాపింపబడెను. ఈ విధముగా తెలుగు జిల్లాలలో అల్లుకొనిపోయిన గ్రంథాలయములు, ఉపన్యాసములు, సభలు, సమావేశములు, కవితాగోష్ఠులు, వార్షికోత్సవములు మున్నగునవి జరిపి నిద్రాణులై ఉన్న తెలంగాణా ప్రజలను మేల్కొలిపి, వారియందు జిజ్ఞాసాతృష్ణను ఉద్భవమొనరించినవి. యువకులలో రచనోత్సాహము పురికొల్పుటకు తోడ్పడినవి. 1913నుండి విజ్ఞానవంతులు కొందరు మాతృభాషా సేవకు నడుం కట్టి పత్రికలను ప్రకటింప నారంభించిరి. హితబోధిని, తెలుగు పత్రిక, నీలగిరి, ఆంధ్రాభ్యుదయం, గోల్కొండ పత్రిక, సుజాత, ఆంధ్రశ్రీ, దేశబంధు, తెలుగుతల్లి, విభూతి, దివ్యవాణి, ఆంధ్రవాణి, తెలంగాణా, మీజాన్ (దినపత్రిక), శోభ, తరణి వంటి మాస, వార, అర్ధవార, దినపత్రికలు తెలంగాణం యొక్క వివిధ ప్రదేశములనుండి వెలువడ నారంభించి గ్రామములందును పాఠకుల సిద్ధపరచి, విజ్ఞాన ప్రచారముగావించి భాషాసేవ యొనరించినవి. వీనియందు అనేకములు ఆర్థిక దుస్థితిచే బాలారిష్ట దోషాలకు గురియై అంతరించినవి. కొన్ని ఆ కాలపు రాజకీయ నిర్బంధమువలన బాధింపబడినవి. నిర్బంధములు సడలింపబడుటచే పోలీసుచర్య అనంతరము కొలది కాలములకే సుజాత, ప్రగతి, భాగ్యనగర్, పద్మశాలి, జనశక్తి, ప్రజాశక్తి, మేధావి, జయభారత్, తెలుగుదేశం, కాకతీయ, చిత్రవిచిత్ర, సుదర్శన, శ్రీ కుసుమహరనాథ, ప్రజావాణి మొదలగు మాస, పక్ష, వార, ద్విదిన పత్రికలు వెలువడి ప్రశంసనీయమగు భాషాసేవ నొనర్చుచున్నవి.

వివిధ సంస్థల సేవ

ఈ సాధనములు గాక, భాషా సేవకొరకు కొన్ని గ్రంథమాలలు స్థాపింపబడినవి. గోల్కొండ, కిన్నెర, దివ్యవాణి, కాకతీయ, విరేశలింగ కవికంఠాభరణ, విజ్ఞాన ప్రచారిణీ మండలి, అణా గ్రంథమాల, దేశోద్ధారక, సాహితీమేఖల, సాధన సమితి యను గ్రంథమాలలు పేర్కొనదగినవి. విజ్ఞాన చంద్రికా గ్రంథమాలకూడా మొట్టమొదట హైదరాబాదునందు స్థాపించబడి, నాలుగు గ్రంథములను ప్రకటించిన పిదప కార్యాలయము మార్చరబడి తరువాత అంతరించినది. కాని పై గ్రంథమాల ఆశయములతోడనే ఇప్పుడు ఇచ్చట ఆంధ్రచంద్రికా గ్రంథమాల స్థాపింపబడి ఉత్తమమైన చారిత్రము, సాహిత్యము, ప్రజావిజ్ఞాన సాహిత్య గ్రంథములను ప్రచురించి ప్రశంసనీయముగా భాషాసేవ గావించుచున్నది. మరియు విజ్ఞానవర్ధినీ పరిషత్తు, లక్ష్మణరాయ ఆంధ్ర పరిశోధక మండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తులవంటి పరిషత్తుల సేవ కడుంగడు ప్రశంసాపాత్రము, పైవానిలో శ్రీ లక్ష్మణరాయ పరిశోధక మండలి అనేక తాళపత్ర గ్రంథములు, అనుశ్రుత సంస్కృత, ఆంధ్ర గ్రంథములు సేకరించి భద్రపరచడమేగాక,

తెలంగాణా శాసనములను పేర ఒక గ్రంథమును ప్రకటించి మందలివారు పునర్ముద్రణ కార్యమును సాగించుచున్నారు. ఈ అమూల్యమైన సేవకై కంకణబద్ధులై మొదటినుండియు పనిచేయుచున్న శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు అత్యంత ప్రశంసనీయులు. గోల్కొండ కవుల సంచిక, శ్రీ కృష్ణదేవరాయల ఆంధ్ర భాషా నిలయ సంచిక, శబ్దానుశాసన ఆంధ్రభాషానిలయ రజితోత్సవ సంచిక, పోతన వర్ధంతి సంచిక, హనుమంతరాయ షష్టిపూర్తి సంచిక మున్నగునవి అమూల్యమగు చారిత్రక సారస్వత వ్యాసాలను ప్రకటించి ప్రజలకు అత్యంత సేవ కావించి ప్రశంసాపాత్రము లైనవి. పైవానిలో గోల్కొండ సంచిక సేవ ప్రత్యేక ప్రశంసనీయార్హము. ఈ సంచికను ప్రకటించి అజ్ఞాతులైన సుమారు 83 మంది తెలంగాణా కవుల యొక్క కావ్యపు మచ్చుతునకలను ఆంధ్రలోకమునకు అందించి ఇచ్చట కవులులేరను అపోహను రూపుమాపి శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు తెలంగాణాకు అత్యంతమైన సేవ గావించిరి. ఈ విధముగా గ్రంథాలయముల మూలంగా తెలంగాణము నందు భాషావ్యాప్తి, విద్యావ్యాప్తి, విజ్ఞాన ప్రచారం జరుగుటచే గ్రామగ్రామములందును కవులు, గ్రంథకర్తలు, వ్యాసకర్తలు, వ్యాసరచయితలు, లేఖకులు, విమర్శకులు, కథకులు, ఏకాంకిక రచయితలు, పరిశోధకులు విరివిగా బయలుదేరి భాషాసారస్వత సేవను విరివిగా నొనరించుచున్నారు.

మొట్టమొదటి గ్రంథాలయము

ఈ భాషా నిలయము హైదరాబాదు రాష్ట్రమునందు మొట్టమొదట సంస్థాపింపబడిన గ్రంథాలయమగుటయేగాక, సక్రమ పద్ధతులపై నడుపబడిన ఆంధ్ర గ్రంథాలయములలో నిది సమస్త ఆంధ్రావని యందును అగ్రగణ్యముగా పరిగణింపబడు చున్నది. తెలంగాణమునందు 1922 నుండి ప్రారంభింపబడిన ఆంధ్రోద్యమము అతిత్వరగా రాష్ట్రమందంతటను వ్యాపించుటకు అనువగు మార్గదర్శకత్వమును కల్పించిన గౌరవము ఈ భాషా నిలయమునకు చెందుతున్నది. ఈ గ్రంథాలయము స్వయముగా మొదటినుండియు సభలు, సమావేశములు, ఉపన్యాసములు, సారస్వత సప్తాహములు, కవి సమ్మేళనములు, హరికథా కాలక్షేపములు, సంగీత సభలు, నాటక ప్రదర్శనములు, జయంతులు, వర్ధంతులు మొదలగు నానావిషయములకు సంబంధించిన కార్యక్రమములను తరచుగా నేర్పాటు గావించి ప్రజలకు విజ్ఞానము, వినోదము కల్గించుచున్నది. అనేక కవి పండిత సన్మానములు జరిగినవి. ఇంతేగాక ఆంధ్రదేశమునందున్న పండితాగ్రేసరు లలో ఈ గ్రంథాలయమును తిలకించి సదభిప్రాయము నొసంగనివారు లేరనియే చెప్పవచ్చును. ఈ నియమునందు ఎనిమిదివేల గ్రంథములు కలవు. వీనియందు సంస్కృత ఆంగ్ల గ్రంథములు కూడా పరిమితముగా గలవు. ప్రాచీన ఆధునాతన శాఖలకు సంబంధించిన గ్రంథములు సప్రయత్నముగా సంగ్రహింపబడి ఉన్నవి.

ఏబయి పత్రికలు పాఠకులకు అందింపబడుచున్నవి. నిలయభవనములను అవసరసమయములందు ఇతర సారస్వత కళా సంస్థలకు ఒసగుతూ వాటిని ప్రతోత్సహించుచున్నది. నిలయ సభ్యుల సంఖ్య 500. వీరిలో నూరు స్త్రీ సభ్యురాండ్రు కలరు. ఈ విధంగా తెలంగాణమునందు నాటినుండీ నేటివరకు జరుగుతున్న వివిధ భాషా సారస్వత ఉద్యమమునందు నాటినుండి నేటివరకు జరుగుతున్న వివిధ భాషా సారస్వత ఉద్యమమునందు ఈ భాషా నిలయము ప్రత్యక్షముగను, పరోక్షముగను భాగస్వామియై ఉండి దోహదము ఒసంగు చున్నదనిన సత్యదూరము కానేరదు. కాని ఈ నిలయము నేటివరకు ఒనరించిన సేవకంటె నేటినుండి ఒనరించవలసిన సేవ పదిరెట్లు కలదు. పారతంత్ర్యమునకు లోబడి పరభాష పర వేషాభివృద్ధికి పాటుబడుతూ జీవించు తెలుగువారియందు మరల మాతృభాషా మమకారమును రేకెత్తించి ఒక నూతన పరమార్థమును గుర్తెరిగింప జేసినది ఈ భాషానిలయము. కాని, నేటి ప్రజాస్వామిక స్వాతంత్ర్య వాతావరణమున ఈ భాషానిలయము యొక్క బాధ్యత పెరిగిపోవుచున్నదనే విషయం గమనార్హము. భాషాసారస్వతములోని సభ్యతా సంస్కృతుల నభివృద్ధి నొందించి తగిన వాతావరణము సృష్టించి తెలుగువారి మేధాసంపత్తికి ప్రతిభా వ్యుత్పత్తులను పదును పెట్టి, ఆంధ్ర జాతియొక్క పూర్వ విశిష్టతను పునఃస్థాపించే బాధ్యత ఈ ప్రముఖ భాషా నిలయపు మూపుపై పడుచున్నది. ఇట్టి గురుతరమైన బాధ్యతను సక్రమంగా నిర్వహించుట సామాన్యమైన పనికాదు. ఈ కార్యమును నిర్వహింపవలెనన్న ఈ భాషా నిలయమునందు అనేక సవరణములు అవసరమగుచున్నవి.

నిలయ భవనము శ్రీ రాజా బహదూరు వెంకట్రామారెడ్డిగారు, కీర్తిశేషులు శ్రీ వేలూరు రంగధామనాయుడుగారు ఒనరించిన అవిస్మరణీయమైన సేవవలన కొంత విస్తరింపబడినది. అయినను సభ్యుల సంఖ్యను, గ్రంథాలయావశ్యకతను బట్టి ఈ గ్రంథాలయ భవనము అత్యంత సంకుచితమై ఉన్నది. స్త్రీల శాఖ, బాల శాఖలను ప్రత్యేకముగా నడిపించవలెనన్నను, మరియు సంచాక గ్రంథాలయ విధానము నవలంబించి సాధ్యమగునేని గ్రంథములను గృహిణులకును, అల్ప వయస్కులగు బాలురకును, మరి ఇతర పాఠకులకును వారి గృహములలో నందించు సదుపాయమును కలిగించవలసినను ఈ భవనము సరిపోదు. ఇంక భాషా నిలయమునందు ప్రస్తుతము ఉన్న గ్రంథములు కూడ సరిపోవు. గ్రంథముల సంఖ్య అధికంగా హెచ్చరింపవలసిన అవసరము కలదు. మరియు ఈ గ్రంథాలయమందు పరిశోధన కవసరములగు గ్రంథములను ప్రత్యేకముగా సేకరించి పండితులను జిజ్ఞాసులగు ఇతర పాఠకులను ప్రోత్సహించవలసి వున్నది. అనేక ఇతర సూచనలను ఈ గ్రంథాలయాభివృద్ధి కొరకై అమలు పెట్టుట అత్యవసరము.

ఈనాడు స్వర్ణోత్సవమును నెరపుకొనుచున్న ఈ భాషా నిలయము,

తెలంగాణా ఆంధ్రుల యొక్క భాషా సంస్కృతుల అభివృద్ధికి యొక ముఖ్యమైన కేంద్రము. మారిన నేటి ప్రజాస్వామ్య వాతావరణమునందు ఇట్టి కేంద్రమువలన ఆంధ్ర ప్రజల ఇతోధిక లాభము బడయగోరినచో ఆశ్చర్యకరము కాదు. సహజమైన ఈ వాంఛలను తీర్చుట ఈ నిలయాభిమానుల కర్తవ్యము. ఈ కర్తవ్యముల నెరవేర్చుటు రాష్ట్ర ఆంధ్రుల ఆదరాభిమానములు లభించినచో అత్యంత సుసాధ్యము. అట్టి స్వర్ణోత్సవం మనయందు కలిగించుటకు ఈ సంవత్సరము తోడ్పడుగాక. ఈ సందర్భమున ఈ ఉత్సవాలు ఆరంభించి ఆశీస్సుల నొసంగిన పూజ్యులగు మహామహోపాధ్యాయ కవిసార్వభౌమ, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు వందనీయులు. మీ అందరి పక్షమునను ఈ రాష్ట్ర ఆంధ్రుల పక్షమునను నేను వారికి సవినయ కృతజ్ఞతాభివందనాలను అర్పించుచున్నాను.

(సెప్టెంబరు 1వ తేదీన హైదరాబాద్ నగరంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం స్వర్ణోత్సవానికి అధ్యక్షత వహించిన హైదరాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారి ప్రసంగం) (కిన్నెర : సంపుటము 4, సంచిక 10, ఫిబ్రవరి 1952 నుండి- శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

"మద్రాసులో తెనుగుమీద ద్వేషం" అనే శీర్షికతో చిత్రాంగి (ఏప్రిల్) పత్రిక సంపాదకీయంలోని భాగాలు

అరవ ఉద్యోగుల దగ్గరనుంచి అరవ డఫేదార్ల వరకూ వుండే ప్రతివ్యక్తీ తెనుగు అనినా, తెనుగువాడనినా పగబూనినట్లుగా వుంది! అది కార్పొరేషనో, ప్రభుత్వ కార్యాలయమో లేదా చివరకు విద్యలు నేర్పే పాఠశాలయో – అన్నీ కూడా తెనుగునకూ తెనుగువారికీ దేనికీ అవకాశం లేకుండా చేయ తలపడ్డట్టు తేలుతూ వున్నది. ఈ విషయమై వొకరు చెప్పడము, మరొకరు చేయడమూ లేదు – ఇది మనం చేయవలసినది అని అన్యాయం చేయడానికి పూనుకొంటున్నారు, చేస్తున్నారు. అందువల్ల ఆంధ్రులకు తీరని అన్యాయం జరుగుతూ వున్నది!

మద్రాసు నగరములో కొన్ని లక్షల సంఖ్యలో వున్న ఆంధ్రులకు యీ అపచారము జరుగుతూ వుంటే మద్రాసు ప్రభుత్వము చూస్తూ వూరుకొంటున్నది.

ప్రభుత్వములో యింత పక్షపాతము వుంటున్నప్పుడు – అందరికీ ప్రభుత్వము సమానావకాశాలు కల్పిస్తుందని పెద్ద పెద్ద కబుర్లు చెప్పడము దేనికి?

(కిన్నెర : సంపుటము 2, సంచిక 5, మే 1950 నుండి- శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

మద్రాసులో ఆంధ్రులు అనుభవించిందే కదా ఇపుడు వారు తెలంగాణా ప్రాంతం వారిపై రుద్దుతున్నారు. ఇక్కడి వారికి హైదరాబాదులో రావలసిన ఉద్యోగాలన్నీ ప్రభుత్వ సహాయసహకారాలతో కాజేస్తున్నారు. ఇదేమి న్యాయం? –తెలంగాణా కల్చరల్ ఫోరమ్

"ఆదిలో తెలంగులం ఆ తరువాత ఆంధ్రులం"

– కోరాడ రామకృష్ణయ్యగారు

ఆంధ్రులు – తెలంగులు అనేవారు వేరు వేరు జాతులవారనీ, ఆంధ్రులుత్తర హిందూస్థానం లోని ఆర్యసంతతి వారైయుండి అనార్య సంపర్కముచేతనో, అభిప్రాయ భేదంచేతనో ఆర్యసంఘం నుండి విడివడి వింధ్య దక్షిణభాగాన నెలకొని, క్రమంగా దక్షిణదేశానికి పాకివచ్చి, కృష్ణా, గోదావరీ మధ్య దేశాన్నాక్రమించి, కృష్ణాతీరాన రాజ్య స్థాపనచేసి, దేశీయులగు తెలంగులతో కలిసిపోయి, వారి సహాయంతో కాలక్రమమున పశ్చిమోత్తర దిక్కులకు రాజ్యమును విస్తరింపజేసి, మగధరాజ్యమును గూడా ఆక్రమించి, ఆంధ్ర సామ్రాజ్య స్థాపకులై ప్రసిద్ధికెక్కినారు.

కృష్ణా, గోదావరీ నదుల మధ్య దేశము ఆంధ్రుల దేశము కాదు. వారుత్తరమునుండి వచ్చి తెలంగుల దేశమున నివాస మేర్పరచుకొనుటచే, తెలుంగు దేశమే ఆంధ్రదేశమను వాడుకను బొందినది. తెలంగు లాంధ్రులతో సమ్మేళనమును బొందుటచే తెలుగు దేశవాసులయినను ఆంధ్రులైనారు గదా. అట్లే ఆంధ్రులభాష తెలుంగు భాషతో సమ్మేళనము పొందుటచేతనే తెలుంగు ఆంధ్రమైనదా?

తెలుగుదేశమందలి తెలుగుభాషే కొందరు లాక్షణికులచేత ఆంధ్రమని పేర్కొన బడినది. క్రీస్తుశకానికి చాలా పూర్వమే తెలుగు, తమిళ, కన్నడములు స్వతంత్ర భాషలుగా విడివడిపోయి ఆయా దేశములలో స్వతంత్ర వ్యవహారాన్ని పొందుతూండినవి. తెలుగే చాలా ప్రాచీన కాలంలో, తక్కినవాటికంటె ముందు విడివడి స్వతంత్రభాష అయివుంటుంది. కాబట్టే తమిళ, కన్నడములకంటె హెచ్చుగా మార్పులకు లోనై వానితో సంబంధంలేని భాషగా పైకి కనబడుతుంది. ఆపైని సంస్కృత ప్రాకృతముల ప్రభావము తెలుగు, కన్నడములపై సమానముగానే విజృంభించి వాని నింకా మార్చివేసినది.

తెలుగు, కన్నడములు కొంతకాలం ఏకభాషగా ఉండేవనడం కూడా సంభావ్యంకాదు. లిపి మాత్రమే కొంతకాలం సమానంగా ఉండేది. వ్యాకరణపరంగా కన్నడం తెలుగుకంటె తమిళానికే దగ్గిరగా కనబడుతుంది. మొత్తముమీద తెలుగు ఆంధ్రమైనది గాని ఆంధ్రము తెలుగు కాలేదు. ప్రాకృతమూ తెలుగు కాలేదు. తెలుగే – ప్రాకృతముకంటె ప్రాచీనభాష. తొలుత నన్నయభట్టు కూడా "తెనుగునన్ మహా భారత సంహితారచన బంధురు" డయినాడు. కాబట్టి ఆతడాంధ్రమును పేర్కొనలేదు.

మన మాంధ్రుల మగుటకు చిరపూర్వమే, తెలంగులము. మన దేశము – తెలుగు దేశము, మన భాష – తెలుగు భాష. – విజయప్రభ (23-4-1950)

(కిన్నెర: సంపుటము 2, సంచిక 5, మే 1950 నుండి– శ్రీ పండిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

ఆంధ్రాభ్యుదయోత్సవములు

ప్రతి సంవత్సరము హైదరాబాదు అఖిల కళాశాలల విద్యార్థి బృందముచే జరుపబడు ఆంధ్రాభ్యుదయోత్సవములు హైద్రాబాదు నగరము లో తెలుగుదనమును ప్రకాశింప జేస్తున్నవి.

మూల పురుషులు : ఒకప్పుడు ఆంధ్ర సాహితీలోకానికి మహాకవులను సమర్పించిన తెలంగాణము మరొకమారు చైతన్యవిలసితమై శేముషీ ప్రాభవముగల రచయితలను అఖిలాంధ్రమునకు అందజేసినది. అట్టి రచయితలలో ఈ శతాబ్దము లో ముఖ్యముగా పేర్కొనదగినవారు కీ.శే. శ్రీ సురవం ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రికా సంపాదకులుగా ఉండి తెలంగాణా ప్రజలలో మాతృభాషాభిమానమును కలిగించినారు. శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు గారు ఒక్క తెలంగాణములోనే గాక, యావత్తు రాష్ట్రంలోను పేరు, పలుకుబడి గలవారు. తెలంగాణాలో విరిసిన అనేక సాంఘిక, సాంస్కృతిక, సారస్వతోద్యమ ములకు వీరే మూల పురుషులు.

కవితా రచన : కవితా రచనయందు తెలంగాణము పూర్వమునుంచీ గొప్ప సంప్రదాయములకు ఆలవాలమై ఉంటూవచ్చినది. హైద్రాబాదు రాష్ట్రంలో నున్న వనపర్తి, గద్వాలవంటి సంస్థానములు అనేక కవి పండితులను ఆదరిస్తూ భాషాభివృద్ధికి దోహదం చేస్తూ వచ్చినవి.

తెలుగు కాల్పనికోద్యమ నిర్మాతలలో ఒకరై, అభినవాంధ్ర కవితా మండలి ప్రముఖులై, యావదాంధ్రములో అనేకమంది చదువరుల నాకర్షించిన ఖండకావ్యములను రచించినట్టి శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు బహుకాలము హైద్రాబాదులోనే నివసించి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్రాచార్య పదవిలో ఉండి తమ రచనలను ప్రచురించారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నున్నట్టి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు విరామమెరుగని న్యాయ, రాజకీయ కార్యకలాపాలలో నిమగ్నులై ఉండికూడా తెలుగు వాఙ్మయమునకు ప్రశంసనీయమైన సేవచేసి ఉన్నారు. వీరు ఓమరు ఖయ్యాం రుబాయీలను పారసీక భాషలోనుండి తెలుగు పద్య కావ్యంగా అనువదించినారు. థామస్ గ్రే విరచితమైన ఎలిజీని తెలుగు పద్యములో వ్రాసినారు. పారసీక వాఙ్మయ చరిత్రనుకూడా వీరు రచించి ఉన్నారు.

ఆ తరువాత సలక్షణ కవిత్వము వ్రాయు కవులున్నారు. కీ.శే. శ్రీ మాదిరాజు విశ్వనాథరావుగారు, నేనూ కలిసి విక్రమాంకదేవ చరిత్రను, కర్ణసుందరి నాటికను తెలుగులోకి అనువదించాము. సలక్షణమైన కవిత్వము వ్రాయువారిలో ఇంకను కేశవపంతుల నరసింహశాస్త్రి, దూపాటి వెంకటరమణాచారి, చివుకుల అప్పయ్యశాస్త్రి, సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, శతావధాని నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస వెంకటాచారి, వానమామలై వరదాచారిగారలు ప్రముఖులు.

తెలంగాణా యువకవులలో కాళోజీ నారాయణ రావుగారు చిత్రమైన కవి. ఱయనను లాక్షణీకులలోగాని లేదా అభ్యుదయ కవులలోగాని చేర్చుటకు వలనుగాదు. చాటు గేయములను రచించుటలో అసామాన్యమైన ప్రతిభ గలవాడు. తెలంగాణా పల్లెలలో వాడుకలోనున్న భాషను, సామెతలను, నుడికారములనే ఱయన తన గేయాలలో ఉపయోగించుతాడు.

సలక్షణమైన కవిత్వమునకును, కావ్యములకు పుట్టినిల్లు అయిన తెలంగాణా, ఆధునిక కవిత్వమునకు కూడా ప్రధాన కేంద్రమై వర్ధిల్లుతూ ఉన్నది. ఇక్కడి యువకులలో అభ్యుదయ కవులు చాలామంది ఉన్నారు. వీరిలో దాశరథి అగ్రగణ్యుడు. ఱయన తెలంగాణములోనే కాక యావదాంధ్రములో కూడా ప్రతిభాశాలిని మెప్పొందిన యువకవి. కడు పిన్నవయస్సుననే ఱయన కవిగా గొప్ప పేరు సంపాదించుకున్నాడు. దాశరథి అభ్యుదయ కవిత్వమునేగాక లక్షణమైన కవిత్వముకూడా వ్రాస్తాడు. ఱయన తరువాత ఎన్నదగిన యువకుడు సి. నారాయణరెడ్డి. వయస్సు ఱయన ఇంకను పిన్నవాడు. కాని పెద్ద ప్రఖ్యాతి నార్జించుకున్నాడు. విశ్వవిద్యాలయ విద్యార్థి బృందంలోను, యువజనులలోను పలుకుబడి గలవాడు. శిల్పము, భావమును సరిపోషించుకుంటూ, చక్కని అభ్యుదయ గేయాలా వ్రాసి చదివి వినిపించి పండిత పామరుల ప్రశంసలందుకుంటున్నాడు. కొన్ని ప్రశస్తమైన గేయ రూపకములను రచించి ప్రదర్శింపజేసినాడు. ఱయన చక్కని సలక్షణ కవితను గూడా వ్రాస్తాడు. ఇంకను పల్లా దుర్గయ్య, ధవళా శ్రీనివాసరావు, చౌల్లేటి నృసింహశర్మ, అడ్లూరి అయోధ్య రామయ్య, భాగి నారాయణమూర్తి, పివి. నరసింహారావు, బి.రామరాజు, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి, వెల్దండ ప్రభాకరరావు, పులిజాల హనుమంతరావు, గిడుతూరి సూర్యం, ఎస్.ఎన్.మూర్తి, వెల్దుర్తి మాణిక్యరావు, వేముగంటి నరసింహాచార్యులు, ఊటుకూరు రంగారావు మొదలగు యువకవులు సాహితీ క్షేత్రంలో కృషిచేస్తూ తమ రచనలద్వారా తెలంగాణా ప్రజలకు సుపరిచితులైనారు.

చారిత్రక పరిశోధన : చరిత్ర పరిశోధనకు తెలంగాణములో అమూల్యావకాశములున్నవి. ఇచట ప్రతి జిల్లాలోను ప్రాచీన శాసనములెన్నో లభించుచుండుటవలన కవి పండితులు కొందరు చరిత్ర పరిశోధనకు గడంగినారు. వీరిలో శ్రీ ఆదిరాజు వీరభద్రరావు, శ్రీ దూపాటి వెంకటరమణా చార్యులు, గడియారం రామకృష్ణ శర్మగారలు పేర్కొన దగినవారు. శ్రీ వెంకట రమణాచార్యులుగారు అనేక ప్రాత శాసనములను వెలికిదీసి పరిష్కరించినారు. శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు ఆలంపూరు శిలాలేఖనములు అను గ్రంథమును వ్రాసి ప్రకటించినారు.

విమర్శ : తెలంగాణములో సాహితీ విమర్శ, రాశియందు ప్రధానము గాకపోయినప్పటికి, గుణమునందు మాత్రము గణనీయమైనది. కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు పేరొందిన విమర్శకులు. తెలుగు లిపి సంస్కరణ, గుఱ్ఱము,

గాథాసప్తశతి మున్నగు విషయములను గూర్చి ఉత్తమమైన పరిశోధనా వ్యాసములను వారు వ్రాసినారు. అంతేగాక, తెలుగు భాషలో వాడుకలో నున్న కొన్ని పదముల వ్యుత్పత్తిని గూర్చి కూడా వివేచన చేసి ముఖ్యమైన నిర్ధారణలు చేసినారు. కురుగంటి సీతారామయ్యగారు విమర్శకాగ్రేసరులు, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఉత్తమ విమర్శకులు. దేవులపల్లి రామానుజరావుగారు పేర్కొనదగిన విమర్శకులు. వీరి వ్యాసములు "నవ్య కవితా నీరాజనము", "నవనీతము" అను పుస్తకములుగా వెలువడినవి. వీరుకూడా సారస్వత పత్రికలలో తరచు వ్యాసాలు వ్రాస్తూ ఉంటారు. మహమ్మద్ ఖాసింఖాన్ పేరొందిన రచయిత.

నవలలు, కథానికలు

సలక్షణము, అభ్యుదయరీతి కవిత్వము లకు నిలయముగా వర్ధిల్లుతున్న తెలంగాణము నవలా సాహిత్యములోను, నాటికలలోను వెనుకబడినదని చెప్పవలెను. చెప్పుకోదగిన ఉత్తమ ఆధునిక నవల ఈ ప్రాంతమునుంచి ఇంతవరకు వెలువడలేదు. అయితే కథానికలరీత్యా ఈ లోపము పూరించబడింది. ఈ దశాబ్ద కాలములో తెలంగాణమునుంచి ఉత్తమమైన కథకులు కొందరు అఖిలాంధ్రమునకు పరిచయమైనారు. శ్రీ బూర్గుల రంగనాథరావుగారి కథలు "వాహ్యాళి" అను పుస్తకముగా వెలువడినవి. శ్రీ నెల్లూరి కేశవస్వామిగారు స్వయముగా కొన్ని ఉత్తమ కథలను వ్రాయుటేగాక, ప్రేంచందు కథలను అనువదించి ప్రచురించినారు. ఇంకను ప్రముఖ కథకులలో నందగిరి వెంకటరావు, భాస్కరభట్ల కృష్ణారావు, ఇటికాల నీలకంఠరావు, పొట్లపల్లి రామారావు, ధరణికోట శ్రీనివాసులు, ఆళ్వారుస్వామి, సింగరాజు లింగమూర్తి, పి. సాంబశివరావు, డి. రామలింగం, కొంటి కృష్ణమూర్తి మొదలగువారు చెప్పుకొనదగి ఉన్నారు. హైద్రాబాదు ప్రభుత్వం జరిపిన కథానికల పోటీలో రచయిత, కళాకారుడు అయిన శ్రీ ఎ.ఆర్.కృష్ణ ప్రథమ బహుమతి పొందినారు. స్త్రీలలో శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, నందగిరి ఇందిరాదేవి, యల్లాప్రగడ సీతాకుమారి పేరొందిన కథకురాండ్రు. శ్రీమతి సంగంలక్ష్మీబాయిగారు మంచి తెలుగు రచయిత్రిగా పేరుగన్నారు. ఆళ్వారుస్వామిగారు ఒకప్పుడు రాజకీయాలలో ఉన్నవారు కాబట్టి వారి కథలలో రాజకీయం కన్పిస్తున్నది. శ్రీ కె.ఎల్. నరసింగారావుగారు స్కెచ్‌లు, గ్రామీణ జీవితాన్ని చిత్రించే నాటికలు వ్రాయుటలో అందెవేసిన చేయి. వీరేగాక కొంత పేరు ప్రఖ్యాతు లార్జించుకొన్న రచయితలు ఇంకా చాలామంది ఉన్నారు.

ఆంధ్ర సారస్వత రంగమున ప్రముఖ పాత్ర వహించిన తెలంగాణా చారిత్రక భూమిలో ప్రతిభగల రచయిత లెందరో ఇంకా ఉన్నారు. ఇట్టి రచయితలందరి రచనా వ్యాసంగమువలనను, నిర్విరామంగా పనిచేయు సారస్వత సంస్థల కృషి వలనను తెలంగాణాకు ఉజ్జ్వలమైన భవిష్యత్తు కలదు.

– నేటి హైద్రాబాదు (ఫిబ్రవరి 54) నుండి

అజంతా

– అడవి బాపిరాజు

వేదకాలం నుంచీ భారతీయులు ఆనందోపా సకులు. ఆ ఆనందానుభవం సౌందర్యార్చన ద్వారా పుడిపిళ్ల అనుభవించారు. సాంఘిక జీవనం, రాజకీయ తంత్రము, ఆర్థిక సంవిధానము ఆనందానుభవం కోసము అనే ఏకైక లక్ష్యం కలిగి ఉండటం చేత వారి జీవితం అంతా సౌందర్యపూర్ణమై విలసిల్లిపోయినది. బ్రహ్మ పదార్థము సౌందర్యమనీ, "ఆనందో వై బ్రహ్మ:" అని వారి పునశ్చరణ.

"బ్రహ్మానంద సహోదరము రసానందమని" ప్రాచీన భారతీయులు సర్వకళలూ ఉద్భవింప చేసుకొన్నారు. ఆనాటినుంచీ చిత్రకళ సర్వతోముఖంగా విజృంభించి వచ్చింది. కాని, ఆనాటి కుడ్యచిత్రాలూ, ఫలకచిత్రాలూ కాలంలో లీనమై పోయినాయి. ఇంక మనకు మిగిలింది – రెండువేల రెండు మూడు వందల సంవత్సరాల క్రితం ఉద్భవించిన అజంతా దివ్య చిత్ర ప్రపంచం మనకు మిగిలింది.

అజంతా యాత్ర పన్నెండుసార్లు నెరవేర్చి తృప్తిలేక ఇంకా వెళ్ళడానికి సిద్ధపడుతూనే ఉన్నాను.

ఎప్పుడు అజంతాకు యాత్రసల్పినా ప్రాచీన మహర్షుల మహోత్కృష్ట సౌందర్యానుభూతి ఎదుట ప్రత్యక్షమై పులకరాలు ఉద్భవిస్తాయి. జగత్తంతా ప్రతి అణువునందూ పరమాత్మ సౌందర్యాన్ని ప్రతిక్షణమూ అనుభవించిన ఆ తపస్వులు తమ దివ్యానుభూతిని తపోవనాలుగా, సంఘారామాలుగా, దేవాలయాలుగా రూపెత్తించారు. తమ రసభోగాన్ని శిలాక్షరం చేశారు; వర్ణ రూపాలుగా మలచినారు. భారతభూమి అంతా ఆ సౌందర్యారాధకుల చేతిలో దివ్యక్షేత్రం అయిపోయింది. ఉద్యోగాలను, భూములను, పట్టణాలనూ పంచుకోవడానికి నేడు వీరావేశం చెందుతున్న ఆంధ్ర సోదరులు ఒక్కమారు ఏ సెలవులలోనైనా కాస్త తీరికచేసికొని, బయలుదేరివస్తే, ఆంధ్రుల మహావైభవం ఏమిటో, మూడు కాలాలకు చెడని వారి కళానిక్షేపాలు ఎలాంటివో, దర్శించి చరితార్థులు కావచ్చును.

నాగార్జునాచార్యులూ, విద్యారణ్య మహామునీ నిర్మించుకొన్ని పావన తపోవనాల మాట అలావుంచి, ఇంకా పురాతనకాలంలో శాతవాహనుల నాటి, ఆంధ్ర తపస్వులు తెలంగాణపు ఉత్తర సరిహద్దులలో నిర్మించుకొన్ని పావన సంఘారామాన్ని దర్శించి తీరాలి. కళాకారులకే కాక ప్రతి మానవుడూ ఈ యాత్ర జన్మలో ఒకసారైనా నెరవేర్చి తీరాలి.

నైజాము రాష్ట్రానికి ఉత్తర సరిహద్దులలో అజంతా కొండల్లో ఆ సంఘారామం ఉన్నది. అజంతా కొండలు సాత్పూరా పర్వతశ్రేణిలో ఒక భాగం. ఆ శ్రేణి ఉపరితలం నూరుమైళ్ళు పొడుగూ, ముప్పై మైళ్లూ వెడల్పూగల సమ ప్రదేశం. అక్కడా నగరాలు, పొలాలు, తోటలు విరివిగా ఉన్నాయి. అజంతా కొండల్లో ఎచట పుట్టిందో వ్యాఘ్రనది.

పసిపాపలా తప్పటడుగులు పెట్టుతూ, చిందులు తొక్కుతూ, ఆ కొండలమధ్య ఒక సన్నని లోయలో పారాడి, పతనంగా పడి, రెండువందల అడుగుల లోతువరకూ తొలుచుకొని అతి నిమ్నమైన నదీకంఠం నిర్మించుకున్నది. ఆ పర్వతశ్రేణిలో ఉత్తరభాగంలో జన్మించిన నదులు తపతిలో సంగమిస్తవి. దక్షిణ భాగంలో పుట్టిన నదులు గోదావరిలో కలిసిపోతవి. వ్యాఘ్రనదిని ఇప్పుడు వోఘీరా నది అని పిలుస్తారు. ఆ కొండలోయల్లో పెద్దపులులు చాలా ఉండడం చేత కాబోలు ఆ పేరు వచ్చింది ఆ నదికి. ఈ నది నిర్మించుకొన్ని నిమ్నమైన ఆ లోయ నాలుగుమైళ్ళ పొడవు వుంటుంది. నదీకంఠము మొదటనే వోఘీరా నదియొక్క జలపాతముంది. అక్కడ సన్నని ఆ లోయ 50 గజముల వెడల్పు వుంటుంది. ఆ లోయ అంతా అతి వంకరటింకరలుగా ఉన్నది. అన్ని వంకరలూ శుక్ల తదియ నాటి చంద్రవంకాకారాలు, లోయకు రెవలావల నూరడుగుల ఎత్తున కోతకోసిన కొండరాతి గోడలు. ఆ పైన కొండ చరియలు, శిఖరాలూ, ఆ లోయ అంతా అనేక వృక్షజాతులతో నిండి ఉంటుంది.

ముప్పై అయిదేండ్ల క్రితం (1917) పూజ్యపాదులు మా గురువుగారు ఓ.సి.కూల్రే గారితోనూ, మహోత్తమ చిత్రకారుడు, చిరస్మరణీయుడు దామెర్ల రామారావుతోనూ కలిసి తొలిసారి నేనీ తీర్థాన్ని సందర్శించినప్పుడు మనమాడ్ మీదుగా జల్‌గాం నగరము వెళ్లి అక్కడనుంచి ఆ పర్వత ప్రదేశాలలో ఒళ్లు కదిలిపోయేటట్లు నలభై ఎనిమిది మైళ్ళు టోంగాలలో ప్రయాణము చేసి, పరీన్‌పూర్ బంగాళాకు చేరుకున్నాము. అక్కడ డాక్ బంగాళాలో మకాంపెట్టి పదిరోజులున్నాము. ప్రతిదినమూ ఉదయం వంటలు చేసుకొని భోజనాలు టిఫిన్ కారియర్లలో పెట్టుకొని గుహలకు నాల్గుమైళ్ళు ప్రయాణమై వెళ్ళేవారము.

ఆ కొండలోయల్లో వంకరటింకరులుగా ఎక్కుతూ దిగుతూ మలుపుమలుపునా అడ్డమువచ్చే వ్యాఘ్రనదిని దాటుతూ తీర్థ దర్శనము చేసుకున్నాము. ఆ ప్రథమ దర్శనము ఏనాటికీ మరుపురాని దివ్యముహూర్తము.

దేశదేశాలనుంచి ఏటేటా యాత్రికుల తండాలు ఆ గుహలను చూడటానికి వస్తూ ఉండడంచేత నిజాం ప్రభుత్వం వారు రోడ్లూ, వంతెనలూ, బస్సులూ, విడుదులూ మొదలైన సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఔరంగాబాదు స్టేషనులో దిగి బస్సు ఎక్కామూ అంటే, సుఖంగా అజంతాకు చేరుకుంటాము. లేదా టాక్సీలు కావలసినవన్ని ఉన్నాయి. ఔరంగాబాదు దాటిన పదిమైళ్లకు పర్వతశ్రేణి ఆరువందల అడుగులు ఎక్కి ఆపై ఏభై మైళ్ళు ఆ పర్వత రాజపథంపై ప్రయాణం ఆనందపూర్ణమై ఉంటుంది. నేను ఇటీవల ఈ దారినికూడా కుటుంబంతో ప్రయాణమైతే చేశానుకాని, మొదటిసారి అష్టకష్టాలు పడి చేసిన తీర్థయాత్రాఫలం నాకు తర్వాత దక్కలేదేమో అనుకుంటున్నాను. ఎందువల్ల నంటారేమో నిదానంగా బండిమీద పోతూ ఆ త్రోవలో అడుగడుగునా శ్యామలారణ్యాలు, సస్యభరితాలైన క్షేత్రాలు, త్రోవకు అడ్డమువచ్చి నిలిచే లేళ్లు జింకలూ,

కొండవాగులూ వీటి రామణీయకతా తిలకిస్తూ పోయే రసికహృదయానికి ప్రయాణ భేదమే కనుపించదు. ఆ ఆనందమే - కారులో బెరంగాబాదు నుడి ఆ ఘాట్‌రోడ్డున ప్రయాణం చేయడం వల్ల కలిగే ఆనందం - వేరు. కాని, మా బాలికలిద్దరూ పొందిన ఆనందం నా ప్రథమ ప్రయాణం నాటి ఆనందానికి ఏమీ తగ్గిపోలేదు.

ఇప్పటి 2100 సంవత్సరాలనాడు అర్హతాచార్యుడు ఆ నగ పర్వతారణ్య భూమిలో ఒక గుహను నిర్మింపించుకొని సంఘారామ మేర్పరచుకొన్నాడు. ఆ మీదట తొమ్మిది వందల సంవత్సరాల వరకూ ఆ సంఘారామము క్రమక్రమంగా వృద్ధియై అనేక విహారాలూ, చైత్యాలు ఏర్పడినవి. అవి బౌద్ధ శిల్పుల కళా లక్ష్మికి కొలువుకూటాలైనవి.

కాలవశంచేత ఆ సంఘారామం పాడుపడి, నామరూపాలు నశించినవి. ఆ గుహాముఖాలన్నీ దట్టమైన చెట్లతో నిండిపోయినవి. అదే మంచిదయిందేమో.

పందొమ్మిదవ శతాబ్ద ప్రారంభంలో భాండేశ కమిషనరొకడు వేటకు వచ్చినప్పుడు ఓ పెద్దపులివి వేటాడుతూ ఆ గుహలను దర్శించాడు. అతడు కాగడాల వెలుతురున ఆ గుహలూ ఆ గుహలలోని పరమాద్భుతమైన చిత్రప్రపంచమూ దర్శించి ముగ్ధుడైపోయి వెంటనే ఫోర్టు విలియం గవర్నరుగారికి వానిని గూర్చి నివేదించుకొన్నాడు.

ఆ విషయం రూస్టు ఇండియా కంపెనీవారికి తెలిసి వారు ఆ బొమ్మల ప్రతిరూపాలు తీసి లండనులో ప్రదర్శించాలని సంకల్పించారు. వారు ప్రసిద్ధ చిత్రకారుడైన గ్రిఫిత్సుగారిని ఈ పనికి నియోగిస్తే ఆయన బొంబాయిలో కొందరు చిత్రకారుల సహాయం తీసుకొని అజంతా దగ్గిర కొన్ని నెలలు మకాం పెట్టి చిత్రాలెన్నో ప్రతిరూపాలు తీసి లండను పంపించారు. కాని, అవన్నీ ఇండియా హౌస్ దగ్ధమైపోయినప్పుడు దగ్ధమైపోయాయి.

మళ్లీ గ్రిఫిత్సుగారు ఆ చిత్రకారుల సహాయంతో చాలా బొమ్మలను ప్రతిరూపం తీసికొన్నారు. ఇందులో 125 కాపీలు మరల తగులబడిపోయినవి. ఆ తగలబడిపోని పూర్వం వారు అజంతాను గూర్చి ఓ మహాగ్రంథం రచించి చాలా బొమ్మలను గ్రంథంలో ప్రచురించారు.

ఇటీవల 1906 నుంచీ 1911 వరకూ ఐదు సంవత్సరాలు ఎడ్జింగ్‌హామ్ ప్రభ్వి ఆనాటి కలకత్తా చిత్ర కళాశాల విద్యార్థులు నందలాల బోసు వగైరాలతో అజంతాకు యాత్ర సల్పి ఆ చిత్రాల ప్రతిరూపం తీసుకొని గ్రంథం ప్రచురించారు. జపాను ప్రభుత్వం వారు 1917లో చిత్రకారుల జట్టు నొకదానిని పంపించి చిత్రాల ప్రతిరూపము వ్రాయించుకొని తీసుకువెళ్లినారు. నైజాము ప్రభుత్వంవారును శ్రీ యజదానీగారి పర్యవేక్షణక్రింద ఒక గొప్ప గ్రంథాన్ని అజంతా చిత్రములతో ప్రచురించియున్నారు.

యాత్రికుల చూపులకు అజంతా గుహలు ఒక మహారాగమై, ప్రత్యక్షమౌతవి. చైత్యములు దేవాలయాలవంటివి. విచాహారములు బౌద్ధ భిక్షులు, యాత్రికులూ నివసించే మందిరాలు, కొన్ని విహారాలలో వేయిమంది జనులు సునాయాసంగా సభ చేసికోవచ్చును. అజంతా గుహలలో శిల్పము తక్కువ చిత్రలేఖనము యెక్కువ. స్తంభాలపైన, గోడలపైన, గుహల అంతరాళంపైన చిత్రలేఖనము ఆ ప్రాచీన చిత్రకారులు స్వర్గధామంలా విరచించి వేశారు.

ఇప్పుడు చిత్రలేఖనము ఒకటి, రెండు, పదహారు, పదిహేడు విహారాలల్లోను 9,10 చైత్యాలల్లోనూ వున్నది. ఈ సంఖ్యలు ఈనాడు వేసికొన్నవే సుమండీ.

ప్రథమంల్లో 1819లో గ్రిఫిత్సు గారీ గుహలను దర్శించినప్పుడు పదహారు గుహల్లో చిత్రలేఖనముండేదట. ఇప్పుడు ఆరు గుహల్లో మాత్రమే చిత్రలేఖనమున్నది. ఈ గుహలలోని చిత్రాలను చూచిన ప్రతి చిత్రకారుడూ ముగ్ధుడై పోతాడు. చిత్రకారుల అజంతా క్షేత్రం కాశీవంటిది. బ్రిటీష్ మ్యూజియానికి ముఖ్యాధికారిగ వున్న 'బినియన్' గారు ఈ చిత్రలేఖనములయొక్క ప్రతిరూపములను చూచే పాశ్చాత్యదేశాల ఉత్తమ చిత్రములతో తుల్యమైనవని పొగడినారు. రాయల్ ఎకాడమీకి అధ్యక్షులైన రొథైన్‌స్టైన్ గారు ప్రాపంచిక సౌందర్యంలో నుంచి ప్రాపంచికాతీతమైన ఆధ్యాత్మిక సత్య సౌందర్యమును చూపించగలిగే భారతీయ చిత్రకారులశక్తి అజంతా గుహలలో సందర్శించినాను అని అన్నారు.

భారతీయ చిత్రకారుల సౌందర్యోపాసనంలో బాహ్య ప్రకృతి వెనుక తాండవించే మహత్తత్వసౌందర్యానికి శ్రుతిగా బాహ్య ప్రకృతి సౌందర్యాన్ని లిఖించారు. చెట్లు, లతలు, ఆకులు, పువ్వులు, పండ్లు, పక్షులు, మృగములు, ఈ చిత్రకారుల కుంచెల నుండి ముద్దులొలికే రేఖా భంగిమములు సంపాదించుకొన్నవి. వారి సిద్ధ హస్తత్వము ఈ చిత్రాల రేఖాభంగింమంలోనే కన్పడుచున్నది. గ్రిఫిత్సుగారు చెప్పినట్లు అజంతాశిల్పుల రేఖాభంగిమ ఒక దివ్య శక్తి సంజనితముగాని మానవశక్తి మాత్రము కాదు. రాతితో, మట్టితో చేసిన రంగులు, ఓషధుల నుండి తీసిన రంగులు కొలదియైనా వాని నుపయోగించటంలో అజంతా చిత్రకారులు ఈనాటి పాశ్చాత్య వర్ణతత్త్వకారులకు కూడా ఆశ్చర్యం కొలిపారు.

ఈ గుహలలో రెండు మూడు సాంప్రదాయములు ఒకదాని వెనక ఒకటి వచ్చినట్లు కన్పడుచున్నది. ప్రతి సాంప్రదాయానికి ఆఖరిదశలో చిత్రలేఖన సంవిధానం నీరసిస్తూ వుండడం అప్పుడు పాత సాంప్రదాయం యొక్క బలహీనతలోనుంచి ప్రతిభావంతమైన క్రొత్త సంప్రదాయం ఒకటి పుట్టినది.

అజంతా చిత్రకారులు బుద్ధుని జాతకగాధలు, జీవితము ముఖ్య విషయంగా పెట్టుకున్నారు. వానిలో బింబసార చరిత్ర, శిబిజాతకము, విశ్వతంత్ర జాతకము, రురు జాతకము, హంసజాతకము, మాతృపోషక జాతకము, శ్వేతగజ జాతకము ముఖ్యమైనవి. బింబసార చరిత్రము, సరిపుత్ర ప్రశ్న చరిత్ర, పులకేశ చరిత్ర మొదలైనవి

చరిత్ర చిత్రలేఖనాలలో ముఖ్యములైనవి. ఒకటవ నంబరు గుహలోని, అవలోకితేశ్వరుడు, మైత్రేయి, బోధిసత్త్వుడు గర్భగుడికి కుడియెడలమల దివ్య స్వరూపములతో తేజరిల్లుతున్నారు. అవలోకితేశ్వరుని ప్రక్క శ్యామతారాదేవి ఒయ్యారాన నిలబడి ఉన్నది. ఆకాశాన గంధర్వులు, కిన్నెరులు, యక్షులు విలాసవంతులై భగవంతుని అర్చిస్తూ ప్రత్యక్షమై వున్నారు. బుద్ధ జీవితము ప్రాపంచికమైన జీవితము మధ్యనే దివ్య కాంతుల్ని ప్రసరించుకొంటూ, వెలుగుతూ ఈ ప్రాపంచిక జీవితాన్ని పవిత్రవంతం చేసింది. అజంతా చిత్రకారులు మానవ జీవితము యొక్క సర్వ ఛాయలనూ అజంతా గుహాకుడ్యాలపై ఫొగడలేని శక్తితో తన స్వరూపంతో చిత్రించివేసినారు. వ్యవసాయ దృశ్యములు, మహానగరములు, పల్లెటూళ్లు, వనవిహారములు, వీధులు, బజారులు, తోటలు, మేడలు, కమలాకరాలు మహాకావ్యంలోని సర్గలై దృశ్యమానము లౌతూన్నవి. ఏనుగులు, హంసలు, కోతులు, పక్షులు, లేళ్లు, గుఱ్ఱాలు, ఆవులు, వన్యమృగాలు - అన్నీ ఈ ప్రపంచంలో వాని వాని అందమైన స్థానాలు చేరుకొనే వున్నవి.

అలంకార శిల్పంలో భారతీయులతో ఏ దేశపు శిల్పులూ, చిత్రకారులూ కొలదిమాత్రమైనా చేరలేదు. ప్రపంచంలోని సమస్తమైన వస్తువులలో నున్న రేఖలూ అలంకార రేఖలలో లయం చేసేరు. తామరపూవులు తీగెలలో ఏనుగులు మెరిసిపోతూన్నవి. మరుగుజ్జువారు తాండవించిపోతున్నారు. మామిడిపండ్లు, ఆకులలో చిలుకలు మొదలైన పక్షులు సప్త తాళాలు కాగా, లేళ్ళూ, మకరాలూ, హంసలూ, సర్వవిధాలైన పూవులూ కలిసిమెలిసిపోయి స్వరకల్పనకాగా, బోధిసత్వ చరిత్రాది విషయాలూ భావంగా, చిత్రలేఖనము దివ్యగాంధర్వమై ప్రత్యక్షమవుతుంది.

అజంతా చిత్రలేఖనాలను గూర్చి స్మిత్‌గారు, రాప్సను గారు, మొదలైన చరిత్రవేత్తలు బ్రౌనుగారు, కూల్రేగారు, సోలోమన్‌గారు మొదలైన చిత్రకారులు - ఉత్తమమైన వ్యాసాలు వ్రాసి ఈ చిత్రలేఖన సంప్రదాయం సకలాసియా చిత్రలేఖన సంప్రదాయాలకు తల్లివంటిదన్నారు.

చిత్రలేఖన షడంగాలైన రూపభేదము, వర్ణికాభంగము, లావణ్యయోజనము, సాదృశ్యము, ప్రమాణము, భావము అజంతా చిత్రాలలో అతీతప్రతిభతో ప్రత్యక్షం చేసినారు ఆ అజ్ఞాత చిత్రకారులు. రూపరేఖ విలాసమూ ఆ చిత్రాల సొమ్ము. కుడ్యచిత్ర లేఖనవిధానం అంతా సమరాంగణ సూత్రంలో చాళుక్య సోమేశ్వరుడు నిర్వచించినాడు.

గొగ్గులుగా కొట్టిన రాతిగోడపై, మెత్తని పుట్టమన్ను, సుద్ద, తెలుపు చేసిన తుమ్మబంక, తెల్లఆవాలు, చింతగింజలవంటి జావ మొదలైనవి అన్నీ కలిపి కుడ్యలేపం తయారుచేసి ఆ శిలా కుడ్యతలంపై పూసేవారు. అది ఆరీఆరని స్థితిలో బొగ్గుతోనో కుంచెతోనో పింగళాది వర్ణాలతోనో రేఖలుగా చిత్రరూపం విన్యసించేవారు. ఆ

రూపాలకు తగిన రంగులు పూసేవారు. మధ్య మధ్య చిత్రలేఖనతలం తడుపుతూ, ఆ తడిమీదే రంగులు పూసేవారు.

పెద్ద కుంచెలు కొబ్బరి ఏశెలతోనూ, తాటి ఏశెలతోనూ చేసేవారు. ఆవుతోకలోని వెంట్రుకలతో రేఖలకై కుంచెలు తయారుచేసేవారు. ఆవుదూడ చెవిలోని వెంట్రుకలతో, ముంగిస వెంట్రుకలతో, ఉడుత తోకతో అతి సూక్ష్మ రేఖా విన్యాసానికై తూలికలు నిర్మించుకొనేవారు. జేగురు, గోపిచందనం, సుద్ద మొదలైన మృత్తికలు శుద్ధిచేసి వర్ణాలు సిద్ధం చేసేవారు. మంజిష్ఠ, తుంగ, సింధూరం, తెల్లసత్తు, నీలిమందు, పసుపు, తంగేడుపూవు, మణిశిల మొదలైన వానిలోనుంచి వివిధమైన రంగులు తయారు చేసుకొనేవారు.

విష్ణుధర్మోత్తరకారుడు శిల్పులూ, చిత్రకారులూ, నాట్యం నేర్చుకు తీరాలన్నాడు. నాట్యంలో హస్తముద్రలు, దేహభంగిమలు సర్వాంగాభినయ విధానాలు శిల్పికి, చిత్రకారునికీ రూపవిన్యాసానికి ముఖ్యమన్నాడు. నాట్యకారుడు సంగీతం నేర్చుకోవాలన్నాడు. సంగీతవేత్త కావ్యాలంకారవేత్త అయితీరాలన్నాడు.

ఆసనాధివసితులైనవారు, నిలుచున్న వారు, క్రింద కూర్చున్నవారు, నడిచేవారు, వాహనాలంకృతులు అయిన స్త్రీ పురుషుల మూర్తులన్నీ త్రిభంగీ, ద్విభంగీయుతములుగా తీర్చి, హస్త, హస్తతల అంగుళీ విన్యాసాలు, కటి, ఊరు, పాద విన్యాసాలు అజంతా శిల్పులు ప్రతిభాయుక్తమైన సౌందర్య రేఖలతో రచించారు. కవులు కవిత్వంలోవలెనే చిత్రలేఖనానికీ 'సమయా:లు' భారతీయ శిల్పులు ఏర్పాటు చేసుకున్నారు. కవి సమయాలు కావ్యానికి ప్రాణపోషణ శక్తిని సమర్పిస్తవి. అలాగే శిల్ప సమయాలు శిల్పానికి ప్రాణపోషణ సమర్పిస్తాయి. ప్రకృతి సత్యంమీద ఆధారపడి, ఆ సత్యానికి అతీతమైన రూపం సంతరించుకొని, అనేక మహాభావాలను ధ్వనిగా వ్యంజనము చేసేదే సమయం. ఇవే కావ్య శజల్ప సత్యాలవుతవి. అజంతా చిత్రకారులు సరియైన శిల్ప సమయాలను అతిగాకాకుండా, అంటే ఉత్ప్రేక్షకాకుండునట్లు ఉపయోగించి ఆ చిత్రలేఖన విన్యాసాలను హిమాలయ శృంగస్థితికి తీసుకొని పోయారు.

అజంతా శిల్పుల శిల్ప సమయాలు ప్రజ్ఞాయుక్తమైనవి. ప్రకృతికి అతిదూరం కానివి. కళ ఎప్పుడూ ప్రకృత్యనుకరణం కాదు. కాని ప్రకృతి కళకు ఆధారం అన్నమాట శిల్పి మరచిపోకూడదు. ఈనాటి చిత్రకారులు పాశ్చాత్య విధానానుకరణవాదులై స్తిమితం చిక్కని, స్థాయికందని రీతులను సేకరించుకొనినట్టి సమయాలే చిత్రలేఖన భావ్యంజనానికి అసలు మార్గాలన్నట్లు చిత్రలేఖనాలు విన్యసిస్తున్నారు. ఈ రీతులు చిత్రంలోని భావాన్ని సహృదయునకు దగ్గిరగా తీసుకురాక దూరంచేసి, చిత్రలేఖనాన్ని సమస్యాస్థితికి తీసుకొని పోతున్నవి. అదేకాక జుగుప్సను కూడా కలుగజేస్తున్నవి.

అజంతా చిత్రలేఖనాలలో ఈ దోషం ఆవంతైనా లేదు. శిల్ప సమయాలను సమ్యక్‌స్థితిలో ఉపయోగించి, చిత్రలేఖనానికి శిల్పులు మహోదాత్తత నందించారు.

వితానాలపై చిత్రలేఖణం ఏలా చేయగలిగినారో, ఆరు, ఏడు ఎనిమిది అడుగుల రూపాలకు మొక్కపోనట్టినవి, శక్తి వంతమైనట్టివి, లాలిత్యం కలవి రేఖలు ఏలా విన్యసించారో, ఆ చిత్రకారుల ప్రతిభ ఎట్టిదో ఎక్కడా తప్పుచేసి దిద్దుకొన్న జాడలేదు; అలసత్వం లేదు; నైపుణ్యానికి లోటు లేదు. విన్యాసంలో కుంటులేదు; భావవిన్యాసంలో సందేహంలేదు. రేకల సామ్యము రంగుల శ్రుతి అనన్యము, అతిలోకమూ.

అజంతా చిత్ర లేఖనవిశ్వం లోకానికి తిరిగి దర్శనముకాగానే, నిద్రాణమై యున్న భారతీయ చిత్రలేఖన ప్రతిభ ఒక్కసారిగా మేలుకొంది. అవనీంద్రుని దేశికాత్వాన నందలాలు మొదలైన మహాశిల్పులు నవ్యశక్తితో అపురూప చిత్రలేఖనాలను ప్రపంచానికందిచ్చారు. అజంతా చిత్రలేఖన మహోత్కృష్టస్థితి అవగతం కాగానే భారతీయ శిల్పంయొక్క మహోన్నత స్థితి లోకానికి అర్థమైంది.

అజంతా విడలేక విడలేక వదలి వచ్చినాను. ఓనాడు నేను అజంతా శిల్పినే అన్న భావం నన్ను ఎప్పుడూ విడదు.

(కిన్నెర : సంపుటము 4, సంచిక 3, మార్చి 1952 నుండి – శ్రీ పందిరి కృష్ణమోహన్ గారి సౌజన్యంతో)

(అజంతా ప్రాంతం ఒకప్పటి సంయుక్త హైదరాబాదు రాష్ట్రంలోని మహారాష్ట్ర ప్రాంతంలో ఉండేది. అజంతా శిల్ప సంపదంతా హైదరాబాదులోని వివిధ శిల్పుల ద్వారా సమకూర్చబడింది. వారిలో తెలంగాణా తెలుగువారు ఎంతోమంది ఉండవచ్చు. లోతైన పరిశోధన చేస్తే అది విదితమౌతుంది. ఆంధ్రాప్రాంతపు శిల్పులు, తదితర ప్రాంతాలవారు కూడా ఉండవచ్చు. కాని వారిలో అప్పటి హైదరాబాదు రాష్ట్రీయులే ఎక్కువ ఉంటారనుటకు ఎంతో ఆస్కారం ఉంది. ఎందుకంటే అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో ఎంతో శిల్ప సంపద తవ్వకాలద్వారా బయటపడింది కనుక.)



తెలంగాణా భాషా సాహిత్యాలకు సీమాంధ్రలో స్థానం లేదు

– రవ్వా శ్రీహరి

నేటి ఆంధ్రప్రదేశ్ తెలంగాణా, కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలతో ఏర్పడిన రాష్ట్రం. ఈ నాలుగు ప్రాంతాల్లో వాడబడే భాష తెలుగు భాషే ఐనా ప్రాంతీయంగా భాషా విషయకమైన భేదాలు ఎన్నో ఉన్నాయి. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డ తరువాత తెలంగాణా ప్రాంతం భాషా విషయంలోను, సాహిత్య విషయంలోను ఎన్నో విధాలుగా తన ప్రత్యేకతను కోల్పోయింది, నష్టపోయింది కూడా. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో తెలంగాణా ప్రాంతపు భాష అపహాస్యానికి కూడా గురైంది. ఈ అంశాలను వివరంగా చర్చిద్దాం.

1. నేడు బాలశిక్షనుండి డిగ్రీ తరగతుల పాఠ్యగ్రంథాల వరకు – అన్నింటిలో తెలంగాణ ప్రజలు మాట్లాడే భాషకు ఏమాత్రం స్థానంలేదు. అందువల్ల బాల్యం నుండీ విద్యార్థి తన ఇంట్లో, తన గ్రామంలో, తన పరిసరాల్లో ఉన్న తనకు సహజమైన తెలుగు భాషలోకాక తనకపరిచితమైన అసహజమైన భాషలో తెలుగును నేర్చుకోవలసి వస్తుంది. దీనివల్ల విద్యార్థి తన ఇంటి భాషకు, ఔరిభాషకు, పరిసరాల్లోని భాషకు దూరమౌతున్నాడు. అంతేకాక ఇంట్లో మాట్లాడే తెలుగుకూ, పుస్తకాల్లో ఉన్న భాషకూ భేదం ఉండడం వల్ల విద్యార్థికి స్పష్టత కొరవడుతుంది.

2. పాఠ్యపుస్తకాల్లోనే కాక ఇతర సాహిత్యంలో, వార్తాపత్రికల్లో, సినిమాల్లో, ప్రసార మాధ్యమాల్లో కూడా తెలంగాణా భాషకు ఏమాత్రం స్థానం లేకపోవడంవల్ల దానికి అస్తిత్వమే లేకుండా పోయింది. దీనివల్ల తెలంగాణా భాషలోని పదజాలం, అందమైన పదబంధాలు, సామెతలు ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తున్నా నేటి వ్యవహారంలో కనుమరుగై పోయి తెలంగాణా భాషకు తీరని అన్యాయం జరిగింది. పాఠ్యపుస్తకాలో, సినిమాల్లో ప్రసార మాధ్యమాల్లో తాము మాట్లాడే తెలుగు భాష కనిపించకపోవడం వల్ల తెలంగాణా ప్రాంతపు సామాన్య ప్రజలు తాము మాట్లాడే భాష మంచిది కాదేమో అనే ఆత్మన్యూనతాభావానికి గురి ఔతున్నారు. ఒకవేళ ఎవరైనా తెలంగాణా పదజాలాన్ని, పదబంధాలనూ ప్రయోగిస్తూ తెలంగాణా భాషలో మాట్లాడినా, రాసినా వారిని అపహసించడం కూడా కనిపిస్తుంది.

3. సినిమాల్లో తెలంగాణా భాషకు ఎంతగానో అవమానం జరుగుతుంది. గుండాలకు, తక్కువస్థాయి పాత్రలకు, రౌడీలకు తెలంగాణా భాషను వాడడం

మామూలై పోయింది. తెలంగాణా వాడుకలో ఉన్న ఎన్నో అందమైన అపురూపమైన పదాలను, పదబంధాలను వాడుకోవడంలో చూపని శ్రద్ధ ఏ కొద్దిమందిలో మాత్రమే, ఎక్కడో కొన్ని చోట్ల మాత్రమే వాడుకలో ఉన్న తెలంగాణా భాషను సినిమా వాడకంలో చూపడం దురుద్దేశ పూర్వకమే అనడంలో సందేహం లేదు.

4. తెలంగాణా ప్రాంతపు భాషలో ఉర్దూ పదాలెక్కువగా ఉంటాయనే అభియోగం ఉంది. తెలంగాణా ప్రాంతపు భాషపై చిన్నచూపు చూపడానికి తెలంగాణా భాషలో ఉర్దూ పదాల వాడకం కూడా కారణమని అంటారు. ఇతర భాషా పదాలు చేరని భాషంటూ ప్రపంచంలోనే లేదు. ఇతర భాషాపదాలు చేరడమనేది అవసరాల కారణంగా, చారిత్రక కారణాల వల్లా జరుగుతుంది. తెలంగాణా ప్రాంతపు తెలుగులో ఉర్దూ పదాల వాడుక ఎక్కువగా ఉంటే కోస్తా ప్రాంతపు భాషలో అడుగడుగునా ఆంగ్ల పదాల వాడుక కనిపిస్తుంది. ఉర్దూ పదాలు వాడడం తప్పనీ, ఆంగ్లపదాలు వాడడం ఒప్పనీ అనడం ఎంతవరకు సమంజసం.

5. తెలుగు భాషకు వచ్చిన నిఘంటువులు చాలావరకు ఆంధ్ర ప్రాంత పండితులచే రచింపబడ్డవే. ఆ పండితులకు తెలంగాణా ప్రాంతపు భాషతో పరిచయం లేదు. తెలిసిన వారిచేత తెలంగాణా పదజాలాన్ని సేకరింపజేసి తమ నిఘంటువుల్లో చేర్చిన వైనం కానరాదు. అందువల్ల తెలంగాణం లోని తెలుగు పదసంపద గ్రంథస్థం కాక నష్టమయ్యే స్థితి వచ్చింది.

6. తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణా ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. దేశికవిత, అచ్చ తెలుగు కావ్యాలు, శతక ప్రక్రియ మొదలైన ఎన్నో ప్రక్రియలకు శ్రీకారం చుట్టింది తెలంగాణమే. వేలకొద్ది కావ్యాలు తెలంగాణంలో రచింపబడ్డాయి. ఐనా చాలా గ్రంధాలకు, కవులకు పూర్వ సాహిత్య చరిత్రల్లో స్థానం కనిపించదు. పూర్వ సాహిత్య చరిత్రకారులు తెలంగాణా ప్రాంతంలో పర్యటించి సాహిత్యాన్ని సేకరించి పరిశోధించకపోవడం దీనికి కారణం. ఈ విధంగా తెలంగాణా సాహిత్యానికి సాహిత్య చరిత్రలో కూడా సరియైన స్థానం లభించలేదని చెప్పవచ్చు.



విశాలాంధ్రలో తెలుగు భాష, సాహిత్యాల స్థితి
(సమైక్యాంధ్ర వాదులకు విజ్ఞప్తి)

-ఆచార్య ఎస్వీ రామారావు

కోస్తా ఆంధ్రవారు తెలంగాణా భాష గురించి, తెలంగాణ సాహిత్యాన్ని గురించి తక్కువగా అంచనావేసి చిన్నచూపు చూడటం అడుగడుగునా వాటిని హేళన చేయటం వేర్పాటు వాదానికి దారి తీసిన మాట వాస్తవం.

నిజానికి తెలంగాణా ప్రాంతంలోనే కోస్తా ఆంధ్ర ప్రాంతం కంటే చాలా ముందునుంచీ సుసంపన్నమైన భాషా సాహిత్యాలు నెలకొని వున్నాయన్న చారిత్రక సాక్ష్యాలను విస్మరించి వారు చరిత్రను వక్రీకరించారు. ఆ సాక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. క్రీ.శ. ఒకటవ శతాబ్దంలోనే హాలశాతవాహన రాజు సంకలనం చేసిన 'గాథా సప్తశతి'లో (ప్రాకృత కావ్యంలో) పాడి, పొట్ట, అత్త మొదలైన నిత్యవ్యవహారానికి సంబంధించిన తెలుగు పదాలు కనిపిస్తాయి. ఇది తెలంగాణా భాష. శాతవాహన రాజులు కరీంనగర్ జిల్లా (కోటిలింగాల) ను తొలుత రాజధానిగా చేసుకొని తెలుగుదేశాన్ని పరిపాలించారు. తరువాత వారి రాజ్యం పైఠన్ (మహారాష్ట్ర), అమరావతి (గుంటూరు జిల్లా) మున్నగు ప్రాంతాలకు విస్తరించింది.
2. హాలుని కాలం వాడయిన తెలంగాణా కవి గుణాఢ్యుడు, 'బృహత్కథ' పేరుతో గొప్ప ప్రాకృతకావ్యం రాశాడు. అది సంస్కృతంలోకి అనువాదమై నేడు లభిస్తున్నది.
3. క్రీ.పూ. నుంచి ఉన్న బౌద్ధ, జైన వాఙ్మయాలలో (పాలీ, ప్రాకృత భాషల్లో) తెలంగాణా ప్రసక్తి ఉంది.
   - తెలివాహ నదీతీరం (గోదావరి నది)
   - అశ్మక, ముల్లక రాజ్యాలు (నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలు)
   - మంజీరికా దేశం (మెదక్ ప్రాంతం)
   - నాగభూమి (మహబూబ్‌నగర్ ప్రాంతం)
   - బాదనకుర్తి (బోధన్) మొదలైనవి.
   - గ్రీక్ దేశస్థుడైన టాలెమీ 'ట్రిలింగాన్' 'తెలంగాణా'ను సూచిస్తున్నది.
   - బర్మాలో నివసించిన 'తలైంగు'లు, మెసపోటేమియా లోని 'తెలిమన్లు' తెలంగాణా ప్రాంతంనుంచి వలసపోయిన వారు. (విదేశీయుల వ్రాతలు, బౌద్ధ-జైన వాఙ్మయాలు, తెలంగాణాలో దొరికిన శాతవాహనుల నాటి నాణాలు వీటిని నిరూపించే సాక్ష్యాలు)

శాతవాహనుల తర్వాత తెలుగుదేశాన్ని పరిపాలించింది చాలావరకు తెలంగాణా ప్రాంతం రాజవంశాలే.

ఉదా : ఇక్ష్వాకులు (నాగార్జునకొండ); విష్ణుకుండినులు (మహబూబ్‌నగర్, నల్గొండ); పశ్చిమ చాళుక్యులు (నిజామాబాద్-వేములవాడ); కాకతీయులు (వరంగల్); పద్మనాయకులు (దేవరకొండ, రాచకొండ); కుతుబ్‌షాహీలు (గోలుకొండ); ఆసఫ్‌జాహీలు (హైదరాబాద్).

క్రీ.శ. ఒకటవ శతాబ్దం నుంచి తెలంగాణా ప్రజల భాష తెలుగు ప్రజల వ్యవహారంలో ఉంది.

క్రీ.శ. ఆరవ శతాబ్దంనుంచి తెలుగులో మొదటి శాసనాలు కడపజిల్లాలో రేనాటి చోడులు వేయించారు. (కోస్తా ఆంధ్రవారు)

క్రీ.శ. ఎనిమిది, తొమ్మిది శతాబ్దాల నుంచి మాత్రమే బెజవాడ, అద్దంకి మొ॥ చోట్ల కోస్తా ఆంధ్ర శాసనాలు కనిపిస్తాయి.

క్రీ.శ. 10వ శతాబ్దంలోని మానుకోటలోని (వరంగల్) కొరవి శాసనం (వచన శాసనం) నన్నయ భాషకు (11వ శ.) దగ్గరగా వుంది.

భవభూతి (నాటకకర్త), మల్లినాథసూరి (కాళిదాసుకు వ్యాఖ్యాత), విద్యానాథుడు - జగన్నాథుడు (అలంకార శాస్త్రం) మున్నగు సంస్కృతభాషా కవులు పండితులు తెలంగాణా వారే కాబట్టి నన్నయకు పూర్వమే క్రీ.శ.ఒకటవ శతాబ్ది నుంచి తెలంగాణాలో సుస్థిరమైన భాషా సాహిత్యాలు నెలకొని ఉన్నాయని చరిత్ర చాటుతున్నది.

నన్నయ తర్వాత కూడా కోస్తాంధ్రతో పాటు తెలంగాణాలో కూడా గొప్ప సాహిత్యం ఉండగా సాహిత్య చరిత్రకారులు వాటిని రికార్డు చేయకుండా అన్యాయం చేశారు.

1) నన్నయ మొదటి కావ్యం - ఆంధ్రభారతం వ్రాస్తే - తొలి తెలుగు రామాయణం (గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం), తొలి తెలుగు భాగవత పురాణం (బమ్మెర పోతన) తెలంగాణాలోనే వెలువడ్డాయి.
2) తొలి దేశికవి అయిన పాల్కురికి సోమన వరంగల్‌వాడు - తొలి తెలుగు శతకం, తొలి ద్విపద కావ్యం, తొలి చారిత్రక కావ్యం, తొలి ఉదాహరణ కావ్యం, తొలి రగడలు - గద్యలు ఇలా మూడు భాషల్లో (సంస్కృతం, కన్నడం, తెలుగు) 30 కావ్యాలు పాల్కురికి రాశాడు.
3) తొలి జంటకవులు గోన బుద్ధారెడ్డి కుమారులు - కాచ-విఠలులు (మహబూబ్‌నగర్) కాగా నంది మల్లయ - ఘంట సింగయ అని ప్రచారం చేశారు.
4) ఇంకా కథా కావ్యాలు (కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక), శతకాలు (సర్వేశ్వర శతకం, సుమతీ శతకం, దాశరథీ శతకం, నరసింహ శతకం మొ॥),

తొలి అచ్చ తెలుగు కావ్యం (యయాతి చరిత్ర), తొలి వచన కీర్తనలు (అన్నమయ్య కంటే ముందువి – సింహగిరి వచనములు) ఇలా చెప్పుకుంటే తెలంగాణా సాహిత్యంలో ఎన్నో ఫస్టులు, జెస్టులు మొ॥ ప్రత్యేకతలున్నాయి. (లక్షణ గ్రంథాలు – అప్పకవీయం, ప్రతాపరుద్ర యశోభూషణం మొ॥)

తర్క శాస్త్ర పండితుడు అన్నంభట్టు, వ్యాకరణ పండితుడు ఖండవల్లి నరసింహశాస్త్రి తెలంగాణా వారే.

ఇక అసలు విషయానికి వద్దాం –

నిజాం రాజ్యంలో తెలుగుభాష అణచి వేయబడిందని, ఉర్దూమయం అయిందని ప్రచారంలో ఉన్నవి పచ్చి అబద్ధాలు. పాలమూరు జిల్లాలోని సంస్థానాల పోషణలో ఎందరో కవులు, కళాకారులు గౌరవాలు పొందారు. గొప్ప కృషి చేశారు. తిరుపతి వేంకటకవుల వంటివారు ఇక్కడికి వచ్చి గౌరవాలు, సత్కారాలు అందుకొన్నారు. విజయనగరం వాడైన ఎలకూచి బాలసరస్వతి జటప్రోలు సంస్థానాన్ని ఆశ్రయించి గ్రంథ రచన చేశాడు.

కాగా– తెలంగాణా ప్రాంతంలో ఉన్నంత భాషా చైతన్యం, సాంస్కృతిక చైతన్యం కోసాంధ్ర వారిలో కొరవడినాయనటానికి క్రింది ఉదాహరణలే సాక్ష్యం చెబుతాయి.

1) ఉస్మానియా విద్యార్థులు క్యాంపస్‌లో 'వందేమాతరం' (1938) గీతం ఆలపించి బహిష్కరణకు గురియైతే ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు వారికి అడ్మిషన్ ఇవ్వటానికి నిరాకరించారు. ఫలితంగా బూర్గు, పి.వి. వంటివారు పూనా, నాగపూర్ విశ్వవిద్యాలయాలకు వెళ్ళి డిగ్రీలు తీసుకొన్నారు.
2) మాడపాటి హైస్కూలు తెలుగు మీడియం విద్యార్థులు పరీక్షలు రాయటానికి నిజాం ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే ఆంధ్ర విశ్వవిద్యాలయం 'అఫిలియేషన్' కోరగా, అప్పటి వి.సి. కట్టమంచి రామలింగారెడ్డి అనుమతి ఇవ్వలేదు. వాళ్లు పూనాకు అనుబంధంగా పరీక్షలు రాశారు. దీనికి కారణం, నిజాం ప్రభుత్వం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విరాళం ఇవ్వటమే.
3) 1948 పోలీసు చర్య తర్వాత ఉస్మానియాలో 'దీనియాత్' (Religion & culture) స్థానంలో 'ద్వితీయభాష' (Second Language) డిగ్రీ విద్యార్థులకు (BA, B.Com., BSc.) ప్రవేశపెట్టబడింది. అప్పటికి ఆంధ్రా యూనివర్సిటీలో ఆర్ట్స్ విద్యార్థులకు తప్ప మిగతా faculty వారికి తెలుగు సబ్జెక్ట్ (second language) లేదు.

మహాకవి రాయప్రోలు సుబ్బారావుకు ఉస్మానియా తెలుగుశాఖలో నిజాం ప్రభుత్వం ఉద్యోగం ఇస్తే ఆయన పదవీవిరమణ చేస్తూ ఇక్కడ తెలుగు డిపార్ట్‌మెంట్ అవసరం లేదని వ్రాశాడని ప్రసిద్ధి.

నైజాం ప్రభుత్వం ప్రాంతీయభాష – మైనారిటి భాష అయిన ఉర్దూను విశ్వవిద్యాలయం స్థాయిలో మీడియంగా విజయవంతంగా నిర్వహిస్తే – విశ్వవిద్యాలయ స్థాయిలో మీడియం కాదు కదా– సెకండ్ లాంగ్వేజి స్థాయిలో నిర్బంధంగా తెలుగును ప్రవేశపెట్టలేకపోయారు ఆంధ్ర పరిపాలకులు. (ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి – మన రాష్ట్రంలోనే మొట్టమొదటి తెలుగు మీడియం డిగ్రీ కళాశాల మహానుభావుడు ఖండవల్లి లక్ష్మీరంజనం చొరవతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబడింది).

ఇన్నికోట్ల మంది ప్రజల వాడుకభాష – రాష్ట్ర అధికార భాష అయిన మాతృభాషను పాఠశాల స్థాయిలో తెలుగు మాతృభాష అయినవారు (ఉర్దూ మొ॥ ఇతర భాషలవారు కాదు) నిర్బంధంగా తెలుగును ప్రథమ భాషగా (ఫస్ట్ లాంగ్వేజ్) – మీడియంగా కాదు – చదువుకొనగలిగే జి.ఓ.ను తేవటానికి ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన ముఖ్యమంత్రులు, విద్యామంత్రులు ఎవరికీ ధైర్యం లేకపోయింది. మాతృభాషను నిర్బంధంగా చేయటం ఇతర భాషల వారికెవరికీ అభ్యంతరం కాదు. వారు కావాలంటే రాష్ట్ర భాష అయిన తెలుగును వారి ఇష్టానుసారం ప్రథమభాషగా కాని, ద్వితీయభాషగా కాని చదువుకొంటారు. ఇక ఇంగ్లీషు మీడియంలో చదువుకొంటున్న తెలుగు పిల్లలు తప్పనిసరిగా తెలుగు (ఫస్ట్ లాంగ్వేజ్) చదవాలన్న నియమం (రూల్) ఏదీ మన రాష్ట్రంలో లేదు. వారు హిందీనో, స్పెషల్ ఇంగ్లీషునో ప్రథమభాషగా చదువుకొంటూ పదవతరగతి వరకూ మాతృభాష అయిన తెలుగును చదువకుండానే ఉత్తీర్ణులవుతున్నారు. ఇంతకన్నా ఘోరం, దుర్మార్గం ప్రపంచ చరిత్రలోనే మరొకటి ఉందా? ప్రాథమిక విద్యాస్థాయి మాతృభాషలోనే కొనసాగటంలోనే పిల్లల అభివృద్ధి ఉందని భాషావేత్తలందరూ పదే పదే చెబుతున్నా మన రాష్ట్ర పాలకుల చెవికి ఎక్కటం లేదు. సమైక్యాంధ్ర పాలకుల్లో స్వభాషాభిమానం అవలేశం కూడా లేకపోవటమే ఇందుకు కారణమని చెప్పనక్కరలేదు. కాబట్టి సమైక్యాంధ్రరాష్ట్రం కొనసాగింత వరకూ తెలుగు భాషకు పుట్టగతు లుండవన్నది పిండితార్థం. తెలుగు భాషాభివృద్ధి కొరకైనా 'ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం' కావాలి.

తెలంగాణా భాష పట్ల, సాహిత్యం పట్ల, పండుగలు – ఆచార్య వ్యవహారాలు మున్నగు సాంస్కృతికాంశాల పట్ల వైమనస్యం, అల్పభావం ఉన్న ఆంధ్ర ప్రాంతం వారు తొందరగా విడిపో వటమే మంచిది. దశాబ్దాలుగా తెలంగాణాలో నివసిస్తూ ఇక్కడి సంస్కృతిని ఆదరించని వారు – ఇక్కడి ప్రజల్లో కలువలేనివారు వేరు కావలసిందే. సద్భావన లేనిచోట సమైక్యత సామరస్యం ఉండజాలవని ఇప్పటికైనా గుర్తించాలి.

తెలుగు సాహిత్య చరిత్ర అంటే తెలంగాణా సాహిత్య చరిత్రనే

-ఆచార్య ఎస్వీ రామారావు

తెలుగు సాహిత్య చరిత్ర అంటే చాలావరకు తెలంగాణా సాహిత్య చరిత్రనే అన్న విషయం చాలామందికి తెలియదు. కాని ఇది చారిత్రకమైన యధార్థం. ఈ సత్యాన్ని నిరూపించి చెప్పటానికే ఈ ప్రయత్నం.

ఇంతవరకూ రచింపబడిన సాహిత్య చరిత్రలన్నీ పదకొండవ శతాబ్దంలోని నన్నయభట్టు ఆంధ్ర మహాభారతంతోనే ప్రారంభం కావటం సర్వసాధారణమైన విషయం. కాని అంతకు వేయి సంవత్సరాలకు ముందే – క్రీ.శ. ఒకటవ శతాబ్దం నుంచే – తెలంగాణా ప్రాంతంలో విశిష్టమైన సాహిత్యం నెలకొని ఉంది. ఎందరో ప్రాకృత, సంస్కృత, కన్నడ కవులు ఈ నేలలో ఉద్భవించి సాహితీ క్షేత్రాన్ని సస్యశ్యామలం చేశారు. వీరు తెలుగులో కావ్యరచన చేయకపోయినా – వీరంతా తెలుగువారు – విశేషించి తెలంగాణా వారు కావటం గమనార్హం.

తెలుగు దేశంలో మొట్టమొదటి కవిగా పేర్కొనదగినవాడు గుణాఢ్యుడు. ఇతడు క్రీ.శ. ఒకటవ శతాబ్దంలో మన రాష్ట్రాన్ని పరిపాలించిన శాతవాహనరాజు హాలుని సమకాలీనుడు. ఆదిలాబాద్, దానికి సరిహద్దులోని పైఠన్ ప్రాంతంలో జీవించాడు. ఇతని తల్లి బ్రాహ్మణ స్త్రీ, తండ్రి నాగ ప్రభువు అని తెలుస్తున్నది. గుణాఢ్యకవి హాలుని ఆస్థానంలోని శర్వవర్మతో చేసిన ప్రతిజ్ఞలో ఓడిపోయి, సంస్కృత ప్రాకృత భాషలను – దేశభాష అయిన తెలుగును పరిత్యజించి, పైశాచీ ప్రాకృతంలో కథల కాణాచి అయిన 'బృహత్కథ'ను రచించాడు. ఇది నేడు అలభ్యంగా ఉన్నా – సోమదేవ సూచి 'కథా సరిత్సాగరం', క్షేమేంద్రుని 'బృహత్కథామంజరి' అన్న సంస్కృత అనువాద గ్రంథాల రూపంలో లభ్యమై చిరకీర్తిని ఆర్జించింది. అనేక కావ్య నాటకాలకు మూలమైన కథాబీజాలు బృహత్కథలో ఉన్నాయని వాఙ్మయ పరిశోధకుల అభిప్రాయం. ఇది మన కథా ప్రక్రియకు చెందిన తొలి రచన.

గుణాఢ్యుని వృత్తాంతం వల్ల క్రీస్తు శకారంభంలోనే తెలుగు భాష ప్రజల వ్యవహారంలో ఉన్నట్లు విదిత మవుతున్నది. అదేకాలంలో విరచితమైన ప్రాకృత కవితా సంకలనం 'గాథా సప్తశతి' లో తెలుగు మాటలు ఉండడం ఈ విషయాన్ని బలపరుస్తున్నది. హాలుడు తన రాజ్యంలోని కవులు 'గాథా' అనే ప్రాకృత ఛందస్సులో రాసిన ఏడు వందల పద్యాలను పై పేరుతో సంకలనం చేశాడు. దీనిని శ్రీనాథుడు ఆంధ్రీకరించాడు కాని అది లభించలేదు. ఆధునిక యుగంలో రాళ్ళపల్లి

అనంతకృష్ణశర్మ (శాలివాహన సప్తశతీసారము) మున్నగువారు తెనిగించి అందలి కవితా వైశిష్ట్యాన్ని చాటిచెప్పారు. సప్తశతిలో వర్ణితమైన ప్రజల జీవన సంస్కృతి, గ్రామీణ వాతావరణం మొదలైనవి తెలంగాణా ప్రాంతానికి చెందినవే అనటంలో సందేహం లేదు. ఇందులో గోచరించే తెలుగు పదాలు – అమ్మ, అత్తా, పొట్టం (పొట్ట), పిల్లఆ (పిల్ల), రుంప (రంపం), అద్దామే (అద్దం), బొణ్ణి (పంది) మొదలైనవి ఈ ప్రాంతంలో వ్యవహారంలో ఉన్నవే.

క్రీ.పూ. మూడవ శతాబ్దంనుండి క్రీ.శ.మూడవ శతాబ్ది వరకు సుమారు ఐదు వందల ఏళ్ళు తెలుగుదేశాన్ని ఏలిన తొలి రాజవంశమైన శాతవాహనులు తొలుత తెలంగాణా ప్రాంతాన్ని (కరీంనగర్ జిల్లా కోటిలింగాల) రాజధానిగా చేసుకొని పాలించినట్లు, తర్వాత పైఠన్ (దక్షిణ మహారాష్ట్ర), అమరావతి ప్రాంతాలకు విస్తరించినట్లు ఇటీవల బయల్పడిన పురావస్తు విశేషాలు, నాణాలు మొ।।వి సాక్ష్యంగా ఉన్నాయి. మౌర్య చంద్రగుప్తుని కాలంలో (క్రీ.పూ. 305) మన దేశానికి వచ్చిన గ్రీకు రాయబారి మెగాస్థనీస్, ప్లీనీ, ఏరియస్ మున్నగు చరిత్రకారులు ఈ ప్రాంతంలోని ఆంధ్రరాజుల ప్రశంస చేశారు. బౌద్ధ జైన గ్రంథాల్లో పేర్కొనబడిన అశ్మక (అస్సక), ముళక (ముల్లక) దేశాలు కూడా తెలంగాణా ప్రాంతాన్ని సూచించేవే. నిజామాబాద్, కరీంనగర్ జిల్లా ప్రాంతాలు అశ్మకదేశంగా, ఆదిలాబాద్, పైఠన్ ప్రాంతాలు ముల్లక దేశంగా గుర్తింపబడ్డాయి. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ – పోదన్, పొదన్య పురి, బహుధాన్యపురం పేర్లతో వ్యవహరింపబడింది. బౌద్ధ వాఙ్మయంలో మన రాష్ట్రం 'మంజీరికాదేశం'గా, 'నాగభూమి'గా కూడా పేర్కొనబడింది. గోదావరికి ఉపనది అయిన మంజీర నదివల్ల మంజీరదేశం అని వ్యవహరింపబడి ఉంటుంది. ద్రావిడ భాషలైన కోదు, గోండు మాట్లాడేవారు – నాగుపామును పూజించే కోయలు నాగజాతివారు అయి ఉంటారని చరిత్ర పరిశోధకుల అభిప్రాయం. మహబూబ్‌నగర్ జిల్లాలో నాగరాల, నాగసానిపల్లె, నాగరకర్నూలు మున్నగు పేర్లుగల ఊళ్లు ఈనాటికీ ఉన్నాయి. పై జాతుల వంశోత్పత్తి కథల్లో 'తెలుగు దేవతల' ప్రస్తావనలున్నాయి.

హాల శాతవాహనుడు – లీలావతిల వివాహం సప్త గోదావరి తీరస్థమైన భీమేశ్వరుని సన్నిధిలో జరిగినట్లు కుతూహలుడు అనేకవి 'లీలావయీ' (లీలావతి) అదే ప్రాకృతకావ్యంలో వర్ణించాడు. గోదావరి తీరంలోని ధర్మపురికి ఎగువగా 40 కి.మీ. దూరంలో వేంపల్లి – వేంకటరావు పేటల వద్ద గోదావరి ఏడుపాయలుగా చీలి వుంది. దీనిని సప్తగోదావరిగా గుర్తించి డా।। సంగనభట్ల నరసయ్యగారు అక్కడి త్రవ్వకాలలో బయల్పడిన ఆలయశిథిలాలు భీమేశ్వరాలయానివే అని భావించారు. జైన జాతకకథలో 'తెలవాహ' (తేల్) నదీతీరంలోని అంధక (ఆంధ్ర)పురం అంధకుల (ఆంధ్రుల) రాజధానగా పేర్కొనబడటం కూడా దీన్ని బలపరుస్తుంది.

తెలవాహ (తెల్లని నది) గోదావరి నదియే. నాడు కృష్ణానదికి 'కణ్ణబెణ్ణ' (కృష్ణవేణి = నల్లని నది) అని వ్యవహారం ఉండడం కూడా ఇందలి ఔచిత్యాన్ని వెల్లడిస్తుంది.

క్రీస్తుపూర్వం నుంచీ తెలుగు, ఆంధ్రం అన్నవి సమానార్థకాలుగా, పర్యాయపదాలుగా వాడుకలో ఉండటం గమనించ వచ్చు. గ్రీకు భూగోళ శాస్త్రజ్ఞుడు టాలెమీ (క్రీ.శ.150) పేర్కొన్న 'టెలింగాన్' (ట్రలింగాన్) దేశం 'తెలంగాణ' పదానికి సన్నిహితంగా ఉంది. ఆణము, దేశము అన్నవి పర్యాయపదాలు. 'మాగాణం' వలెనే 'తెలంగాణం' శబ్దం కూడా ఏర్పడి ఉంటుంది. మెదక్‌జిల్లా రామచంద్రపురం మండలంలోని 'తెల్లాపూర్' గ్రామానికి తెలంగాణపురం అని ప్రాచీన నామం ఉన్నట్లుగా ఇటీవలే ఒక రాతి శాసనం (క్రీ.శ.1417) బయటపడింది.

పై విషయాలన్నీ శాతవాహనరాజులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించినట్లుగా - వారి యుగంలో వెలువడిన 'బృహత్కథ' తొలి కథావాఙ్మయ ప్రక్రియగా, 'గాథాసప్తశతి' తొలి కవితా సంకలన గ్రంథంగా స్పష్టీకరిస్తున్నాయి. శాతవాహనుల తర్వాతి వారైన ఇక్ష్వాకు రాజుల కాలంలో 'ధర్మామృతం' అనే ప్రాకృత జైన కావ్యం విరచితమైనట్లు తెలుస్తున్నది. విష్ణుకుండినరాజు మాధవవర్మ (6వ శ.) స్వయంగా జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి, పేరుతో సంస్కృతంలో ఛందోగ్రంథం రచించాడు. దీనికి గణస్వామి వ్యాఖ్య రాశాడు. "ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే" అని ప్రసిద్ధి గన్న సంస్కృత నాటక కర్త భవభూతి (8వ.శ.) "దక్షిరాపథే పద్మపురం నామనగరం" నిశాసిగా చెప్పుకొన్నాడు. పౌదన్యపురమే పద్మపురం అయి క్రమంగా బోధన్ పేరుతో స్థిరమైంది. ఉత్తర రామచరిత్రలో గోదావరి వర్ణన ఉండటంతో పాటు, భవభూతి నాటకాలు ప్రదర్శింపబడిన 'కాళప్రియానాథాలయం' బోధన్‌కు సుమారు వందమైళ్ల దూరంలో ఉన్న నాందేడ్ జిల్లాలోని కాంథార్ గ్రామం అవటం భవభూతి బోధన్ వాస్తవ్యుడే అని నిరూపిస్తున్నాయి. మహావీరచరితం, మాలతీమాధవం, ఉత్తర రామ చరితం నాటక త్రయకర్త భవభూతి సంస్కృతనాటక ప్రక్రియలో విశిష్టస్థానంగడించాడు.

వేములవాడ చాళుక్యరాజు రెండవ అరికేసరి (910-930) ఆస్థానకవి అయిన పంపడు కన్నడంలో ఆది పురాణ (జైనపురాణం), విక్రమార్జున విజయ (పంపభారతం అని ప్రసిద్ధి పొందిన చంపూకావ్యం) కావ్యాలు రచించాడు. పద్మపురివాసి (బోధన్), 'పద్మకవి' అనే బిరుదుగల పంపకవి తెలుగువాడు. కన్నడ రత్నత్రయంలో ఒకడుగా సుస్థిరస్థానం పొందాడు. బోధన్‌లో ఇతన సమాధి ఉంది. పంపసోదరుడైన జనవల్లభుని సహాయంతో అతని మిత్రుడైన మల్లియరేచన క్రీ.శ.940 ప్రాంతంలో 'కవిజనాశ్రయం' అనే ఛందోగ్రంథం తెలుగులో రచించాడు. కాబట్టి నన్నయకు పూర్వమే విరచితమైన తొలి తెలుగు గురించి భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి.

గుజరాత్ ప్రాంతానికి చెందిన సోమదేవసూరి కూడా రెండవ అరికేసరి కాలంలో వేములవాడకు వచ్చి నాగరాజు కాలంలో (955-60) సంస్కృత కావ్యాలు రచించినట్లు ఆధారాలున్నాయి. జైన మతస్థుడైన ఇతడు వేములవాడ చాళుక్యులకు మూడు తరాలు జైన గురువుగా ఉన్నాడు. యశస్తిలకచంపువు, కథాసరిత్సాగరంతో పాటు 'నీతిసారం' రచించాడు. సోమదేవసూరి శిష్యుడైన రెండవ బద్దెగుడు (960-966) దీనిని 'నీతిశాస్త్రముక్తావళి'గా తెలుగులోకి అనువదించా డని చెప్పబడుతున్నది. మొదటి ప్రతాపరుద్రుని 'నీతిసారం'లో (క్రీ.శ. 1150) బద్దెగుని పద్యాలు ఉదాహృతమైనాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూరు వాస్తవ్యుడైన మంధాన భైరవుడు క్రీ.శ. 1000లో 'భైరవతంత్రం' అను సంస్కృత తంత్రశాస్త్రం రచించాడు. మానవల్లి రామకృష్ణ కవి 'కుమారసంభవం' పీఠికలో దీని ప్రశంస ఉంది.

ఇవన్నీ ప్రాఙ్నన్నయయుగంలోని తెలంగాణా సారస్వత ప్రక్రియలు. ఈ ప్రాంతంలోని సాంస్కృతిక, సాహిత్య చైతన్యానికి నిదర్శనాలు. తెలుగేతర భాషలలో ఉండడం చేత మన సాహిత్య చరిత్రకారులెవరూ దీన్ని పట్టించుకోలేదు. ఇది తెలంగాణా చరిత్రకు జరిగిన అన్యాయం. నన్నయకు పూర్వయుగంలోని శాసనాలలో కూడా తెలంగాణాలోని తెలుగుభాష క్రమవికాసం ద్యోతకమవుతుంది. దీన్ని గురించి మరింత వివరంగా తెలుసుకోవలసిన అవసరం ఉంది.



తెలుగు శాసనాలు-
తెలంగాణా సాహిత్య భాష

-ఆచార్య ఎస్వీ రామారావు

ప్రాఙ్నన్నయ యుగంలోని (క్రీ.శ.1వ శ.-10వ శ.) శాసనాలను నిశితంగా పరిశీలిస్తే తెలంగాణా ప్రాంతంలో ఆనాడే నెలకొని ఉన్న సాహిత్య భాష గురించి ఎన్నో ఆసక్తికరమైన అంశాలు వెలికివస్తాయి. ఈ శాసనాలు తొలుత ప్రాకృత, సంస్కృత భాషల్లో ఉన్నా, ఆరవ శతాబ్ది కాలంనుంచి తెలుగులో శాసనాలు గోచరిస్తాయి. శాతవాహనరాజు వాశిష్ఠీపుత్ర పులుమావి జంగిలిగుండు ప్రాకృత శాసనంలో (క్రీ.శ.200) 'వేపురక' అన్న ఊరిపేరు కనిపిస్తుంది. వేము+ఊరు = వేపూరుకు 'క' ప్రత్యయం చేరి 'వేపురక' అయింది. మహబూబ్‌నగర్‌జిల్లా కల్వకుర్తి తాలూకాలో వేపూరు అన్న గ్రామం ఉంది. ఈ శాసనం వేయించిన రాజు పేరులోనల 'పులుమావి' కూడా అచ్చమైన తెలుగు పదం. పులు=రెల్లు, గడ్డి, మావి= తల్లిపేగు. గడ్డిలో పుట్టినవాడు (కుమారస్వామి) అని అర్థం. ఆనాడు ఇక్కడో షణ్ముఖ పూజ వ్యాప్తిలో ఉన్నట్లు నాగార్జునకొండ ప్రాంతంలోని కార్తికేయ గుడులు, స్కంధవర్మ మొ॥ పేర్లు సాక్ష్యమిస్తున్నాయి. కొండమూడి జయవర్మరాజు శాసనంలో (క్రీ.235) పొండూరు, కూడూరు గ్రామ నామాలున్నాయి. ఇందులోని 'మహాతగవం' (తగవు తీర్చేవాడు) శబ్దం, వీర పురుషదత్తుని నాగార్జునకొండ శాసనం (క్రీ.శ.237)లోని 'మహాతలవం' (తలారి) పదం నాడు వాడుకలో ఉన్న పదవులను తెల్పుతున్నాయి.

హైదరాబాదు సమీపంలోని కీసరగుట్టలో బయల్పడిన విష్ణు కుండినుల శాసనంలోని 'వ్రాసినవాన్ష్టు' (వ్రాసినవాండ్రు) అమరావతీ స్థూపంలోని 'నాగబు' పదం కన్నా స్పష్టమైన తెలుగు మాట (సమాసం) గా పేర్కొనదగింది. 'నాగ' అను సంస్కృత ధాతువుకు 'బు' (ము) విభక్తి చేరగా ఏర్పడిన నాగబు రెండు శిథిల ఫలకాలమీద 'నాగబుధనికా' అన్న వ్యక్తిపేరు అని కూడా కొందరు భావిస్తున్నారు. కాబట్టి నాగబు అసంపూర్ణమైన పదం.

క్రీ.శ.ఆరవశతాబ్దిలో (575-600) రేనాటి బోడరాజు ననంజయుడు కడపజిల్లాలో వేయించిన ఎర్రగుడిపాడు, కలమళ్ళ శాసనాలు తెలుగు భాషలో తొలి గద్య శాసనాలుగా పరిశోధకులు నిర్ణయించారు. కోస్తా ఆంధ్ర కంటేముందు రాయలసీమలో విలసిల్లిన భాషాభిమానానికి ఇది నిదర్శనం. జయసింహుని విప్పర్ల శాసనం (క్రీ.శ.649) సాగరసీమలో లభించిన మొదటి తెలుగు శాసనం. వేంగీనాడు పరిపాలకులైన తూర్పు చాళుక్యుల పద్యశాసనాలు తొమ్మిదవ శతాబ్దంలో లభ్యమైనాయి. వీరి సమకాలికులు - కరీంనగర్ జిల్లా వేములవాడ ప్రాంతాన్ని

పరిపాలించిన పశ్చిమ చాళుక్య రాజుల ఆస్థానంలో పంప, జినేంద్ర వల్లభుడు, సోమదేవసూరి మున్నగు కవులు కన్నడ సంస్కృత భాషల్లో (10వ శ.) కావ్యరచన చేశారు. వరంగల్‌జిల్లా మానుకోట సమీపంలో చాళుక్య భీముడు వేయించిన కొరవి శాసనం (892-922) తెలుగు వచన రచనాశైలి క్రమ పరిణామానికి, తెలంగాణా సాహిత్య భాషా పరిణతికి తార్కాణంగా ఉంది. ఇందులోని కొంతభాగం చూడండి

"కుసుమాయుధు పెద్దకొడు కనేక నృపతి మణిమకుట మకరికా కషణ మశృణిత భగల కలావర్తంబు రాజ్యంబు సేయుచు నిష్ట విషయ కామభోగంబు లనుభవించుచు సుఖంబుణ్డి (ండి) ఒక్క నాణ్డు(ండు) కొరవి నల్లమేరయ కొడుకు పెద్దన రావించి "నీవు నా ప్రాణ సమానుణ్డ (ండ) వైన చెలివి. నీ చేసిన యుపకారంబునకుం బ్రత్యుపకారంబు సేయలయుం గాన నీకేమి వలయుం దాని వేణ్డి (డి) కొమ్మనిన...."

నన్నయభట్టు భారతరచన కాలానికి (1056) నూటయాభై సంవత్సరాలకు ముందే అందలి రచనా శైలిని వోలిన వాక్య నిర్మాణం ఈ కొరవి శాసనంలో ఉండడం తెలుగు భాషీయులందరూ తెలుసుకోవలసిన సత్యం. తొలి కందపద్యశాసనం, మొదటి సంస్కృత వృత్త శాసనం కూడా తెలంగాణలోనే విరచితమైనాయి. పంప సోదరుడైన జినవల్లభుడు రచించిన కరీంనగర్ జిల్లా కుర్క్యాల శాసనంలో (10వ శ.) మూడు కందపద్యాలున్నాయి. సంస్కృతాంధ్ర కన్నడ భాషల్లో ఉన్న ఈ శాసనానికి 'గంగాధర శాసనం' అని వ్యవహారం ఉంది.

వరంగల్ జిల్లా జనగామ తాలూకా గూడూరులోని విరియాల మల్లని పద్య శాసనాల్లో (1005-1045) మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు ఉన్నాయి. సంస్కృత వృత్త ఛందస్సులో విరచితమైన ప్రప్రథమ తెలుగు శాసనం ఇది. విరియాల ఎర్రభూపతి పత్ని అయిన కామసాని తన పుత్రుని పరాక్రమం చేత బేతరాజును కాకతీయ సింహాసన ప్రతిష్ఠితుడిని చేసిన వృత్తాంతం ఇందులో వర్ణితమైంది. అందుచేతనే దీనికి కామసాని శాసనం అన్న ప్రసిద్ధి కలిగింది. కాని విరియాల మల్లడు మల్లేశ్వరస్వామిని ప్రతిష్ఠించి చెరువును త్రవ్వించిన సందర్భంలో ప్రకటించిన శాసనం ఇది. ఇందలి పద్యాలలోని శైలి నన్నయ వాక్యశైలికి సన్నిహితంగా ఉండటం గమనింపదగిన అంశం. మచ్చుకు ఒక పద్యం చూడండి -

"భావితకీర్తి నాతనికి బాండవ మధ్యమభీముడోయనం
గా విరాయాలు భీమనృప ఘస్మరుడై యుదయించె వానికిన్
భూవినుయండు మండలిక భూషణు డెట్టి నరేంద్రు డుత్తమ
శ్రీ వినుతుండు బంధుజన సేవ్యుడు దానుదయించె నున్నతిన్."

నన్నయ అవతారికలోని మొట్టమొదటి తెలుగు పద్య పంక్తులు ఈ పద్యాన్ని పోలి ఉన్నాయి.

"రాజకులైక భూషణుడు రాజమనోహరుడున్యరాజ తే
జోజయశాలి శౌర్యుడు విశుద్ధ యశశ్శర దిందు చంద్రికా
రాజిత సర్వలోకు డపరాజిత భూరిభుజా కృపాం ధా
రాజుల శాంత శాత్రవ పరాగుడు రాజమహేంద్రుడున్నతిన్."

గూడూరు శాసనం నన్నయ భారతరచన తర్వాతదని అభిప్రాయభేదం ఉన్నప్పటికీ ఇంచుమించు ఒకే కాలంలో ఇటు వరంగల్లు ప్రాంతంలో, అటు రాజమండ్రి ప్రాంతంలో ఒకే విధమైన సాహిత్యభాష వాడుకలో ఉందన్నది తేలిన సారాంశం. దీనిని బట్టి నన్నయ తెలుగుభాషను సంస్కృతమయం చేశాడన్నది కేవలం అపవాదు మాత్రమే అని బోధపడుతున్నది. సమకాలీన శాసనాల్లో, కన్నడ కావ్యాల్లో ఉన్న తత్సమ శైలినే ఆధారం చేసుకొని హృద్యమైన పద్యశైలికి ఆద్యుడైనాడు నన్నయ. ఇంతకన్నా ఆసక్తికరమైన అంశం మరొకటి ఉంది.

నన్నయభట్టు సహధ్యాయుడు, భారతరచనలో సహాయకుడు అయిన నారాయణభట్టు నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ నుంచే రాజమహేంద్రవరం వెళ్ళి పశ్చిమ-తూర్పు చాళుక్యుల మధ్య శాంతిదూతగా వ్యవహరించి సఖ్యత కుదిర్చాడు. నారాయణభట్టు సహాయానికి కృతజ్ఞతగా రాజరాజు అతనికి నందంపూడి అగ్రహారం దానం చేశాడు. ఈ నందంపూడి శాసన (1053) రచయిత నన్నయభట్టు. ఇందులో నారాయణభట్టు సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్రభాషా కవిరాజశేఖరుడని పేర్కొనబడినది. తమిళదేశంతో బాంధవ్యం కలిగిన రాజరాజుకు కానీ, సంస్కృతాంధ్ర ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుడైన నన్నయకు కానీ కన్నడ భాషా పరిచయం ఉండే అవకాశం లేదు. పంపభారతంతో ఆ పరిచయాన్ని కలిగించినవాడు బహు భాషా కోవిదుడైన నారాయణభట్టు. రాజమహేంద్ర పురంలోని విద్వత్సభల ఆక్షేపణలను ఎదుర్కొని భారతరచనలో - మహాభారతయుద్ధంలో అర్జునునికి శ్రీకృష్ణుని వలె - నన్నయకు బాసటగా నిలచాడు. ఈ విధంగా పదవ శతాబ్దం నాటికే తెలంగాణాలో కావ్యరచనా సమర్థకమైన సాహిత్యభాష నెలకొని వుందనటంలో ఏ విధమైన సందేహమూ లేదు. గోదావరి జిల్లా భాష గురించి గొప్పగా చెప్పకొనే కోస్తాంధ్రేయులు విజ్ఞతతో ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

స్వాతంత్ర్యానంతరం సాంస్కృతికంగా వెనుకబడిన తెలంగాణ

- దా. ఎన్.గోపి

1. పది జిల్లాల భాష ప్రామాణిక భాష కానప్పుడు కేవలం 2 ప్రాంతాల (సీమాంధ్ర) భాషే ప్రామాణికం ఎలా అవుతుంది? బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో భాషాపరంగా భావాలను అణగద్రొక్కినట్లే, నాయకులు తెలంగాణా భాషను తుంగలో తొక్కారు.

తెలంగాణ భాష అంటే మిగతా ప్రాంతం వారికి కేవలం హైదరాబాద్‌లో మాట్లాడుకునేదే, నాయకుల యిళ్ళల్లో పనిపిల్లలు మాట్లాడేదే అనుకుంటున్నారు. కాని తెలంగాణా ప్రాంతాల్లో పర్యటిస్తే ఆ సంస్కృతి - సంప్రదాయాలు - భాష ఎంత ఉందో తెలుస్తుంది.

2. దాదాపు 53 ఏళ్ళ నుండి పాలన సీమాంధ్రదే, పత్రికలు వారివే. అందులోని ప్రామాణిక భాష వారు ప్రచురిస్తున్నదే, సినిమాలు వారివే అందులోని ప్రధాన పాత్రలు, సంభాషణ, ఇతివృత్తం అంతా వారి దగ్గరివే. మాదే అసలైన భాష, మీది మాండలికం అని ముద్ర వేశారు. తెలుగు సినిమాల్లో అధమ పాత్రలు, దుష్ట పాత్రలు తెలంగాణా భాషతో చెప్పించి ఈ ప్రాంతం వారి మనోభావాల మీద దెబ్బ తీసారు.

3. కోస్తా ప్రాంతం వారిని తెలంగాణకు, తెలంగాణా వారిని కోస్తాకు విద్యార్థి బృందాలను పంపాలని ప్రపోజ్ చేశారు. తెలంగాణా సొగసులు పల్లెల్లో ఉన్నాయి, పల్లె జనాల్లో, పల్లె పాటల్లో, బతుకమ్మ పాటల్లో బతుకుతున్నాయి. తెలంగాణా విద్యార్థులు 'బొటానికల్ టూర్'కని కోస్తా ప్రాంతానికి వెళ్ళారు. కాని, అక్కడి వాళ్లెవ్వరూ ఇక్కడికి రాలేదంటే ఎంత న్యూనతా భావమో చూడండి.

ప్రముఖ టి.వి. ఛానల్స్ వాళ్ళవి; ప్రముఖ కవులు రాసిన విషయాలను సాహిత్య చౌర్యం చేసి తలలు తోకలు కత్తిరించి వారివిగా చలామణి చేసు కుంటున్న ఉదంతాలెన్నో వెలుగులోకి వస్తున్నాయి. ఈ (లఫడాలన్నీ) భేదాలన్నీ దృష్టిలో పెట్టుకొని శ్రీకృష్ణ కమీషన్ వారు మా సంస్కృతిని సీమాంధ్ర కలుషితం చేయకుండా కాపాడాలని మనవి.

■ తన ఊళ్ళో తానే పరాయిదైంది
తెలంగాణా పల్లె
గాయపడిన చెల్లె.

(contd...)

■ పొక్కిలైన వాకిలి
నా తెలంగాణా చెక్కిలిపై ఆరని కన్నీటి చుక్క
■ బానిసత్వం ఎవరికీ నచ్చదు,
చివరకు కీటకానికి కూడా.
■ తుఫానుకు తుఫానే విరుగుడు,
బహుశా అది ధైర్యం కావచ్చు, విశ్వాసం.
■ ఎదురుగాలిలోనే పతంగి పైకి లేస్తుంది.
■ మనిషికున్న ఏకైక బలహీనత
పుట్టినగడ్డతో పేగు సంబంధం.
■ అన్ని ఉన్నవానికి
అడుగువాని ఆక్రోషం తెలియదు.
■ అనవరత నిరీక్షణలో ఆలస్యం రాజకీయ విషం.
■ ఏది అచ్చు (తచ్చు)
ఏది హల్లు (హెచ్చు) అని కాదు
రెండు కలిస్తేనే భాష
లేకపోతే అవుతుంది అది అదేదో తమాషా.
■ కలిసి ఉండటం
వేటికైనా అంత తేలిక కాదు,
విడిపోతూ, విడుదలౌతూ
ఐక్యమౌతూ హాయిగా ఉంటూ
నిరంతరం భుజం భుజం కలిసి తిరిగితే
వింత గమనమది,
చిర తపస్సుకు ఫలితంగా
ప్రభవించిన సమ్యక్ చలనమది.
■ ప్రయాణం ముగిసేది కాదు,
వచ్చిన దారే అనుకుంటే ఎలా?
వెళ్లేటప్పుడు మరీ కొత్తగా ఉంటుంది.

■ తెలంగాణ వీరుడా! కారణజన్ముడా!
నీ త్యాగం వృధాపోదు, ఈ యాగం వృధా కాదు
నక్షత్రాల్లా ఆకాశానికెక్కిన అమరవీరులారా!
మిమ్మల్ని కన్న మట్టి విశ్వమంతా పరిమళిస్తుంది.

సాంస్కృతిక రంగంలో కోస్తా ఆధిపత్యం

– జయధీర్ తిరుమలరావు

మనుషుల మధ్య సౌహార్ధత, సహజీవనాలను పెంచేవి, కట్టి ఉంచేవి జాతి, దేశం, సంస్కృతి, భాష, చరిత్ర వంటి కీలకమైన అంశాలే. దేశం, జాతి, భావనలు లేని మన దేశంలో సంస్కృతి, నాగరికత పరంగా మనం ఒక్కటే అనే భావనతో ఐక్యంగా కలిసి ఉంటారు ప్రజలు. ఘనదేశం బహు సంస్కృతుల నిలయం. ఐనా అందరినీ కట్టి పడేసేదీ సంస్కృతి.

ఆంధ్ర–తెలంగాణాలు చారిత్రకంగా వేరువేరు భౌగోళిక ప్రాంతాలుగానే ఉన్నాయి. కాకతీయుల కాలంలో తెలంగాణ బలమైన కేంద్రంగా ప్రభవించింది. అది ఇతర తెలంగాణేతర ప్రాంతాలను పాలించిన రాజులు వైదిక మతాన్ని తిరస్కరించి మొదట జైన, శైవ ఆ తదుపరి మత రాజ్యంగా రూపొందింది. అందువల్ల సాంస్కృతిక ఏకత తెలంగాణ, ఆంధ్రప్రాంతాల మధ్య ఎన్నడూ పొసగలేదు.

మహాభారతం సంస్కృతీకరించి తెలుగు భాషలో కోస్తా జిల్లాల్లో, నన్నయ కవి వెలువరించగా ఓరుగల్లు నగర పరిసరాల్లోని పాలకురికి సోమనాథుడు దేశీ సాహిత్యంలో స్వతంత్రరీతిలో (భాష, ఇతివృత్తం, ఛందస్సు వంటి వాటితో) రచనలు చేశాడు. ఆనాటికది ఒక సాహిత్య విప్లవం. **కోస్తా ప్రాంతం నుండి అధికంగా అనువాద తెలుగు భాషలో మార్గ సాహిత్యం వెలువడగా తెలంగాణా తెలుగు ప్రాంతం నుండి దేశీ సాహిత్యం వెలువడింది.**

అలాగే దేశీయ సంగీతం, కళలు, జానపద సాహిత్యం అధికపాళ్ళలో వెలువడింది. ఇది భాషలో సైతం ప్రతిఫలించింది. తెలంగాణా తెలుగులో అనేక ప్రాచీన భాషా పదాలు, రూపాలు ఈనాటికీ కనిపిస్తాయి. ప్రాచీన కాలంలో ప్రాకృతం, మధ్యయుగాలలో పారసిక భాష, అరబ్బీ భాష, ఆ తరువాత ఉరుదూ భాషలు ఇక్కడ నేలూనుకున్నాయి. ఐనా ప్రజలు తెలుగు భాషను రక్షించుకున్నారు. గోలుకొండ సుల్తానులు, నైజాం రాజుల నుండి కోస్తా ప్రాంతం (1850), దత్త మండలాల పేరుతో రాయలసీమ బ్రిటీష్ వారి పాలనలోకి వెళ్ళాక ఈ రెండు ప్రాంతాల మధ్య అంతరం పెరిగింది. అంతకుముందు ఎలాంటి అంతరాలు లేవు. కృష్ణా గోదావరి ఆనకట్టల నిర్మాణం వల్ల పంటలు బాగా పండాయి. ధనిక రైతాంగ వర్గం ఏర్పడింది. తెలంగాణాలో జాగీర్దార్లు, దొరలు ప్రజలపై శ్రమశక్తిపైనే ఆధారపడ్డారు. సస్యశ్యామలమైన పొలాలు, పంటలు కోస్తాని ఆధునికతవైపు నడిపించగా తెలంగాణా ఎక్కడ ఉన్న పరిస్థితి అక్కడే ఉండింది. కృష్ణా గోదావరులు అధికంగా ప్రవహించి ఎన్నోసార్లు వరదలు, ముంపులకు గురికావడం జరిగింది. ఈ నదుల ప్రవాహం కోసం ఒడ్డులను, దరులను కట్టించి బాగు చేయడానికి నైజాం చాలా ఖర్చు చేశాడు.

కాని పెద్ద ఆనకట్టలు కట్టలేదు. అందువల్ల ఇక్కడ ప్రవహించిన నీరు అక్కడ పంటలై వికసించింది. పంటలు దిగుబడి పెరిగి రాబడి హెచ్చింది. ఆ రకంగా డబ్బు సమకూరింది. దాన్ని దాచుకోవడం కోసం బేంకులు ఏర్పాటయ్యాయి. వడ్డీరేట్లు అందుబాటులోకి వచ్చాయి. అదనపు అప్పులు తీసుకోవడం ఆరంభమైంది. అలా పెరిగిన పెట్టుబడి సినిమా రంగానికి, పత్రికల ఏర్పాటుకు దోహదమైంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నాటికే కోస్తా ప్రాంతంవారు మద్రాసుకి వలస వెళ్ళి అక్కడ ఆధిపత్యం చూపడం ప్రారంభించారు. దాన్ని వ్యతిరేకించిన తమిళులతో పడలేక ఆంధ్రోద్యమాన్ని ప్రారంభించారు. కేవలం కొంతమంది ధనికవర్గం, ఆ తరువాత రాజకీయనాయకుల వల్ల ఈ ఉద్యమం నడిచింది. అదే ధనికవర్గం తెలంగాణా సహా విశాలాంధ్ర కోసం ఉద్యమించారు. అప్పటికే తమిళ ప్రజలచే ఈసడింపబడి అక్కడ ఉండలేక హైదరాబాదు చేరారు. మదరాసులో తమిళభాష, సంస్కృతులను ద్వేషించిన గుణమే ఇక్కడా ఉరుదూ, తెలంగాణా తెలుగుని ఈసడిస్తూనే ఆస్తులు కొన్నారు. వ్యాపారాలు మొదలు పెట్టారు.

తెలంగాణా తెలుగుని వారు నడిపే పత్రికల్లో ఈసడించడం, ఇక్కడి సాహిత్యాన్ని పక్కన పెట్టడం, ఈ ప్రజలకు కవిత్వం, కథ, నవల రాయడం రాదని బహిరంగంగా అనడం పెరిగిపోయింది. వందల ఏళ్ళ వ్యాపార సంస్కృతికి దూరంగా ఉన్న తెలంగాణా తెలుగు సంస్కృతికి కోస్తా వారి వల్ల పరాభవాలు మొదలయ్యాయి. ఇక్కడ చౌకబారు కళలను ప్రచారం చేశారు. సినిమా సంస్కృతి వెర్రితలలు వేసింది.

తెలంగాణా ప్రజల సంస్కృతి కళలు కోస్తావారి వాణిజ్య లాభసాటి కళలకు పోటీ ఏర్పడింది. ఆర్థిక లాభాపేక్షగల కళా వ్యాపారం ముందు ప్రజా సంస్కృతికి అవమానం జరిగింది. సినిమా రంగపు పెట్టుబడి వర్గాలకు కోట్లాది రూపాయల భూమి, బోనస్‌లు, సబ్సిడీలు తెలంగాణా కళాకారులకు కాల్చిన బీడీలు, సిగరెట్ల పన్నులతో సత్కారాలు చేశారు. సుమారు 50 మంది కేంద్ర సాహిత్య అకాడమీ పొందిన వారిలో తెలంగాణాకి చెందినవారు పట్టుమని పదిమంది కూడా లేరు. సాహిత్యం పైనే కాదు సాహిత్య సంస్థలపై కూడా వారి ఆధిపత్యమే ఇంకా నడుస్తోంది.

జానపద కళలు - తెలంగాణ ప్రత్యేకత

- జయధీర్ తిరుమలరావు

భాష, సాహిత్యం, కళారంగాలలో తెలంగాణాకు ఎంతో నష్టం వాటిల్లింది. ఇరవై ఏళ్ళ క్రితం పద్మవిభూషణ్ కాళోజి గారు అన్నట్లు రెండున్నర జిల్లాల (కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి సగం జిల్లాలు) వారి భాష లాగ లేకపోవడం వల్ల తెలంగాణా తెలుగు భాష ఈసడింపుకు లోనైంది. అలాగే ఎంతో విలక్షణమైన జానపద కళలు, చేతివృత్తులు, హస్తకళలు కూడా గుర్తింపునకు నోచుకోలేదు. ఉదాహరణకు- వేల ఏండ్ల నుండి ప్రచారంలో ఉన్న ఒగ్గు కథ, తెరచీర ప్రదర్శన, చిందు ప్రదర్శన, మందహెచ్చు కథలు తెలంగాణేతర తెలుగు ప్రాంతం గుర్తించడానికి నిరాకరించింది.

ఇవేకాకుండా తెలంగాణాలో ఉన్న డక్కలి జాంబపురాణం, నులకచందయ్యల పురాణం, పాండవ కథలు, కాకిపడగ కథలు, గంజికూటి కథలు, బీరన్న కథలు, సాధనాశూరుల విద్య, బతుకమ్మ పాటలు, నృత్యం, దుబ్బు కథ వంటి కళారూపాలు ఎంతో వెనకబడ్డాయి. అందుకు కారణం తెలంగాణ ప్రాంత కళలపై చిన్నచూపు. ఈసడింపులే కారణం.

ఈ కళారూపాలు చాలా వరకు ఉపకులాలకి చెందినాయి. ఈ ఉపకుల వ్యవస్థ తెలంగాణాలో బలీయంగా ఉంది. ఉపకుల వ్యవస్థ (Sub-caste System) అంటే - ప్రతి కులంపై (Patron caste) ఆధారపడి జీవించే కొన్ని ఉపకులాలు ఉన్నాయి. వీరిని ఆశ్రిత కులం (Dependent caste) అంటారు. ఈ ఉపకులం వారు ఆయా కులాలకు కులగాథ, (Caste Mythology) కులపురుషుని (Caste Originator) కథలు చెబుతారు. వీరు గురువులుగా కూడా వుంటారు. వీరిని ప్రాచీన కాలంలో నియమించారు. అందుకు దాఖలాగా వీరివద్ద రాగిపత్రాలు (Copper Plate Inscriptions) ఉన్నాయి. అంతేకాకుండా తాళపత్ర గ్రంధాలు (Palm-leaf Manuscripts) మరియు కాగితం చుట్టలు మరియు రాతప్రతులు (Paper Scrolls and Manuscripts) ఉంటాయి. వీరికి నల్లగొండ జిల్లాలో ఉన్న కొలనుపాక గ్రామంలో మఠాలు కూడా ఉన్నాయి. ఈ సంప్రదాయం తెలంగాణాలో సజీవంగా (Living Tradition) ఉంది. ఇంతటి ప్రత్యేకత తెలంగాణాలో బలంగా నేటికీ కనిపిస్తుంది. ఇతర ఆంధ్ర ప్రాంతాలలో ఈ వ్యవస్థ లేదు. ఉన్నా అది చాలాచోట్ల నామరూపాలు లేకుండా పోయింది. అక్కడక్కడ కొద్దిమంది ఉపకులాలవారు కనిపించినా వారికి ఆ ప్రాంతాల్లో ఆదరణ లేదు. తెలంగాణా ప్రాంతం నుండే ఈ ఉపకులాల గురువులు, ప్రదర్శకులు వారికి హక్కు (Right) ఉన్న పట్టీ గ్రామాలకు (Deed of Right in 40 villages) వెళ్ళితే వీరి తెలంగాణ భాష విని దూరం కొడుతున్నారు. ఈ విధంగా జానపద కళల్లో ఉన్న కళా ఔన్నత్యం (Art Potentiality) ని గుర్తించకపోవడం, జానపద కళాకారుల హక్కులను కాలరాయడం మూలంగా తెలంగాణ ప్రాంతంలోని జానపద కళలపై వివక్ష (Apartheism) కొనసాగుతున్నది.

తెలంగాణా సంస్కృతి, చరిత్ర, జీవన విధానం - ప్రత్యేకం

- కె.శ్రీనివాస్

భాషలో యాసలో తేడాలనేవి ప్రాంతాల వారీగానే కాదు, జిల్లాలవారీగా, కొన్నిచోట్ల రెవిన్యూ/రాజకీయ మండలాల వారీగా, కులాల వారీగా కనిపిస్తాయి. వ్యక్తివ్యక్తికి కూడా పదజాలంలో, వ్యక్తీకరణలో, యాసలో తేడాలు ఉంటాయని భాషాశాస్త్రజ్ఞులు చెబుతుంటారు. అయితే, వ్యక్తి మాండలికాలు, వృత్తి మాండలికాలు, మండల మాండలికాలు - వీటిలో వ్యత్యాసాలు తక్కువ సామ్యం ఎక్కువా అయినప్పుడు అవి ఒక పెద్ద మాండలికంలో భాగంగా పరిగణిస్తాము. ఆ కారణంగానే, అంతర్గతంగా కొన్ని తేడాలు ఉన్నప్పటికీ, సామ్యాలు అధికంగా ఉండడం వల్ల తెలంగాణా వ్యవహార భాష అంతటినీ కలిపి ప్రాంతం మాండలీకంగా వ్యవహరిస్తున్నాము. భాషతో పాటు, ఆచార వ్యవహారాలు, ఆహార్యం, పండుగలు, మర్యాదలు, దేవతలు - మొదలైన అంశాలలో అంతర్గత సామ్యాలు ఎక్కువ ఉన్నందున తెలంగాణ ప్రాంతానిది ఒక ప్రత్యేక సంస్కృతి అంటున్నాము. ప్రత్యేక అన్న విశేషణాన్ని ఇక్కడ గమనించాలి. విభిన్నత కాదు, ప్రత్యేకత.

1. తెలంగాణ ప్రాంతానికి తెలుగు మాట్లాడే ఇతర ప్రాంతాలకీ మధ్య సాంస్కృతిక భేదాలు అసంఖ్యాకం. అయితే, ఈ తేడాలను వేరువేరుగా చూసి లెక్కవేయడం కంటె, తేడాలను అర్థం చేసుకోవడానికి ఉపకరించే ప్రాతిపదికలను, సూత్రాలను గుర్తించడం ముఖ్యం. తేడాలు, ప్రత్యేకతలన్నిటి మధ్య ఏదైనా ఒక అంతస్సూత్రం ఉన్నదా, వాటన్నిటినీ ఒక చట్రంలో పెట్టి చూడవచ్చా - అన్నవి ఇక్కడ ప్రశ్నలు. దీనికోసం తెలంగాణ చరిత్రలోని విశేషాలను, జీవన విధానంలోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

2. తెలుగు వారి చరిత్రకు సంబంధించి కొన్ని తేడాలు కనిపిస్తాయి. శాతవాహనుల తరువాత కాకతీయుల కాలం వరకు మధ్యలో రాజ్యాల గురించిన సమాచారం స్పష్టంగా దొరకదు. ఈ కాలంలో నేటి ఉత్తర తెలంగాణ ప్రాంతం ఎక్కువ నేటి ఉత్తర కర్ణాటక, దక్షిణ మహారాష్ట్ర ప్రాంతాల రాజకీయ ప్రభావంలో ఉండేవి. అలాగే, కాకతీయ రాజరికం ఎట్లా ఎప్పుడు ప్రారంభమైంది స్పష్టంగా తెలియదు. అలాగే, ఉత్తరాంధ్రగా నేడు చెబుతున్న ప్రాంతం కళింగ రాజకీయాల ప్రభావం కిందనే దీర్ఘకాలం కొనసాగింది.

3. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న ప్రాంతం అంతా ఒకే రాజకీయ అధికారంలో కేవలం మూడు నాలుగు వందలేళ్ళు మాత్రమే ఉన్నదని అంతా అంగీకరిస్తున్నారు. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అతి కొద్దికాలం మొగలాయి ప్రత్యక్ష పాలనల్లో మాత్రమే తెలుగుభాషా ప్రాంతాలు ఒకే పాలన కింద ఉన్నాయి. ఇక్కడ ఒక విశేషం ఉన్నది. కాకతీయులు, కుతుబ్‌షాహీలు ఇద్దరూ తెలంగాణ కేంద్రంగా దాదాపు దక్షిణ భారతమంతా పాలించారు. తెలంగాణేతర ప్రాంతం రాజధానిగా ఉన్న రాజ్యంలో తెలంగాణ ఎప్పుడూ లేదు. తెలుగు భాషాభిమానానికి, వైభవానికి చిహ్నంగా పరిగణించే విజయనగరం సామ్రాజ్యంలో తెలంగాణ ఎప్పుడూ భాగం కాదు. తుంగభద్ర, కృష్ణకు ఎగువన ఉన్న తెలుగు ప్రాంతాల్లో ఇతర తెలుగు ప్రాంతాల ప్రాబల్యం ఎప్పుడూ లేదు.

4. నైసర్గికంగా తెలంగాణకు కృష్ణ, తుంగభద్ర, గోదావరి లోయ దక్షిణాన సహజ సరిహద్దులుగా ఉన్నాయి. ఉత్తరాన కానీ, పశ్చిమాన కానీ అటువంటి సరిహద్దులు లేకపోవడం వల్ల కన్నడ, మహారాష్ట్ర ప్రాంతాలతో తెలంగాణకు సాంస్కృతిక వినిమయం అధికంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ అనేది రాజకీయంగా ఏర్పడిన కొత్త రూపమే తప్ప, భౌగోళికంగా ఇప్పటికీ సందర్భోచితంగా కనిపిస్తున్న 'దక్కన్' అస్తిత్వంలోనే తెలంగాణ దీర్ఘకాలం కొనసాగింది. నర్మద, తుంగభద్ర నదుల మధ్య ఉన్న భూభాగమే దక్కన్. ఇది బహుభాషా భూభాగం. సామ్రాజ్య నిర్మాణాలకు అనువైన భౌగోళిక రూపంగా దక్కన్ కొనసాగింది. రెండువందల సంవత్సరాల పాటు కొనసాగిన బహుభాషా రాజ్యం 'హైదరాబాద్' దక్కన్‌కు రాజకీయరూపం.

5. తొలిదశలోనే బౌద్ధం ప్రభావంలో ఉండిన తెలంగాణం (అందులోనూ ఉత్తర తెలంగాణం)లో వైదిక మత ప్రభావం స్వల్పం. ఇక్కడ వైదిక మతం ఏర్పడిన తరువాత బౌద్ధజైనాలు ప్రవేశించాయా, లేక వైదికమే తరువాత ప్రవేశించిందా, రెండూ ఒకే కాలంలో ప్రవేశించాయా అన్నది ఇంకా తేలవలసి ఉన్నది. కాకతీయ రాజ్యానికి దూతగా వచ్చిన తిక్కన సోమయాజి తెలంగాణలో జైనులతో వాదోపవాదాలు చేశాడని చెబుతారు. కాకతీయులు శైవులైనప్పటికీ, జైనాన్ని ఆదరించారని చెబుతారు. తెలంగాణలో ఉన్న శైవం అనతికాలంలోనే వీరశైవంగా కూడా పరివర్తన చెందింది. అంటే, దీర్ఘకాలంనుంచి ప్రత్యామ్నాయ ధర్మాలను అనుసరిస్తూ వచ్చిన తెలంగాణలో వైదిక మతం ప్రభావం సాపేక్షికంగా తక్కువ. ఫలితంగా – తెలంగాణ నుంచి సామాజిక కవులు, ఉద్యమాలు అధికంగా వచ్చి ఉంటాయి.

6. శైవం తరువాత ఇక్కడ ప్రవేశించిన మతం ఇస్లాం, కుతుబ్‌షాహీలు షియాలు. వారి పాలనలో మతపరివర్తనలు చెప్పుకోదగినంతగా జరగలేదు కానీ, షియా సంస్కృతి తెలంగాణ గ్రామాలకు, అట్టడుగు ప్రజానీకానికి కూడా పాకిపోయింది. ఇస్లాం

పాలన కారణంగానో, మరే కారణంగానో తెలంగాణనుంచి సాంప్రదాయ బ్రాహ్మణ వర్గాలు నిష్క్రమించడమో, వలస పోవడమో జరిగింది. అదే సమయంలో దక్షిణాది నుంచి శ్రీ వైష్ణవ సంప్రదాయం తెలంగాణకు వలస వచ్చింది. రామానుజ మతానికీ ఇస్లాంకూ ఉన్న కొన్ని సారూప్యాలు అందుకు కారణం కావచ్చు. భక్తి సంప్రదాయం బలంగా ఉండడం వల్ల, యజ్ఞయాగాది తతంగాలకీ, సాంప్రదాయ పౌరోహిత్యానికీ తెలంగాణలో ఆదరణ పెద్దగా లేకపోయింది.

7. వైదిక మత ప్రభావం తక్కువ కావడం వల్ల, ఆదిమ మత సంస్కృతులు ఇంకా సజీవంగానే ఉండడం వల్ల తెలంగాణలో రకరకాల జాతరలు, ఆచారాలు విభిన్నమైన రీతిలో కనిపిస్తాయి. బతుకమ్మ వంటి పండుగ కేవలం తెలంగాణకే పరిమితం. దసరా, హోళీ తెలంగాణ ప్రాంతంలో ఉత్సాహంగా జరుపుకునేవి కాగా, తక్కిన తెలుగు ప్రాంతాల్లో సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, కృష్ణాష్టమి వేడుకలు.

8. పీఠభూమి, మెట్టప్రాంతం కావడం వల్ల తెలంగాణ ప్రాంత పుష్పఫల జాతులు, పంటలు, సేద్య పద్ధతులు, సాగునీటి విధానాలు వేరువేరుగా కనిపిస్తాయి. చెరువుల వ్యవసాయంలో రాయలసీమతో కొన్ని పోలికలు కనిపిస్తాయి కానీ – అనుబంధంగా ఉండే సాంస్కృతిక విశేషాలలో అనేక వ్యత్యాసాలు ఉన్నాయి.

ప్రత్యేకత తెలంగాణా చరిత్రలోనే ఉన్నది

– కె.శ్రీనివాస్

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలన్న ఆకాంక్ష మళ్ళీ బలపడుతున్నది. దాని ప్రతిధ్వనులు రాజకీయరంగంలో తీవ్రంగానే వినిపిస్తున్నాయి. తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నిటినీ కలిపి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు చేసినప్పటినుంచి జరిగిన అన్యాయం వల్లా, అభివృద్ధిలో అసమానతల వల్ల మాత్రమే తెలంగాణాలో ప్రత్యేకతా భావన ఏర్పడిందని చాలామంది అనుకుంటారు. కానీ, అది వాస్తవం కాదు. అసమానతల వల్ల విడిపోతామన్న కోరిక బలపడి ఉండవచ్చును కానీ, సాంస్కృతికంగా, చారిత్రకంగా తెలంగాణాకు ప్రత్యేక అస్తిత్వం ఉన్నది. తెలంగాణాకు ఆధునిక అభివృద్ధిలో న్యాయమైన భాగం దొరకనట్టే, తెలుగువారి చరిత్ర పుస్తకాల్లో కూడా తగిన పరిగణన దొరకలేదు. తెలంగాణా అంటే స్వాతంత్ర్యానికి పూర్వం అంధకారంలో మగ్గిపోయిన ఒక ఫ్యూడల్ రాజ్యం అనీ, దొరతనమూ వెట్టిచాకిరీ తప్ప మరేదీ తెలంగాణాలో ఉండేది కాదనీ ఒక అభిప్రాయం బలపడిపోయింది. తెలంగాణా చరిత్ర తెలుగు వారందరికీ తగినంతగా తెలిసి ఉన్నట్టయితే, తెలంగాణా వారు ఇవాళ కొత్తగా విడిపోవాలని కోరుకోవడం లేదని, ఒకనాటి తమ ప్రతిపత్తిని పునరుద్ధరించమని మాత్రమే కోరుకుంటున్నారని సులువగా అర్థం అయ్యేది.

1940 కంటే ముందు అంతా అంధకారం

తెలంగాణా చరిత్రను 1940లనుంచే చెప్పుకోవడం మనకు అలవాటయిపోయింది. (ఇక్కడ చరిత్ర అంటే పాఠ్యపుస్తకాలలో రాసిన చరిత్ర కాదు. రాజకీయ అవగాహనలో భాగంగా చదువుకునే చరిత్రల్లో, రాజకీయ సామాజిక సాంస్కృతిక అవగాహనకు ప్రాతిపదికలుగా రాసుకున్న చరిత్రల్లో తెలంగాణా 1940లనుంచే మొదలవుతుంది. ఆ చరిత్రల ప్రకారం అంతకుముందు ఇక్కడ పెద్దగా చెప్పుకోదగినది ఏమీ లేదు, అంధకారం తప్ప.)

తెలంగాణా రైతాంగ పోరాటానికి బీజాలు పడ్డప్పటినుంచి మాత్రమే తెలంగాణాకు ప్రధాన స్రవంతి చరిత్రలో స్థానం లభిస్తున్నది. తెలంగాణాను అంతర్జాతీయంగా సుప్రసిద్ధం చేసిన, దేశదేశాల ప్రజాపోరాటాలకు ప్రేరణగా మార్చిన రైతాంగ సాయుధ పోరాటం ఇక్కడి ప్రజానీకానికి ప్రేమాస్పదమయిన జ్ఞాపకం మాత్రమే కాదు, కొనసాగుతున్న చరిత్ర కూడా. కానీ, తెలంగాణా పోరాట సంస్కృతి, ఇక్కడి సామాజిక వ్యవస్థ, ఇక్కడి ప్రజల నమ్మకాలు, ఆచారాలు, భాష అన్నీ వందలాది యేళ్ళ గతంలో నిర్మితమయ్యాయనేది విస్మరించరానిది. తెలంగాణాకున్న సుదీర్ఘ ప్రత్యేక చరిత్ర ఉజ్జ్వలమైనది, ఉత్తేజకరమైనది.

పశ్చిమ దేశాల వారు తమ చరిత్రనే ప్రపంచ చరిత్ర చేశారు. బెంగాల్ వారు తమ పునరుజ్జీవనాన్నే భారతజాతి పునరుజ్జీవన మన్నారు. బ్రిటీష్ ఆంధ్రజాతీయవాది కూడా తన అస్తిత్వానికి సంబంధించిన వంశచరిత్రనే రాసుకున్నారు. భారతదేశంలో 19వ శతాబ్ది చివరి భాగంలో జరిగిన చరిత్ర రచనా ఉద్యమాన్ని పరిశీలిస్తే అది ఆనాటి పాలకులు కల్పించిన ప్రాథమిక వ్యవస్థల మీద ఆధారపడి, వారి హేతువాదానికి లోబడి, వారు కల్పించిన ప్రమాణాలకు అనుగుణంగా జరిగిన ఉద్యమం అని అర్థమవుతుంది. ఆ చరిత్రలన్నిటిలో తెలంగాణాకు, తెలంగాణా వంటి అనేక దేశీయ రాజ్యాలకు పరాయి పరిగణనమే దొరికింది. ఈ నేపథ్యంలో తెలంగాణా చరిత్రను తిరిగి పరిశీలించవలసిన అవసరం ఉన్నది.

ఢిల్లీ మీద పోరాడిన ప్రతాపరుద్రుడున్నాడు, ప్రతాపరుద్రుని ఎదిరించిన సమక్క సారక్కలున్నారు, బహమనీల మీదనే కాదు, కృష్ణరాయలమీద కూడా పోరాడిన షితాబుఖానుడున్నాడు, విజయనగర రాజ్యాన్ని పతనం చేసిన కుతుబ్‌షాహిలు మొగలుల్ని ఎదిరించిన వీరగాధలున్నాయి, కోటను ప్రాణంలా కాపాడిన అబ్దుల్ రజాక్‌లారీ ఉన్నాడు, శివాజీతో పొత్తు పెట్టుకున్నందుకే కాదు, దక్షిణాదిలో ఒక కొత్త మిశ్రమ సంస్కృతిని పోషిస్తున్నందుకు ఔరంగజేబు ఆగ్రహానికి గురి అయి, రాజ్యం కోల్పోయిన బహదూర్‌షా జాఫర్‌లాగా బందీగా మరణించిన అబుల్ హసన్ తానీషా ఉన్నాడు, అతన్ని ధిక్కరించిన కంచెర్ల గోపన్న ఉన్నాడు. గోల్కొండను ఏడుగడియలు పాలించిన సర్వాయి పాపడున్నాడు, నిజాంను ఎదిరించి ఆ తరువాత మరాఠాల మీద పోరాడిన రాణి శంకరమ్మ ఉన్నది, రెసిడెన్సీమీద దండునడిపిన తుర్రెబాజ్‌ఖాన్ ఉన్నాడు, పోరాడి మరణించిన రాంజీగోండు ఉన్నాడు, పండగశాయన్న ఉన్నాడు, కొమురం భీం ఉన్నాడు, యూనియన్ సైన్యాలచేతిలోనే మరణించిన నక్కారాములున్నాడు. వీరందరూ వ్యక్తులు మాత్రమే కాదు, ఆ కాలాలను కుదిపివేసిన ఆకాంక్షలకు ప్రతినిధులుగా వారు వ్యవహరించారు. చరిత్రకు కొదవేమీ లేదు. చెప్పని చరిత్ర, కప్పిపుచ్చిన చరిత్ర, తక్కువ చేసి చెప్పిన చరిత్ర తెలంగాణాకు చాలానే ఉన్నది.

తెల్లబందిపోట్లు పిప్పిచేసిన తెలంగాణా

దక్కన్ భూభాగంలో తెలుగు మాట్లాడే ప్రజలనేల తెలంగాణా. కనీసం నాలుగువందలేళ్లనుంచి ఉన్నమాట తెలంగాణా. తెలుగు మాట్లాడే ఇతర భూభాగాల ప్రజలకు భిన్నమయిన పాలనావ్యవస్థలో ప్రత్యేక చరిత్రను, ప్రత్యేక సంస్కృతిని నిర్మించుకున్న జాతి తెలంగాణా. కాకతీయుల కాలంలోనే రూపొందడం ప్రారంభమయిన ప్రస్తుత తెలంగాణా అస్తిత్వం, బహమనీ పాలకులు, కుతుబ్‌షాహీలు, ఆసిఫ్‌జాహిల పాలనలో క్రమంగా స్థిరపడింది. ఎడతెగని యుద్ధాల వేదికగా

కష్టాలపాలయింది. ఉత్తర భారత దండయాత్రలనుంచి దక్షిణాదికి కోటగోడగా నిలబడింది. మొగలులు గోల్కొండలో కొల్లగొట్టిన ఖజానా, మహారాష్ట్రులు వసూలు చేసిన చౌత్, బ్రిటిష్–ఫ్రెంచ్ యుద్ధాలకు పెట్టవలసి వచ్చిన పెట్టుబడి, సైన్యసహాయనిధి పేరిట బ్రిటిష్ పాలకులు మోపిన సైనికభారం తెలంగాణా రైతులను పీల్చి పిప్పిచేశాయి. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థిరపరచడానికి నిజాంలు తమ స్వాతంత్ర్యాన్ని వదులుకోవలసివస్తే, తెలంగాణా రైతు తన నెత్తుటితో, చెమటతో కప్పం కట్టుకున్నాడు. మొగలాయి జాగీర్దారీ వ్యవస్థ తెలంగాణా గ్రామీణుడిని పరాధీనుడిగానూ, అతి హీనమయిన బాంచగానూ మార్చింది. మధ్య ఆసియా నుంచి మొగలు ఆస్థానం మీదుగా దక్కన్‌కు వచ్చిన పాలకులకు తోడుగా వచ్చిన పఠాన్లు, అరబ్బులు, రోహిల్లాలు, కాయస్థులు, మహారాష్ట్రులు, లోధీలు, కన్నడిగులు, ఉత్తరాది ముస్లిములు – ఎందరెందరో తెలంగాణాకు వచ్చి స్థిరపడ్డారు. అతి సుందరమయిన, అత్యద్భుతమయిన హైదరాబాద్‌ను నిర్మించడానికి సర్వందోచి ఇచ్చిన తెలంగాణాతో ఏ సంబంధమూ లేని పరదేశి రాజకీయ పాలక వర్గం ఇక్కడ ఏర్పడింది. పేష్కష్ చెల్లిస్తే చాలు, జ్యుడిషియల్ పోలీస్ అధికారాలతో సహా సర్వంసహాధికారాన్ని తమ తమ ఇలాకాలలో చెలాయించుకునే అవకాశం ఉన్న సంస్థానాధీశులు జాగీర్దారులు, దేశముఖులు, మక్తేదారులు, భూస్వాములు నైజాం రాజాన్యినికి మూలస్తంభాలుగా మారారు. వీరిలో తెలుగువారు రాజకీయ పలుకుబడిలో, అధికారంలో ద్వితీయ స్థానంతోనే తృప్తిపడినా, రైతులను హింసించడంలో మాత్రం ప్రథమ స్థానంలో వున్నారు. తెలంగాణా గ్రామం ఎడతెగని దోపిడీకి, దుఃఖానికి మారుపేరుగా మారిపోయింది.

ఈ మొత్తం పరిణామాలలో తెలంగాణా జనం మౌన ప్రేక్షకులుగా ఉండిపోలేదు. తమ జీవనాన్ని మెరుగుపరుచుకో వడానికి తమ ప్రయత్నాలు తాము చేశారు. పోరాడారు, సర్దుకున్నారు, ఇతర ఉపశమన మార్గాలు వెదుక్కున్నారు, మతాలను ఆశ్రయించారు, తిరుగుబాటును వరించారు.

ఈ నేపథ్యంలోనే తెలంగాణా సంస్కృతి కూడా రూపొందింది. రాజకీయ అస్థిరత, అభద్రతల మధ్యనే ప్రజా జీవనం తన దారిని వేసుకుంది. రకరకాల పరాయి జాతుల వారితో కలిసి ఒక ఉమ్మడి సంస్కృతిని కూడా నిర్మించుకుంది. భోగపరాయణ మయిన వైష్ణవాన్ని వరించింది. నిరాడంబరతను బోధించే శైవాన్ని ఆదరించింది. వీరులను కీర్తించింది. కీర్తనకారులను, బ్రాహ్మణేతర కవులను ఆదరించింది. భూస్వామ్య నిర్బంధం మాటునే గ్రామ సమాజం కల్పిస్తున్న భద్రతను స్వీకరించింది. పీడకునిలో పోషకుణ్ణి కూడా చూసింది. కంటకులను కడతేర్చి గద్దెనెక్కే కొత్త పాలకులకు హారతులు పట్టింది. శ్రమఫలితాన్ని ధారపోస్తే – ఆపైన తక్కిన సాంస్కృతిక, మత జీవనంలో రాజ్యం కల్పించిన పరిమిత స్వేచ్ఛను అనుభవించింది.

నిజాం రాజ్యంలో ఇంగ్లీషువాడికి పీఠం ఏర్పడినాక, వ్యాపార అవసరాల కోసం, పరిపాలక అవసరాల కోసం రకరకాల సాంప్రదాయ ప్రజాశక్తులను అణచివేయడం మొదలయింది. పిండారీల ఊచకోత దగ్గరనుంచి, తిరుగుబాట్లు చేసిన చిన్న చిన్న దేశముఖుల, జాగీర్దారుల అణచివేత దాకా అది కొనసాగింది. పాలనాపరంగా ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలకు బాధ్యత వహించని బ్రిటీష్‌వారు హైదరాబాద్ రాజ్యంనుంచి ధనం పిండడమే పనిగా పెట్టుకున్నారు. 1800-1850 మధ్యకాలంలో బ్రిటీష్‌వారు ఈ ప్రాంతంలో చేసిన యుద్ధాలన్నిటినీ హైదరాబాద్ రాజ్యమే భరించింది. హైదరాబాద్ పాలకుడిని నిరాయుధుడినిచేసి, అతనికి ఏమాత్రం పనికిరాని పెద్ద సైన్యాన్ని నెత్తిమీద మోసి, అప్పుల పాలయిన ప్రభుత్వానికి వడ్డీలకి అప్పులిచ్చి, సారవంతమయిన భూములున్న ప్రాంతాలను కబళించి, పన్నుల వసూలుకోసం కాంట్రాక్టులు తీసుకుని – బ్రిటీష్‌వారు ఇక్కడి ప్రజలను పీల్చిపిప్పి చేశారు. హైదరాబాద్ రాజ్యంలో జాగీర్దారులు, పాయెగాలు మొదలైన భూస్వామ్య కులీనవర్గాలవారు ప్రజాకంటకులుగా మారిపోవడంలో ఈ నేపథ్యం అంతా పనిచేసింది. రాజ్యానికి కావలసిన ధనాన్ని పోగుచేయడం, అందులో తమ వాటా తీసుకోవడం – ప్రతిఫలంగా తమ ప్రాంతాలలో ప్రజల మానప్రాణాల మీద తిరుగులేని అధికారం చాలామంది జాగీర్దారులను, దేశముఖులను నరహంతకులుగా తీర్చిదిద్దాయి. మరోవైపు మొదటి స్వాతంత్ర్య సమరంలో క్రియాశీలంగా పాల్గొన్న రోహిల్లాలను, అరబ్బులను శిక్షించి, రాజ్యంలో శాంతిభద్రతలను స్థాపించామని నమ్మకం కలిగాక బ్రిటీష్ ఇండియా తరహా సంస్కరణలను ప్రారంభించారు. హైదరాబాద్ రాజ్యంలో పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టిన సాలార్‌జంగ్ 1857 తిరుగుబాటు దారులను పట్టి బ్రిటిష్ రెసిడెంట్‌కు అప్పగించిన ఆంగ్లభక్తుడు. అతని హయాంలోనే భూములనుంచి వచ్చే ఆదాయాన్ని క్రమబద్ధీకరించడానికి, ప్రమాణీకరించడానికి ల్యాండ్ సెటిల్‌మెంట్ జరిగిన రైత్వారీ ప్రాంతాలలో కూడా భూముల మీద రైతులకున్న సాంప్రదాయ హక్కులు పోయి, దేశముఖుల, మఖ్తేదారుల ఆధిపత్యం వచ్చింది. వ్యక్తిగత కమతాల ప్రవేశం పెద్ద సంఖ్యలో చిన్న, మధ్యతరహా రైతాంగాన్ని సృష్టించవలసినదిపోయి వేలాది, వందలాది ఎకరాల భూస్వాములను సృష్టించింది. ఈ భూస్వాముల అవతరణ క్రమం లోనే సుప్రసిద్ధమయిన 'అంధకార తెలంగాణా' ఏర్పడింది. తరతరాలుగా సాగుచేసుకుంటున్న రైతులను కేవలం కౌలుదారులుగా, కూలీలుగా మార్చే ప్రక్రియలో జరిగిన హింసే ఆ తరువాత పోరాటాలకు ఇంధనం అయింది.

హైదరాబాద్ రాజ్యంలో సంస్కరణలు, మార్పులు

తెలంగాణా గ్రామం ఎలా ఉన్నా, నైజాం పరిపాలనా యంత్రాంగం 1860ల నుంచీ క్రమంగా పెరుగుతూ వస్తోంది. రకరకాల శాఖలు ఏర్పడ్డాయి. అందుకోసం అనుభవజ్ఞులైన, విద్యావంతులయిన ఉద్యోగులు కావలసివచ్చారు. ఉద్యోగులను

తయారు చేసుకోవడానికి విద్యాసంస్థలు కావలసి వచ్చాయి. అప్పటిదాకా రాజభాషగా ఉన్న పర్షియన్, అరబిక్‌లను కాదని దేశీయభాషను అధికారభాష చేశారు. హైదరాబాద్ రాజ్యంలో రెండువైపులా బ్రిటీష్ ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన రైలు మార్గాలు రాకపోకలకు కొత్త అర్థాలకు ఇచ్చాయి. రాజ్యవ్యవస్థకు మూలస్తంభాలుగా ఉన్నవారిలో తెలంగాణా స్థానికులు కూడా ఉన్నప్పటికీ, ప్రభుత్వంలో, రాజకీయ నిర్ణయాలలో వారి ప్రమేయం నామమాత్రంగా వుండడం వల్ల, ఉర్దూలో అయినప్పటికీ చదువుకున్న తెలంగాణా వారి సంఖ్య క్రమంగా పెరగడం వల్ల, ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారి సాహచర్యం వల్ల – తెలంగాణా వారిలో కొత్త ఆకాంక్షలు మొదలయ్యాయి. తాము కూర్చుని మాట్లాడుకోవడానికి, చదువుకున్న విషయాలను పరస్పరం పంచుకోవడానికి గ్రంథాలయాలు కావలసి వచ్చాయి. ఒక సరికొత్త ప్రజాజీవనాన్ని సృష్టించుకోవడానికి ప్రేరణగా గతచరిత్ర కావలసివచ్చింది. ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ రాజ్యంలోని తెలుగువారిని ఒక ప్రత్యేక ప్రజాసమూహంగా గుర్తిస్తూ వారి తరపున మాట్లాడడానికి ఆంధ్రజన సంఘాలు ఏర్పడ్డాయి. అవి క్రమంగా ఆంధ్రమహాసభగా పరిణమించాయి. సమాంతరంగా తెలంగాణాలో వివిధ కులసంఘాలు, సామాజిక సంఘాలు ఏర్పడ్డాయి. ఈ సంఘాలూ ఆంధ్రమహాసభా సమన్వయంతో పనిచేయడం ప్రారంభించాయి. తెలంగాణా వారి ప్రాతినిధ్య సంస్థగా పనిచేసిన ఆంధ్రమహాసభ అప్పటికున్న వివిధ, విభిన్న, విరుద్ధ శక్తుల ఉమ్మడి వేదికగా కనిపిస్తుంది. నాయకత్వం, మార్గదర్శకత్వం కల్పించమని కోరినా బ్రిటీష్ ఇండియా ప్రజా ఉద్యమ నాయకత్వం నిరాకరించింది. ప్రభావశీలమయిన మధ్యతరగతి ఏర్పడని తెలంగాణాలో ఆంధ్రమహాసభ ఉద్యమం భవిష్యత్తు గురించిన స్పష్టమయిన ప్రణాళికను వేసుకోలేకపోయింది. పెరుగుతున్న ప్రజా చైతన్యానికి, కరుడుగట్టిన భూస్వామ్యానికి మధ్య ఘర్షణ ఏర్పడి ఆంధ్ర మహాసభ చీలిపోయింది.

నిజానికి ఆంధ్ర మహాసభ మాత్రమే తెలంగాణాలోని అధిక సంఖ్యాకుల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించగలిగే స్థితిలో ఉండింది. దాని రాజకీయ సరిహద్దులు హైదరాబాద్ రాజ్యానికి మాత్రమే పరిమితం అయి ఉండడం వల్ల, సమాజంలోని అనేక సామాజిక వర్గాలను కలుపుకొని పోయే స్వభావం ఉండినందువల్ల దానిని తెలంగాణా జాతీయవాద స్వభావం రూపొందే అవకాశం ఉండేది. కోస్తాఆంధ్రలో బ్రిటీష్ ప్రభుత్వం అమలుచేసిన పాలనా చర్యలకు తోడుగా బలమయిన సాంఘిక, సాంస్కృతిక ఉద్యమం ఉండడం వల్ల అక్కడ అనేక ప్రాథమిక సదుపాయాలు చాలావేగంగా ఏర్పడ్డాయి. తెలంగాణాలో అటువంటి ప్రాథమిక సదుపాయాల కోసం ఒంటరిగా ప్రయత్నించవలసి వచ్చింది. ఆ ప్రయత్నాలకు ఉద్యమరూపం ఇచ్చేంత శక్తి ఉన్న బలమయిన కమ్యూనిటీ గాని, ఆకాంక్షావర్గం

కానీ తెలంగాణాలో లేకపోవడం వల్ల, ఒక ప్రత్యేకమయిన భూస్వామ్య వర్గం ఆంధ్రమహాసభలో కూడా క్రియాశీలంగా ఉండడం వల్ల ఉద్యమం తీర్మానాలకే పరిమితం అయింది. అయితే, తీర్మానాలే అయినా అవి ఇక్కడి ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షలను బలంగా ప్రతిఫలించాయి. తెలంగాణాలో నాడు నిర్మించిన ప్రాజెక్టుల కింద వ్యవసాయం చేయడానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలతో బ్రిటీష్ ఆంధ్రరైతులను నిజాం ఆహ్వానించినప్పుడు ఆంధ్రమహాసభ దాన్ని వ్యతిరేకించింది.

బ్రిటీష్ ఇండియానుంచి ఉద్యమ సహకారం ఏమీ లభించక పోయినా, అక్కడి రాజకీయ పరిణామాలు హైదరాబాద్ రాజ్యం మీద ప్రభావం వేస్తూ వచ్చాయి. ఇక్కడి సంస్కృతిలో భాగమయిన మతసహనం విచ్ఛినమై పోయింది. ప్రజల రాజకీయ ఆకాంక్షలకు ఏ వేదికా లేకుండా చేయాలన్న నిరంకుశ ధోరణుల కారణంగా ప్రజలమధ్య రగులుతున్న అవిశ్వాసాలు క్రమంగా పెరిగిపోసాగాయి. స్వతంత్ర భారతదేశంలో భాగం అయ్యే హైదరాబాద్ రాజ్యంలో తమ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ముస్లిములను వేధించసాగింది. ఇంగ్లీషువారు నిర్మించిన చరిత్ర రచనా ధోరణీ, వర్తమాన పరిస్థితీ కలసి ఇక్కడ ముస్లిమేతరులలో మతధోరణులను పెంపొందించాయి. ఇత్తెహాదుల్ ముసల్మీన్ అవతరణ హైదరాబాద్ రాజకీయ వాతావరణాన్నే మార్చివేసింది. నిజాం అధికారానికి ఒక ప్రజాభూమికను ఏర్పాటు చేయడానికి జరిగిన ప్రయత్నం విపరీత పరిణామాలకు దారితీసింది. ఈ పరిస్థితులలో వివేకవంతంగా పరిస్థితిని చక్కదిద్దగల నాయకత్వం కొరవడింది.

మరోవైపు బ్రిటీష్ ఇండియాలోని ఆంధ్రలో జాతీయోద్యమం తో పాటు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రవాదం బలపడింది. ఆంధ్రజాతివాదం రూపుదిద్దుకుంది. తెలంగాణాలోని 'ఆంధ్రోద్యమం' మీద కూడా దాని ప్రభావం కొద్దికొద్దిగా కనిపించసాగింది. బ్రిటీష్ ఇండియాలో ఎదిగిన కోస్తా ఆంధ్రవారి సాహచర్యం ఎలా ఉంటుందో అప్పుడే తెలంగాణా వారికి అనుభవంలోకి రాసాగింది. కానీ, తెలంగాణాలో అప్పుడప్పుడే తలెత్తుతున్న మధ్యతరగతిని కలిపి ఉంచగలిగిన భావన, సహాయానికి రాకున్నా చెప్పుకోవడాని కయినా కొంత అండ ఉంటుందన్న ఆశ ఆంధ్రత్వం మీద భ్రమలు పెంచుకునేట్టు చేశాయి.

ఒక రాజ్యం అంతరించింది, ఒక రాష్ట్రం ఏర్పడింది

బాధ్యతాయుత ప్రభుత్వం నినాదంతో కొద్దికొద్దిగా పుంజుకుంటున్న హైదరాబాద్ ప్రజా ఉద్యమం ఇంకా పూర్తిగా బలపడకముందే – భారతదేశానికి స్వతంత్రం వస్తున్న సూచనలు నిజాం ధోరణిని ప్రభావితం చేశాయి. రజాకార్లు అవతరించారు. మరోవైపు ఆంధ్రమహాసభ చీలిపోయి, కమ్యూనిస్టులు భూస్వాముల మీద పోరాటం ప్రారంభించారు. దేశీయ రాజ్యాల విషయంలో గోడమీద పిల్లివాటంగా

వ్యవహరిస్తూ వచ్చిన కాంగ్రెసు ఆంధ్రమహాసభలోని జాతీయవాదులకు సరిఅయిన దిశానిర్దేశం చేయలేకపోయింది. భారతదేశంలో విలీనం కావాలన్న డిమాండ్‌కు విస్తృతమయిన ప్రజాసహకారం సమకూర్చుకోవడానికి కూడా వారికి వ్యవధి లేకపోయింది. భారతప్రభుత్వం ఎప్పుడు సైనికచర్య చేపడుతుందా ఎప్పుడు విముక్తి దొరుకుతుందా అని ఎదురుచూడ వలసిన పరిస్థితిలో పడిపోయారు. అత్యంత వివాదాస్పద పరిస్థితులలో హైదరాబాద్ రాజ్య భారతదేశంలో విలీనం చేయబడ్డది. పోరాటాన్ని కొనసాగించిన కమ్యూనిస్టులను యూనియన్ సైన్యం దారుణంగా అణచివేసింది. కమ్యూనిస్టులు 1952లో పోరాటాన్ని విరమిస్తున్నట్టు ప్రకటించారు. నిజాం పతనం జరిగిన వెంటనే రాష్ట్రంలో పరిపాలనా యంత్రాంగంలో పెద్ద మార్పులు చేశారు. వేలాదిమంది ఉద్యోగులను తొలగించారు. మద్రాసు రాష్ట్రం నుంచి ఉద్యోగులను తరలించారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కర్నూలు రాజధాని ప్రయోగం విఫలం కావడంతో, విశాలాంధ్ర ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. కమ్యూనిస్టులు విశాలాంధ్ర వాదాన్ని పూర్తిగా స్వీకరించి, ఆ ప్రక్రియను వేగవంతం చేశారు. నెహ్రూ విముఖంగా వున్నా, ఫజల్ అలీ కమీషన్ వద్దన్నా, మాడపాటి హనుమంతరావు తటస్థంగా వున్నా, బూర్గుల రామకృష్ణారావు అర్ధమనస్కంగా ఉన్నా, కొండా వెంకటరంగారెడ్డి వ్యతిరేకించినా 1956లో విశాలాంధ్ర ఏర్పడింది. ఆ తరువాత జరిగిన కథ సుప్రసిద్ధమే.

సాహిత్యంలో ఏమి జరిగింది?

రాజకీయచరిత్రలో ఏమి జరిగిందో సాహిత్య చరిత్రలో కూడా అదే జరిగింది. హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పడినప్పుడు రెండు ప్రాంతాల చరిత్రను, రెండు భాషా సంస్కృతులను కృత్రిమంగా ఒకటి చేయడం జరిగింది. అందులో భాగంగా ప్రజాజీవితంలోని అన్ని రంగాలలో బ్రిటీష్ ఆంధ్ర వారి నాయకత్వాన్ని మొదట స్థిరపరచారు. మొత్తం చట్రాన్ని బ్రిటీష్ ఆంధ్రజాతీయవాదానికి, అభ్యుదయవాదానికి లోబరిచి రూపొందించారు. ఆ చట్రంలో భాగంగానే కొన్ని స్థానాలను, కొంత చరిత్రను తెలంగాణాకు కూడా వదలవలసి వచ్చింది. నెత్తురు చిందించి తెలంగాణా ప్రపంచ దృష్టినే ఆకర్షించిన సందర్భాలను తప్పనిసరిగా తెలుగువారి చరిత్రలో భాగంగా అంగీకరింపవలసి వచ్చింది. కానీ, తెలంగాణాలో సాంస్కృతిక, రాజకీయ వికాసానికి ప్రారంభం వేసిన చారిత్రక దశలను, విశాలాంధ్రలో భాగంగా ఉంటూనే తెలంగాణా నిర్మించుకున్న సొంత చరిత్రను ఉద్దేశపూర్వకంగా అలక్ష్యం చేశారు.

కందుకూరి, గురజాడ, గిడుగులను తెలుగు సాహిత్యానికి వైతాళికులుగా, యుగపురుషులుగా, శ్రీశ్రీని యుగకర్తగా ప్రకటించడం ద్వారా (వారికి ప్రత్యర్థిగా

విశ్వనాథ సత్యనారాయణను నిలబెట్టడం ద్వారా కూడా) తెలంగాణా సాహిత్యం మీద విశాలాంధ్రవాదులు ఆధిపత్యం సంపాదించారు. ఆ రచయితల మీద ఎవరికీ కోపం, ద్వేషం ఉండనవసరం లేదు, గొప్ప రచయితలుగా వారిని అందరూ గౌరవించవలసిందే. కానీ, వారు తెలంగాణా వికాసానికి దోహదం చేసినవారు కాదనేది కూడా వాస్తవం. ఇది కొందరు వ్యక్తుల పేర్లను తీసి మరికొందరిని చేర్చే సమస్య కాదు. ఇది చరిత్రకు, ఆత్మగౌరవానికి, విలువలకు సంబంధించిన సమస్య. తెలంగాణా సాహిత్యానికి బయటివారి నాయత్వాన్ని, యుగకర్తృత్వాన్ని అంగీకరించినందువల్ల ఆ చట్రంలో ఎంతోకొంత ఇమిడే తెలంగాణా రచయితలకే ఆమోదనీయత లభించింది. తెలంగాణా సాహిత్య చరిత్ర కాళోజీ, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వాములతో మొదలు కావడం అందువల్లనే. వారు తెలంగాణా గర్వించదగ్గ గొప్ప రచయితలు. తెలుగువారందరూ హృదయానికి హత్తుకోవలసిన రచయితలు. అయితే, తెలంగాణాలో అకస్మాత్తుగా నిజాం వ్యతిరేక పోరాటంనుంచే సాహిత్యం పుట్టలేదు. ఇక్కడ కూడా ఒక సుదీర్ఘమయిన వికాసదశ ఉన్నది. వికాశదశ అంతా వెనుకబడిన సాహిత్యంగానో, వెలుగుచూడని సాహిత్యంగానో, సంప్రదాయ సాహిత్యంగానో అణగారిపోయింది. ఆనాటి సాహిత్యమే కాదు, మళ్లీ నక్సల్బరీ తరం రచయితలు వచ్చేవరకు తెలంగాణా రచయితలకు ఎక్కడా చిరునామా లేదు.

మా. వేం.భాగ్యరెడ్డి వర్మ, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కోదాటి రామకృష్ణారావు, గంగుల శాయిరెడ్డి, షబ్నవీసు రామనరసింహారావు, ఒద్దిరాజు సోదరులు, పింగళి లింబాద్రి రెడ్డి, మల్యాల దేవీప్రసాద్ యాదవ్, గవ్వా అమృతరెడ్డి, చట్రాతి లక్ష్మీనరసమాంజ, బి. శ్రీనివాసశర్మ, చెల్వెల బాగయ్య, గుంటక నరసయ్య మొదలయిన సాహిత్య సామాజిక సాంస్కృతిక వ్యక్తిత్వాలు నిర్మించిన వికాసోద్యమంతో తెలంగాణా సాహిత్య, సాంస్కృతిక చరిత్ర ముడిపడి ఉన్నది. తెలంగాణాకు సొంతంగా సాహిత్య చరిత్ర ఉన్నది. వికాసోద్యమపు సొంతగొంతుక ఉన్నది. బ్రిటీష్ ఆంధ్రసాహిత్య రంగంలో జరిగిన అనేక ఉద్యమాలను, ధోరణులను, వాదాలను తెలంగాణా స్వీకరించలేదు. భావకవిత్వం దగ్గరినుంచి వ్యావహారిక భాషావాదం దాకా తెలంగాణా భాగస్వామ్యం ఏమీ లేదు. అది తన పరిస్థితులకు అనుగుణమైన బాహ్య ప్రేరణలను మాత్రమే స్వీకరించింది.

తెలంగాణా వాదులు మొదట చేయవలసినది తమ చరిత్రను తాము గౌరవించుకోవడం. సాంస్కృతిక వికాసానికి దోహదం చేసిన వ్యక్తులను సంస్థలను స్మరించుకోవడం వారిని ప్రజల సమష్టి స్మృతిలో భాగం చేయవలసి ఉన్నది. బ్రిటీష్ ఆంధ్రలో ఆంధ్రోద్యమానికి సాంస్కృతిక దోహదం ఎంతో ఉన్నది. ఐడెంటిటీని సుస్థిరం చేసే శక్తీ, సమర్థతా రాజకీయ అంశాల కంటె సాంస్కృతిక అంశాలకే ఎక్కువ ఉంటాయి.

తెలంగాణ సాహిత్యం, సంస్కృతి

– అంపశయ్య నవీన్

మొన్న మొన్నటి వరకు 'తెలంగాణ సాహిత్యం' అంటూ ప్రత్యేకగా చెప్పటం జరుగుతుండేది కాదు. 'తెలుగు సాహిత్యం'లోనే తెలంగాణ సాహిత్యం ఒక భాగం అనుకునేవాళ్ళు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.

ఇవ్వాళ సాహిత్యంలో స్థానీయత లేక ప్రాంతీయత అనేది ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్నది. ఈ ధోరణిని ఆధునికోత్తర (పోస్టు మోడ్రనిజమ్) వాదం యొక్క ఒక పార్శ్వమని విమర్శకులు భావిస్తున్నారు. ఇదివరకు భిన్నత్వంలో ఏకత్వం అంటుండేవాళ్ళు. ఇప్పుడు ఉన్నది భిన్నత్వమేనని, ఏకత్వం లేదని పోస్టు మాడ్రనిస్టులంటున్నారు. అందర్నీ ఒక త్రాటిమీదకు తీసుకు రావడం ఇంచుమించు అసంభవమని, ఎవరి అస్తిత్వం వారిదేననీ, ఎవరి బాధలు, గాధలు వారివేననీ, ఎవరి సమస్యలు, ఎవరి పరిష్కారాలు వారివేననీ, కాబట్టి ఎవరికి వారిని విడివిడిగా చూడాలే తప్ప అందర్నీ కలిపి చూడటం అన్యాయం, అసమంజసం అనే ఆధునికోత్తరవాదుల వాదాన్ని ఇప్పుడు ఎక్కువమంది పరిశీలకులు అంగీకరిస్తున్నారు.

అనేక చారిత్రక కారణాల వల్ల తెలంగాణ ప్రాంతానికొక ప్రత్యేక అస్తిత్వం ఉంది. ఇక్కడి ప్రజలు మాట్లాడే భాష, యాస, ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, ఇక్కడి ప్రజలు జరుపుకునే పండుగలు, పబ్బాలు, ఇక్కడి ప్రజల ఆహారపుటలవాట్లు – ఒక్కమాటలో ఇక్కడి ప్రజల సంస్కృతి వేరే ప్రాంతం తెలుగువాళ్ళ సంస్కృతితో పోల్చినప్పుడు కొంత భిన్నత్వం కనిపిస్తుంది.

ఈ ప్రాంతం దాదాపు 400 సంవత్సరాల వరకు ముస్లిముల పరిపాలనలో ఉండిపోయింది. ఈ కారణం వల్ల ఇక్కడి ప్రజలు మాట్లాడే భాష మీద, ఇక్కడి ప్రజల సంస్కృతి మీద ముస్లిముల ప్రభావం గాఢంగా కనిపిస్తుంది. ఇక్కడి ప్రజలు మాట్లాడే భాషలో ఉర్దూ మాటలు చేరిపోయాయి. అలాగే ఇక్కడి ప్రజలు మాట్లాడే తెలుగు యాసలో ఉర్దూ యాస కనిపిస్తుంది. ఉర్దూ ఇంతగా చేరిపోవడం వల్ల ఇక్కడి తెలుగు అసలు తెలుగే కాదని ఇది 'తురక్యాంధ్ర'యని కోస్తా జిల్లాల కొందరు పండితులు ఇక్కడి తెలుగును అవహేళన చేశారు. అసలు తెలంగాణాలో కవులే లేరన్న అక్కడి వాళ్ళకు సమాధానంగా 1934లో సురవరం ప్రతాపరెడ్డి "గోలకొండ కవుల సంచిక" పేరుతో 354 మంది తెలంగాణ కవుల పేర్లను, వారు రాసిన కవితలను వెలువరించాల్సి వచ్చింది.

"నిజాం రాష్ట్రంలో కవులు పూజ్య"మనే అపవాదును తొలగించటానికే ఈ

ప్రాంతంలో ఉన్న కవులను, వారి కవితాశక్తిని ప్రపంచానికి తెలియపరచటానికే సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచికను వెలువరించాల్సి వచ్చింది. ఆధునిక కాలంలో తెలుగులో వెలువడిన మొట్టమొదటి కవితా సంకలనమిది. ముద్దుకృష్ణ సంపాదకత్వంలోని 'వైతాళికులు' ఈ సంచిక తర్వాతనే – అంటే 1935లో వెలువడింది.

అనుమాండ్ల భూమయ్య గారన్నట్లు "ఈ సంచిక తెలంగాణా ఆధునిక సమాజానికి, ఇక్కడి ప్రజల మనోభావాలకు నిదర్శనం. ఈ సంచిక వెలువడకుండా ఉన్నట్లయితే ఎందరో కవులు విస్మృతి పాలయ్యేవారు. ఈ సంచిక ప్రముఖమైంది. సంపాదకులు ప్రశంసనీయులు".

క్రీస్తుకు పూర్వం రెండో దశాబ్దంనుండే తెలంగాణ ప్రాంతంలో కవులున్నారని ఇటీవలి పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. 'బృహత్కథ' లాంటి మహాగ్రంథాన్ని వెలువరించిన గుణాఢ్యుడు (క్రీ.పూ.200–150) తెలంగాణ ప్రాంతంలోనే నివసించాడట. గుణాఢ్యుడినే సాహిత్య చరిత్రలో మొదటి లిఖిత కవి అంటున్నారు.

కరుణరసానికి ప్రతీకగా నిలిచిన ప్రఖ్యాత సంస్కృత కవి 'భవభూతి' (క్రీ.శ.680–750) కూడా తెలంగాణాలోనే నివసించాడని చెప్పడానికి ఆధారాలున్నాయంటున్నారు. ఇంకా ఎందరో ప్రాచీన కవులు తెలంగాణాలోనే పుట్టి పెరగారనడానికి రుజువులున్నాయి. బద్దెన, వేములవాడ భీమకవి, మల్లికార్జున పండితారుధ్యుడు, రుద్రదేవుడు (మొదటి ప్రతాపరుద్రుడు), పాల్కుర్కి సోమనాథుడు, జాయపసేనాని, గోన బుద్ధారెడ్డి, మారన, విద్యానాథుడు, భాస్కర రామాయణ కవులు, విద్యారణ్యస్వామి, సర్వజ్ఞ సంగభూపాలుడు, బమ్మెరపోతన, మల్లినాథసూరి, వెలిగంధల నారయ, పిలమర్రి పినవీరభద్రుడు, ఏకామ్రనాథుడు, కొరివి గోపరాజు, పొన్నిగంటి తెలుగన్న, కందుకూరి రుద్రకవి, సారంగుతమ్మయ, కంచర్ల గోపన్న (రామదాసు) లాంటి ఎందరో మహామహులు తెలంగాణాకు చెందినవాళ్ళే.

తెలుగులో మొదటి స్వతంత్ర కావ్యాన్ని రచించింది పాల్కుర్కి సోమనాథుడనీ, నన్నయాదులు సంస్కృత మహాభారతాన్ని అనువదించారు కాబట్టి వారు అనువాదకులు మాత్రమేననీ, కాబట్టి ఆదికవి అన్న గౌరవం పాల్కుర్కి సోమనాథునికే దక్కాలని ఇవ్వాళ్ళ తెలంగాణవాదులంటున్నారు. తెలుగులో ద్విపద అనే కొత్త వృత్తాన్ని సృష్టించి, దేశి తెలుగులో బసవపురాణాన్ని రచించిన పాల్కుర్కి సోమనాథుడు తెలంగాణ ప్రాంతపు కవి కావడం ఇక్కడి ప్రజలకు గర్వకారణమే. అలాగే తెలుగులో మొదటి రామాయణాన్ని రచించిన గోనబుద్ధారెడ్డి (రంగనాథ రామాయణము) కూడా ఇక్కడి వాడే. అలాగే భాగవతాన్ని తెనిగించిన సహజకవి బమ్మెర పోతన కూడా ఇక్కడి వాడేనని చరిత్రకారులు రుజువు చేశారు. పోతన్న రచించిన ఎన్నో పద్యాలు ఈనాటికి

కూడా తెలుగువారి నాలుకల మీద నర్తిస్తున్నాయంటే ఆయన ఎంత అజరామరుడో మన కర్థమౌతుంది.

"ప్రతాపరుద్ర చరిత్రము" రాసిన ఏకామ్రనాథుడికి తొలి తెలుగు చరిత్రకారుడన్న గౌరవం ఉంది. కాకతీయుల చరిత్రను గ్రంథస్థం చేసిన కవి ఈ ఏకామ్రనాథుడే. అచ్చ తెలుగులో మొదటి కావ్యాన్ని రచించిన (యయాతి చరిత్ర) పొన్నిగంటి తెలుగన్న కూడా తెలంగాణా వాడే. ఇలా ప్రాచీన తెలంగాణా సాహిత్యానికెన్నో ప్రత్యేకతలున్నాయి.

ప్రాచీనకాలంలో సాహిత్యం వర్ధిల్లాలంటే రాజాశ్రయం అవసరమయ్యేది. కాకతీయుల కాలంలోనూ, విజయనగర రాజుల కాలంలోనూ, రెడ్డిరాజుల కాలంలోనూ పద్మనాయక రాజుల కాలంలోనూ సాహిత్యానికి రాజాశ్రయం లభించింది.

కుతుబ్ షాహీలలాంటి ముస్లిమ్ రాజులు పాలించిన కాలంలో కూడా తెలుగు సాహిత్యానికి రాజుల ఆదరణ లభించింది. కానీ క్రీ.శ. 1724 నుండి 1948 వరకు హైదరాబాద్ సంస్థానాన్ని పాలించిన ఆసఫ్‌జాహీ వంశస్తుల కాలంలో తెలుగు సాహిత్యానికి రాజాదరణ పూర్తిగా మృగ్యమైంది. వీరికాలంలో తెలుగు భాషా సాహిత్యాలు తీవ్రమైన అణిచివేతకు గురయ్యాయి. ఉర్దూను రాజభాషగా మార్చి అన్ని రంగాల్లోనూ ఉర్దూనే ప్రవేశపెట్టారు. దాంతో కింది వర్గాల వారు తప్ప ఉన్నతవర్గాల వారెవరూ తెలుగు మాట్లాడని పరిస్థితి యేర్పడింది. ఆ రోజుల్లో ఉర్దూలో మాట్లాడగల్గే వాళ్ళనే విద్యావంతులుగా భావించేవారు. హైదరాబాద్ నగరంలో తెలుగును 'తెలంగీ బేఢంగీ' అని అవమానించేవారు. మరాఠీ, కన్నడ భాషలకున్న గుర్తింపు కూడా తెలుగుకు ఉండేది కాదు. ఈ దయనీయ పరిస్థితి నుండి తెలుగును రక్షించడానికి 1920లో "ఆంధ్రజన సంఘం" అనే సంస్థ, 1930లో ఈ సంస్థే ఆంధ్రమహాసభ అన్న సంస్థగా రూపాంతరం చెందింది. ఈ ఆంధ్ర మహాసభ సంస్థే తెలుగు భాషా సాహిత్యాల పునరుజ్జీవనానికి కృషి చేసింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు లాంటి వైతాళికులెందరో తెలంగాణాలో సాహిత్య, సాంస్కృతిక వికాసానికి బీజాలు వేశారు. ఆంధ్ర మహాసభలకు సమాంతరంగా గ్రంథాలయ మహాసభలు జరిపారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజీ నారాయణరావు, కోదాటి నారాయణరావు లాంటి మహామహులు గ్రంథాలయోద్యమాన్ని ఊరూరికి, వాడవాడలకు వ్యాపింపచేశారు. సురవరం ప్రతారెడ్డి గోలకొండ పత్రికను నడపటమే కాకుండా, గోలకొండ కవుల సంచికను ప్రకటించి తెలంగాణ కవుల్లో ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పాడు. వట్టికోట ఆళ్వారుస్వామి దేశోద్ధారక గ్రంథమాల (1938) అనే

సంస్థను స్థాపించి తెలంగాణ రచయితలు రచించిన గ్రంథాలను వెలువరించడం ప్రారంభించాడు. సురవరం ప్రతాపరెడ్డి రచించిన "హైందవధర్మ పోలీలు" కాళోజీ నారాయణరావు రచించిన "నా గొడవ", వానమామలై వరదాచారి రచించిన "పోతన చరిత్రము" మొదలైన తెలంగాణ రచయితల 18 గ్రంథాలను ఈ సంస్థే ప్రచురించింది. ఇంచుమించు ఈ రోజుల్లోనే హైదరాబాద్‌లో స్థాపించబడిన ఆంధ్రసారస్వత పరిషత్తు తెలంగాణ సాహిత్య చైతన్యానికి దోహదం చేసింది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పందొమ్మిదివందల నలభైలలో ప్రారంభమైన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం కారణంగా తెలంగాణాలో గొప్ప పోరాట సాహిత్యం సృష్టించబడింది. ఎన్నో పాటలు, పద్యాలు, బుర్రకథలు, గొల్లసుద్దులు ఈ పోరాట కాలంలో రచించబడినాయి. ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్ననాళ్ళే ఈ పాటలు రాయడం విశేషం.

"ముసలినక్కకు రాచరికంబు దక్కునే" అంటూ మహాకవి దాశరథి నినదించాడు. ఆనాటి తెలంగాణాలోని సాంఘిక, రాజకీయ వాతావరణాన్ని చిత్రిస్తూ వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' నవల రచించాడు. ఈ ప్రజల మనిషి నవలే తెలంగాణా నుండి వెలువడిన మొదటి నవల.

ఆ కాలంలో తెలంగాణ ప్రాంతంనుండి పాటలు, కవిత్వం వెలువడినంత విరివిగా కథానికలు, నవలలులాంటి వచన రచనలు వెలువడలేదు. దాశరథి, కాళోజీ, వానమామలై వరదాచార్యులు, సుద్దాల హనుమంతు, యాదగిరిలాంటి కవులెందరో గొప్ప కవితల్ని, పాటల్ని రచించారు.

సెప్టెంబరు 1948లో పోలీసు యాక్షన్ జరగటంతో తెలంగాణా ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో చేరిపోయింది. దాంతో 200 సంవత్సరాలకు పైగా సాగిన ఆసఫ్‌జాహీల పరిపాలన అంతమైపోయింది. అలాగే ఇక్కడి ప్రజలమీద రుద్దబడిన ఉర్దూ భాష పెత్తనం అంతమై పోయింది. ఈ పరిణామం ఈ ప్రాంతంలో తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించటానికెంతో దోహదం చేసింది.

దాశరథి, సి.నారాయణరెడ్డి, కాళోజీ, వానమామలై వరదాచారి, పల్లా దుర్గయ్య, సంపత్కుమార, సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, వే. నరసింహారెడ్డి, వరవరావు, నిఖిలేశ్వర్, జ్వాలముఖి, చెరబండరాజు, ఎన్.గోపి, వేణుగోపాల్, మాదిరాజు రంగారావు, అనుమాండ్ల భూమయ్య, నందినీ సిద్ధారెడ్డి, రామా చంద్రమౌళి, మానమామలై జగన్నాథచార్యులు, దర్భశయనం, పొట్లపల్లి శ్రీనివాసరావు, వి.ఆర్.విద్యార్థి లాంటి తెలంగాణా కవులెందరో తెలుగు కవిత్వాన్ని తమ కవితలతో సుసంపన్నం చేశారు.

కథల విషయానికొస్తే మొన్నమొన్నటి వరకు 1910లో గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' కథనే తెలుగులో రచించబడిన మొదటి కథగా చెప్పేవాళ్ళు. కానీ ఇటీవలనే 1902లోనే భండారు అచ్చమాంబ రచించిన "ధనత్రయోదశి" అన్న కథే తెలుగులో వెలువడిన మొదటి కథ అని పరిశోధకులు తేల్చారు. ఈమె తెలంగాణాకు చెందిన రచయిత్రి కాబట్టి,తెలుగులో వెలువడిన మొదటి కథ కూడా తెలంగాణ ప్రాంతంనుండే వెలువడటం గమనించదగిన విశేషం.

మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, పొట్లపల్లి రామారావు, గూడూరి సీతారాం, వట్టికోట అళ్వారుస్వామి, పి.వి. నరసింహారావు మొదలైన తెలంగాణ ప్రాంతపు రచయితల్ని తొలితరం కథకులుగా చెప్పొచ్చు. వీరితో బాటు యశోదారెడ్డి, కాంచనపల్లి చిన వెంకటరామారావు, భాస్కరభట్ల కృష్ణారావు మొదలైన రచయితలను కూడా తొలితరం కథకులుగా గుర్తించవచ్చు.

దాశరథి రంగాచార్య, అంపశయ్య నవీన్, దేవరాజు మహారాజు, పోల్కంపల్లి శాంతాదేవి, మాదిరెడ్డి సులోచన, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య, ముదిగంటి సుజాతారెడ్డి, తాడిగిరి పోతరాజు, ఆడపు లక్ష్మీపతి, పులుగు శ్రీనివాస్ మొదలైన రచయితల్ని మలితరం తెలంగాణా కథకులుగా చెప్పొచ్చు. ఎం. తిరుపతయ్య, అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి విప్లవ కథల్ని రాసిన రచయితలుగా గుర్తింపుపొందారు.

ఈనాడు తెలంగాణాప్రాంతంనుండి ఇక్కడి సమస్యల్ని చిత్రిస్తూ, ఇక్కడి ప్రజలు మాట్లాడే భాషలో కథలు రచిస్తున్న కథకులు ఎందరో ఉన్నారు. పెద్దింటి అశోక్‌కుమార్, కె.వి.నరేందర్, ఐతా చంద్రయ్య, రహ్మతుల్లా, అన్వర్, స్కైబాబా, పి.చంద్, కాసుల ప్రతాపరెడ్డి, గీతాంజలి, జూకంటి జగన్నాథం, బి.వి.ఎన్.స్వామి, అంబల్ల జనార్ధన్, నల్లాల లక్ష్మీరాజం, అనిసెట్టి రజత్, దార్ల రామచంద్ర, జాజుల గౌరి, జె.సుభద్ర, గోగు శ్యామల, బెజ్జారపు వినోద్ కుమార్ మొదలైనవారు ఇటీవల కథలు, కవితలు రాస్తున్న వాళ్ళలో కొందరు మాత్రమే. ఇంకెందరో తెలంగాణ వర్ధమాన రచయితలు కథలు, కవితలు రాస్తూ తెలంగాణా ప్రజా సమస్యలకు అద్దం పడ్తున్నారు.

నవలల విషయానికొస్తే వట్టికోట అళ్వారుస్వామి రచించిన 'ప్రజలమనిషి' నవలనే తెలంగాణ ప్రాంతం నుండి వెలువడిన మొదటి నవలగా గుర్తిస్తున్నారు. పందొమ్మిది వందల ముప్పైలనాటి తెలంగాణ సాంఘిక, రాజకీయ జీవితాన్ని ఈ నవల అత్యంత వాస్తవికంగా చిత్రించింది. ఈ రచయితే 'గంగు' అనే మరో అసంపూర్ణ నవలను కూడా రచించారు.

ఆళ్వారుస్వామి చూపించిన మార్గంలోనే పయనిస్తూ, దాశరథి రంగాచార్య 'చిల్లరదేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపదం' నవలల్ని రచించాడు. భాస్కరభట్ల కృష్ణారావు 'యుగసంధి', 'వెల్లువలో పూచిక పుల్లలు' లాంటి మంచి నవలలు రాశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదువుతున్న విద్యార్థుల జీవితాల్ని చిత్రిస్తూ నవీన్ 'అంపశయ్య', 'ముళ్ళపొదలు', 'అంతస్రవంతి' నవలల్ని రచించాడు. పూర్తిగా చైతన్య స్రవంతి శిల్పంలో రూపొందిన మొట్టమొదటి తెలుగు నవలగా 'అంపశయ్య'ను విమర్శకులు గుర్తించారు. అలాగే అర్ధశతాబ్దపు తెలంగాణ చరిత్రను చిత్రిస్తూ నవీన్ 'కాలరేఖలు', 'బాంధవ్యాలు', 'చెదిరిన స్వప్నాలు' అన్న మరో మూడు నవలల్ని రచించాడు. బీడీ కార్మికుల జీవితాల్ని చిత్రిస్తూ బి.ఎన్.రాములు 'బ్రతుకుపోరు' నవలను రచించాడు. తెలంగాణ సాయుధ పోరాటకాలాన్ని చిత్రిస్తూ ముదిగంటి సుజాతారెడ్డి 'మలుపు తిరిగిన రథచక్రాలు' అన్న నవలను రచించారు. కాలువ మల్లయ్య, మలయశ్రీ, రామచంద్రమౌళి, గీతాంజలి, సి.హెచ్.మధు, పులుగు శ్రీనివాస్, ఎం. తిరుపతయ్య మొదలైన రచయితలు తెలంగాణ ప్రజల జీవితాల్ని చిత్రిస్తూ నవలలు రాశారు.

అల్లంరాజయ్య 'కొలిమంటుకున్నది', 'వసంతగీతం' లాంటి విప్లవ నవలల్ని రచించాడు. బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికుల జీవితాల్ని చిత్రిస్తూ తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.చంద్ నవలలు రాశారు. మాదిగల జీవితాల్ని చిత్రిస్తూ బోయజంగయ్య 'జగడం', వేముల ఎల్లయ్య 'కక్క' నవలల్ని రచించారు.

ఒకప్పుడు ఒక సామాజిక వర్గానికి చెందిన వాళ్ళే నవలలు, కథలు, కవితలు రచించేవారు. ప్రస్తుతం అన్ని సామాజిక వర్గాలకు చెందిన వాళ్ళు ముఖ్యంగా బీ.సి. దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన రచయితలు నవలలు, కథలు, కవితలు రాస్తుండటం వల్ల ఇవ్వాళ్టి సాహిత్యంలో అన్ని వర్గాల ప్రజల బాధలు, గాధలు సాధికారికంగా చిత్రించబడుతున్నాయి.

గత శతాబ్దపు చివరిరోజులనుండి ప్రారంభమైన రెండోదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఈ ప్రాంతపు కవులు విస్తృతంగా ఈ ప్రాంతానికి జరిగిన వివక్షను గురించి విరివిగా కవితల్ని రచిస్తున్నారు. అయితే కవిత్వం వెలువడినంత ఉధృతంగా, విస్తృతంగా కథలు, నవలలు వెలువడటం లేదు. అయితే ఈ ఉద్యమ నేపథ్యంలో వెలువడుతున్న కవిత్వంలో ఆవేశం ఉన్నతంగా కవిత్వం లేదేమోననే సందేహం కల్గుతుంది.

మొత్తమ్మీద తెలంగాణ ప్రాంతం నుండి వెలువడ్తున్నంత సాహిత్యం ఆంధ్రప్రదేశ్‌లోని మరే ఇతర ప్రాంతం నుండి కూడా వెలువడటం లేదన్నది

నిర్వివాదాంశం. ఇప్పటి తెలంగాణా సాహిత్యానికి కొన్ని ప్రత్యేకమైన లక్షణాలున్నాయి. వాటిలో కొన్ని:

మొదట్లో తెలంగాణ మాండలికాన్ని కనీసం సంభాషణల్లో వాడటానికి కూడా ఒక్కడి రచయితలు భయపడ్తుండేవాళ్ళు. కానీ ఈనాటి ఈ ప్రాంతపు రచయితలు తెలంగాణ భాషను, యాసను నిర్భయంగా తమ రచనల్లో వాడుతున్నారు. మొత్తం రచననంతా తెలంగాణా మాండలికంలోనే రచించాలన్న పట్టుదల ఈనాటి రచయితల్లో కనిపిస్తున్నది.

తెలంగాణ ప్రాంతం, ఇక్కడి సాహిత్యం తీవ్రమైన వివక్షకూ, అణచివేతకు గురయ్యాయన్న చైతన్యం ఈనాటి రచయితల్లో విస్తృతంగా కన్పిస్తున్నది. ఈ కారణంచేత తెలంగాణ రచయితలకు న్యాయంగా రావలసిన గుర్తింపు రాలేదన్నదికూడా ఇక్కడి రచయితల అభియోగం.

తెలంగాణ పల్లె జీవితం మీద, అక్కడి ప్రజల వృత్తుల మీద, జీవన విధానం మీద మమకారం, విస్తృతమైన నగరీకరణ కారణంగా పల్లెలు తమ సహజజీవితానికి దూరమైపోతున్నాయన్న ఆవేదన, ఆగ్రహం ఈనాటి తెలంగాణ సాహిత్యంలో వ్యక్తమౌతున్నాయి.

అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా యేర్పడితే తప్ప ఇక్కడి సమస్యలు పరిష్కారం కావన్న నమ్మకం ఈనాటి రచయితల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది.

తెలంగాణ సంస్కృతి విషయానికొస్తే ఇక్కడి సంస్కృతికి కొన్ని ప్రత్యేక లక్షణాలు కన్పిస్తాయి.

ఒక ప్రాంతపు ప్రజల జీవన విధానాన్నే ఆ ప్రాంతపు సంస్కృతి అంటాం. ఒక ప్రాంతపు ప్రజల వేషభాషలు, అన్న పానీయపుటలవాట్లు, పండుగలు, పబ్బాలు, ఆటపాటలు, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, మనిషి పుట్టినప్పుడు, వివాహాలు జరుపుకుంటున్నప్పుడు, మరణించినప్పుడు ప్రజలు అనుసరించే పద్ధతులు మొదలైనవన్నీ సంస్కృతిలో అంతర్భాగాలే.

తెలంగాణ ప్రాంతం నాలుగువందల సంవత్సరాల ముస్లిముల పరిపాలనలో ఉండడం వల్ల ఇక్కడి ప్రజల సంస్కృతి మీద ముస్లిముల సంస్కృతి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడి ప్రజలు మాట్లాడే భాషలో, యాసలో ఉర్దూ పదాలు పలుకుబళ్లు ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడి ప్రజలు – ముఖ్యంగా అగ్రవర్ణాలకు చెందిన ప్రజలు ముస్లిములు వేసుకునే దుస్తుల్ని, అలంకారాల్ని అనుకరించారు. అగ్రవర్ణాల స్త్రీలు అనుసరించే ఘోషా పద్ధతి (బయటి ప్రపంచంలోకి స్వేచ్ఛగా రాకపోవడం) ముస్లిముల

కారణంగా యేర్పడిందే. ఇక్కడి ప్రజలు భుజించే ఆహారంలో కూడా ముస్లిముల వంటల ప్రభావం కనిపిస్తుంది. మాంసాహారాన్ని, బిర్యానీ, బగారా లాంటి వంటల్ని ఇష్టపడటం ముస్లిముల ప్రభావం వల్లనే. కల్లు, సారాయిల్లాంటి మత్తు పానీయాల్ని సేవించడం కూడా ఇక్కడి ప్రజలకు చాలా యిష్టం. సాయంత్రం కాగానే ఇక్కడి ప్రజలు తాడిచెట్లకిందకు వెళ్ళి కల్లు తాగుతూ, హాయిగా గడుపుతారు. వివాహాలలాంటి శుభకార్యాల్లో కల్లు సారాలు తప్పనిసరిగా ఉంటాయి. బంధువులొచ్చినప్పుడు కల్లుసారాలతో వాళ్ళకు విందు యివ్వకపోతే అవమానంగా భావిస్తారు. అలాగే ఇక్కడ జరుపుకునే పండుగల మీద కూడా ముస్లిముల ప్రభావం కనిపిస్తుంది. ఒక్కడ 'దసరా' పండుగ చాలా పెద్ద పండగ. దసరా పండగంటే బాగా తాగటం, తినడమేనని ఇక్కడి ప్రజల నమ్మకం – మతపరమైన నేపథ్యం ఈ పండక్కి ఉన్నప్పటికీ, తాగటం, మాంసాహారాన్ని భుజించటమే ఈ పండగ ప్రధాన లక్షణం. అలాగే ఇక్కడ పీరీల పండగ (మొహర్రం) చాలా పెద్ద పండగ. ఇది ముస్లిముల పండగ అనే విషయాన్ని ఇక్కడి ప్రజలెప్పుడో మరచిపోయారు. 'దసరా' అనేది ఉర్దూమాట. తెలంగాణాలో ఘనంగా జరుపుకునే ఈ పండగ మీద ముస్లిముల ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తుంది.

ఇక వినోద సాధనాల విషయానికొస్తే ఇక్కడి ప్రజలకు ఎన్నో జానపద కళలున్నాయి. వీధి భాగోతాలు, తోలుబొమ్మలాట, హరికథలు, ఉయ్యాల పాటలు, పటం చూపిస్తూ చెప్పబడే పాండవుల కథలు, చిందువాళ్ళు ఆడే వీధి నాటకాలు మొదలైన వినోద సాధనాలంటే ఇక్కడి ప్రజలకు చాలా ఇష్టం. తెలంగాణ ప్రాంతంలో ఈనాటికి కూడా ఇలాంటి ఎన్నో జానపద కళలు సజీవంగా ఉండటానికి కారణం వేరే ప్రాంతాల్లో జరిగినంత నగరీకరణ ఇక్కడ జరగకపోవడమే. ఒక్క వరంగల్ జిల్లాలోనే 44 జానపద కళలుండేవని, వాటిల్లో కొన్ని ఈనాటికి కూడా సజీవంగా ఉన్నాయని పరిశోధకులు కనుగొన్నారు. సినిమాల, టీవీల కారణంగా క్రమంగా ఇలాంటి ఎన్నో జానపద కళలు అంతరించిపోతున్నాయి.

ఆటల విషయానికొస్తే ఒకప్పుడు ఇక్కడ చిర్రెగోనె, చెడుగుడు (కబడ్డి), గుమ్మాట, దాగుడుమూతలు, పచ్చీసు, పులిజూదం, కచ్చకాయలు, తొక్కుడుబిళ్ళ, పిల్లలపెళ్లిళ్లు లాంటి ఎన్నో ఆటలు ఆడుకునేవారు. క్రమంగా ఈ ఆటలు కూడా కనుమరుగై పోతున్నాయి.

యేప్రాంతపు సంస్కృతైనా స్థిరంగా ఉండదు. కాలానుగుణమైన మార్పులు ఉత్పన్నమౌతూనే ఉంటాయి. సంస్కృతిలోని ముఖ్యాంశాలైన వేషభాషలు, ఆహారపుటలవాట్లు, వినోదసాధనాలు, పాశ్చాత్య సంస్కృతి కారణంగా తీవ్రమైన మార్పులకు లోనవుతున్నాయి. కానీ సంస్కృతిలోని మరికొన్ని ముఖ్యాంశాలైన

వివాహాది శుభకార్యాల విషయంలోనూ, మరణించినప్పుడు జరిగే కర్మకాండల విషయంలోనూ, కొత్త జీవి జన్మించినప్పుడు జరుపుకునే బారసాలలాంటి కార్యక్రమాల విషయంలోనూ, బతకమ్మపండగ, దీపావళి, ఉగాదిలాంటి పండగల్ని జరుపుకునే సంప్రదాయ పద్ధతుల్లోనూ పెద్దగా మార్పులు జరగలేదు. వీటి విషయంలో ఇక్కడి సంస్కృతి ఈనాటికి కూడా పగడ్బందీగా, కట్టుదిట్టంగా ఉందనే చెప్పాలి. ఇలా తెలంగాణ సంస్కృతి ఇతర ప్రాంతాల సంస్కృతికి కొంత భిన్నంగానే కనిపిస్తుందనటంలో సందేహం లేదు. పాత కొత్తల మేలు కలయికగా ఇక్కడి సంస్కృతి భావిస్తున్నది. ఈ హైటెక్ యుగంలో యేదీ స్థిరంగా ఉంటుందని చెప్పటానికి వీల్లేదు. ప్రతి ప్రాంతపు సంస్కృతి మార్పుకు గురౌతున్నట్లే ఇక్కడి సంస్కృతి కూడా ఎన్నో మార్పులకు గురవుతూనే ఉంటుంది.

- ఒక ప్రాంతంలో అభివృద్ధి జరిగినప్పటికి స్థానిక ప్రజలు వెనకబడి వున్నారంటే అర్థమేమిటి? స్థానిక వనరులతో వలస వాదులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు ప్రయోజనం పొందారే తప్ప స్థానిక ప్రజలు అభివృద్ధి చెందనలేదని అర్థం. దీన్ని అభివృద్ధి అని ఎలా అంటారు? ఇలాంటి అభివృద్ధిని వలస వాదుల అభివృద్ధి అని, పారిశ్రామిక వేత్తల, వ్యాపారవేత్తల దోపిడీ అని అంటారు. అంతేగాని అది స్థానిక ప్రజల అభివృద్ధి కాదు. స్థానిక వనరుల అభివృద్ధి కాదు. అది స్థానిక వనరులను, అవకాశాలను స్థానికేతరులు అనుభవించడం, తరలించడం, దోపిడీ చేయడం.

- వలసలు అనేవి స్థానిక ప్రజల అభివృద్ధికి భిన్నంగా సాగినప్పుడు అవి దోపిడీ వర్గాల వలసలవుతాయి. భారీ పరిశ్రమల వల్ల, భారీ నీటి ప్రాజెక్టుల వల్ల కోట్లాది ప్రజలు నిర్వాసితులయ్యారు. భూములు కోల్పోయారు. వృత్తులు కోల్పోయారు. మాతృభూమిపై నివసించే అవకాశం కోల్పోయారు. వాళ్లు చెల్లాచెదురయ్యారు. దేశంలోని 5 శాతం జనాభా ఇలా అభివృద్ధి పేరిట దిక్కులేని పక్షులయ్యారు. అనగా ప్రతి 20 మందిలో ఒకరు దేశంలో అభివృద్ధి పేరిట బలిపశువులయ్యారు. గిరిజనులు 20 శాతం, ఎస్సీలు, బీసీలు 10 శాతం జనాభా 'అభివృద్ధికోసం' బలిపశువులయ్యారు. కానీ అభివృద్ధిలో వాటాను ఆ నిష్పత్తి మేరకు అందుకోలేకపోయారు. నిర్వాసితులకే ఉపాధి కల్పన అని ఎంత అరిచినప్పటికీ అరణ్యరోదన అయిపోయింది. సింగరేణి బొగ్గు గనులు, నేటి సెజ్‌లు, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లోని గనులు, ఖనిజాలు స్థానికులను బలిపశువులను చేశాయి. అభివృద్ధి ఎవరికి అందింది? సమాజ సంపద అభివృద్ధి చెందింది. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందింది. కానీ అందులో స్థానికులకు చెందిందేమీ లేదు. అందువల్ల అసమానతలు పెరిగాయి. బిర్లా, ధాపర్లు, టాటా, రిలయెన్స్, తదితర 150కి పైగా గల పారిశ్రామిక కుటుంబాలు అభివృద్ధి చెందాయి.

– సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు

తెలంగాణ జాతరలు - బోనాలు

- డా॥ ఆర్. కమల

కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ ఈ పది జిల్లాలున్న ప్రాంతాన్ని తెలంగాణ అంటారు.

తెలంగాణ ఆదివాసులు జరుపుకునే పండుగలు ప్రత్యేకమైనవి. ఈ పండుగలనే జాతరలంటారు. కోయవారి 'సమ్మక్క సారక్క' జాతర; గోండుల 'నాగోబ'జాతర; బంజారాల 'శీతాలభవాని' జాతర; చెంచువారి 'గారెల మైసమ్మ' జాతర పేర్కొనదగినవి. ముగ్గురమ్మల మూలపుటమ్మయైన దేవిని శక్తి స్వరూపినిగా పిల్లలను, పశువులను కాపాడే దేవతగా పూజిస్తారు. వర్షాకాలం రాగానే రకరకాల అంటువ్యాధులు సోకుతాయి. 'పుబ్బ'లో పుట్టి 'మఖ'లో మాడిపోయే రకరకాల పురుగులు భూమి నుండి ఉద్భవిస్తాయి. ఆ సమయంలో కండ్లకలక, పసికలు (జాండిస్), విరేచనాలు, చలిజ్వరాలు రావటం సహజం. అలానే పశువులు పచ్చిక మొలచినా తినక చొంగ కారుస్తూ, ఈగలు ముసురుతున్నా తోక కదపక గాలి వ్యాధితో పడుకోనుంటాయి. ఈ జ్వరాల బారిన పడిన బాలురైనా, పశువులైనా బతికి బయటపడటమంత సులభం కాదు. ఏదో ఒక అద్భుతమైన శక్తి మాత్రమే కాపాడగలదని వారి నమ్మకం. అందుకే ఆయమ్మను పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, రేణుకమ్మ, ఎల్లమ్మ అనే పేర్లతో ఆహ్వానించి పూజిస్తారు. వినోదభరితమైన సామూహిక జన వేడుకలే జాతరలు. వీటినే తిరునాళ్ళంటారు.

నాగోబ జాతర :

ఆదిలాబాదు జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం ముత్నూరు గ్రామ సమీపాన గల 'కేస్లాపూరు'లో నాగోబ జాతర జరుగుతుంది. నాగోబ గిరిజనుల ఆరాధ్యదైవం. పూర్వం గోండుల కుటుంబాన సర్పరూపాన నాగోబ జన్మించి, అద్భుతమైన శక్తియుక్తులు ప్రదర్శించి, మహిమలను చూపుతూ కేస్లాయి గ్రామాన గల పుట్టలో దూరిందని చెబుతారు. అప్పటినుండి గోండులా పుట్టకు పూజలు చేస్తూ భక్తితో గుడి కట్టించారు. ప్రతి సంవత్సరము మాఘమాస పౌర్ణమరోజున నాగోబ జాతరను జరుపుకుంటారు. ఈ వేడుకలలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుండి జనులు తండోపతండాలుగా వస్తారు.

సమ్మక్క, సారక్క జాతర :

వరంగల్ జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం అనే ప్రాంతంలో రెండేళ్ళ కొకసారి 'సమ్మక్క సారక్క జాతర' జరుగుతది. క్రీ.శ.13వ శతాబ్దంలో కాకతీయ సామంత రాజైన పడగిద్దరాజు మేడరము ప్రాంతాన్ని పాలించేవాడు. ప్రతి సంవత్సరము కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రునకు కప్పం చెల్లించేవాడు.

అనుకోకుండా ఒక సంవత్సరము అనావృష్టి కారణంగా కప్పం చెల్లించలేకపోయాడు.

పడగిద్దరాజు కప్పం కట్టలేదని ప్రతాపరుద్రుడు సేనాపతి యుగంధరునితో కోపంగా అంటాడు. అంతేకాక అతన్ని మేదారంపైకి యుద్ధానికి పంపుతాడు. ఆ యుద్ధంలో పడగిద్దరాజు, అతని సేనాపతి జంపన్న మరణిస్తారు. అది తెలుసుకున్న సమ్మక్క, సారక్కలు వారి గిరిజన పరివారంతో యుగంధరుని ఎదుర్కొంటారు. ఆ యుద్ధంలో సమ్మక్క సారక్కలిద్దరూ వీరోచితంగా పోరాడుతారు. చివరకు కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక సమ్మక్క మరణిస్తుంది. సారలమ్మ అడవిలోకి వెళ్ళిపోతుంది. ప్రజలకోసం పోరుచేసి ప్రాణత్యాగం చేసారని భావించి, వారి పేరున జాతర చేస్తారు గిరిజనులు. దేశంలోని నలుమూలలనుండి ఈ ఉత్సవంలో పాల్గొనుటకు వచ్చే వారి సంఖ్య అత్యధికం. అది గుర్తించి ప్రభుత్వం వారీమధ్య జాతీయజాతరగా గుర్తించారు. ఈ జాతర వలన రాష్ట్రాదాయం కొన్ని కోట్లు.

సిద్ధుల గుట్ట జాతర :

నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మండలంలో సిద్ధులగుట్ట ఉన్నది. పూర్వం నవనాథులు ఈ గుట్టపై శివలింగాన్ని స్థాపించి తపస్సు చేయటం వలన ఈ గుట్టను సిద్ధుగుట్ట అంటారు. ఇక్కడ శివున్ని సిద్ధలింగేశ్వరస్వామిగా కొలుస్తారు.

ఆరు+మూరు = 6+3=9 నవనాథుల పేరుమీద ఆ ప్రాంతమేర్పడిందంటారు.

నల్లగొండ జాతర :

కరీంనగర్ జిల్లాలోని కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ సమీపాన ప్రతి సంవత్సరము మాఘ పౌర్ణిమ రోజు ఈ జాతర జరుగుతుంది. శ్రీమహావిష్ణువు హిరణ్యకశిపుని సంహరించి ఉగ్రరూపాన తిరుగుతూ ఈ కొండపై పాదం పెట్టగా నల్లటి కొండగా మారిందని ఆ కొండమీద కూర్చొని విశ్రాంతి తీసుకున్నాడని అక్కడిప్రజలు స్థలపురాణం చెపుతారు. అందుకే ఆయనకు నల్లకొండ నరసింహస్వామి యని పేరు వచ్చింది.

ఈ జాతరకు భక్తులు భక్తితో కాలినడకన, పిల్లాజెల్లతో బండ్లపై వస్తారు. ఎత్తైన కొండను వ్యయ ప్రయాసలతో ఎక్కుతూ, ఆయాసం వచ్చినపుడు 'నల్లకొండ నరసింహా నన్నాదుకో పైకి చేదుకో' అంటూ భక్తితో దర్శించుకుంటారు.

పెద్దమ్మ జాతర :

హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడిలో జనవరి చివరివారం కాని, ఫిబ్రవరి మొదటివారంలో కాని ఈ జాతర జరుగుతుంది. ఆదిశక్తియైన అమ్మవారు పండు ముత్తైదువగా రూపం ధరించి, భూలోక సంచారం చేస్తూ జూబ్లీహిల్సులో కొలువైంది. ఆ అవ్వ ముదుసలి కనుక ఎవరూ ఎక్కువగా పట్టించుకోలేదు. అమ్మ ఆగ్రహించి ఆ ప్రాంత వాసులకు మశూచి పొక్కులు వచ్చినవి. ఇరుగుపొరుగు వారంతా భయపడి రాయిలా పడి ఉన్న విగ్రహాన్ని లేపి అమ్మా! తల్లి పెద్దవ్వ, పెద్దమ్మా కాపాడు అంటూ కేకలు పెడబొబ్బలతో అమ్మనాశ్రయించారు. మశూచి వ్యాధి

మాయమై బాధనుండి ఉపశమించారు. అమ్మను ఎక్కడికీ వెళ్ళవద్దని కాళ్ళావేళ్ళా పడ్డారు. అమ్మ కూర్చున్న స్థలాన గుడి కట్టారు. పెద్దమ్మ పేరున జాతర చేస్తారు.

కొమురవెల్లి జాతర :

వరంగల్ జిల్లా చేర్యాల మండలం కొమురవెల్లి అనే గ్రామంలో ప్రతి సంవత్సరము మాఘమాసం నుండి ఉగాది (చైత్రమాసం) వరకు మల్లన్న దేవునికి జాతర జరుగుతది.

మహాదేవుడే మల్లన్న భూములు పాలించ ఆకాశమార్గాన పోతూండగా బలిజ కులానికి చెందిన బలిమేడలదేవి మేడపై నిలబడి కన్పిస్తుంది. ఏడుగురన్నదమ్ముల కొక్కతే ఆడపడచు. ఆమెను ప్రాణంగా చూసుకుంటారు.

ఒకరోజు ఆ అన్నదమ్ములు జూదమాడుట చూసి మల్లన్న కూడా వారితో జూదమాడుతాడు. జూదంలో వాళ్ళేడుగురు ఓడిపోతారు. వారి ఆస్తిపాస్తులన్నీ పోగొట్టుకుంటారు. వారితో మల్లన్న మీరోడిపోయినారు. జూదంలో ఫణంగా పెట్టడానికి మీ దగ్గర ఇంకేమి మిగలలేదన్నాడు. అప్పుడా అన్నదమ్ములు మేమోడిపోలేదు, మా చెల్లెల్ని జూదంలో పెట్టి మళ్ళీ గెలుచుకుంటామంటారు. మల్లన్న సరే అంటాడు. బలిమేడలదేవిని పందెం కాసి జూదంలో ఓడిపోతారు. మల్లన్నే మళ్లీ గెలుస్తాడు. బలిమేడల దేవిని తీసుకొని మల్లన్న గుఱ్ఱమెక్కాడు. అన్నదమ్ముల కామెనిచ్చుట యిష్టంలేక కత్తులు, బరిసెలు పట్టుకొని వెంటపడ్తారు. అది గమనించిన మల్లన్న గట్టి తుమ్ముతాడు. ఆ గాలికి వారెగిరి తుమ్మిన గాలితో తుమ్మచెట్లుగా మారిపోతారు.

మల్లన, బలిమేడలదేవితో వెళుతుండగా చీకటి పడ్తుంది. అంతలో కొమురవెల్లి గుట్ట వస్తుంది. గుట్ట మధ్యభాగంలోకి వెళ్ళి చూడగా సొరంగం కన్పిస్తుంది. ఆ రాత్రి దేవితో ఆ సొరంగంలో గడుపుతాడు. తెల్లవారి దేవి తన అన్నలను మనుషులుగా మార్చమని కోరుతది. ఆమె మాట కాదనలేక మ్రానుగా మారిన ఏడుగురిని మనుషులుగా మారుస్తాడు. అన్నదమ్ములక్కడికి వచ్చి చూసేసరికి మేడలో సర్పంతో దర్పంగా మల్లికార్జునుడు దర్శనమిస్తాడు. ఆనాటినుండి మల్లన్న జాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. ఆంధ్రరాష్ట్రంవారే కాక కర్ణాటక, మహారాష్ట్ర నుండి భక్తులు తండోపతండాలుగా వస్తారు. ప్రభుత్వం వారు తగిన సదుపాయాలు కల్పించి, తెలంగాణ ప్రాంతంలోని ఈ జాతరను జాతీయం చేస్తే భక్తులెక్కువ సంఖ్యలో దర్శించుకొని తరిస్తారు.

మహంకాళి జాతర :

ప్రతి సంవత్సరము జూలై నెలలో సికింద్రాబాదులో మహంకాళి జాతర వైభవోపేతంగా జరుగును. దీనినే బోనాల పండుగ అనికూడా అంటారు. ఆషాఢ మాసంలో జంటనగరాల్లో జరిగే అతి పెద్ద పండుగ బోనాల జాతర.

పూర్వం మహిషాసురుడనే రాక్షసుడు బ్రహ్మదేవుని నుండి వరాలు

కోరుకుంటాడు. పురుషుడి చేతిలో చావకూడదని యుద్ధంలో రక్తపు చుక్క భూమ్మీద పడితే మహిషాసురుడందుంచి పుట్టాలని కోరుకుంటాడు. మహిషుని ఆగడాలకంతు లేకపోగా దేవతలు, ప్రజలు దుర్గాదేవికి మొరపెట్టుకుంటారు. వారి ప్రార్థన మేరకు భయంకర కాళీరూపంలో ప్రత్యక్షమై భయంకర రూపంతో నాలుకచాచి ఒక్కొక్క మహిషాసురులను మింగివేసింది.

కాళి (కాలా రంగు) నలుపు కళిక = జిహ్వ = నాలుక కలదై మహాకాళి 'మహంకాళి'గా పేరుపొందినది. అప్పటినుండి ఇప్పటివరకు ఆకలిగొన్న ఆ తల్లిని అన్నంతో శాంతింపజేస్తూ బోనాలు (భోజనాలు) సమర్పించి జాతర జరుపుకుంటారు. అంబరాలనంటే సంబరాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జాతీయ పండుగగా ప్రకటించింది.

వేలాల జాతర :

ఆదిలాబాదు జిల్లా, చెన్నూరు తాలూకాలోని వేలాలలో మహాశివరాత్రికి గొప్ప జాతర జరుగుతుంది. సామూహిక పూజలు, భజనలతో శంకరుని పూజించి భక్తులు తరిస్తారు. పవిత్ర గోదావరి తీరాన పచ్చని ప్రకృతి రమణీయతతో అలరారే గుట్టపై ఈ జాతర జరుగుతుంది. కరీంనగర్, వరంగల్ ప్రాంతాల జనులక్కడ మొక్కులు చెల్లించి పూజలందిస్తారు.

మన్నెంకొండ జాతర :

మహబూబ్‌నగర్ జిల్లా మన్నెంకొండ ఆంజనేయస్వామికి జాతర జరుగుతుంది. శివాలయాల్లో శివదీక్షతో భక్తులు వచ్చినట్లే, హనుమద్దీక్షతో యువకులీ జాతర భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

ఏడుపాయల జాతర :

మెదక్‌జిల్లా, పాపన్నపేట మండలం, నాగసాని పల్లె సమీపంలో ఈ జాతర జరుగుతుంది. మంజీరనది ఏడుపాయలుగా చీలిపోయినచోట దుర్గామాతకు జాతర చేస్తారు.

జనమేజయుని సర్పయాగంలో సర్పజాతి అగ్నికాహుతికాగా, తల్లి అయిన కద్రువ పుత్రశోకంతో కుమిలిపోతుంది. తన సవతి అయిన వినుత సహాయంతో ఆమె కుమారుడైన గరుత్మంతుని పిలిపిస్తుంది. నాగజాతికి పుణ్యగతులు కలిగించమని ప్రాధేయపడుతుంది. అప్పుడు గరుత్మంతుడు గంగాదేవిని ప్రార్థించి, తన తమ్ముళ్ళకు మోక్షాన్ని ప్రసాదించమని వేడుకుంటాడు.

గంగాదేవి గరుత్మంతుని భక్తికి, పరోపకార నిరతికి మెచ్చుకొని తన కాలి అందెనుండి ఒక గజ్జెను తీసి ఇచ్చింది. దీనివల్ల నీ కోరిక నెరవేరుతుందని చెప్పింది. గరుత్మంతుడు భక్తి శ్రద్ధలతో అది తీసుకొని కళ్ళకద్దుకొని ముక్కున కరచుకొని వస్తుండగా జారి కిందపడి నదిగా మారి ప్రవహించింది. గరుత్మంతుడు సర్పయాగ స్థలానికి రాగానే, నది ఏడుపాయలుగా చీలి నాగు మృతదేహాలను పునీతం చేసి

పుణ్యలోకాలకు పంపిస్తుంది. గంగాదేవి కాలి అందె ఇచ్చిన కారణంగా ఆ నదికి 'మంజీర' అని పేరు వచ్చింది. ఏడుపాయలుగా చీలడం వలన 'ఏడుపాయల జాతర' గా ప్రసిద్ధి పొందింది. ఈ జాతర గంగాధరుడైన పరమశివుని పూజించే మహా శివరాత్రి రోజు భక్తులు జరుపుకోవటం మరో విశేషం.

ఈ జాతరల సంస్కృతి ఎక్కువగా తెలంగాణా ప్రాంతానికి పరిమితమైంది. జానపదుల ఆచార వ్యవహారాలు, ఆటలు, పాటలు, ప్రజల మనో భావాలు మనకిక్కడ ప్రస్ఫుటగా కన్పిస్తాయి. కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో ఆడి, పాడి భక్తి విశ్వాసాలతో మ్రొక్కులు చెల్లించుకుంటారు. అంతేకాక కొందరు కోళ్ళను, మేకలను, గొఱ్ఱను అమ్మవారికి బలిచ్చి సామూహికంగా వండి బోనం నివేదించి తింటారు. కల్లుపోయడం, మాంసాహారాన్ని నివేదించడం పోశమ్మ, మైసమ్మలకు మ్రొక్కడం తెలంగాణ ప్రజల జనజీవనంలో జాతరలకొక ప్రత్యేక స్థానముంది.

"ఆంధ్రత్వ మాంధ్రభాషా చ। నాల్పస్య తపనః ఫలం"॥

అని తమిళుడగు అప్పయ్య (ర్) దీక్షితులు వ్రాసిరి. 300 ఏండ్ల క్రిందటనే తమిళ ప్రసిద్ధ పండితునికి ఆంధ్రత్వమందు భిన్నత్వము కానవచ్చెను... సంస్కృతియనగా నాగరికత, లలితకళలు, సారస్వతము, సభ్యత, దైనందినాభివృద్ధి మున్నగు నుత్తమగుణము లన్నియు కలిసిన విశిష్టగుణము... ఆంధ్రులకు ప్రత్యేక సంస్కృతి కలదు. ఆంధ్రుని, అరవను, బెంగాలీని, పరానును చూచిన వెంటనే వీరు వీరని వేరుపరచవచ్చును. ఎందుకు? అది వారి వేషభాషలను బట్టియే! అందుచేత ఆ సకల భాషావాగమ శాసనులు, స్వస్థాన వేషభాషాభిమతాఃస్సంతో రసప్రలుబ్ధదియాఃః అని సెలవిచ్చిరి. ఆంధ్రులనుండి వారి భాష, భాషలోని నుడికారము, వారి భావములు, వారి శిల్పకళ, వారి పల్లెపాటలు (ఫోక్ సాంగ్స్), కథలు (ఫోక్ టాక్స్), విశ్వాసములు వారి చరిత్ర, వారి సాంఘీకాచారములు, వేసినవేసిన రేపే వారు అడవిజాతులతో కలసిపోగలరు. ఇతరులలోని ఉత్తమ కళలను స్వీకరించి తమ వాటితో మేళవించి తమవిగా చేసుకొనుట నాగరిక లక్షణము. విజయనగర సమ్రాట్టులు, మధురా, తంజాపురీ నాయక రాజులును హిందూ ముస్లిం శిల్ప సమ్మేళనము గావించి ప్రత్యేకాంధ్ర శిల్పమును స్థాపించిరి. ఆంధ్రులు తమ భాషకు శ్రావ్యతను సమకూర్చి కర్ణాటక సంగీతమను పేరుతో ఖ్యాతిగాంచిన కళను దక్షిణాపథమున కంతటికిని ప్రసాదించిరి. మళయాళములో కథాకళి, గుజరాతులో గర్భనృత్యము, ఉత్తర హిందూ స్థానములో రామలీల, కథక్ నృత్యఉ, ఆసాములో మణిపురి నృత్యము మున్నగు విశిష్ట వైవిధ్య నృత్యాలు భారతదేశమందలి నానా ప్రాంతములలో నే విధముగా వెలసెనో! ఆంధ్రులందున కూచిపూడి భాగవతులచే పరిరక్షితమైన నృత్యమునకు ప్రత్యేకత కలదు. రామప్ప గుడిలోని నృత్య శిల్పములు జాయసేనాని నృత్య రత్నాకరానికి ఉదాహరణములు.

– ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణా సంస్కృతికి చెందిన వ్రతాలు - పండుగలు

- డా. ఆర్.కమల

తెలుగు ప్రజల సంస్కృతీ స్రవంతిలో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రాంతాల సంస్కృతులు ఎన్నో కొన్ని కలిసినా ప్రాంతాల వారీగా ఎవరి సంస్కృతి వారికి ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ ప్రత్యేకత ఆయా ప్రాంత చారిత్రక నైసర్గిక నేపథ్యాలపై ఆధారపడి ఉంది. తెలంగాణా ప్రజల సంస్కృతిలో ప్రత్యేకమైన కొన్ని పండగలు కేవలం వారివిగా, వారి వారసత్వ సంపదగా మిగిలి పోయాయి. అవే బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలు, బోనాలు, (మహంకాళి జాతర), హోలీ (కాముని పండగ), పీరీల పండగ, సమ్మక్క-సారలమ్మ జాతరలు మున్నగునవి. తెలంగాణా వారు వాటిని 'మా సంస్కృతికి సంబంధించినవి' యని సగర్వంగా చెప్పుకుంటారు.

తెలంగాణ ప్రాంతంపై పక్కనే ఉన్న మహారాష్ట్ర సంప్రదాయ ప్రభావం ఉన్నది. రెండు ప్రాంతాల సరిహద్దుల్లో రాకపోకలు, సంబంధ బాంధవ్యాల ద్వారా వీరి ఆచారాలు వారు, వారి ఆచారాలు వీరు ఆచరించడం సహజం. అందుకే తెలంగాణ ప్రజలకొక విలక్షణమైన సంస్కృతి ఏర్పడింది. వీరి కట్టుబొట్టు ఆహార విహారాలు దేశంలో మరెక్కడా కన్పించవు. ఇక్కడి ప్రజలు వృత్తిరీత్యా దేశవిదేశాల్లో ఎక్కడ ఉన్నా, సంస్కృతి సంప్రదాయాలు మరువలేదు. వీరి కుటుంబాల్లో పండగలు, వేడుకలు సామూహికంగా జరుపుకొని సంతోషిస్తారు. తెలంగాణా పండుగలని పేర్కొవటంలో అబ్బురపడాల్సిన పనిలేదు. పొలిమేర భేదించిందంటే భాషలు, యాసలు భేదిస్తాయి. అలాగే రీతులు, రివాజులు భేదిస్తాయి. ఆయా రుతువుల్లో పండే పంటలు, లభించే పువ్వు, పత్రిక, కాయ, పండూ, ఆకు అలంను బట్టి ఏర్పడతాయి కాబట్టి అందుకు అనుకూలమైన దేవతలపేర్లతో పండుగలు జరుపుకుంటారు. కంకణధారణ, కలశస్థాపన చేసుకుంటారు.

తెలుగు ప్రజలకు పరంపరగా వచ్చిన యుగాది, సంక్రాంతి, దీపావళి, దసరా (విజయదశమి) వంటి పండుగలను ఇరు ప్రాంతాల వారు జరుపుకుంటారు కాని ఆ జరుపుకోవడంలో కూడా తేడాలున్నాయి. ఉదాహరణకు 'గొబ్బెమ్మ పండుగ' ఆంధ్రా ప్రాంతంలో సంక్రాంతి సమయంలో జరుపు కుంటారు. గొబ్బెమ్మను గౌరీదేవిగా పూజిస్తారు. సంక్రాంతిని అన్ని ప్రాంతాలవారు జరుపుకున్నా ఆంధ్రావారు దానిని పెద్ద పండుగగా చెప్పుకుంటారు. అదేవిధంగా తెలంగాణా ప్రజలకు దసరా, బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగలు పెద్ద పండుగలు.

బొడ్డెమ్మ పండుగ

తెలంగాణా లోని బతుకమ్మ పండగ పెద్దల పండగ. బొడ్డెమ్మ పండగ పిల్లల పండగ. వినాయక చవితి నాడు లేదా భాద్రపద బహుళ పంచమినాడు మొదలు పెట్టి మహాలయ అమావాస్యతో బొడ్డెమ్మ పూజలు పూర్తి చేస్తారు. పండగ మొదటి రోజున ఒక పీట మీద పుట్టమన్నుతో బతుకమ్మ ఆకారంలో త్రికోణ గోపురంగా నిర్మించి దాని చుట్టూ తంగేడు, కట్ల, మొదలగు పూలతో అలంకరించి దాని తలమీద కలశాన్ని పెట్టి బియ్యం పోసి కొత్త రవికబట్ట, పసుపుముద్దతో గౌరమ్మను చేసి పసుపు కుంకుమలతో పూజిస్తారు. ఆడ పిల్లలందరూ దీనిని సమిష్టిగానైనా విడివిడిగానైనా జరుపుకుంటారు. సాయంకాలం ఆరుబయట పుట్టమన్ను తో అలికిన స్థలంతో ఈ బొడ్డెమ్మను పెట్టి దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడి చివరకు పప్పుబెల్లాలు ప్రసాదంగా పంచుకుంటారు. బొడ్డెమ్మ పండుగ చివరి రోజున కలశంలో తొమ్మిది రోజులు పోసిన బియ్యంతో పాయసం చేసుకుంటారు. ఈ పండుగ తొమ్మిది రోజులు జరుపుకుంటారు.

బతుకమ్మ పండుగ

ఈ పండుగ నవరాత్రితో ప్రారంభమ వుతుంది. బతుకమ్మను పేర్చుటకు ప్రసిద్ధమైన పువ్వులు గుమ్మడి ఆకులు, గుమ్మడి, గూనుగు, కట్ల, నువ్వు, బీర, గన్నేరు, రుద్రాక్ష, గోరింట, తంగేడు పువ్వులు ప్రత్యేకంగా వాడుతారు. ప్రతిరోజూ సాయంకాలం ఆడవారందరూ గుమిగూడి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాడుతారు.

దసరా పండగ

తెలంగాణాలోని 'దసరా పండగ' అందిరికి చెందిన పండగ. మాంసాహారాలు కులాసాగా, ఖుషీఖుషీగా తప్పనిసరిగా ఆరగించే, సారాను నీరులా సేవించే, అందరూ కొత్త బట్టలు ధరించే పండగ. తెలంగాణాలో దసరా పండగను సంపన్నులే కాదు సదరు ప్రజలు కూడా అతి పెద్ద పండగగా భావిస్తారు. స్త్రీలు బతుకమ్మ పండగను ఎలా అతి పెద్దపండగగా భావిస్తారో పురుషులు దసరా పండగను అలా భావిస్తారు.

హరితాళిక

ఇది వినాకయచవితి ముందురోజు చేసుకునే పండుగ. యిల్లు అలికి ముగ్గులు పెట్టుకొని ప్రొద్దంతా ఉపవాసముండి, రాత్రి యిసుకలో శివలింగం చేసి భక్తితో శివపార్వతులను పూజిస్తారు. ఉదయాన వినాయక చవితి యథావిధిగా జరుపుకుంటారు. భాద్రపదశుక్ల తృతీయనాడు చేసుకుంటారు.

పొలాల అమావాస్య

శ్రావణమాసం చివర, భాద్రపద మాసారంభాన ఈ పండుగ చేసుకుంటారు. రేగటి మట్టిలో ఎడ్లను, గొల్ల బోయణ్ణి చేసి పూజిస్తారు. సాయంత్రం ఎడ్లకు

రంగురంగుల చుక్కలు పెట్టి అలంకరిస్తారు. నెమలీకలు కొమ్ములకు కడ్తారు. పాడిపంటలు పుష్కలంగా వారి ప్రాంతాన ఉండాలని నియమనిష్టలతో చేసుకునే పండుగ ఇది.

చిలుకు ద్వాదశి

కార్తీక శుక్ల ఏకాదశి ఉపవసించి, ద్వాదశి రోజు తులసికోటను అష్టదళ పద్మంతో అలంకరించి, ఉసరిక కొమ్మను తులసి చెట్టు మొదట్లో ఉంచి ముత్తైదువులు జరుపుకునే పండుగ. బియ్యపు పిండిని చెరుకుగడతో దంచగా పైనపడే పాటు స్వర్గలోకవాస మేర్పడ్తదని, యిక్కడి ప్రజలు నమ్మకం. పచ్చిపిండి ముద్దలు వాయనం చేసి అందరికి పసుపుకుంకుమ, రవికబట్ట దక్షిణ యిచ్చి దీవెనలందుతాయి.

వటసావిత్రి పున్నమి

ఈ పండుగను జ్యేష్ఠ శుద్ధ పున్నమినాడు ప్రజలంతా భక్తి శ్రద్ధలతో చేసుకుంటారు. ఊరిలోని వటవృక్షాన్ని పూజించి, ఆ చెట్టుకింద ఈ పండగ చేసుకుంటారు. దీనితో ఆరోగ్యం, ఆయుష్షు కలిగి ఉంటారని ఈ ప్రాంతంవారి ప్రగాఢ విశ్వాసం.

కేదారి వ్రతం

దీపావళి పండుగ తెల్లవారి గురుగుల నలంకరించి, చక్కెర చిలుకలు, పేలాలు పెట్టి కేదారిదేవిని నియమనిష్టలలో కొలుస్తే ధనధాన్యాలకు కొదువ ఉండదని వీరి నమ్మకం. తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

అనంతచతుర్దశి

ఎర్రదారం చేతికి కట్టుకొని దీక్షతో లక్ష్మీ విష్ణువులను పూజిస్తారు. బంధుమిత్రులతో కలిసి భుజిస్తారు. అనంతుని అనంత రూపాలలో కొలిచే పండగ యిది.

మహిష పండుగ

ఇది దీపావళి తర్వాత 3 రోజులకు అత్యంత వైభవంగా చేసుకుంటారు. యమధర్మరాజు వాహనమైన దున్నపోతును శుభ్రంగా కడిగి గజ్జెలు, గంటలు కట్టి అలంకరిస్తారు, ఊరేగిస్తారు. ఈ పండగ చేసుకుంటే యమగండాలు, అకాలమృత్యు భయముండదని ఇక్కడివారి విశ్వాసం. యాదవులు దీనిని 'సదర్' అని సంభోదిస్తారు.

బోనాల పండగ

బోనాల పండగ తెలంగాణాలోనే ఎక్కువ పాపులర్‌గా ఉంది. మరీ హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో. దీనినే 'మహంకాళి జాతర' అని కూడా అంటారు. ఇది స్త్రీలు వారికి ముఖ్యమైన పండుగగా భావిస్తారు. దేవుడు రావడం, తూలడం మున్నగునవి స్త్రీల ఉత్సవాలలో కనబడతాయి.

వినాయక చవితి

తెలంగాణాలో జరుపుకొను 'వినాయక చవితి' సీమాంధ్రలో జరుపుకునే దానికన్నా చాలా పెద్దదని చెప్పాలి. హైదరాబాదులో జరుపుకునే వినాయకచవితి మరీ పెద్దది. ఈ పండగ జరుపుకునే పరంపర తెలంగాణా వారికి ఒకప్పటి హైదరాబాదు రాష్ట్రంలో భాగమైన మహారాష్ట్ర ప్రాంతంనుండి వచ్చింది.

నిజాం ప్రభువు నలుగురు వ్యక్తులు కలిస్తే లాఠీ ఛార్జీ చేయించేవారు. ప్రజలు వారి మనో భావాలను ఎలా వ్యక్తం చేసుకోవాలో తెలియక వ్యధ చెందసాగారు. మహారాష్ట్ర ప్రజలు ప్రక్కనే ఉండడంతో తెలంగాణా వారికొక ఉపాయం తట్టింది. గణపతి నవరాత్రుల పేరుతో 9,10 రోజులు సామూహిక పూజలు, భజనలు చేస్తూ వారి మనోగతాన్ని బంధుమిత్రులకు తెలుపటానికి చక్కని అవకాశం. చాందా, బల్లార్షా, నాగ్‌పూర్ నుండి విగ్రహాలను తెచ్చి పూజించసాగారు. విందులు, వినోదాల పేరుతో ప్రజల సత్తాను, మనోభావాన్ని తెలుసుకొని తెలంగాణా పోరాట ఉద్యమంలో పాల్గొన్నారు. పండుగల వెనుక పరమార్థమిది.

మహారాష్ట్రలో ఎంత పెద్దగానైతే ఈ పండుగ జరుపుకుంటారో అంత పెద్దగా ఒక్క తెలంగాణా ప్రాంతంలోనే జరుపుకుంటారు. తెలంగాణావారు ఈ పండగను వారి పండగల్లో ఒక పెద్ద పండగగా భావిస్తారు. ఇలాంటి తీరు సీమాంధ్రలో మనకు కనబడదు.

హోలీ (కాముని పండగ)

హోలీ పండగ ఉత్తర భారతదేశంనుండి ఒకప్పటి హైదరాబాదు రాష్ట్రానికి వచ్చిన పండగ. ఈ పండగ సందర్భంగా తెలంగాణా వాసులందరూ ఉత్తర భారతీయులవలె రంగులు బాహాటంగా చల్లుకోవడం, పండగ తుదకు కామున్ని కాలేయడం ప్రతిపాటి. ఇప్పుడీ పండగ తెలంగాణావారి పండగ లాంటిది అయిపోయింది. తెలంగాణాలోని అన్నిచోట్లా జరుపుకోబడుతోంది.

పీరీల పండగ

తెలంగాణాలో మహమ్మదీయులు 'మొహర్రమ్' పండగ జరుపు కుంటారు. దీనినే హిందువులు 'పీరీల పండగ' అంటారు. ఈ పండగ మహమ్మదీయులదయినా తెలంగాణా హిందువులందరూ కూడా దీనిలో పాల్గొంటారు. పీరీలను వారి ఇంటికి తీసికొచ్చిన వారి కాళ్ళపై నీళ్ళు పోస్తారు. పిల్లలు కానివారు పిల్లలు కావాలని వాటిని మొక్కుతారు. పీరీల పండగ రోజుల్లో ప్రతి ఊరిలో పెద్ద జాతరలాంటిది జరుపుకుంటారు.

'బక్రీద్', 'మీలాదుల్ నబీ' పండగలు

తెలంగాణాలోని మహమ్మదీయుల 'బక్రీదు', 'మీలాదుల్ నబీ' పండగలను కూడా తెలంగాణా హిందువులు వారి పండగల్లాగానే వాటిలో పాల్గొని

మహమ్మదీయులతో పాటు కలిసి భుజిస్తారు, పానీయాలు వగైరా సేవిస్తారు, అలాయిబలాయిలు చేసుకుంటారు. ఈ సంస్కృతి సీమాంధ్రలో కనబడదు. దానికి కారణం వందలాది సంవత్సరాలనుండి తెలంగాణా హిందువులు, తెలంగాణా మహమ్మదీయులు తెలంగాణాలో కలసిమెలసి ఉండడమే. ఒకరి సంస్కృతులను ఒకరు, ఒకరి పండగలను ఒకరు గుర్తించడం, గౌరవించడమే.

తెలంగాణాలోని హరిజనులు, బీసీలు తక్కిన వారందరు జరుపుకునే సదరు పండగలతో పాటు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలను పూజిస్తారు. కొన్ని కొన్ని ప్రత్యేక రోజుల్లో, సందర్భాల్లో ఆయాచోట్ల జాతరలు, ఉత్సవాలలాంటివి చేసికొంటారు.

తెలంగాణా ఆదివాసుల పండగలు

తెలంగాణావారి పండగలలో ఆదివాసుల పండగలు ప్రత్యేకమైనవి. ఈ పండగలను తెలంగాణాలో 'జాతరలు' అంటారు. వీటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి కోయవారి 'సమ్మక్క-సారలమ్మ జాతర', గోండుల 'నాగశేష', 'పెర్సాపెన్' జాతరలు, బంజారాల 'శీతాలభవాని', 'శివభయ్య' జాతరలు, చెంచువారి 'గారెల మైసమ్మ', 'భగవంతరు' జాతరలు.

పశువులను, పక్షులను, పాములను పూజించే గొప్ప సంస్కృతి. "ఈశ్వరానాం సర్వభూతేషు" అన్నట్లు గొప్ప సంస్కృతి తెలంగాణ సంస్కృతి.

– డా. పి.సరస్వతి

తెలంగాణా దెవాలయాలు

-వట్టికోట ఆళ్వారుస్వామి

తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలలో 641 దేవాలయాలు న్నాయి. జిల్లాల వారీగా జూచినచో హైదరాబాదు జిల్లాలో 42, వరంగల్, ఖమ్మం జిల్లాలో 66, కరీంనగరు జిల్లాలో 62, ఆదిలాబాదు జిల్లాలో 62, నిజామాబాదు జిల్లాలో 96, మెదక్ జిల్లాలో 92, మహబూబునగర్ జిల్లాలో 134, నల్లగొండ జిల్లాలో 87 - ఈ విధంగా 641 దేవాలయాలు తెలంగాణాలో ఉన్నాయి. మహబూబునగర్ జిల్లాలో అత్యధిక సంఖ్యలో నున్నట్లు, హైదరాబాదు జిల్లాలో అత్యల్ప సంఖ్యలోనున్నట్లు పై సంఖ్యలో తేలగలదు. తాలూకాల వారీగా జూచినచో నిజామాబాదు జిల్లా ఆర్మూరు తాలూకా అగ్రస్థానం వహించింది. ఇచ్చట 46 దేవాలయాలున్నాయి. దీని తరువాత పేర్కొనదగింది మహబూబునగర్ జిల్లా మఖ్తల్ తాలూకా. ఇచ్చట 40 గలవు. వరంగల్ జిల్లాలో అయినవోలు, కొరివి, పాలంపేట, ముఖ్యంగా పేర్కొనదగిన మహాస్థలాలు. అయినవోలులో మైలారుదేవుడు గలడు. 20 దినముల వరకు ఉత్సవం సాగుతుంది. దేవమందిరం, మంటపాలు మొదలగునవి కాకతీయ శిల్పము ననుసరించి నిర్మితమై దివ్యంగా ఉంటుంది. కొరివిలో వీరభద్రస్వామి దేవాలయ ముంది. ప్రతి సంవత్సరము శివరాత్రితో ఉత్సవం ప్రారంభ మయి అత్యంత వైభవోపేతంగా 20 రోజులు జరుగుతుంది. ఇది సాటిలేని మేటి జాతరగా ప్రసిద్ధి కెక్కింది. ఈ కొరివి మహబూబాబాదుకు 6 మైళ్ళ దూరాన ఉంది. ఖమ్మం జిల్లాలో భద్రాచలం, దమ్మపేట ముఖ్యమయిన యాత్రాస్థానములు. భద్రాచలంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయము భరతభూమిలో ప్రసిద్ధి చెందింది. చైత్రమాసంలో ప్రారంభమై 30 దినములు సాగుతుంది. కరీంనగరు జిల్లాలో ధర్మపురి, వేములవాడ, మంథెన, బేర్సూరు ప్రసిద్ధ స్థలములు. ఆదిలాబాదు జిల్లాలో సావరపూరు, రాజోరా, కేసలాపురం ముఖ్య ప్రదేశాలు. వీటిలో కేసలాపురంలోని భీమదేవు దేవాలయం గోండుజాతికి సంబంధించింది. ఇది గోండుల గొప్పజాతర పుష్యమాసం తరువాత ప్రారంభమవుతుంది. 15 దినాలు జరుగుతుంది. వేలకొలది గోండులు గుమిగూడుతారు. గోండుకవులు, పాటగాండ్రు, ప్రధానులు వాయిద్యములు వాయించుచు భక్తిగీతములు పాడుతారు. ఈ ఉత్సవంలో క్రొత్తగా వివాహమైన పెండ్లికూతుళ్ళు ప్రధాన పాత్రలు వహిస్తారు. విగ్రహంముందు రాత్రంతయు నాట్యాలు జరుగుతాయి. పూజా పునస్కారాలలో ఆదిశేషునకు గొప్పపూజ జరుగుతుంది. మహబూబునగరు జిల్లా ఆమాపూరు, ఆత్మకూరు, శిరసనగండ్ల, గంగాపురము ప్రసిద్ధ స్థలాలు, నల్లగొండ జిల్లాలో పానుగల్లు, వాడపల్లి, జీడికల్లు, యాదగిరిగుట్ట ప్రసిద్ధస్థలాలు.

హనుమకొండయందలి దర్శనీయ ప్రదేశాలలో వేయిస్తంభాల గుడి, పద్మాక్షి

గుడి, భద్రగుడి ముఖ్యముగా పేర్కొనదగినది. వేయిస్తంభాల గుడి 1162లో చాళుక్య శిల్పము ననుసరించి నిర్మింపబడింది. ఇందు ఒకదానితో నొకటి సంబంధము లేని మూడు విశాలాంగణాలు, వాటికి ముందు 300 స్తంభములచే ఒప్పారెడు ఒక ముఖ మంటపముంది. ముఖమండపాని కెదుట నక్షత్రాకారమున మండపమొకటుంది. దీనికి 200 స్తంభాలున్నాయి. మూడు దేవాలయములు జేర్చి కట్టబడుటచే దీనికి త్రికూటాలయమని పేరొచ్చింది. స్తంభముల మీద మనోహరంగా చిత్రములు చెక్కబడినాయి.

వరంగల్లు జిల్లా ములుగు తాలూకాలోని రామప్పగుడి ప్రత్యేక ప్రశంసకు తగింది. ఈ ఆలయ నిర్మాణము, చిత్ర కౌశల్యము, శిల్ప నైపుణ్యం వర్ణింప నలవిగాదు. ఈ ఆలయంలో ఆకర్షణీయమైనట్టివి స్త్రీ విగ్రహాలు. ఈ విగ్రహాలు ఆలయ గోపురాన్ని మోస్తున్నట్లు నిర్మింపబడిన రాతి సాలభంజికలు. వీటి అందం వర్ణింప నలవిగాదు. ఆ విగ్రహాలు ప్రాణాలు గలవిగా కనిపిస్తాయి. కాకతీయ శిల్ప చాతుర్యమంతా, భరతశాస్త్రమంతా పుంజీభవించి స్తంభాల యందు, కప్పుల యందు గనపడుతుంది.

నల్లగొండలోని ఛాయా సోమేశ్వరాలయ మొక అద్భుత మందిరం. ఈ ఆలయంలోని లింగంపై దీర్ఘమగు నల్లని నీడ ఒకటి పగలంతయు నొకేచోట కదలక కనిపిస్తుంది. ఈ నీడ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఎంత మాత్రం చలింపక ఒకేచోటనే గానుపించుట వింతయిన విషయం. చిత్రాతి చిత్రమైన ఈ ఛాయారహస్యం ఇంతవరకు ఎవరును తెలిసికోజాలలేదు. అది యా మహాశిల్పికి మాత్రమే తెలుసు. నల్లగొండ జిల్లాలోని నాగులపాడు, పిల్లలమఱ్ఱి దేవాలయాలు మధ్యయుగం నాటి వాస్తుశిల్ప వైభవానికి ఉత్తమ నిదర్శనాలని చెప్పవచ్చును. మధ్యయుగంనాటి శిల్పి సౌందర్యపిపాసి, ఈ శిల్పి జీవితమునందున్న బిగి, పరిపూర్ణత మొదలగు విశాల భావాలను జీర్ణించుకొని సౌందర్యము నొక విశాల దృక్పథముతో అవగాహన చేసికొన్నాడు. భంగిమాల చిత్రణయందును, చైతన్యమును ప్రకటించుటయందును, అలంకార రచనయందును, ఆభరణ విన్యాసమందును తెలంగాణ శిల్ప శోభను, లావణ్యాన్ని గూర్చినాడు. ఈ దేవాలయాలు ముక్తికి, రక్తికి అనుకూల్యాలయి తెలంగాణవాసులను తరింపచేస్తాయి.

మన దేవాలయాల శిల్ప విన్నాణము పరాకాష్ఠను పొందిన భారతీయ సంస్కృతికి ప్రత్యక్ష నిదర్శనాలు. దేశం నలుమూలలా, అడుగడుగునా వెలసిన ఈ దేవాలయాలను చూస్తే ఆనాటి భారతశిల్పులలో వెల్లివిరిసిన సృజనాత్మక కళాప్రతిభ ద్యోతకం కాగలదు. అట్టి శిల్ప ప్రతిభ క్రమేణా అంతరించుటేగాక, ప్రాచీన శిల్ప సంపదను హర్షింపగల సామర్థ్యాన్ని కూడా కోల్పోతూ వచ్చాము.

పాశ్చాత్యులు మన శిల్పం, చిత్రకళ, సారస్వతం మొదలగువాని ఉత్కృష్టతను మనకు తెలియజేయువరకు మనం గుర్తింపజాలక పోయాము. కాని, కొలది సంవత్సరాలుగా ఇటు కొంత కృషి జరుగుతూ ఉండడం ముదావహం.

శిల్ప విజ్ఞానం క్షీణిస్తూ ఉన్న కొద్దీ, మన దేవాలయ శిల్పాన్ని ఎట్లా పరిరక్షించుకోవలెనో కూడ విస్మరించాము. ఆయా ప్రదేశాలలోనివారు దేవాలయాలను మరమ్మతులు చేసేటప్పుడు, ఏటేటా వెల్లలు వేయించే సందర్భంలోను శిల్పసంపదను పాడుచేస్తూ వచ్చారు. అందుచే మన శిల్ప సౌందర్యాన్ని సరిగా తెలిసికొనటానికి అవకాశాలు తగ్గుతూ వచ్చాయి. కావున ఇకనైనా మనం మన శిల్పాల మహత్తరతను గుర్తించి, వాని సక్రమరక్షణకు ప్రయత్నించాలి.

ఈ విషయాన్నే శ్రీ డగ్లస్ బారెట్ అనే ఆయన ఇటీవల చెప్పియున్నారు. అతడు లండనులోని బ్రిటిష్ మ్యూజియానికి చెందిన ప్రాచ్య పురావస్తుశాఖకు చెందినవాడు. మిస్టర్ బారెట్ హిందూదేశంలో పర్యటించి, ఇచ్చటి కళాఖండాలను పరిశీలించుటకై వచ్చారు. మన దేవాలయ పరిస్థితిని చక్కజేయవలెనని ఆయన ఇటీవల చెప్పియున్నారు. **('మన దేవాలయాలు', కిన్నెర : సంపుటము4, సంచిక3, మార్చి,1952)**

తెలంగాణాలోని ఎన్నో దేవాలయాలు ఇపుడు పూజలకు, దీపాలకు కూడా నోచుకోనివి అయినాయి. ఎన్నో కూలిపోయాయి, శిథిలావస్థల్లో ఉన్నాయి. వాటికి చెందిన భూములన్నీ అన్యాక్రాంతమైనాయి, అమ్ముకోబడినాయి. దేవున్ని మొక్కడం, దేవుని పేరట మొక్కడం తప్ప ఇపుడు నిజంగా దేవుని గుడిని ఒక పవిత్రస్థానంగా భావించి దాని పవిత్రతను కాపాడుటకు అటు ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు, ఇటు ప్రజలూ, సమాజాలు కూడా. పెద్ద పెద్ద దేవాలయాలకే పరిరక్షణ దిక్కులేదు, చిన్నవాటిని ఎవడడిగినాడు. నిన్నగాక మొన్న కాళహస్తిలో కూలిన కాళహస్తి దేవాలయ శిఖరమే దీనికి సాక్ష్యం. తెలంగాణాలోని కొండగట్టు దేవాలయం అరవై యేండ్లకు గాని నిన్నగాక మొన్న ఒక చిన్నపాటి తారురోడ్డుకు నోచుకోలేదు. ఇపుడు కోటిలింగాలకు పోతే అచట ఒకపుడు ఒక బ్రహ్మాండమైన దేవాలయం ఉన్న జాడే కానరాదు. ధర్మపురి, కీసర, బాసర దేవాలయాల పరిరక్షణను అంతగా పట్టించుకున్నవారు లేరు. కాళేశ్వరం దేవాలయం ఎంత పెద్ద పుణ్యక్షేత్రమని భావించబడినా దాని పక్కనే ప్రవహిస్తోన్న గోదావరి నది పుష్కరాలకు నోచుకోదు కాని విజయవాడ మాత్రం నోచుకుంటుంది.

(కొండలరావు వెల్చాల, కన్వీనర్, తెలంగాణా కల్చరల్ ఫోరమ్)

తెలంగాణ ప్రాచీన కవిత్వం దృక్పథం

- డా.గండ్ర లక్ష్మణరావు

తెలంగాణ ప్రాచీన కవిత్వం ఇటీవలి వరకు విడిగా గుర్తింపబడలేదు. తెలంగాణ రాజకీయ ఉద్యమం ఊపందుకున్న దశలో తెలంగాణ చరిత్ర, సాహిత్యం, కళలు మొదలైనవి అస్తిత్వాన్ని చాటుకునే ప్రయత్నం చేశాయి. ఈ దశలోనే తెలంగాణ సాహిత్యాన్ని చరిత్రగా రాయాలని పలువురి మనస్సుల్లో ఉన్నా ఈ మధ్య ముంగిలి పేరుతో సమగ్రం కాకపోయినా గొప్ప ప్రయత్నం చేశాడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలుగు సాహిత్య చరిత్రగానే ఇంతవరకు చదువుకున్నాం. చదువుకుంటున్నాం. తెలుగు కవుల చరిత్ర, కవితరంగిణి, ఆంధ్రకవుల చరిత్ర, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, సమగ్ర ఆంధ్ర చరిత్ర , తెలుగు సాహిత్య చరిత్ర మొదలైన పేర్లతో సాహిత్య చరిత్రలు వెలువడ్డాయి. వాటినే ప్రామాణికంగా ఇప్పటివరకు చదువుతున్నాం. ఈ చరిత్రలన్నీ కందుకూరితో మొదలైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎక్కువ ప్రచారంలోకి వచ్చినాయి. ఆదికవి నన్నయ అని అంతకు ముందు ప్రాఙ్నన్నయ యుగమనీ ఆ తరువాత కవుల కాలాలను బట్టి , కవుల రచనలను బట్టి , యుగవిభజనలు చేశారు. వాటిల్లో ఎక్కడో ఒక చోట తప్పనిసరియైన చోట మాత్రమే తెలంగాణ కవులకు స్థానం కల్పించారు కాని చాలా చోట్ల నిర్లక్ష్యం చేయడం స్పష్టంగానే కన్పిస్తుంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను మరింత అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలంగాణ చారిత్రికంగా, భౌగోళికంగా తనదైన ఉనికి, ప్రత్యేకతలు కలిగి ఉన్నట్లే సాహిత్యంలో కూడా తనదైన ముద్రలు ఉన్నాయని వాటిని వెలికి తీసే ప్రయత్నంగానే ఈ వ్యాసం రాయడానికి ప్రయత్నిస్తున్నాను. ఇది ఒక ప్రారంభం మాత్రమే.

తెలంగాణ ప్రజల వనరులు, వృత్తులు, జీవనవిధానం పైనే వారి ఆలోచనలు ఆధారపడి ఉండడం సహజం. సమాజంలోని ఇతర ప్రాంతాల ప్రభావాలు రాజకీయాలు, వలసలు ఇతరేతర కారణాలు మున్నగునవి దానిపై ఉన్నప్పటికీ, తన మూలాలను తాను ఏదో ఒకవిధంగా కాపాడుకుంటూనే ఉంటుంది. అట్లా మూలాలు బలంగా ఉన్న ప్రాంతమే ఒక భాషా ప్రాంతంగా, ఒక రాజకీయ ప్రాంతంగా అంటే రాష్ట్రంగా చెప్పుకోవడానికి యోగ్యత కలిగిఉంటుంది.

తెలంగాణ ప్రజలు ప్రాచీన కాలంనుండి కష్టజీవులు. దండకారణ్యం ఛేదిస్తూ సాగుభూములు తయారు చేసుకున్నవారు. గుట్టలు, కొండలు ఎక్కుతూ దిగుతూ

బాటలు వేసుకున్నవారు. పశుసంపద పెంచుకున్నవారు. దండయాత్రలకు గురయి పోరాటాలకలవాటుపడ్డవారు. తమ మాటను, తమ పాటను, తమబాటను తామే తయారు చేసుకున్నవారు. ఆ స్వంత గొంతు అన్నిరంగాలలో ఉన్నట్లే సాహిత్య రంగంలో కూడా కనపడుతుంది.

ప్రాచీన తెలంగాణ భాష క్రీ.పూ. నుండి ఉన్నా సాహిత్యం క్రీ.శ 9 వ శ నుండి క్రీ.శ. 18 శ. వరకు గ్రహించవచ్చు. 19 వ శతాబ్దం పూర్వార్ధం కూడా దాదాపు ప్రాచీనతా ఛాయలే కనపడుతాయి. కుతుబ్‌షాహీలు, ఆసఫ్ జాహీల పాలన కారణంగా పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమంగా ఉండడం, పరిపాలనలో కూడా అధికార భాషగా ఉండడం కారణంగా తెలుగు తన ఉనికిని తానే పల్లెల్లో జీవభాషగా, పండితుల్లో గ్రాంథిక భాషగా నిలుపుకుంటూ వచ్చింది. ఇంగ్లీషు సాహిత్య ప్రభావం ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడే వరకు కేవలం నగరానికి చెందినంతవరకు మాత్రమే. పి.వి.నరసింహారావు, డా.సి.నారాయణ రెడ్డి వరకు ఉర్దూ మాధ్యమం పాఠశాలల్లో చదివారు. అంతకు ముందు పరిస్థితిని మనం ఊహించుకోవాలి. అయినా ప్రసిద్ధమైన కావ్యాలు, పద్యాలు, తత్వాలు, శతకాలు ప్రతి పల్లెలో చదువు వచ్చినవారు, రాని వారు కూడా చదువుకునే వారు. ఆ విధంగా సాహిత్యాన్ని అభిమానించి అపురూపంగా ఇక్కడి భాషను కాపాడుకున్నారు. అందువలన ప్రాచీన తెలంగాణ సాహిత్యం అచ్చంగా తనదైన సామాజిక జీవనం వచ్చినదే అని ఖచ్చితంగా చెప్పవచ్చును.

ఈ మధ్య కాలంలో (క్రీ.పూ. నుండి క్రీ.శ 18 వరకు) వేలాది మంది కవులు రచనలు వెలువరించారు. ఇప్పటికింకా వెలుగు చూడని గ్రంధాలెన్నో ఉన్నాయి. ఇంకా తాళపత్రాల రూపంలోనే ఉన్నరచనలెన్నో ఉన్నట్లుగా ఇటీవల తాళపత్ర గ్రంథ సేకరణ సందర్భంగా వేలాది ప్రతులు దొరకడమే సాక్ష్యం. వెలుగు చూసిన వాటిలో చరిత్రకెక్కినవి కొన్ని, చరిత్రలో నామమాత్రంగా పేర్కొనబడినవి ఎన్నో ఉన్నాయి. ఈ అందరి రచనలను ఈ సందర్భంగా పరిశీలించడం అసాధ్యం కనుక తెలంగాణ ఉనికిని చాటి చెప్పే ప్రసిద్ధమైన రచనలు ఆధారంగా ప్రాచీన తెలంగాణ సాహిత్యంలో కనిపించే విశిష్టమైన అంశాలు కొన్నింటిని వివరిస్తాను. సాహిత్యకారు లందరూ ఒక సంస్థగా ఏర్పడి పని చేసినపడు ఒకే దృక్పథం ఉంటుంది. కాని వేరు వేరు కాలాల్లో వేరు గ్రామాలలో పట్టణాలలో వెలువడిన రచనలకు ఒక దృక్పథం ఎట్లా ఉంటుందనే అనుమానం రావచ్చు. ఈ పల్లెలు, పట్టణాలు ఒకే జీవన విధానానికి, సంస్కృతికి అలవాటు పడి ఉండడం చేత అక్కడి కవుల రచనల్లో సామాన్య లక్షణాలుండడం అసాధారణం కాదని నా అభిప్రాయం. ఆ దృష్టితోనే ఈ తెలంగాణ ప్రాచీన సాహిత్యాన్ని ఒక దృక్పథంగా చూడడానికి ప్రయత్నిద్దాం.

గఱకపు ముద్ద లోహమవగాఢమహీశని కోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి.యురగాధిపు కోరలు పట్టుకార్లు, ది
క్కరటి శిరంబుదాయి, లయకారుడు కమ్మరి,వైరి వీర సం
హరణ గుణాభి రాముడన మైలమ భీమన ఖడ్గసృష్టికిన్

ఇది వేములవాడ భీమకవి పద్యము. భీమకవిది కరీంనగర్ జిల్లాలోని వేములవాడ కాదని డా. మలయశ్రీ తన సిద్ధాంత గ్రంథములో చర్చించాడు. కాని అతనిది వేములవాడయనియే అనేక ఉపపత్తులు చూపి డా. సంగనభట్ల నరసయ్య నిరూపించాడు. అన్ని సాక్ష్యాలట్లుండగా ఈ పద్యంలో కమ్మరులు వాడే పట్టుకార్లు అనే పదం ప్రయోగించాడు. ఇది తెలంగాణ కమ్మరి కొలిమి దగ్గర ఇప్పటికీ వాడే పదమే. తెలంగాణ కవులు మొదటినుండి కలం వీరులు అనడానికి ఈ పద్యం మచ్చుతునక.

ఇక తెలంగాణలో ప్రాచీన కాలంనుండి కన్పిస్తున్న సాహిత్యంలో, సృజనలో, వస్తువులో, నేపథ్యంలో, లక్ష్యంలో ప్రధానంగా కనిపించే లక్షణాలు :
1.స్వయం ప్రేరణ; 2.దేశీయత; 3.రాజధిక్కారం; 4.ప్రయోగదక్షత; 5.ప్రజాకవిత్వం; 8.వృత్తి పురాణాలు.

ఈ అంశాలు తెలంగాణ ప్రాచీన కవిత్వంలోనే కాదు ఆధునిక కవిత్వంలోనూ ఉన్నాయి. ఒక విధంగా ఆధునిక కాలంలో ఇంగ్లీషు, ఆంధ్ర సాహిత్యాల ప్రభావాల వలన తెలంగాణ మూలాలను చాలా వరకు మరిచి పోవడమో, పోగొట్టుకోవడమో జరిగింది. అందుకే తెలంగాణ తెలుగు ఇప్పటి తెలంగాణ ప్రజలకు కూడా కొత్తగానే అనిపిస్తుంది. సాహిత్యం కూడా అట్లే అనిపించవచ్చు. ఈ అంశాలకు అతీతమైన సందర్భాలు లేకపోలేదు. ఉదాహరణకు రాజులను ధిక్కరించడమే కాదు రాజులను ఆశ్రయించినవారు కూడా ఉన్నారు. అయితే ఆశ్రయం అనేది రాజుల, కవుల ఏకాభిప్రాయం వల్లనే కాని కేవలం రాజాశ్రయం కోసం అభిమానాన్ని చంపుకున్న లేదా వారికోసమే రచనలు వెలువరించిన సందర్భాలు తక్కువ. అది ఇక్కడి వారి లక్షణం కాదని చెప్పడమే ఉద్దేశం. ఇట్లా మీగతా ఏ అంశాలలోనైనా మినహాయింపులు ఉండవచ్చు. కాని ప్రధానమైన లక్షణాలుగా గుర్తించాలని అభిప్రాయపడుతున్నాను.
1. స్వయం ప్రేరణ : కవిత్వం ఒకరు రాయమంటే రాసేది కాదు. తాను పొందిన అనుభూతి విశేషం చేత, లేదా తాను అత్యావశ్యకంగా చెప్పాలనుకున్న భావతీవ్రత చేత తనకు తానుగా తనదైన పద్ధతిలో చెపితే అది కవితాత్మకంగా ఉంటే ఆ కవిత్వం సహజ కవిత్వం అవుతుంది. అందుకు వాల్మీకి మానిషాద శ్లోకమే గొప్ప ఉదాహరణ. తెలుగులో ఆదికవి అని చెప్పుకుంటున్న నన్నయ రాజ రాజ నరేంద్రుని ఆదేశంతో మహాభారత రచనకుపక్రమించాడు. అంతకు ముందు ఆయన ఏదైనా కవిత్వం రాశాడా తెలియదు. ఆయనకంటే ముందున్న కవులు కొందరు శాసనాలలో కవిత్వం

రాశారు. అటువంటి వాటిలో తెలుగు పద్యాలు కూడా ఉన్నాయి. కావ్యం కాకపోవడం చేత నన్నయకు ఆదికవి పట్టం కట్టి ఇప్పటివరకూ నిలుపుతున్నాం. తెలంగాణలో కూడా శాసనాలలో దేశీయమైన ఛందంలో పద్యాలు రాయబడినాయి. కరీంనగర్ జిల్లా కురిక్యాల శాసనం 940 ప్రాంతాల్లో నిదని చరిత్రకారుల నిర్ణయం. అందులో కందపద్యాలున్నాయి. కాని సంపూర్ణమైన కావ్యాన్ని రచించినవాడు పాల్కురికి సోమన. క్రీశ. 12 వ శతాబ్దం. పాల్కురికి ఇప్పటి వరంగల్ జిల్లాలో ఉన్న పాలకుర్తి అని సాహితీ వేత్తలందరు అనేక చర్చల అనంతరం తేల్చిన విషయం. పాల్కురికి రచించిన బసవపురాణం ఏ రాజు ప్రేరణ చేతగాని, ఏ అధికారి ప్రేరణ చేతగాని జరగలేదు. ఆయన స్వయంగా ఆనాటి సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేవలం భక్త జనుల కోరికమేరకు తాను నమ్మిన బసవని సిద్ధాంతాలను, శైవభక్తిని ప్రజలలో ప్రచారం చేయాలని అనుకొని రచించాడు.

బసవపురాణంబు బసరించు శక్తి
నసలార నొసగితి మట్లుగావునను
రచియింపు బసవపురాణంబు నీవు
నచలిత భక్త హితార్థంబుగాగ
నావుడు భక్తజనావలి యాజ్ఞ
వావిరి తలమోచి వర్ణింతు కవిత

– బ.పు.పుట 3 , ప్రచురణ తె.వి.వి.

అందుకే ప్రజలకు అప్పటికే పరిచయమైన పాటలకు దగ్గరగా ఉండే ఛందంలో రాశాడు. ఆయన తన పాండిత్యానికంటే, తన కవితా చాతుర్యానికంటే తాను చెప్పదలచుకున్న విషయానికీ, అది ప్రజలలోకి పోవాలనే లక్ష్యానికీ అంకితమైన వాడు. సోమన్ననే కాదు అనేకులు భక్తి సందేశం కాని, వీర సందేశం కాని తమంతట తామే పూనుకొని చేసిన కవులు తెలంగాణలో అనేకులు. ఈ ప్రాంతంలో ప్రాకృతంలో వెలువడిన హాలుని గాథలన్నీ సామాన్య ప్రజల జీవనానికి ప్రతిబింబాలే. వారి పనులు, కష్టాలు, సుఖాలు, శృంగారాలు ఈ గాథల్లో వర్ణించారు. ఇవి వారు వీరు చెప్పుకోగా విన్న హాలుడు ఏర్చికూర్చినాడని అంటారు. అంటే ప్రజల జీవితాన్ని ప్రజలు, చెప్పుకున్నవాటినే కూర్చాడు కాని ఊహలు, కల్పనలు లేవు.

గాథలొక్క కోటి కలవు లోకంబున
వానిలోన నందమైన వాని
నేర్చి కూర్చిపెట్టె నేడు నూఱులు కవి
వత్సలుండు శాలివాహనుండు

గాథలందు మరియు గానమ్ములందు తం
త్రీమనోజ్ఞవాద్యరీతులందు

ప్రౌఢకాంతలందు రసికులు కానట్టి
వారి కదియ శిక్ష వసుధలోన,

ఇచట నేపరుందు, మొదలైన ప్రసిద్ధ పద్యాలు వారి సహజ శృంగార జీవితాన్ని తెలియజేస్తున్నాయి. ఆవుల పాలుపితకడం, జున్నుపాలు తాగడం, పత్తిచేను దున్నడం మొదలై వ్యవసాయపనులను వర్ణించిన గాథలున్నాయి.

నీతి సారముక్తావళి రాసిన బద్దెగుడు, సుమతీ శతకం రాసిన బద్దెన, తన తండ్రి జ్ఞాపకంగా రచించిన రంగనాథ రామాయణం, తనను పలుకుమన్నాడని కేవలం భక్తి ప్రధానంగా భావించి పోతన రచించిన భాగవతం, మడికి సింగన సంకలనం చేసిన సకలనీతి సమ్మతం మొదలైన వెన్నో తమకు తాముగా ఆనాటి సామాజిక దృష్టితో చేసిన రచనలే కాని ఒకరి కోరికకోసం రాసినవి కావు.

నీతి శాస్త్ర ముక్తావళి(క్రీ.శ.960-966 ప్రాంతాలలోనిది) లో బద్దెన రాసిన రాచరికపు పన్నులలో కాపులను బాధించడం సరికాదనే అంశాన్ని చెప్పినతీరు

గనులు కృషి ప్రపంచ మరి కప్పము సుంకము గోకులంబు నం
దన వనముం జలస్థల వధస్థ వణిక్క్రియ దుర్గ రక్షణం
బన గల యన్ని మార్గముల నర్థము గూర్పక కేవలంబు కా
పున పొలియించు రాజు సిరిపొందునె రాజమనోజ భూభుజా!

ఇందులో రాజు కోశాగారం నింపుకోవడాని కున్న మార్గాలను చెపుతూ కాపుల జోలికి రాకపోవడం మంచిది అనే సూచన ఉంది.

రంగనాథ రామాయణానికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం పీఠిక రాశారు. అందులో తెలంగాణ ప్రాంతానికి చెందిన విషయాలు ఇక్కడ గమనార్హాలు. ఇది 1942 లో రాశారు. అప్పటికి మనకు స్వాతంత్ర్యం కూడా రాలేదు.

"పశ్చిమాంధ్రులకును ప్రాగ్దేశాంధ్రులకును సారస్వత సృష్టిలోను, సారస్వత సేవలోను కొంత భేదమున్నది. మన వాఙ్మయమునగల మార్గ - దేశి శాఖలలో పూర్వకాలమున మార్గ శాఖ ప్రాక్సీమలోను దేశిశాఖ పశ్చిమసీమలోను ఎక్కువ వృద్ధియైనదని బాహుళ్యము మీద చెప్పవచ్చును. ఇటులనుటచే పడమట మార్గ కవిత్వము పుట్టలేదని కాని, తూర్పున దేశి రచనలు లేవని కాని యర్థము కాదు. మరి యీ విభాగము ప్రాధాన్యమును బట్టి చేసినది. ఈ భేదమునకు నైసర్గికమైన యొక కారణము పొడగట్టుచున్నది. ప్రాక్సీమ, పర్వతారణ్య రహితమును ఫలవంతమునునైన భూభాగమగుటచే ఔత్తరాహుల ప్రవేశమునకును వారి విద్యాసభ్యతల వ్యాప్తికిని ఎక్కువ యవకాశమబ్బినది. ఈ ప్రాంతమున సంస్కృత విద్య యెక్కువగా వ్యాపించుటయు, సంస్కృత సారస్వతానుకరణము గా సారస్వత సృష్టి జరుగుటయు దాని ఫలమే. ఎన్నటి మాటలో ఎందుకు? వర్తమాన కాలమున

కూడ వంగ సాహిత్యానుకరణము ఈ సర్కారులలో వలె పశ్చిమాంధ్రమున లేదు. ఇక పశ్చిమాంధ్రులు వీరి యంత యదృష్టవంతులు కారు. నిరంతరము ప్రకృతితో పోరుచు పాటువడవలసిన కష్టజీవులు. ఆ కృషి జీవనమే వారిని దృఢకాయులుగా, వీరులుగా స్వాతంత్ర్య తత్పరులుగా చేసినది. తాతలనాటి తల్లి భాషయే వీరికి చాలును. పరభాషల యావశ్యకత గాని , వానిని నేర్వవలెనని కుతూహలముగాని, నేఁడర్వదగిన యవకాశముగాని వీరికి నుండదు. పర సంప్రదాయములకు మురిసి హత్తుకొను మెత్తదనము వారి మనస్సులకు ఉండదు. తమ సంఘములో మహోదారమైన జీవితము గడిపితరలి పోయిన వీరుల చరిత్రలే వారి కావ్యమకులకు ఇతివృత్తములు. అవియే వీర పదములు. ఒకవేళ ఇతర చరిత్రలు మహత్వమును బట్టి సంఘములోనికి చొచ్చుకొని వచ్చినను అవి దేశీయతా ముద్రతో రూపాంతరము పొంది యాత్మీయతను పొందునే కాని యెరవు సొమ్ముల వలె వింత కొల్పవు. ఇది యా సీమలో నుత్పన్నమైన ప్రాచీన సారస్వతమునకు సాధారణమైన ధర్మము. కాల ప్రభావమును బట్టి యా ధర్మము అర్వాచీన కాలమున కొంత సడలినను, ఆ జనుల సారస్వతాభిరుచి మాత్రము పూర్వ సంప్రదాయము నకే మొగ్గుచూపుచుండును. దేశీయతా మహితమైన యా యభిరుచిని తృప్తి పరుపగల కవులే మహా కవులుగా జాతీయ కావ్య కర్తలుగా పూజింప బడుదురు. గోనబుద్ధారెడ్డి యట్టి మహాకవి. ఇతడు సంస్కృత మహాకావ్యమును తెనిగించినను ఆంధ్రీకరణమును దేశీయ చిహ్నములతో విలక్షణతా శోభితమొనర్చి తన స్వతంత్రతా తృష్ణను తన దేశీయుల సారస్వతాభిరుచులను తనిపెను." రంగనాథరామాయణం – పీఠిక ,ప్రచురణ తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాదు.

సాహిత్య సృజనలోతమ స్వాతంత్ర్యాన్ని పూర్వీకులు పూర్తిగా పాటించారు. రాను రాను రాజుల, సంస్థానాధిపతులనుండి కాన్కలు, సన్మానములు, అగ్రహారములు కొని రచించినవారు కూడా తెలంగాణలో ఉన్నారు. కాని వస్తువు, రూపం విషయాలలో చాలవరకు స్వేచ్ఛనే పాటించినారు. ఉదాహరణకు అచ్చతెలుగులో యయాతి చరిత్ర రచించిన పొన్నికంటి తెలగన్న మల్లిభరాముని కోరికతో అతనికంకితమిచ్చి మెప్పుపొందినాడు కాని తన పద్ధతినిగాని, కథను గాని మార్చుకోలేదు. ఇట్లాంటి వెన్నో ఉదాహరణలున్నాయి.

2. దేశీయత : దేశీయత అంటే స్థానీయత. లేదా దేశానికి చెందిన అని అర్థము. ఏ దేశానికి చెందినది ఆదేశానికి దేశీయము. తెలంగాణ దేశము కాకపోతే తెలంగాణ దేశీయత ఎక్కడిది? చరిత్ర తవ్వితే తెలంగాణ దేశంగా ఉండేదని పరిశోధకులు చెపుతున్నారు. ఇపుడు సాహిత్యం ఆధారంగా కూడా చరిత్రను దేశీయతను చూడవచ్చును. ఈ ప్రాంతంలో మాట్లాడే మాటలు, పాడే పాటలు, పాటించే ఆచారాలు ఈ దేశీయములు. ఇప్పటికీ తెలంగాణలో పల్లెల్లో ఇది దేశిసరుకేనా? అని

అడుగుతారు. అంటే మనదగ్గర తయారయిందా? మనదగ్గర పుట్టిందా? పండిందా? ఇట్లా వారి ఉద్దేశం.

భాషకూడా దేశీయతను సంతరించుకుంది. తెలుగు వారు ఉండే ప్రాంతము తెలుగు ఆణెము అని, తెలంగాణము అని నిర్వచనాలు చెప్పుకున్నాం. తెలుగు అనే పదానికి మూలం త్రిలింగమా? తెనుగు పదానికి మూలం త్రినగమా? అనేవి ఇంకా చర్చనీయాంశాలే. ఎందుకంటే త్రిలింగ మధ్యస్థమైన దేశం త్రిలింగదేశం అనీ త్రిలింగదేశంలో మాట్లాడే భాష త్రిలింగ భాష అనీ ఇప్పటిదాకా చెప్పుకుంటున్నాం. అంటే త్రిలింగ క్షేత్రాలకంటే ముందు ఇక్కడ నివాసముంటున్న వారెవరు? వారి భాష తెలుగుకంటే భిన్నమైనదా? త్రిలింగక్షేత్రాలకంటే ముందు ఇక్కడ జనసంచారలం లేదా? ఇట్లాంటి ప్రశ్నలకవకాశముంది. 'దేశి' అనే పుస్తకంలో కోరాడ రామకృష్ణయ్య మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు 1954 లో ఒక వ్యాససంకలనం వెలువరించారు. అందులో ఆంధ్రము తెలుగు అనే పదాలను గురించి చర్చిస్తూ "ఈ ప్రాంతమున అనగా కృష్ణా గోదావరి మధ్యభాగంలోకి ఉత్తరభారత ప్రాంతంలోనుండి ఆర్యాంధ్రులు అనబడే వారు వచ్చి స్థిరపడ్డారు. వారు వచ్చేసరికి ఇక్కడ తెలగాలు, తెలుగు వారు అనే వారున్నారు. అయితే ఆర్యాంధ్రుల ప్రాబల్యం వల్ల తెలుగు అనే మాట చాలాకాలం మరుగున పడిపోయింది" అని సోదాహరణంగా వివరించారు. దీన్ని బట్టి ఆంధ్రులు రాకముందే ఇక్కడ తెలుగవారు, వారి భాష, వారి పాలన మొదలైనవన్నీ ఉన్నాయి. కాని తరువాత వచ్చిన ఆంధ్రులు వారిపై ఆధిపత్యం నడిపి తెలుగును మరుగుపరిచారు. – దేశి. కోరాడ రామకృష్ణయ్య. అంటే ఆంధ్రపెత్తనం ఆరంభం నుండే ఉందని స్పష్టం. తెలుగు భాష మూల రూపాలు క్రీ.పూ. వెలువడిన శాతవాహన గాథాసప్తశతినుండే కనపడుతున్నాయి. గాథాసప్తశతి కరీంనగర్ కోటిలింగాల రాజధానిగా పాలించిన రాజు హాలుడు రచించాడు.

తొమ్మిదవ శతాబ్దికి చెందిన కురిక్యాల (కరీంనగర్ జిల్లా) శాసనం కంద పద్యాల్లో ఉంది. కంద పద్యం దేశీయమైన ఛందం. ఇది సాహిత్యం కాకపోయినా ఛందస్సు స్థానికంగా అప్పటికే ప్రసిద్ధమై ఉంటుంది.

తెలంగాణలోని ఇతర శాసనాలను గురించి వాటిలోని భాషా విశేషాలను గురించి విడిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

కావ్యసాహిత్యంలో పరిశీలిస్తే తెలంగాణలో తొలితెలుగు కవిగా కనిపించే కొండంత మనిషి పాల్కురికి సోమనాథుడు. ఒకప్పటి నల్లగొండ జిల్లా ఇప్పటి వరంగల్ జిల్లాలో ఉన్న పాలకుర్తికి చెందిన వాడుగా చరిత్ర, సాహితీ పరిశోధకులందరూ అంగీకరించిన విషయం. తెలంగాణ నడిగడ్డమీద పుట్టినవాడు కావడం చేత ఆంధ్ర,రాయల సీమ వారు ఎత్తుకపోవడానికి ఎక్కువ అవకాశం దొరకలేదు. పైగా ఆయన రచనలు దేశీయతకు పట్టకట్టినవి కావడం వల్ల ఏ కారణం వల్ల కూడా

మరొకప్రాంతం వాడుగా చెప్పడానికవకాశం లేదు. కేవలం మతపరంగా, బసవని కథ కారణంగా కన్నడకు దగ్గరివాడనే ఆలోచన చేసినప్పటికీ తెలంగాణ కవిగానే అందరు ఒప్పుకున్నారు.

పాల్కురికి సోమన సంస్కృతం, కన్నడం మొదలైన భాషలు బాగా తెలిసిన పండితుడైన ప్రజాకవి. ఆనాటి సామాజిక అవసరం, లేదా ప్రజల్లో తాను నమ్మిన శైవ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం కోసం కవితా మార్గాన్ని ఎంచుకున్నాడు. తాను గొప్పగా సంస్కృత ఛందస్సులో వృత్తాదులు రాయగలిగన సమర్థత ఉండికూడా బసవ పురాణాన్ని ద్విపదలోనే రచించాడు. ఈయనను తెలంగాణలోనే కాదు మొత్తం తెలుగుసాహిత్యంలో కూడా మొదటి కవిగా చెప్పుకోదగిన ఉపపత్తులున్నాయి.

1. నన్నయను ఆదికవి అన్నారు కాని ఆయన మార్గకవిత్వంలో రచించాడు.
2. నన్నయ సంస్కృతంనుండి అనువాదం చేశాడు కాని స్వతంత్రమైన రచనకాదు.
3. నన్నయ మహాభారతాన్ని తెలుగు చేయమని రాజరాజనరేంద్రుడు ఆజ్ఞాపిస్తే చేశాడు కాని తనంత తానుగా ఆ సంకల్పం చేయలేదు.
4. ఆయన ఆరంభించినాడే కాని పూర్తి చేయలేదు.
5. మహాభారతం వైదిక మత పునరుద్ధరణలో భాగమే అయినా అగ్రకులాల ఆధిపత్యం సందర్భాన్ని బట్టి కనిపిస్తుంది. ప్రసిద్ధమైన నిండు మనంబు పద్యమే ఇందుకొక ఉదాహరణ.

పాల్కురికిసోమన

1. బసవ పురాణం దేశీయమైన ద్విపద లో రచించాడు.
2. ఇది పురాణమని అన్నాడే కాని ఏ పురాణానికి, ఏ భాషా రచనకు అనువాదం కాదు.
3. ఈ రచన చేయుమని ఏ రాజుగాని, అధికారిగాని ఆదేశించలేదు,కేవలం శివభక్తుల అభ్యర్థనయే కారణము. సామాజిక సందర్భాన్ని బట్టి తీసుకున్న నిర్ణయం.
4. ఈ రచన ఆసాంతం పూర్తి చేశాడు.
5. ఇదే కాదు తెలుగులో ఒక శతక ప్రక్రియను మొదలు పెట్టి చూపించాడు.
6. తనకు గురువైన పండితారాధ్యుని చరిత్రను కావ్యంగా రాశాడు. ఏ ప్రాచీన సంస్కృత పురాణాలనుండి, ఇతిహాసాలనుండి, మరెక్కడినుండి కథను తీసుకోకపోవడం , తన గురువు కథను రాయడం కూడా ఆదర్శమే.
7. తన రచనలో అన్ని కులాల వృత్తుల వారికి సమప్రాధాన్యత నిచ్చి కథలుగా రాయడం సామాజిక అవగాహనకు నిదర్శనం.
8. అంబలి, గంజి, పిట్టవ్య, నిమ్మవ్య, మాచయ్య వంటి పదాలు పేర్లు అచ్చతెలుగురూపాలకు కావ్యగౌరవాన్ని కలిగించాడు.

అవ్వ, అయ్య అని పేర్ల చివర కలిపి పలకడం ఇక్కడి అలవాటు. రామయ్య, చంద్రయ్య,

రాజయ్య, నరసయ్య, లచ్చవ్వ,భూమవ్వ, రాజవ్వ మొ॥నవి.

ఈ యీ కారణాలెన్నో సోమనను మొదటి తెలంగాణ కవిగానే కాదు తెలుగు కవిగా చెప్పుకోవచ్చు. బసవపురాణంలోని కథలన్నీ దేశీయములే. భక్తి ప్రధానములే అయినప్పటికీ పేర్లు, సంఘటనలు దేశీయంగానే ఉంటాయి. మహిమలు మాత్రం ఆధ్యాత్మికాలు. ఇట్లా వస్తువు, రూపం కూడా దేశీయములే.

ఉరుతర గద్య పద్యోక్తులకంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
కూర్చెద ద్విపదలు కోర్కెదైవార
తెలుగ మాటలనంగ వలదు, వేదముల
కొలదియ కాజూడుడిల నెట్టులనిన
పాటి తూమునకును పాటియౌనేని
పాటింప సోలయు పాటియకాదె
అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుటయెకాదెకవివివేకంబు

బ.పు.పుట.4.

అని ద్విపదలోనే ఎంతగొప్ప కథనైనా, విషయాన్నైనా చెప్పవచ్చునని నిరూపించాడు.

ఈ ద్విపదలు పల్లెల్లో జనులు పాడుకునే పాటలలయకు దగ్గరగా ఉండడం చేత భక్తులు పాడుకోవడానికి కూడా సులువుగా ఉంటుందని ఆయన భావం. ఇది దేశీయమైన ఛందస్సు. ఈ ద్విపదకు కావ్యగౌరవాన్నిచ్చిన కవి పాల్కురికి. ఇంతటితోనే కాదు తరువాత రామాయణాన్ని గోనబుద్ధారెడ్డి, హరిశ్చంద్రోపాఖ్యానాన్ని గౌరన, భాగవతాన్ని కూడా మరో కవి ద్విపదలో రచించారు. ద్విపద ప్రక్రియ కొంతకాలం ఒక ఉద్యమం వలె వచ్చిందనుకోవాలి. ఇంతే కాదు సోమన ఉదాహరణ కావ్యం రచించాడు. ఉదాహరణలో కళికలు, ఉత్కళికలు ఉంటాయి. ఇవి కూడా రగడలే.

కళిక : వెండియు త్రిభువన – వినుత సమేతుడు
మండిత సద్గుణ మహిమోపేతుడు
సదమల విపుల వి బాల యశస్కుడు
గావున సాక్షాత్ కలియుగ రుద్రుడు

ఉత్కళిక :భువనోపకార సౌభ్యాబ్ధిలోన
భవమోద వీర ముఖ్యుడై తాక
భక్తి సంయోగ వెలయు శుభకరుడు
ముక్తి సంభోగ ఇల విశ్వగురుడు

ఇవి ఏయే రగడలతో అంటే దేశీయమైన గేయాలతో సరిపోతాయి. ఏయే

గేయాలతో సరిపోతాయో సహృదయులు గమనించాలి. డా.సంగనభట్ల నరసయ్య తెలుగులో దేశిచ్ఛందస్సు అనే తన పరిశోధనగ్రంథంలో ఆయా రగడలు దేశీయముద్రలతో ఉన్నవి చూపించారు.

ఈ దేశీయతా ముద్రలు తిక్కన భారతం రాయకముందే వ్యాపించాయి. బహుశ: తిక్కన ఈ ద్విపదను ఎంచుకోకపోయినప్పటికీ తెలుగు భాషను తన రచనలో ఎక్కువగా ఉపయోగించుకోవడానికి వీరి ప్రభావం ఉందనుకోవాలి. తన పాండిత్యం కంటే ప్రజలకర్థం కావటమే లక్ష్యం అనే అంశాన్ని ఆయన కూడా ఆదర్శంగా తీసుకున్నాడనుకోవాలి.

బమ్మెర పోతన కూడా "కొందరికి తెనుగు గుణమగు, కొందరికి ని సంస్కృతంబు గుణమగు రెండున్, కొందరికి గుణములగు, నే నందఱి మెప్పింతు కృతుల నయ్యెయెడలన్" అన్నాడు. ఇందులో తెనుగు అంటే మాట్లాడే తెలుగని స్థూలంగా అనుకోవాలి. ఆయన కవిత్వంలో తెలంగాణ పదాలు, వాక్యనిర్మాణాలు, వ్యక్తీకరించే విధానాలు ఎన్నో ఉన్నాయి. భాషా పరిశోధకులు దృష్టి సారిస్తే అనేకం దొరుకుతాయి. ఉదాహరణకు లావు, (తెలంగాణలోనే లావు అంటే ఎక్కువ లావుమాట్లాడుతున్నవు అంటారు) అన్న అనే మాట సోదరుడు అనే అర్థంలోకాక ఆత్మీయతతో ప్రేమతో పిలిచే పిలుపుగా తెలంగాణలోనే వాడుతారు. పేర్ల చివర అన్న కలిపి మాట్లాడుకోవడం తెలంగాణలోనే ఉంది. ఆంధ్రలో అండి కలిపి మాట్లాడుతారు.

అన్నములేదు కొన్ని మధురాంబువులున్న త్రావుమన్న రా
వన్న, ...
నిన్నున్ మెచ్చరు నీతిపారమహిమన్ నీతోడి ధైర్యార్భకుల్,
అన్నా ఎన్నడు .....

ఇట్లాంటి అనేక సందర్భాలలో అన్న సోదరార్థం కాదు. గౌరవార్థం లేదా మర్యాదార్థం.

కొంచుబోయి, (కొంచబోయి అని ఇప్పటికి వాడతాం), చేతుల పుణుకుచు, (పుడుకుచు అని ఆంధ్ర ప్రయోగం), చేగ.... చేవ అనే పదానికి బదులు, మనం సేగ అంటాం ఇప్పటికీ. మిడుకంగలేక..... మిడుకుట తెలంగాణ పదం, దొబ్బు. .....(ఆంధ్రలో అశ్లీలార్థం) తెలంగాణలో నెట్టుట, కాజేయుట అనే అర్థం లోనే వాడతారు. పోతనకూడా ఇదే అర్థంలో వాడినాడు. ధరణి దొబ్బి, వెడలంగ ద్రొబ్బుడి..... గొగడి, బుడబుడ రవము, మలమలమాడుచు, మేల్కని అనడానికి మేల్కొని అనడం తెలంగాణ వాడుక.ఇట్లే ఎత్తుకపోవు, తోడుకవచ్చి వంటి ప్రయోగాలు ఎన్నో చూడవచ్చు.

చేతులారంగ శివుని..... చేతులార, నోరార, కడుపార, మనసార వంటివి

వాడుకమాటలే. చేతులారంగ పద్యంలోని సాభిప్రాయ పదప్రయోగం అపూర్వమైనది. వట్టి మాటలలో గొప్ప అర్థాలను పొదిగినాడు. శివుని పూజించడం, హరిని స్తుతించడం అట్లా ఉంచి 'దయయు సత్యంబు లోనుగా తలపడేని ' అనడంలో దైవభక్తి కంటే కనీసం మనిషికి ఉండవలసిన దయాగుణం, సత్యనిష్ఠ లేకపోతే వ్యర్థం అనడం లో ఆయన ఆవేదన అర్థం అవుతుంది. పోతన తెలుగుకు బదులు సంస్కృతం ప్రయోగించిన చోట కూడా నిర్మాణంలో తెలుగుదనం తొంగి చూస్తుంటుంది. సమకాలం వాడుగా చెప్పుకుంటున్న శ్రీనాథునిలో సమాసార్ఢత , ప్రౌఢత్వం నిర్భరంగా ఉండగా ప్రౌఢత్వం పదాల్లో ఉన్నా మెత్తదనం పోతనలో ఉండడానికి ఆయన ప్రయోగం జనప్రయోగానికి దగ్గరగా ఉండడమే కారణం. పోతన శిష్యులుగా మిత్రులుగా భావింపబడుతున్న ఏర్చూరిసింగన, బొప్పరాజు గంగన, వెలిగందల నారయ రచనల్లో కూడా దేశి వాడుక ఉంటుంది.

కొఱవిగోపరాజు భీముగల్లు వాసి. ఇప్పుడు నిజామాబాదు జిల్లాలో ఉంది. ఈయన సింహాసన ద్వాత్రింశకమనే కావ్యాన్ని రాశాడు.

తెనుగున తేటగా కథలు తెల్పిన కావ్యము పొందులేదు మె
త్తన పసచాలదంద్రు విశదంబు సంస్కృతమూదజె
ప్పిన నవి దర్భముండ్లనుచు బెట్టరు వీనుల, కావునన్ రుచుల్
దనర తెనుంగు దేశియును తద్భవమున్ కలయంగ చెప్పెదన్
(1-32 సిం.ద్వా.)

తెనుగు , దేశి, తద్భవము మూడు వేరు వేరు అనే అర్థంలో వాడినట్లు స్పష్టము. దేశి ని వదలకుండా గ్రహించడం గమనించదగినది.

గౌరన క్రీ.శ.1380 -1450 లలో గొప్ప పండితుడు. ప్రతివాద మదగజ పంచానన అనే బిరుదం గలవాడు. అయినా నవనాథ చరిత్ర ద్విపదలోనే రాయడం విశేషం.

పూసల పేరును బొంగు కోలయును గాసెగట్టిన మీద కదియ బిగించి
చుట్టిన యుఱుత్రాడు సొంపారు చెంప గుట్టిన యెద్దుల కుఱుచకొయ్యలును
మెఱుగు పించపుదండ మేటి బెబ్బులులు గఱవక యుండు వాకట్టు బదనికెలు
మరువక దిగకుండ మందులు వాడి నెరయు చీరణములు నించిన తిత్తి
చిక్కంబు తనకొప్ప సింగంబులట్టి కుక్కలు తనవెంట కూడి యేతేర
ఇట్లా ఒక వర్ణన.

3. రాజధిక్కారం : తెలంగాణ ప్రజలకు ధిక్కార స్వరం సహజస్వభావం. మంచి కోసం రాజలనైనా, అధికారులనైనా, ఎంతటివారినైనా ఎదిరించడం ఇక్కడి ప్రజలకెంత సహజం. కవులు కూడా ఈ ధిక్కారం చేసినవారే.

ఘనుడన్ వేములవాడ వంశజుడ దాక్షారామ భీమేశునం
దనుడన్, దివ్యవిశేమృత ప్రకట నానా కార్య ధుర్యుండ, భీ
మన నా పేరు వినంగ జెప్పితి తెలుంగాధీశ, కస్తూరికా
ఘనసారాది సుగంధ వస్తువులు వేగం దెచ్చి లాలింపురా !

అని తన పరిచయాన్ని ఎంతో భేషజంగా చేసుకొని రాజును వచ్చి తనకు మంచి కానుకలు ఇచ్చి బుజ్జగింపుమని కోరుతున్నాడు. అంతే కాదు తనను పదే పదే తిప్పిన రాజును

వేములవాడ భీమకవి వెగమె చూచి కళింగ గంగు తా
సామము మాని కోపమున సందడి దీరిన రమ్ముపొమ్మనెన్
మోమును జూపదోషమిక ముప్పది రెండు దినంబులావలన్
జామున కర్థమందతని సంపద శత్రుల జేరుగావుతన్
అని శపించాడు.

పోతన సర్వజ్ఞసింగమనాయడు తనకు కావ్యమంకితమివ్వమని అడిగినందులకు తిరస్కరించడమే కాదు

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు కొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
సమ్మెటపోటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్

అని రాజులను అధములని నిందించే సాహసానికి దిగినాడు. ఇది తెలంగాణ సొరుషమే.

గౌరన క్రీ.శ.1380 - 1450,తన పెదతండ్రి పోతరాజు రాజకొండ రాజయిన సింగయమాధవుని మంత్రిగా ఉన్నాడు. అయినా వారినాశ్రయించలేదు. లక్షణ దీపిక అనే ఛందో గ్రంథాన్ని, నవనాథ చరిత్ర అనే ద్విపదకావ్యాన్ని ఇష్టదైవానికే అంకితం చేశాడు.

కంచర్ల గోపన్న తానీషాను ఎదిరించిన సంగతి అందరికి తెలిసిందే. అంతే కాదు భక్త్యావేశంలో "ఎవడబ్బ సొమ్మని" అని శ్రీరాముని కూడా నిందాస్తుతి చేశాడు.

ధర్మపురి నివాసి శేషప్ప సీసపద్యశతకం వినని తెలుగువారండరు. చదువురానివారుకూడా 'లక్షాధికారైన లవణమన్నమెకాని మెరుగు బంగారమ్ము మింగబోడు' వంటి పద్యపాదాలు ఉదాహరిస్తాడంటే వాటి వ్యాప్తి అర్థమవుతుంది. ఆయన నరసింహదేవాలయంలో దీపరక్షకుడుగా ఉద్యోగం చేసి ఆలయాధికారులు జీతం ఇవ్వకపోతే ఉక్రోషంతో దేవునిమీద కోపంతో సంబోధన దేవుని గురించి చేసి లోకంలో జరిగే పోకడలన్నిటిని ఏకరువుపెట్టాడు.

ఎండిన ఱెళ్ళ గోడెరిగింపడెవ్వడు
పండిన యూళ్ళకే ప్రభువులంత,

వంటి భావాలు ఈ కాలానికీ వర్తిస్తాయి.

పిల్లల మట్టి పినవీరభద్రుడు 'వాణి నా రాణి' అని సవాలు చేశాడు.

అయితే ఇందుకు భిన్నంగా ఇంతకు ముందు పేర్కొన్నట్లు కొందరు రాజులను, మంత్రులను ఆశ్రయించిన వారు కూడా ఉన్నారు. ఆశ్రయంలో తమ స్వాభిమానాన్ని చంపుకున్నవారు కాదు.

4. ప్రయోగదక్షత :

తెలంగాణ ప్రాంత ప్రాచీన కవులు అనేక ప్రయోగాలు చేయడంలో దిట్టలు.

1. జంటకవులుగా గోనకాచ భూపతి, గోన విట్టల భూపతి ఇద్దరు రామాయణం ఉత్తరకాండ రచించారు.
2. క్రీ.శ.1520 - 1590 లమధ్య మరింగంటి(ఆసూరి) సింగరాచార్యులు దశరథరాజనందన చరిత్ర అనే పేరుతో నిరోష్ఠ్య రామాయణ కావ్యం రచించాడు.
3. పొన్నికంటి తెలగన్న ఇదే కాలంలో అచ్చతెనుగుకావ్యం యయాతి చరిత్ర రచించాడు.
4. కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం పేరుతో యక్షగాన ప్రక్రియకు శ్రీకారం చుట్టినాడు.
5. బసవా బసవా బసవా వృషాధిపా అనే మకుటంతో మొట్టమొదటి శతకం రాసినవారు పాల్కురికి సోమన. తరువాత ఇప్పటికీ ఈ శతక ప్రక్రియ వేయిరేకలు పద్మంలాగా విస్తరిల్లుతూనే ఉండడం విశేషం.
6. గద్యరచనలుకూడా తెలంగాణ కవులు చేశారు. కృష్ణమాచార్యులు అనే కవి సింహగిరి వచనములు రచించాడు. అయితే అతడు సింహాచలం లోని నరహరిని సంబోధించి రాసినాడు కాబట్టి ఆయన రచనలుదా హరించడంలేదని ముంగిలిలో సుంకిరెడ్డి పేర్కొన్నారు కాని తానెక్కడి దేవుని గురించి రాసినా ఇక్కడివాడే కనుక అతడిని మొదటి వచన రచయితగా చెప్పుకోవచ్చు.
7. మొదటి ఉదాహరణ కావ్యం కూడా పాల్కురికి సోమన రచించాడు.
8. మొదటి ఛందశ్శాస్త్ర గ్రంథం లక్షణ దీపిక మల్లియ రేచన క్రీ.శ.940 లోనే రచించాడు.
9. తడకమళ్ళ వేంకట కృష్ణారావు 1830- 90 లమధ్య లీలావతి గణిత శాస్త్రాన్ని పద్యరూపంలో రచించాడు. రామావతార కాల నిర్ణయం అనే పేరుతో ఒక చారిత్రిక గ్రంథం రచించాడు.
10. సకలనీతి సమ్మతం వంటి సంకలన గ్రంథం మడికి సింగన రచన. వేరు వేరు గ్రంథాలలోని ఉత్తమమైన సూక్తులను సేకరించడం ఆయనే మొదలుపెట్టాడు.

11. సింహాసన ద్వాత్రింశిక మొదటి కథా సంకలన కావ్యం. దీని తరువాతనే హంసవింశతి, విక్రమార్క చరిత్ర మొదలైనవి వెలువడ్డాయి.
12. గోండి భారతం. మహాభారతం వ్యావహారిక భాషలో పద్యాలరూపంలో సరళంగా ఆదిలాబాద్‌జిల్లాకు చెందిన మునిపంతులు అనే కవి క్రీ.శ.1820 ప్రాంతంలో రాశాడు.

మూలభారతము గని
ముని కవిశ్రేష్ఠులు ఆంధ్రభాషలో
జేసిరందు కనగ కారిన్యమె
చదువకాదర్థమందరికీ
మరి తెలుగు కావలె మహిలో నందరికీ...:

అంటూ మహాభారతంలో యతులు ప్రాసలు బలవంతంగా అవసరంలేదని అర్థం కావడమే ప్రధానమని రాశాడు. ఈ భారతాన్ని గోండి భారతం అనికూడా అనడం విశేషం.

చాల చదువూ యేల సన్యాసి గానేల
బహుజనద్వేషియై బ్రతుకనేలా
ఆడంబరము విడిచి అవనిలో యెవ్వరిని
తాపపెట్టని వాడు తపసి యిలలో....

5. సమకాలీన వీరుల గాథలు :

తెలంగాణలో ఆయా కాలాలలో తమ వీరత్వాన్ని చూపిన వారిని గురించి ప్రజలు చెప్పుకోవడమే కాదు పాటలుకట్టి పాడుకున్నారు. నిన్నమొన్నటి వరకు ఆ పాటలు జానపదుల నోళ్ళలో ఎప్పుడూ కదలాడేవి.

1. బల్మూరి కొండలరావుకథ, 2. సర్వాయి పాపని కథ, 3. అంకమరాజు కథ, 4. నల్ల సోమనాద్రి కథ, 5. మియాసాబు కథ, 6. రాజారామేశ్వరరావుకథ.

ఇవి కాక బతుకమ్మపాట, ఒల్లాల్ చెరువు పాట, రోహిల్లాల పాట, మొహర్రం పాట అనే పేర్లతో పాటలు కూడా ప్రచారంలోకి తెచ్చినవారు ప్రజాకవులు, కళాకారులు.

మోత్కుల్ల గొట్టిరి మోత్కుల్ల వాసిరి
మోత్కుల్ల కడుపుల్ల మౌలాలి పుట్టె
బురుగుల్ల గొట్టిరి బురుగుల్లవాపిరి
బురుగుల్ల బురుగుల్ల కడుపుల బొంబాయి పుట్టె
(మొహర్రం పాట)

ఈ వారసత్వమే ఇప్పటికీ తెలంగాణలో ప్రజాకవులకు పుట్టినిల్లుగా గొంతెత్తి పాడుకుంటున్నది.

6. వృత్తిపురాణాలు : తెలంగాణలోని వివిధ కుల వృత్తులను పాటించేవారు వారి

కులాలకు మూలాలను తడ్డుకొని వాటిని పురాణాలుగా చెప్పుకున్నారు. వేదవ్యాసుడు రాసిన 18 పురాణాలు కాక వీరి కులాల పుట్టుకలు, వాటి వెనుకముందరి కథలు పురాణాలుగా రాసుకొని పాడుకున్నారు. ఇవి రాసిన వారిని ప్రజాకవులుగా భావించాలి. 1. విశ్వకర్మపురాణం, 2. గౌడ పురాణం, 3.జాంబపురాణం, 4.కుమ్మరికథ, 5.మేదరికథ, 6.మడేల్ కథ (మడేల్ కథకు మడవాలు మాచయ్య అనే బసవపురాణకథ మూలం కావచ్చు)

ఈ పురాణాలను చెప్పేకళాకారులను ఆయా కులాలవారే పోషించుకునే ఆచారం ఇప్పటికీ ఉంది.

తెలంగాణ ప్రాచీన సాహిత్యం స్థూలంగా విశ్లేషిస్తే కనిపించిన అంశాలలో ప్రధానంగా కవిత్వం జీవన విధానం నుండి, కష్టాలనుండి, భక్తి ఆవేదన నుండి సామాజిక ఆరాటం నుండి, బతుకు పోరాటం నుండి వెలువడిన సాహిత్యం ఎక్కువ. రాజుల ఆశ్రయం కోసం, భోగవిలాసాలకోసం, కీర్తి ప్రతిష్టల కోసం వెలువడింది తక్కువ. రాజులు కూడా స్వయంగా పండితులై కావ్యాలు రచించారు. కవులను పోషించారు. ఇవి కూడా ప్రాచీన కావ్యాలకథలే కాకుండా సరికొత్త రీతిలో పాత కథలను రచించిన వారున్నారు. ఇందుకు భిన్నంగా కూడా కొన్ని ఉండవచ్చు. కాని ఈ ప్రాంతపు ప్రధానలక్షణాలుగా భావించవచ్చు

విశ్వవిద్యాలయాలు, విద్యార్థులు వీటిమీద పరిశోధన చేయవలసిన అవసరం ఉంది. అంతే కాదు ఇతర ప్రాంత కవులపై తెలంగాణ కవుల ప్రభావం కూడా చూపించడానికి అవకాశం ఉంది. వాటిని సోదాహరణగా పరిశీలించ్సాన అవసరం ఉంది.

ఖచ్చితంగా తెలంగాణ మాట వేరే

– డా.గండ్ర లక్ష్మణరావు

మా మాట వేరు, బాట వేరు అని డా.కొండలరావుగారు రాసిన వ్యాసం పై డా. అద్దంకి శ్రీనివాస్‌గారి స్పందనపై నా ఆలోచన.

తెలంగాణ భాష, కోస్తాంధ్రభాష, రాయలసీమ భాష ఒక్కటే కాని మాండలికాలు వేరు, యాస వేరు అనే అంశంపైనే ప్రధానంగా చాలారోజులుగా చర్చ జరుగుతున్నది. ఒకే భాష అయినప్పటికీ భౌగోళిక పరిధులను బట్టి జీవన విధానాన్ని బట్టి ఆచార వ్యవహారాలను బట్టి, పరిపాలనా ప్రాబల్యాలను బట్టి, ప్రపంచంలో వస్తున్న శాస్త్ర సాంకేతికాది మార్పులను బట్టి భాషలో అనేక విధాల మార్పులు ఏర్పడతాయనేది భాషా శాస్త్ర సిద్ధాంతాలు కూడా కాదనలేని సత్యం. ఇక్కడ తెలంగాణ ప్రాంతం మాండలికం ఒక భాషగా పూర్తిగా విడిపోయేంతగా అంటే ఇతర ప్రాంతాల భాషతో క్షమార్హం కానంతగా మారకపోయినప్పటికీ ఎక్కువ తేడాలున్నాయనేది స్పష్టం. భాషలో వ్యవహారికతకే ప్రాధాన్యం. వ్యాకరణం కూడా ప్రయోగ శరణం అనే అన్నారు పెద్దలు. మరి తెలంగాణ వ్యవహార భాష వాడుక భాష ఇవాళ చాలా వరకు తన ఉనికిని పోగొట్టుకున్నది. ఇంకా పోగొట్టుకుంటున్నది. అందుకు ఎన్ని కారణాలున్నా ఆంధ్ర ప్రాంతంలోని 'రెండున్నర జిల్లాలదె దండి భాష అన్నప్పుడు' అని మా కాళోజి కవితను గుర్తుచేసుకోవాలి.

ఈ దండి ఎట్లా పెత్తనం ఎట్లా తెలంగాణ భాష పై ఇతర ప్రాంతాల భాషలపై, ఇతర వర్గాల మాండలికాలపై దాడి చేసిందో కొన్ని ఉదాహరణలు మాత్రం ఇక్కడ చూపుతాను.

1. పాఠ్యపుస్తకాలు : ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రాంతంతో పనిలేకుండా అప్పటికే సుప్రసిద్ధులయిన రచయితలో, కవులో పండితులో పాఠ్యపుస్తకాలు రూపొందించారు.ప్రభుత్వ విద్యాశాఖల్లో అధికారులు అక్కడి వారే ఉండడం వాటిగురించి అప్పటి రాజకీయ నాయకులు అంతగా పట్టించుకోకపోవడం, తెలంగాణ వారి భాస ఉర్దుమిశ్రమం కనుక అక్కడి వారిని సంప్రదించాలనుకోవడం ఏవీ జరుగలేదు. వీటికి చారిత్రక ఆధారాలు అక్కరలేదు. ఏ ఒక్కరైనా తెలంగాణ తెలుగు పండితులు పాఠ్యపుస్తకాలు రాసినట్లు చూపించండి. బాలశిక్షలో ఒక పాఠం ఉంది.అది అరటిచెట్లుపై పాట.ఆదివారమునాడు అరటి మొలచినది అని మొదలయి అన్నివారాలను పరిచయం చేయడం పాఠంలో ఉద్దేశం. ఇందుకు అరటి చెట్టే ఎందుకు ఎన్నుకున్నారు? ఆంధ్రప్రాంతంలో ఉన్నంతగా అరటి చెట్టుగురించి, అరటి తోటలగురించి తెలంగాణ ప్రాంతంవారికి పరిచయంలేదు. ఇంకా చెప్పాలంటే ఊరికి ఒక అరటి చెట్టుకూడా ఉండేది కాదు.అరటి బొత్తములు అన్నారు. బొత్తములు అనే

మాట ఎప్పుడూ ఇక్కడ బాగా తెలిసినవాళ్ళు అంటే అప్పటి ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు కూడా విన్నమాట కాదు. ఇక అబ్బాయి, అమ్మాయి అరటి పండిదిగో అన్నారు. అబ్బాయి, అమ్మాయి అనే మాట తెలంగాణలో సహజం కాదు. ఆడపిల్ల, మగపిల్లగాడు, లేదా పిల్ల, పిల్లగాడు, ఇంకా పోరి, పోరడు వంటి మాటలే ఉన్నాయి. వాటి సాధుత్వాసాధుత్వాలు వాటి ఎక్కువతక్కువల గురించి ఇక్కడ చర్చకాదు.ఇట్లా పరిచయం లేని అనేక పదాలు బాలశిక్షతో పాటు కలిపి అంతటా రుద్దబడినాయనేది కాదంటారా? ఇంకా పై తరగతులకు పోతే కొత్త కొత్త మాటలు అంటే ఏ మాటలయితే ఇక్కడ కూడా వాడితే సరిపోతుందో అక్కడ అక్కడి (ఆంధ్ర) మాట వాడి రుద్దినవి అనేకం ఉన్నాయి.

ఎక్కడికి వెళ్ళారు? అని అంటారు. తెలంగాణలో అయితే ఎక్కడికి పోయారు? అంటారు. పోయారు అనే మాట విడిగా మాట్లాడితే అశుభం కాని కలిపి మాట్టాడినపుడు కాదు. పుస్తకాలలో వెళతారు, వెళ్ళారు, వెళ్ళాలి వంటి మాటలే కనిపిస్తాయి కాని పోయారు, వచ్చినారు, పోయిండ్రు, వచ్చిండ్రు వంటి తెలంగాణ వాడుక మాటలు కనిపించవు.

2. పత్రికలు : దిన, వార, మాస పత్రికలు అన్నీ ఆంధ్రప్రాంతనుంచి లేదా హైదరాబాదునుంచి వచ్చినా సంపాదకులు, రచయితలు ఎక్కువ మంది ఆంధ్రప్రాంతం వారే ఉన్నారు. పత్రికల్లో వాడే పదాలు, వాక్యాలు మొదటగా అంతగా పరిచయంలేకపోయినా క్రమంగా అలవాటు పడవలసి వచ్చింది. వారపత్రికల్లో కథలు, సీరియల్స్, ఇతర శీర్షికలు ఆంధ్రప్రాంతంవారివే ఎక్కువగా పత్రికల్లో చదవడం వలన కూడా చదువుకునే వారిని ప్రభావితం చేశాయి.

3.రేడియో, సినిమా, టీవీ : ఒకప్పుడు రేడియో కార్యక్రమాలు చదువురాని వారిని కూడా ప్రభావితం చేశాయి. వ్యవసాయ కార్యక్రమాలు, కార్మికుల కార్యక్రమాలు, పిల్లల కార్యక్రమాలు, నాటికలు, వార్తలు ఇట్లాంటి వాటినిండా ఆంధ్రప్రాంత(రెండున్నరజిల్లాల కొన్ని ఆధిపత్యకులాల)భాషా ప్రయోగమో ఉందనడం అసత్యం కాదు. ఏవో కొన్ని గ్రామీణ కార్యక్రమాల్లో, జానపదగేయాల్లో వేరు వేరు ప్రాంతాల భాష కనిపించినా అది వైవిధ్యం కోసమే కాని అందరూ పాటించదగినదన్నట్లుగా ఉండేవికావు. సినిమాలు సామాన్యులను అత్యంత ప్రభావితం చేశాయనడం ఎవ్వరూ కాదనలేని నిజం. సినిమాల్లో మాటలు,పాటలు ఎన్నో పదాలను తెలంగాణ ఇతర ప్రాంతాల వారు కూడా అలవాటు చేసుకునేటట్లు చేశాయి. ఉదాహరణకు చాలా ప్రసిద్ధమయిన పాట ' ఏరువాకా సాగారో రన్నా చిన్నన్నా ' అనే పాట లో ఏరువాక అంటే తెలంగాణ ప్రాంతం వారికి తెలియదు. ఇక్కడ ఆ మాట వాడుకలో లేదు. కాని వలపల దాపల ఎడ్లతోలుకొని, ఇల్లాలును నీ వెంటబెట్టుకొని వంటి పరిచయమైన మాటలతో పనులతో ఆ పాటను ఆత్మీయం చేసుకున్నారు. ఏరువాక ఇప్పటికీ వాడుకలోనికి రాని మాట. అండీ ! ఏమండీ ! ఇప్పుడు సర్వసామాన్యమై పోయాయి.

ఒకప్పుడు తెలంగాణలో ఈ అండీ లేదు. అయ్యా, అన్నా అనే వారు . వరుసబట్టి, వయసుబట్టి సంబోధించేవారు. పిలుచుకునేవారు. ఇప్పటికీ పేరుకు అన్న జోడించి మాట్లాడడం తెలంగాణ ప్రాంతంలో ఉంది. కొద్ది పరిచయంఅయితే మరోసారి కలిసినపుడు పేరుతో అన్న చేర్చి ఆత్మీయంగా పిలుచుకుంటారు, పలకరించుకుంటారు. రామన్న, రాజన్న, వెంకన్న, ఎల్లన్న, మల్లన్న, ఇట్లా . అయితే సినిమాల్లో ఈ అన్న అనే పిలుపును రౌడీలు, రౌడీ నాయకులు పిలుచుకుంటున్నట్లు చూపించి అదేదో తప్పుగానో, న్యూనంగానో ఉందనే భావం కలిగించారు. ఈ సినిమాల ప్రభావంతోనే అవ్వ, అయ్య, , అమ్మ నాయిన, ఆయి బాపు, చిన్నయ్య, చిన్నాన్న, చినబాపు, కాక, ఏరాలు, సడ్డకుడు ఇట్లాంటి మాటలు అమ్మ నాన్న, బాబాయ్ వంటి మాటల దాడిలో కనుమరుగయ్యాయి. బాబాయ్, తోడికోడలు, తోడల్లుడు అనే మాటలు తెలంగాణలో లేవు. ఇప్పుడది వాడుకయింది. ఈ వాడుక ఎవరు చేశారు. ఏ భాషా సిద్ధాంతం ప్రకారం జరిగింది? అత్త, మామ, అక్క, అన్న అనే సాధారణ పిలుపులుండేవి, స్థాయినిబట్టి కొందరు గారు అని వారు వీరు అని మర్యాద, గౌరవపూర్వకంగా బహువచన ప్రయోగాలుండేవి. కాని ఇప్పుడందరూ అత్తయ్య, మామయ్య, అక్కయ్య, అన్నయ్య అయిపోయాయి. అత్తమ్మ, మామయ్య అని ఉండేవి.అక్కమ్మ అని అక్కను అమ్మతో సమానంగా పిలిచేవారు. ఇప్పుడు లేవు. మా ఆయన, మా ఆవిడ అనే మాటలు లేవు. మా ఇంటిది, మా ఇంటాయన, ఉన్నత వర్గాల్లో ఇంటివారు అని సంబోధించేవారు. ఇల్లుకు ఆలు ఇల్లాలు అయినపుడు, ఇంటికి ఆయన ఇంటాయన ఆవడంలో తప్పులేదుకదా. ఇప్పుడు వ్యాకరణం ప్రకారం, భాషా సిద్ధాంతాల ప్రకారం తప్పొప్పుల చర్చ చేయడం లేదు. వాడుకలో వచ్చిన మార్పులను మాత్రమే మీ ముందుంచుతున్నాను.(ఇప్పుడిప్పుడు పల్లెల్లో కూడా మమ్మీ డాడీ, అంకుల్ ఆంటీలు వచ్చి అన్నిటినీ మరిచిపోతున్నారు)

తెలంగాణలో అన్నం తిన్నవా? పన్నవా? అనే మాటలుండేవి. ఇప్పుడు భోజనం చేసినవా? అని వచ్చింది. భోజనం చేయడం అనేపదంలోని చేయడం క్రియకు, అన్నంతినడంలోని తినే క్రియకు ఎంతో వ్యత్యాసముంది. ఎంతో సహజసుందరంగా ఉండే పదజాలమంతా కనుమరుగయిపోవడానికి కారణం సినిమా, రేడియో మొదలయినవి కావా? అందులో ఉన్న ఆధిపత్య ప్రాంతాల కులాల ప్రాబల్యం కాదా?

గ్రామదేవతలకుకూడా బోనం పెట్టడం ఉంది. భోజనం అనరు.పెండ్లి కి లగ్గం అనే ఎక్కువగా వాడుకలో ఉండేది. పిల్ల పిల్లగాడు అనేవాళ్లు లేదా పడుచు పినుమడు, అనేవాళ్ళు, పెండ్లి పిల్లగాడు, పెండ్లిపిల్ల, పెనిమిటి, పెనికూతురు అనేవాళ్ళు ఇప్పుడందరూ అబ్బాయి, అమ్మాయి గా మారి పోయి మా మాటలన్నీ మరిచిపోయేదశవచ్చింది. దీనికి కారణం ఎవరు?

ఇట్లా అన్నివాడుకలకు, అన్ని వేడుకలకు, అన్ని సందర్భాలకు సరిపోయిన సహజమయిన పదజాలమంతా కనుమరుగయి కేవలం సినిమా భాష సర్వత్రా

వ్యాపించడం ఇవాళ చూస్తున్నాం.సినిమా పరిశ్రమ ఎవరిచేతిలో ఉంది? తెలంగాణ భాష సేవకులకు, వాచ్‌మెన్‌లకు, రౌడీలకు, పనిమనుషులకు వాడి ఆ భాషను కించపరచిన సత్యాన్ని ఎందరో ఎన్నోసార్లు ఎత్తి చూపారు. ఇదంతా కేవలం ఒక ప్రాంతం భాష ఆధిపత్యం చేయడం కాదా?

పాలనా పరంగా ఆయా శాఖలో ఉపయోగించిన పదజాలం కొద్దిమాత్రమైనా (ఎక్కువగా ఇంగ్లీషులోనే ఉంది కనుక) అందులో కూడా కొత్తమాటలు వచ్చి చేరాయి. వ్యవసాయంలో చేన్లు చెలకలు పొలాలు తోటలు అనే నాలుగు మాటలు మాట్లాడేవారు. చేన్లు అంటే జొన్న, పెసర, నువ్వు, ఉలువ, కంది మొదలైన పంటలు పండేభూములు. చెలకలు కేవలం పశువులకు మేతకోసం వదిలిపెట్టిన భూములు. పొలాలు వరిపండించేవి. తోటలు అంటే మిరప, మొక్కజొన్న , పసుపు మొదలైనవి పండించేవి. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ తోటలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వచ్చినాయి. అరటి, కొబ్బరి తోటలు లేనేలేవు. ఇప్పుడు ఈ భూములకే వ్యవసాయశాఖ కారణంగా మెట్టచేలు, పల్లపు చేలు, ఒక్కొక్కసారి పంటచేలు అంటే పంటపండే అన్నీ అని పదాలు వచ్చి చేరాయి. వానాకాలం, యాసంగి (వేసంగి) పంటలు అనే మాటలకు కొత్తమాటలు వచ్చి చేరాయి. అన్ని రంగాలలో కొత్త పదజాలం వచ్చి చేరింది.

ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నయినా చూపవచ్చు. ఇదంతా రుద్దడం కాదా! అప్పుడు వాళ్ళకు మే ఆధిపత్యం చేస్తున్నామన్న ధ్యాస ఉందా? మేము భాషాధిపత్యానికి గురవుతున్నామన్న ధ్యాస తెలంగాణ వారికి ఆనాడు ఉందా? ఉండకపోవచ్చు. కాని చారిత్రకంగా జరిగిన వాస్తవాలు ఇవి. ఇప్పుడెవరినీ నేరస్థులుగా చూడవలసిన పనిలేదు. ఒక చారిత్రక పరిణామంగా అనుకుందాం. ఎవరి అస్తిత్వాన్ని వాళ్ళం కాపాడుకుందాం. ఒకరికొకరు ఆత్మీయంగానే ఉందాం. రాజకీయంగా పరిపాలనా పరంగా వేరుకావాలనే ప్రజల ఆకాంక్షలకు అడ్డం పడి అనేక విద్వేషాలు రెచ్చగొట్టుకోవడం సరికాదు. ఎన్టీరామారావు పంచాయితీ సమితి స్థానాల్లో మండలాలు ఏర్పాటు చేయడం ప్రజలక సౌకర్యం కొరకు పరిపాలనా సౌలభ్యం కొరకే కాని విడదీయడానికి కాదుకదా ! అట్లే రాష్ట్రాలు పాలనా పరంగా విడిపోవడం వలన కలిగే నష్టమెవరికీ లేదు. ఈ ఘర్షణలో చరిత్రను తవ్వుకోవడం మూలాలు వెతుక్కోవడం అనే మంచితో పాటు పరస్పరం వైషమ్య వైరుధ్యాలు పెంచుకోవడమే అవుతుంది.

ఇప్పుడు మేం కొంత తెలుసుకొని మా బాధలు మేం పడతం, మా మాటలు మేం మాట్లాడుతం అంటే మీరే కాదు మేమూ అణచివేయబడ్డామని ఉత్తరాంధ్ర వారు, రాయలసీమవారు వాదించడం అస్తిత్వవాదమా? ఆటంకవాదమా? ఎప్పుడూ తెలంగాణ గొంతెత్తినప్పుడే వీరెందుకు స్పందిస్తారు? ఎన్నిగా విడిపోతారు? ఎవరెవరు కలుస్తారు? ఇవన్నీ మాకు ముఖ్యం కాదు. డా కొండలరావుగారు చెప్పినట్లు మా తెలంగాణ మాట వేరు.బాట వేరు. డా.అద్దంకి శ్రీనివాస్‌గారు చెప్పినట్లు రాజకీయ బాట వేరు. ఈ రాజకీయ బాట వెనుక ప్రజల మాట ఉందనేది గమనించాలి.

తెలంగాణా సెంటిమెంట్

– జగపతిరావు వెల్చాల

ఐదు దశాబ్దాల నిరంతర తెలంగాణా పోరాట ఉద్యమంలో ఎందరో తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. నిరాశ్రయులైనారు. ప్రాణాలను ఆహుతిచ్చినారు. లక్షలాది మంది తమ జీవిత ఆశయమైన తెలంగాణా రాష్ట్రం సాధించటానికి అంకితమైపోయారు. వారి సంకల్పసిద్ధి వలననే తెలంగాణా 'సెంటిమెంట్' ఆవిర్భవించి మహాశక్తిగా రూపు దిద్దుకుంది.

'సెంటిమెంట్' అనేది అంతరాత్మ ప్రభోదం. ఒక అనీర్వచనీయమైన మానసిక స్పందన ఇది కంటికి కనపడని ప్రజానాడి. 'సెంటిమెంట్' ఒక అనిర్వచనీయమైన మానసిక సంఘర్షణ. ఒక ప్రగాఢ విశ్వాసం, భావోద్వేగం ద్వారా కలిగిన ఆత్మ ప్రేరణ. భావోద్రిక్తత వలన భావ సారూప్యత, హృదయ స్పందన వలన ఉత్పన్నమైన ఒక అకుంఠిత దీక్ష, పట్టుదల.

'సెంటిమెంట్' కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు వందల సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. బోడా.భూభాగంలో, నాగాల్యాండులో, ఐరిష్ రిపబ్లిక్‌లో, ప్యాలెస్టిన్‌లో, తుర్కిస్థాన్‌లో ఇంకా ఎన్నెన్నో దేశాల్లో 'సెంటిమెంట్' ఎన్నో ఉద్యమాలను ప్రభావితం చేస్తున్నది. అక్కడ దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలపై మారణకాండలు కొనసాగుతున్నాయి.

'సెంటిమెంట్' ఆధారంగానే ఆంధ్రులు మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పర్చుకున్నారు. తమిళ 'తంబి'లు హిందీకి వ్యతిరేకంగా పోరడి తమ భాష ఔన్నత్యాన్ని కాపాడుకున్నారు. 'ద్రావిడ సంస్కృతి సెంటిమెంటు' ను ముందుంచి ప్రత్యేక దేశంగా విడిపోదామని నినాదం చేసారు. ఆంధ్రలో 'ముల్కీ రూల్సు' వ్యతిరేకంగా 'ఆంధ్రా సెంటిమెంటు'ను ఎగదోసి ఆంధ్రావారు ఉద్యమం లేవనెత్తి విడిపోదామని రగడచేశారు. యన్.టి.రామారావుగారు 'తెలుగు వారి ఆత్మాభిమానం సెంటిమెంటు'ను వాడుకొని అధికారం కైవసం చేసుకున్నారు. ఇందిరాగాంధీ గారు "పేదరికం' సెంటిమెంటును 'క్యాచ్' చేసి 'గరీబీ హటావో' నినాదం ద్వారా అధికార పీఠం ఎక్కగలిగారు.

సెంటిమెంట్‌ను ఎదుర్కోవటానికి క్షుద్రపన్నాగాలు ఎత్తుగడల ప్రక్రియలు పనికిరావు. డబ్బు, పదవుల ప్రలోభాలు పనిచేయవు. తెలంగాణా అభివృద్ధి మంత్రం లెక్కకు తీసుకోబడదు. నీచ, నికృష్ట, పక్షపాత, విద్వేషపూరిత గోల్‌మాల్ లెక్కలు దానిని అడ్డుకో లేవు. ఆశలను, ఆవేశాలను అవి అణచలేవు.

సెంటిమెంటు దేశభక్తి పోరాటం లాంటిది. అది భావోద్రిక్తతను, మానసిక తీవ్రతను తీవ్రతరం చేస్తుంది. ఎంతకాలం గడిచినా సెంటిమెంటు నివురుగప్పిన నిప్పులా అణువణువుల్లో దాగి ప్రజ్వరిల్లుతుంది. విప్లవానికి, తిరుగుబాటుకు అది దారితీస్తుంది.

అభివృద్ధితో సెంటిమెంట్‌ను ముడిపెట్టడం అశాస్త్రీయం, అసమంజసం. అది బ్రిటీష్ సామ్రాజ్యం నుండి స్వాతంత్ర్యం కోరేవారికి అభివృద్ధిని ఎర చూపినట్లుగా వుంటుంది.

అమెరికా ఒక తెల్లవారి దేశం. వారిదీ, బ్రిటిష్ వాసులదీ ఒకే 'ఎథినిక్' గ్రూపు. వారి భాష, మతం ఒకటే. అయినా అమెరికా దేశస్థులు తమ సంతతి వారిని తమ దేశం నుండి తరిమికొట్టి 'అమెరికన్ సెంటిమెంట్' ఆధారంగానే వారి స్వాతంత్ర్యం సాధించుకున్నారు.

తెలివిగలవారు తన గురించి ఆలోచిస్తే స్వార్థం అంటారు. ఇతరుల కోసం తన తెలివిని ఉపయోగిస్తే త్యాగం అంటారు, మేధావి అంటారు. ఆంధ్రప్రాంత మేధావులు, జర్నలిస్టులు, నాయకులు తెలంగాణా ప్రాంత ప్రజలను చైతన్యవంతం చేసి ఎదిగించే కార్యక్రమాలు, నిర్మాణాలు ఎందుకు చేపట్టలేకపోయారు? వేలెకరాల తెలంగాణా భూస్వాములు పారిశ్రామిక వేత్తలుగా, కాంట్రాక్టర్లుగా, విద్యారంగ వ్యవస్థాపకులుగా ఎదిగే క్రమాన్ని ఎందుకు ముందుకు తీసుకురాలేకపోయారు? ఆంధ్రప్రాంతం వారి వలన విస్తరణ స్వార్థానికి సంబంధించిందని ఇది స్పష్టం చేస్తుంది.

ఇందుకు భిన్నంగా అరబ్ దేశాల్లోకి తెలుగు ప్రజలు వలస వెళుతున్నారు. అరబ్బు దేశాల అభివృద్ధి కోసం కూలీలుగా, నిపుణులుగా పనిచేస్తున్నారు. అంతే తప్ప అక్కడి స్థానిక వనరులను ఉపయోగించుకొని తెలుగువాళ్లు అక్కడ పారిశ్రామిక వేత్తలుగా, యజమానులుగా ఎదగడం లేదు. అందువల్ల ఇలాంటి వలసలను వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. ఇలాంటి వలసలు ఏ దేశానికైనా, ఏ ప్రాంతానికైనా అవసరమే. వారిని స్థానిక ప్రజలు కూడా ఆదరిస్తారు. తెలంగాణా జిల్లాల్లో ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండి వేలాది పేదలు దశాబ్దాలుగా వలస వచ్చి స్థానిక ప్రజల భవన నిర్మాణంలో కూలీలుగా, మేస్త్రీలుగా పనిచేస్తూ స్థిరపడుతున్నారు. అలా స్థానిక ప్రజల అభివృద్ధికోసం వారి కృషి సాగింది. ఈ సందర్భంగా కూడా స్థానిక కూలీలు, మేస్త్రీలు తమ కూలి కొల్లగొడుతున్నారని గొడవలు జరిగాయి. అయితే ఎవరు ఎక్కువ పనిచేస్తారో వారినే తీసుకుంటున్నాం. మీరు వారిలాగా ఎక్కువ పని చేయండి అని నిలదీశారు. వెనుకబడిన వారు వెనుకబడ్డారు. పనిలో నైపుణ్యం పెంచుకున్న వాళ్లు పోటీపడి ఉపాధి గెలుచుకున్నారు. అందువల్ల స్థానిక ప్రజలు అభివృద్ధి చెందకుండా ఒక నగరం, ఒక పట్టణం, ఒక ప్రాంతం అభివృద్ధి చెందింది అంటే అది స్పష్టంగా స్థానిక వనరులను దోపిడీ చేస్తూ ఎదిగిన వలస వాదుల అభివృద్ధి అని అర్థం. – సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు

సంస్కృతిని పరిరక్షించవలసిన న్యాయవ్యవస్థ పట్ల కూడా తెలంగాణా వారియెడ ఆంధ్రాపాలకుల కుసంస్కృతే

– యం.జగ్గారావు

'మా రాష్ట్రం మాకు కావాలి' అన్న నినాదంలో ఎంత న్యాయబద్ధత వుందో తెలుసుకోవడానికి న్యాయవ్యవస్థలో జరిగిన అన్యాయాల గురించి పరిశీలించాల్సిన అవసరం వుంది. పక్షపాతం, వివక్ష ఎంత వుందో బోధపడాలంటే కొన్ని విషయాలు తెలియాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి అంటే గత 54 సంవత్సరాలనుంచి ఇప్పటిదాకా 16 మంది అడ్వకేట్ జనరల్స్‌ని ప్రభుత్వం నియమించింది. అందులో 4 జిల్లాలే వున్న రాయలసీమ నుంచి 8 మంది నియామకం జరిగింది. మిగతా 8 మంది నియామకం 9 సర్కార్ జిల్లాల నుంచి జరిగింది. 10 జిల్లాలు వున్న తెలంగాణా నుంచి ఒక్కరుకూడా అడ్వకేట్ జనరల్‌గా నియమించబడలేదు. 16 మంది అడ్వకేట్ జనరల్స్‌లో ఒక్క చిత్తూరు జిల్లానుంచే 6 గురు నియామకం కావడం గమనించాల్సిన అంశం. రాయలసీమ, సర్కార్‌జిల్లాల వాళ్ళే తెలివిగల వాళ్ళు అని అనుకోవడానికి వీల్లేదు. ఈ నియమకాలు ముఖ్యమంత్రి ఇష్టానుసారం జరుగుతాయి. వీరి యోగ్యత, నిష్కాపట్యం, నిర్వహణ అత్యుత్తమంగా వుందని అనుకోవడానికి వీల్లేదు. చాలామంది అడ్వకేట్ జనరల్స్‌లో యోగ్యత, నిష్కాపట్యం, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల హైకోర్టుల్లో చాలా కేసులు వీగిపోయాయని మాజీ అడ్వకేట్ జనరల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. అడ్వకేట్ జనరల్ నియామకాల్లో తెలంగాణ న్యాయ కోవిదులకు జరిగిన అన్యాయానికి బాధ్యులెవరు? ఇంత వివక్షతకు కారణం ఏమిటి?

ఈ 54 సంవత్సరాల్లో హైకోర్టులో ఒక్క పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా తెలంగాణా ప్రాంతం నుంచి నియామకం జరగలేదు. అడ్వకేట్ జనరల్ సిఫారసుల మేరకే హైకోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదులు, ప్రభుత్వలీగల్ సంస్థలకి న్యాయసలహాదారుల నియామకం జరుగుతుంది. తెలంగాణ నుంచి అడ్వకేట్ జనరల్ నియామకం ఇంతవరకూ జరగలేదు కాబట్టి ఆ నియామకాల్లో తీవ్రమైన అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రాంత న్యాయవాదులు వివక్షతకి గురైనారు.

న్యాయ కార్యదర్శుల విషయంలో కూడా తెలంగాణ ప్రాంత న్యాయమూర్తులు వివక్షతకి గురైనారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క తెలంగాణా న్యాయమూర్తి కూడా న్యాయకార్యదర్శిగా నియమించబడలేదు. ఆంధ్రవలసవాదుల గుత్తాధిపత్యం వల్ల న్యాయ వాదులు, న్యాయమూర్తులు నలిగిపోయినారు.

ఇక న్యాయవ్యవస్థ విషయానికి వస్తే రక్తం మసలుతుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటులోనే కుట్ర జరిగింది. హైదరాబాద్ రాష్ట్ర హైకోర్టు రెండూ విలీనమయ్యి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడింది. నిజానికి ఆంధ్ర హైకోర్టు హైదరాబాద్ హైకోర్టులో విలీనమైందని చెప్పాలి. కొత్త హైకోర్టుకి వచ్చిన న్యాయమూర్తులు కొత్త హైకోర్టులో ప్రమాణస్వీకారం చేయాల్సి వుంటుంది. రెండు హైకోర్టుల విలీనంవల్ల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడితే అందరు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయాలి. కానీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆ విధంగా జరగలేదు. హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు మాత్రమే ప్రమాణస్వీకారం చేశారు. ఇది న్యాయవిరుద్ధమే కాదు, హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తుల ఆత్మగౌరవాన్ని కించపరచడం కూడా.

అన్యాయం ఇక్కడితో ఆగిపోలేదు. సీనియారిటీ విషయంలో కూడా హైదరాబాద్ రాష్ట్ర న్యాయమూర్తులకి తీవ్రమైన అన్యాయం జరిగింది. రెండు హైకోర్టులు విలీనమైనప్పుడు 'ఇంటర్‌సీ' సీనియారిటీ ఏర్పాటు కావాలి. కానీ అది జరుగలేదు. ఆంధ్ర హైకోర్టులో జూనియర్‌మోస్ట్ న్యాయమూర్తి శ్రీ ఎన్.పి.కృష్ణారావు (1955), హైదరాబాద్ హైకోర్టులోని సీనియర్ మోస్ట్ న్యాయమూర్తి శ్రీ ఖమర్ హుస్సేన్ (1946), జూనియర్ మోస్ట్ న్యాయమూర్తి శ్రీ పింగల జగన్‌మోహన్‌రెడ్డి (1952). వీళ్ళ నియామకపు తేదీల ప్రకారం సీనియారిటీ నిర్ణయించాలి. కానీ ఆ విధంగా జరుగలేదు. వీళ్ళందరినీ ఆంధ్రహైకోర్టులోని జూనియర్ మోస్ట్ న్యాయమూర్తి ఎన్.పి. కృష్ణారావు (1955లో నియమితులైనారు) క్రింద వీరిని పెట్టారు. 1946లో నియమితులైన న్యాయమూర్తి ఖమర్ హుస్సేన్ (హైదరాబాద్ హైకోర్టు) అతనికి చాలా జూనియర్ అయిన ఆంధ్రా హైకోర్టు న్యాయమూర్తి ఎన్.పి.కృష్ణారావు క్రింద వుంచడం జరిగింది. కారణంగా హైదరాబాద్ న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో, అదే విధంగా జిల్లా జడ్జిల ఎంపికలో క్రియాశీలకమైన పాత్రని కోల్పోయినారు. హైకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో మొదటి ముగ్గురు న్యాయమూర్తులు ప్రధానపాత్ర వహిస్తారు. అదేవిధంగా జిల్లా జడ్జీల ఎంపికలో కూడా. 1996 వరకు జిల్లా జడ్జీల నియామకం ఇంటర్వ్యూల ద్వారా మాత్రమే జరిగేది. ఈ కారణం వల్ల తెలంగాణ ప్రాంత న్యాయవాదులు జిల్లా జడ్జీలుగా ఎంపిక అయ్యే అవకాశాలు సన్నగిల్లాయి.

ఆ తొలిరోజుల్లో జరిగిన మరో ద్రోహం జస్టిస్ కుమరయ్య ఉదంతం. జస్టిస్ కుమరయ్యను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు న్యామూర్తిగా నియమించారు. ఈ నియామకం జరిగిన ఒక సంవత్సరం తరువాత కుమరయ్యను శాశ్వత న్యాయమూర్తిగా నియమించే తరుణంలో ఆయనను కాకుండా మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న బసిరెడ్డిని శాశ్వత న్యాయమూర్తిగా నియమించారు. క్రిమినల్ న్యాయవాదిగా పేరుమోసిన బసిరెడ్డి జస్టిస్ కుమరయ్యకు జూనియర్‌గా ఉండడానికి

ఒప్పుకోడన్న కారణంగా అలా చేశారని అప్పటి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడినారు. 1957అక్టోబర్10న బసిరెడ్డి న్యాయమూర్తిగా నియమితులు కాగా, పన్నెండు రోజుల తర్వాత జస్టిస్ కుమరయ్యను శాశ్వత న్యాయమూర్తిగా నియమించారు. బసిరెడ్డికి ప్రాధాన్యమివ్వడంలో కుట్ర వుంది. తెలంగాణా న్యాయమూర్తులు సీనియర్ న్యాయమూర్తులుగా ఉండకుండా చూడడమే ఆ కుట్ర. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడటంతోనే హైదరాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీపతిరావు తన ప్రధాన న్యాయమూర్తి పదవిని కోల్పోయి, బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా వెళ్ళిపోవాల్సి వచ్చింది. అదే విధంగా హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు ఆంధ్రా హైకోర్టులోని జూనియర్ మోస్ట్ న్యాయమూర్తికి జూనియర్లుగా మారిపోయినారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటులో జరిగిన అన్యాయం 54 సంవత్సరాలుగా కొనసాగుతూనే వుంది. అప్పుడు జరిగిన ద్రోహం ఇంకా విస్తృతరూపంలో కన్పిస్తూనే వుంది.

ఇక ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉనికిని ప్రశ్నిస్తూ దాఖలైన రిట్ పిటీషన్ ఆరోజు విచారణకి రాలేదు. 1950 నవంబర్5, ఉదయం పదిన్నరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన పని ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి కోర్టులోని బెంచిలో ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు, జస్టిస్ రామ్ మనోహర్ ప్రసాద్‌లు వున్నారు. బెల్లు మ్రోగిన వెంటనే న్యాయమూర్తులు కోర్టు హాల్లోకి వచ్చి తమ స్థానాల్లో కూర్చున్నారు. వారు కూర్చోగానే తెలంగాణాకు చెందిన సీనియర్ న్యాయవాది బారిస్టర్ శ్రీకిషన్ లేచి "మైలార్డ్! నేనొక రిట్ పిటీషన్ దాఖలు చేశాను. అందులో రాజ్యంగ పరమైన అంశాలను లేవనెత్తాను. ఈ కోర్టు పనిచేసే విధానాన్ని, అధికార పరిధిని ప్రశ్నించాను. ఆ కేసు మొదటగా విచారించాలని కోరుతున్నా"నని అన్నారు. "అంతేకాదు, ఇప్పుడు మీరు అధిరోహిస్తున్న బెంచి పరిధిని కూడా ప్రశ్నిస్తున్నాను. అందుకని మీరు నా రిట్ పిటీషన్ని ముందుగా వినాల"ని కోరారు బారిస్టర్ శ్రీకిషన్.

కాజ్‌లిస్టులో కేసులేదని అందుకని అది వినే అవకాశం లేదని కోకా సుబ్బారావు అన్నారు. ఇతర కేసులని పిలవమని బెంచి క్లర్క్‌ని ఆదేశించారు. బారిస్టర్ శ్రీ కిషన్ మిన్నకుండి పోలేదు. తన వాదనని కోర్టు వినకపోవడం చట్ట వ్యతిరేకమని అరిచాడు శ్రీ కిషన్.

శ్రీ కిషన్ కోర్టు పనికి అంతరాయం కలిగిస్తే అతన్ని బయటకు పంపించాలని రిజిస్ట్రార్‌కి చీఫ్ జస్టిస్ ఆదేశాలు జారీ చేశారు. కాజ్ లిస్టులో వున్న కేసులని మాత్రమే వినడం ఆంధ్రా హైకోర్టు పద్ధతని కూడా చీఫ్ జస్టిస్ అన్నారు. కాజ్‌లిస్ట్‌లు కేసులని వుంచే పని రిజిస్ట్రార్ చేస్తారు. అప్పుడు రిజిస్ట్రార్ ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తి. హైదరాబాద్‌లో ఏర్పాటైన హైకోర్టులో నడిచింది ఆంధ్రాహైకోర్టు

పద్ధతి. ఆంధ్రప్రదేశ్ ఉనికినే ప్రశ్నించిన రిట్ పిటీషన్ని ఆ రోజు విచారించలేదు. ఆ తరువాత ఎప్పుడో పరిష్కరించారు. ఆ రోజునే విచారిస్తే ఫలితాలు మరో విధంగా ఉండేవి.

హైదరాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్‌గా పనిచేసిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కావడం వల్ల తన పదవిని కోల్పోయినాడు. ఆంధ్రా రిజిస్ట్రార్‌తో అవమానించబడ్డాడు. ఆంధ్రా వలసపాలకుల గుత్తాధిపత్యం క్రింద తెలంగాణ న్యాయవాదులు, తెలంగాణ న్యాయమూర్తులు నలిగిపోయారు, నలిగిపోతున్నారు. ఇప్పటివరకూ హైకోర్టుకి ఎంపిక చేసిన న్యాయమూర్తుల వివరాలు చూస్తే ఈ విషయం ఇంకా స్పష్టమౌతుంది.

మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్రులు రెండవ తరగతి పౌరులుగా బ్రతికారు. అది వాళ్ళ గడ్డ కాదు. హైదరాబాద్ తెలంగాణ గడ్డ. తెలంగాణ న్యాయవాదులు, తెలంగాణ న్యాయమూర్తులు తమ గడ్డ మీదే రెండవ తరగతి పౌరులుగా బ్రతుకుతున్నారు. ఇది ఇంకా ఎన్నాళ్ళు? స్వయం పరిపాలన, స్వీయ న్యాయపరిపాలన తెలంగాణ ప్రజల ప్రజాస్వామ్య హక్కు

ఇక న్యాయమూర్తుల సంఖ్య విషయానికి వస్తే న్యాయమూర్తుల సంఖ్యలో పది శాతం కూడా తెలంగాణ న్యాయమూర్తులు లేరు. ప్రతిభ లేకపోవడం వల్ల ఈ విధంగా జరగడం లేదు. ధానికి కారణం పాలకుల పక్షపాత వైఖరే.

సంస్కృతిని పరిరక్షించే న్యాయవ్యవస్థ పట్ల కూడా ఆంధ్రా పాలకులు అవలంబించే కుసంస్కృతి వలననే ఈ అన్యాయాలన్నీ జరుగుతున్నాయి. న్యాయవ్యవస్థ పట్లే ఇలాంటి కుటిల సంస్కృతి ఉంటే తక్కిన వాటిలో ఇక న్యాయమెలా జరుగుతుంది తెలంగాణా వారికి?

'ముంగిలి' ముందడుగు

ఈ మధ్య, 'తెలంగాణా ప్రచురణలు' వారు డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారి 'ముంగిలి'యను తెలంగాణా ప్రాచీన సాహిత్యానికి చెందిన బృహత్గ్రంధమొకటి వెలువరించారు. దీనిలో ఒకప్పటి తెలంగాణా సాహిత్య వైభవం గురించి చాలా సమాచార సామగ్రి సేకరించి పొందుపరిచారు. తెలంగాణా సాహిత్యాభిమానులు, తెలంగాణా అభిమానులందరూ తప్పకుండా చదవలవలసిన పుస్తకమిది. (కొని చదవవలసింది) దీనితో పాటు ఈ రచయిత మరో రచయిత సురేంద్రరాజుతో కలిసి తెలంగాణా ఆధునిక కవిత్వం గురించి తెచ్చిన 'మత్తడి'ని కూడా చదివితే ఈ ప్రాంతం వారికి ఎంతో కొంత తెలంగాణా సాహిత్యం యొక్క పూర్వాపరాలు, ఆధునిక సాహిత్యం యొక్క ప్రగతి తెలుస్తాయి. 'ముంగిలి'నుండి కొన్ని భావాలు దీనిలో నారాయణరెడ్డి గారి, తెలంగాణా ప్రచురణలు వారి సౌహార్ద్రంతో పొందుపరుస్తున్నాం.

– *డా॥ కొండలరావు వెల్చాల*
కన్వీనర్, తెలంగాణా కల్చరల్ ఫోరమ్

'తష్ణ' నుండి

తనను తాను తెలుసుకుంటున్న తెలంగాణ – విస్మరణకు, వివక్షకు, వక్రీకరణకు గురైన తన చరిత్ర, సంస్కృతి, సాహిత్య మూలాల అన్వేషణకు శ్రీకారం చుట్టింది. ఈ అన్వేషణ గవేషణలో బయటపడ్డ సాహితీ వజ్ర వైఢూర్యాలను తెలుగు ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నమిది. తెలంగాణ తల్లి బిడ్డలుగా కొంతమంది మిత్రులం ప్రత్యేక అస్తిత్వసోయితో ఈ తెలంగాణ ప్రచురణలు ప్రారంభించాం. తెలంగాణ గత వైభవాన్ని, గౌరవాన్ని, కీర్తిని, శౌర్యాన్ని, ప్రతిభను, గుర్తింపును దశదిశలా వ్యాపించజేయాలనే ఆలోచనలకు అక్షరరూపమిచ్చే యత్నమిది.

×××

తెలంగాణకు సంబంధించిన పూర్తి సమాచారం అందరికీ అందుబాటులో లేకపోవడంతో (కొన్నిసార్లు సమాచారమున్నా పట్టించుకోనందున) ప్రాంతేతర మేధావులు తెలంగాణలో ఏమీలేదని పూర్తి నిర్ధారణకు వచ్చి తీర్పులిస్తున్నారు. ఓరుగల్లు 'బమ్మెర' పోతన రాయలసీమ వాడంటూ ఇంకా రాద్ధాంతం చేస్తుండ్రు. రాజమండ్రి కుసుమధర్మన్న పదుల సంఖ్యలో తెలంగాణ సంస్కర్తల్ని లెక్కేసి మొక్కినా పాఠ్య పుస్తకాల్లో ఒక్కరికీ చోటుండదు. కరుణశ్రీ 'పుష్పవిలాపా'నికి ముందే 'కుసుమ విలాపం' రాసిన నల్లగొండ కోదాటి రామకృష్ణారావును ఎవ్వరూ గుర్తించరు. తత్వాలకు యక్షగానాలకు ప్రాణంపోసిన గుజ్జరి యెల్లదాసు, వెంకటదాసు, భాజా అహ్మదొద్దీన్‌లు ఎవ్వరికీ పట్టని బిడ్డలయ్యిండ్రు. గత శతాబ్దంలోనే కవితలల్లిన తెలంగాణ తొలి దళిత కవి దున్న ఇద్దాసు గుర్తింపుకు నోచుకోలేదు.

కత్తి పట్టిన రుద్రమదేవి శౌర్యాన్ని, తుదకంటూ పోరాడిన సమ్మక్క, సారక్క వారసత్వాన్ని కొనసాగించాలని ఆశ, అన్నమయ్య లక్షగళ సంకీర్తన హోరులో పేరు లేకుండా

పోయిన కంచర్ల గోపన్నను, వేలాది కీర్తనలు రాసి కూడా మరుగున పడిన వేపూరి హనుమద్దాసు, మన్నెంకొండ హనుమద్దాసు, రాకమచర్ల వెంకటదాసు, ముష్టిపల్లి వెంకట భూపాలుడు తదితరులను ప్రచారం చేయాలి. చాకలి అయిలమ్మ ధైర్యాన్ని, బందగీ స్థైర్యాన్ని అందరికీ తెలియ జెప్పాలి. అందుకే ఈ సాహసం.

xxx

'పుస్తకం గురించి కాసేపు...' నుండి

ఈ పుస్తక రచనకు పూనుకోవటానికి ఇంతకుముందు చెప్పిన కారణంతో పాటు మరొక కారణం ఉంది. గోలకొండ కవుల సంచికకు ముందూ తర్వాతా తెలంగాణ సుప్తచేతనలో పేరుకుపోయిన అనేక అవహేళనలు, అలక్ష్యాలు, నిరాసక్తతలు, అనాసక్తతలు, ఉదాసీనతలు, అజ్ఞానాలు, వివక్షలు –
అవికొన్ని :

1. 1920లో ఒక సర్కార్ ఆంధ్ర ప్రముఖుడు మాడపాటితో "హైద్రాబాద్‌లో ఆంధ్రులు కలరా?" యని ప్రశ్నించాడు.

2. 1950 ప్రాంతంలో కోస్తాంధ్రులెవరో దేవులపల్లి రామానుజరావుగారితో "మీరు హైద్రాబాదు వాసులైనప్పటికీ తెలుగు మాట్లాడగలుగుచున్నారే" అని ఆశ్చర్య పడినారట.

3. 1951లో ఒక వ్యాసంలో దేవులపల్లి ఇలా రాసినారు ఆధునికాంధ్ర వాఙ్మయమున ప్రసిద్ధులైన ఒక రచయిత, "తెలంగాణమున తెలుగు రచయిత ఎవ్వరు?" అని ఒకానొక సందర్భమున నన్ను ప్రశ్నించియుండిరి.

4. 1955 – పంపడు వేంగినుంచి కన్నడ దేశానికి వలస వెళ్ళాడని శిష్టా రామకృష్ణశాస్త్రి రాసినాడు. కాని వెళ్ళింది పంపడు కాదు అతని తండ్రి. వెళ్ళిన ప్రాంతం కన్నడదేశం కాదు వేములవాడ.

5. 1984 – నేను (ఈ గ్రంథ రచయిత) ఉద్యోగరీత్యా శ్రీకాకుళం వెళ్ళినపుడు అక్కడివాళ్ళు "తెలంగాణ నుంచి వచ్చారు. చక్కని భాష మాట్లాడుతున్నారే" అని ఆశ్చర్యం వ్యక్తం చేసినారు.

6. 1996– "పూర్వ సాహిత్య చరిత్ర గ్రంథాల్లో తెలంగాణ ఒక అజ్ఞాత ప్రాంతంగా కనిపించేది. సాహిత్య చరిత్ర అంతా తెలంగాణేతర ప్రాంతాలలో జరిగిందా అని అనుమానం వచ్చేది" అని చేకూరి రామారావు – డా॥ ముదిగంటి సుజాతారెడ్డిగారి "తెలుగు సాహిత్య చరిత్ర" ముందుమాటలో రాసినారు.

7. 2003 – "తెలంగాణలో సాహిత్య కళ చాలాకాలం గొంగళి పురుగువలె నిద్రాణవస్థలో ఉన్నది" అని అధికార భాషా సంఘం చైర్మన్ నందూరి రామకృష్ణమాచార్య " వెన్నెలజల్లులు" అనే నల్లగొండ జిల్లా కవితా సంకలనం ముందుమాటలో రాసినాడు.

8. 2007– నేను హైదరాబాద్ ప్రాచ్యలిఖిత భాండాగారానికి వెళ్ళినపుడు అక్కడ తారసపడ్డ ఒక రాయలసీమ వ్యక్తి తెలంగాణ భాషా విశిష్టత గురించి నా వాదనలన్నీ విన్న తర్వాత గూడ "ఎంతైనా తెలంగాణ భాష ఇంకా మెరుగుపడాలి" అన్నాడు. ఇంకా ఇలాంటివి ఎన్నో...

వీటిని విచ్ఛిన్నం చేస్తూ తెలంగాణకు అద్భుతమైన భాషా సాహిత్యాల సంపద వారసత్వంగా సంక్రమించిందని నిరూపించాలనుకోవడం ఈ రచనకు మరో కారణం.

xxx

తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం తెలంగాణ శాసన, భౌగోళిక, రాజకీయ చరిత్ర తదితర పరిశోధనలతో ముడిపడి ఉంది. తెలంగాణలో మొదటి పరిశోధన చేయించినవాడు కాలిన్ మెకంజీ. 1790 నుండి 1810 వరకు పరిశోధకులను పంపి శాసనాలను ఎత్తి రాయించి తాళపత్ర గ్రంథాలను సేకరింపచేసినాడు. తర్వాత కొమఱ్ఱాజు లక్షణ్‌రావు, జయంతి రామయ్య పంతులు, మల్లంపల్లి సోమశేఖరశర్మ మొ॥ వాళ్ళు విశేష కృషి చేసినారు. 1927లో రాసిన "నిజాము రాష్ట్రాంధ్ర కవులు" (శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రజతోత్సవ సంచిక) అనే వ్యాసంలో శేషాద్రి రమణకవులు "పరిశోధకులు బ్రిటిషు ఆంధ్రదేశంనందే తమ దృష్టి ప్రసరింపచేసి చరిత్ర గ్రంథములు ముగించుటచే నిజాము రాష్ట్రమునందలి చరిత్రమింతవరకు దుర్భేద్యముగా నుండెననుటలో సాహసము లేదు" అని రాసినారు. అంటే ఆనాటికి తెలంగాణ చరిత్ర నిర్మాణం కాలేదని తెలుస్తుంది. ఆ తర్వాత ఆ దిశగా ప్రయత్నం జరిగిందో లేదో తెలియదుగాని - సురవరం ప్రతాపరెడ్డి గారి "తెలంగాణ చరిత్రము" (గోలకొండ పత్రిక 27-7-1941) అనే వ్యాసం, మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి "తెలంగానా చరిత్ర" (సుజాత - 15-8-1951) అనే వ్యాసం మాత్రం దొరికినవి. తెలంగాణ చరిత్రను తవ్వి తీయడానికి బి.ఎస్.శాస్త్రిగారు పడిన నిరంతర శ్రమ విస్మరించరానిది. విడిగా విష్ణుకుండినుల చరిత్ర, కాకతీయుల చరిత్ర, రాచకొండ పద్మనాయకుల చరిత్ర, కుతుబ్‌షాహిల, ఆసఫ్‌జాహిల చరిత్రల గురించి పరిశోధనలు జరిగినవి కాని సమగ్రంగా తెలంగాణ భౌగోళిక రాజకీయ, సాంస్కృతిక చరిత్ర ఒక్కచోట క్రోడీకరించడం జరుగలేదు.

ఆ దిశగా "తెలంగాణ చారిత్రక భూగోళం" అనే ఒక ఎం.ఫిల్. థీసిస్ (రాతప్రతి) మాత్రం వచ్చినట్లు తెలుస్తుంది. తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం సమగ్రంగా జరగాలంటే ముందు తెలంగాణ భౌగోళిక, రాజకీయ చరిత్ర నిర్మాణం సమగ్రంగా జరగవలసి ఉంది.

ఇప్పటికి లభించిన చరిత్రలతో సాహిత్య చరిత్రను సంవదించే ప్రయత్నం మాత్రమే ఈ రచనలో జరిగిందనే విషయాన్ని సహృదయులు దృష్టిలో ఉంచుకోవాలె.

xxx

ఇక తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణానికి కృషిని పరిశీలిద్దాం.

శేషాద్రి రమణ కవులు పైన పేర్కొన్న వ్యాసంలోనే ఇలా అన్నారు. "ఇంత విశాలమగు (నిజాం రాష్ట్ర ఆంధ్రప్రాంతం) ప్రదేశమును ఉపేక్షా దృష్టితో చూచుట చేతనే ఆంధ్రుల చరిత్రము, ఆంధ్రకవుల చరిత్రము అసమగ్రములుగా భావింపవలసి వచ్చినది". "నిజాము రాష్ట్రమునందలి యాంధ్రకవుల చరిత్రము వ్రాయుట సామాన్య కార్యము కాదు. ఈ రాష్ట్రమున గల ప్రాచీన గ్రంథములు సమగ్రముగా సేకరింపబడలేదు. సమకూర్చి యుపయోగార్హముగా నుంపబడిన లిఖిత పుస్తకాలయములు లేవు. గ్రంథస్తములగు

గ్రామనామములు పెక్కులు మహ్మదీయ నామాంకితముగా మారియున్నవి. పెక్కు గృహములందు తాళపత్ర గ్రంథములు చివికి బేర్డించుచున్నవి." "నిజాము రాష్ట్ర ఆంధ్రకవి జీవితము సమగ్ర పరిశోధనముతో బయలు వెడలినచో ఆంధ్రకవి జీవిత సంశయగ్రంధులు విడిపోవుటయే గాక నిజాము రాష్ట్రాంధ్ర దేశము యావదాంధ్ర దేశమునకు శిరప్రాయమను అంశమాబాల వేద్యము కాగలదు".

ఈ మాటలను బట్టి ఆనాటికి తెలంగాణ కవుల చరిత్ర నిర్మాణం కాలేదని, కావలసిన అవసరం ఉన్నదని తెలుస్తుంది. శేషాద్రి రమణ కవులముందు, తర్వాత వచ్చిన తెలుగు సాహిత్య చరిత్రలను ఒకసారి చూద్దాం.

1. బయోగ్రఫికల్ స్కెచెస్ ఆఫ్ డెక్కన్ పోయెట్స్ - 1829 -కావలి వెంకటరామస్వామి; 2. కవి జీవితములు - 1876 - గురజాడ శ్రీరామమూర్తి; 3. ఆంధ్ర కవుల చరిత్రము - 1917 (పూర్వాంధ్ర కవుల ప్రథమ సంపుటి 1887) - కందుకూరి వీరేశలింగం; 4. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - 1920 - వంగూరి సుబ్బారావు; 5. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహం - 1928 - 'కవిత్వ వేది' కల్లూరి వెంకట నారాయణరావు; 6. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం - 1929 - ఖండవల్లి లక్ష్మీ రంజనం; 7.ఆంధ్ర కవి తరంగిణి (12 సంపుటాలు) 1952 నుంచి మొదలు - చాగంటి శేషయ్య; 8. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వం (1375 వకు) సంపుటం - 1 (రచనాకాలం 1955, మొదటి ముద్రణ 1957) శిష్టారామకృష్ణశాస్త్రి; 9. భోగరాజు నారాయణమూర్తి; 10. టేకుమళ్ళ కామేశ్వరరావు; 11. బసవరాజు అప్పారావు; 12. చెంచయ్య; 13. భుజంగరావు; 14. టేకుమళ్ళ రాజగోపాలరావు; 15. బి.టి.రాజు; 16. దివాకర్ల వెంకటావధాని; 17. తెనుగు కవుల చరిత్ర - నిడదవోలు వెంకటరావు; 18.సమగ్ర ఆంధ్రసాహిత్యం - ఆరుద్ర; 19. తెలుగుసాహిత్య చరిత్ర (5 సంపుటాలు) - కొర్లపాటి శ్రీరామమూర్తి.

ఈ సాహిత్య చరిత్రలు రాసిన వారిలో తెలంగాణ వారెవ్వరూ లేరు. అందుకే తెలంగాణ కవులకు లభించవలసిన స్థానం లభించలేదు. అనేకమంది కవులు మరుగున పడి విస్మరణకు గురైనారు. ఈ చరిత్రకారులకు ఈ ప్రాంతం గురించి శేషాద్రి రమణ కవులు అన్నట్లు ఉపేక్షాభావం ఉండడం వల్ల, ఈ ప్రాంతం గురించి తెలియకపోవడం వల్ల కందుకూరి, బ్రౌన్‌లాంటి వాళ్ళు కూడ గోదావరివాడు అనగానే ఆ కవిని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు, కృష్ణతీరం వాడు అనగానే ఆ కవిని కృష్ణా, గుంటూరు జిల్లాలకు తీసికెళ్ళారు. ఒక కవి ఇంటిపేరు కోస్తా జిల్లాల్లో ఎక్కడ కనపడ్డా ఆ కవిని ఆ వూరివాడిని చేసినారు. కృష్ణా, గోదావరి తీరాలు తెలంగాణలో కూడా ఉన్నాయనే గుర్తింపే వారికి లేదు. ఆ ప్రాంతంలో ఉన్న వూరి పేర్లు తెలంగాణలో కూడా ఉన్నాయన్న జ్ఞానమే వారికి లేదు. ముదిగంటి సుజాతరెడ్డి రాసిందొక్కటే తెలంగాణ నుంచి వచ్చిన సాహిత్య చరిత్ర. అందుకే ఈ గ్రంథంలో తెలంగాణ కవులకు ప్రాధాన్యం లభించింది.

xxx

ఇక తెలంగాణ సాహిత్య పరిశోధన, చరిత్ర పరిశోధన గురించి చూద్దాం.

కాలిన్ మెకంజీ, మానవల్లి రామకృష్ణ కవి, కొమర్రాజు లక్ష్మణరావు, జయంతి

రామయ్య పంతులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, వెల్లాల సదాశివశాస్త్రి, అలూరి గురూజీరావులు తెలంగాణ గురించి పరిశోధించిన తొలితరం పరిశోధకులని శేషాద్రి రమణ కవుల్లో ఒకరైన దూపాటి వెంకటరమణాచార్యులు రాసిన ఒక వ్యాసం వల్ల తెలుస్తుంది.

తెలంగాణ సాహిత్యాన్ని గురించి విస్తృతంగ పరిశోధించినవారు శేషాద్రి రమణకవులు. తెలంగాణ సాహిత్య చరిత్రకు సంబంధించి వారు ప్రాతఃస్మరణీయులు. తెలంగాణ కవులను గురించి మొదటిసారిగా ఒకచోట క్రోడీకరించినవారు వాళ్ళు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ రజతోత్సవ సంచిక (1927)లో వారు వ్రాసిన "నిజాము రాష్ట్రాంధ్ర కవులు" అనే వ్యాసంలోను, అదే సంచికలో ఇచ్చిన పట్టికలోను 114మంది తెలంగాణ కవుల గురించి రాసినారు. తరువాత గోలకొండ పత్రికలో వివిధ సంవత్సరాల్లో, మరికొంతమంది కవుల గురించి వారే వ్యాసాలు రాసినారు. (అదే పత్రికలో ఆదిరాజు వీరభద్రరావు, తి.బు. వేంకటాచార్యులు మొ॥ వారు కొంతమంది కవుల గురించి వ్యాసాలు రాసినారు). వెరసి గోలకొండ కవుల సంచిక (1934)లో వారే 183 మంచి ప్రాచీన కవుల గురించి (తెలంగాణ పూర్వకవుల పేరుతో) సంక్షిప్త పరిచయం రాసినారు. అప్పటికి తెలంగాణ కవులకు సంబంధించిన సమాచారం వారివద్ద దండిగానే ఉండింది. చాలా కావ్యాలను స్వయంగా చూసినారు. "సమగ్రమగు జీవిత చరిత్రము వ్రాయుటకు ననువగు పరికరములను కొంతవరకు సేకరించితిమి. ఇంకను సేకరించుచున్నాము" అని వారు రాసిందాన్ని బట్టి ఆ విషయం స్పష్టమవుతుంది. అప్పుడే వివరంగా రాయగలిగి వుండి రాయకపోవడంవలన తెలంగాణ సాహిత్యానికి చాలా నష్టం జరిగింది.

తర్వాత వారిలో ఒకరైన దూపాటి వెంకట రమణాచార్యులు - "సుజాత" (15-08-1951) తెలంగాణా ప్రత్యేక సంచికలో "తెలంగాణము ప్రాచీనాంధ్ర వాఙ్మయం" అనే వ్యాసం రాసినారు. (ఇందులో అదనంగా ఎంతమంది కవుల గురించి రాసింది బేరీజు వేయలేదు). అంతే, అంతటితో విశాలాంధ్ర నినాదం కారణంగా తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్రల నిర్మాణానికి బ్రేకు పడింది.

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల గురించి ఒక జాతీయోద్యమ స్వభావంతో, ఉద్వేగంతో, సాంస్కృతిక పునరుజ్జీవన ఆవేశంతో జరిగిన పరిశోధన, వెతుకులాట, గత వైభవ స్మరణం, తనలోకి తను చూసుకోవటం అంతా "విశాలాంధ్ర" నినాదంతో మరుగున పడింది. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంతో తెలంగాణను "అటక" ఎక్కించినారు.

అయితే తెలంగాణ ఉత్తబీజం కాదు. అగ్నిబీజం. ఎన్నటికీ తన శక్తిని కోల్పోదు. కోల్పోలేదు. శేషాద్రి కవులతో సమకాలికంగానూ తర్వాత ఆ బీజం ఆరిపోలేదు. "తెలంగాణ సాహిత్య చరిత్ర" పేరుతో కాకపోయినా వివిధరూపాల్లో కంభంపాటి అప్పనశాస్త్రి, ఆదిరాజు వీరభద్రరావు, మారేమండ రామారావు, శిరుగూరు హనుమంతరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, భావరాజు వెంకటకృష్ణరావు, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, చిదిరె మఠం వీరభద్రశర్మ, బూర్గుల రామకృష్ణారావు, గడియారం రామకృష్ణశర్మ, బిరుదురాజు రామరాజు, బిఎన్.శాస్త్రి, కపిలవాయి లింగమూర్తి, శ్రీరంగాచార్య, జితేంద్రబాబు, సంగిశెట్టి శ్రీనివాస్, కె.శ్రీనివాస్, బాలశ్రీనివాస్‌మూర్తిల పరిశోధన, తెలంగాణ

వివిధ జిల్లాల సాహత్య చరిత్రలు, శతక, యక్షగాన, వచన వాఙ్మయం మొ॥ వివిధ ప్రక్రియల చరిత్రలు, సంస్థాన చరిత్రలు మొ॥ వాటి మీద పరిశోధన సాగింది.

అయితే తెలంగాణ సాహిత్యాన్నంతటినీ ఒక్కచోట, కాలక్రమానుసారంగా, పూర్తి వివరాలతో కవిత్వ పరిచయంతో సహక్రోడీకరించే పని మాత్రం జరుగలేదు. ఆ దిశగా ఇది ('ముంగిలి'ది) తొలి ప్రయత్నమని భావిస్తున్న. పైన పేర్కొన్న అనేకమంది కృషికి ఇది కొనసాగింపు మాత్రమేనని కూడ భావిస్తున్న. ఇది సమగ్రం కాదని, కొన్ని లోపాలున్నవని, రెండో ముద్రణలో వాటిని సవరించుకొని సమగ్రం చేసే ప్రయత్నం చేస్తానని విన్నవించుకుంటున్న.

హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు, ఢిల్లీ, ముంబయి, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, కర్నూలు నగరాల స్థానికులు వలస వచ్చిన వాళ్లు తమకు తెచ్చిపెట్టిన కష్టాల పట్ల కోపంగా ఉన్నారు. ఆ కోపాన్ని మహారాష్ట్రలో శివసేన వంటి వాళ్లు సిద్ధాంతీకరించి రాజకీయ నినాదాలుగా మలుచుకున్నారు. అంతేగానీ భౌతిక పునాది లేకుండా స్థానికు ఆగ్రహం లేకుండా శివసేన ఇచ్చే నినాదాలు ప్రజల్లో కొనసాగడం సాధ్యం కాదు. ముంబాయి నగర అభివృద్ధిని తీసేసి మహారాష్ట్ర అభివృద్ధిని లెక్కిస్తే ఒరిస్సా రాష్ట్రం కన్నా వెనకబడిపోయిందని ఇరవయ్యేళ్ళ క్రితం ఒక అధ్యయనంలో చెప్పారు. అలాగే హైదరాబాద్ మహానగర అభివృద్ధిని తీసేసి తెలంగాణా అభివృద్ధిని లెక్కిస్తే నిజమైన తలసరి ఆదాయం తెలుస్తుంది. కానీ ప్రతిసారీ హైదరాబాద్ మహానగర ఆదాయాన్ని తెలంగాణాలో కలిపి తెలంగాణా అభివృద్ధి చెందిందని లెక్కిస్తారు. కానీ హైదరాబాద్ తెలంగాణాలో భాగం అన్నప్పుడు మాత్రం వలసవచ్చిన వాళ్ళు మేం అభివృద్ధి చెందించాం అని, మాకే చెందాలని లేదా కేంద్ర పాలిత ప్రాంతం కావాలని డిమాండ్ చేస్తున్నారు.

- అసమానతలు వున్నంతకాలం ప్రత్యేక ఉనికి ఉద్యమాలు అనేక రూపాల్లో ముందుకు వస్తూనే వుంటాయి. అవి స్త్రీవాదం కావచ్చు, దళితవాదం కావచ్చు, ప్రత్యేక రాష్ట్ర వాదం కావచ్చు, బీసీ వాదం కావచ్చు, కులవృత్తుల అభివృద్ధి చర్చ కావచ్చు, దోపిడీ పీడనల అణచివేత నుండి విముక్తి కావచ్చు. ఏదైనా అసమానతలు వున్నంతకాలం ఇలా అనేక రూపాల్లో ముందుకు వస్తూనే వుంటాయి.

- తెలంగాణ రాష్ట్రం అనేది కేవలం వెనుకబాటు తనానికి సంబంధించినది కాదు. కేవలం చిన్న రాష్ట్రాల సిద్ధాంతానికి సంబంధించినది కాదు. ఒక ప్రత్యేక చారిత్రక పరిణామంలో రూపొందిన తెలంగాణ ప్రాంత భాష, సంస్కృతి, సామాజిక అంశాల అభివృద్ధికి ఇతరుల ఆధిపత్యం నుంచి విముక్తికి సంబంధించినది. అది రాజకీయ పరమైనది కాదు. ఆర్థిక పరమైనది కాదు. సాంస్కృతిక పరమైనది, స్వయం పాలనకు, ఆత్మ గౌరవానికి, స్వేచ్ఛా సమానత్వంకు సంబంధించినది.

– సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు

అభినందనం

– ఆచార్య రవ్వా శ్రీహరి

ఆంధ్రులందరూ ఒకేజాతికి చెందినవారైనా ఆంధ్రదేశంలోని ప్రాంతాల భేదాన్ని బట్టి నిజామాంధ్రులు, కోస్తా ఆంధ్రులు, రాయలసీమ ఆంధ్రులు, కళింగాంధ్రులు అనే నాలుగు ప్రధాన భేదాలు కనిపిస్తాయి. నిజామాంధ్రులు నివసించే భూభాగాన్నే మనం 'తెలంగాణ' అని వ్యవహరిస్తున్నాం. ఏమి దురదృష్టమో కాని కొన్ని ప్రాంతాల పండితుల్లో, పెద్దల్లో తెలంగాణంలో తెలుగులేదనీ, ఉన్నా అది సరైన తెలుగు కాదనీ నిష్కారణమైన అసత్యమైన అపోహ నేటికీ ఉంది. ఈ అపోహ కలిగినవారు తెలంగాణంలోని మారుమూల పల్లెలకు వెళ్ళితే తెలంగాణపు తెలుగు బాస సొగసులు వారికి తెలిడువస్తాయి. ఒక పండితుడు "నిజాం రాష్ట్రంలో ఆంధ్రకవులు పూజ్యము" అని గోలకొండ పత్రిక తొమ్మిదవ సంవత్సరాది సంచికలో ఒక అభియోగం కూడా చేసినాడు, దానిని సహింపక తెలంగాణ వైతాళికుడైన సురవరం ప్రతాపరెడ్డిగారు ఎంతో శ్రమపడి తెలంగాణ ప్రాంతంలో కవుల వివరాలను సేకరించి 'గోలకొండ కవుల సంచికను ప్రచురించినారు. ఇందులో తెలంగాణ ప్రాంతమందలి 354 మంది ఆధునిక కవుల వివరాలను, 183 మంది ప్రాచీన కవుల వివరాలను పేర్కొనడం జరిగింది.

తెలంగాణలో విలసిల్లిన సాహిత్యానికి అమూల్యమైన చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యంలోని శిఖరాయమాణులైన కవులెందరో తెలంగాణను ప్రసీతం చేసినవారే. తెలుగు కవులకున్న వైశిష్ట్యాన్ని గుర్తించే 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహా'న్ని రచించిన ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు తమ గ్రంథంలో కొందరు తెలంగాణ కవులు అనే పరిచ్ఛేదాన్ని కల్పించినారు. దీన్ని బట్టి తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ ప్రాంతపు కవులకు గల ప్రత్యేకతను గమనించవచ్చు.

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా దేశి పద్ధతిలో స్వతంత్ర రచన చేసిన కీర్తి తెలంగాణలోని పాలకుర్తికి చెందిన సోమనాథునికే చెందుతుంది. భాషలో, ఛందస్సులో, వస్తువులో ఎంతో నవ్యతను ప్రదర్శిస్తూ ఇతడు రచించిన బసవపురాణం, పండితారాధ్య చరిత్ర కావ్యాలు తెలుగు సాహిత్యానికి మణిదీపాలు. సోమన రచించిన వృషాధిప శతకం మకుట నియమం, సంఖ్యానియమం కలిగిన శతకాల్లో మొట్టమొదటిది.

ప్రాచీన తెలుగు రామాయణాల్లో భాస్కర రామాయణం మిక్కిలి ప్రజాదరణను పొందిన గ్రంథం. ఎఱ్ఱన రచించిన రామాయణం లభ్యం కాలేదు కనుక లభ్యమైన మార్గ పద్ధతికి చెందిన రామాయణాల్లో ఇదే ప్రథమం. ఇది హుళక్కి భాస్కరుడు, మల్లికార్జున భట్టు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు – ఈ నలుగురు కవుల సమిష్టి కృషి. వీరిలో హుళక్కి భాస్కరుడు ఓరుగల్లును పాలించిన కాకతీయ రాజుల ఆస్థానంలో ఉన్న కవి. భాస్కర రామాయణాన్ని అంకితం గొన్నది కాకతీయ సైన్యాధ్యక్షుడు సాహిణిమారన. ఈ విధంగా లభ్యమైన మొదటి మార్గ రామాయణం కవులందరూ తెలంగాణ ప్రాంతానికి చెందినవారే. భాస్కర రామాయణానికి కొద్ది ముందుగా వచ్చిన ద్విపద రంగనాథ రామాయణకర్త గోన బుద్ధారెడ్డి కూడా తెలంగాణ ప్రాంతపువాడే.

ఆంధ్రులు అత్యంత భక్తితో ఆరాధించే మహాగ్రంధం పోతన భాగవతం. పోతన వరంగల్లు జిల్లాలోని ఐమ్మెర గ్రామానికి చెందినవాడు. ఈ కవి ప్రాంతం విషయంలో ఇప్పటికీ కొందరు వివాదాలు లేవనెత్తడం దురదృష్టకరమైన విషయం.

మొట్టమొదటగా తెలుగులో అనువదింపబడ్డ పురాణం మార్కండేయపురాణం. ఈ పురాణాన్ని తెనిగించిన మారన తిక్కన శిష్యుడై కొంతకాలం నెల్లూరులో ఉన్నా తరువాత వరంగల్లులో కొంతకాలం నివసించి రెండవ ప్రతాపరుద్రుని సేనా నాయకుడైన నాగయ్యగన్న నాయకునికి తన గ్రంథం అంకితం చేసినాడని విమర్శకుల అభిప్రాయం. తెలుగులో మొదటి పురాణానువాదం వెలసిన కీర్తి తెలంగాణకే దక్కుతుందని చెప్పవచ్చు.

అచ్చ తెలుగు కావ్యానికి మొట్టమొదటగా పురుడుపోసింది తెలంగాణమే. ఈ కావ్య రచయిత తన యయాతి చరిత్ర కావ్యాన్ని పొట్ల చెరువు (పట చెరువు) పట్టణానికి సర్దారైన అమీర్‌ఖానుకు అంకితం చేసినాడు.

యక్షగాన ప్రక్రియకు మొదటిగా నారుపోసినవాడు, కందుకూరి రుద్రకవి. ఈతని సుగ్రీవ విజయం మిక్కిలి ప్రసిద్ధం.

ఇలా ఆయా ప్రక్రియల్లో మొదటగా సాహిత్య సృష్టి జరుగడమే కాక ఇంకెంతో సారస్వతం తెలంగాణంలో గణనీయంగా వచ్చిందని చెప్పవచ్చు.

ఇటీవల తెలంగాణంలోని సారస్వతాన్ని గురించి ఎంతో కృషి జరుగుతుంది. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఈ విషయంపై ఒక పరిశోధన ప్రణాళిక సాగుతుంది. వివిధ కళాశాలల్లో గోష్ఠులు నిర్వహింపబడుతున్నాయి. అంతేకాక కొందరు పరిశోధకులు స్వయంగా ఈ విషయంపై కృషి చేసి ఎన్నో నూత్నాంశాలను వెలువరిస్తున్నారు. అట్టి పరిశోధకుల్లో డా॥ నారాయణరెడ్డి అగ్రగణ్యులు. ఎన్నో సాహిత్య చరిత్ర గ్రంథాలను, శాసనాలను పరిశోధించి, సుమారు ఐదువందల మంది సంస్కృతాంధ్ర కవుల వివరణలతో సుమారు 800 పేజీల గ్రంధాన్ని రచించి తెలుగు సాహిత్యానికి ఎంతో సేవచేసినాడనటంతలో ఏమాత్రం సందేహం లేదు. వ్యాఖ్యాతృ చక్రవర్తిగా విశ్వవిఖ్యాతి చెందిన మెదక్ జిల్లావాసి మల్లినాథుడు, ప్రతాపరుద్రుని ఆస్థానాన్ని అలంకరించిన విద్యానాథుడు, రాచకొండ ప్రభువు ఆస్థానంలో ఉన్న విశ్వేశ్వరుడు, ఓరుగల్లు నివాసియై సంస్కృతంలో సుమారు 74 కావ్యాలను రచించిన అగస్త్య కవి – ఇలా తెలంగాణంలో విలసిల్లిన సంస్కృత కవుల నెందరినో గుర్తించి ఇందులో వివరించడం విశేషం. ఇందులో ఆయా కవులను యుగవిభజనానుసారంగా వివరించడం వల్ల తెలంగాణంలో వచ్చిన సాహిత్య పరిణామ క్రమం తెలుసుకునే అవకాశం ఉంది. అందువల్ల ఈ గ్రంథం ఒక రకంగా తెలంగాణ సాహిత్య చరిత్ర అవుతున్నది. కవుల వివరణలతో పాటు వారి గ్రంధాల్లోని శ్లోకాలనూ, పద్యాలనూ ఈ గ్రంథలో ఉదాహరించడం వారి కవితా వైశిష్ట్యాన్ని గుర్తించడానికి ఉపకరిస్తుంది. ఐతే కొన్నిచోట్ల ఈ పద్యాలు పరిమితిని దాటినట్లుగా కనిపిస్తుంది.

సంస్కృతాంధ్రాలలో రచింపబడ్డ తెలంగాణ శాసనాల్లో కావ్య సంపద ఎంతో ఉంది. సాహిత్య చరిత్రకారులు కావ్య ఖండాలనదగిన శాసనకర్తలైన కవులను విస్మరించడం జరిగింది. నారాయణరెడ్డి ఈ విషయంలో కూడా ఎంతో కృషి చేసి అజితేంద్రయతి,

మయూర సూరి, ఈశ్వర భట్టోపాధ్యాయుడు మొదలైన సంస్కృత శాసన కవులను, ఇతర తెలుగు శాసన కవులను పేర్కొని వారి శాసనాల్లోని విషయాలను వింగడించడం విశేషం.

కులపురాణాలను, జానపద కథలను పట్టించుకున్న సాహిత్య చరిత్రకారులు అరుదు. జాంబపురాణం, విశ్వకర్మపురాణం, మడేల్ పురాణం, గౌడపురాణం మొదలైన పురాణాలను, నల్లసోమనాద్రి కథ, సదాశివరెడ్డికథ, మొదలైన జానపద కథలను గూర్చి నారాయణరెడ్డి వివరించడం గ్రంథానికి అదనపు మెరుగు.

ఈ గ్రంథం తెలంగాణ సాహిత్య చరిత్రను సమగ్రంగా వివరిస్తుంది. నారాయణరెడ్డి ఎంతో శ్రమకోర్చి, వివిధ గ్రంథాలు, శాసనాలు, మొదలైనవి పరిశోధించి ఈ గ్రంథాన్ని రచించి తెలంగాణా సాహిత్య చరిత్రకే కాక ఆంధ్ర సాహిత్య చరిత్రకు కూడ ఎంతో సేవ చేసినాడు. ఇందుకు మిత్రుడు డా॥ నారాయణరెడ్డిని మనసారా అభినందిస్తున్నాను. పండితులు, జిజ్ఞాసువులు, నారాయణరెడ్డి ఈ ప్రయత్నాన్ని సహృదయంతో ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

తెలుగుకూ, తెలుగు కవులకూ ఇక్కయైన తెలంగాణను ప్రశంసిస్తూ శ్రీ మందడి వేంకటకృష్ణకవి గారు చెప్పిన ఈ క్రింద పద్యంతో నా 'అభినందన'ను ముగిస్తాను.

కవితాలతాంగి సత్కరాళి మొదయడే
ప్రతి వత్సరమున గద్వాల సభల
ఆంధ్రభారతి మహదానంద మొందదే
ప్రతి వత్సరము వనపర్తి సభల
పండితమండల ప్రాభవం చెనగదే
ప్రతి వత్సరమున గోపాలు పేట
ఆంధ్ర సాహిత్య విద్యావినోదము లేదె
యాత్మకూర్పురిని ప్రత్యబ్దమందు
నిట్టియాస్థాన చయముల కింపు బెంపు
తేజమొసగిన నైజాము దేశమందు
తెలుగునకు నిక్కమైన యీ దేశమందు
కవివరేణ్యులు పండితుల్ గలరు కలరు.

(గోలకొండ కవుల సంచిక. పుట 309)

ముంగిటి ద్వారం

– దా॥ ముదిగంటి సుజాతారెడ్డి

దా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి ప్రాచీన కాలం నుంచి క్రీ.శ. 19వ శతాబ్దాంతం వరకున్న తెలంగాణ కవులను సాహిత్యాన్ని గురించి ఈ "ముంగిలి" బృహత్గ్రంథంలో చెప్పాడు. ప్రాచీన కవుల కవిత్వాన్ని ఈ విధంగా మచ్చుతునకలుగా పరిచయం చేస్తూ సంకలనాలను కూర్చటం తెలుగులో ప్రాచీనకాలం నుంచి వస్తున్న సంప్రదాయమే. అయితే "ముంగిలి" సాహిత్య గ్రంథం ప్రయోజనం విశిష్టమైంది. అపూర్వమైంది. కేవలం తెలంగాణలో ఆవిర్భవించిన సాహిత్యాన్నేకాక కవి జీవితాలను ఈ గ్రంథం పరిచయం చేస్తున్నది. దాంతో "ముంగిలి" కేవలం కవితా సంకలన గ్రంథంగా కాక తెలంగాణా ప్రాచీన సాహిత్య చరిత్రగా రూపొందింది. ఆ విధంగా ఇంతకాలం తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను చెప్పే గ్రంథం లేదనే లోటును తీరుస్తున్నది. ఈ దిశగా "ముంగిలి" ఒక చారిత్రక బాధ్యతను నిర్వహిస్తున్నది.

"ముంగిలి"ని దా. నారాయణరెడ్డి చారిత్రక పూర్వయుగం నుంచి తెలంగాణ ఉనికిని పరిచయం చేస్తూ ఆ క్రమంలో "తెలంగాణ" పదం ఆవిర్భావం, ప్రాచీనతలను చర్చించాడు. చిత్తడి భూములతో నిండిన కోస్తా ప్రాంతం కన్నా ముందు దక్కన్ పీఠభూమిలో భాగమైన తెలంగాణ మానవ నివాసాలకు అనువైంది. ఇక్కడే క్రమంగా మానవ నాగరికత వికసించి రాజ్యాలు ఏర్పరచుకునే దశ వరకు ఎదిగింది. అశ్మక, ములక, ముషక అనేక గణరాజ్యాలు బౌద్ధమత వ్యాప్తికి పూర్వకమే ఇక్కడ ఏర్పడ్డాయి. చారిత్రక యుగానికి వస్తే తెలంగాణ భూమిని పాలించిన వాళ్ళు శాతవాహనులు. ఆంధ్రభృత్యులుగా పురాణాలచేత వర్ణింపబడిన శాతవాహనులు క్రీ.పూ. 240 నుంచి పరిపాలిస్తున్నా క్రీ.పూ. 150లో వాళ్ళు ఆంధ్రుల సామంతత్వం నుంచి విడిపోయి స్వతంత్రులైనట్లుగా చరిత్ర చెప్తున్నది.

అయితే శాతవాహనుల ఆరంభం స్వతంత్రరాజ్యస్థాపనను గురించి వాళ్కెక్కడి వాళ్ళు ఏ జాతికి ప్రాంతానికి చెందిన వాళ్ళు అనే విషయంలో ఎన్నో అభిప్రాయ భేదాలు చారిత్రకుల్లో వున్నాయి. కాని తెలంగాణలో కరీంనగరం జిల్లా ధర్మపురికి దగ్గరగా గోదావరి నదీ తీరాన వున్న కోటిలింగాలలో తవ్వకాలు జరిగింతర్వాత శాతవాహనుల ఆరంభపాలన తెలంగాణలో కోటిలింగాలలో జరిగిందని స్పష్టమైంది. శాతవాహనులకు పూర్వం కోటిలింగాలను గోబద, నరన,. సమగోప మొదలైన పాలకులు పాలించినట్లుగా వాళ్ళే ఆంధ్రులయి వుంటారని తవ్వకాల లోపలి పొరలలో దొరికిన నాణాల ఆధారంగా చెప్పటం సాధ్యమౌతున్నదని దా. రాజారెడ్డితో సుంకిరెడ్డి ఏకీభవిస్తూ "ముంగిలి"లో శాతవాహనుల పాలనారంభం తెలంగాణలో జరిగిందని చెప్పాడు. కోటిలింగాలలో దొరికిన "గోబద" పేరు "తొలి బ్రాహ్మీలిపి"లో వ్రాయబడిన నాణెం ఆంధ్రదేశంలో వేయబడిన మొదటి నాణెం అని చెప్పాలి. ఇప్పటి తెలుగు లిపి రూపం కాకతీయుల కాలంలో ఏర్పడింది. తర్వాత రెడ్డి రాజుల విజయనగర రాజుల శాసనాల్లో స్థిరపడింది. కోటిలింగాలలో దొరికిన గోబదుని నాణెం మీదున్న "గోబద" అన్న పేరు మొదటి తెలుగుపదం –

తెలుగుపేరు. ఆ నాణెం మీదున్న బ్రాహ్మీలిపి తెలుగు లిపికి తొలిరూపం అంటారు డా. నారాయణరెడ్డి. "గోబద" పేరు "గోపథ" అనే సంస్కృత నామానికి వికృతరూపం కావచ్చును. "నరన" అన్నది "నారాయణ"కు వికృతరూపం. తెలంగాణలో నారన, నారయ అనే పేర్లు ఇప్పటికీ కన్పిస్తాయి.

భారతదేశంలోని తమిళం, మళయాలం మొదలుకొని దేశభాషల లిపులన్నీ అశోకుని శాసనాల్లో కన్పించిన బ్రాహ్మీలిపి నుంచి క్రమపరినామం చెంది ఏర్పడినవే అని అందరికి తెలుసును. తెలుగు లిపి కూడా బ్రాహ్మీలిపి నుంచి ఏర్పడిందే. అయితే తెలుగు అక్షరాలకు మూలమైన మౌర్యుల తొలినాళ్ళ బ్రాహ్మీలిపి కోటిలింగాలలో లభించిన నాణాలపైన కన్పిస్తున్నదని, తెలుగు నామాల పేర్లు ఈ నాణాల మీదనే మొట్టమొదటిసారిగా లభించాయని ఆ విధంగా ఈ నాణాలు తెలుగుభాష, తెలుగులిపి యొక్క ఉనికిని క్రీ.పూ. మూడో శతాబ్దానికి తరలించాయని డా. నారాయణరెడ్డి అంటాడు. ఇవన్నీ తెల్గుభాష చరిత్రకు ఒక నూతనారంభాన్ని చెప్తున్నాయి. కోటిలింగాలలో జరిగిన తవ్వకాల రిపోర్టు ఆంధ్రప్రదేశ్ ఆర్కియాలజీ శాఖవారి దగ్గర వున్నది. కోటిలింగాల మట్టి కింది పొరల్లో లభించిన నాణాలను సేకరించి విశేషమైన కృషి చేసి తెలంగాణ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించిన వారు డా॥ రాజారెడ్డి. ఆయన వృత్తిచేత న్యూరోసర్జన్ అయినా చరిత్ర అంటే అభిమానం గల పరిశోధకుడు. అయితే ఈ సమాచారాన్నంతా అఖిల భారత చరిత్ర సభల్లో ప్రతిపాదించి జాతీయ స్థాయిలో అందరికీ తెలియజేయవలసిన అవసరమెంతైనా ఉంది.

శాతవాహనులు మొదట ఆంధ్రులకు భృత్యులుగా పాలించారు. ఆ ఆంధ్రులు ఆంధ్రనగరం కోటిలింగాలను రాజధానిగా పాలించిన దోబదుని వంశీయులే అని రాజారెడ్డి తదితర చారిత్రకుల అభిప్రాయం. కోటిలింగాలలో శాతవాహనరాజుల్లో స్వాతంత్ర్యం ప్రకటించిన ఛిముకుని నాణెం కూడా దొరికింది. మరెక్కడా అతని నాణెం లభ్యం కాలేదు. కోటిలింగాల శాతవాహనులకు పూర్వం ఆంధ్రులకు రాజధాని తర్వాత శాతవాహన స్వతంత్రరాజ్యం కూడా ఇక్కడే ఆరంభమైందని ఆ నాణెం ఆధారంగా తవ్వకాల రిపోర్టులో రికార్డు చేయబడింది. స్వతంత్రుడైన ఛిముకుడు ఆంధ్రులవలెనే తానూ నాణాలు వేయించి వుంటాడు. కోటిలింగాల రాజధానిగా శాతవాహన రాజ్యం ఆరంభమై క్రమంగా పశ్చిమ దిశగా దక్షిణదిశగా వ్యాపించింది. తెలంగాణలో ఆరంభమైన శాతవాహనులు ప్రాకృతభాషను ఆదరించారు. కావ్యం హాలుని గాథాసప్తశతి గుణాఢ్యుని బృహత్కథ వంటి ప్రాకృత కావ్యాలెన్నో తెలంగాణలో రచింపబడినాయని నారాయణరెడ్డి గుర్తించి ఈ తెలంగాణ ప్రాచీన సాహిత్య పరిచయాన్ని ఆ సాహిత్యంతోనే ఆరంభించాడు. శాతవాహనుల కాలంలో కుతూహలుడు, కుమారిలుడు, శ్రీపాలితుడు, వాత్స్యాయనుడు, నాగార్జునుని వంటి కవులు బౌద్ధదార్శనికులు ఉన్నారు. గాథాసప్తశతిలో ప్రాకృత గాథలు వ్రాసిన ఎందరో కవుల కవయిత్రుల పేర్లున్నాయి. శాతవాహనుల కాలం ప్రాకృత సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా చెప్పబడ్తున్నది.

శాతవాహనుల తర్వాత తెలంగాణను ఇక్ష్వాకులు, విష్ణు కుండినులు పాలించారు.

హైదరాబాదు నగరంలోని చైతన్యపురిలో మూసీనది కుడిగట్టున విష్ణుకుండినరాజు గోవిందుని (క్రీ.శ.370-400) ప్రాకృత శాసనం దొరికింది. ఇదే తెలంగాణలో దొరికిన మొట్టమొదటి శిలాశాసనం. నల్లగొండ జిల్లాలో రామన్నపేట తాలూక తుమ్మలగూడెం సమీపంలో వున్న నాగారం గ్రామంలో విష్ణుకుండినరాజు గోవిందవర్మ (క్రీ.శ.435) వేయించిన తామ్ర శాసనం సంస్కృతంలో వున్నది దొరికింది. దీనిలో 'పేఱ్ఱపఱు' అన్న గ్రామ నామం తెలుగులో వుంది. ఈ గ్రామాన్ని బౌద్ధవిహారానికి దానం చేస్తూ ఈ శాసనం చేయబడింది. విష్ణుకుండినుల కాలంలో జనాశ్రయుడు సంస్కృతంలో రచించిన 'జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి'లో 'శీర్షిక' పద్యంపేరుతో సీసపద్యం లక్షణం ఇయ్యబడింది. సీసం చివరి గీతపద్యం వుండాలనే లక్షణం కూడా చెప్పబడింది. సీసం అచ్చమైన తెలుగు ఛందము. దీనిలో ద్విపద త్రిపదల లక్షణాలు కూడా చెప్పబడినాయి. దీన్నిబట్టి విష్ణుకుండినుల కాలంలో తెలుగులో పద్యరచన వున్నట్లుగా తెలుస్తున్నది.

భవభూతి (క్రీ.శ.7,8 శతాబ్దం) ఆంధ్రుడనటం అందరూ అంగీకరించిందే. భవభూతి ఒకచో (ఒకానొక ఉత్తర రామచరిత్ర ప్రతిలో) వైదర్భదేశం వాడనని పద్మపురనివాసినని చెప్పుకున్నాడు. ప్రాచీన విదర్భదేశంలో తెలంగాణలోని మెదక్‌జిల్లాలోగల ఈనాటి కొండాపురం (కుండినపురం) ప్రాంతం కూడా ఉంది. కాబట్టి భవభూతి తెలంగాణలోని ఆ విదర్భ ప్రాంతంలో పుట్టి వుంటాడు. వేదశాస్త్రపండితుల కుటుంబంలో భవభూతి జన్మించాడు. జైన మతానికే కాక వైదిక పండితులకు నిలయం కరీంనగరం జిల్లాలోని ధర్మపురి. భవభూతి పుట్టింది ఆ గ్రామం అయినా కావచ్చును. మొత్తంమీద భవభూతి తెలంగాణలోని విదర్భప్రాంతం వాడు. నాటకాలను రచించి కాళిదాసు తర్వాత గొప్పకవి అని ప్రసిద్ధి చెందాడు. తను రచించిన మూడు నాటకాలను భవభూతి నటుల సముదాయాలతో తిరుగుతూ పోయి "కాల్పి" అనే క్షేత్రంలో ప్రదర్శించాడు. అక్కడ్నుంచే కన్యాకుబ్జం రాజు యశోవర్మ ఆస్థానంలో గౌరవాదరణలు పొందాడు. అటువంటి భవభూతి కవిత్వాన్ని నారాయణరెడ్డి ఈ సంకలనంలో చేర్చటం బాగుంది.

వేములవాడ చాళుక్యులు గుజరాతులోని లాట దేశాన్నేలిన చాళుక్యవంశానికి చెందిన వాళ్ళు. అక్కడినుంచి వచ్చి మొదట బోధన్ (పోతన) రాజధానిగా తర్వాత వేములవాడ రాజధానిగా తెలంగాణను క్రీ.శ. 750-973 మధ్యకాలంలో పాలించారు. లాట చాళుక్యులతో పాటు ఎంతోమంది గూర్జర సైనికులు జనులు వచ్చి ఉంటారు. రెడ్లలో మొటాటి, గుడాటి అనే భేదాలు మహారాష్ట్ర (మరారా), గుజరాతు (గూర్జర=గుడాటి) అని వాళ్ళు వచ్చిన ప్రాంత భేదాన్ని బట్టి వచ్చి వుంటాయి.

తెలంగాణలో వేములవాడ చాళుక్యుల పాలనలో కళ సాహిత్య పోషణలు జరిగాయి. పంటలు వ్యాపారం అభివృద్ధి చెంది తెలంగాణ సుభిక్షంగా వుంది. వేములవాడ చాళుక్యులు తమ ప్రత్యేక శైలిలో వేములవాడలో, కొలనుపాకలో శైవాలయాలను నిర్మించారు. జైనమతాన్ని అభిమానించారు. గుజరాతు నుంచి వచ్చిన సంస్కృత పండితుడు కవి సోమదేవసూరి రెండో అరికేసరి (క్రీ.శ.910-930) కాలంలో చాళుక్యుల ఆస్థానంలో చేరి మూడు తరాల రాజులకు మత గురువుగా విద్యా గురువుగా వున్నాడు. ఈ జైన

పండితకవి సంస్కృతంలో యశస్తిలక చంపువును, నీతికావ్యాన్ని వేములవాడలో వుంటూనే రచించాడు. రెండో అరికేసరి ఆస్థానంలోనే దండనాథుడుగా వున్న పంపకవి కన్నడంలో మొట్టమొదటి కావ్యం విక్రమార్జున విజయం, ఆదిపురాణం రచించాడు. తెలంగాణలో వున్న కవి కన్నడ సాహిత్యంలో ఆదివాకావ్యాన్ని వ్రాయటం చాల విచిత్రమైన సంయోగమే. మరుగున పడిన ఎన్నో తెలుగు కావ్యాలను గురించి ప్రబంధ రత్నావళి వల్ల తెలుస్తుంది. దీనిలో పద్మకవి జినేంద్ర పురాణంలోని సీసపద్యం వుంది. వేటూరి ప్రభాకరశాస్త్రి సేకరించి ప్రచురించిన ఈ 'ప్రబంధ రత్నావళి' సంకలన గ్రంధానికి పీఠిక వ్రాస్తూ నిడదవోలు వేంకటరావు కన్నడంలో ఆదికవి పంపడే తెలుగులో పద్యకవి అని అంగీకరించాడు. పంపని సోదరుడు జినవల్లభుడు తెలుగులో రచించిన మూడు కందపద్యాలు కరీంనగరం జిల్లా కురిక్యాల గ్రామంలో లభించిన శాసనంలో (క్రీ.శ.940) వున్నాయి. తెలుగులో కందం రాయందే కవి కాడని నానుడి. అచ్చమైన తెలుగు దేశి ఛందస్సు కందం. అటువంటి కందంలో వ్రాయబడిన పద్యాలు మొట్టమొదట ఈ జినవల్లభుని కురిక్యాల శాసనంలోనే కన్పిస్తున్నాయి. దీన్నిబట్టి పంపడు తెలుగు తెలిసినవాడేనని తెలుగు కావ్య రచనా సమర్థుడని చెప్పవచ్చును. 'ప్రబంధ రత్నావళి'లో పేర్కొనబడిన 'జినేంద్ర పురాణం' పంపకవి రచనే అని అది రెండో అరికేసరి ఆస్థానంలో క్రీ.శ.10వ శతాబ్దం ఉత్తరార్ధంలో రచింపబడిందని చెప్పవచ్చును.

మడికి సింగన (క్రీ.శ.1420) ప్రాంతంవాడు) నీతి, రాజనీతి సంబంధమైన 17 రచనల నుండి పద్యాలను ఏరుకొని 'సకల నీతి సమ్మతము' అనే సంకలన గ్రంధాన్ని కూర్చాడు. ఇదే తెలుగులో మొదటి సంకలన గ్రంధం. మండికి సింగన తాత అల్లాడ మంత్రి తిక్కన సోమయాజి మనుమరాలు కట్టాంబికను వివాహమాడాడు. కాని మడికి సింగన సబ్బినాడు (కరీంనగరం జిల్లా ప్రాంతం) ను పాలించిన వెలిగండల కందనామాత్యునికి తన రెండు కావ్యాలను అంకితమిచ్చి తెలంగాణలో స్థిరపడిన కవి అయ్యాడు. సింగన 'సకల నీతి సమ్మతము'లోనే మనకు బద్దెన రచించిన 'నీతి శాస్త్ర ముక్తావళి' నుంచి కొన్ని రాజనీతి పద్యాలు లభిస్తున్నాయి. ఈ బద్దెన రెండో అరికేసరి కొడుకు రెండో బద్దెన (క్రీ.శ.960-66) కావచ్చును. 'రాజ్యాస్థిరతలో వున్న మూడో బద్దెన కన్నా రెండో బద్దెన నీతి శాస్త్ర ముక్తావళి రచయిత అని చెప్పడం సమంజసంగా వుంటుందని నేను నా "చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర" (పుట 28)లో వ్రాసాను. రెండో బద్దెనకు సోమదేవసూరి విద్యాగురువు. తన గురువు సోమదేవసూరి సంస్కృతంలో రచించిన నీతి కావ్యాన్నే తెలుగులోకి "నీతి శాస్త్రముక్తావళి"గా సంగ్రహంగా ('ముక్తావళి' అని వున్నది కాబట్టి) ఆంధ్రీకరించి వుంటాడు. రెండో బద్దెన తండ్రి రెండో అరికేసరి కాలంలోనే తెలుగులో సుందరమైన కందపద్యాల రచన (కురిక్యాల శాసనం) జరిగింది. కాబట్టి రెండో బద్దెన కందాన్ని ఎన్నుకొని 'సుమతీ శతకా'న్ని రచించి వుంటాడు. వేములవాడ భీమకవి వేములవాడ నివాసి. రెండో అరికేసరి కాలంలో వుండి వుంటాడు. మల్లియ రేచనను సంబోధిస్తూ భీమన 'కవిజనాశ్రయము' అనే ఛందోగ్రధాన్ని తెలుగు ఛందాలను తెలుగులో వివరిస్తూ ఈ లక్షణ గ్రంధాన్ని రచించి

వుంటాడు. మల్లియరేచనకు కవిజనాశ్రయుడనే బిరుదముంది. "దానచింతామణి" అని ప్రసిద్ధి చెందిన అత్తిమబ్బె దానశీలిగా ఆ కాలంలో ప్రసిద్ధి చెందింది. కన్నడంలో పంప తర్వాత రత్నత్రయంలో రెండోవాడైన పొన్న అత్తిమబ్బె ఆదరణ పొందాడు. రత్నత్రయంలో మూడో కవి రన్న ఆమె ప్రేరణతోనే కావ్యరచనకు పూనుకున్నాడు. మల్లియ రేచన అత్తిమబ్బె సోదరుడు. వాళ్ల తండ్రి పేరు మల్లియ (మల్లయ). జైనుడు. వైశ్యుడు. అతని ఆదరణలోనే భీమన అతన్ని సంబోధిస్తూ కవిజనాశ్రయమనే చందోగ్రంథాన్ని రచించాడని చెప్పాలి. ఇక్కడ డా.నారాయణరెడ్డి అభిప్రాయం భిన్నంగా వుంది. ఆయన కవిజనాశ్రయాన్ని మల్లియ రేచన రచనగా భావించి పరిచయం చేసాడు. ఆ విధంగా నన్నయకు పూర్వము తెలుగులో సాహిత్యమున్నదని మొదటిసారిగా నిరూపించినది 'ప్రబంధరత్నావళి' అని నిడదవోలు వేంకటరావు ప్రబంధ రత్నావళి పీఠికలో అన్నాడు. రెండో అరికేసరి కాలం కన్నడంలోనే కాదు తెలుగు సాహిత్య రచనలోను ప్రాధాన్యం కలిగి వుంది. తెలుగులో కావ్యాలు శాస్త్రాలు శతక ఛందోగ్రంథాలు రచింపబడినాయి. వేములవాడ చాళుక్యుల కాలం ముఖ్యంగా రెండో అరికేసరి పరిపాలనా కాలం తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగం అనదగినది. తెలంగాణ లోనే తెలుగులో సాహిత్యరచన ఆరంభం జరిగిందన్న సూచన ఈ ముంగిలిలో ఉంది.

వేములవాడ చాళుక్యులకు సమకాలికంగా మహబూబాబాదు ప్రాంతాన్ని ముదిగొండ చాళుక్యులు పాలించారు. ముదిగొండ చాళుక్యరాజు నిరవద్యుడు వేయించిన కొరవి శాసనం (క్రీ.శ.893) చారిత్రకంగానే కాక తెలుగుసాహిత్య వికాసం దృష్టితోనూ చాలా ప్రాముఖ్యం కలది. ఈ శాసనాన్ని బట్టి క్రీ.శ.893 నాటికే చక్కని కథనశైలిగల తెలుగు వచనం వికసించిందని తెలుస్తున్నది. ప్రసన్నమైన సంస్కృత దేశ్యపదాల కూర్పుతో కూడిందీ శాసనంలోని వచన రచన. మృదుమధురమైన కథాకథన రీతి ఈ వచనంలో కన్పిస్తున్నది. నన్నయకు వంద సంవత్సరాలకు పూర్వమే సంభాషణలతో కూడిన అందమైన కథాకథన శైలి వికసించిందని ఈ శాసనం వల్ల తెలుస్తున్నది. ఈ శాసనంలోని కొంతభాగాన్ని డా. నారాయణరెడ్డి ఈ గ్రంథంలో చేర్చటం సముచితంగా వుంది. ఈ శాసనంలో వేములవాడ చాళుక్యరాజు రెండో అరికేసరి తండ్రి మొదటి బద్దెన (క్రీ.శ.870-895) తూర్పు చాళుక్య భీముని బంధించిన వీరునిగా వర్ణింపబడినాడు. పంపకవి ఈరాజును చాళుక్య భీమన్నపతి గర్వం దింపినవాడు అని తన విక్రమార్జున విజయం కావ్యపీఠికలో వర్ణించాడు. గుజరాతు చాళుక్యశాఖకు చెందిన వేములవాడ చాళుక్యులకు బాదామి చాళుక్యశాఖకు చెందిన తూర్పు చాళుక్యులకు ఎప్పుడూ వైరం నడుస్తూనే ఉండేది. వేములవాడ చాళుక్యులు రాష్ట్రకూటుల పక్షం వహించేవాళ్ళు. తూర్పు చాళుక్యుల శాఖ అయిన ముదిగొండ చాళుక్యులు రాష్ట్రకూటుల దాడులను అడ్డుకుంటూ తూర్పు చాళుక్యుల పక్షంలో వుండేవాళ్ళు. మొదటి బద్దెనను ఎదిరించి నిరవద్యుడు చాళుక్యభీముని బంధవిముక్తిని చేసిన ఉదంతమే కొరవి శాసనంలో వుంది.

కొరవి శాసనం క్రీ.శ.893 నాటికే తెలంగాణలో చక్కని తెలుగువచనం వికసించిందని చెప్తుండగా క్రీ.శ.1000 నాటిదైన విరియాల కామసాని వేయించిన కామసాని

శాసనంలో చక్కని అలంకారశైలిలో రచింపబడిన చంపకమాల ఉత్పలమాల పద్యాలున్నాయి. ఈ శాసనం కాకతీయ వంశపు తొలి రాజుల కాలంలో వేయబడింది. దీనిని బట్టి నన్నయకు పూర్వ కవులున్నారని చక్కని పద్య, వచన రచనలు జరిగాయని తెలుస్తున్నది. ఈ శాసనాలు తెలంగాణలో దొరికాయి కాబట్టి నన్నయకు పూర్వం తెలంగాణలో తెలుగు సాహిత్య రచన జరిగిందని ఆది వేములవాడ చాళుక్యుల ఆదరణలో స్పర్ధయుగంగా వుండిందని చెప్పవచ్చును. అందుకు తగిన ఆధారాలు ఈ గ్రంథంలో ఉన్నవి.

వేములవాడ చాళుక్యుల తరువాత తెలంగాణను కాకతీయులు పాలించారు. వాళ్ళు క్రమక్రమంగా విజయాలు సాధించి తెలంగాణనే కాక మొత్తం ఆంధ్రదేశాన్ని మొదటిసారిగా ఏకఛత్రాధిపత్యంలోకి తెచ్చిన చక్రవర్తులయ్యారు. కాకతీయుల కాలంలో తెలంగాణలో ముఖ్యంగా రాజధాని నగరం ఓరుగల్లు కేంద్రంగా సంస్కృతాంధ్ర సాహిత్యాలు వికసించాయి. ఈ కాలంలో సంస్కృతంలో స్వతంత్ర రచనలే కాక వ్యాఖ్యానాలు రచింపబడినాయి. ఉత్తరభారతంలో సంస్కృతానికి ఆదరణ పోషణలు క్షీణించిన కాలంలో కాకతీయులు సంస్కృతభాషను కవులను ఆదరించారు. అగస్త్యుడు, నరసింముడు, శాకల్యమల్లన, విశ్వనాథ, రుద్రదేవుడు, రెండో ప్రతాపరుద్రుడు, విద్యానాథుడు, త్రిపురాంతకుడు, గంగాదేవి వంటి కవులు కాకతీయుల కాలంలో వున్నారు. జాయప సేనాని కాకతీయుల ఆస్థానంలో సేనాని. ఆయన 'నృత్తరత్నావళి' అనే నృత్యశాస్త్రాన్ని రచించాడు. శివదేవయ్య, విశ్వేశ్వర దేశికుడు శివభక్తితో రచనలు వ్యాఖ్యానాలు రచించారు. కాకతీయుల కాలంలో తెలుగులో ఎంతో సాహిత్యసృష్టి జరిగింది. మారన, గోనబుద్ధారెడ్డి, భాస్కరుడు, పాల్కురికి సోమన, రంగనాథుడు, పోతన, మొల్ల వంటి కవులెందరో కావ్యాలను పురాణాలను రచించారు. పాల్కురికి సోమన, మొల్ల రెండో ప్రతాపరుద్రుని కాలంలో వున్నారు. ఏకామ్రనాథుడు (క్రీ.శ.16వ శ.) తన ప్రతాపరుద్ర చరిత్రలో మొల్ల రెండో ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్నట్లుగా చెప్పాడు. పోతన మొల్లలు ఇద్దరూ ఆరాధ్య శైవం నేపథ్యంలోంచి వచ్చినవాళ్ళే. ఇద్దరూ ఓరుగల్లులో ఉండి రచనలు చేశారు. వీరశైవం తెలంగాణలోనే ఎక్కువగా వ్యాప్తిలో వుంది. నిమ్నవర్గంలో జన్మించిన మొల్ల తన తండ్రి 'జంగమ లింగార్చనపరు"డని చెప్పటం చేత వీరశైవుడని తెలుస్తున్నది. వీరశైవ కుటుంబంలో పుట్టింది కాబట్టే మొల్ల నిమ్నవర్గంలో స్త్రీగా పుట్టినా విద్యాగంధం కలదయింది. కాకతీయుల పతనావస్థ కాలంలో క్రీ.శ.14వ శతాబ్దారంభంలోనే రామభక్తి సంప్రదాయం తమిళదేశంలో పుట్టి క్రమంగా ఉత్తర భారతం వరకు వ్యాపించింది. మొల్ల పోతనలు రామభక్తులై రామాయణాన్ని భాగవతాన్ని రాముని కంకితంగా రచించారు. ఇద్దరూ తమ చేత పలికించేవాడు రామచంద్రుడే అని చెప్పుకున్నారు. రాజాశ్రయాన్ని నిరసించి తమ రచనలను రామునికంకితం చేసారు. మొల్ల తెలంగాణ కవియిత్రి. తెలుగులో మొట్టమొదట కవయిత్రి అనటంతో డా॥ నారాయణరెడ్డి విభేదిస్తున్నాడు. అందుకే ఈ గ్రంథంలో మొల్ల ప్రసక్తి లేదు. తెలుగులో మొట్టమొదటి రామాయణం గోనబుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణం. ఇది ద్విపదలో వ్రాయబడింది. తరువాత భాస్కరుని రామాయణం, మొల్ల రామాయణం చంపులో వ్రాయబడిన కావ్యాలు. అట్లా తెలుగులో మొదటి మూడు రామాయణాలు తెలంగానాలో రచింపబడినాయి. మారన మార్కండేయ పురాణం తొలి పురాణ అనువాదం. మారన

కవిత్వాన్ని పెద్దనాది ప్రబంధ కవులు అనుకరించారు. కాకతీయ గణపతిదేవున్ని తిక్కన తన ప్రభువు మనుమసిద్ధిని సింహాసనస్థుని చేయటానికి సహాయం అర్థించటానికని ఓరుగల్లుకు వచ్చి సందర్శించాడు. తిక్కన రాయబారం ఓరుగల్లు సందర్శనం చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. తెలంగాణలోనే వీరశైవ కవుల సాహిత్యం సృష్టింపబడింది. ఎందుకంటె వీరశైవం ఇక్కడే బలంగా వ్యాపించింది. శివకవుల్లో అగ్రేసరుడు వేదాల్లోని అధ్యాయాలు కొన్నింటికి వ్యాఖ్యానాలు రచించి వీరశైవాన్ని జైనం వలె నాస్తిక మతం కాకుండా ఉద్ధరించినవాడు పాల్కురికి సోమనాథుడు. శివకవులు "జాను తెనుగు" అచ్చమైన, సంస్కృతం మిళితంకాని భాష, జనుల భాషలో కావ్యరచన చేస్తామని ప్రతిజ్ఞ పూని తెలుగు భాషోద్ధరణను చేసి జాత్యభిమానాన్ని చాటారు. తెలుగుకు గౌరవం తెచ్చిపెట్టారు. శివకవుల ప్రభావంతోనే తిక్కన 'జాత్య'మైన తెలుగులో అచ్చమైన తెలుగునుడికారం సొంపుగల భాషలో రచించాడు. కాకతీయ రాజులకు కవులు కావ్యాలను అంకితంగా ఇయ్యకున్నా సంస్కృతంతోపాటు తెలుగులో ఎందరో కవులు ఎన్నో కావ్యాలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. కాకతీయ యుగం తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ సాహిత్యంలో మరో స్వర్ణయుగం. దీన్ని నిరూపించే సాహిత్య సంపదను డా॥ నారాయణరెడ్డి ఈ గ్రంథంలో ప్రదర్శించినాడు.

కాకతీయుల పతనానంతరం విజయనగర స్థాపన జరిగింది. ఆ తరుణంలో గంగాదేవి వంటి కవయిత్రులు ఓరుగల్లు నుంచి విజయనగరం తరలివెళ్ళారు. అదే విధంగా విద్యారణ్యులు సాయణాచార్యుల వంటి గురువులు పండితులు తెలంగాణలో జన్మించినవాళ్లే అని విజయనగర స్థాపనకు కారకులయ్యారని డా॥ నారాయణరెడ్డి అభిప్రాయం. కాకతీయుల దగ్గర సైనికాధికారులుగా వున్న హరిహర బుక్కరాయలనే సోదరులను విజయనగర స్థాపనకు పురిగొల్పారు. ప్రేరణగా నిల్చారు. సాయణాచార్యుడు నాలుగు వేదాలకు వ్యాఖ్యానాలు రచించాడు. విద్యారణ్యుడు అద్వైతదర్శనంలో రెండో శంకరాచార్యులుగా ప్రసిద్ధి చెందాడు. దాదాపుగా ఇదే కాలంలో క్రీ.శ.14వ శతాబ్దంలో మెదక్‌జిల్లా కొలిచలిమ (కొల్చారం)లో జన్మించిన కోలాచరం మల్లినాథుడు సంస్కృత పంచమహాకావ్యాలకు మేఘసందేశానికి వ్యాఖ్యానాలు రచించి ప్రపంచ ప్రసిద్ధుడైనాడు. మల్లినాథుని కొడుకు కుమారస్వామి "ప్రతాపరుద్రీయం"కు వ్యాఖ్యానం వ్రాసాడు. మల్లినాథుడు జైన కుటుంబంలో జన్మించాడని సంస్కృత శాస్త్ర కావ్యనాటకాదులను అధ్యయనం చేసినవాడని అంటారు. ఆ విధంగా వేదాలు మొదలుకొని పంచమహాకావ్యాల వరకు తెలంగాణలో వ్యాఖ్యానాలు రచింపబడినాయి. క్రీ.శ.17వ శతాబ్దంలో మహబూబునగరం జిల్లా మామిళ్ళపల్లిలో జన్మించిన అన్నంభట్టు 'తర్కసంగ్రహం' అనే న్యాయవైశేషిక దర్శనాలను సమన్వయం చేస్తూ అతి ప్రసిద్ధమైన గ్రంథాన్ని రచించాడు. దీనికి 30 టీకలున్నాయి. ఎన్నో దేశవిదేశ భాషల్లోకి అనువదింపబడింది. ప్రసిద్ధమైన ప్రౌఢమైన తెలుగు ప్రబంధం రామరాజభూషణుని వసుచరిత్రకు వేములవాడ నివాసి సోమనాథుడు (క్రీ.శ.1650) విద్వన్మనోరంజని అనే వ్యాఖ్యానాన్ని రచించాడు. ఇది చాల గొప్పవ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యానం లేందే ఇప్పటి పాఠకులు వసుచరిత్ర పద్యాలను అర్థం చేసుకోలేరు.

కాకతీయుల పతనానంతరం తెలంగాణ రేచర్ల వెలమరాజుల పాలనలోకి వచ్చింది. ఆ కాలంలో సంస్కృతాంధ్ర కవులెందరో వున్నారు. సర్వజ్ఞ సింగభూపాలుడు, విశ్వేశ్వరుడు సంస్కృతంలో నాటకాలు అలంకార శాస్త్ర గ్రంధాలు రచించారు. విశ్వేశ్వరుడు (క్రీ.శ. 14 శ।) "చమత్కార చంద్రిక" అనే అలంకార శాస్త్ర గ్రంధం రచించి "చమత్కారమే కావ్యాత్మ"నే నూతన సిద్ధాంతాన్ని స్థాపించాడు. శ్రీనాథ కవిసార్వభౌముడు సర్వజ్ఞ సింగభూపాలుని దర్శించి పాండిత్యంతో మెప్పించి సన్మానమందుకున్నాడు. ఈ కాలంలో(క్రీ.శ. 14,15 శతాబ్దాల్లో) కొరవి గోపరాజు, పిల్లలమర్రి పనవీరన, హరిభట్టు, ఏర్చూరి సింగన, వెలిగందల నారయ, వంటి కవులెందరో వున్నారు. చివరి ఇద్దరు కవులు పోతన భాగవతానువాదంలో పాలుపంచుకున్న కవులు. వీళ్ళందరిగురించీ మనం ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు.

క్రీ.శ.1500 ప్రాంతంలో బహమనీరాజ్యం విచ్ఛిన్నమై ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలేర్పడినాయి. వాటిల్లో గోలకొండ రాజధానిగా పాలించిన కుతుబ్‌షాహి రాజ్యం ఒకటి. రేచెర్ల వెలమరాజులకు సమకాలికంగా తెలంగాణలో కొంతభూమిని గోలకొండ రాజ్యంగా పాలించి క్రమంగా తెలంగాణాన్ని అంతా తమ పాలనలోకి తెచ్చిన రాజులు కుతుబ్‌షాహీలు (క్రీ.శ.149661687). ఈ రాజుల కాలంలో పారశీ ఉర్దూ సాహిత్యంతో పాటు తెలుగు సాహిత్యం పోషింపబడింది. తెలుగులో ఎందరో కవులున్నారు. ఎన్నో కావ్యాలు రచించారు. కావ్యరచనల్లో కొత్త పోకడలు చూపారు. కుతుబ్‌షాహిల పాలనలో చరిగొండ ధర్మన, పొన్నగంటి తలగన, రుద్రకవి, సారంగుతమ్మయ, కలకూచి బాలసరస్వతి, అద్దంకి గంగాధరుడు, మరింగంటి కవులు వంటి వులెందరో కావ్యరచనలు చేసారు. అద్దంకి గంగాధరకవి ఇబ్రాహిం కుతుబ్‌షా ఆస్థానంలో వుండి ఆ రాజుకు అంకితంగా "తపతీ సంవరణోపాఖ్యానం" అనే ప్రౌఢశైలితో కూడిన ప్రబంధాన్ని రచించాడు. ఇబ్రాహీం కుతుబ్‌షా మల్కిభరాముడుగా తెలుగు కవులచేత వర్ణింపబడినాడు. క్షేత్రయ్య వంటి పదకర్తలు మల్కిభరాముని సందర్శించి సన్మానాలందుకున్నారు. రుద్రకవి మల్కిభరాముని చేత రెంటచింత అగ్రహారాన్ని పొందాడు. జంషీద్, మహమ్మద్ కులీకుతుబ్‌షాహి రాజులు స్వయంగా పారసీ ఉర్దూ భాషల్లో కవులే గాక ఫారసీ ఉర్దూ తెలుగు కవులకాశ్రయమిచ్చారు. త్యాగయ్యచేత ప్రస్తుతింపబడిన కీర్తనకర్త రామదాసు అక్కన్న మాదన్నల మేనల్లుడు. రామదాసు అబ్దుల్లా తానీషా (క్రీ.శ.1672-1687) కాలంలో వున్నాడు. అక్కన్నమాదన్నలు ఆ రాజు మంత్రులు. ఆ కాలంలోనే ఏకామ్రనాథుడు 'ప్రతాపరుద్ర చరిత్ర' ను (క్రీ.శ.1490-1509) వచనంలో రచించాడు. కాకతీయుల వంశోత్పత్తిని చరిత్రను చెప్తున్న చారిత్రక కావ్యమిది. తెలుగులో వ్రాయబడిన మొదటి వచన గ్రంథమే కాక ఇది మొదటి చారిత్రక కావ్యం. ఈ రచనను తర్వాత ఓరుగల్లు నివాసి అయిన కాసె సర్వప్ప (క్రీ.శ.1600 ప్రాంతం) ద్విపదగా మలిచాడు. క్రీ.శ.18వ శతాబ్దంవాడైన కూచిమంచి జగ్గకవి "సోమదేవరాజీయం" పేరుతో పద్యకావ్యంగా రచించాడు. ఇట్లా తెలంగాణ సాహిత్యానికి సంబందించిన ఎన్నో వివరాలను ఈ గ్రంథం అందిస్తుంది.

కుతుబ్‌షాహి రాజుల తర్వాత తెలంగాణ నుంచి ఆంధ్రదేశాన్ని పాలించినవాళ్ళు ఆసఫ్‌జాహీలు. క్రీ.శ.1688-1724 మధ్యకాలంలో దాదాపు నలభై సంవత్సరాలు

ఆంధ్రదేశంలో మొఘల్ పాలన సాగింది. ఆసఫ్‌జాహీలు (1724-1948) ఇంగ్లీషు డచ్ పోర్చుగీసుల ఫ్రెంచ్‌వాళ్ళ వర్తక రాజకీయాల్లో పడి యుద్ధాల్లో చిక్కుకునిపోయి క్రమంగా ఆంధ్రదేశంలోని రాయలసీమ కోస్తా ప్రాంతాలను ఆ రాజులు బ్రిటష్ వాళ్ళకు ధారాదత్తంచేసారు. కాని నైజాం రాజ్యంలో తెలంగాణ చాలకాలం వాళ్ళ పరిపాలనలో వుండిపోయి 1948 సెప్టెంబర్ 17వ తారీఖున స్వాతంత్ర్యాన్ని పొందింది. ఆసఫ్‌జాహీల కాలంలో గద్వాల వనపర్తి, దోమకొండ మొదలైన సంస్థానాల్లో తెలుగు సాహిత్యం పోషింపబడింది. అట్లా క్రీ.శ. 17, 18, 19 శతాబ్దాల్లో ఆధునిక యుగం అవతరించేంత వరకు తెలంగాణలో తెలుగుసాహిత్యం ప్రజ్వరిల్లుతూనే వుంది. ఈ కాలంలో సురభి మాధవరాయలు జటప్రోలు సంస్థాన పాలకుడు. "చంద్రికా పరిణయము" అనే పిల్లవసుచరిత్రను రచించాడు. మాధవరాయల ఆస్థానంలో వున్న ఎలకూచి బాలసరస్వతి (క్రీ.శ.1650) భర్తృహరి శతకాలను సరళరమ్యమైన శైలిలో అనువదించి ప్రసిద్ధుడైనాడు. గద్వాల సంస్థానం ప్రభువు సోమభూపాలుని ఆస్థానంలో ఉన్న కాణాదం పెదసోమయాజి (క్రీ.శ.1762) "ముకుంద విలాసం" పేరుతో శ్రీకృష్ణుడు భద్రను వివాహమాడే కథను కావ్యంగా వ్రాసాడు. దోమకొండ సంస్థానాధిపతి కామినేని మల్లారెడ్డి (క్రీ.శ.1550-1600) "షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం" వంటి రచనలు చేసిన కవి. సంస్థానాల కాలంలో రచనలు చేసిన ఎందరో కవులను నారాయణరెడ్డి ఈ గ్రంథంలో విశదంగా పరిచయం చేసాడు.

నారాయణరెడ్డి ఈ "ముంగిలి" తెలంగాణ ప్రాచీన సాహిత్య గ్రంథంలో సర్వాయి పాపన్న, కొండభ్రాయుడు, గద్వాల కోటను నిర్మించిన నల్ల సోమనాద్రి, గోండురాజయిన అంకమరాజు, సదాశివరెడ్డి, రాజారామేశ్వరరావు (వనపర్తి సంస్థానాధీశుడు) వంటి చారిత్రక పురుషుల మీద జానపదులు కట్టి పాడే పాటలను కూడా చేర్చాడు. తెలంగాణలో జానపదుల్లో ప్రచారంలో వున్న వివిధ వృత్తి పురాణాల చరిత్రలను గురించి ప్రస్తావించి ఉదాహరణలు ఇచ్చాడు. సంస్కృతంలో రాజవంశాల చరిత్రలను క్షేత్ర చరిత్రలను క్షేత్ర మహాత్మ్యాలను చెప్పే అష్టాదశ పురాణాలు ఇంకా ఉప పురాణాలున్నాయి. అదే విధంగా జైన వీరశైవ సంప్రదాయంలో తీర్థంకరుల మహాపురుషుల చరిత్రలను చెప్పే పురాణాల రచనా సంప్రదాయముంది. దీన్ననుసరించే కావచ్చును జానపదులు వివిధ వృత్తి కులాల వాళ్ళు తమతమ చరిత్రలను రికార్డు చేసుకుంటూ పురాణాల పేర్లతో వివరించారు. అటువంటి కులపురాణాలను కూడా నారాయణరెడ్డి ఈ "ముంగిలి" తెలంగాణ ప్రాచీన సాహిత్యం గ్రంథంలో చేర్చడం అభినందనీయం.

క్రీ.శ.20వ శతాబ్దారంభంలో (1910) తెలంగాణలో భారతదేశంలోని అన్ని భాషా సాహిత్యాల్లో రొమాంటిసిజం ప్రవేశించింది. హిందీలో "ఛాయావాద్" తెలుగులో భావకవిత్వం వంటి వాదాలు వచ్చాయి. కాని తెలంగాణలో భావకవిత్వం ఆవిర్భవించే ఆదరింపబడే పరిస్థితులు లేవు. ఒకటి అక్షరాస్యత 3-4% మాత్రమే. మాతృభాష తెలుగు చదివేవాళ్ళు పూర్తిగా తక్కువ. ఇంకోటి నిజాం నిరంకుశ పాలన దానిమీద తిరుగుబాటు ఉద్యమాలు సాహిత్యాభిమానంలేని ఫ్యూడల్ దొరలు. ఫ్యూడల్ వ్యవస్థలో నలిగిపోతున్న కిందవర్గం మీద అణచివేతలు. ఈ పరిస్థితుల్లో భావకవిత్వానికి ఆదరణ

లభించలేదు. సమకాలిక పరిస్థితుల బట్టి సురవరం వంటి అభ్యుదయ వాదులు భావకవిత్వాన్ని నిరసించారు. కాబట్టి తెలంగాణలో ప్రాచీన సాహిత్యం తర్వాత సమకాలీన సందర్భాన్ని బట్టి అభ్యుదయవాదమే వచ్చింది. హైదరాబాదులో రాయప్రోలు వంటి భావకవితా గురువు వున్నాడు. ఆయన తెలంగాణ మీద అభిమానం లేనివాడు కాబట్టి 1956వరకు ఇక్కడు వున్నా నిజాం మీదనే అభిమానం చూపాడు. కాని తెలంగాణ ఉద్యమాలను పట్టించుకోలేదు. సాహిత్యాన్ని గాని ఇక్కడి కవులు రచయితలను గాని రాయప్రోలు ఏ మాత్రం ప్రభావితం చేయలేక పోయాడు. శాంతినికేతనంలో చదువుకొని వచ్చిన కవి ఈ విధంగా ఆచరించటం చాలా శోచనీయమైన విషయం! అదే కొంతకాలమే మీజాన్ పత్రికకు సంపాదకుడుగా హైద్రాబాదులో వున్న అడవి బాపిరాజు అభ్యుదయ భావాలను ప్రోత్సాహించి కథలను రచించటానికి ప్రేరణనిచ్చాడు. జర్నలిస్టులను తయారు చేసాడు. అడవిబాపిరాజు చారిత్రక నవలాకారుడు. తెలంగాణ చరిత్రలోని ఇక్ష్వాకులు, కాకతీయుల నాటి ఇతివృత్తాలను తీసుకొని "అడవి శాంతిశ్రీ, గోనగన్నారెడ్డి" నవలలను రచించాడు. బాపిరాజు తెలంగాణ అన్నా ఇక్కడి పోరాటాలన్నా అభిమానం కలిగి వుండేవాడు. తెలంగాణయే అసలు సిసలైన తెలుగుగడ్డ – అని బాపిరాజు తెలంగాణను చారిత్రక దృష్టితో ప్రశంసించాడు. "తెలుగుదేశ చరిత్రకు తెలంగాణ విత్తనము" అని కొమర్రాజు లక్ష్మణరావు అన్నాడు.

తెలంగాణ భూమి గోదావరి కృష్ణ మూసీ మానేరు మంజీర ప్రాణహిత వంటి అనేక నదులు ఏరులతో తడిసి సారవంతమైంది. ఇక్కడ పుట్టిన తెలంగాణ తెలుగు సాహిత్యం కూడా అపూర్వమైంది. ఈ సాహిత్యం భిన్న ప్రక్రియల్లో సాగింది. ఎన్నో కొత్త ప్రక్రియలు మౌలికమైన రచనలు ఇక్కడి తెలుగు సాహిత్యంలో ఆవిర్భవించాయి. ఇతర ప్రాంతాల కవులకు ఆదర్శమైనాయి. కావ్యాలు పురాణాలు ఇతిహాసాలు భక్తికావ్యాలు ప్రబంధాలు శతకాలు యక్షగానాలు మహాపురుషుల జీవిత చరిత్రలు కీర్తనలు వచనాలు గేయాలు మొదలైన ప్రక్రియలనెన్నింటినో తెలంగాణ తెలుగు సాహిత్యంలో కవులు సృష్టించారు. అపారమైన జానపద సాహిత్య సృష్టి ఇక్కడ జరిగింది. ద్విపద అచ్చమైన తెలుగు ఛందస్సు. దాన్ని తెలంగాణా కవులు మహాకావ్య రచనకు అనువైన ఛందస్సుగా తీసుకొని గౌరవాన్ని ఇచ్చారు. ద్విపద పాడుకోవటానికి చాల అనువైన ఛందస్సు. గోన బుద్ధారెడ్డి రామాయణాన్ని ద్విపదలో వ్రాసాడు. ఆ ద్విపదలు పామరుల్లో పాటలుగా వ్యాప్తిలో వున్నాయి. మొదటినుంచి పాట మీద అభిమానమున్న తెలంగాణకవులు ప్రజలా ద్విపదను ఆదరించారు. తెలుగులో మొట్టమొదటి రామాయణం గోన బుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణమే. అది తెలంగాణలోనే రచింపబడింది. పాల్కురికి సోమన మహాపురుషులైన బసవన్న, మల్లికార్జున పండితారాధ్యుల చరిత్రలను మహాకావ్యంగా వ్రాస్తూ ద్విపద ఛందస్సునే గ్రహించాడు. మహాపురుషుల భక్తుల చరిత్రలను తీసుకొని దేశీయమైన ఇతివృత్తంతో తెలుగులో అనువాదం అనుసరణ కాని స్వతంత్రమైన ఇతివృత్తంతో పాల్కురికి సోమన మహాకావ్యాలు వ్రాయటం తెలంగాణలోనే జరిగింది. తెలంగాణలోనే మొదట కందపద్యం కన్పించింది. ఆ కందంలోనే బద్దెన సుమతీ శతకాన్ని రచించాడు. తెలంగాణలో నన్నయకు పూర్వమే శతకం రచింపబడింది. ఒకవేళ సుమతీ శతకాన్ని కాదన్నా పాల్కురికి

సోమన రచించిన వృషాధిప శతకం తెలుగులో సంపూర్ణ శతక లక్షణాలున్న మొదటి శతకమవుతుంది. తెలంగాణలోనే కవిజనాశ్రయమనే తెలుగులో మొదటి ఛందోగ్రంథం రచింపబడింది. తెలుగులో మొట్టమొదటి యక్షగానం రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం తెలంగాణలోనే రచింపబడింది. ఇక్కడే తెలుగు సాహిత్యంలో మొదటి వచనాలు కీర్తనలు రచింపబడినాయి. తెలంగాణలోనే తెలగన మొట్టమొదట అచ్చతెనుగు కావ్యాన్ని రచించి ఒరవడి పెట్టాడు. తెలంగాణలోనే సామాన్య జనుల నానుడితో కూడిన తెలుగుకు ప్రాధాన్యమియ్యాలన్న ఉద్యమాన్ని శివకవులు లేవనెత్తారు. తెలుగు పలుకుబడికి ప్రాధాన్యమియ్యాలనే 'అచ్చతెలుగు' కావ్యాలు వ్రాయటానికి ఇక్కడే శ్రీకారం చుట్టబడింది. మడికి సింగన కూర్చిన 'సకలనీతి సమ్మతము' తెలుగులో మొదటి సంకలన గ్రంథం. ఓరుగల్లు నివాసి ఏకామ్రనాథుడు వ్రాసిన 'ప్రతాపరుద్ర చరిత్రము' తెలుగులో మొదటి చారిత్రక రచనయే కాక తెలుగులో మొదటి వచన గ్రంథం. ఓరుగల్లు నివాసి విద్యానాథుడు వ్రాసిన 'ప్రతాపరుద్ర యశోభూషణం' ఆంధ్రదేశంలో సంస్కృతంలో వ్రాయబడిన మొదటి అలంకార శాస్త్ర గ్రంథం. ఓరుగల్లులో విద్యాభ్యాసం చేసిన గంగాదేవి సంస్కృతంలో రచించిన 'మధురా విజయం' సంస్కృతంలో మొట్టమొదట అర్ధ చారిత్రక కావ్యం. దీని కోవలో తర్వాత 'విజయం, అభ్యుదయం' పేర్లతో సంస్కృతంలో చాల కావ్యాలు రచింపబడినాయి.

వేదాలకు వ్యాఖ్యానం వ్రాసిన విద్యారణ్య సాయణాచార్యులు, సంస్కృత మహాకావ్యాలకు వ్యాఖ్యానాలు రచించిన మల్లినాథుడు తెలంగాణవారే. ఉత్తర భారతంలో సంస్కృతానికి ఆశ్రయం లేనపుడు దాన్ని రక్షించి పోషించింది కాకతీయులు రాచకొండ రాజులే. వాళ్ళను ఆదర్శంగా తీసుకునే రెడ్డిరాజులు, విజయనగర రాజులు నాయక రాజులు సంస్కృతాన్ని ఆదరించారు. ఆ విధంగా ఎంతో వైవిధ్యంతో ఎందరికో ఆదర్శమైన మౌలికమైన రచనలు తెలంగాణాలో ఆవిర్భవించాయి. విస్తృతంగా తెలుగు సాహిత్యం నన్నయకు పూర్వంనుంచే తెలంగాణలో సృష్టింపబడింది. అటువంటి అమోఘమైన సాహిత్యాన్ని ఆ బృహద్గ్రంథరూపంలో పరిచయం చేస్తున్న సుంకిరెడ్డిని నేను అభినందిస్తున్నాను. "నిజాము రాజ్యములో ఆంధ్రకవులు శూన్యము" అన్న అజ్ఞానపు మాటలను సవాలుగా తీసుకొని 1934లో సురవరం ప్రతాపరెడ్డి 1930ల నాటి 354 మంది తెలంగాణ కవుల కవితలతో కూడిన సంకలనాన్ని "గోలకొండ కవుల సంచిక"గా తెచ్చాడు. 2002లో మరొక మిత్రునితో కలిసి సుంకిరెడ్డి "మత్తడి" అనే సంకలనాన్ని తెచ్చాడు. 1917 నుండి 2002 వరకు వచ్చిన తెలంగాణ ఆధునిక కవిత్వ పరిణామాన్ని ఆ సంకలనం ప్రతిబింబించింది. ఇప్పుడు తెలంగాణలో నన్నయకు పూర్వం నుంచి క్రీ.శ.19వ శతాబ్దాంతం వరకు వచ్చిన విశాలమైన సాహిత్యాన్ని సుంకిరెడ్డి ఈ 'ముంగిలి'లో పరిచయం చేసాడు. కవిత్వంతో పాటు కవుల జీవితకాలాదుల పరిచయాన్ని కూడా చేర్చాడు. దాంతో 'ముంగిలి' తెలంగాణా కవుల చరిత్రగా సాహిత్య చరిత్రగా రూపొందింది. ఇదే తెలంగాణ సాహిత్య సమగ్ర చరిత్ర అని చెప్పలేకున్నా ఆ దిశగా ముంగిటి ద్వారాన్ని డా. సుంకిరెడ్డి తెరిచాడని చెప్పాలి!

ఆంధ్రప్రాంతంలో పునరుజ్జీవన యుగంలో చరిత్ర, సాహిత్య చరిత్రలో కవులు కావ్యాలను గురించి ఎంతో కృషి జరిగింది. మరిచిపోయిన మరుగునపడ్డ చరిత్రను సాహిత్య చరిత్రను కవులను కావ్యాదులను పరశోధించి వెలికితీసారు. చర్చలు జరిపి వ్యాసాలు గ్రంథాలు రచించారు. అటువంటి పునరుజ్జీవన కాలంలో తెలంగాణాలో వచ్చిన ప్రాచీన తెలుగు సంస్కృతిని, సాహిత్యాన్ని వాళ్ళు పట్టించుకోలేదు. పైగా ప్రాచీన తెలంగాణ కవులనెందరినో పట్టించుకోకుండ భ్రమతో వివక్షతో పక్షపాతబుద్ధితో ఉపేక్షతో కోస్తా, రాయలసీమకు చెందిన కవులుగా నిర్ణయించారు. తెలంగాణలో వచ్చిన సాహిత్య వైశిష్ట్యాన్ని ప్రాచీనతను పట్టించుకోలేదు. దాన్ని గురించి చెప్పలేదు. పరాయి సంస్కృతి భాషల ప్రభావంలో వున్న తెలంగాణలో భారతదేశంలో కన్నా భిన్నంగా స్వాతంత్రోద్యమం నడిచింది. ఆ ఉద్యమంలో భూపోరాటంలో మునిగివున్న తెలంగాణలో పునరుజ్జీవనం రావలసినంత రాలేదు. ఆ అదనులో ఆంధ్రప్రాంతాల పండితులు పరిశోధకులు చారిత్రకులు తెలంగాణను తెలుగు ప్రాంతం కాదన్నట్లుగానే పట్టించుకోకుండా ఉపేక్షను చూపారు. అయితే ఇంతవరకు తెలంగాణ సాహిత్య చరిత్ర రాలేదన్న మనస్తాపాన్ని లోటును తీరుస్తున్నది "ముంగిలి". తెలంగాణా సాహిత్య చరిత్ర భవనంలోకి ప్రవేశించే ముంగిటి ద్వారాన్ని తెరిచింది ఈ "ముంగిలి" గ్రంథం. విస్తృత పరిశోధనతో కఠిన పరిశ్రమతో తెలంగాణ సాహిత్య చరిత్ర "ముంగిలి" గ్రంథాన్ని డా. సుంకిరెడ్డి కూర్పు చేశాడు. ఇటువంటి అపూర్వ గ్రంథాన్ని కూర్చినందుకు మరోసారి నేను డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డిని అభినందిస్తున్నాను.



మొఘలాయి గులాబి - హైబ్రిడ్ గులాబి

- డాక్టర్ కొండలరావు వెల్చాల

హైబ్రిడ్ గులాబీలు చాలా పెద్దగుంటాయి. బహు రంగురూపుల్లో ఉంటాయి. పది చెట్లు చాలు తోటంతా ఆక్రమించుకోవడానికి. పెద్దవి కదా! వ్యాపారానికి బాగా పనికొస్తాయి. ఖరీదు ఎక్కువ. రోగాలు కూడా ఎక్కువే. సువాసన ఉండదు. ఉంటే, అన్ని పూలదీ ఒకేలా ఉంటుంది. వాటిదంతా ఒకే జాతి. ఖర్చెక్కువ. ముళ్లు కూడా.

సువాసన లేని పూలు దేవునికి పనికిరావంటారు. కాని కాలం మారింది కదా! ఇపుడు వాటి రాసి ఎక్కువ క్రనుక వాటినికూడా వాడుతున్నారు. బహుశా ఇపుడు వాటినే ఎక్కువ వాడుతున్నారేమో! సువాసనలేని పూలను సుకుమారులు కూడా ధరించ ఇష్టపడరు. మరీ వారి భర్తలు. అయినా కాలం మారింది కదా! వారు కూడా ధరిస్తున్నారు. పాపం భర్తలేం చేస్తారు భరించక ఇక?

ఒకపుడు తెలంగాణాలో మొగలాయి రోజాలు ఎక్కువుండేవి. ఎక్కువేమిటి? అవే ఉండేవి. ఒకచెట్టుంటే చాలు, తెల్లవారేసరికి ఇల్లంతా, తోటంతా ఘుమఘుమలాడేది. అవి ఇపుడు అట్టే కానరావు. వాటిని తెలంగాణావారిని సీమాంధ్ర వారు వచ్చి మింగేసినట్లు హైబ్రీడ్లు వచ్చి మింగేశాయి. పాపం మొగలాయి పూలు ఏం చేస్తాయి? బిక్కుబిక్కుమను బిక్కమొఖం వేసికొని తగ్గాయి. ఇపుడు అవి అచటచట మాత్రమే అగపడతాయి.

ఆర్థికశాస్త్రంలో ఒక సామెతుంది "నకిలీ నాణ్యాలు వచ్చి అసలు నాణ్యాలను మింగేశాయి" అని. అలాంటి పరిస్థితి ఇది.

రవీంద్రనాథ్ ఠాగూర్ తన "గీతాంజలి"లో ఒకచోట అంటాడు "వారు కటికచీకటి రాత్రి వచ్చి మాకు కాస్తంత చోటిస్తే చాలు పడుకొని తెల్లవారే వెళ్లిపోతామన్నారు. తెల్లవారి చూస్తే ఏముంది! వారు ఇంటిలోవన్నీ సర్దుకొని పరారయ్యారు". తెలంగాణా వారి పరిస్థితి ఇపుడు అలాంటిది. అది వాసనలేని పూలు వాసన ఉన్న పూలను తరిమికొట్టినలాంటి దుస్థితి.

సీమాంధ్ర సంస్కృతి ఆక్రమణవల్ల తెలంగాణా సంస్కృతి సన్నకారు రైతు ఆకృతిలోకి మారింది, ఇంకా మారుతూనే ఉంది.

లగడపాటి రాజగోపాల్‌గారే అన్నట్లు పాపం! అమాయకులైన తెలంగాణావారు అతిరథులైన సీమాంధ్ర వారి ఆక్రమణలను తట్టుకోలేకనే. కదా ఇపుడు "ఇక వద్దు మాకు ఈ దంట, ఇక వద్దు మాకు ఈ తంట" అని అంటున్నారు, ప్రత్యేక తెలంగాణా కావాలని కోరుతున్నారు.

తెలంగాణా ఆంధ్రా సంస్కృతులు వేరే !

-డాక్టర్ కొండలరావు వెల్చాల

"కల్చర్" యను పదాన్ని ఆంగ్లంలో విస్తృతార్థంలో వాడుతారు. సంస్కారార్థంగా, విషయార్థంగా (డిసిప్లిన్), విధానార్థంగా (సిస్టమ్). కాని తెలుగువారు సంస్కృతిని చాలావరకు విషయార్థంలో, విధానార్థంలో వాడుతారు. సంస్కారాన్ని సంస్కారార్థంలో, అంటే గుణార్థంలో వాడుతారు.

"మీ సంస్కృతి అలాంటిది" అని అంటే సాధారణంగా తెలుగువారు తీసుకునే అర్థం మీ విధానం, పద్ధతి, రీతి, అలవాటు, సాంప్రదాయం, ఆచారం అలాంటిదని. "మీ 'సంస్కారం అలాంటిది" అని అంటే 'మీ గుణం, నైజం అలాంటిది' యని. తెలుగువారికి 'సంస్కృతి' 'సంస్కారం'యను రెండూ రెండర్థాలు గల పదాలు ఉన్నాయి కనుక వారికది ఒక పరిపాటి, ఒక రివాజు. సంస్కృతిని 'వ్యవస్థార్థం'లో వాడడం, సంస్కారాన్ని 'వ్యక్తార్థం'లో వాడడం.

కాని 'సంస్కృతి', 'సంస్కారం'యను పదాలను వాడినప్పుడు మనం వాటికి చెందిన అర్థఛాయలను, వాడిన ఉద్దేశ్యాలను మనసులో పెట్టుకోవాలి. అంతేకాదు వాటికి చెందిన సమయాలను, సందర్భాలను, నేపథ్యాలను, చరిత్రలను కూడా. ఎందుకంటే, "నీ సంస్కారం అలాంటిది" అని అన్నప్పుడు ఉద్దేశిస్తున్నది 'నీవలాంటివాడవు' అని కాదు, 'నీ నేపథ్యం, నీ పుట్టుక, నీ మెట్టుక, నీ చరిత్ర, నీ వాతావరణం, సాంప్రదాయం' అలాంటిదని. సంస్కారమను పదాన్ని మనం ఒక విలువగా వాడినపుడు దానిని 'ఇండిపెండెంట్' విలువగా మాట్లాడక, దాని నేపథ్యానికి జోడించి ఒక 'డిపెండెంట్' విలువగానే మాట్లాడాలి. ఎందుకంటే, ఏ సంస్కారమైనా దానంతట అదే ఉన్నట్టుండి ఊడిపడదు, అది ఒక నేపథ్యం నుండి, చరిత్ర నుండి, సాంప్రదాయం నుండి ఏర్పడి, ఎదుగుతుంది కనుక.

నేపథ్యాలు ఒకే విధంగా ఉన్నపుడు ఒకానొక విధమైన ఆలోచనా సంస్కృతి, ఆచార సంస్కృతి, ఆచరణ సంస్కృతి మున్నగునవి ఏర్పడుతాయి. నేపథ్యం వలన సంస్కారమేర్పడుతుంది, సంస్కారం వలన సంస్కృతి. ఒక విధమైన నేపథ్యం కలవారందరూ ఒక విధమైన సంస్కారాలు కలవారవుతారు. ఒక విధమైన సంస్కారాలు కలవారందరూ ఒక సంస్కృతి కలవారు. అలాంటి వారందరూ ఒకానొకవిధంగా ప్రవర్తిస్తారు, ఆలోచిస్తారు, ఆచరిస్తారు.

సంస్కారం యను పదాన్ని మనం సాధారణంగా 'మంచితనం', 'సుగుణం' అను అర్థంలో వాడుతుంటాం. కాని సంస్కారం మంచిదీ కావచ్చు, చెడుదీ కావచ్చు. సుగుణమయిందీ కావచ్చు, దుర్గుణమయిందీ కావచ్చు. 'పాజిటివ్'దీ కావొచ్చు, 'నెగిటివ్'దీ కావచ్చు. తరచి చూస్తే సంస్కారం ఒక గుణం, ఒక లక్షణం మాత్రమే. 'రూపం' రూపమే, 'గుణం' గుణమే. 'సంస్కారం' గుణాన్ని మాత్రమే సూచిస్తుంది.

అది ఎలాంటి గుణం అనుదానికి మరో పదం జోడించవలసి ఉంటుంది. 'సద్గుణం', 'దుర్గుణం'లా 'దుష్టసంస్కారం', 'శిష్ట సంస్కారం' లేక 'సంస్కారవంతుడు' (కల్చర్డ్) అని అనవలసి వస్తుంది.

ఇంగ్లీష్‌లో 'హి ఈజ్ కల్చర్డ్' యని అనడం వేరు 'దటీజ్ హిజ్ కల్చర్' యని అనడం వేరు. ఒక దాని అర్థం సంస్కారవంతుడు, మంచివాడని. ఇంకొక దాని అర్థం ఒకానొకవిధమైన సంస్కృతికి చెందినవాడని. 'కల్చర్'కు ఇలాంటి అర్థఛాయలుంటాయి. వాటిని గ్రహించాలి, గుర్తించాలి.

'ఇది వారి కల్చర్, లేక ఇది వారి సంస్కారం' యని ఎవరినైనా ఎవరైనా అన్నపుడు, ఆ అనేవాడు సాధారణంగా వారి నేపథ్యాన్ని, గతాన్ని, చరిత్రను దృష్టిలో పెట్టుకొని అంటాడు కాని ఇదిమిద్ధంగా అనడు. అలా దాని ప్రయోగం చాలావరకు వ్యవస్థాగతమైందే కాని వ్యక్తిగతమైంది కాదు.

ఈ రోజుల్లో 'సంస్కృతి వేరు' అని అన్నంత లోపలనే అదేదో నిందలాగా, నేరారోపణ లాగా మీద పడుతున్నారు లోకులు. సంస్కృతి వేరు కావడం నేరమూ కాదు, ఘోరమూ కాదు, పాపమూ కాదు, పుణ్యమూ కాదు. అదొక ఫ్యాక్ట్, ఒక వాస్తవం, ఒక రియాలిటీ మాత్రమే. సంస్కృతులు వేరు కావడం మనం ప్రపంచమంతా ఎన్నోచోట్ల చూస్తున్నదే. దానికి కులం కారణం కావచ్చు, మతం కారణం కావచ్చు, ప్రాంతం కారణం కావచ్చు, మరేదైనా కారణం కావచ్చు. అందువలన సంస్కృతి పేరట మాట్లాడితేనే దానిని నిరసించడం, నిందించడం సమంజసం కాదు. సంస్కృతుల నిర్ధారణ ఒకానొక విధమైన పరిశోధనా ప్రక్రియ, ఒక సాక్ష్యాధార నిర్ధారణ.

తెలంగాణా ప్రాంతం వారి సంస్కృతి, ఆంధ్రా ప్రాంతం వారి సంస్కృతి వేరనడానికి కారణాలు వారి నేపథ్యాలు, గతాలు, చరిత్రలు, సాంప్రదాయాలు. వాటిని ఎవ్వరూ కాదనజాలరు. వాటికి అనేకానేక సాక్ష్యాలున్నాయి. అవి వారి చరిత్రలో దొరికాయి, ఇంకా దొరుకుతూనే ఉన్నాయి. సంస్కృతి వేరన్నంత మాత్రాన్నే కోపగించుకోవలసిన అవసరం లేదు, దానిని విమర్శగా భావించవలసిన అవసరం లేదు, దానినొక 'ఫ్యాక్ట్ ఆఫ్ లైఫ్ అండ్ లివింగ్'గా తీసికోవాలి తప్ప. అదే ఇపుడు జరగడం లేదు. ఒకప్పుడు ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలంగాణా ప్రాంత సంస్కృతి ఆంధ్ర ప్రాంత సంస్కృతి ఒకటే 'కాదు' 'కాదు' అన్న వారే ఇపుడు రాజకీయ కారణాల కొరకు 'ఔను' 'ఔను' అంటున్నారు. దీనినే అంటారు రెండు నాలుకల ధోరణని. ఒక అవసరానికి ఒక తీరు మాట, ఇంకొక అవసరానికి ఇంకొక మాటని. ఇది చరిత్రను, గతాన్ని, నేపథ్యాన్ని కాదనడమే అవుతుంది కాని మరొకటి కాదు. తెలంగాణా, ఆంధ్రా సంస్కృతుల మధ్య భాష ఒక్కటే 'కామన్' కాని మరేదీ 'కామన్'

కాదు. ఎవరో అన్నట్లు మాటా కాదు, మూటా కాదు, ఆటా కాదు, పాటా కాదు, సాపాటా కాదు.

భాష కూడా వారే అనేకానేక సార్లు అన్నట్లు, ఇంకా అంటున్నట్లు ఒకటే కాదు. వారిది తెలుగు + ఇంగ్లీషయితే తెలంగాణా వారిది తెలుగు + ఉర్దూ, వారిది తెలుగు + సంస్కృతమయితే తెలంగాణా వారిది తెలుగు + ప్రాకృతం, వారిది తెలుగు + గ్రాంధికమయితే తెలంగాణా వారిది తెలుగు + వ్యావహారికం, వారిది తెలుగు + యాస అయితే తెలంగాణా వారిది తెలుగు + ప్రవాస (అంటే ఉర్దూతో పాటు ఎంతో కొంత ఫార్సీ, హిందీ, మరాఠీ, కన్నడ మున్నగు భాషలతో కూడినది).

ఇక మీకు వేరే వ్యత్యాసాలు కావాలంటే నా వ్యాసాలు (1) తెలంగాణా మాట వేరు, పాట వేరు, ఆట వేరు, సాపాట వేరు; (2) తెలంగాణా ఆంధ్రాప్రాంత సాంస్కృతిక వ్యత్యాసాల నేపధ్యాలు చదవండి. అవి 'తెలంగాణా కల్చరల్ ఫోరమ్' వద్ద దొరుకుతాయి.

తెలంగాణా మాట వేరు, పాట వేరు ఆట వేరు, సాపాట వేరు, బాట వేరు

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఇది నేనంటున్న మాట కాదు. తెలంగాణా వారే అంటున్న మాట కూడా కాదు. గత అయిదున్నర దశాబ్దాలుగా ఆంధ్రాప్రాంతం వారే వ్యంగ్యంగా, వేళాకోళంగా, ఎద్దేవంగా అంటున్న మాట.

అసలు 'ప్రత్యేక తెలంగాణా సెంటిమెంట్' (మానసిక భావోద్వేగత) "మీకూ మాకూ పడదు, పడదు". "మాకు అన్ని వేరు ఆత్మగౌరవం వేరు" "మాకు అన్నిటి కన్నా మా ఆత్మాభిమానం ముఖ్యం, దానికొరకు కావాలి మాకు మా స్వయం పరిపాలన", "మా బతుకు మేము కలో గంజో తాగి బతకడానికి, మా అభివృద్ధిని మేమే చేసుకోవడానికి మాకు ప్రధానంగా కావలసింది 'స్వేచ్ఛ'. ప్రత్యేక తెలంగాణా వాదనంతా, ఆందోళనంతా ఆ ప్రాంతం వారి సాంస్కృతిక అవహేళనతోనే మొదలయింది. ఆంధ్రా ప్రాంతం వారే అనేకానేక సార్లన్నట్లు, అంటూనే ఉన్నట్లు, తెలంగాణా వారి మాట వేరు, పాట వేరు, ఆట వేరు, సాపాట వేరు. అందుకే కదా మరి తెలంగాణా వారంటున్నారిపుడు మా ఉద్యమ బాట కూడా వేరని. అది వందేండ్లయినా ఆగదని.

తెలంగాణా మాట, పాట, ఆట, సాపాట ఎలా వేరో, ఎందుకు వేరో చూద్దాం.

తెలంగాణా మాట :

తెలంగాణా తెలుగు తెలుగే కాదు, అది తెలుగు పాలిటి తెగులు. తెలంగాణా తెలుగు ఎక్కువ ఉర్దూ తక్కువ తెలుగు. అది సంస్కారభాష కన్నా ఎక్కువ సదరు భాష, ప్రాస భాష కన్నా ఎక్కువ యాసభాష, ప్రామాణిక భాష కన్నా ఎక్కువ మాండలిక భాష, వేదుక భాష కన్నా ఎక్కువ వాడుక భాష అంటూ ఆంధ్రాప్రాంతం వారు తెలంగాణా భాషను ఎప్పటికప్పుడు చలన చిత్రాల ద్వారా, పుస్తకాల ద్వారా, పత్రికల ద్వారా, టీవీ ఛానళ్ళ ద్వారా పరిహసిస్తూనే ఉన్నారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమమంతా ఈ ఎద్దేవాలకు వ్యతిరేకంగానే "ఆత్మగౌరవ" నినాదంతో మొదలయింది. తక్కినవన్నీ ఆ పిదపే వచ్చాయి అంచెలంచెలుగా దానికి తోడుగా.

తెలంగాణా వారనేది వారిదే అసలు సిసలైన తెలుగని. వారి భాషే తక్కువ సంస్కృత పదాలతో ఎక్కువ తెలుగు పదాలతో కూడిందని, వారి భాష మాట్లాడేవారిలోనే ఉచ్ఛారణా దోషాలు యాసలు దీర్ఘాలు మున్నగునవి తక్కువని, వారి భాషే ఆసియా ఖండ భాషలన్నిటికీ దగ్గరని, వారి భాషే ప్రజాస్వామ్య భాషకు, ప్రజల భాషకు చాలా దగ్గరని. వారి భాషే తక్కువ గ్రాంధిక భాష ఎక్కువ వాడుక

భాషని, వారిభాషలోనే తక్కువ ఆంగ్లపదాలు, ఎక్కువ తెలుగు పదాలున్నాయని. అసలు 'తెలుగు' అను పదం వారి భాషకే ప్రత్యేకమని, ఆంధ్రులది ఆంధ్రమని.

ఆంధ్రాప్రాంతపు ఒకానొక ఉపప్రాంతా నికి చెందిన భాషను అన్ని ప్రాంతాల ప్రామాణిక భాషగా చెలామణీకి తేవడం జరిగింది, ఇంకా జరుగుతూనే ఉంది. దీనివలన తెలంగాణా ప్రాంతపు భాష మెలమెల్లగా అదుగంటుతోంది. ఇది ఇలా కొనసాగితే తెలంగాణా భాషంటూ ఇకముందు ఒకటి మిగలదు. తెలంగాణా భాష మిగులకపోతే తెలంగాణా సాహిత్యం, తెలంగాణా విద్యకూడా వెనుకబడుతుంది. ఎందుకంటే ప్రామాణిక భాష వలన తెలంగాణా వారికి ఎన్నో అధ్యయన, అభ్యాస సమస్యలు, రచనా సమస్యలు బోధనా సమస్యలు ఎదురవుతాయి, ఎదురవుతూనే ఉన్నాయి. (ప్రామాణిక భాషంటూ నిర్దేశిస్తే అది మూడు ప్రాంతాలకూ వేరువేరుగా నిర్దేశించాలి).

సాహిత్యాన్ని విద్యను భాష నిర్దేశిస్తుంది. అవి మూడూ కలిసి సంస్కృతిని నిర్దేశిస్తాయి. అలా ఒక భాష మరుగునపడితే ఆ భాషీయులకు చెందిన విద్యలు, సాహిత్యాలు, సంస్కృతులు కూడా మరుగున పడుతాయి. ఒక ప్రాంత భాష, దానికి చెందిన సంస్కృతి ఆ ప్రాంతానికి అస్తిత్వంలాంటిది, ఆయువుపట్టులాంటిది. ఆ సంస్కృతి వలననే ఆ ప్రాంతానికి తనదను ఒక గుర్తింపు, ఒక గౌరవం, ఒక 'ఎంటిటీ', 'ఐడెంటిటీ' లభిస్తుంది. భాష ద్వారానే భాషకు చెందిన వారి పరిచయం కలుగుతుంది. భాష ఇంటికి ముఖద్వారం లాంటిది.

తెలంగాణా వారి మాట వేరు కనుకనే వారికి ఇన్నాళ్లనుండి "తెలంగాణా" యను పేరొకటి వచ్చింది. ఆ భాషే పోయాక దానికి దాని పేరు కూడా పోయినట్లే కదా మరి! పోతుంది కూడా. 'తెలంగాణా మాట' తెలంగాణా ప్రాంతానికి ఒక బాట లాంటిది, ఒక దిక్సూచి లాంటిది. భాష సంస్కృతిలో ఒక భాగం కనుక, భాష ద్వారానే విద్య, వికాసం, వినయం, వివేకంలాంటివి సమకూరు తాయి కనుక, భాష వారికి సంస్కృతి లాంటిది.

తెలంగాణా విద్యార్థులు, రచయితలు, అధ్యాపకులందరూ ఇపుడు ఒకటి కాదు రెండు భాషల (ఆంగ్లేయ భాష, ప్రామాణిక కోస్తా ప్రాంత తెలుగు భాష) దండయాత్రలకు గురవుతున్నారు. దాని వలన వారి విద్యాభ్యుదయాలు, సామాజికాభ్యుదయాలు, ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయి. వారు అటు 'పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్' ఉన్నత ఉద్యోగాలకు, ఇటు 'ప్రైవేట్ ఎంటర్‌ప్రైజ్' ఉన్నత ఉద్యోగాలకు ఆంధ్రాప్రాంతీయులతో పోటీపడలేకపోతున్నారు.

ఆంధ్రాప్రాంతం వారు వారి ప్రాంతానికి చెందిన భాషను ప్రామాణిక భాషగా తెలంగాణా వారిపై రుద్దడం వలన తెలంగాణా ప్రాంత విద్యార్థులు ఎన్నో అధ్యయన, అభ్యాస, అభివృద్ధి ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యలకు చెందిన, ఉద్యోగాలకు

చెందిన పరీక్షల్లో వారు ఆంధ్రాప్రాంతంవారికి వెనుకబడే ఆస్కారం ఏర్పడుతోంది. ప్రామాణిక భాషలోని ఎన్నో సాంస్కృతిక, మాండలిక పరమైన పదాలు ఇరుప్రాంతాలకు ఒకటే కాక, తెలంగాణా ప్రాంతంలో అవి వాడుకలో లేక విద్యార్థుల అవగాహనను అవి దెబ్బతీస్తున్నాయి. అందుకే తెలంగాణా విద్యార్థులు ఈ మధ్య వారి పరీక్షా పత్రాలు తెలంగాణా వారే దిద్దాలి యను నినాదాన్ని లేవనెత్తారు. దీనికి కారణం తెలంగాణా విద్యార్థులు తెలంగాణా భాషలో పరీక్షలు రాస్తే ఆంధ్రాప్రాంతం వారికి ఆ రాతలు ఒంటబట్టవు, ఒప్పవని. ఒక ప్రాంతానికి చెందిన ప్రామాణిక భాషను ఇంకొక ప్రాంతంపై రుద్దడం వలన అది వారి స్థానిక భాషను దెబ్బతీసి ఆ ప్రాంత సంస్కృతిని కూడా దెబ్బతీస్తుంది. ఇపుడు తెలంగాణాలో అక్షరాలా అదే జరుగుతోంది.

తెలంగాణా పాట :

తెలంగాణాకు చెందిన సాహిత్యం పెద్దగా చెప్పుకోదగిందేమీ కాదని, అలాగే తెలంగాణాకు చెందిన రచయితలు, సాహిత్యవేత్తలని కూడా ఆంధ్రాప్రాంతం వారి ప్రత్యక్ష పరోక్ష వాదన. కవులు, సాహిత్యవేత్తలు, విమర్శకులు మున్నగువారు వారి ప్రాంతంలోనే ఎక్కువని, సాహిత్య ఉద్దండులంతా ఆ ప్రాంతం వారేనని.

తెలంగాణా గడ్డ జానపద సాహిత్యానికి అసలు సిసలైన గడ్డని తెలంగాణా వారి వాదన. తెలంగాణాలో ఉద్భవించినంత జానపద సాహిత్యం ఆంధ్రాప్రాంతంలో ఉద్భవించలేదని. దానికి కారణం తెలంగాణా వారి తెలుగుభాష 'జనభాష' కావడమేనని. అలాగే సామాజిక సాహిత్యం కూడా చాలావరకు తెలంగాణానుండే ఉత్పన్నమైందని. దానికి కారణం తెలంగాణాలో తలెత్తిన అనేకానేక ఉద్యమాలని. ఉద్యమాల నుండే సామాజిక సాహిత్యం ఉద్భవించింది, ఉద్భవిస్తుందని.

తెలంగాణాలో అప్పటికీ ఇప్పటికీ 'భక్తి సాహిత్యం' కూడా ఎక్కువని దానికి 'పోతన భాగవతం' ఝుండా లాంటిదని. తెలంగాణాలో జన్మించిన పోతన 'భాగవతాన్ని' మించిన భక్తి సాహిత్యం ఇంకొకటి లేదని. స్త్రీల పాటల్లో, దేశభక్తి పాటల్లో, అభ్యుదయ పాటల్లో, ఉర్దూ కవితల్లాంటి కవితల్లో తెలంగాణా వారు చాలా ముందడుగు వేశారని, భావకవితల్లో కూడా తెలంగాణా వారు తక్కువేమీ కారని. అలాగే విమర్శ సాహిత్యంలో, భాషా సాహిత్యంలో, వ్యాకరణ సాహిత్యంలో, ఛందోసాహిత్యంలో కూడా.

తెలంగాణా రచయితల్లో కూడా పోతన, భీమన, మారన, నారన, సోమన లాంటి వారు, పి.వి., బూర్గుల, సురవరం, సినారే, దాశరథి సోదరులు, గోపీ, కోవెల సంపత్కుమారచార్య సుప్రసన్నాచార్య, చేరా, రవ్వాశ్రీహరి, బి.యన్.శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, రామానుజరావు, కాళోజీ, అనుముల, వానమామలై సోదరులు, మాడపాటి, సదాశివ, హనుమాండ్లు భూమయ్య, డా॥బి.రామరాజు, ముదిగొండ వీరభద్రయ్య, రంగనాధాచార్య, మాదిరాజు రంగారావు,జువ్వాడి

గౌతమరావు, యశోదారెడ్డి, వరవరరావు, జ్వాలా ముఖి, చెరబండ, నిఖిలేశ్వర్, గద్దర్, అంపశయ్య నవీన్ లాంటి సుప్రసిద్ధ రచయితలు, కవులున్నారని.

తెలంగాణా ఆట :

తెలంగాణా విద్యాలయాలన్నీ ఒకప్పుడు ప్రభుత్వమే స్థాపించి నడిపించేది. వాటికి లెక్కలేనన్ని ఆటస్థలాలుండేవి. ప్రతిరోజూ సాయంత్రం, ప్రాతఃకాలం ఆ స్థలాలలో ఎంతో మంది విద్యార్థులు అధ్యాపకులు ఆడుతూ పాడుతూ కనిపించేవారు. అందరూ కలిసి చదువుకునేవారు, అందరూ కలిసి ఆడుకునేవారు పాడుకునేవారు. అలా వారందరికీ ఒక విధమైన 'కామన్ కల్చర్', 'ప్రజాస్వామ్య కల్చర్', 'సెక్యులర్ కల్చర్', 'కాంపోజిట్ కల్చర్', 'కలిసి మెలిసి ఉండే కల్చర్' పుష్కలంగా అబ్బేది. బహుశా తెలంగాణా వారి 'స్నేహ సంస్కృతి'కి, 'స్పోర్ట్స్‌మన్ స్పిరిట్'కి అప్పటికీ ఇప్పటికీ అదే కారణమేమో!

ఆ రోజుల్లో తెలంగాణాలోని అనేకానేక ఆటల్లో తెలంగాణా విద్యార్థులు, పిల్లలు, యువకులతో పాటు పెద్దలు కూడా పాల్గొనేవారు. అప్పటి పల్లీయ ఆటల్లో పేర్కొనవలసినవి చిర్రగోనె, ఉత్తుత్తు, టొక్కా గోళీలాట, బొంగరాలాట, చెండాట, ఉరుకుడు, దూకుడు, కుస్తీ, ఈత, కోతికొమ్మచ్చి, తొక్కుడుబిళ్ల, చెమ్మచెక్క చేరడేసిమొగ్గ, దాగుడుమూతలు, పిల్లికుప్పలు, దొంగాట, బొమ్మలాట, పుంజీతం, పచ్చీసు, కోలాట, బతుకమ్మాట మున్నగునవి. పట్టణాలలోనివి ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్, బ్యాట్‌మింటన్, షటిల్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, క్యారమ్‌బోర్డ్, ఛెస్ తదితరాలు.

అందుకే ఆ రోజుల్లో తెలంగాణా ప్రాంతంవారు ఆంధ్రా ప్రాంతం వారికంటే ఆటల్లో ఎంతో ముందుండేవారు. ఈనాటి క్రికెట్‌లో, హాకీలో, ఫుట్‌బాల్‌లో కూడా. ఆనాటి విద్యల, ఆటలవలన ఎంతోమంది మంచి వృత్తిపరులే కాకుండా మంచి పౌరులుగా, మనుషులుగా కూడా రూపొందారు.

ఏవీ మరి ఆనాటి ఆ ఆటలు? ఏవీ మరి ఆనాటి ఆ ఆటస్థలాలు? అవన్నీ చాలావరకు అదృశ్యమయ్యాయి. అవి ఏమయ్యాయో ఆ దేవుడికే తెలుసు. ఆ ఆటలు, ఆటస్థలాలు మాయమయి నందున ఆనాటి ఆ ఐక్యతా సమైక్యతా సంస్కృతి కూడా చాలావరకు మాయమయింది. అన్నిటికన్నా పెద్ద నష్టం ఆ సంస్కృతి మటుమాయం కావడం వలన జరిగింది. విద్యాలయాలకు చెందిన వనరులు వసతులు నిర్లక్ష్యం చేయబడడం వలన, వాటి స్థలాలు అమ్ముకోబడడం, అన్యాక్రాంతం చేయబడడం వలన జరిగింది.

తెలంగాణా సాపాట :

తెలంగాణావారి రుచులు, అభిరుచులు వేరు. అవి వారికి ఆనాటి మిశ్రమ సాంఘిక వ్యవస్థనుండొచ్చాయి. తురకల, మహారాష్ట్రుల, కన్నడిగుల, ఇతర

ప్రాంతీయుల నుండొచ్చాయి. ఎందుకంటే తెలంగాణా ప్రాంతం, మరి హైదరాబాదు నగరం ఆ రోజుల్లో ఎందరో ఇతర ప్రాంతీయుల, మతీయుల, భాషీయుల కూడలిగా ఉండేది. అందరూ వారి వారి రుచులు, అభిరుచులు పంచుకునేవారు. కలిసి తినేవారు, కలిసి త్రాగేవారు, కలిసిమెలిసి గడిపేవారు. తెలంగాణావారి వంటలు చాలావరకు ఆంధ్రాప్రాంతం వంటల కన్నా భిన్నంగా ఉండేవి, తెలంగాణా వారి రుచులు ఆంధ్రావారి రుచులకన్నా. తెలంగాణా వారి మాంసాహారాలు చాలావరకు ముస్లిం కల్చర్‌తో ప్రభావితమైనవి. ఇప్పటికీ ఆ వంటల్లో ముస్లిం వంటల వాసనలుంటాయి. తెలంగాణావారు ముస్లింలలాగే అనేకానేక మాంసాహారాలు వండుతారు. వాటి రుచులు వాటివే. అలాంటివి ఆంధ్రాప్రాంతంలో చాలా తక్కువ.

తెలంగాణాలో మొక్కజొన్నలు చాలా పండుతాయి. తెలంగాణా వారు మొక్కజొన్నలతో అనేకానేక తినుబండారాలు చేస్తారు. వాటి విత్తులతో, పిండితో, వాటిని ఇతర వాటితో కలిపి కూడా. గారెలు చేస్తారు, అట్లు చేస్తారు, గుగ్గిళ్ళుచేస్తారు, గటకలు చేస్తారు, మఱింకెన్నో. మొక్కజొన్న కంకులు కాల్చి తినడం, అలాగే వాటిని 'తంపి' అంటే బూరుతో ఉడికించి తినడం తెలంగాణా వారికి ఎంతో యిష్టం. అలాగే పొట్టుతో ఉడికించిన జొన్న కంకి, కందికాయ, శనగకాయ, అనపకాయ మున్నగునవి కూడా.

తెలంగాణాలో మక్కలతో, అనుములతో చేసినన్ని పదార్థాలు, ఫలహారాలు ఆంధ్రాలో చేయరు. తెలంగాణావారికి అనుములతో, మక్కలతో, చిక్కుళ్ళతో చేసే వంటలంటే ఎంతో యిష్టం. తెలంగాణావారు చేసినన్ని ఆకు కూరలు, గడ్డలకూరలు కూడా ఆంధ్రాప్రాంతీయులు చేయరు.

తెలంగాణావారి ఫలహారాల్లో చకినాలు, చేగోళ్లు, కరిజెలు, అరిశెలు, నేతి సల్ది ముద్దలు, పేనీలు, కారప్పూస, పునుకులు, బోలప్పలు, సర్వపిండి, గుడాలు మున్నగునవన్నీ చాలావరకు వారికే పరిమితం. తెలంగాణా వారు వండే పప్పు, పప్పుచారు, పప్పుకట్టు, పచ్చిపులుసు, చారు, చల్లచారు, దప్పడాలు, బాజాలు మున్నగునవి వేరు. అవి వండే విధానాలు వేరు, వాటి రుచులు వేరు.

ఒకప్పుడు తెలంగాణావారు 'వరుగుల'తో ఎన్నో వంటలు చేసేవారు. వరుగుల వంటలంటే ఎండవేసిన మాంసంతో, చేపలతో, రొయ్యలతో, కాయగూరలతో చేసేవి. ఒకప్పుడు తెలంగాణావారి ప్రొద్దటి ఉపహారాలు (ఈనాటి 'బ్రేక్‌ఫాస్ట్') ఎక్కువగా కిచిడీ, పోణన్నం, జొన్నరొట్టె, గోధుమరొట్టె, జొన్నగటక, పరాటా, సర్వపిండి, బోలప్ప మున్నగునవి.

తెలంగాణా 'తొక్కులు' (పచ్చళ్లు) అప్పటికీ ఇప్పటికీ ఎంతో ప్రసిద్ధి గాంచినవి. అప్పట్లో వాటిని మామిడికాయలతోనే ఎక్కువ చేసేవారు మామిడికాయల కాలంలో. వాటిని సోగి, మెంతి, ఆవ, నార, బెల్లం, ఉప్పావ అనేవారు. ఈ తొక్కులు ఒకసారి

చేస్తే సంవత్సరాంతం వరకు చెడిపోకుండా ఉండేవి. అలా వాటిని చేయడం అప్పటికి ఇప్పటికీ తెలంగాణావారి ప్రత్యేకం.

తెలంగాణావారి ఇంకొక వంట 'అంబలి'. ఇది సాధారణంగా కష్టపడి పనిచేసేవారు ఎక్కువ ఇష్టపడేవారు. ఒకటి రెండుసార్లు అంబలి త్రాగితే చారు ఎంతో కృషి చేయగలిగేవారు. తెలంగాణావారి మరొక పదార్థం 'అటుకులు'. ఇవి బియ్యంతో, మొక్కజొన్న, జొన్న మున్నగువాటితో చేసేవారు. వాటిని చాలావరకు విడిగానైనా, ముడిగానైనా ఫలహారాలుగా ఉపయోగించేవారు.

ఇలా చెబుతూపోతే చాలా వున్నాయి తెలంగాణావారి వంటలు. వీటిలో కొన్ని ఆంధ్రాప్రాంతం వారు కూడా చేస్తే చేయవచ్చు. కాని చేయడంలో చేయడంలో ఈ ప్రాంతం ఆ ప్రాంతం వారికి చాలా తేడా ఉంటుంది. అలాగే రుచులలో రుచులలో, నాలుకల్లో నాలుకల్లో. ఎవరి నేపథ్యం, ఎవరి రుచి అభిరుచి, ఎవరి సంస్కృతి వారిది కనుక.

తెలంగాణా వారి దుస్తులు:

తెలంగాణావారి సంస్కృతికి చెందిన విభిన్నతలలో వారి దుస్తులను కూడా పేర్కోవాలి. వాటిలో ఇరు ప్రాంతాలకు చెందిన వ్యత్యాసాలు చాలా అగపడతాయి. ఒక ప్రధానమైన వ్యత్యాసం ఆంధ్రాప్రాంతం వారు ధరించే లుంగీలకు, తెలంగాణా ప్రాంతం వారు ధరించే లాగులకు చెందింది. ఆంధ్రాప్రాంతం వారు అప్పటికీ ఇప్పటికీ లుంగీలే ఎక్కువ ధరిస్తారు. తెలంగాణావారు లాగులు. తెలంగాణావారి చొక్కాలలో (తెలంగాణాలో వాటిని 'అంగీలు' అంటారు), ఆంధ్రావారి చొక్కాలలో, తెలంగాణావారి బనియన్లలో, ఆంధ్రావారి బనియన్లలో కూడా తేడాలుంటాయి. ఆంధ్రా తెలంగాణా పల్లీయుల ధోవతులు, చీరలు మున్నగునవి కట్టడంలో కూడా తేడాలున్నాయి.

తెలంగాణా కర్షకులు అప్పటికీ ఇప్పటికీ తలపాగా ధరిస్తారు. ఈ సాంప్రదాయం ఆంధ్రాలో ఎక్కువగపడదు. తెలంగాణా ప్రాంత స్త్రీ పురుష కార్మికులు వారి దుస్తులు ఎక్కువ మోకాలు వరకే ధరిస్తారు. ఆంధ్రాప్రాంతంలో ఎలా ధరిస్తారో తెలియదు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఆంధ్రా తెలంగాణా ప్రాంత జీవులకు, జీవితాలకు చెందిన సంస్కృతీ వ్యత్యాసాలు చాలా చెప్పవచ్చు. ఇక్కడ చెబుతున్నది వ్యత్యాసాలున్నాయని మాత్రమే కాని అవి మంచివి చెడువి, పెద్దవి చిన్నవని కాదు. వాటికి చెందిన ప్రత్యేకతలు మాత్రమే ఇచట వివరించబడినాయి.

ఈ సంస్కృతులు 'మావి' యని చెప్పుకుంటారు ఎవరికి వారు. వాటిని వారి అస్తిత్వంలా, వ్యక్తిత్వంలా భావిస్తారు. అవి దెబ్బతింటే, వాటిపై ఎవరైనా దండెత్తితే వారది వారి ఆత్మగౌరవానికి కొట్టుగా భావిస్తారు. సహజమే కదా మరి!

ఎవరి ఆత్మగౌరవం వారికి వారి ప్రాణంతో, మానంతో సమానం. అది మరచిపోగూడదు. అందుకే కదా యన్.టి.రామారావుగారు ఆ రోజుల్లో "ఆత్మగౌరవ బావుటాను" ఒక పాశుపథాస్త్రంగా ఎగురవేసి విజయం సాధించారు. ఆ ఆయుధం ముందు అన్ని ఆయుధాలు బలాదూర్! అన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు గారు కూడా ఆ నినాదాన్నే అపుడపుడు లేవనెత్తుతూనే ఉంటారు. మరి ఒకరు లేవనెత్తితే ఒప్పు, ఒకరు లేవనెత్తితే తప్పా?

ఇపుడు తెలంగాణావారు ప్రత్యేక తెలంగాణా కోరుతున్నది వారి సంస్కృతి పరిరక్షణ ద్వారా వారి ఆత్మగౌరవ పరిరక్షణను మాత్రమే. స్వాభిమానం, ఆత్మగౌరవం యనునవి ఎన్ని సదుపాయాలు కల్పించినా, ఎన్ని అభ్యున్నతులు సాధించినా, ఎన్ని సాధిస్తామని కల్లిబొల్లిమాటలు చెప్పినా, వాగ్దానాలు చేసినా సంతృప్తినిచ్చేవి కావు. తెలంగాణాలో 'మానమే పోయాక ప్రాణం ఉంటేనేమి లేకుంటేనేమి' అని అంటూ ఉంటారు జనులు. ఆత్మగౌరవం యనునది వారి 'మానానికి' చెందింది. అది వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి, స్వపరిపాలనకు చెందింది. స్వేచ్ఛను మించిన, మానాన్ని మించిన ధనధాన్యం ఎక్కడుంటుంది? స్వేచ్ఛను మించిన, మానాభిమానాన్ని మించిన కాంక్ష మనిషికి మరొకటి ఏముంటుంది? అది వ్యక్తియొక్క వ్యక్తిత్వానికి, అస్తిత్వానికి చెందింది. దానిని దేనికొరకు కూడా పోడగొట్టుకోవడానికి ఏ నాగరీకుడు, ఏ వికాసవంతమైన పౌరుడూ అంగీకరించడు.

శ్రీకృష్ణకమిటీ ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి. ప్రత్యేక తెలంగాణా కోరిక కేవలం ఆర్థిక కోరిక మాత్రమే కాదు, అంతకన్నా మించి, ఆ ఆర్థిక కోర్కెకె మూలమైన ఆత్మగౌరవానికి చెందిన కోరికయని గుర్తించి, గ్రహించి, తగు న్యాయం చేయాలి.

సంస్కృతి గురించి ఇంకొక తుదిమాట : ఒకప్పుడు తెలంగాణాలోని ప్రతి ఊళ్ళో ఒక గుడి ఉండేది. ఏది ఉన్నా లేకున్నా గుడి మాత్రం తప్పనిసరని అనుకునేవారు తెలంగాణావారు. ప్రతి గుడికీ ఒక పూజారి ఉండేవాడు. దానికి చెందిన కొంత 'గుడిభూమి' ఉండేది. ఆ గుడిభూమి ఆ గుడి పూజారికి జీవనాధారంగా ఉండేది. దాని వలన ఆతడు ఆ గుడిని పట్టుకొని స్థిరంగా అచటే ఉండేవాడు. ఆ భూమి నుండి వచ్చే ఆదాయంతో పాటు అప్పుడప్పుడు జరిగే పూజలు, ఉత్సవాలు, పండుగలు మున్నగునవి అతనికి అంతో ఇంతో అదనపు ఆదాయం తెచ్చిపెట్టేవి. అందువలన అతడూ, అతని వారసులూ ఆ గుడిని అంటిపెట్టుకొని ఉండేవారు. ప్రతిరోజూ ఆ పూజారి ఆ గుడిలో దీపారాధన చేసి పూజలు నిర్వహించేవాడు. అలా ఉండేది ఆనాటి తెలంగాణా పల్లెల్లోని ఆధ్యాత్మిక సంస్కృతి. అది ఇపుడు చాలా అదృశ్యమైపోయింది ఆంధ్రాపాలకుల పుణ్యమాయని.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆ సంస్కృతి అంతా అడుగంటింది. ఎన్నో పల్లెలు

గుళ్ళు లేనివి, దీపారాధన లేనివి, పూజలు లేనివైపోయాయి. అదొక విధంగా తెలంగాణా పల్లెలకు పట్టిన అనేకానేక సాంస్కృతిక దుర్గతుల్లో మరొక దుర్గతి. కానీ ఎవరికి పట్టిందది! గుడిలేని ఊరును చూడగూడదు అనేవారు ఒకప్పుడు తెలంగాణా జనులు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడడం తెలంగాణా గుళ్ళకు ఒక శాపంలాంటి దయింది. ఆ పాపం ఇపుడు తెలంగాణా ఉద్యమం ద్వారా చుట్టుకుంటోంది. ఇచట పాపమన్న మాట ఎందుకు వాడానంటే, గాంధీగారు కూడా ఒకప్పుడు "కొన్ని కొన్ని పాపాలు చేయగూడదు, చేస్తే వాటి పర్యవసానాలు తప్పవు" అని ఆనాటి కొన్ని ఉదాంతాలను ఉదహరిస్తూ అన్నారు.

నా అభిప్రాయంలో తెలంగాణావారి సగటు సంస్కృతి వారికి 'స్పాంటేనియస్' గా అంటే ప్రకృతిసిద్ధంగా వచ్చిన 'మానస' సంస్కృతి'. సీమాంధ్ర వారి సగటు సంస్కృతి 'కల్టివేటెడ్'గా, అంటే 'కాన్షియస్'గా వచ్చిన వ్యాపార సంస్కృతి, తదనుగుణ్యమైన ఆధిపత్య సంస్కృతి. ఆ సంస్కృతులకు వారు కారణం కాదు, వారి గత చరిత్రలు, నేపథ్యాలు కారణాలు. సమైక్యాంధ్ర ఏర్పడినాక సీమాంధ్రవారి వ్యాపారపరమైన కృత్రిమ సంస్కృతి తెలంగాణావారి సహజ సంస్కృతిని చాలావరకు దెబ్బతీసింది. 'సమైక్యాంధ్ర' ఇలాగే కొనసాగితే తెలంగాణావారికి ఇకముందు తెలంగాణా సంస్కృతి యనునది ఇంకేమీ మిగులదు. అందుకే వారి తాపత్రయమంతా వారి సహజసంస్కృతిని, సహజ ప్రకృతిని ఎలాగైనా కాపాడుకోవాలని. దానికి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర స్థాపన తప్ప మరోమార్గం లేదు.

తెలంగాణా ఆంధ్రా ప్రాంత సాంస్కృతిక వ్యత్యాసాల నేపథ్యాలు

-డాక్టర్ కొండలరావు వెల్చాల

'తెలంగాణా కల్చరల్ ఫోరమ్' ఆంధ్రా ప్రాంత సంస్కృతికి, తెలంగాణా ప్రాంత సంస్కృతికి చారిత్రాత్మక, భౌగోళిక, ఆర్థిక, విద్యా విషయక పరమైన మౌలిక వ్యత్యాసాలున్నాయి కనుక రెండు ప్రాంతాలు కలిసి ఉండడం సాధ్యం కాదని అంటుంది. ఆ విధంగా శ్రీకృష్ణ కమిటీకి నివేదిక సమర్పించింది. ఈ వ్యత్యాసాలకు వ్యక్తులు కాదు కారణం వ్యవస్థలు, వాటి నేపథ్యాలు అని అభిప్రాయపడింది. ఈ భేదాలు పైపైవి కావు, చాలా లోతైనవి కనుక భౌగోళిక సమైక్యతకు ఎంత ప్రయత్నించినా మానసిక సమైక్యత కుదరదని ఉద్ఘాటించింది.

నిరంతరం కలహాలతో కలిసి ఉండడంకన్నా విడిపోయి స్నేహభావంతో, బాంధవ్యభావంతో వుండడమే మంచిదని సూచించింది. ప్రత్యేక తెలంగాణా కోరిక కేవలం ఆర్థికపరమైన కోరిక మాత్రమే కాదు, అంతకన్నా మిన్నగా సాంస్కృతికపరమైన కోరిక యని, ఆత్మ గౌరవానికి చెందిన కోరికయని ప్రస్ఫుటంగా ప్రకటించింది.

ఇపుడు ఈ సాంస్కృతిక వ్యత్యాసాలు, వాటికి చెందిన నేపథ్యాలు, చరిత్రలు ఎలాంటివో పరిశీలిద్దాం.

ఐదు వందల యేండ్లకు పైగా ఆంధ్రా ప్రాంతం బ్రిటీష్ పాలనలో ఉండింది. బ్రిటీష్ వారి పరిపాలనంతా అధికారాన్ని వారి స్వంత ప్రయోజనాల కొరకు ఎలా వాడుకోవాలో, భారతదేశాన్ని ఎలా ఒక కాలనీగా కొల్లగొట్టాలో, పారిశ్రామికవేత్తలను, పెట్టుబడీదారులను, భూస్వాములను, దళారీలను ఎలా చేబట్టి, వారికి లాభాలు చేకూర్చి బ్రిటీష్ రాజ్యానికి ఎలా వాడుకోవాలో ఆ నీతికి, రీతికి, సంస్కృతికి చెందింది.

ఇది ఒక విధమైన కొల్లగొట్టు అధికార సంస్కృతి. ఒక విధమైన మనస్తత్వం, psychology. మరొకవిధంగా చెప్పాలంటే ఒక విధమైన మానసిక రుగ్మత, బలహీనత, వ్యసనం. ఇది కొన్ని సమాజాలకు, ప్రాంతాలకు, దేశాలకు చారిత్రకంగా సంతరించే పరిపాలనా సాంప్రదాయం. ఇలాంటి అధికార నైజం ఆంధ్రాప్రాంత పరిపాలకులకు శతాబ్దాల బ్రిటీష్ వారి పరిపాలన వలన వారసత్వంగా వచ్చింది. దీనికి తోడు బ్రిటీష్ వారి "విభజించు పాలించు"యను నీతి కూడా, రీతి కూడా.

దీనికి విరుద్ధంగా తెలంగాణాప్రాంతం రాచరిక వ్యవస్థ ద్వారా పరిపాలించబడింది. రాచరికంలో అహం అధికార దర్పం, అలసత్వమెక్కువ, ఆధునికత తక్కువ.

ఒక వ్యవస్థ అధికారాన్ని 'కాజేయడం' కొరకనుకునే వ్యవస్థయితే, ఇంకొకటి అధికారం అధికారం కొరకనుకునే వ్యవస్థ, ఒక వ్యవస్థ అధికారం కేవలం స్వలాభం కొరకనుకుంటే, ఇంకొకటి భేషజం కొరకనుకునే వ్యవస్థ. ఒక వ్యవస్థ 'capitalism'కు చెందిందైతే, ఇంకొకటి 'feudalism'కు చెందింది. feudalism లో రాపిడి ఎక్కువ కాని దోపిడి తక్కువ. capitalismలో రాపిడి తక్కువకాని దోపిడి ఎక్కువ.

ఈ అధికారపరమైన తేడాలవలన ఇరుప్రాంతాల సంస్కృతులు వేరువేరని చెప్పక తప్పదు. ఒకటి కొల్లగొట్టు సంస్కృతికి చెందిందయితే ఇంకొకటి 'కొల్లాయి కట్టితేనేమి' యని నీలిగే సంస్కృతికి చెందింది.

తెలంగాణా ఆంధ్రా ప్రాంతాలకు చెందిన ఆర్థిక పరమైన సంస్కృతుల్లో కూడా తేడాలున్నాయి. అవి వాటి వాటి ఆర్థిక నేపథ్యాలకు చెందినవి.

బ్రిటీష్‌వారు ప్రధానంగా వారి పరిపాలనా సౌకర్యాల కొరకు, ఆర్థిక ప్రయోగాల కొరకు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని ఒక భాగమైన ఆంధ్రాప్రాంతంలో అభివృద్ధికర పథకాలు చాలా చేబట్టారు. ఆ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు, తంతి తపాలా సౌకర్యాలు, విద్యా వైద్య సౌకర్యాలు, దిగుమతి ఎగుమతి సౌకర్యాలు, రక్షణ భద్రతా సౌకర్యాలు, వ్యాపార వాణిజ్య పారిశ్రామిక సౌకర్యాలు, సాగునీటి సౌకర్యాలు మున్నగునవి ఎన్నో కల్పించారు. అవన్నీ ఆంధ్రాప్రాంత ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డాయి. అవి అచటివారి ఆదాయాలు పెంచాయి. ఆ ఆదాయాల పెంపకాల వలన అచటివారికి ఎంతో 'surplus money' చేతికొచ్చింది. దానిని వారు అనేకానేక ఆర్థికరంగాలలో పెట్టుబడులు పెట్టి మరింత పెంచుకున్నారు. ఆంధ్రాప్రాంతంలోని పరిపాలనా పరమైన ఆర్థికాభివృద్ధి అటు పారిశ్రామికాభివృద్ధికి, వాణిజ్యాభివృద్ధికి దోహదం చేసింది, ఇటు పెద్ద పెద్ద నగరాలను పెంపొందించింది. ఇవన్నీ కలిసి ఆంధ్రాప్రాంత ఎకానమీని ఒక 'mini capitalistic economy' గా మార్చాయి. అలా ఆంధ్రా ప్రాంతానికి 'capitalistic economy'కి చెందిన అన్ని దుష్ట లక్ష్యాలు, దుష్ట లక్షణాలు సంతరించాయి.

దానికి విరుద్ధంగా తెలంగాణా ప్రాంతమంతా చాలావరకు పల్లీయ సంస్కృతిగా, వ్యవసాయిక సంస్కృతిగా, ఆరాటాలెక్కువ, ఆదాయాలు తక్కువకు చెందిన సంస్కృతిగా రూపొందింది. సాగునీటి కొరతవలన వ్యవసాయాలు కూడా "బ్రతకలేక బడిపంతులు పని" యను లాంటివిగా పరిణమించాయి. తెలంగాణాలో పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్యాభివృద్ధి, విద్య వైద్యాభివృద్ధి, మౌలిక వనరుల అభివృద్ధి కొరత కొట్టొచ్చినట్లు కనబడేది. ఒక్క హైదరాబాద్ పట్టణం తప్ప తెలంగాణాలోని అన్ని ప్రాంతాలు అంతంతమాత్రం అభివృద్ధి చెందిన ప్రాంతాలుగానే ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆంధ్రాప్రాంతపు ఆర్థిక వ్యవస్థ 'exploiting' వ్యవస్థగా

పుంజుకుంటే, తెలంగాణాప్రాంతపుది 'exploited' ఆర్థికవ్యవస్థగా దిగజారింది. అది అప్పటికీ ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది.

ఆంధ్రా తెలంగాణా ప్రాంతాల తేడాకు చెందిన మరొక కారణం వాటి భౌగోళిక నేపథ్యం.

ఆంధ్రాప్రాంతానికి విశాలమైన సముద్రతీరముంది. సముద్ర తీరముండడం సముద్రమంత సంపదతో సమానం. సముద్రతీరం రవాణా సౌకర్యాలకు, ఎగుమతుల దిగుమతులకు ఎంతో సహకరిస్తుంది. సముద్రంలోని మత్స్య సంపద, రతనాల పవడాల సంపద, పర్యాటక ఆదాయ సంపద ఎన్నో పరిశ్రమల సంపదలతో సమానం. సముద్రం పారిశ్రామిక వాణిజ్య సంస్కృతిని పెంచుతుంది. 'enterprenarial' 'adventurous' సంస్కృతిని కూడా. దీనికి ఇంగ్లాండ్ కంటే గొప్ప ఉదాహరణ మరొకటుండదు. అలాంటి సముద్రతీరం తెలంగాణాకేదీ అలాంటి సంస్కృతి పెంచుకోవడానికి?

భౌగోళికంగా తెలంగాణా ప్రాంతపు శీతోష్ణ (climatic) స్థితి కన్నా ఆంధ్రాప్రాంత శీతోష్ణ స్థితే పనులకు, పనిచేసేవారికి అనుకూలమైనది. దానివలన అచటి శ్రామికులు అలసిపోకుండా రోజుకు ఎన్నో గంటలు పనిచేయగలరు. తెలంగాణావారి వెనకబాటుతనానికి ఒక కారణం తెలంగాణా ప్రాంతపు అతి ఉష్ణమైన వాతావరణమని కూడా చెప్పకతప్పదు.

తెలంగాణా ప్రాంతపు భూములకన్నా ఆంధ్రాప్రాంతపు భూములు సమానంగా ఉంటాయి. అందువలన సేద్యానికి, నీటి నిలువలకు అనుకూలమయినవి. అందుకే ఆంధ్రాప్రాంతపు భూములు 'commercial crops' కు అనువుగా ఉంటాయి. ఆంధ్రా ప్రాంతపు భూములు తెలంగాణా ప్రాంత భూములకన్నా సగటుగా ఎక్కువ సారవంతమైనవి కూడా. అంతేకాదు ఆంధ్రాప్రాంతంలో సాగునీటి వసతులు కూడా ఎక్కువ కనుక పంటలు ఫలితాలు కూడా ఎక్కువే. మిర్చి, పత్తి, పొగాకు, పసుపు, చెరుకు మున్నగు 'cash crops' అన్నీ ఆంధ్రా ప్రాంతంలోనే ఎక్కువ. అలాగే పళ్ళతోటలు కూడా.

ఇలాంటి భౌగోళిక పరిస్థితులవలన ఆంధ్రాప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఆధునిక పారిశ్రామిక సంస్కృతి సమకూరింది. దాని పర్యవసానంగా 'materialistic, capitalistic' సంస్కృతి సంతరించింది.

తెలంగాణా ఆంధ్ర ప్రాంత సంస్కృతుల భేదాలకు మరొక బలీయమైన కారణం ఆ ప్రాంతాలలోని విద్యా భేదాలు.

బ్రిటీష్‌వారు వారి లాభాలకొరకు, వారి పరిపాలనా సౌకర్యాల కొరకు ఆంగ్లభాషను, ఆంగ్లమాధ్యమం ద్వారా విద్యా బోధనను అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఐదువందల యేండ్ల క్రితమే ప్రవేశపెట్టారు. ఎవరెంత లేదన్నా కాదన్నా ఆంగ్ల భాష ఆధునిక విద్యకు అనుకూలమైన భాష యనక తప్పదు. ఆ భాష వలన ఆంధ్రాప్రాంతం

వారికి ఆధునిక విద్య చాలానాళ్ళనుండి అబ్బింది. అలాంటి పరిస్థితి అప్పట్లో తెలంగాణాలో లేదు. ఉర్దూభాష ద్వారా నేర్చుకున్న తెలంగాణా చదువులు ఆంధ్రప్రాంతంలో ఆంగ్లభాష ద్వారా నేర్చుకున్న చదువుల కన్నా ఆధునికతలో ఎంతో వెనకనే చెప్పాలి. అలాగే అప్పట్లో తెలంగాణా ప్రాంతంవారు అటువారి సులభమైన తెలుగుభాష ద్వారా విద్యాధ్యయనం చేయలేక పోయారు, ఇటు ఆంగ్లభాష ద్వారా.

ఆంధ్రాప్రాంతంవారి ఆంగ్లేయ భాష ద్వారా అబ్బిన ఆధునిక విద్య వారికి ఉద్యోగాలలో, వ్యాపారాలలో, పరిశ్రమలలో, వారి వనరులను వసతులను అభివృద్ధి చేసికోవడంలో ఎంతో అనుకూలించింది.

ఆంధ్రా తెలంగాణా ప్రాంతాల సాంస్కృతిక భేదాలకు చెందిన ఇంకొక అంశం ఆయా ప్రాంతాలలోని విద్యాలయాల స్థాపనలకు చెందింది.

ఒకప్పుడు తెలంగాణాలోని అన్ని విద్యాలయాలు ప్రభుత్వ విద్యాలయాలే. ఒకప్పటి ఆంధ్రాప్రాంతపు విద్యాలయాలు చాలావరకు ప్రైవేట్ విద్యాలయాలే. ప్రభుత్వ విద్యాలయాలలో ఫీజులు ఎప్పుడూ తక్కువే కనుక వాటిలో చేరేవారందరూ అప్పటికీ ఇప్పటికీ అన్ని కులాలకు, వర్గాలకు, ఆర్థిక స్థాయిలకు చెందినవారే. ప్రైవేటు విద్యాలయాలలో చేరేవారు చాలావరకు సంపన్నులు, అగ్రకులాలకు చెందినవారే. అందుకే స్థూలంగా ప్రభుత్వ విద్యాలయాలలో చదివేవారి సంస్కృతి ప్రైవేటు స్కూళ్ళలో చదివేవారి సంస్కృతికన్నా వేరుగా ఉంటుంది. ప్రభుత్వ విద్యాలయాల్లో చదివేవారి సంస్కృతిని మనం 'inclusive' సంస్కృతిగా, ప్రభుత్వేతర విద్యాలయాల్లో చదివేవారి సంస్కృతిని మనం 'exclusive' సంస్కృతిగా పరిగణించవచ్చు. ఎక్కువ డబ్బు వెచ్చించి చదివే వారి 'culture' తప్పనిసరిగా ఎక్కువ సంపాదించాలను నైజానికి చెందిందే అవుతుంది. ఎక్కువ ఫీజులు చెల్లించేవారు వారి విద్యా వ్యయాన్ని ఒక పెట్టుబడిగా పరిగణిస్తారు. అలాంటి విద్యాలయాలు నడిపేవారు కూడా వాటిని అలాగే చూస్తారు. అలాంటి విద్య ఒకానొక విధమైన దోపిడీదారీ, కొల్లగొట్టు సంస్కృతికి, పేరాశకు దారితీస్తుంది. ఒక్క హైదరాబాదును మినహాయిస్తే తెలంగాణా ప్రాంతంవారు అప్పటికీ ఇప్పటికీ ఎక్కువ పెట్టుబడులు పెట్టి విద్యాలయాలు స్థాపించగలిగిన వారూ కారు, విద్యలు అలా ఆర్జించేవారూ కారు. వారి స్తోమతలు అలాంటివి కావు, వారి సంస్కృతులూ అలాంటివి కావు.

బ్రిటిష్ పరిపాలన వలన ఆంధ్రులకు అబ్బిన మరొక సంస్కృతి entrepreneurial సంస్కృతి.

ఇది ఒకానొకవిధమైన పారిశ్రామిక వాణిజ్యపరమైన ఆర్థికపరమైన కౌశల్యం. ఇది పెద్ద పరిశ్రమలు, పెద్ద స్థాయి వ్యవసాయాలు, వాణిజ్యాలు, ఎగుమతులు దిగుమతులున్న వాతావరణంలో ఎక్కువ అభివృద్ధి చెందుతుంది. Entrepreneurs అనేవారు డబ్బుకలవారు, పెట్టుబడి పెట్టగలిగేవారే కానక్కరలేదు. సాధారణంగా

వారు అలాంటివారు కానేకారు. వారికి ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య అవగాహన, స్ఫూర్తి, ముందుచూపు, లాభాలకు చెందిన 'sixth sense' అంటామే అలాంటివి ఎక్కువుంటాయి. వాటికి కావలసిందల్లా అవకాశాలను, వాతావరణాలను వాసన చూడగల, పసిగట్టగల శక్తి. వాటికి కావలసిందల్లా పదిమందితో పరిచయం, ఒక విషయాన్ని, ఒక అవకాశాన్ని ప్రచారం చేసి పదిమందిని ఆకట్టుకొనే ప్రజ్ఞ, వారినుండి సహాయసహకారాలు సేకరించగల యుక్తి, ఒక idea ను చలామణిలోకి తెచ్చే చురుకుదనం. వారికి అన్నిటికన్నా ముఖ్యమైనది అవకాశాలకు చెందిన vision. అది బ్రిటిష్‌వారికి పుష్కలంగా ఉండేవి. ఆ లక్షణాలు వారినుండి ఆంధ్రాప్రాంతం వారికి కూడా పుష్కలంగా సమకూరాయి. దానికి ఆంధ్రాప్రాంతపు భౌగోళిక నేపథ్యం, వ్యవసాయాభివృద్ధి, విద్యాభివృద్ధి, వాణిజ్యాభివృద్ధి కూడా ఇతోధికంగా సహకరించాయి. అంతపాటి నేపథ్యం తెలంగాణా వారికి లేదు. దానికి వారి వారి నేపథ్యాలే కారణం.

ఆంధ్రా ప్రాంతీయులు తమిళుల లాగా, మళయాళీల లాగా, గుజరాతీల లాగా ఎచ్చటికి వెళ్ళినా బ్రతకగలరు. వారికి అలాంటి entrepreneurial శక్తి, యుక్తి, చతురత, చాకచక్యం ఉంది. Entrepreneurial సంస్కృతికి చెందిన ముఖ్యమైన శక్తులు అవకాశాలను కనుగొనగలగడం, ముందుచూపు, risk taking capacity, speculative sense, adventurous instinct ఇవి అబ్బాలంటే వలసినంత అనుభవం కావాలి, వారసత్వం కావాలి, వాతావరణం కావాలి. ఇవన్నీ ఆంధ్రాప్రాంతం వారికి అధికంగా, సుదీర్ఘంగా అబ్బాయి వారికి చెందిన చారిత్రక, భౌగోళిక కారణాల వలన.

Entrepreneurial కౌశల్యానికి చెందిన అనేకానేక పార్శ్వాలలో పరిపాలనలను, పరిపాలకులను వశపరచుకో గలిగే వారితో పనులు చేయించుకోగలిగే 'చాణక్యనీతి' కూడా ఒక పార్శ్వం. ఈ కాలంలో దానిని 'the art of lobbying, influencing and managing' అని అంటున్నారు management శాస్త్రంలో. ఈ కౌశల్యం ఆంధ్రాప్రాంతపు Entrepreneursకు చాలా ఉంది. అందుకే కదా వారు పరిపాలనలు, పరిపాలకులు మా చేతిలో ఉండాలని ప్రాకులాడుతున్నారు. పరిపాలనపై అధిపత్యం వారికి పరిపాలన కొరకు కాదు, వాణిజ్యం కొరకు, వ్యాపారం కొరకు, వనరుల వసతుల సౌకర్యాలపై ఆధిపత్యం కొరకు, అధిక లాభాల కొరకు. ఇవన్నీ వారికి డా॥ రామ్ మనోహర్ లోహియా గారన్నట్లు కేవలం 'decent living' కొరకు కాదు, 'enlarged standard of living' కొరకు. ఈ 'enlarged standard of living'యను కోరికకు ఒక గెట్టంటూ (limit) ఉండదు. ఇక్కడే వస్తుంది పేచీ అంతా, ఘర్షణంతా. ఒక ఘర్షణ 'decent living' కొరకైతే, ఒక ఘర్షణ 'enlarged standard of living' కొరకు. ఒకటి జీవించుట కొరకైతే, ఒకటి సౌఖ్యంగా, మరింత సౌఖ్యంగా జీవించుట కొరకు. ఈ ఘర్షణ తెలంగాణా ఆంధ్రా ప్రాంతాలకు

చెందిన ఘర్షణ మాత్రమే కాదు. ఇది యావత్ప్రపంచంలో అప్పుడప్పుడు అచటచట జరిగిన, జరుగుతోన్న ఘర్షణ సంఘర్షణే. కాలమే నిర్ణయిస్తుంది దాని పర్యవసానం.

Entrepreneur సంస్కృతిని విద్యలాగే, పరిజ్ఞానంలాగే, తెలివిలాగే, ప్రతిభలాగే మంచి కొరకూ వాడుకోవచ్చు, చెడు కొరకూ వాడుకోవచ్చు. దానిని బ్రిటీష్ వారు 'colonization' కొరకు వాడుకున్నారు. దురదృష్టవశాత్తు ఆంధ్రాప్రాంతం పాలకులు కూడా ఆ సంస్కృతిని తెలంగాణాను ఒక కాలనీగా మార్చడానికి, కొల్లగొట్టడానికే వాడుకున్నారు.

Entrepreneur శక్తంటూ ఒకటుంటే అదున్నవారు దానిని వారెచటున్నా వాడుకొని బ్రతకగలరు. ఎప్పటినుండో తమిళులూ, మళయాళీలు, గుజరాతీలు ఆ పని చేస్తున్నారు. కనుక, తెలంగాణా విడిపోతే ఆంధ్రులు భయపడవలసిన అవసరమేమాత్రమూ లేదు. ఎందుకంటే, వారికి కూడా వారిలాగా బ్రతకడం ఎలాగో తెలుసు. దానికి చెందిన సంస్కృతి ఎలాంటిదో తెలుసు. కనుక తెలంగాణా విడిపోతే, హైదరాబాదు నగరం తెలంగాణా వారికి మాత్రమే దక్కితే ఆంధ్రాప్రాంతం వారు పెద్దగా విచారపడవలసిన, ఆందోళన చెందవలసిన అవసరమేమీ లేదు, వారిచేతిలో వారి entrepreneurial సత్తా ఉన్నంతవరకు. అది వారికి పుష్కలంగా ఉంది. విడిపోతే ఏమవుతుంది? భూములు విడిపోతాయి కాని మనుషులు విడిపోతారా, వారి లావాదేవీలు, వ్యవహారాలు విడిపోతాయా? వారి దారులు ఆగిపోతాయా? అటాంటప్పుడు వారెందుకు భయపడాలి విడిపోతే ఏమైపోతామోనని? విడిపోతే వారికున్న ఎచటైనా బ్రతకగల శక్తి, యుక్తి, చతురత, చాకచక్యం ఎక్కడికి పోతుంది? అదీ ఈ 'globalisation' కు చెందిన కాలంలో, తెలివుంటే ఎచటైనా బ్రతకుటకు అనుకూలమైన, అవకాశాలున్న కాలంలో. ఉద్యోగాల కొరకు, అవకాశాల కొరకు ఆంధ్రా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలేమిటి ప్రపంచంలో ఏచోటికైనా పోగలిగే ఈ కాలంలో ఎన్ని నగరాలు లేవు హైదరాబాదు లాంటివి ఎవరైనా బ్రతకడానికి చేతిలో శక్తి ఉంటే, మేధలో యుక్తి ఉంటే, హృదయంలో కాస్త మంచితనమే పెంచుకుంటే. అలాంటప్పుడు బెంగదేనికి, బెంబేలు దేనికి?

పైన పేర్కొన్న ఎన్నో కారణాలవలన ఆంధ్రాప్రాంతం మధ్య తెలంగాణా ప్రాంతం మధ్య సాంస్కృతిక పరమైన భేదాలు మనకు అనేకానేకం కనబడుతాయి. ఇలాంటి లోతైన సాంస్కృతిక భేదాలు కలవారు సమైక్యంగా కొనసాగడానికి ఎలా అస్కారముంటుంది? ఇలా అంటే తెలంగాణా ప్రాంతమంతా ఒకేలాంటిదని, ఆంధ్రాప్రాంత మంతా ఒకేలాంటిదని, ఆంధ్రాప్రాంతం వారందరూ ఒకేలాంటివారు, తెలంగాణాప్రాంతం వారందరూ ఒకేలాంటివారని కాదు అర్థం. అచటి సంస్కృతికి ఇచటి సంస్కృతికి ఏమాత్రం సంబంధం లేదనీ కాదు. లేక ఒక సంస్కృతి పెద్దది, ఒక సంస్కృతి చిన్నదనీ కాదు. ఆయా చారిత్రాత్మక, భౌగోళిక నేపథ్యాలను శ్రీ కృష్ణ

కమిటీ దృష్టికి తీసుకొని రావడం మాత్రమే. సమస్యను పరిష్కరించడానికి సమన్వయం కుదరని సంస్కృతులను కూడా పరిగణ లోకి తీసుకోవాలని వారిని కోరడం మాత్రమే.

ఆంధ్రాప్రాంతం వారు ఈ పేర్కొన్న వాస్తవాలను కేవలం నేపథ్యానికి చెందినవిగా మాత్రమే తీసుకోవాలి కాని, ఏవో నేరారోపణలుగా తీసుకోగూడదు. సాంస్కృతిక తేడాలకు వాటి వాటి చరిత్రలు, నేపథ్యాలు, వ్యవస్థలు, భౌగోళిక వ్యత్యాసాలే కారణం కాని వ్యక్తులు ఎలా కారణమవుతారు? మరీ సామాన్య ప్రజలు, సాధారణ పౌరులు ఎలా కారకులవుతారు? సదరు ప్రజలు ఎచటి వారైనా ఒకేలాంటివారే కదా! అణ్యం పుణ్యం ఎరగని అమాయకులు. పరిపాలకులు, రాజకీయులే కదా వారిని ప్రక్కతోవ పట్టిస్తారు!

భాష కొరకు భాషా రాష్ట్రమా లేక రాజకీయాల కొరకా?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఈ మధ్య జరిగిన 'సిపిఎం పార్టీ' వార్షికోత్సవంలో ఆ పార్టీవారు "మా పార్టీ. భాషా రాష్ట్రాల విచ్ఛిన్నతకు, విభజనకు వ్యతిరేకం కాని చిన్న రాష్ట్రాల స్థాపనకు కాదు" అని ఒక ప్రకటన చేశారు. "ఇది లోపల ఎన్నో చిన్నా చితుకూ కుల కుంపట్లు. ముఠా కుంపట్లు పెట్టుకొని చీలిపోవచ్చు కాని బైటి నామ ఫలకం మాత్రం ఒకటే ఉండాలి" అనడం లాంటిది. కాని నామఫలకం మాత్రం ఉంటేనే సరిపోతుందా? దాని పేరట లోపల ఎంత వేర్వేరుగా ఉన్నా ఫరవాలేదా? అలాగే భాష కొరకు ఒక భాషారాష్ట్రమంటూ ఏర్పరచుకుంటే సరిపోతుందా? భాష గంగపాలు, గోదావరి పాలైనా ఫరవాలేదా? సమైక్యం! సమైక్యం! అని నినదిస్తే సరిపోతుందా, సమైక్యంగా ఉండాలని ఒక రాష్ట్రంగా ఏర్పడినవారు ఐక్యంగా కూడా ఉండనక్కరలేదా? సమైక్యతకు మొదలు ఐక్యత కుదరాలిగా? భావార్థం పోయి భాషార్థం మాత్రమే మిగిలితే సరిపోతుందా? తెలుగువారందరూ కలిసి మెలిసి ఉండుటకు తెలుగు కాని, తెలుగు కొరకే తెలుగు కాదుగదా?

ఇంగ్లీషులో "కమ్యూనికేషన్" అను పదమొకటుంది. దాని అసలర్థం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మాత్రమే కాదు, ఒకరి నొకరు ఆ మాటల ద్వారా అర్థం చేసికోవడం. అందుకు భాష ఒక వాహిక మాత్రమే. ఒక్కొక్కప్పుడు భాషుంటుంది కాని అర్థం చేసికోవడం, అర్థం కావడం ఉండదు. మాట్లాడే భాషను ఒకరొకవిధంగా అర్థం చేసుకుంటే మరొకరు మరొక విధంగా అర్థం చేసుకుంటారు. అలాంటప్పుడు నిజమైన కమ్యూనికేషన్ ఉండదు. కనుక భాష భాష కొరకే ముఖ్యం కాదు, భాష మాట్లాడే వారి సఖ్యత కొరకు ఐక్యత కొరకు ముఖ్యం కాని. సఖ్యత సడలితే ఐక్యత భాష దానిని చక్కబెట్టజాలదు. దానికంత శక్తి ఉండదు. భాషకు డిపెండెంట్ శక్తే కాని ఇండెపెండెంట్ శక్తి ఉండదు. భావ శక్తే భాషకు శక్తి. భావం కుంటుపడితే భాష కూడా కుంటు పడుతుంది.

"మేము భాషా రాష్ట్రాల విభజనకు వ్యతిరేకులం కాని చిన్న రాష్ట్రాల స్థాపనకు వ్యతిరేకులం కాదు" అని అనే సిపిఎం వారు ఒకటి గమనించాలి. అలాగైతే అలాంటి వాదన వారికి, వారి సిద్ధాంతానికి కూడా వర్తించాలి కదామరి? కాని అలా జరగలేదు, జరగడం లేదేమరి! ఒకప్పటి ఒకే ఒక సిద్ధాంతానికి చెందిన ఒకే ఒక కమ్యూనిస్టు పార్టీ ఇపుడు అనేకానేక సిద్ధాంతాలకు చెందిందిగా చీలిపోయింది. అలాంటిది భాషా రాష్ట్రాలకు కూడా వర్తించదా మరి? భాష ఒకటే అయిన ఖండాలన్నీ, దేశాలన్నీ, రాష్ట్రాలన్నీ, ప్రాంతాలన్నీ ఒకే ఒకటిగా ఏర్పడ్డాయా? ఒకే భాష మాట్లాడే ఒకప్పటి

ఇంగ్లండ్ ఇప్పుడు మూడుగా చీలిపోయింది. అలాగే ఒకప్పుడు ఒకే భాష మాట్లాడే రష్యా, కొరియాలాంటివి, ఒకే హిందీ భాష మాట్లాడే ఉత్తర భారత దేశంలో ఎన్నో హిందీ మాట్లాడే రాష్ట్రాలు ఎన్నో రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. కనుక ఒకే భాష మాట్లాడే రాష్ట్రాలన్నీ ఒకటిగానే ఉండిపోవాలనే వాదం సరయింది కాదు. "Workers of the World Unite, you have nothing to loose but your chains" అన్నాడు Marx. ఒక విధంగా చూస్తే ప్రధాన మంత్రి నుండి మామూలు కార్మికుని వరకు అందరూ వర్కర్సే, కాని వారిలో అనేకానేక స్థాయిలు, శ్రేణులుంటాయి. అది ఒక స్లోగన్‌గా పనికొస్తే పనికి రావచ్చు కాని నిజ జీవితంలో ఎలా పనికొస్తుంది? నిజ జీవితంలో అందరూ ఒకటే ఎలా అవుతారు? అందుకే కదా ఇపుడు కమ్యూనిస్టు దేశాల్లో ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను బట్టి వారిలో వారికి భేద విభేదాలొచ్చాయి. అలాగే తెలుగు వారు మాట్లాడే తెలుగంతా ఒకటే కాదు, తెలుగు వారంతా ఒకేలాంటి వారు కారు, భాష పేరట భాషారాష్ట్రాన్ని అంతగా సాగదీయడానికి, అది విడిపోగూడదని అంతగా అనడానికి.

అయినా, ఒకందుకు దానినంగీకరించినా, ఇపుడు మనకు భాషా రాష్ట్రమనునదొకటి దక్కింది కాని భాషెక్కడ మిగిలింది ఆ భాష పేరట వాదించడానికి? తెలుగు భాషకు ఎప్పుడో తెగులు పట్టింది. అది ఇపుడు నామకార్థంగా మాత్రమే మిగిలింది. నిజానికి దానికిపుడు ప్రథమ భాషా స్థాయి కాదు ద్వితీయ భాషాస్థాయి కూడా దక్కడంలేదు. అటు విద్యాలయాలను, ఇటు ఉద్యోగాలిచ్చే ప్రభుత్వాలయాలను "భవతీ భిక్షాందేహి" యని అడుక్కోవలసి వస్తోంది దాని రక్షణ పరిరక్షణ కొరకు. తెలుగుకు కనీసం రెండవ భాషా స్థాయి నయినా దక్కనీయండి. అలాగైనా దానిని బోధించే అవకాశం కల్పించండి. పరిపాలనా భాషగా దానిని "కనీసం నామఫలకాల" కొరకు వాడే అవకాశమైనా ఈయండని దిగజారిపోయి అడుక్కోవలసి వస్తోంది అధికార భాషా సంఘానికి కూడా.

ఇపుడు తెలుగు మాధ్యమం ద్వారా చదివేవారే కాదు. తెలుగునొక భాషగాకూడా చదివేవారు కరువైపోతున్నారు. మన ఱతరం పిల్లలు తెలుగు మాట్లాడితే తెలుగు మాట్లాడినట్లుండదు. అదేదో వేరే భాష మాట్లాడినట్లుంటుంది. దానిలో తెలుగు యాసా ఉండదు. తెలుగు శ్వాసా ఉండదు. ఆంగ్ల భాష ఇపుడు అంతటా చలామణిలోకొచ్చింది. అన్ని రంగాలకది ప్రాకింది, ఇంకా త్వరత్వరగా ప్రాకుతూనే ఉంది. ఆంగ్ల భాష ద్వారా విద్యాబోధన వలన ఇంకా కొన్నాళ్ళకు తెలుగు మాధ్యమం మాయమవడం ఖాయం. తెలుగు భాష ద్వారా విద్యాబోధన మాయమయాక మరికొద్ది రోజుల్లో తెలుగు భాషా బోధన కూడా మాయమవడం తథ్యం. ఎందుకంటే పరిపాలనా భాషగా, విద్యా భాషగా ఉపయోగించని భాష, బ్రతకడం అసంభవం కనుక. మరి ఇక దేనికొరకు "భాషరాష్ట్రం"? దేనికొరకు సమైక్యంగా ఉండడం? రాజకీయాల కొరకా? రాజకీయుల కొరకా?

సమైక్యవాదులైనా, విభజన వాదులైనా వారివారి స్వార్థ ప్రయోజనాల కొరకు, రాజకీయ ప్రయోజనాల కొరకు ఈ రాష్ట్రం సమైక్యంగా ఉండాలని ఒకరు విభజించబడాలని, ఒకరు విభజించగూడదని ప్రాకులాడేవారేకాని అయ్యో! మన భాష పోతోందే! తద్వారా మన సంస్కృతి పోతోందే! తద్వారా మనం మన ఉనికిని, అస్తిత్వాన్ని మన తెలుగుదనాన్ని కోల్పోతున్నామే నని వాపోయేవారు ఎందరున్నారు వారిలో? అందరూ ఆర్థిక విషయాల గురించి మాట్లాడే వారే కాని భాషా విషయాల గురించి మాట్లాడే వారేరీ? అలాంటి వారికి అర్హతెలా ఉంటుంది భాషారాష్ట్రం పేరట మాట్లాడడానికి? భాష కొరకు వారేం చేస్తున్నారని భాషారాష్ట్రం గురించి మాట్లాడడానికి?

ఒకనాటి 'తెలంగాణా ఉద్యమం', దాని పర్యవసానంగా వచ్చిన 'ఆంధ్రా ఉద్యమం' వచ్చిన రోజుల్లో వాటిగురించి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారిని మీ అభిప్రాయమేమిటని అడిగితే, "చెవులే పోతుంటే చెవుల పోగులకొరకు ఏడ్చినట్లుంది ఈ తతంగమంతా" అన్నారట అసలు తెలుగే అడుగంటుతుంటే తెలుగు రాష్ట్రంపై తగాదా ఏమిటి అను అర్థంలో. అవును మరి! వారన్నట్లు అసలు తెలుగే పోతుంటే, తెలుగు భాష పేరట ఏర్పడిన రాష్ట్రం అలాగే సమైక్యంగా ఉండాలని తగాదా పడడం తమాషాగానే అనిపిస్తుంది నాలాంటి తెలుగు భాషాభిమానులకు. అది భాష కొరకు భాషా రాష్ట్రమా? లేక రాజకీయాల కొరకు భాషా రాష్ట్రమా యను అనుమానాన్ని రేకెత్తిస్తుంది.

సమైక్యత కావాలనుటకు ఒకప్పుడు భాషా "సెంటిమెంటే" పని చేసింది. ఆ సెంటిమెంటు వలననే సమైక్యం అయాము కూడా. కాని ఇపుడు ఆ భాషీయులే ఆ భాషకు ఆసాంతం విస్మరించాక, ఆ సెంటిమెంటెలా పనిచేస్తుంది? దాని కొరకు మనం కృషి చేసింది, చేస్తున్నది ఎంత? భాషా రాష్ట్రం విభజించబడకూడదనేవారంతా భాష కొరకు ఎన్ని ఉద్యమాలు చేపట్టారు, ఎన్ని భాషా పరమైన పరిరక్షణ పోరాటాలు జరిపారు? అలాంటప్పుడు ఇపుడా సెంటిమెంటు పేరట ఎలా మాట్లాడుతారు? భాష కొరకు పట్టుదలతో పోరాడని వాళ్లు భాషా రాష్ట్రం గురించి పట్టుపట్టడం ఎలా సమర్థనీయం? అభివృద్ధి పేరట మాట్లాడేవారి భాషనే పోగొట్టుకునే "అభివృద్ధి" ఏమి అభివృద్ధియది? భాష వలననే కదా ప్రధానంగా విద్య మెరుగవుతుంది, మెరుగైన విద్యవలననే కదా అభివృద్ధి సాధ్యమౌతుంది? అలాంటి భాషనే విస్మరింస్తే అది విద్యను విహీనం చేయడం ద్వారా అన్ని అభివృద్ధులను అరికట్టదా? నాబోటి భాషాభిమానికి, భాష కొరకే భాషా రాష్ట్రం కాని భాషేతర కారణాల కొరకు భాషా రాష్ట్రం కాదని విశ్వసించే వారికి భాషా రాష్ట్రం పేరిట ఇప్పుడు జరుగుతోన్న భాషేతర తతంగమంతా అంతుపట్టని అయోమయంగా ఉంది.

ఏ భాషైతే బోధనా భాషకాదో, ఆ భాష నిజమైన పరిపాలనా భాష కూడా కానేరదు. అలాంటప్పుడు దానిని పరిపాలనా భాషగా చేపట్టడం కేవలం నామకార్థమే అవుతుంది కాని నిజంగా అది నిజాయితీగా చేపట్టడం కాదు. అలాంటి నామకార్థపు

భాషాపాలసీ, బోధన భాషా పాలసీ వలన మన పిల్లలు అటు తెలుగు భాషకు, ఇటు ఆంగ్ల భాషకు కాకుండా పోతున్నారు. అలాంటి మన భాషా, విద్యాబోధనా పాలసీలు అత్యధికులను నిర్వీర్యులను, నిరర్థకులను చేస్తున్నాయి. పది పదిహేను శాతం చురుకైన, విద్యార్థులు మాత్రమే ఆంగ్లభాష ద్వారా విద్యాబోధన వలన ఇంటా బయటా ఉన్నతోద్యోగాలు తెచ్చుకోగలుగుతున్నారు. తక్కిన వారు ఆ భాష నేర్చుకోలేక మామూలు వారిగా మిగిలిపోయి ముప్పుతిప్పలు పడుతున్నారు. ఈ పది పదిహేను శాతం వారికొరకేనా మరి మనం ఆంగ్ల భాషను అంతగా పొగిడేది, దాని ద్వారా విద్యాబోధన జరగకపోతే మనవారు ముందడుగు వేయలేరు, అభ్యున్నతి చెందలేరని అందలమెక్కి గొంతుచించి అరచేది? ప్రజాస్వామ్యం కేవలం అలాంటి వారి కొరకేనా? పదిమంది కొరకు తొంభై మందిని ఫణం పెట్టుట కొరకేనా? ఆంగ్లభాష వలన ఎంతమంది ఆ భాషలో ప్రావీణ్యులవుతున్నారో వారిని ఆ భాషలో లోతుగా పరీక్షిస్తే తెలుస్తుంది (ఉన్నత ఉద్యోగాల కొరకు, ఉన్నత విద్యలకొరకు పరీక్షలిచ్చేవారిని).

భాషా పాలసీ, విద్యాబోధనా పాలసీ కూడా ఈ దేశంలో అన్ని పాలసీలలాగే ఒక రాజకీయ పాలసీగా, ఓటు బ్యాంకు పాలసీగా రూపొందడం మన దురదృష్టం.

మన భాష విషయంగా మనమిలాంటి పోకడలు పోతూ, ఇలాంటి త్రోవలు త్రొక్కుతూ, భాషా రాష్ట్రం గురించి గొంతులు చించుకొని మాట్లాడడమే కాదు, వీధిలోపడి పోట్లాడడం ఎంత వరకు సమంజసం, సమర్థనీయం? భాషా రాష్ట్రం గురించి అలా మాట్లాడేవారు, పోట్లాడేవారు మొదట భాష గురించి మాట్లాడాలి, పోట్లాడాలి కదా మరి? భాష కొరకు ఏడ్వని ఏకరువు పెట్టనివారు, భాషా రాష్ట్రానికొరకెందుకేడ్వాలి, ఏకరువు పెట్టాలి?

అయినా, కలిసి ఉండడం ముఖ్యమా లేక కలిసిమెలిసి ఉండడమా? కలిసిమెలిసే ఉండలేక పోతే కలిసి ఉండడం దేనికి? సఖ్యతే లేకపోతే ఐక్యతదేనికి? కావలసింది ఐక్యతా లేక సఖ్యతా?

విశ్వనాథ సత్యనారాయణగారు ఒకప్పు డన్నట్లు సంస్కృతులు, సంస్కారాలు, ఆచారాలు, సాంప్రదాయాలు కలవనపుడు సమిష్టి కుటుంబాలెలా చీలిపోతాయో అలాగే సమిష్టి దేశాలు, రాష్ట్రాలు, మతాలు, ప్రాంతాలు కూడా చీలిపోతాయి. దేనికైనా కంపాటిబిలిటీ ముఖ్యం కదా? అదే లేనపుడు, అస్తమానం పోట్లాడుతూ, కీచులాడుతూ కలిసుందాం! కలిసుందాం! అనుకుంటూ కూడా కలహాలకు కాలుదువ్వడం ఎంత మాత్రం సమంజసమూ కాదు, సమర్థనీయమూ కాదు. కలిసి వుండి ఎప్పుడూ కొట్లాడడం మంచిదా లేక విడిపోయి కలిసిమెలిసి ఉండడం మంచిదా? యని సావధానంగా ఆలోచించాలి.

తాత్వికంగా ఆలోచిస్తే మనమేమిటి, కాలమే విడిపోలేదూ – గ్రీష్మం, హేమంతం, వర్షాకాలంగా? సమయమే విడిపోలేదూ – ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంత్రంగా. కాలమే మనను విడదీయదలచుకుంటే మనమెంతవారం దానికడ్డు పడడానికి...! కాల ప్రవాహానకి ఎదురీదడానికి.

తెలుగు భాష పైనే లేని ప్రేమ తెలంగాణాపై ఎలా ఉంటుంది?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

తెలంగాణా మాట వేరు, పాటవేరు, ఆటవేరు, సాపాట వేరు, కనుక తెలంగాణా వారి బాట వేరు. ఈ విషయం తెలంగాణా వారికే కాదు, తెలంగాణా గురించి తెలిసినవారందరికీ తెలుసు. ఈ మాటే తెలంగాణేతర తెలుగువారు ప్రత్యక్షంగా, పరోక్షంగా అడపాదడపా అన్నారు, ఇంకా అంటూనే ఉన్నారు.

పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ గారితో సహా ఎందరో మహానుభావులు ఈమాటే అన్నారు. "మీకూ వారికి కలవదు కాని చూడండి కొన్నాళ్ళు" అని నెహ్రూ గారు అంటే "సరే, చూద్దాం కొన్నాళ్ళని" తెలంగాణా నేతలు ఎన్నో షరతులతో ఒప్పుకుంటే సమైక్య ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది .

పాపం! అమాయకులైన తెలంగాణా ప్రజలకు అప్పట్లో తెలియదు ముమ్ముందు ఏమి కాబోతుందో, ఎలాంటి అన్యాయాలు, అక్రమాలు, అపాయాలు, అధికార దుర్వినియోగాలు జరగవచ్చో, తెలంగాణావారి తలలు తెలంగాణేతరులెన్ని విధాల కొట్టవచ్చో.

ఎలాగైతేనేమి తెలంగాణావారి మూగభాష ఓడి తెలంగాణేతరుల ముసుగుభాష నెగ్గింది, తెలంగాణేతరుల అమాయకభాష ఓడి తెలంగాణేతరుల మాయభాష నెగ్గింది, తెలంగాణా వారి నాడిభాష ఓడి తెలంగాణేతరుల దాడి భాష నెగ్గింది. తెలంగాణేతరుల మాటధ్వనికి వారి మూటధ్వని కూడా జోడయి కాగూడనిది అయింది.

తెలంగాణావారు ఎన్ని అన్యాయాలు నిరూపించినా, వాటికి చెందిన ఎన్ని సాక్ష్యాలు ముందుంచినా, ప్రత్యేక తెలంగాణా కొరకు వారు ఎన్ని త్యాగాలు చేసినా, ఎన్ని ప్రాణాలు పోగొట్టుకున్నా, ఎన్ని ఉద్యమాలు చేబట్టినా, ఎంతకాలం పోరాడినా "శాసనపరమైన మెజారిటీ" పేరిట జరిగేది ఇంకా జరుగుతూనే ఉంది.

తెలంగాణావారికి "where there is majority, there lies the authority" అని ఇపుడు తెలిసింది కాని అది అపుడే తెలిస్తే ఎంతో బాగుండేది. పాపం అంతదూరం ఆలోచించక పోయారు అమాయకులు వారు. ఇంతలో "too late" అయిపోయింది అది. అదే ఇపుడు ఆంధ్రావారి చేతిలో ఆయుధమయిపోయింది. అదేకదా అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రావారి ధీమా. అది మనసులో పెట్టుకొనే కదా అన్ని అగ్రీమెంట్లకూ 'ఊ' కొట్టారు. "చూద్దాంలే, అవి అయేటివా, పోయేటివా, వాటిని పాటించేవారెవరు, పరిపాలనంతా మన చేతిలోనే ఉంటుంది కదా?

పాలసీలను, నియమనిబంధనలను త్రొక్కేసే అధికారమంతా మనదే కదా"యని అన్ని ఒప్పందాలకూ తలూపారు.

అపుడెందుకు ఇపుడు కూడా అదే పని చేస్తున్నారు. నిన్న మొన్ననే కదా అందరూ ఏక కంఠంతో "తెలంగాణా ఇస్తే మాకెలాంటి అభ్యంతరం లేదు లేదని" పదేపదే అంటూ, మ్యానిఫెస్టోల్లో రాస్తూ, బాహాటంగా బహిరంగ సభల్లో చెబుతూనే, ఎపుడయితే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణాకు సముఖత తెలిపిందో అపుడు "వారు ఇస్తారని మేము అనుకోలేదు కనుకనే సరేనంటే సరేనన్నాం" అని చేతులెత్తేశారు. ఇదేనా వారు చాలా గొప్పగా చెప్పుకునే "సంస్కృతి", "సంస్కారం"? ఇదే అయితే ఎలా నమ్మేది వారు ఏది చెప్పినా, ఏది ఒప్పుకున్నా? ఆ విశ్వాసద్రోహమే ఇపుడు తెలంగాణా వారిని సతమతపరుస్తోంది. అదే ఇపుడు తెలంగాణావారిని "ఇక కుదరదు", "ఇక కుదరదు" యను తీవ్రమైన "సెంటిమెంటు"కు గురిచేస్తోంది. తెలంగాణా సెంటిమెంటుకు అదే అతి బలవత్తరమైన కారణం. తక్కినవన్నీ ఒకెత్తయితే ఆ అపనమ్మకం ఇంకొకెత్తు. ఇది సాంస్కృతిక, మానసిక పరమయింది, గాఢమయిన గాయం లాంటిది.

తెలంగాణా ప్రజలు కొన్నాళ్ళు రాచరికపు నిరంకుశత్వానికి గురయ్యారు, కొన్నాళ్ళు ఫ్యూడలిస్టిక్ నిరంకుశత్వానికి. ఇపుడు రాజకీయ authoritaria-nism కు చెందిన నిరంకుశత్వానికి గురవుతున్నారు. పదాలు వేరు కాని వాటి గుణాలు ఒకే తరహావే.

ఒకనాడు తెలంగాణావారు జమిందారీ, జాగీర్దారీ, వతందారీ ఒత్తిళ్ళకు గురైతే ఇపుడు ప్రజాస్వామ్యం పేరిట ప్రభువుల పెత్తనందారీకి, పరిపాలకుల నిరంకుశత్వానికి గురవుతున్నారు. ఒకనాడు "కులదొరల దొరతనానికి" గురైతే ఇపుడు "రాజకీయ దొరల దొరతనానికి" గురవు తున్నారు.(ఆనాటి దొరలు ఎప్పుడో పలాయనం చిత్తగించారు. ఈనాటి రాజకీయ దొరలు ఖాళీ చేయబడిన వారి కుర్చీలలో కూర్చున్నారు) దొరతనం ఎవరిదైతేనేమి దొరతనం దొరతనమే కదా? అది తెలంగాణావారి దొరతనమైతే నేమి, ఆంధ్రుల దొరతనమైతేనేమి. అది భూస్వాముల దొరతనమైతే నేమి, పెట్టుబడిదారుల దొరతనమైతేనేమి? ఏ దొరతనమైనా, అది ఎవరిదైనా గర్హించ దగిందే కదా? దానినుండి ఏదో ఒక విధంగా విముక్తి పొందవలసిందే కదా? కావలసిందల్లా స్వాతంత్ర్యం. అది ఎవరు అణగద్రొక్కితేనేమి? దానికి వ్యతిరేకంగా పోరాడి దానిని సంపాదించుకోవాల్సిందే కదా మరి? ఒక స్వాతంత్ర్య పోరాటానికి ఒక సూత్రం, మరొక స్వాతంత్ర్య పోరాటానికి మరొక సూత్రం, ఒక స్వాతంత్ర్య పోరాటానికి ఒక ధర్మం, మరొక స్వాతంత్ర్య పోరాటానికి మరొక ధర్మమా?

లోగా చైనావారిని మనం "భాయీ భాయీ" యని మోసం చేశారన్నాం. అదే పని ఇపుడు "ఆంధ్రాభాయీ"లు కూడా చేశారు తెలంగాణా భాయీలకు. మన తెలుగంతా ఒకటే, ఒకటేయని, ఏకమయ్యాక మాది 'గొప్ప', మీది 'చిప్ప' అన్నారు, ఇంకా అంటూనే ఉన్నారు. మనమంతా తెలుగువారమే, సమానమేనని అంటూనే అయినా, మేము 'మెజారిటీ తెలుగువారం' మీరు 'మైనారిటీ తెలుగువారు' అంటున్నారు ఇపుడు గొంతు చించుకొని. మా సంస్కృతి మీ సంస్కృతి, మా చరిత్ర మీ చరిత్ర ఒకటేనని ఒకప్పుడని ఇపుడు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో, కాదు మాది పెద్దది, మీది చిన్నదని అంటూనే ఉన్నారు. అక్షరాలా అనకున్నా కనుచూపుల్తో, కరాల చేతల్తో కనబరుస్తూనే ఉన్నారు.

ఇలాంటివన్నీ తెలంగాణా వారి 'ఆత్మగౌరవాన్ని' ఎన్నో విధాలుగా అవమాన పరచడం, కించపరచడం, అవహేళన చేయడం, చిన్నచూపు చూడడం కాదా? తెలంగాణా వారి మనస్సులను చివుక్కుమనిపించడం కాదా? అలాంటప్పుడు ఎలా కుదురుతుందిక 'మానసిక ఐక్యత'? మానసిక ఐక్యత లేకుండా భౌతిక ఐక్యత ఎన్నాళ్ళు పనిచేస్తుంది? ఎప్పటికప్పుడు తిరిగి తిరుగుబాటు బావుటా ఎగురవేయదా? అదే కదా గత 55 ఏళ్ళనుండి జరుగుతోంది.

వారన్నట్లు, ఇంకా అంటూనే ఉన్నట్లు, మేము కూడా ఇపుడు ఒప్పుకుంటున్నాం, వారికీ మాకూ మాటల్లో కలవదు, పాటల్లో కలవదు, ఆటల్లో కలవదు, సాపాటల్లో కలవదు కనుక బాటల్లో కూడా కలవదని. వారు చాటుకు అంటున్నట్లు మేమిపుడు నేటుకే అంటున్నాం వారికీ మాకూ 'కలవదు', 'కలవదు', 'కలవదని'.

వారంటున్నారు మీకూ మాకిపుడు కలవదు కాని మీరు హైదరాబాదు వదిలితే వేరు పడడానికి మాకు అభ్యంతరం లేదని. తెలంగాణావారికి వారి ప్రేమ అంతపాటిదని ఎప్పుడో తెలిసిపోయింది. "మనం మనం ఒకటి" అనే వారి ప్రేమంతా హైదరాబాదు కొరకే కాని తెలంగాణా కొరకు కాదు, తెలుగు భాష కొరకు కూడా కాదని.

తెలుగుభాష పేరట తెలుగు రాష్ట్రాన్ని తెచ్చుకున్న వారికి తెలుగు పైనే లేని ప్రేమ తెలంగాణాపై ఎలా వస్తుంది? వారి తెలుగుభాషకు చెందిన ప్రేమ ఎప్పుడో పోయింది. అది పేదరాలైన తెలుగు తల్లినుండి ధనికురాలైన ఆంగ్లేయ సవతి తల్లిపై ఎప్పుడో తబాదలా అయిపోయింది. (తల్లి కన్నా ధనం ముఖ్యమైపోయింది కదా మరి! అందుకని.) కనుక తెలంగాణా వారిని తెలుగు భాష పేరిట "అందరమూ కలిసుందామని" అనడం ఇపుడేమాత్రం సమంజసం కాదు.

తెలుగుభాష తల్లి లాంటిది కదా? మరి వారు తల్లిలాంటి తెలుగు భాషనే కాదన్నాక ఎవరు వారిని ఎలా నమ్మాలో వారే చెప్పాలి? వారు ఎవరినైనా అలాగే

కాదనగలరని ఇపుడు తేలిపోయింది. నిన్న మొన్ననే సోనియాను **"అమ్మ!, అమ్మ! మీరు ఎలా అంటే అలాగే"** అని అంటూనే, అసలు సమయానికి ఆమె మాట కూడా కాదన్నారు కదా! అవసరమైతే అలాంటిదానికి దేనికైనా వారు ఇకముందు వెనుదీయరని, ఆ అమ్మకు కూడా అవసరమైతే వెన్నుపోటు పొడవగలరని ఆమెకు కూడా తెలిసిపోలే దంటారా?

ఇంకొకమాట. వారు హైదరాబాద్‌లో పెద్ద పెట్టుబళ్ళు పెట్టామని పదేపదే అంటున్నారే. వారి పెట్టుబళ్ళు గత రెండు మూడు దశాబ్దాలనాటివే కాని తెలంగాణా వారివి అయిదారు శతాబ్దాలవి కదా? వారు ఆ మాత్రానికే ఇది మా హక్కని బల్లగుద్దితే వీరేమనాలి మరి? అయినా వీరి సదరు సగటు పెట్టుబళ్ళలో, త్యాగాలలో ఆంధ్రావారివి ఎంతపాటివి? పోతే తెలంగాణా వారికున్నది హైదరాబాద్ సిటీ ఒకే ఒకటి. ఆంధ్రావారికి దాని లాంటివి దాదాపు పది పన్నెండున్నాయి. ఇంకాస్త పెట్టుబడి పెడితే వాటిలో ఎన్నో హైదరాబాదు అంతటివి కాగలుగుతాయి. వారిది దోపిడీదారీ నీతే, capitalistic రీతే కాకపోతే మాకున్న ఒకే ఒక సిటీకి కూడా అలా ఎసరు పెడతారా మరి?

విద్య క్రిందికి, అభివృద్ధి మీదికా?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఎంత చక్కని చిక్కని భాష మన తెలుగు భాష! ఎంత శక్తి గల, సత్తాగల భాష! ఎంత లలిత లతితంగా, శృంగారంగా, బంగారంగా చెప్పగలిగేభాష! ఎంత తియ్యని మధువులొలికే మాధుర్య భాష! ఒక్క పోతన భాగవతం చాలు తెలుగు భాష ఎంత తియ్యనిదో తెలిసికోవడానికి. ఎంత సాహిత్య సంపద, సాంస్కృతిక సంపదుంది ఈ భాషలో! ఒక్క విశ్వనాథ సత్యనారాయణగారి "రామాయణ కల్పవృక్షం" చాలు ఈ భాష ఎంత కామధేనువో కనుగొనడానికి! ఎన్ని భావాలు! ఎన్ని స్పందనలు! ఎన్ని అనుభూతులు! ఎన్ని అనుభవాలు! ఎన్ని అంతరార్థాలు! ఎన్ని రసాలు! ఎన్ని వక్రోక్తులు! ఉపమానాలు! ఉత్ప్రేక్షలు! అతిశయోక్తులు! దేశీయాలు! నానుళ్లు! సామెతలు! సాహిత్య సారస్వత సాంస్కృతిక సందేశాలు! తాత్విక చింతనలు! మీమాంసలు! భాష్యాలు! ఎంత అందంగానే కాక అర్థవంతంగా చెప్పారు మన వారు ఈ భాషలో!

అలాంటి ఈ భాషను మనం పోగొట్టుకో వచ్చా? దానిని నిర్లక్ష్యాల పాలు చేసి నిర్మూలించ వచ్చా? దానిని ఆధునిక అవసరాల కొరకు మరింత సుసంపన్నం చేసికొని వాడుకోవటానికి బదులు అది పాతచింతపండయిందని, ఈనాటి అవసరాలకు సరిపోదని దానినశ్రద్ధలపాలు చేసి అడుగంటించవచ్చా?

ఎలాగైతే విద్యలను ఎప్పటికప్పుడు ఆధునకం చేసుకోవలసిన అవసరముంటుందో అలాగే భాషలను కూడా ఎప్పటికప్పుడు ఆధునకం చేసికోవలసుంటుంది. ఎందుకంటే జ్ఞానమెప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటుంది, అది పెరిగినా కొలదీ భాష కూడా దానికి అనుగుణ్యంగా పెరగవలసే ఉంటుంది. కొత్తకొత్త జ్ఞానాలకు కొత్తకొత్త పదాలు అవసరమౌతాయి. వాటిని కనుగొనాలి. పాతవాటిని అవసరమున్న మేరకు మార్చుకోవాలి, కొత్తవాటిలో విలీనం చేసికోవాలి. ఇది నిరంతరం జరగవలసిన పని. అది అలా జరగకపోతే భాష పెరగదు, పెరగడమే కాదు బ్రతుకదు కూడా. ఎందుకంటే భాషలన్నీ "అవసరాల" కొరకే పుడుతాయి, అవసరాలకు పనికిరాని భాష వాడబడదు, వాడకపోతే అది వాడిపోతుంది. ఎప్పుడైతే క్రొత్తక్రొత్త వస్తుసేవా సౌకర్యాలు, పదార్థాలు, పనిముట్లు, పనులు, నిర్వహించే విధానాలు, నీతులు, రీతులు మారుతాయో, విద్యలు, మరీ శాస్త్రీయం, సాంకేతికం పరిశోధనాత్మకమవుతాయో భాష సాధారణ పదాల కన్నా ఎక్కువ "పరిభాష"కు చెందిందవుతుంది. ఏ దేశాలలోనైతే జ్ఞాన పరిజ్ఞానాలు ఇతోధికంగా అభివృద్ధి చెందుతాయో వాటి నుండొస్తాయి క్రొత్త, సరిక్రొత్త పరిభాషాపదాలు ఇతర దేశాలకు. అంటే భాష 'పరిభాష' ద్వారా జ్ఞాన పరిజ్ఞానంతో పాటు పర్యటిస్తుందన్నమాట

ఒక భాష పెరగకపోతే, ఆ భాషీయులలో జ్ఞాన విజ్ఞానాలు పెరగలేదన్నమాట, పెరిగితే అవి కూడా పెరిగాయన్నమాట. భాష ఆధునికమవడమంటే అది అలా జ్ఞాన విజ్ఞానాలను పెనవేసికొని అభివృద్ధి చెందడం. భాషకు తనదైన విడిసత్తా ఉండదు, దానికి సృజనాత్మక, పరిశోధనాత్మక, పరిశీలనాత్మక దృష్టి దృక్పథాల వలన, భావాల వలన వచ్చే సత్తా తప్ప, భాషా ఆధునీకరణ కావాలంటే జ్ఞాన విజ్ఞానాల ఆధునీకరణ, వస్తుసేవా సౌకర్యాల, పదార్థాల ఆధునీకరణ తప్పదు. ఇంగ్లీషు భాష ఆధునిక భాషయని మనమంటుంటాం. దానికి కారణం అచట జ్ఞాన విజ్ఞానాలు అభివృద్ధి చెందడమే, అది ఆ భాష యొక్క విడిశక్తికాదు, ముడిశక్తి. మనమూ విద్యా విజ్ఞాన రంగాల్లోని శాస్త్ర సాంకేతిక పరిశోధనా రంగాల్లో ముందడుగు వేస్తే మన భాష కూడా అలాగే అభివృద్ధి చెంది, ఆధునిక మయేది. మనం పెరిగితే మన భాష పెరుగుతుంది, మనం తరిగితే మన భాష తరుగుతుంది, మనం సాగిపోతే మన భాష సాగిపోతుంది, మనం ఆగిపోతే మన భాష ఆగిపోతుంది, కనుక భాష పెరగకపోవడం, ఆధునికం కాకపోవడం ఆ భాష లోపం కాదు, ఆ భాషీయుల లోపం.

ఏ భాషా ఎప్పటికీ అచ్చమైన భాషగా ఉండదు. ఎందుకంటే కొత్తగా కనుగొనబడేవన్నీ, ఒకే దేశంలో కనుగొనబడవు. అలాంటివి అన్ని దేశాల్లో కనుగొనబడుతూనే ఉంటాయి. ఏ దేశాలలో అవి కనుగొనబడుతాయో, ఆ దేశాల భాషల నుండి ఆ పదాలను మనం అరువు తెచ్చుకొంటుంటాం. వాటిని పదేపదే చాడి మనవిగా చేసికొంటుంటాం. ఆ పదాలు మన పదాలుగా మన భాషలో ఇమిడి పోతుంటాయి. మన భాషల్లోనే కాదు, అన్ని భాషల్లో జరిగే క్రియ ప్రక్రియే. కనుక ఏ భాషా ఎల్లకాలం అచ్చమైన భాషగా అలాగే ఉండిపోదు. అది ఇతర భాషలతో ముడిబడి, ఆదాన ప్రదానాలతో ముందంజ వేసి, నవ్యమవుతుంది, సవ్యమవుతుంది.

ఈ రీతిగా చూస్తే, తెలుగు భాష ఎన్నో భాషల నుండి ఎన్నో పదాలు అరువు తెచ్చుకొని, ఎంతో ఆధునికం కాకపోలేదు. ఈ ఆధునికత చాలా వరకు "మీడియా వారి" పుణ్యం వలననే జరిగిందంటే అతిశయోక్తి కాదు. విద్యాలయాలు, పరిశోధనాలయాలు, ఎకాడమీలు మున్నగునవి ఎంతోకొంత కృషి చేసినా, మీడియవారికే మనం మన భాషాభివృద్ధికి, భాషాధునికతకు ఎంతో ఋణపడి ఉండాలి. దానిని వారు చేసినంత ఆధునీకరణ మరెవ్వరూ చేయలేదని నిర్ద్వందంగా, నిస్సంకోచంగా ఒప్పుకోవాలి.

మరీ మన పరిపాలకులు మన భాషాభివృద్ధికి చేసిన కృషి చాలా స్వల్పం, వారు మేలు చేసిందానికంటే కీడు చేసిందే ఎక్కువని చెప్పాలి. మన తెలుగు మీడియం విద్యాలయాలను కుంటుపడగొట్టడం ద్వారా, సంగీత, సాహిత్య, నాటక ఎకాడమీలను మూసివేయడం ద్వారా, తెలుగు ఎకాడమీకి ఉర్దూ ఎకాడమీకన్నా కూడా తక్కువ వనరులు కేటాయించడం ద్వారా, తెలుగు యూనివర్సిటీకి తగినన్ని నిధులు

సమకూర్చకపోవడం ద్వారా, సాంస్కృతిక సంస్థలకు తగినంత చేయూత నివ్వకపోవడం ద్వారా, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తులాంటి సంస్థలను ప్రోత్సహించక పోవడం ద్వారా, విశ్వవిద్యాలయాల్లోని తెలుగు శాఖలకు తగినన్ని నిధులు కేటాయించక వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా, మన గ్రంథాలయాలకు రాజకీయులను నియమించి వాటిని రాజకీయాలపాలు చేయడం ద్వారా, అన్నిటికన్నా ముఖ్యంగా పనిగట్టుకుని, రాజకీయాలు దృష్టిలో పెట్టుకొని ఇంగ్లీషు భాషకు బోధనాభాషగా ప్రథమస్థానం కల్పిస్తూ తెలుగును రెండవ స్థానానికి నెట్టేసి దాని వాడుకను నామకార్థం చేయడం ద్వారా.

ఇందుకొరకా మనం తెలుగు భాష పేరట "ఆంధ్ర రాష్ట్రం" కావాలని కోరింది? దీని కొరకా దానిని మనం అంత ఆరాటపడి సాధించింది? ఇందుకొరకా మనమిప్పుడు భాషా రాష్ట్రం పేరట చేస్తోన్న రభసంతా? తెలుగు భాషా రాష్ట్రాన్ని ఇంగ్లీషు భాషా రాష్ట్రంగా మార్చడం కొరకా? భాషను సమైక్యతకు "కేంద్రబిందువు" చేయక తక్కిన వాటికి పెద్దపీట వేయుట కొరకా?

భాషను ఒకవైపు మంటగలుపుతూ, రాజకీయాల కొరకు, ఓటుబ్యాంకు కొరకు దానిని నానావిధాల భ్రష్టుపట్టిస్తూ "భాషారాష్ట్రం! భాషారాష్ట్రం!" అని మొసలి కన్నీళ్ళు కార్చడం కొరకా? అలా భాషా రాష్ట్రాన్ని నవ్వుల పాలు చేయుట కొరకా? భాషా రాష్ట్రం భాష కొరకు కాకపోతే అది ఒకటిగా ఉంటేనేం, రెండుగా మూడుగా చీలిపోతేనేం?

మనమిప్పుడు "అభివృద్ధి"కి పెద్దపీట వేస్తున్నాం. దాని ముందు అన్ని పీటలూ చిన్నపీటలే అంటున్నాం. అలాంటి అభివృద్ధి అనుకున్నంత మేరకు జరగక పోవడానికి కారణమేమిటో ఎవరైనా చెప్పగలరా? మన విద్యలు మొదటి నుంచి మన భాష ద్వారానే గరిపితే ఈ పాటికి మనమెంతో ముందంజ వేసేవారం కాదా? అది మాతృభాషల ద్వారా/ దేశ భాషల ద్వారా విద్యలు గరుపుతోన్న చైనా, జపాన్, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, కొరియా, ఫార్చుసా, హోలాండ్ మున్నగు దేశాల అనుభవం కాదా?

విద్యలు పాడైపోతే నీతి నిజాయితీలు పాడైపోతాయి. నీతి నిజాయితీలు పాడైపోతే రీతులు, విధానాలు, విధులు పాడైపోతాయి. అవి పాడైపోతే అభివృద్ధి పాడైపోతుంది. అభివృద్ధి పాడైపోతే అది అన్ని అత్యాచారాలకు, అరాచకాలకు, అవినీతులకు, ఉగ్రవాదాలకు, హింసావాదాలకు, విడివాదాలకు, పిడివాదాలకు, విచ్ఛలవిడివాదాలకు దారితీస్తుంది.

అభివృద్ధి కొరకు విద్య అవసరమా లేదా యన్నది మొదట తేల్చాలి. విద్య ప్రజల భాష ద్వారా గరిపితే త్వరగా అబ్బుతుందా లేక మరోభాష ద్వారా గరిపితేనా యనునది మొదట తేల్చాలి. ఆర్థికాభివృద్ధయినా, మరే అభివృద్ధయినా ప్రధానంగా

విద్యతో ముడిబడి ఉంటుంది కనుక. విద్యాభివృద్ధి ఎప్పటికీ అత్యధికులు మాట్లాడే ప్రజాభాషతో ముడిబడి ఉంటుంది. దానికి ఏ సందేహమూ, ఏ వాదోపవాదమూ అక్కరలేదు. మన భాష ద్వారా జరిగే అభివృద్ధి వలన మన దేశంలోనే ఉద్యోగావకాశాలు ఇతోధికంగా పెరిగే అవకాశముంటుంది. పరాయి దేశాల్లోని ఉద్యోగాలు మనవాటితో పోల్చి చూస్తే ఎప్పటికీ తక్కువే. కనుక పరాయి భాష ద్వారా విద్యాభ్యాసాలు చేసి పరాయి ఉద్యోగాల కొరకు ప్రాకులాడడం, దేహీ యని అడుక్కోవడం దేనికి? ఎపుడో ఒకసారి వారు ఇక చాలు, మీరు వెళ్ళిపొండంటే మూటా ముల్లే సదరుకొని ఇంటి ముఖం పట్టడం దేనికి?

విద్య చెడిపోతే నీతి నిజాయితీ చెడిపోతుందని ఇంతవరకే చెప్పుకున్నాం. అవినీతి పెరగడం వలననే అభివృద్ధికి చెందిన వ్యయం ఆవగింజంతైనా అట్టడుగువారికి చెందడం లేదని అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీగారే అన్నారు. అది అప్పటికీ ఇప్పటికీ నిజం. ఏ వ్యయం ఎంతైతేనేమి అనుకున్నవారికి అందక అది గుత్తేదార్ల, మధ్యవర్తుల, బ్రోకర్ల, పార్టీ జోకర్ల పాలైతే?

అయినా, అభివృద్ధి పేరట చేసే వాగ్దానాలే వ్యయాలా? ఏవీ వాటికి చాలినన్ని వనరులు, నిధులు, కేటాయింపులు, వాటి విడుదలలు? మూలరాళ్ళు వందలకు వందలు, వేలకు వేలు వేస్తేనే అభివృద్ధి గబాగబా జరుగుతుందా?

తెలంగాణాలో ఒక వాడుక ఉంది. దానిని 'జంబి కింది వ్రాత' లంటారు. దసరారోజున ఒక బ్రాహ్మణున్ని సాక్షిగా నిలబెట్టి జమ్మిచెట్టు క్రింద కూర్చొని వేలకువేలు, లక్షలకులక్షలు ఇచ్చుకుంటిమి, పుచ్చుకుంటిమని వ్రాసుకుంటారు. అవి ఇచ్చుకునేవీకావు, పుచ్చుకునేవీకావు. అలాంటివే ఈనాటి అభివృద్ధికి చెందిన వాగ్దానాలు. అవి రాతలేతప్ప, చేతలుకావు, కానేరవు. ఎందుకంటే వాటికి చాలినంత ధనం మనవద్ద ఉండదు, అంత ఋణం మనకు పుట్టదు. అలాంటి వాగ్దానాలు ఏళ్ళతరబడి కాగిదం మీది కందిపప్పుల్లాగే మిగిలిపోతాయి. అవి వస్తాయి, వస్తాయి యని ప్రజలు వాటికొరకు నిరీక్షిస్తూనే ఉంటారు, అవింకా వస్తూనే ఉంటాయి ఆమెడ దూరం నుండి. ఇంతలోపల మరెన్నో వాగ్దానాలు? వాటికి వీటికి కేటాయించిన వనరుల మరలింపులు తరలింపులు, అది షరామామూలేనని అందరికీ తెలిసిందే.

ప్రఖ్యాత రచయిత సోమర్‌సెట్ మాఘమ్ "ప్రజాస్వామ్యం ప్రభువుల స్వామ్యం కావాలనుకుంటే పాలించే వారు మురికివాడల్లోని మురికిగుంటలు పూర్తిగా పూడ్చి వేయగూడదు. కొన్నెప్పటికీ అలాగే ఉండనీయాలి, లేకపోతే ప్రజలు వారిని మరిచిపోతారు" అంటాడు. అందుకే కాబోలు మన ప్రభువులు కొన్ని మురికి గుంటలనెప్పటికీ "పూడుస్తాం, పూడుస్తాం" అంటారే కాని పూడ్చివేయరు, మరొ ఎన్నికలు వచ్చే వరకు వాటిని అలాగే ఉండనిస్తారు. ఇపుడిదే పని ప్రజలు కూడా చేస్తున్నారు. మీకే సార్ ఈ సారి మా ఓటని అంటారు, కాని వేయరు. "యధా రాజా తధా ప్రజా" కదా మరి!

తెలంగాణా సంస్కృతిపై ఇస్లాం సంస్కృతి ప్రభావం

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఈమధ్య 'తెలంగాణా కల్చరల్ ఫోరమ్' వారు ఒక సమాలోచనా సభ నిర్వహించారు. దానిలో నేను 'తెలంగాణా ప్రాంతపు సంస్కృతి ముసల్మానుల సంస్కృతికే దగ్గర' అన్నాను. ఆనాటి నిజాం పరిపాలనలో జరిగిన నిరంకుశత్వాలను, అప్పటి రజాకార్ల విధ్వంసక చర్యలను గుర్తుచేస్తూ, అలాంటి వారి సంస్కృతికి తెలంగాణా వారి సంస్కృతి దగ్గరని అనడం సమంజసం కాదన్నారు కొందరు.

సంస్కృతి వేరు, తక్కిన విషయాలన్నీ వేరు. రాజులను, రాజ్యపాలనలను, రజాకార్ల చర్యలను నేను సమర్థించడం లేదు, నేనంటున్నది సంస్కృతి గురించేనని, సంస్కృతి జీవనసరళికి చెందిందని, నేను రాజకీయేతర, మతేతర సాంస్కృతిక పరమైన వాటిలో మాత్రమే తెలంగాణావారు ముస్లిం సంస్కృతికి దగ్గరని అంటున్నానని ఎంతో నచ్చచెప్పజూచాను.

నా అభిప్రాయాన్ని మరింత స్పష్టంగా ఈ వ్యాసం ద్వారా వివరించదలచాను.

సంస్కృతి యనునది ప్రధానంగా దైనందిన నడవళ్ళకు, ఆదాన ప్రదానాలకు, మానవీయ సంబంధ బాంధవ్యాలకు సామరస్యాలకు, సహాయ సహకారాలకు, త్యాగాలకు, స్నేహితాలకు, సత్సంబంధాలకు చెందింది. అలాగే విచారాలలో, వినోదాలలో, విషాదాలలో, మతేతర, పరిపాలనేతర ఆలోచనాధారల్లో ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవ దానికి, ఒకరినొకరు ప్రభావితం చేసికోవడానికి చెందింది. ఈ విషయాలలో తెలంగాణా తెలుగు వారికి, తెలంగాణా ముస్లింలకు చాలా సామ్యాలు అప్పటికీ ఇప్పటికీ ఉన్నాయి.

దీనికి కారణం తెలంగాణా ప్రాంతం ఐదు వందలేళ్ళకు పైగా ముస్లిం పరిపాలనలో ఉండడమే. అదే వాటికన్నిటికీ ప్రధానమైన కారణం. ఆ కారణం వలననే తెలంగాణా తెలుగు వారి సంస్కృతిపై ముస్లింల సంస్కృతి ప్రభావం పడింది. దానికి విరుద్ధంగా ఆంధ్రా ప్రాంతంలో బ్రిటీష్ వారి పరిపాలనవలన ఆంధ్రులపై బ్రిటీష్ వారి సాంస్కృతిక ప్రభావం పడింది. ఇలా అంటే దానిని ఆ ప్రాంతంవారు అపార్థం చేసికోగూడదు. అది ఒకానొక చారిత్రక వాస్తవాన్ని వివరించడం మాత్రమే.

తెలంగాణావారి తెలుగుభాషపై ఉర్దూ భాష ప్రభావం లేదా? తెలంగాణావారి ఆహారాది అలవాట్లపై, వంటలపై ముస్లింల ఆహారాది అలవాట్ల, వంటల ప్రభావం లేదా? తెలంగాణావారి ఆహ్వానాల, వీడ్కోలుల, కలవడుల, కరచాలనలపై ముస్లిం సంస్కృతి ప్రభావం లేదా?

తెలంగాణావారి పైజామాలు, షేర్వానీలు, మేలిముసుగులు మున్నగు వాటిపై ముస్లిం సంస్కృతి ప్రభావం లేదా? తెలంగాణావారి సాహిత్యాలపై, సంగీతాలపై, కళలపై ముస్లింల సంస్కృతి ప్రభావం లేదా? తెలంగాణా వారి తెలుగు కవిత్వంలోని ప్రేమ, విరహం, విషాదం, వ్యంగ్యం మున్నగు వాటిలో ఇస్లాం కవిత్వ ప్రభావం లేదా?

తెలంగాణావారి 'పాన్దాన్ - ఒగల్దాన్ కల్చర్', 'గోరింటాకు కల్చర్', 'కంటి కాటుక కల్చర్', 'చాయ్ కల్చర్', 'బిర్యానీ కల్చర్', 'నవ్వాబీ కల్చర్', 'షాన్-ఆన్-మెహర్బాన్ కల్చర్', 'ఆన్-బీన్ కల్చర్', 'ఉద్వేగ కల్చర్', 'ఉత్సాహ కల్చర్' పై ముస్లింల సంస్కృతి ప్రభావం లేదా? తెలంగాణావారి భవన నిర్మాణాల, తదితర కట్టడాల సంస్కృతిపై ముస్లింల సంస్కృతి ప్రభావం లేదా?

కొన్నాళ్ళవరకు ముస్లింల 'పర్దా కల్చర్', 'కర్టెన్ కల్చర్' కూడా తెలంగాణావారి కల్చర్లో సాగింది. ఇంకా చాలావాటిలో ముస్లింల సంస్కృతి ప్రభావం తెలంగాణావారి సంస్కృతిపై అప్పటికీ ఇప్పటికీ కనబడుతూనే వుంది కదా.

ఈ వాస్తవాలను పురస్కరించుకొనే "తెలంగాణా ప్రాంతపు తెలుగువారి సంస్కృతి ముస్లింల సంస్కృతికి దగ్గర"యని ఒక చారిత్రక వాస్తవాన్ని మాత్రమే ప్రకటించాను. తెలంగాణా ముస్లింలు తెలంగాణా వాదాన్ని సమర్థించాలంటే ఆ మాత్రం వాస్తవమైన మాటకూడా మాట్లాడకపోతే ఏ విధంగా వారిని ప్రత్యేక తెలంగాణావాదాన్ని సమర్థించేట్లు మచ్చిక చేసుకోగలం మనం? అదెంతో అవసరంకదా ఈ సందర్భంగా మరి.

అంతేకాదు, బ్రిటీష్ వారి పరిపాలన మనకు కొంత చెడ్డ, కొంత మంచి చేసినట్లే ముసల్మానుల పరిపాలన కూడా మనకు కొంత మంచి, కొంత చెడ్డ చేసింది. మంచిని మంచి, చెడ్డను చెడ్డ అనాలి కదా? నన్నడిగితే పరిపాలనలో మనకు ఎంతోకొంత ఆధునికత, క్రమబద్ధత, క్రమశిక్షణ నేర్పింది ముసల్మానులే. పరిపాలకుల యెడ కొంత భక్తి, కొంత భయం లేందే పరిపాలన సాగదని నిరూపించింది వారే. న్యాయం, న్యాయశాస్త్రం మీద మనకు శాస్త్రీయమైన అవగాహన కల్పించింది కూడా వారే, మన వ్యవసాయానికి చెరువుల ద్వారా, కుంటలద్వారా ఎంతోకొంత సాగునీటి సరఫరా వసతి కల్పించింది కూడా వారే. (అదికూడా ఇప్పుడు అడుగంటింది.) మన తెలుగుభాషను ఉర్దూ ద్వారా నిరంకుశంగా త్రొక్కిపెట్టినా కూడా (ఇపుడు తెలుగు వారే ఇంగ్లీషు ద్వారా త్రొక్కిపెడుతున్నట్లు) ఉర్దూ మాధ్యమం ద్వారానైతేనేమి మనకు ఎంతోకొంత ఆధునిక విద్యావసతులు కల్పించింది కూడా వారే, ఎంత అధికార దర్పం తెలుగువారిపై చెలాయించినా కూడా ఎంతోకొంత రక్షణాభద్రతలు కల్పించిందికూడా వారే, అప్పటి జనాభా ప్రకారం హైదరాబాదులోనే కాక అన్ని జిల్లాల్లో ఎన్నోకొన్ని వైద్యవసతులు కల్పించింది కూడా వారే. వాటిని మనం

మరచిపోగూడదు. ముస్లింల సంస్కృతి ఆనాటి వ్యక్తులపై ఎంత ఉండేదో, ఆనాటి వ్యవస్థలపై కూడా అంతే ఉండేది. అది కాదనడం ఒక చారిత్రాత్మక నిజాన్ని కాదనడమే అవుతుంది కాని మరొకటి కాదు.

ఇలా అంటే, నేను నిజాం పరిపాలనను, ముసల్మానుల పరిపాలనను అన్ని విధాలా సమర్థిస్తున్నానని కాదు అర్థం. కొంతమంచి, కొంతచెడ్డ అన్ని పరిపాలనల్లో ఉంటుందని. ఈనాటి పరిపాలనల్లో లేదా? ఈనాటి పరిపాలనల్లో ఒక్క ఎన్నికలను వదిలేస్తే ఆనాటి రాచరికంలా, నిరంకుశత్వంలా, ఒంటెద్దు పోకడలా అనిపించడం లేదా? తెలంగాణావారికి ఆంధ్రులు అన్యాయం తలపెడితే దానిని వారు హిందువులు కనుక సమర్థించాలి కాని ముసల్మానులు అన్యాయం తలపెడితే నిరసించాలా? అది పచ్చి 'పార్షియాలిటీ' కాదా!

తెలంగాణా ముస్లింలు, తెలంగాణా తెలుగువారు సాంస్కృతికపరంగా దగ్గర కావడానికి బలీయమైన కారణం తెలంగాణా ముసల్మానుల్లో చాలామంది ఒకప్పుడు హిందూమతంనుండి ఇస్లాం మతానికి మారడమేనని నా అభిప్రాయం. వారంతా ఇతర తెలంగాణా తెలుగువారిలాగే ఒకప్పటి తెలంగాణా తెలుగువారే. అందుకే ఇప్పటికీ ఒక్క మతపరంగా, భాషాపరంగా మాత్రం కాదు కాని సంస్కృతిపరంగా వారు చాలావరకు తెలంగాణా తెలుగువారిలాగే అనిపిస్తారు, కనిపిస్తారు, వినిపిస్తారు. ప్రేమలో, త్యాగంలో, స్నేహంలో, కృతజ్ఞతాభావంలో ఎవరికీ తీసిపోరు. వారుకూడా 'ఇన్సానియత్'కు అంటే మానవీయతకు పెద్దపీటే వేస్తారు.

ఇది నేను నా అనుభవంనుండి చెబుతున్నాను. దానికి నా అనుభవానికి చెందిన ఒక ఉదాహరణ ఇస్తాను. దాదాపు 60 యేళ్ళ క్రింది మాట అది. నేనపుడు ఆనాటి హైదరాబాదు రాష్ట్ర విమోచనోద్యమంలో ఒక అండర్‌గ్రౌండ్ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తగా పనిచేసేవాణ్ణి. అందువలన నన్నపుడు ఎచట దొరికితే అచట అరెస్టు చేయమని ఆర్డరు వేయడం జరిగింది ఆనాటి నిజాం సర్కారు ద్వారా. అదే సమయంలో నేను అనుకోకుండా ఒకసారి మా ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఆరోజుల్లో మోటారుకార్లు, మోటారు సైకిళ్ళు వగైరా ఉండేవి కావు. బస్సులో ప్రయాణం చేసి ఒక బస్సు స్టేజి వద్ద దిగాను. నా కొరకు మా ఊరినుండి ఒక కచ్చరం వచ్చింది. అనుకోకుండా అదే టైముకు ఇంకొక బస్సునుండి నా పాత స్కూల్‌మేట్, నాకు దగ్గరి స్నేహితుడు 'దస్తగిరి' అనే ముస్లిం కూడా దిగాడు. నన్ను ఎవరైనా పోలీసువాళ్ళు చూస్తున్నారాయని నేను బెదురు బెదురుగా అటూఇటూ చూస్తుండగా అతడు నావైపు చూచి "క్యాహై కొండల్రావ్ సాహెబ్! బహుత్ ఘబ్రాయేహుయే దిఖ్‌రహేహై?" అన్నాడు. నా పాత క్లాస్‌మేట్, స్నేహితుడు కదాయని నేనాతనికి భయపడుతూనే ఉన్న విషయాన్ని ఉన్నదున్నట్లు చెప్పాను. అతడు నా జబ్బ చరచి "కాహెకు డర్తేహో, మై సాథ్ హూంనా! యెహ్ లేవ్ మేరీ షేర్వానీ ఔర్ టోపీ, ఉన్కో పెహనో"యని తనవి నాకిస్తూ నన్ను

ముందర కూర్చొమ్మని తాను వెనుక కూర్చున్నాడు నాకొక బాడీగార్డ్‌లాగా.

చూచారా! తురకవాడే కాని ఎలాంటివాడో, ఎంత సంస్కారం కలవాడో? నా అనుభవంలో తురకవాళ్ళు చాలావరకు అలాంటివారే. మనం వారి మతం జోలికి అనవసరంగా పోయి వారితో తగవులాడకపోతే, వారిని వారి రాజకీయమౌఢ్యులు, మతమౌఢ్యులు ఉసికొల్పి పక్కతోవ పట్టించకపోతే.

అందుకే నేను మతంవేరు, సంస్కృతివేరు అంటున్నాను. అందుకే సంస్కృతి వరకొస్తే తెలంగాణా ముస్లింలు, తెలంగాణా తెలుగు వారందరూ దాదాపు సమానమే అంటున్నాను.

తెలంగాణాలో త్రవ్వకాల ద్వారా లభించిన సాంస్కృతిక సంపద

-డాక్టర్ కొండలరావు వెల్చాల

తెలంగాణా వారి సాంస్కృతిక చరిత్ర ఈనాటిది కాదు. క్రీస్తుకు పూర్వం నాటిది. రాతియుగం కన్నా పూర్వపుది. కొన్ని వేలయేండ్ల నాటిది. తెలంగాణాలోని త్రవ్వకాలలో లభించిన అనేకానేక ఘస్తు సామాగ్రి వలన ఇది పదే పదే ధృవీకరించబడింది, ఇంకా ధృవీకరించ బడుతూనే ఉంది. ఇంతవరకు త్రవ్విన స్థలాలే కాక ఇంకా ఎన్నో స్థలాలు ఎంతో పురావస్తు సంపదతో కూడుకొని ఉన్నాయని త్రవ్వకాలను నిర్వహించిన నిపుణులు చెబుతున్నారు.

పురావస్తు శాఖ సమాచారం ప్రకారం ఆదిలాబాద్‌లో 37, హైదరాబాద్‌లో 27, కరీంనగరంలో 37, ఖమ్మంలో 15, మహబూబ్‌నగర్‌లో 59, నిజామాబాద్‌లో 19, రంగారెడ్డిలో 20, వరంగల్‌లో 30 'ప్రొటెక్టెడ్ మాన్యుమెంట్స్' ఉన్నాయి. ఇవన్నీ త్రవ్వకాల ద్వారా బయటపడ్డవే. వీటిలో pre-historic sites, proto-historic sites, early-historic sites, మహమ్మదీయ మాన్యుమెంట్లు, యూరోపియన్ మాన్యుమెంట్లు, కోటలు, ఖిలాలు, నాణాలు, రాతలు, శిల్పాలు, దేవాలయాలు, ఇళ్ళు, సమాధులు, మఠాలు వగైరా ఉన్నాయి.

ఇంతవరకు త్రవ్విన పెద్దత్రవ్వకాలలో దాదాపు సగం తెలంగాణా ప్రాంతానికి చెందినవే. వీటిలో కోటిలింగాలకు, దాని పరిసర ప్రదేశాలకు చెందిన త్రవ్వకాలు అతి పెద్దవి.

ఈ త్రవ్వకాల వలన తెలంగాణా ప్రాంతం సాంస్కృతికంగా ఎంత సస్యశ్యామలమయిందో మనకు తెలుస్తుంది. ఆర్థికంగా తెలంగాణా ప్రాంతం అంత పెద్దగా అభివృద్ధి చెందిన ప్రాంతం కాకున్నా సాంస్కృతికంగా అది చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని విదితమవుతుంది.

ఈ ప్రాంతంలో శాతవాహన, బౌద్ధ, జైన, విష్ణు, శైవ మతాలు, నాగరీకతలు చాలా అభివృద్ధి చెందాయని మనకు ఈ త్రవ్వకాలు తెలియపరుస్తాయి. అలాచూస్తే, ఒకప్పటి భారతదేశం కూడా సాంస్కృతికంగా, మతపరంగా, ఆధ్యాత్మికంగా గొప్ప అభివృద్ధి చెందిన దేశమే కాని, ఆర్థికంగా అంతగా అభివృద్ధి చెందిన దేశం కాదు కదా! అలాగే తెలంగాణా ప్రాంతం కూడా.

ఇతర దేశాలలో, త్రవ్వకాల ద్వారా బయటపడ్డ ముఖ్యమైన సంపదలను, నాగరీకతా ప్రదేశాలను ఆయా ప్రదేశాల వారి సంస్కృతులకు, నాగరికతలకు సాక్ష్యాలుగా పొందుపరచే, పరిరక్షించే, వాటి గొప్పతనాలను భావితరాలకు అందించే, పర్యాటకులకు చూపించే రీతి, నీతి అంటూ ఒకటి ఉంటుంది. అలా వారు వారి సాంప్రదాయాలను, పరంపరలను చాటుకుంటారు. అలా చేయడం వారి దేశానికి,

ప్రాంతానికి, జాతికి గర్వ కారణంగా భావిస్తారు. కాని, ఈ దేశంలో, మన రాష్ట్రంలో, మరీ మన తెలంగాణా ప్రాంతంలో సుప్రసిద్ధ నాగరీకత స్థలాలను, అచటి అతి ముఖ్యమైన నాగరీకతా సాక్ష్యాలను భద్రంగా పొందుపరచే, పరిరక్షించే సుస్థిర వ్యవస్థాపరమైన పాలసీలంటూ చెప్పుకోదగ్గవి లేవు. ఉన్నా, వాటిని అంతగా పట్టించుకునే, పాటించే నాథులు లేరు. అందువలన తెలంగాణా పురాతన వస్తు సంపద, దాని నాగరికతకు చెందిన సాక్ష్యాలు, సంస్కృతికి చెందిన మూలాలు ఎన్నో ఇంతవరకే మాయమయాయి, ఇంకా మాయమవుతూనే ఉన్నాయి. ఆ స్థలాలను 'పర్యాటక-యాత్రాస్థలాలుగా' అభివృద్ధి చేసే చర్యలేవీ చేపట్టబడడం లేదు.

తెలంగాణాలోని సాంస్కృతిక నాగరికతా పరమైన త్రవ్వకాలకు ఏ గతి పడుతోందో, తెలంగాణాలోని అనేకానేక దేవాలయాలకు కూడా అదే గతి పడుతోంది. తెలంగాణాలోని దేవాలయాలకు ఏ గతి పడుతోందో తెలంగాణాలోని భాషా సాహిత్యాలకు, పల్లీయ పాటలకు అదే గతి పడుతోందనుటకు డా. బి.రామరాజుగారు "తెలంగాణా జానపద గేయములు" యను వ్యాసంలోని క్రింది వాక్యాలే సాక్ష్యాలు.

"నా పరిశోధనకై తెలంగాణమున వివిధ మండలములందు కొన్ని యూళ్ళు తిరిగి సుమారొక వేయి గేయములు సేకరింపగలిగితిని. కాని ఏమి లాభము? ఈ గేయములు పుస్తక రూపమున ప్రకటింపబడవలయును గదా! ప్రభుత్వమో, విశ్వవిద్యాలయమో, సాహిత్య సంస్థలో చేయవలసిన కార్యమిది. నా వంటి వ్యక్తులు చేయగల పని సేకరించుట మాత్రమే. ప్రచురణమన్న ధనము కావలయును. సేకరించిన గేయములను ప్రకటించుకొను భాగ్యము లేనప్పుడు నా బోటివానికి కలుగునది మొదట నిరుత్సాహము, అటు తరువాత నైరాశ్యము"

తెలంగాణా ప్రాంతంలో ఇలాంటి పరిపాలనా పరమైన సార్వత్రిక నిర్లక్ష్యం మనకు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. తెలంగాణా లోని అనేకానేక పురాతన సాంస్కృతిక నాగరీకత స్థలాలను పట్టించుకొని, వాటిని పరిరక్షించే చర్యలేవీ తగుమేరకు జరగడం లేదు. వాటికి వనరులు తగుమేరకు కేటాయించ బడడం లేదు. వాటిని కాపాడుటకు తగినంత సిబ్బంది నియమించబడడం లేదు. వాటి పరిరక్షణకు నామమాత్రం నిధుల కేటాయింపులు సుస్థిర ప్రాతిపదికపై కాక, అస్థిర ప్రాతిపదికపై చేస్తున్నారు. అందువలన తెలంగాణాలోని ఎంతో పురాతన నాగరికతా సంపద కుంటుపడుతోంది, మంటకలిసిపోతోంది. అలాగే అనేకానేక భాషాసాహిత్యాల, జానపదగేయాల సంపద. ఇది తెలంగాణాకు జరుగుతున్న అనేకానేక అన్యాయాలలో ఒకటి. ఇది అక్షరాలా తెలంగాణావారి సంస్కృతికి, నాగరీకతకు జరుగుతున్న అన్యాయం. అది తెలంగాణా వారే తెలంగాణాను పాలించుకుంటేనే తప్ప ఇతరులు పాలిస్తే జరగదు. ఇతరులది ఎప్పటికీ సవతి తల్లి చూపేకాని అసలు తల్లి చూపు కాదని ఎప్పుడో తేలిపోయింది. ఈ సాంస్కృతిక, నాగరికతా పరమైన అన్యాయాన్ని, నిర్లక్ష్యాన్ని శ్రీకృష్ణ కమీషన్ ముందుకు తీసుకు రాబడుతోంది.

మామూలు పదాలు ప్రామాణికం (*standardise*) చేయడం సరికాదు

-డాక్టర్ కొండలరావు వెల్చాల

పత్రికల్లో, పుస్తకాల్లో, విద్యాంశాల్లో రాసే తెలుగు భాషను ప్రామాణికం, అంటే *standardise* చేయడమనే ప్రక్రియొకటి చాలానాళ్ళనుండి ఈ రాష్ట్రంలో జరుగుతోంది అలాగే మాట్లాడే భాషను కూడా.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు రాసేభాష, మాట్లాడేభాష మూడు ప్రాంతాలలో ఒకేతీరుగా ఉండదను విషయం అందరికీ తెలిసిందే. ఒకానొక విధంగా భాషను రాయడం, మాట్లాడడం ఆయా ప్రాంతాల వారికి తరతరాలుగా ఒక వారసత్వంగా వస్తోంది. అది వారికి ఒక సంస్కృతి లాంటిదయింది. వారి భాషా సాహిత్య సంస్కృతుల్లో అది ఒక భాగమైంది. అందువలన ఒక ప్రాంతపు తెలుగు భాష ఇంకొక ప్రాంతంలో రాసినా, మాట్లాడినా చదివేవారికి, వినేవారికి కాస్తో కూస్తో వింతగానే ఉంటుంది. ఈ సంస్కృతంతా ఒకేఒకటి ఎందుకు కావాలో నాకు ఇంతవరకు అర్థం కాలేదు. భాషాసాహిత్య వైవిధ్యాలు కూడా ఇతర వైవిధ్యాల లాగా ఒక సమాజానికి, దేశానికి, ప్రాంతానికి ఒక తోటలోని అనేకానేక పూలలాంటివే కదా మరి! రోజాలలో ఎన్నో తేడాలుంటాయి కాని వాటినన్నిటినీ కలిపి రోజాలే అంటాం కదా! అలాగే తెలుగు భాషలో ఎన్ని తేడాలున్నా వాటినన్నింటినీ కలిపి తెలుగే అంటారు కదా అనేవారందరూ. అందువలన తెలుగులన్నీ కలిపి ఒకే తెలుగు కావాలనడం అంత సమంజమైంది కాదేమోనని అనిపిస్తుంటుంది నాకు.

విషయపరమైన, విద్యాపరమైన, వృత్తిపరమైన సాంకేతిక పదాలు, పరిభాషా పదాలన్నీ ప్రామాణికం కావడం అవసరమే కాదు అత్యవసరమే. ఎందుకంటే, వాటిలో ప్రాంతీయాలు ఉండడం కుదరదు కనుక. వాటిలో ప్రాంతీయాలు చోటుచేసుకుంటే అవి అయోమయాలకు దారి తీస్తాయి కనుక. కాని మామూలు భాషను, ఆయా ప్రాంతాలవారు దైనందిన జీవితాల్లో మాట్లాడే భాషను కూడా ఒకే భాషగా మార్చడం ప్రాంతీయ భాషా సాహిత్య సంస్కృతులను దెబ్బతీయడమే అవుతుందని, అలా చేయడం ఆయా ప్రాంతీయుల భాషాధ్యయన బరువును కూడా ఎక్కువ చేయడమే అవుతుందని నా అభిప్రాయం.

ఆయా ప్రాంతాల పౌరుల్లో ఒకానొక విధమైన దైనందిన భాష చెలామణీలో ఉంటుంది. అదే వారి జీవభాష కూడా. ఆ భాషలోనే వారికి చెందిన అర్థాలు, పరమార్థాలు దాగుంటాయి. వారి భావాలు ఆ భాషలో తప్ప మరొక బాషలో వారు

చెప్పలేరు, చెప్పినా వారనుకున్న అర్థం, భావం కుదరదు. ఒక్కొక్క అనుభూతికి, ఆ ప్రాంతానికి చెందిన భాషకు ఒకానొక విధమైన బాంధవ్యమనునది మనకు కనబడీ కనబడకుండా, వినబడీ వినబడకుండా ఉంటుంది.

ఉదాహరణకు తెలంగాణాలో "మానం పోయాక ప్రాణం ఉంటేనేమి, పోతేనేమి" అని అంటుంటారు లోకులు. ఈ వాడుక సామాన్యుల్లోనే ఎక్కువుంది. "మానం" అనే పదాన్ని సామాన్యుడు 'పరువు', 'ప్రతిష్ఠ' అర్థంలో కూడా వాడుతాడు. సభ్యసమాజంలో 'మానం' అన్న పదాన్ని 'మానభంగానికి' చెందిన అర్థంలో కూడా వాడుతారు. మనం ఆ పదాన్ని ఆ విధంగా వాడగూడదని ఒక సామాన్యునికి చెబితే చెల్లుతుందా? అలాగే ఒక నాగరీకునికి ఆ పదాన్ని అభిమానానికి కూడా వాడవచ్చునని చెబితే చెల్లుతుందా? అది ఆ ప్రాంతానికి, ఆ ప్రాంతపు వాడుకకు చెందింది. దానిని *'standardise* చేస్తే ఆ ప్రాంతపువాళ్ళు ఇబ్బందులపాలు కావలసి వస్తుంది. తెలుగులో మనం "లేశాడు", "లేసినాడు", "లేచిండు" యను మూడు పదాలు ఒకే అర్థంలో వాడుతాం. వివిధ ప్రాంతాల వారు వాటిని వారి వారి అలవాటు ప్రకారం ఆయా ప్రాంతాల్లో వాడతారు. దానిలో తప్పేముంది? ఆ మూడు పదాలను కలిపి ఒకే పదం చేయవలసిన అవసరం ఏముంది? వాటి వాడుకను వారి స్వేచ్ఛకు, అలవాటుకు వదిలిపెట్టవచ్చుకదా? అలా మనకు తెలుగులో ఎన్నో పదాలు తటస్థిస్తాయి. ఇలాంటివి వేరే దేశాలలో వేరే భాషల్లో కూడా ఉంటాయి. ఉదాహరణకు ఇంగ్లండులో మాట్లాడే భాష, స్కాట్లాండ్‌లో మాట్లాడే భాష, ఐర్లాండ్‌లో మాట్లాడే భాష ఎంత ఆంగ్లేయమైనా ఒకే ఒకటి మాత్రం కాదు. అలాగే, అమెరికాలో, ఇంగ్లాండులో, ఆస్ట్రేలియాలో తదితర ఆంగ్లేయ భాష మాట్లాడే దేశాల్లో ఎన్నో తేడాలు కనిపిస్తాయి రాతల్లో కూడా మాటల్లో కూడా. వాటినన్నింటినీ వారు ప్రామాణికం చేసే ప్రయత్నం చేయడంలేదు. ఎవరి అలవాటు ప్రకారం వారు వాటిని వాడుతున్నారు. అర్థం చేసుకునేవారు చేసుకుంటున్నారు. కనుక ప్రామాణికత పేరట ఈ రాష్ట్రంలో ఒక ప్రాంతం భాషను ఇంకొక ప్రాంతంపై రుద్దడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. భాషపోతే, సాహిత్యం పోతుంది, సాహిత్యం పోతే సంస్కృతి పోతుంది. భాష సంస్కృతికి "నాడి" లాంటిది. భాష వలననే ఒక సంస్కృతికి ఒక అస్తిత్వమనునది ఆ సంస్కృతికి చెందిన వారికి ఒక వ్యక్తిత్వమనునది ఏర్పడుతుంది. మనం 'వీరు తెలంగాణావారు', 'వీరు రాయలసీమవారు', 'వీరు సర్కారు వారు' అని వారి వారి భాషల ద్వారా, సాహిత్యాలద్వారా, సంస్కృతుల ద్వారా, సాంప్రదాయాల ద్వారానే కదా తెలిసికొంటాం. అలాంటప్పుడు వాటినన్నింటినీ ఒకటే చేయబూనడం నియంతృత్వం లాంటిదే అవుతుంది కాని మరొకటి కాదు.

వ్యక్తుల్లో వ్యత్యాసాలు ఉన్నట్లే భాషలకూ వ్యత్యాసాలుంటాయి. ఒకే భాషలో కూడా ఉంటాయి. అలాంటపుడు ప్రాంతీయ భాషలను ఒకటే చేయ సంకల్పించడం,

మాండలికాలను, గ్రామీణ భాషలను, నగర భాషలను, కులభాషలను అన్నిటినీ ఒకటే చేయ సంకల్పించడం లాంటిదవుతుంది. కాలం గడచినా కొలదీ అవన్నీ ఏనాడో ఒకనాడు ఎంతో కొంత దగ్గరపడవచ్చు కాని వాటిని అనవసరంగా పనిగట్టుకొని ఒకటి చేయాలనుకోవడం కలహాలను కొనితెచ్చుకోవడ మవుతుంది కాని మరొకటి కాదు.

ఒక చిన్నపాటి 'వార్త'లో తెలంగాణావారు రాస్తే ఎలా రాసేవారో, వేరే ప్రాంతం వారు ఎలా రాశారో ఇపుడు చూద్దాం. ఇది మామూలు వార్తకు చెందిందే. విషయపరమైన వ్యాసాల్లో భాషా తేడాలు ఇంతకన్నా ఎన్నోరెట్లు ఎక్కువుంటాయి. కాని ఎన్ని తేడాలున్నా మామూలు పదాలు అర్థం చేసికోవడంలో ఏ ఇబ్బందీ అంతగా ఉండదు. కనుక మామూలు పదాలను కూడా ప్రామాణికం చేయడం బాగుండదు. ఇది తప్పు పట్టడం కాదు, కేవలం వ్యత్యాసాలు చూయించడం మాత్రమే. వార్తాంశంలో రాసిన పదాలు కూడా ఒప్పులే, అలాగే ఇంకొక విధంగా రాసిన పదాలు కూడా ఒప్పులే, వాటిని రాయడంలోనే తేడా.

పాఠశాలల్లో 'జనరల్ తెలుగు'కు చెందిన 'టెక్ట్స్ బుక్స్' లోని మామూలు తెలుగు పదాలు ఏ ప్రాంతం వారు ఎలా వాడితే అలాగే వాడాలి కాని వాటిని మరో ప్రాంతం వారు వాడినట్లుగా వాడగూడదు. వాటిని మూడు ప్రాంతాలకు వేరువేరుగా రాయించాలి. అవసరమైతే ఆయా ప్రాంతాలవారితోనే పాఠాలు చెప్పించాలి, పరీక్షా పత్రాలు కూడా దిద్దించాలి. వీటికి అయ్యే ఖర్చుకన్నా తుదకు అబ్బే లాభాలే ఎక్కువ. అన్నిటికన్నా పెద్ద లాభం వారి వారి స్వేచ్ఛను గౌరవించడం, గుర్తించడం, వారిలో సామరస్యాలను పెంచడం. భాషపట్ల సాహిత్య సంస్కృతుల పట్ల వారి ఆసక్తి, అభిలాష పెంచడం. అంతకన్నా కావలసిందేముంటుంది. సామరస్యాలు కోల్పోతున్న ఈ రోజుల్లో?

సీమాంధ్ర విద్యాలయాల విద్యా విధానాల వలన కుంటుపడుతోన్న తెలంగాణా సంస్కృతి

-డాక్టర్ కొండలరావు వెల్చాల

"కళ కళ కొరకే కాదు, కళాత్మకంగా జీవించుట కొరకు"యను సూక్తి ఓకటుంది. అంటే, కళ అందంగా, సంస్కారంగా, సౌకుమార్యంగా జీవించుట కొరకని అర్థం. అలాగే "విద్య విద్య కొరకే కాదు, వికాసవంతంగా, వినయవంతంగా, వివేకవంతంగా జీవించుట కొరకు" యను సూక్తి కూడా మరొకటుంది. అంటే విద్య కేవలం ఉద్యోగం కొరకు ఉద్యోగోన్నతి కొరకే కాదు సంస్కృతి కొరకు, సౌందర్యంగా జీవించుట కొరకని అర్థం.

ఒకప్పుడు, మా చిన్నప్పుడు, మా తెలంగాణాలో మేము చదివే చదువులన్నీ కేవలం ఉద్యోగాల కొరకని, ఉన్నతుల కొరకని చదివేవారం కాదు. చదువు చైతన్యం కలిగిస్తుందని, విలువలనందిస్తుందని, పదిమందిలో పరువు కొనితెస్తుందని, సంస్కారవంతుల్ని చేస్తుందని, సభ్యత నేర్పుతుందని కూడా చదివేవారం. అందుకే అప్పటి తెలంగాణా వారు ఎంతోమంది ఎంత బీదవారైనా, ఉన్నవారైనా, లేనివారైనా మర్యాదలో ఎంతో ముందుండేవారు. వారికి ఉన్నా లేకున్నా అతిథి సత్కారాలకు ఏ లోటూ కలిగించేవారు కాదు. అతిథి ఇంటికి వస్తే దేవుడు వచ్చినట్లు చూచేవారు, వారిని ఆ విధంగా గౌరవించేవారు, అరుసుకొనేవారు, కృతార్థులను చేసేవారు.

అప్పట్లో మా ఊళ్లో ఎవ్వరూ మజ్జిగ, చొప్ప, గడ్డి అమ్మేవారు కాదు. అంతెందుకు కాయగూరలు, పాలు కూడా అమ్మేవారు కాదు. వీలయినంతవరకు ఉచితంగానే ఇచ్చేవారు. ఎవరింటిలో పెళ్లి జరిగినా అందరి ఇళ్లల్లో ఆ పెళ్లి జరుగుతున్నట్లు ఎంతో సంబరపడేవారు. పెళ్లింటివారికి చేదోడువాదోడుగా వుండి ఎన్నో పనులు పంచుకునేవారు. పెళ్లంటే ఊళ్లో వాళ్లందరూ వారి ఊరికి చెందిన పెళ్లిగా భావించేవారే కాని ఏదో ఒకింటికి చెందిన పెళ్లిగా భావించేవారు కాదు. పిన్నవారు పెద్దవారిని ఎంతో గౌరవించేవారు, వారితో ఎంతో మర్యాదగా, సభ్యతతో, వినయంతో మాట్లాడేవారు. అలాగే చదువుకునేవారు, ఊరికొస్తే వారేదో ఘనాపాటీలమన్నట్లు విర్రవీగేవారు కాదు, తెలుగొచ్చినా ఇంగ్లీషులో మాట్లాడి మీసాలు ఎగురవేసేవారు కాదు. కర్షకులతో, కార్మికులతో, ఇంటి పనులు చేసేవారితో వారింటివారిలాగే ఎంతో కలుపుగోలుగా మాట్లాడేవారు వారు కూడా.

అప్పట్లో తెలంగాణాలో అంటరానితనం కూడా అట్టే ఉండేది కాదు. విద్యాలయాల్లో అందరూ కలిసి చదువుకునేవారు, పెద్ద కులాలవారి ఇళ్లల్లో కూడా హరిజనులు పనిచేసేవారు. ఎవ్వరో కొందరు తప్ప హరిజనులను సదరు ప్రజలంతా సమానులుగానే భావించేవారు.

ఆనాటి విద్యాలయాలన్నీ ప్రభుత్వ విద్యాలయాలే. అప్పటి చదువులన్నీ అయితే తెలుగు, లేకపోతే ఉర్దూ మాధ్యమం ద్వారానే జరిగేవి. ఏవో కొన్ని పెద్ద పట్టణాల్లో తప్ప ఇంగ్లీషు మీడియం స్కూళ్లు అట్టే ఉండేవి కావు. ప్రభుత్వ విద్యాలయాల్లో ఫీజులు దాదాపు ఉండేవి కావు. ఆ విద్యాలయాలన్నీ అందరూ కలిసి చదువుకునేవే కనుక వాటిలో చదివేవారందరూ ఏ కుల మత తారతమ్యాలు లేకుండా ఎంతో కలుపుగోలుగా కలిసిమెలిసి ఉండేవారు. విద్యాలయాలలో ఎన్నో ఆటలుండేవి, పాటలుండేవి, సాంస్కృతిక కార్యక్రమాలుండేవి, విద్యంతా ఒక సంబరంగా ఉండేది. అలా విద్యాలయాలలో విద్యలన్నీ సంస్కృతికి చేదోడువాదోడుగా ఉండేవి. విద్యలకు సంస్కృతులకు ఆదానప్రదానాలు విరివిగా ఉండేవి. విద్యలన్నీ మొదట సంస్కారాల కొరకు, సంస్కృతుల కొరకు, ఆ తదుపరే ఇతర అవసరాల కొరకన్నట్లు భావించబడేవి.

ఇపుడు విద్యకు సంస్కృతికి సంబంధం దాదాపు తెగిపోయింది. ఇపుడు విద్యకు ఉద్యోగానికి మాత్రమే సంబంధమేర్పడింది. అపుడు విద్యకు ఘనానికి సంబంధముండేది, ఇపుడు విద్యకు ధనానికి సంబంధమేర్పడింది. ఇపుడు విద్యంతా ఒక గ్లామర్ విద్య చమక్, ధమక్, పెద్ద పెట్టుబడుల విద్యయిపోయింది, విద్యకు చెందిన పెట్టుబడి అటు విద్యాలయాలు స్థాపించేవారికి, ఇటు విద్యాలయాల్లో చదివేవారికి పారిశ్రామిక పెట్టుబడి లాంటిది, వ్యాపార పెట్టుబడి లాంటిదయిపోయింది. విద్యంతా లాభాల కొరకు, పెద్ద ఆదాయాల కొరకన్నట్లు పరిణమించింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండి తెలంగాణాలో విద్యా స్వరూపమే మారిపోయింది. విద్యంతా ధనవంతులకు చెందిన విద్యయిపోయింది. దీనికి ప్రధానంగా ప్రభుత్వ పాలసీలే కారణాలనక తప్పదు.

(1) మొదట ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాలనన్నింటినీ తగినన్ని వనరులు సమకూర్చక నిర్వీర్యం చేసింది. అలా ఆ విద్యాలయాల నన్నిటినీ కుంటుపడేట్టు చేసింది. ప్రభుత్వ విద్యాలయాల విద్యలను ఎందుకూ కొరగాకుండా చేసి ప్రజల దృష్టిలో వాటిని తక్కువ శ్రేణికి చెందినవిగా మార్చింది.

(2) అటు తదుపరి ప్రభుత్వం ప్రతియేటా ప్రైవేటు విద్యాలయాలను ప్రోత్సహించడం మొదలెట్టింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో వేలకువేలు ప్రైవేటు విద్యాలయాలు ప్రతియేటా స్థాపింపబడినాయి.

(3) ప్రైవేటు విద్యాలయాలలో పెట్టుబడులు ఎక్కువ, ఫీజులు ఎక్కువ, డొనేషన్లు ఎక్కువ కనుక వసతులు, సౌకర్యాలు, ఆకర్షణలు కూడా ఎక్కువే.

(4) ధనవంతుల పిల్లలందరూ ఈ విద్యాలయాలకు మొగ్గు చూపడం మొదలైంది. బీదవారందరూ మిగిలిన ప్రభుత్వ విద్యాలయాలకు మాత్రమే పరిమితమయ్యారు.

(5) ఒకప్పటి తెలుగు మీడియం, ఉర్దూ మీడియం విద్యాలయాలన్నీ ఇంగ్లీషు మీడియంలోకి మార్చబడినాయి. ఇంగ్లీషు మీడియం విద్యాలయాల్లో చదివితే పెద్ద

ఉద్యోగాలు వస్తాయన్న అభిప్రాయం, అభిలాష పెరిగింది.

(6) అటు వనరులు, వసతులు, సౌకర్యాలు ఎక్కువ ఉండడం వలన, ఇటు ఇంగ్లీషు మీడియంవి కావడం వలన ప్రైవేటు విద్యాలయాలకు డిమాండ్ బాగా పెరిగింది.

(7) ధనవంతుల పిల్లలే అధిక పెట్టుబడులతో స్థాపించబడిన విద్యాలయాల్లో చదవడం, వారి విద్యలే ఎంతో కొంత బాగుండడం, వారే రాజకీయాలలో, పరిపాలనలో పైచేయి వారు కావడం యథాతథమయిపోయింది.

(8) ప్రభుత్వంలో ప్రైవేటు విద్యాలయాల్లో అధిక ఫీజులు చెల్లించి చదివిన వారి సంఖ్యే పెరుగుతూ పోయింది. వారంతా అలాంటి విద్యాలయాల్లో చదివిన వారే కనుక అలాంటి విద్యాలయాలలో ఫీజులు ఎంత పెంచినా, డొనేషన్లు ఎంత రాబట్టినా వారు కల్పించుకోకపోవడం, పట్టించుకోకపోవడం పరిపాటయింది.

(9) పరిపాలనా వ్యవస్థల్లోనే కాదు, పరిశ్రమలలో, రాజకీయాలలో కూడా ధనవంతుల ప్రమేయమే రానూ రానూ ఎక్కువయింది.

(10) అలాంటి విద్యాలయాల్లో చదివినవారు ఇంటా బయటా అయిదు నుండి పది శాతం కన్నా ఎక్కువ పెద్ద ఉద్యోగాలలో నెగ్గకున్నా సదరు ప్రజలలో కూడా ఆ విద్యాలయాల్లో చదివే వారికే పెద్ద ఉద్యోగాలు వస్తాయన్న భ్రమ, ప్రచారం మరీ పెరిగింది.

వీటన్నిటి వలన విద్యకు, సంస్కృతికి ఒకప్పటి సంబంధం తెగిపోయింది. ఒకప్పటి తెలంగాణా సంస్కృతి ఇపుడు ఎంతో మారిపోయింది. సీమాంధ్ర ధన సంస్కృతి ప్రభావం దానిపై ఎంతో పడింది, ఇంకా పడుతూనే ఉంది. ఒకప్పటి తెలంగాణా ఈ సంస్కృతికి చెందింది కాదు. ఇది దానికి కొనితెచ్చుకున్న సంస్కృతి, ఇంపోర్టెడ్ సంస్కృతి. ఈ విద్య వలన సీమాంధ్రులు ఉద్యోగాలలో, ఉద్యోగోన్నతుల్లో నూటికి అరవై నుండి డెబ్భైశాతం వరకు లాభపడితే, తెలంగాణా వారు నూటికి అయిదు నుండి పదిశాతం వరకు మాత్రమే బాగుపడ్డారు. కాని తెలంగాణావారి సంస్కృతి మాత్రం అరవై శాతం నుండి డెబ్భై శాతం వరకు కుంటుపడింది.

తెలంగాణా విద్యార్థులు చాలామంది బీదవారు కనుక వారు ఎలాగూ చాలామంది అధిక పెట్టుబళ్లతో సీమాంధ్రులు స్థాపించే విద్యాలయాల్లో చేరలేరు. వారు ఎలాగూ తక్కువ స్థాయికి చెందిన ప్రభుత్వ విద్యాలయాలలో, మామూలు తరహా ప్రైవేటు విద్యాలయాల్లో చేరవలసిందే. అలాంటి వారి విద్య ఎలాగూ బాగుండదు. వారు అధిక సంఖ్యలో ఉద్యోగాలలో, పోటీ పరీక్షల్లో నెగ్గలేరు. ఇపుడు జరుగుతున్నదంతా అదే. దాని పర్యవసానంగానే ఎంతోమంది నిరుద్యోగులు, నిరాశకు గురయినవారు నక్సలైట్లుగా మారిపోవడం కూడా జరుగుతోంది. విద్యా సంస్కృతులు కుంటుపడితే జరిగే పరిణామం ఇదే. అంతే కాకుండా పెద్ద పెద్ద పట్టణాలకు నిరుద్యోగుల వలస కూడా ఎక్కువై దోపిడీలు, దొంగతనాలు, దుర్మార్గాలు, దుష్టచర్యలు

ఎక్కువయే ఆస్కారం ఏర్పడుతోంది. దీనికంతకూ విద్యాప్రమాణాలు క్షీణించడం, తద్వారా సంస్కార సంస్కృతులుయనక తప్పదు. ఇలాంటివి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాకే ఎక్కువవుతున్నా యనక కూడా తప్పదు.

విద్యా ప్రమాణాలు పడిపోయినాకొలదీ, విలువలు క్షీణించినా కొలదీ, సంస్కృతీ సంస్కారాలు కుంటుపడినా కొలదీ, అన్ని రంగాలలో అవినీత కూడా ఎంతో పెరిగింది, ఇంకా పెరుగుతూనే ఉంది. నీతి నిజాయితీ దిగజారుతూనే ఉంది. సీమాంధ్రా ధన సంస్కృతి తెలంగాణా సాదాసీదా సంస్కృతిని ఇంతవరకే ఎంతో దెబ్బతీసింది. కలిసుంటే ఇంకెంతో దెబ్బతీస్తుందనడంలో ఏ సంకోచమూ, సందేహమూ అక్కరలేదు. ఎందుకంటే ఇప్పుడు హైదరాబాదులో, పెద్ద పెద్ద పట్టణాలలో విద్యాలయాల స్థాపన, విద్యాలయాల ద్వారా లాభాలు గడించడం, లికర్ వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారం, గనుల వ్యాపారం, సినిమా వ్యాపారం, మీడియా వ్యాపారం, రాజకీయ వ్యాపారం లాంటిదయి పోయింది. మెలమెల్లగా విద్య 'ఎడ్యుకేషన్ మాఫియా' లాంటిదయిపోతోంది. దీనికి సీమాంధ్రుల విద్యాలయాల స్థాపనారీతులు, విద్యలు గరిపే నీతులు, విధానాలు, లక్ష్యాలే కారణమనక తప్పదు.

సంస్కృతిలో ప్రాంతీయ భాషల మాండలికాల స్థానం

-డాక్టర్ కొండలరావు వెల్చాల

"హెమింగ్‌వే" యను ప్రఖ్యాత రచయిత "ఫిషర్‌మెన్ అండ్ ద సీ"యను ఒక మంచి నవల రాశాడు. ఇతర సాహిత్య నిర్మాణ ప్రత్యేకతలతో పాటు దానిలోని అతి ముఖ్యమైన ప్రత్యేకత దాని భాషంతా "జాలర్ల భాష" కావడం.

ఆ భాష తెలియాలంటే, ఆ నవల యొక్క అందాన్ని చూరగొనాలంటే జాలర్లు వారి దైనందిన జీవితాల్లో, వృత్తికి చెందిన పరిసరాల్లో వాడే ప్రత్యేకమైన పదజాలం, పలుకుబళ్లు, దేశీయాలు, సామెతలు మున్నగునవి తెలియాలి. అలాగే సముద్రం గురించి తెలియాలి, చేపల గురించి తెలియాలి, జాలర్ల వృత్తి నిర్వహణల గురించి తెలియాలి, ఆ వృత్తిలో తటస్థించే ఆపదల గురించి, ప్రమాదాల గురించి తెలియాలి. ఆ వృత్తికి చెందిన విచారాలు, విషాదాలు, ఆనందాలు మున్నగునవన్నీ తెలియాలి. జాలర్ల జీవిత విధానాలు, వారి ఆలోచనా ఆచరణ సరళి తెలియాలి. అవి ఆ ప్రాంతానికి, వృత్తికి చెందిన వాడుకభాషలో, పరిభాషలో వుంటాయి. అవన్నీ పట్టణాలలో నివసించే వారి భాషలో వుండాలని అనడం, అనుకోవడం ఒక విధంగా పరిహాసమూ అవుతుంది, పరిహాసాల పాలు కావడమూ కూడా అవుతుంది. ఇపుడు తెలంగాణా భాష పట్ల జరుగుతున్నది అదే. ఆ భాష ఈ భాష కావాలని అనడం, అనుకోవడం, నిర్దేశించడం.

వృత్తులను బట్టి, ఆయా ప్రాంతాలకు చెందిన చారిత్రక, భౌగోళిక కారణాలను బట్టి ఆయా ప్రాంతాలలో ఆయా ప్రాంతీయ భాషలు లేక మాండలికాలు ఉంటాయి. అది ఒక విధమైన పనులకు, ఆచారాలకు, రీతులకు, నీతులకు, అలవాట్లకు చెందిన "కలెగలుపు భాష", "మిశ్రమభాష". ఆ భాషకు ఆ నేల వాసనే వుంటుంది. మరొక నేలకు చెందిన వాసనను అచట వెదకులాడడం అపహాస్యంపాలు కావడమే అవుతుంది.

ఆయా ప్రాంతాలలో చెలామణీలో యున్న పదాలకు అచట ప్రత్యేకమైన అర్థాలుంటాయి. పదాలు అవే అయినా వేరేచోట ఆ పదాలకు వేరే అర్థాలుంటాయి. ఉదాహరణకు తెలంగాణాలో "గుంట" అంటే నూటఇరవై అయిదుగజాల భూమి యని కొలతకు చెందిన అర్థముంది. అదే పదానికి కోస్తాంధ్ర ప్రాంతంలో "సాని" యను అర్థముంది. అలా ఎన్నో పదాలుంటాయి. తెలంగాణాలో "కోడలును ఎప్పుడు తోలుకు పోతావు" అని అంటే ఆంధ్రావారు "వారేమి గోదలా అలా తోలుకు పోవడానికి" యని ఎద్దేవా చేస్తారు. 'తోలుకు పోవడమంటే' తెలంగాణాలో 'పెంట తీసుకొనిపోవడ' మని అర్థం. అది అచటి వాడుక. అలా ఎన్నో వాడుకలుంటాయి.

అందువలన ఒకే ప్రాంతపు భాషను ప్రామాణిక భాషగా నిర్దేశిస్తే ప్రాంతీయ భాషలతో పాటు ప్రాంతీయ సాహిత్యాలు, సంస్కృతులు కూడా అడుగంటుతాయి. ఆ ప్రాంతాలు వాటి అస్తిత్వాలను, ప్రత్యేకతలను, ఆనవాళ్లను కోల్పోతాయి. భాషలకు మాండలిక పదాలే కాకుండా, మాండలిక యాసలూ ఉంటాయి. ఆ పదాల, యాసల వలననే ఆ ప్రాంతపు భాషకు ఒకానొకవిధమైన "వ్యక్తిత్వం" వస్తుంది. అన్ని ప్రాంతాల భాషలను ఒకటే చేయడం వాటి వ్యక్తిత్వాలను అంతమొందించడమే అవుతుంది కాని మరొకటి కాదు.

ఉదాహరణకు ఇపుడు డా॥ ముదిగంటి సుజాతారెడ్డి గారి "యశోదారెడ్డి కథనశిల్పం"యను వ్యాసం నుండి నాలుగు పంక్తులు తీసుకుందాం. అవి ఎంత ప్రాంతీయ ప్రత్యేకతగలవో, వాటిని మరో తెలుగుభాషలో రాస్తే వాటి అందం, ఆనందం ఎలా దెబ్బతింటాయో చూద్దాం.

1) "కూసుంటే తప్పు, లేస్తే తప్పు. అయ్యో దేవుడా! కూసున్కం లేస్కం అటుపెట్టి నా నెత్తి నేను దువ్వుకున్నా తప్పే! దువ్వుకోకుంటే అంతకన్నా తప్పు! తుమ్మిన తప్పే, దగ్గిన తప్పే!" అట్లా వుండేది కోడలి పరిస్థితి. గంజ కత్తెర్ల సొప్పదంటోలె నలిగి నజ్జిగిజ్జి అయితుండెనంటె నమ్మండి!" (కోడలమ్మ ఎతలు)

(2) "ఆకురాలిన సెట్టోలె, దురమాగిన పండోలె, పండువారిన ఆకోలె, పీసువారిన బీరకాయోలె, వొట్టిపోయిన చెర్వోలె, దోసిన యిల్లోలె, రెక్కలూడిన పక్షోలె వున్న ఎలమంద వోలె, పసినిమ్మపండోలె, పచ్చని సిగురోలె, దోరకాయోలె, దానిమ్మ పువ్వోలె, రెక్కలొచ్చిన చిల్కోలె, పులిబెదురు తాకని జింక పిల్లోలె, కొబ్బరి గిన్నోలె వున్న మన్మరాలని... వొచ్చిండు" (ఆ రొండు నావి)

(3) "అందికే, ఆడ తీరొక్క బిచ్చగాడు, కాలున్నోడు, లేనోడు, కన్నున్నోడు, కన్నుగాననోడు, ఈడ్పుగాళ్ళోడు, తొంట సెయ్యోడు, తాకట్లోడు, తంటాలోడు, పల్లీలమ్మేటోడు, పండ్లిగిలించేటోడు, మంది పిల్లలను చాట్లేసి బాలెంతననెటోళ్ళు, రోగి, రొష్ణ, కూలికి కుష్ణను మోసెటోడు, ఒకే తాడు ముగ్గురు గుడ్డోళ్ళు, ఒక కుంటి, ఒక గుడ్డి యిట్ల ప్రంచికంల వున్న సబ్బుండజనం తీరు తీరు రూపకం కానొస్తరు" (తరాలనాటి తెగులు)

(4) "మొన్న మూడు దినాలు మొగులు చిల్లివోయినట్ల, ముంతన గుమ్మరిచ్చినట్ల, మిన్నూ మన్నూ కలిపి ఏకంగ వొడికినట్ల ఏకసిస్తుగ ఒకటే వాన! వొర్రెలు, వొంపులు, కాల్వలు, మడుగులు, కుంటలు, చెర్లు, ఏర్లు, నదులు అన్ని నీళ్ళు నిండంగ పిక్కటిల్లి గండ్లుపడి, కట్టలు దెంపుకొని, ఏకమైన వొడ్లెక్కి అలుగులు దుంకి చిన్నా పెద్ద తారతమ్యాలుడిగి మిర్రుపల్లాలు ఒకటై వొంపులు దీరి, ఈ నురోసాలు ఇడ్సి, ఒక్కబాటగా, ఒక్క సూటిగా, జతజతగా కలెగల్పుగా సముద్రయ్య దిక్కు నడ్సినయ్". (మోనా)

పైన ఉదహరించిన యశోదారెడ్డి గారి భాషాపంక్తులు చూడండి. అవి ఎంత అందంగా, ఆనందంగా తెలంగాణా భాషా సంస్కృతిని తెలంగాణా వారికే కాకుండా, తెలంగాణేతరులకు కూడా ఎంత వికాసంతో పాటు వినోదం కలిగిస్తున్నాయో! అలాంటి భాషను, దాని సంస్కృతిని ఎలా సీమాంధ్ర ప్రామాణిక భాషలో పెట్టగలం? అలా పెడితే అది బాగుంటుందా? అది అయ్యవారిని చేస్తే కోతయినట్లు కాదా?

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి గారు యశోదారెడ్డి గారి తెలంగాణా భాషా సౌందర్యం గురించి రాస్తూ "భాషా సొగసుల కోసం, నుడికారాల సొంపుకోసమైనా ఆమె కథలను చదవాలి, తెలంగాణా నాగరికత తెలిసికోవడానికి ఆమె కథలు చదవాలి" అంటారు వారి "యశోదారెడ్డి కథనశిల్పం" వ్యాసంలో. తెలంగాణా వారి జీవన విధానం, తెలంగాణాలోని పండుగలు, చుట్టరికాలు, ప్రయాణాలు, ఆప్యాయతలు, వంటలు, మర్యాదలు, పలకరించు విధానాలు, కూర్చునే, నిల్చునే తీరులు మున్నగునవి వర్ణించాలంటే ప్రామాణికమైన కోస్తాంధ్ర భాషలో వాటిని వర్ణిస్తే బాగుంటుందా? అపుడది హెమింగ్‌వే రచించిన 'ఫిషర్‌మెన్ అండ్ ద సీ' యను ఉత్తమోత్తమ నవలను సీమాంధ్రభాషలో రాస్తే ఎలాగుంటుందో అలాగుంటుంది సర్వాంధ్ర వాసనలతో.

"భాషాభావాలు ఎక్కడో అంతూపొంతూ చిక్కని ఆకాశంనుండి ఊడిపడవు. అవి జీవితంనుండి, జనానీకం నుండి, పరిసరాలనుండి, నిశితమైన చూపునుండి, అనుభవాల నుండి మొలకెత్తుతాయి. అలాగే కధా వస్తువులు కూడా" అంటారు డా॥యశోదారెడ్డి గారు. అది అక్షరాలా నిజం. కనుక ఒక ప్రాంతం భాషను ఇంకొక ప్రాంతంపై రుద్దడం నిరంకుశత్వం, దురహంకారమే ఔతుంది కాని అది విద్యకూ పనికొచ్చేది కాదు, సంస్కృతికి అంతకన్నా పనికొచ్చేది కాదు. ప్రాంతీయ భాషలను, వాటి పదాలను మనం ఎంత కాపాడుకుంటే సాహిత్యానికి అది అంత ఎక్కువ తోడ్పడుతుంది. ఒక భాషలో ఒక భావానికి సరిపోని పదాలు ఇంకొక భాషలో దొరికే అవకాశముంటుంది. అంతేకాదు, ప్రతి ప్రాంతం వారు వారివారి అధ్యయనాల, అనుభవాల ప్రకారం భాషాభ్యుదయానికి, తోడ్పడే ఆస్కారం ఏర్పడుతుంది. అలా భాష ఎన్నో అవసరాలకు ఎన్నో విధాలుగా పెరుగుతుంది. ఎలాగైతే ఇంగ్లీషు భాష ఇతర భాషలనుండి పదాలు కొనితెచ్చుకొంటుందో అలాగే మన ప్రాంతీయ భాషలనుండి కూడా మనం అవసరమైన పదాలను కొనితెచ్చుకోవడంలో తప్పేముంది? ఒక భాషకు ఒక విధానం, మరొక భాషకు మరొక విధానం ఎందుకు అవలంబించాలి. ఒకే భాషయని మనమనుకొనేదంతా (అది ఆంగ్లేయభాషైనా, తెలుగు భాషైనా) నిజంగా ఒకటేనా? కావుకదా. వాటిలో ఎన్నో తారతమ్యాలు, భేదాలుంటాయి. ఇంగ్లండులో వాడబడే ఇంగ్లీషు భాష ఎలాగైతే ఇతర ప్రాంతాలలో వాడబడే ఇంగ్లీషు భాషనుండి కూడా పదాలు కొనితెచ్చుకొంటుందో మనం కూడా అదే పని ఎందుకు చేయగూడదు. ఒక ప్రాంతం ఇంకొక ప్రాతం నుండి అవసరమైన పదాలను ఎందుకు కొని

తెచ్చుకోగూడదు? ఒకే ప్రాంతపు భాషను అన్ని ప్రాంతాలవారి నెత్తిపై ఎందుకు రుద్దాలి?

ఈ సందర్భంగా **'పందిరి మల్లిఖార్జునరావు శతజయంతి సంపుటము-3 : భాషా చరిత్ర, సంస్కృతి'**లోని జమ్మలమడుగు మాధవరాయశర్మ గారి మాటలను పేర్కొంటూ, చేరా గారన్న మాటలు గమనించదగినవి.

"చాలామంచి తెలుగు పదాలు తెలంగాణా, రాయలసీమ గ్రామగ్రామాల్లో ఉన్నాయి. వాటిని సాదరంగా స్వీకరించి అందరూ అందుకొని ఉపయోగించాలి.

బ్రాహ్మణులు (లేక ఒక ప్రాంతీయులు కావచ్చు) తమ గృహ పరిసరములలో మాట్లాడుకొను భాషను అందరూ అనుకరించాలని ఆశిస్తున్నారు. భాషలో వేగంగా రావలసిన పరివర్తనానికి అది అనుకూలం కాదు. ఈ కాలంలో వారి భాషే కావాలని పట్టుదల ఎందుకు? తదితర వర్ణాల, వర్గాల (ప్రాంతాల) వారు తమ నిత్యపరిచితభాషను బాగా వ్యావహారంలోకి తీసికొని రావాలి."

– జమ్మలమడుగు మాధవరాయశర్మ

"ఇంతటి సమైక్య దృష్టి అందరిలోనూ ఉంటే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం అవసరముండేది కాదు. కాని యాభై ఏళ్లలో చరిత్ర గతి వేరే విధంగా ఉంది."– చేరా



ఆంధ్రా ప్రాంత రాజకీయ సంస్కృతి

-డాక్టర్ కొండలరావు వెల్చాల

సంస్కృతి (Culture)యను పదాన్ని ఆంగ్ల భాషలో సంస్కారానికి వాడతారు, రీతికి (system) కు, విషయానికి (discipline) కు కూడా వాడుతారు.

ప్రత్యేక తెలంగాణా వాద సందర్భంలో 'సంస్కృతిని' ఇరువర్గాల వారు సంస్కారమను అర్థంలోనే వాడుతున్నారు.

ఈ సందర్భంగా సంస్కృతియను పదాన్ని రాజకీయ సంస్కృతికి కూడా వర్తించక పోతే తక్కిన వాదనలనన్నింటినీ శ్రీకృష్ణ కమిటీ వారు, ఇవన్నీ మామూలే, అంతటా పరిపాటేయని కొట్టివేసే, నిర్లక్ష్యంచేసే ఆస్కారం చాలా వుంది.

అందుకొరకు రాజకీయ సంస్కృతి ఆంధ్రాప్రాంతంలో ఒకానొక విధంగా ఎందుకుంది, దానికి కారణాలేమిటి యని తెలంగాణావాదులు హేతుబద్ధంగా విశ్లేషించి వివరించవలసిన అవసరం ఎంతైనా వుంది. వారి రాజకీయ సంస్కృతి అలా వుంది కనుకనే వారి తక్కిన పరిపాలనా సంస్కృతులన్నీ అలాగే వున్నాయి, అందువలననే అన్ని అన్యాయాలూ జరుగుతున్నాయి. అది ఇన్నాళ్ళూ అలా కొనసాగింది, ఇంకా అలాగే కొనసాగుతుందని చారిత్రాత్మక నేపధ్యాన్ని ఎత్తుకొని నిరూపించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రాప్రాంత రాజకీయ సంస్కృతి ఒకానొక విధంగా ఉండడానికి చారిత్రకపరమైన కారణాలు ఇపుడు పరిశీలిద్దాం, ఆ సంస్కృతికి వారు కారకులు కారు, వారి చరిత్రే, వారి నేపధ్యమే కారణమని చెప్పుటకు.

అలాంటి రాజకీయ సంస్కృతి వారికి బ్రిటీష్ పాలననుండి వచ్చి దాదాపు 500 యేండ్లవరకు కొనసాగింది. ఒక ప్రాంతం అంతకాలం ఒకే ఒక పరిపాలనలో ఉండడం వలన జరిగిన పరిణామమది. వారి చరిత్రలో అదొక భాగమయింది. తెలంగాణా వారు ఆ కారణానికి ఆంధ్ర ప్రాంతం వారిని నిందించడం లేదు, వారిపై నేరారోపణ చేయడం లేదు. ఇది మీ సంస్కృతి, మీకది ఇలా వచ్చింది, దానిని మీరు మాపై రుద్దుతున్నారు, అది మీ ప్రకృతిలోని, మీ నైజంలోని భాగమైపోయి బీటలు వారింది, కనుక ఇపుడే కాదు ముమ్మందు కూడా అది పోయే అవకాశం ఏమాత్రం లేదని మాత్రమే చెబుతారు.

ఇక బ్రిటీష్ పరిపాలనా ప్రభావిత రాజకీయ సాంస్కృతిక అంశాలను ఇపుడు పరిశీలిద్దాం.

- *బ్రిటీష్ వారి పరిపాలనా సంస్కృతి వలసపాలన సంస్కృతి.*
- *బ్రిటీష్ వారి పాలనా సంస్కృతి పెట్టుబడిదారీ సంస్కృతి.*
- *బ్రిటీష్ వారి పరిపాలనా సంస్కృతి వ్యాపార సంస్కృతి.*

- *బ్రిటీష్ వారి పాలనా సంస్కృతి అధిపత్య సంస్కృతి.*
- *బ్రిటీష్ వారి పరిపాలనా సంస్కృతి పరిపాలించేవారు గొప్పవారు, పరిపాలించబడే వారు తక్కువవారు యని భావించే బడా-ఛోటా నైజ సంస్కృతి.*
- *బ్రిటీష్ వారి పాలనా సంస్కృతి "విభజించి పరిపాలించు" మను నీతికి, రీతికి చెందిన సంస్కృతి.*

అలాంటి బ్రిటీష్‌వారి పరిపాలనా సంస్కృతితో 500 యేళ్ళు ప్రభావితమైన రాజకీయ పరిపాలనా సంస్కృతి ఆంధ్రా ప్రాంతం నాయకులది, పెట్టుబడిదారులది, పారిశ్రామికవేత్తలది, వ్యాపారవేత్తలది. ఆ సంస్కృతినే వారు తెలంగాణా ప్రాంతంపై ప్రయోగిస్తున్నారు. అలాంటి బ్రిటీష్ వారి కుటిల కుచారపు నీతిని, బ్రిటీష్ వారి పక్షపాత discriminatory రీతిని, విభజించి పాలించు నీతిని, కొల్లగొట్టు నీతిని, దోపిడీదారీ రీతిని. వారి ప్రకృతికి సహజమైన సంస్కృతిని తెలంగాణా ప్రాంతం వారిపై పాటిస్తున్నారు వారు.

ఆ సంస్కృతి కొన్ని శతాబ్దాలది కదా మరి! అది వారిలో వేర్లు నాటుకొని యున్నది కదా! అదెలా పోతుంది అవలీలగా. అందుకే పోవడం లేదు. అందుకే వారు ఎన్ని వాగ్దానాలు చేసినా, ఎన్ని ఒడంబడికలపై సంతకాలు చేసినా, ఆ ప్రాంతపు పరిపాలకులు వారి నైజాన్ని, వారి ప్రకృతిని, వారి సంస్కృతిని విడనాడజాలడం లేదు. పాపం అది వారి తప్పుకాదు, వారి గతానిది, వారి చరిత్రది. అందుకే వారికన్నా ఎక్కువ వారి చరిత్రను, వారి గతాన్ని తప్పుపడుతున్నారు తెలంగాణావారు. కాని ఎలాగైతేనేమి తెలంగాణా వారే కదా అన్ని విధాలా అవస్థలపాలవుతున్నారు, ఎన్నో అన్యాయాలు, అధర్మాలు, అవినీతులు, అధికార మోసాలు మోస్తున్నారు.

దీనికి పరిష్కారమేమిటి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం తప్ప, విభజన తప్ప?

ఇచట మరొక విషయం చెప్పితీరాలి. అదేమిటంటే ఆర్థిక అన్యాయాలు, రాజకీయ అన్యాయాలు, సాంస్కృతిక సామాజిక అన్యాయాలు కేవలం వాటికి చెందినవే కావు. ప్రధానంగా అవన్నీ తెలంగాణా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవి. తెలంగాణావారి ఆత్మ గౌరవాన్ని అవమానపరచేవి. కనుకనే ప్రత్యేక తెలంగాణా వాదం కేవలం ఆర్థికవాదం మాత్రమే కాదు, ఆత్మగౌరవవాదం కూడాయని శ్రీకృష్ణ కమిటీ వారు గుర్తించవలసిన అవసరం ఎంతైనా వుంది. దానిని వారి దృష్టికి తెలంగాణా ప్రాంతీయు లందరూ తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుంది.

"నేను విచారిస్తున్నది 'నేరం' ఉన్నందుకు కాదు, 'నేరప్రకృతి' యునుది ఒకటి ఉన్నందుకు" అంటాడు దార్శనికుడు ఖలీల్ జిబ్రాన్. ఆ ప్రకృతివలననే ఆ 'నేరం' ఉత్పన్నమౌతుందంటారు. కనుక తెలంగాణావారి ఉద్యమం, ఆ ప్రకృతిని, ఆ సంస్కృతిని వ్యతిరేకించే ఉద్యమం.

ఇది ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి చెందిన అతి ముఖ్యమైన అంశం.

తెలంగాణావారి పోరాటం కేవలం ఆర్థిక పరమైన పోరాటమని అనేవారు, అనుకునేవారు దీనిని గ్రహించాలి, గుర్తించాలి. ఆర్థికం కేవలం ఆర్థికంగానే నెత్తిపై ఊడిపడదు, అది ప్రధానంగా పరిపాలకుల నైజంగా ఊడిపడుతుంది.

A 'system' is the product of a 'psyche'. That is what the Telanganites have to dirve home to the Justice Sri Krishna Committee.

అది వారి దృష్టికి తీసుకురాకుండా, అది నిరూపించకుండా తక్కినవన్నీ రాస్తే, చెబితే మూలం వదలి మూలను పట్టుకుని ఊగులాడి నట్లుంటుంది కాని ఒరిగేది, ఒనగూరేది పెద్దగా ఉండదు.



వ్యతిరేకం కాదంటే అనుకూలం కాదా?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

తెలంగాణా ఇస్తారా, ఇవ్వరా? వస్తుందా, రాదా? అది వేరే సంగతి కాని, తెలంగాణా వ్యవహారమంతా విద్యావంతులను, వికాసవంతు లను, వినయ వివేకవంతులను ఈనాటి రాజకీయ భాష పట్లా, రాజకీయుల 'వంచన వచనాల' పట్ల దిగ్భ్రాంతులను చేస్తోంది. సదరు ప్రజలను ప్రజా స్వామ్యం పట్ల విశ్వాసాన్ని కోల్పోయేట్లు చేస్తోంది.

ఎన్ని అబద్ధాలు! ఎన్ని మోసభాషలు! ఎన్ని మాటల మార్పులు! ఎన్ని అంగీకారాల తిరస్కారాలు! ఎన్ని పార్టీల, ప్రభుత్వాల వాగ్దానాల ఉల్లంఘనలు! ఎంత నీతి ఘోరం, రీతి నేరం! కళ్లు భరించలేనన్ని, చెవులు వినజాలనన్ని, బహుశా యావత్ప్రపంచంలోనే ఎన్నడూ కనీవినీ ఎరుగని ప్రజాస్వామ్య ఖూనీ ఇది. ప్రజాస్వామ్యానిదే కాదు, నాగరికతది, సంస్కారానిది, భారతీయ సంస్కృతిది.

పెద్దలనబడే వారే ఇలాంటి పనిచేస్తే వారి పిల్లలకు వారు ఎలా ఆదర్శం కాగలరు? వారి మాటలను యువకులు ఎలా గౌరవించగలరు, పాటించగలరు, శిరసావహించగలరు? ఇక పుస్తకాలలో, పాఠాలలో చెప్పబడే నీతులకు, రీతులకు, సత్యాలకు, ధర్మాలకు, న్యాయాలకు ఎలా విలువుంటుంది? ఇక విశ్వాసానికి తావెక్కడుంటుంది, వినయానికి?

రాజకీయాలలో ఇపుడు భావానికి భాషకు సంబంధం, అనుబంధమే తెగిపోయింది. ఒకే పదానికి ఎన్నో కొత్తర్థాలు, వ్యాఖ్యానాలు సృష్టించారు మనవారు. భళేరా! యని యనిపించుకున్నారు మన ఆంధ్రులు యావత్ప్రపంచమంతా.

ఇక అసలు విషయానికి మరీ నిన్న మొన్నటి మాటలకొస్తే, గాదె వెంకటరెడ్డి గారి "కాంగ్రెస్‌వారు తెలంగాణా కాదనలేదు కాని, ఇస్తామని ఎప్పుడూ అనలేదు" ఉవాచ తెలంగాణా వారినందరినీ ఆశ్చర్యపరచింది. అబ్బా! ఎంత కుటిలానికి, కువారానికి, కల్మషానికి దిగజారారే మనను 'తమ్ముళ్ళు' అనే మన 'అన్నయ్యలు' యని ముక్కు మీద వ్రేలేసుకొనేట్లు చేసింది అది వారిని.

తెలంగాణా ఏర్పాటును కాదనడం లేదంటే ఔనన్నట్లు కాదా? ఇవ్వడానికి అభ్యంతరం లేదంటే ఇస్తామన్నట్లు కాదా? ఒక యువలిని ఒక యువకుడు 'నన్ను పెళ్ళాడతావా'? యని అడిగితే 'నాకు అభ్యంతరం లేదు' అని ఆ యువతి అంటే అది ఔనన్నట్లా, కాదన్నట్లా?

తెలంగాణా కాదనడం లేదని ఎవరో కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా అంటే దానిని ఎవరూ పెద్దగా పట్టించుకోరు కాని, అదే మాట అక్షరాలా ప్రజలకు ప్రాతినిధ్యం

వహిస్తోన్న పార్టీలే, ప్రభుత్వాలే, సాక్షాత్తూ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, 'అధిష్ఠానవర్గం' అనబడేవారే. దాదాపు అన్ని పార్టీలకు చెందిన అధిపతులే అంటే, ఆ మాట అందరు అన్నట్లేనా లేక కొందరా? అది 'కాన్సెన్సెస్' అవుతుందా లేక మరొకటా?

'ఏకాభిప్రాయం', 'ఏకాభిప్రాయం' అని ఈ మధ్య అన్నిచోట్లా ఆంధ్రులందరూ అంటున్నారు. ఏకాభిప్రాయమంటే వారి అభిప్రాయంలో 'రెఫెరెండమా'? లేక అనేకానేక కులాల, వర్గాల, మతాల, మూరాల, వృత్తిపరుల, విద్యార్థుల, కార్మికుల, కర్షకుల అభిప్రాయమా? అలాంటిది సాధ్యమా? అలా రాష్ట్ర విభజనలు ఇంతకు పూర్వం జరిగాయా? కాశ్మీర్‌లో చాలానాళ్ళనుండి ఏకాభిప్రాయ వాదనే జరుగుతోంది కదా. అలాంటి ఏకాభిప్రాయం కనుగొనడం జరిగిందా? రాష్ట్రాల విభజన ఏకాభిప్రాయ ప్రాతిపదికపై జరగాలని రాజ్యాంగంలో ఎక్కడైనా వ్రాసి ఉందా? అలాంటప్పుడు 'ఏకాభిప్రాయ' వాదన వితండ, విపరీతవాదన కాక మరేమవుతుంది?

చెప్పిసవారంతా కేవలం నోటి మాటలతోనే కాదుగదా 'తెలంగాణా ఏర్పాటుకు మేము వ్యతిరేకులం కాదు' అని చెప్పింది, ఇపుడు చెప్పలేదని తప్పించుకోజూసడానికి. ఆ మాటలు లిఖితపూర్వకంగా అన్ని పార్టీలవారు వారి మ్యానిఫెస్టోల్లో చేర్చారు, ఆయా పార్టీల అధినేతలు వివిధ సభల్లో, సమావేశాల్లో, సందర్భాల్లో నొక్కి వక్కాణించారు. ఇప్పుడు అలా మేము అనలేదంటే చిన్న పిల్లలు కూడా నవ్వరా? ఇదంతా ఏళ్ళు మీద పడినవారు చేసే పనేనా? ఇలాంటి వారు ఎలా నేతలు, ప్రజాప్రతినిధులు, మంత్రులు వగైరా అనిపించుకోవడానికి అర్హులు? రేపు ఏ ముఖం పెట్టుకొని వీరు సంఘంలో, సభ్య సమావేశాల్లో మాట్లాడగలరు? ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు, యువకులు పెద్దవారనబడేవారినెలా గౌరవిస్తారు? గుర్తిస్తారు? వారి పిల్లలే వారి మాటలు ఎలా పాటిస్తారు? నేతలనేవాళ్ళే ఇలా చేస్తే రేపు ప్రజలను వారు దేని గురించైనా ఎలా ఒప్పించగలరు, మెప్పించగలరు? ఇదేనా 'ఆంధ్రులు' పదే పదే 'ఆత్మగౌరవం', 'ఆత్మగౌరవం' అని ప్రతిరోజూ నోరు చించుకొని అరచే ఆత్మ గౌరవం? ఇది ఆత్మ గౌరవం ఎలా అవుతుంది 'ఆత్మ వంచన' అవుతుంది కాని? ఈ దేశంలో ఇప్పుడు ఎవరైనా ఆత్మ గౌరవం లేనివారంటూ ఉంటే వారు 'ఆంధ్రులే' నని ఇప్పటికే అచటచటా భారతదేశమంతటా చెప్పుకుంటూనే ఉన్నారు. అలాంటి వారు చరిత్రలో అధికారం కొరకు ఆత్మవంచనకు కూడా వెనుదీయని చరిత్ర హీనులుగా నిలిచిపోరా? తెలంగాణా వారే కాదు అన్ని దేశాల్లో, రాష్ట్రాల్లో ఆంధ్రులంటే మోసగాళ్ళు, అబద్ధాలాడేవారు, అన్యాయానికి ఒడిగట్టేవారని పేరు తెచ్చుకోవడం ఖాయం కాదా?

మాటల గారడీ, పేరడీ

-డాక్టర్ కొండలరావు వెల్చాల

తెలంగాణా వస్తుందా, రాదా? ఆంధ్ర రాష్ట్రం ఒకే రాష్ట్రంగా ఉంటుందా, ఉండదా? తెలంగాణా వస్తే తెలంగాణా వారికి మంచిదా, కాదా యను ప్రశ్నలను కాసేపు పక్కకు పెట్టి తెలంగాణా సమస్య గురించి పదేండ్లనుండి అధిష్ఠానవర్గం వారు, తెలంగాణేతర ప్రాంతం వారు ప్రయోగించిన పదాల గురించి సావధానంగా ఆలోచిస్తే అదొక అయోమయ మైన గారడీ, పేరడీ లాంటివిగా అనిపిస్తాయి, వినిపిస్తాయి మనకు, 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే' యన్నట్లు. ఇపుడా పదాలను కాస్త విశ్లేషిద్దాం.

కాన్సెసెస్ - ఏకాభిప్రాయం :

కాంగ్రెస్ పార్టీ వారు ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు మేము సముఖులమేనని 2004 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని, మొదట రెండడుగులు ముందుకు వేసి, పిదప ఒకడుగు వెనకకు వేసి 'కాన్సెసెస్' ద్వారా ఆ పని చేస్తామని చెప్పారు. 'ఏకాభిప్రాయం' అను పదాన్ని కాన్సెసెస్ అను పదానికి సమానార్థంగా వాడుతూ పోయారు తెలంగాణేతరులు.

ఇచ్చటే జరిగింది పదాల గారడీ, పేరడీ. 'కాన్సెసెస్' అంటే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో ఇచ్చిన అర్థం 'అత్యధికుల అంగీకారం, ఆమోదం', ఏకాభిప్రాయం' అంటే మనం మామూలుగా తీసికునే అర్థం 'అందరి ఆమోదం, అంగీకారం'.

అధిష్ఠానం ఆ పదాలకు చెందిన వేరు వేరు అర్థాల గురించి అంతగా పట్టించుకోక పోవచ్చు, ఏలాగూ కాలాయాపన చేయదలచు కున్నందున ఇతరులు సరేసరి.

అలా దాదాపు 5,6 ఏళ్ళు గడిచింది. ఈ లోపల తెలంగాణా ఉద్యమం కాస్త తగ్గింది. దీనికి తోడు తెలుగుదేశం, సి.పి.ియం. ప్రత్యేక తెలంగాణా స్థాపనకు అనుకూలంగా లేకపోవడం కూడా కాంగ్రెస్ వారికి కలిసొచ్చింది.

రెండవ దశలో తెలంగాణా ఏర్పాటు ఉద్యమం మరోసారి ఊపందుకుంది. అప్పుడు కాంగ్రెస్‌వారు వాడిన భాష 'అధిష్ఠానవర్గం నిర్ణయమే శిరోధార్యం', 'మేడమ్ గారి నిర్ణయమే మా నిర్ణయం' యనునది. ఈ భాష 2009 ఎన్నికల సందర్భంగా, ఆ పిదప తెలంగాణా రాష్ట్ర స్థాపన ప్రక్రియ చేబడతామని అధిష్ఠానవర్గం నిర్ణయించనంత వరకు వాడిన భాష. ఈ భాషే అన్ని ఎన్నికల్లో, అసెంబ్లీ లోపలా, బయటా, అంతటా, అందరూ వాడారు. అంతేకాదు, ముఖ్యమంత్రి గారు ఢిల్లీకి పోక పూర్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కూడా అందరూ ఆ భాషే వారికి వినిపించారు.

ఈ భాషంతా వారు వ్యక్తిగతంగా వాడిన భాషా లేక "ప్రజా ప్రతినిధులు"గా వాడిన భాషా?

ఈరోజు తెలంగాణేతరులు మరొక కొత్త భాష లేవనెత్తారు. తెలంగాణా రాష్ట్రస్థాపన 'అన్ని ప్రాంతాల వారి అభిప్రాయానుసారం జరగాలి' యను భాష.

'అందరి మనోభావాలు తెలిసికోవడం' అంటే ప్రతి వ్యక్తి మనోభావమా? అది రెఫరెండం లాంటిది అవుతుంది. అలాంటిది ఏ రాష్ట్ర స్థాపనలో కూడా ఇంతవరకు జరగలేదే? అలా జరగాలని రాజ్యాంగం శాసించలేదే? ఇది మరొక విధంగా 'ఏకాభిప్రాయం' లాంటిది. పార్టీలలోనే కుదరని ఏకాభిప్రాయం ప్రజల్లో ఎలా కుదురుతుంది? ఇలా మాట్లాడడం మోసపూరితమైన కుతంత్రం కాక మరేమౌతుంది?

15, నవంబర్ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మగారు 'తెలంగాణది ప్రత్యేక పరిస్థితి' యను వ్యాసంలో రాసినట్లు "తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్రా ప్రాంతంలో విలీనం చేసినప్పుడు అందరి అభిప్రాయాలు సేకరించే చేశారా?" ప్రజలు కాదు ప్రజా ప్రతినిధులే కదా దానికి ఒప్పుకున్నది. అది కూడా రంగనాయకమ్మ గారన్నట్లు ఎన్నో షరతులతో కూడిన తాత్కాలిక ఒప్పందమే. ఎపుడంటే అపుడు విడిపోవటకు ఆస్కారం కల్పించిందే.

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయం ఎప్పటికీ ప్రజా ప్రతినిధుల ద్వారానే వెల్లడించడం జరుగుతుంది కాని ప్రతి పౌరుడినుండి సేకరించడం జరగదు. 'ప్రజల ఓట్లే' ప్రజల అభిప్రాయాలుగా పరిగణించడం ప్రజాస్వామ్యంలో పరిపాటి. మరి అలాంటప్పుడు ప్రజాభిప్రాయం అనడంలో అర్థమేముంటుంది? ఓట్లు వేరు, అభిప్రాయాలు వేరా? ఓట్లు వేసిన వారందరూ మావైపే అన్నప్పుడు ఇపుడు వారే మరోవైపు ఎలా అవుతారు. అపుడు మీ వైపు తిప్పుకున్నవారిని ఇపుడెందుకు తిప్పుకోరు, తిప్పుకోలేరు?

ఇదంతా ప్రజలను పక్కతోవ పట్టించడం కాక మరేమౌతుంది? ప్రజల పేరట కొంతమంది వారి వారి స్వార్థ ప్రయోజనాల కొరకు తెలంగాణా సమస్యను వాడుకోవడం కాక మరేమౌతుంది? ఇలాంటి పని ప్రజలను ప్రజాస్వామ్యంలో, ప్రజా ప్రతినిధులలో, శాసనాలలో, పరిపాలనా నిర్ణయాలలో విశ్వాసం కోల్పోయే వారిని చేయడం కాక మరేమవుతుంది?

చేయవలసిందేమిటి, చేస్తున్నదేమిటి?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఒక ఊరిలో ఒక మంచి విద్యా సంస్థ నెలకొల్పి సమర్థవంతంగా నడిపితే, ఒక మంచి గుడి స్థాపించి దానిని శుభ్రంగా శుచిగా కాపాడితే, ఒక మంచి గ్రంథాలయం నిర్మించి దాని ద్వారా పది మందిని వికాసవంతులను చేస్తే, ఒక మంచి వైద్యాలయం కట్టి దాని ద్వారా స్థానిక పౌరులను ఆరోగ్యవంతులను చేస్తే, ఒక విస్తారమైన ఆట స్థలాన్ని కేటాయించి దాని ద్వారా ఆట సదుపాయాలు కలిగిస్తే, ఒక సాహిత్య సారస్వత సాంస్కృతిక సభానిలయాన్ని సమస్త సదుపాయాలతో కట్టి అందజేస్తే, ఒక మంచి కళ్యాణ మండపం కట్టి పెళ్ళిళ్ళకు సౌలభ్యం కల్పిస్తే, ఒక మంచి ఆడియో విజువల్ ఆడిటోరియం కట్టి వినోద వికాస కార్యక్రమాలు చూచుటకు ఆస్కారం కలిగిస్తే, అలాగే ఒక గ్రామంలో త్రాగు నీరు, డ్రైనేజి, రోడ్డు రవాణా వసతులు మున్నగునవి చేకూరిస్తే ప్రభుత్వం ఊరికీ ఊరివారకందరికీ ఎంతో మేలు చేసినట్లవుతుంది, ప్రజాస్వామ్యంలో ప్రజాభివృద్ధి అంటే ఎలా జరుగుతుందో ఉదాహరణలుగా సాక్ష్యాలుగా, నిదర్శనలుగా చూపించినట్లవుతుంది, దేశీయులకు విదేశీయులకు మన పరిపాలనా ఎదుగుదల గురించి సదవగాహన సదాభిప్రాయం ఏర్పడుతుంది.

దీనికి చేయాల్సింది డా. జయప్రకాష్ నారాయణగారు పదే పదే అంటున్నట్లు, అభిప్రాయపడుతున్నట్లు విధుల, నిధుల, పరిధుల వికేంద్రీకరణ. వెనకబడిన ఊళ్ళకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, కేంద్ర ప్రభుత్వం ద్వారా, విదేశ సహాయ సహకారాల సేకరణల ద్వారా నిధులు సమకూర్చడం, వారు నిధుల సమీకరణ ఎలా చేసికోవాలో సూచించడం. వారు రూపొందించు కునే పథకాల్లో, ప్రణాళికల్లో, సహాయ సహకారాలు, సాంకేతిక నైపుణ్యాలు మున్నగునవి అందించడం. వాటి నిర్వహణల్లో వారికి చేదోడు వాదోడుగా ఉండడం. వ్యవసాయ ఆదాయాలతోపాటు వ్యవసాయ అనుబంధమైన చిన్న, మధ్య, కుటీర పరిశ్రమలు నెలకొల్పుకోవడంలో వారికి తగినన్ని జ్ఞాన పరిజ్ఞానాలు, శిక్షణలు, రుణాలు, నీరు, కరెంటు మున్నగునవి స్థిర ప్రాతి పదికలపై సమకూర్చడం.

ఇవీ, ఇంకా కొన్ని ఊరంతా, ఊరి వారందరూ బాగుపడుటకు ప్రభుత్వం చేయవలసిన పనులు. వ్యక్తులకు, దళారులకు, ఫైరవీకార్లకు, పార్టీ వర్కర్లకు, రాజకీయ అనుయాయులకు మాత్రం సేవలందించి, వారిని మాత్రమే పోషించి అవసరమైనప్పుడల్లా వారిని ఎన్నికల్లో వాడుకోవడం కాదు. వ్యవసాయదారులకు కరెంటు ఫ్రీగా ఇస్తామని, జనులకందరికీ రూపాయికి కిలో బియ్యం, స్త్రీలకు బట్టలు, వృద్ధులకందరికీ పెన్షన్లు మున్నగునవి ఇస్తామని, ఏవేవో అందీ అందని ఆరోగ్య

పథకాల ద్వారా వైద్య సౌకర్యాలు ఫ్రీగా అందజేస్తామని చెప్పడం కాదు. మరికొందరు, భూములిస్తాం, ఉద్యోగాలిస్తాం, నిరుద్యోగులకు నెలసరి జీతాలిస్తామని చెప్పడం, ఇంకా కొందరు టీవీలిస్తాం, ఒకటి కావు రెండు కావు పది లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, ధరల స్థిరత్వానికి నికర నిధి సమకూరుస్తాం, ఆరోగ్య బీమా పథకాన్ని ఫ్రీగా కల్పిస్తాం, బీదవాళ్ళకు ప్రతి నెలా వేయి నుండి రెండు వేల వరకు ధన పంపకాలు చేస్తామని సాధ్యం కాని ప్రజారంజక పథకాలు రూపొందించి శుష్క వాగ్దానాలు చేయడం కాదు.

ఇలాంటివి ఎన్నాళ్ళు, ఎంత మందికి, ఎన్ని ఊళ్ళకు సమకూరుస్తారు? ఎచటి నుండి వస్తుంది వీటన్నింటికి డబ్బు? అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలకందరికీ, ఊరికంతటికీ వర్తించే పథకాలు, ప్రణాళికలు చేబట్టాలి కాని ఏ కొందరికో వర్తించేవి కావు కదా చేబట్టవలసినవి, అలా చేసేది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? ఇలాంటివన్నీ చేస్తామనడం, ఇస్తామనడం లంచాలవ్వడం లాంటివి కాక మరేమవుతాయి? మొదట ప్రజలను నిరక్షరాస్యులను, నిర్వీర్యులను, నిరుద్యోగులను, బిచ్చాగాళ్ళలాంటి వారిని చేయడం, ఆ పిదప వారికి దయా దాక్షిణ్యాలుగా ఏవో కొన్ని అందీ అందనివి, చేయ గలిగినవి, చేయజాలనివి, ఎన్నికల్లో లబ్ధిపొందడానికి చేస్తామని చెప్పడమేనా ప్రభుత్వాలు చేయవలసింది. ఎంత హాస్యాస్పదమయిన పోకడ వింత పోకడ యిది, అది ఇపుడు పరిపాలించే వారిదైనా ఇక ముందు పరిపాలించదలచుకున్న వారిదైనా. ఈ సందర్భంగా చెప్పవలసింది మరొకటుంది. అది వ్యవసాయ నీటి సరఫరాకు, ప్రాజెక్టులకు చెందింది. అసలు మామూలు బావులకే స్థిరంగా కరెంటు అందించలేని ప్రభుత్వాలు అత్యధికంగ, అపరిమితంగ కరెంటు అవసరమయే "ఎత్తిపోతల పథకాల"కు ఎలా కరెంటు సమకూర్చగలదో మొదలు రైతులకు చెప్పాలి. స్థిర ప్రాతిపదికపై కరెంటు సరఫరా చేయలేని నీటి పథకాలపై రైతులాధారపడితే వారు నష్టపోరా, మోసపోరా సమాజానికి నిజాయితీగా చెప్పాలి.

ఒకప్పుడు ప్రతి సంవత్సరం వర్షాలు కురిసినట్లు ఏళ్ళ తరబడి కూడా ఇపుడు కురవడం లేదు కదా? అలాంటప్పుడు వర్షాలు బాగా కురిస్తేనే వరదలు వచ్చిన్నాటి అంచనాల ప్రకారం "ఫ్లడ్ వాటర్" పై ఆధారపడే ప్రాజెక్టులు కట్టడం ఎంత వరకు సమర్థనీయం. వరదలు రాకపోతే, ప్రాజెక్టుల్లో నీళ్ళు లేకపోతే వ్యవసాయదారులు అలాంటి ప్రాజెక్టులపై ఆధారపడి వ్యవసాయాలు చేస్తే నష్టపోరా, మోసపోరా యనునది ప్రభుత్వం వారు సమాజానికి నిజాయితీగా చెప్పాలి.

ఒకప్పుడు పై రాష్ట్రాల్లో ఆనకట్టలు అధికంగా కట్టనప్పుడు మనకు పై నుండి నీళ్ళు విస్తారంగా వచ్చేవి. ఇపుడు పై రాష్ట్రాలు ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు, ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు కదా! అలాంటప్పుడు క్రొత్తగా కట్టే మన ప్రాజెక్టులకు నీళ్ళెలా వస్తాయో అలాంటి నీటిపై ఆధారపడితే రైతులు నష్టపోరా? మోసపోరా? ప్రభుత్వం

వారే సమాజానికి నిజాయితీగా వివరించాలి. అయినా ఈ ప్రాజెక్టులన్నీ ఎప్పుడొస్తాయో అందరూ తినగా తినగా, పంచుకోగా పంచుకోగా వాటికి అవసరమైన నిధులు చాలక కుంటుపడగా, కుంటుపడగా పరిపాలకులే నిజాయితీగా సమాధానమివ్వాలి.

ఈ ప్రాజెక్టులన్నీ అటు కాంట్రాక్టర్లకు, ఇటు రాజకీయ మధ్యవర్తులకు, దళారులకు, లంచగొండి పరిపాలకులకు, డబ్బు సమకూర్చేవే కాని, వ్యవసాయదారులకు ఇప్పుడప్పుడే అక్కరకొచ్చేవి కావని, ఇంత వరకు కట్టిన ప్రాజెక్టుల రిపేర్లకే నిధులు లేక అవి కొన్ని అరిపోతుంటే, కొన్ని కూలిపోతుంటే క్రొత్తవి కట్టడమేమిటి? వాటికి నిధులు ఎచటి నుండి వస్తాయి? పాత వాటి నిధులు క్రొత్త వాటికి మరలిస్తారా? యని ప్రజలు ముక్కుమీద వ్రేలేసుకొని ప్రశ్నిస్తుంటే, ఫర్వాలేదు ఆ దేవుడే ఉన్నాడని "గాలిలో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు" యని వాటిని ప్రారంభించడం ఎంత వరకు సమంజసమో, సమర్ధనీయమో పరిపాలకులే నిజాయితీగా చెప్పాలి. ఇలా చెప్పుకుపోతుంటే ఇంకేన్నైనా చెప్పవచ్చు మన ప్రభుత్వాల ప్రతాపాల ప్రగల్భాల గురించి.

ఇలాంటి పరిపాలనా ఒరవడి ఈ అరవయ్యేళ్ళలో ఒక్క తమిళనాడులో ఎంతో కొంత చూచాం. ఎన్‌టిఆర్‌గారి కాలంలో కొంత, చంద్రబాబునాయుడుగారి కాలంలో కొంత కాని, దీనినిపుడు విచ్చలవిడి స్థాయిలో చూస్తున్నాం. మన ప్రజాస్వామ్యం ఎటుపోతుందో తెలియక అర్థం కాక నివ్వెరపోతున్నాం, ఇలాంటి వాటితో ఈ రాష్ట్రం అతిగా అప్పుల పాలయి ఏ గతి కాబోతుందో తెలియక తికమక పడుతున్నాం. ఇలాంటి పరిపాలనల వలన యువకులు, విద్యార్థులు వచ్చే తరాలలో ఎలాంటి పాఠాలు నేర్చుకోబోతున్నారో బోధపడక "కర్మ సిద్ధాంతం" నుండి "ఖర్మ సిద్ధాంతం" వైపుకు ప్రతి రోజూ, ప్రతి ఘంటా పరుగిడుతున్నాం.

ఇప్పుడు ఒకరు కాదు, ఒక ప్రభుత్వం కాదు, అందరూ, అన్ని ప్రభుత్వాలూ అన్ని పార్టీలూ అదే త్రోవ త్రొక్కుతున్నట్లనిపిస్తుంది మన రాష్ట్రంలో ఒక్క 'లోక్‌సత్తా' తప్ప. ఈ "దయాదాక్షిణ్యాల అభివృద్ధి వైపు'. ఆంధ్ర రాష్ట్ర పరిపాలన ఆదర్శప్రాయమంటు న్నారు కదా మరి. కనుక ఇతర రాష్ట్రాలే కాక, కేంద్రం కూడా ఎన్నో పాఠాలు నేర్చుకోవలసి ఉంటుంది మన నుండి. "అవసరమైతే చార్మినార్‌ను కూడా అమ్మకానికి పెట్టి పరిపాలిస్తాం చెప్పుకోపో నీ అబ్బతో, నీవు తిన లేదా నేనూ తింటాను, ఇంకింత మరింకింత తింటాను, ఏమీ చేస్తావో చేసుకో, ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో" అనే లాంటి దుస్సాహాసాలు, దూకుళ్ళు జనులను గుడ్డివారిని, ఎడ్డివారిని, చెవిటి వారిని చేసి, 'భవతి భిక్షాందేహీ' యని యనిపించే లాంటివి. వారి ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని వమ్ము చేసే లాంటివి. ప్రజాస్వామ్యాన్ని ప్రభుసామ్యంగా, సామ్యవాదాన్ని సామంతవాదంగా మార్చేలాంటివి.

అడగవలసిన ప్రశ్నలు అడగరేం?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఈ మధ్య "సామాజిక న్యాయం" గురించి పదే పదే మాట్లాడడం, రాయడం జరుగుతోంది. కాని ఈ జరిగేదంతా ముక్కుసూటిగా కాక ముక్కు తిరుగుడుగా జరుగుతోంది. అనదలచిందేదో కుండబ్రద్దలు కొట్టినట్టు అనకుండా భయ భయంగా, అంటే ఎవరైనా ఏమైనా అనుకుంటారో ఏమోనని వెనకా ముందాడుతూ అనడం జరుగుతోంది. "సామాజిక న్యాయం" గురించి లేవదీయవలసిన ప్రశ్నలు ప్రధానంగా దిగువవి ఆరు.

1) ఒకే కుటుంబం వారు పదే పదే ఎందుకు పరిపాలించాలి?
2) ఒకే కులంవారు పదే పదే ఎందుకు పరిపాలించాలి?
3) ఒకే పార్టీ వారు పదే పదే ఎందుకు పరిపాలించాలి?
4) ఒకే ప్రాంతం వారు పదే పదే ఎందుకు పరిపాలించాలి?
5) ఒకే ఒకరు పదే పదే ఎందుకు పరిపాలించాలి? అనునవి.
6) ఒకే ఒక మతం వారు పదే పదే ఎందుకు పరిపాలించాలి?

ఇవి ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు ఓటర్లు, మేధావులు, విద్యాధికులు, వికాసవంతులు పదే పదే అడగవలసిన ప్రశ్నలు. ఇవి అన్ని కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, పార్టీలకు, అందరికీ సంబంధించిన ప్రశ్నలు. ప్రజాస్వామ్య మనుగడకు చెందిన ప్రశ్నలు. మన రాజ్యాంగంలోని "ప్రాథమిక హక్కుల"లాంటి ప్రశ్నలు. మన దేశ భవితవ్యానికి, అభివృద్ధికి, అభ్యున్నతికి, క్షేమ సంక్షేమానికి, సుస్థిరతకు చెందిన ప్రశ్నలు.

అలా కాక "సామాజిక న్యాయం" గురించి మాట్లాడినప్పుడు అగ్రకులాల అన్యకులాల ప్రసక్తి మాత్రమే తీసుకొస్తే అగ్రకులాలలో ఎన్నో శాఖోపశాఖలుంటాయి, అలాగే అన్యకులాలలో, వర్గాలలో, మతాలలో, ప్రాంతాలలో కూడా కనుక అలాంటి ప్రసక్తి కుల కలహాలకు, మత కలహాలకు, ప్రాంతీయ కలహాలకు దారి తీస్తుంది. అది ఎవరికీ మంచిది కాదు. అగ్రకులాల వారికి అన్యకులాల వారి ఓట్లు రాకుండా, అన్యకులాల వారికి అగ్రకులాల వారి ఓట్లు రాకుండా అనేకానేక కులాలనుండి అనేకానేకులు పోటీ పడుతోన్న ఈనాటి ఎన్నికల్లో ఎవ్వరూ గెలవలేరు. అలాగే మతాలవారు ప్రాంతాల వారు కూడా.

అవకాశాలు పదే పదే ఒకే ఒక కుటుంబానికి, కులానికి, మతానికి, ప్రాంతానికి, వర్గానికి, వ్యక్తికి, లేక కొందరు వ్యక్తులకు మాత్రమే దక్కితే, కొత్తవారికి, యువకులకు, మేధావులకు అవి లభించకుండాపోతాయి. తద్వారా అధికారాలు, సంపాదనలు వారి చేతుల్లోనే కేంద్రీకృతమవుతాయి. అలాంటి పరిపాలనా వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యతిరేక

వ్యవస్థగా రూపొంది అవినీతికి, అహంకారానికి దారితీస్తుంది. ఆంగ్లేయ భాషలో "Power corrupts, absolute power corrupts absolutely" అను సామెత ఒకటుంది. పదే పదే అధికారం అలాంటి నీతి నిజాయితీలేని నిరంకుశ పరిపాలనకు దారితీస్తుంది.

అమెరికా రాజ్యాంగంలో కనీసం అధ్యక్ష పదవికైనా ఒక పరిమితి నిర్దేశించబడింది. దాని వలన అధ్యక్ష పదవికి ఎంపికైనవారు రెండుసార్లకన్నా ఎక్కువ ఆ పదవిలో కొనసాగడానికి వీలుండదు. మనం అమెరికన్ రాజ్యాంగం నుండి ఎన్నో నియమనిబంధనలు, శాసనాలు అరువు తెచ్చుకున్నాం. ఈ నిబంధనను మాత్రం convenient గా వదిలేశాం. ఇది మన వంశపారంపర్య మనస్తత్వానికి పరాకాష్ఠ. బానిసత్వం మనను వదిలింది కాని మనం బానిసత్వ మనస్తత్వాన్ని వదలలేదు. అలాగే వారసత్వం మనను వదిలింది కాని మనం వారసత్వ మనస్తత్వాన్ని వదలలేదు. ఒకప్పటి మన కుటుంబ వ్యవస్థలో కుటుంబ పెద్ద ఎంత కురువృద్ధుడైనా అధికారం తన చేతిలోనే ఉండాలని కోరేవాడు. తాను కూర్చున్న కుర్చీ ఖాళీ చేసేవాడు కాదు. మనం ఎంత నాగరీకులమని, అధునాతనులమని చెప్పుకున్నా ఇప్పటికీ మనం ఆ పద్ధతిని వదలడం లేదు. ఆ మనస్తతత్వ పరిణామమే పదే పదే రాజకీయ పరమైన పదవులలో కొనసాగాలనే ఉబలాటకు కారణం. ఆనాటి సమిష్టి కుటుంబంలోని ఆ Out dated భావమే ఇప్పటికీ కొనసాగుతోంది ఈనాటి 'రాజకీయ కుటుంబాలలో'.

అసలు ఈ దేశంలో "మేము అభివృద్ధి చేశాం కనుక మమ్ములనే ఎన్నుకోండి" అని అనడమే ఒక తమాషా. ప్రజలు ఒక పార్టీనైనా, ఒక వ్యక్తినైనా ఎందుకెన్నుకుంటారు అభివృద్ధి కొరకు కాకపోతే? అలాంటప్పుడు అభివృద్ధి చేశామని చెప్పుకోవడం దేనికి చేసినా చేయకపోయినా, అది ఎంతోకొంత నిజమైనా, ఎంతోకొంత అబద్ధం, అతిశయోక్తయినా? అది వారి కర్తవ్యం, బాధ్యతే కదా? మరి ఆ అభివృద్ధిని తులనాత్మకంగా అంచనా వేయాలంటే మార్పు అవసరమే కదా? ఒక క్రొత్త ప్రభుత్వం రాందే పాత ప్రభుత్వాన్ని ఎలా బెరీజు వేస్తాం? అలా పాత ప్రభుత్వమే కొనసాగుతూ పోతే ఇక పాతను పాతతోనే పోల్చాలి తప్ప క్రొత్తదానితో పోల్చడానికి వీలవుతుందా? ఒక అభివృద్ధిని ఇంకోక అభివృద్ధితో పోల్చుటకు వీలు లేకుండా పోతుంది. అది మనని మనమే మెచ్చుకోవడంలాంటిదవుతుంది.

ఈ రాష్ట్రంలో చాలా నాళ్ళుగా రెండే రెండూ పార్టీలు పరిపాలించాయి. ఒకటి కాంగ్రెస్, రెండవది తెలుగుదేశం. రెండూ పాత పార్టీలే. వాటి గురించి, వాటి పరిపాలనల గురించి ప్రజలకు చాలా వరకు తెలిసిన విషయమే. ఇప్పుడు ఎన్నికల్లో సరిక్రొత్తగా పోటీ చేస్తున్న పార్టీలు రెండు. 1) ప్రజారాజ్యం పార్టీ 2) లోక్‌సత్తా పార్టీ. ఈ రెండు పార్టీల పరిపాలనలు ప్రజలు చవి చూడలేదు. వీటికి అనుభవం లేదనడం సరైంది కాదు. అనుభవం రెండు తీర్లు. ఒకటి వారు గడించింది. ఇంకోకటి ఇతరుల

ద్వారా గడించింది. ఈ రెండు పార్టీల వారికి ఆ రెండు పార్టీల వారి ద్వారా గడించిన అనుభవం చాలా ఉంది. ఆ రెండు పార్టీల కీర్తి అపకీర్తి వీరికి అపారంగా తెలుసు. వీటి వెనకాల కూడా సమర్థులైనవారు ఎంతో మంది ఉన్నారు. వారిలో చాలా మందికి మంచి పేరు ఉంది. ఇవి రెండూ ఇప్పటి వరకు రాజకీయ రంగంలో "క్లీన్ స్లేట్" లాంటి పార్టీలే. కీర్తి లేకున్నా అపకీర్తి మాత్రం ఇంతవరకు ఏమాత్రం లేదు.

ఎందుకివ్వగూడదు మరి వారికి ఒక అవకాశం? ఎందుకెన్నుకోవాలి అనేకానేక వృద్ధులతో కూడిన పాత పార్టీలనే? ఏ పాటి "సామాజిక న్యాయం" జరిగింది ఈ పాత పార్టీల ద్వారా అలాంటిది కోరేవారికి? క్రొత్తవారికి ఎలాగైనా పాత వారికన్నా ఏదో చేయాలన్న ఉత్సాహం ఎప్పటికీ ఎక్కువే ఉంటుంది కదా మరి?

ఈ రెండు పార్టీలే కదా ఎక్కువ మంది క్రొత్తవారికి, యువతకు, స్త్రీలకు, వెనకబడినవారికి అవకాశాలిచ్చాయి. అలా అవే కదా సామాజిక న్యాయం ఎక్కువ సమకూర్చాయి? ఎన్నాళ్ళుగానో జరుగుతోన్న అన్యాయాన్ని చాలా వరకు సరిదిద్దాయి. ఇది అన్ని అభివృద్ధి అడుగుల్లోకల్లా అతిపెద్ద ముందడుగు అని ఎవరు కాదనగలరు?

అమెరికా ప్రజలు ఒబామాను ఎన్నుకొని అచటి యువతకు, వెనకబడిన వారికి ఒక సందేశాన్నిచ్చారు. మనం కూడా అలాంటి సందేశమే ఎందుకివ్వకూడదు ఈ రాష్ట్రం ద్వారా ఈ దేశానికి? ఒక క్రొత్త ప్రభుత్వాన్ని, ఒక క్రొత్త నేతృత్వాన్ని ఎందుకు సమకూర్చుకోగూడదు?

'అభివృద్ధి'లో అనుభవంలేదని, బిహార్‌ను పాడు చేసిన అసమర్థుడని ఎందరో ఎద్దేవా చేసిన లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ఎన్నాళ్ళుగానో మొద్దుబారిపోయిన రైల్వే డిపార్టుమెంటులో ఎంతో అభివృద్ధి సాధించాడు. ఐఐఎం (అహ్మదాబాద్)తో భేష్ అనిపించుకున్నాడు. Harvard University ద్వారా 'షభాష్' అనిపించుకొని ఉపన్యసించుటకు ఆహ్వానించబడినాడు. అలా చూస్తే ఎన్.టి. రామారావుగారికి కూడా రాజకీయాలలో ఏ మాత్రం అనుభవముండింది? అయినా ఎన్నో కొన్ని సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టలేదా? ఈనాటి మన ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు కూడా ప్రధానమంత్రికి సరిపోయే అనుభవం అంతంతేనని చెప్పక తప్పదు. అలా అనుభవం అంతగా లేకున్నా కూడా సత్సంకల్పంతో, కార్యదీక్షతో, నీతి నిజాయితీతో ఎంతో సమర్థవంతంగా రాజకీయాలు, పరిపాలనలు నడిపినవారు ఎంతో మంది ఉన్నారు.

అలాగే రాజకీయరంగంలో అంత అనుభవంలేని శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఈ మధ్య జాతీయ అంతర్జాతీయ కీర్తి గడించారు. ఎంతో సమర్థురాలు, తెలివికలది, అభివృద్ధికర అభిప్రాయాలున్న మేధావి యని హేమాహేమీలతో అనిపించుకున్నారు. అందువలన అనుభవం అంతగా లేనివారు సరిక్రొత్తవైన

విజయాలు సాధించలేరని అనుకోవడం వారినే కాదు మనని మనం కూడా భ్రించపరచుకోవడమే అవుతుంది. ఏ రాజుపోతే, మారితే ఏ రాజ్యం ఆగింది? నేతృత్వం దానికదే రూపుదిద్దుకుంటుంది. అది ప్రకృతి సహజం. అది మనకన్నా ఎక్కువ కాలంలోనే ఉంటుంది.

అయినా మంచి పరిపాలన ప్రధానమంత్రైనా, ముఖ్యమంత్రైనా మంచి మంత్రులను, మంచి అధికారులను ఎన్నుకోవడంలోనే ఉంటుంది కదా! ఎంపిక చేసిన వారికి తగినంత స్వేచ్ఛ ఇవ్వడంలో. వారు సూచించిన, ప్రతిపాదించిన వాటిని దాటివేసి యధేచ్ఛగా నిర్ణయాలు తీసుకోకపోవడంలో. ఈనాటి సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమున్న రోజుల్లో విషయపరమైన అవగాహనను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ముందుకు పోవడంలో. అలాగే అధికారాల నన్నిటిని గుప్పిట్లో పెట్టుకోక తగిన మేరకు వాటిని వికేంద్రీకరించడం లో. వికేంద్రీకరించడమే కాకుండా సరియైన వనరులు సమకూర్చి తగిన నిర్వాహకులను నియమించడంలో. దానికి జలగం వెంగళరావు ఋజువు, అంత పెద్దగా చదువుకున్నవాడేమీ కాకున్నా సరియైన సిబ్బందిని ఎంపిక చేసికోవడంలో అభివృద్ధికర నిర్ణయాలు తీసుకోవడంలో అతనికి ఆతడే సాటి అని అనిపించుకున్నాడు. పరిపాలనంటే మనం చేయడం కన్నా ఎక్కువ ఇతరులతో చేయించడంలో ఉంటుందని తెలిసినవాడు.

"నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు"

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఈసారి ఎన్నికల్లో "సిగ్గు" తన సిగ్గుమాలినతనాన్ని అద్దంలో చూచుకొని సిగ్గుపడుతోంది, హవ్వ! ఇంత దిగజారి పోయానా? నేనని. ఒకరా, ఇద్దరా, ముగ్గురా? ఒక పార్టీలోనా, రెండింటిలోనా, మూడింటిలోనా? అన్ని పార్టీల్లో నుండి అటునుండి ఇటు, ఇటు నుండి అటు వలస పోవడాలు రావడాలు మామూలైపోయాయి, కప్పగంతులు, కుప్పగంతులు మరీ ఎక్కువై పోయాయి. లంచగొండితనం వలె విచ్చలవిడి అవకాశవాదానికి ఆనకట్ట లేకుండా పోయింది. పార్టీలు మారడం చొక్కాలు మార్చుకోవడం లాంటిదైపోయింది. పార్టీ మార్పిళ్ళకు అవినీతి ఆర్జనలకు తేడా లేకుండా పోయింది. అది దీని కొరకు ఇది దాని కొరకు లాంటిదైపోయింది. సిద్ధికి తప్ప సిద్ధాంతానికి ఏ విలువా లేకుండా పోయింది. ఒక్కొక్క పార్టీలో సీటు కొరకు గేటు వద్ద ఆశించేవారు వారినెవరు పట్టించుకున్నా పట్టించుకోకపోయినా పడిగాపులు కాసేవారు కొల్లలు, ఎల్లలైపోయారు.

ఓహో! ఎంత ఎంతెంత మంది దేశానికి, దేశీయులకు సేవలందించాలని తహ తహ పడేవారు, తాపత్రయ పడేవారు! నిస్వార్థపరులు! నీతి నిజాయితీ పరులు! నిద్ధా మనుషులు! ఒక్కొక్క కుటుంబం నుండి ఒక్కరు కాదు, ఇద్దరు కాదు అరడజను మంది పార్టీకి పాటుపడాలని, దాని కొరకు ప్రాణాలైన వీడాలని ఉబలాటపడేవారు! కొందరు అలాంటి సేవకు అవకాశం ఇవ్వకపోతే అక్కడికక్కడే కిరసనాయిలు, పెట్రోలు పోసుకొని చావడానికి తయారయ్యేవారు! మరికొందరు ఆ కొండకు ఈ కొండకు ఆ గుడికి ఈ గుడికి పోయి యాగాలు, యాత్రలు, పూజలు, ప్రార్థనలు మున్నగునవి పార్టీ టిక్కెట్టు రప్పించు దేవుడా అని కోరేవారు. ఎంత మంది నిష్పలాంటివారు! నిజ జీవితాల్లో మచ్చెరగనివారు! పురుషార్థులు! పుణ్య పురుషులు!

ఓహో! వీరిలో ఎందరో ఆ కాలంలో కొందరు మేము స్వాతంత్ర్య సమర యోధులమని చెప్పుకుంటూ, మీరు ఏమి చేశారని అడిగితే, ఒకరికి చెప్పులందించాం, ఒకరికి చేతికర్ర అందించాం, ఒకరికి కాళ్ళ నీళ్ళు, ఒకరికి గురిగెడు మజ్జిగ, ఒకరికి గిలాసెడు ఛాయ్ పోశాం. ఒకరితో మాట్లాడాం, ఒకరితో పోట్లాడాం, ఒకరితో ఆడాం, ఒకరితో పాడాం, ఒకరికి మంచం వేశాం, ఒకరికి కంచం అందించాం, చెట్టెక్కి చూశాం, గుట్టెక్కి కూశాం, గట్టెక్కి అరిచాం, ఒకరికి చెంబు అందించాం, ఒకరికి ముంత అందించాం అన్నలాంటివారు. అప్పుడు అలాంటి త్యాగాలన్నీ చేశాం కనుక ఇప్పుడు మాకు "ఫించన్" రావాలని కోరిన వారు, ఇంకా కోరుతున్నవారు. ఇప్పుడు పార్టీ, టిక్కెట్లు కోరేవారు కూడా చాలా మంది అలాంటి వారే. ఎందరో మొన్న

ప్రొద్దున చేరినవారు, నిన్న మధ్యాహ్నం చేరినవారు, ఇవ్వాళ్ళ సాయంత్రం చేరినవారు. వారిలో ఎందరో వారిదువరకు సభ్యులుగా ఉన్న పార్టీల నుండి వెలివేయబడిన వారు, ఎన్నో పార్టీలు మార్చినవారు, ఆయా పార్టీల్లో ఉల్లిగడ్డల్లా, ఎల్లిగడ్డల్లా భావించబడి ప్రక్కకు నెట్టివేయబడినవారు, చీమల్లా దోమల్లా చూడబడినవారు.

మరీ వీరిలో ఎవరికివ్వాలి పార్టీ టిక్కెట్లు? దుప్పటి కప్పినవారికా? తప్పెటందించినవారికా? వారు ఏ కులాల వారైతేనేమి? వారిలో దరిద్రులకివ్వాలా టిక్కెట్లు లేక ధనికులకా? ఇప్పుడు ఏ పార్టీలోనైనా మంచివారనేవారు అరుదే కాదు చాలా అరుదే కదా మరి! ఇప్పుడంతటా సంచివారేగా మంచివారుగా భావించబడేవారు! మీకు నూటికి కాదు వేయికి కూడా పట్టుమని పదిమంది దొరకరు నీతి నిజాయితీ కలవారు, సిద్ధాంతాల కొరకు, నిజ సేవల కొరకు పార్టీల్లో చేరేవారు. అలాంటి వారి కాలం ఎప్పుడో అడుగంటింది గాంధీజీతోనే. ఇప్పుడంతా గాంధీ పేరు చెప్పుకొని బ్రాంది తాగేవారు, వ్యాపారాల కొరకు రాజకీయాల్లో చేరేవారు, రాజకీయాల ద్వారా వ్యాపారాల్లో అత్యధికంగ గడించదలచనవారే. రాజకీయాల్లో పరిశ్రమల్లో, వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టినట్టు రాజకీయాల్లో కూడా పెట్టుబడి పెట్టి అన్యాయాలు, అవినీతులు, అరాచకాలు తలపెట్టి అమితంగా ఐంపాదించాలని కోరేవారే. ఎక్కువగా వారే ఇప్పుడు టిక్కెట్ల కొరకు తహ తహ పడేవారు. వారే పార్టీ చందాల పేరట లంచాలిచ్చుటకు, లక్షలు కోట్లు వెచ్చించి నెగ్గుటకు సంసిద్ధమయేవారు. పార్టీ బహిరంగ సభలకు తగినంత ధనం సమకూర్చి, వాటిలో వినోదాలు, విలాసాలు నిర్వహించేవారు. అలాంటి వారికే ఇప్పుడు పార్టీల్లో అత్యధిక స్థానం, ఆహ్వానం. ఇప్పుడు టిక్కెట్ల కొరకు పోటా పోటీ బాహా బాహీ అంతా అటువంటి వారి మధ్యే. తిట్టుకోవాటాలు, కొట్టుకోవాటాలు, కట్టెలతో కరవళ్ళతో, కాళ్ళతో, చేతులతో తట్టుకోవడాలు, ముట్టుకోవడాలు మున్నగునవి కూడా.

ఇప్పుడు అసెంబ్లీకి పోటీ పడాలంటే కావాలి లక్షలకు లక్షలు, పార్లమెంటుకు పోటీ పడాలంటే కావాలి కోట్లకు కోట్లు. మంచితనంతో సంపాదించిన వారి వద్ద ఎలా ఉంటుంది అంత డబ్బు? ఎన్ని జన్మలెత్తాలి అంత శ్రీమంతం చెమటవడిపి సంపాదించాలంటే. అందువలననే మంచి వారెవ్వరూ రాజకీయాల్లోకి రారు, రాలేరు కూడా. తక్కినవారంతా చాలా ఎరకు రాజకీయ వ్యాపారులే కదా మరి? వారు వారి వారి బాగోగులు మాత్రమే చూచుకుంటారు. దానికి ఏ అనుమానమూ అక్కరలేదు.

ఈ మధ్య మన రాజకీయ భాషలోకి తరచు వాడుకలోకి వచ్చిన, వస్తోన్న వచ్చిన నినాదం "సామాజిక న్యాయం". సామాజిక న్యాయమంటే అందరూ మామూలుగా అనుకునేది బీదవారికి, అట్టడుగు వారికి అవకాశాలు తీసుకొచ్చేదని. కాని తమాషా ఏమిటంటే ఈ సామాజిక న్యాయం చేకూరాలనేవారు కూడా టిక్కెట్లు ఇచ్చే వరకొస్తే ధనికులకు తప్ప బీదవారికి ఇవ్వడం లేదని అనోటా ఈనోటా వింటున్న

మాటే. మరి "సామాజిక న్యాయం" అంటే ధనవంతులకు న్యాయం చేయడమా లేక బీదవారికా? వారు ఏ కులానికి చెందినవారయితేనేం? కులం కాదు కదా సామాజిక న్యాయంలో ప్రధానం, ధనం కదా? అలాంటప్పుడు ధనవంతులకు టిక్కెట్లు ఇవ్వక బీదవారికి టిక్కెట్లు ఇవ్వడం కదా కావలసింది. "సామాజిక న్యాయం జరగాలి" అని అనేవారు కూడా ధనవంతులనే పట్టుకొని వ్రేలాడితే దాని వలన సామాజిక న్యాయమెలా జరుగుతుందో వారే చెప్పాలి. దాని వలన జరిగేది కుల న్యాయం అయితే కావచ్చు కాని, వారుద్దేశిస్తున్నట్లు సామాజిక న్యాయం మాత్రం జరగడానికి వీలుండదు. సామాజిక న్యాయమనునది కులాలకు చెందింది కాదు, వర్గాలకు చెందింది. ఈ మాట నేను చెబుతున్నది కాదు. ఎప్పుడో ఏనాడో మార్క్స్ చెప్పాడు. "Workers of the world unite, you have nothing to loose but your chains" అని మార్క్స్ ఇచ్చిన పిలుపు వర్గ పోరాటానికి చెందిందే కాని కుల పోరాటానికి చెందింది కాదు. ఆ పోరాటం మొదట ఆ కులంలోని బీదవారు ఆ కులంలోని ధనవంతులతో మొదలెట్టాలి. ఆ పిదప అన్ని కులాల వారిలో ఉన్న ధనవంతులతో అన్ని కులాల వారిలో ఉన్న బీదవారు మొదలెట్టాలి. అలా మొదటి సంగ్రామం ప్రారంభం కావాలి. అలా తుది సంగ్రామం. కానీ మనమిప్పుడు వాంఛిస్తున్నది ధనవంతుల మధ్య బీదవారి మధ్య పోరాటం కాదు, కులాల మధ్య కులాల మధ్య పోరాటం. కులాలు ఎప్పుడూ ఉంటాయి. (ఒకనాటి లాంటి వారసత్వ కులాలు కావు ఈనాటి లాంటి వారసత్వం లేని కులాలు.) అవి ఎప్పుడూ పోవు. ఎందుకంటే అవి వృత్తులకు చెందినవి కనుక. వృత్తులు ఏ ఒక్కరికి చెందినవి కావు కనుక. వృత్తుల మధ్యా వృత్తుల మధ్యా పోరాటం అసహజంగా ఉంటుంది కనుక. కులాల మధ్యా కులాల మధ్యా పోరాటాలను "సామాజిక న్యాయ పోరాటాలు"గా భావించేవారు ఇది గ్రహించాలి. సామాజిక న్యాయానికి వర్గపరమైన అర్థాన్ని, లక్ష్యాన్నివ్వాలి కాని కులపరమైన అర్థాన్ని, లక్ష్యాన్ని కాదు. అదే సామ్యవాదం. అదే ప్రజాస్వామ్యం, అదే లౌకికవాదం కూడా.

నష్ట పరిహారాలు

(బోనులో నిలబడేది ప్రభుత్వాలే!)

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దానికి కారణం విద్యా వ్యవస్థలోని డిటెన్షన్ నిబంధనయని గొంతెత్తారు విద్యార్థులందరూ. ఆ కుటుంబానికి నాలుగు లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించడానికి విశ్వవిద్యాలయం అంగీకరించింది. విశ్వవిద్యాలయం కూడా ప్రభుత్వ పరిధిలోకే వస్తుంది కదా మరి! కనుక తప్పలేదు దానికి కూడా. (ఈ మధ్య పరిపాలనలు సక్రమంగా నడిపి హత్యలు, ఆత్మహత్యలు కాకుండా చూడడం కన్నా పరిపాలనలు అక్రమంగా నడుపుతూ చనిపోయిన వారికల్లా పరిహారం చెల్లిస్తున్నారు కదా, అందుకని)

ఆ మధ్య వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన దాసరి వంశీ యనే ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో (వల్లభనగర్) ఐదవ తరగతి చదివే పిల్లవాడు మేడమీది నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి ఆంగ్ల భాషా - మాధ్యమం ఒత్తిడిని అతడు తట్టుకోలేక పోతున్నాని పదే పదే చెప్పగా కూడా ఎవరూ పట్టించుకోక పోవడమే కారణమని వార్తా పత్రికలు రాశాయి. మరి ఆంగ్ల భాషను మాధ్యమంగా ప్రవేశపెట్టింది కూడా ప్రభుత్వమే కదా! అతనికి కూడా నష్టపరిహారం చెల్లించడం న్యాయం, ధర్మం కదా మరి? తెలియదు ప్రభుత్వం వారు చెల్లించారో లేదో? బహుశా ఇకముందు ఎవరైనా ఒత్తిడి తట్టుకోలేక విద్య విరమించుకున్నా, ఫేలైనా నష్టపరిహారం అడిగితే అడగొచ్చు? వివిధ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు ఉద్యోగాలు రానందుకు కూడా..!

అసలీ దేశంలో అన్ని స్థాయిల ప్రభుత్వ రంగ విద్యాలయాల్లో, అన్ని విద్యల్లో ప్రభుత్వమే అదే విధించే, అదే నిర్దేశించే నియమాలు అదే పాటించడం లేదు ఇప్పుడే కాదు ఎప్పుడూ. అది అన్న మేరకే దాని విద్యాలయాలలో వసతి సేవా సౌకర్యాలు కల్పించదు. అందువలన మేమెంతో నష్టపోతున్నామని, వాటికి నష్టపరిహారాలు చెల్లించాలని విద్యార్థులందరూ ఎప్పటినుండో అడగవలసింది. అలా అడగనందువలననే కదా ఆ ప్రభుత్వ విద్యాలయాలన్నీ అలా తగలబడి పోతున్నాయి. అవి అలా తగలబడిపోవడానికి ఆ కారణాలే ముఖ్యమైనవని మరెవర్నో కాదు, విద్యార్థులను, అధ్యాపకులను అడిగితే ఫారే చెబుతారు వాటి కథలన్నీ. కనీసం ఇప్పుడైనా, ఈ సందర్భంగానైనా విద్యార్థులు నోరుతెరవడంలో తప్పేమీ లేదు. పైపెచ్చు అది అందరూ హర్షించదగిన ఒప్పే, ఇతరులకు కనువిప్పే.

"మన అనేకానేక ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యావిషయక సంక్షోభాలకు ప్రకృతి కొన్నిసార్లు కారణమైతే, ప్రభుత్వం ఎన్నోసార్లు కారణమవుతుంది" అని అన్నారు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయ్‌గారు ఒకసారి. ఈ దేశాన్ని రాజులు పాలించిన కాలంలో ప్రజలు వారికే విపత్తులు, నష్టకష్టాలు వాటిల్లినా వాటన్నిటికీ అయితే వారే, లేకపోతే ప్రకృతే కారణమని అనుకునేవారు. వాటికి ఏ నష్టపరిహారాలు అడిగేవారు కాదు. అలా వందల వేలేళ్ళు గడిచాయి.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, ప్రజాస్వామ్యమేర్పడ్డాక కూడా చాలానాళ్ళు ఈ దేశీయులు వారికి సంభవించిన కష్ట, నష్టాలకు, ఉపద్రవాలకు, సంక్షోభాలకు ప్రభుత్వం కారణమని అనుకోలేదు. దానికి కారణం, స్వాతంత్ర్య మొచ్చి, ప్రజాస్వామ్యమేర్పడ్డాక ఒక ఇరవై ముప్పై ఏళ్ళు ప్రభుత్వాలు బాగా నడవడం, నాయకత్వం చాలా వరకు బాగుండడమే.

ప్రభుత్వాలు దిగజారిపోవడం, అవి నీతి నిజాయితీలు కోల్పోవడం, బంధు, కుల, మత, భాష, ప్రాంత, పార్టీ పక్షపాతమువి, "ఓటు బ్యాంకు" రాజకీయ పాలసీలవి కావడం ఒక ముప్పైయేళ్ళ క్రితం నుండి మొదలైంది. ఈ పదేళ్ళలో అది పటవృక్షమయింది. అలాగే, ఒక ఇరవైయేళ్ళనుండి పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి అనేకానేక చిన్నా చితుకూ ప్రాంతీయ పార్టీలు ఈ దేశంలో. వీటికి అధికార లక్ష్యం తప్ప సిద్ధాంతమంటూ స్థిరంగా ఏదీ ఉండదు. స్వార్థపర రాజకీయాల వలన, దేశ స్థాయి పార్టీలల్లో కూడా ఎన్నో చీలికలోచ్చాయి. వీటివలన ఎన్నో అనైతికమైన అస్థిరప్రభుత్వాలు ఏర్పడ్డాయి వాటి వాటి తాత్కాలిక ఒప్పందాల ద్వారా. అలాంటి ప్రభుత్వాలు ఆయా పార్టీలలోని స్వార్థపరుల ఒత్తిళ్ళ వలన, దురాశల వలన కూలిపోవడం, పరిపాటి అయింది. సిద్ధాంతాలకు, విలువలకు ఆస్కారం లేకుండా కేవలం స్వార్థపరుల ఒత్తిళ్ళ ఆధారంగా, ఆయా పార్టీలు పాలసీలు రూపొందించడం, పరిపాలనలు కొనసాగించడం, ఈ పార్టీ ఆ పార్టీ, ఈ ప్రభుత్వం ఆ ప్రభుత్వం అనకుండా అన్ని పార్టీలకు, అన్ని ప్రభుత్వాలకు పరిపాటి అయింది. అది ఒక అలవాటుగా, అనవాయితీగా మారిపోయింది.

పై వాటి వలన, పరిపాలనలు అస్తవ్యస్తమై, ప్రభుత్వాలు బలహీనమై, రాజ్యమంతా ఇష్టారాజ్యంగా మారి అనేకానేక అవకతవకలకు, అవినీతులకు, నియంపోకడలకు లోనయాయి. పాలసీలు, పరిపాలనలు అస్తవ్యస్తమైనా కొలదీ ప్రజలు అనేకానేక ఇక్కట్లకు, ఇబ్బందులకు గురికావడం మామూలైపోయింది.

దానికితోడు ప్రజాస్వామ్య వ్యవస్థ వలన ప్రజల చైతన్యం కూడా చాలా పెరిగింది. దానికి పదే పదే ఎన్నికలు, ఎన్నికల్లో రాజకీయుల విచ్చలవిడి వాగ్దానాలు, "ఓట్ల రాజకీయాలు", ప్రతిపక్షాల ప్రోత్సాహాలు మున్నగునవి కూడా జతకావడం వలన, పరిపాలకుల ఇష్టారాజ్యాలకు వ్యతిరేకంగా ప్రజలు గొంతెత్తడం మొదలెట్టారు. అంతేకాదు వారి ప్రతి ఇబ్బందులకు, ఇక్కట్లకు ప్రభుత్వమే కారణమన్న మనస్తత్వాన్ని

పెంచుకొని ప్రతిదానికీ నష్టపరిహారం అడగడం మొదలెట్టారు. పరిపాలనా అసమర్థత పెరిగినా కొలదీ ప్రభుత్వాలు నష్టపరిహారాలు ఇవ్వక తప్పలేదు, తప్పడం లేదు.

రాజుల పాలనలపుడు వారి పరిపాలనలు ఎలాంటివైనా వాటికి వ్యతిరేకంగా ప్రజలు గొంతెత్తలేకపోయారు. కాని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు తక్కినవేవీ ఉన్నా లేకున్నా సమకూరినా సమకూరుకపోయినా గొంతెత్తే అధికారం మాత్రం గదావరంత ఎలాగూ ఉంటుంది కదామరి? అందువలన గొంతెత్తడం అలవాటైంది వారికి.

ప్రభుత్వాలు బలహీనపడినాకొలదీ తప్పు లన్నీ వాటివేనని ఒప్పుకోవడం తప్పలేదు వాటికి. "తప్పుమీదైతే ఇవ్వండి పరిహారం" అని నిలదీసి అడగడం పరిపాటయిపోయింది ప్రజలకు. వారి ఇబ్బందులకు, ఇక్కట్లకు ఒక్కొక్కసారి వారే కారణమైనా, ప్రకృతి కారణమైనా, అన్నిటికీ ప్రభుత్వమే కారణమని అనడం ఒక అలవాటుగా మారింది. వారికి ప్రతిపక్షాల అండదండలెలాగూ ఎప్పటికీ ఉండనే ఉంటాయి కదా? ప్రభుత్వంలో ఉన్న పార్టీ కూడా ఒకప్పటి ప్రతిపక్ష పార్టీయే కదామరి? అలా వారి ఒకప్పటి రాజకీయాలే వారికి మరొకప్పుడు తలనొప్పులుగా మారాయి, మారుతూనే ఉన్నాయి.

ఇంతకీ వీటిన్నిటివలన జరిగిన పరిణామమేమిటంటే, ఇపుడు ప్రతి ఆత్మహత్యకు ఏదో ఒక విధంగా పరిపాలకులే కారణం, ప్రభుత్వమే కారణమని ప్రభుత్వాన్ని బోనులో పెడుతూ లక్షలకు లక్షలు నష్టపరిహారాలు ఒక హక్కుగా అడుగుతున్నారు ఆత్మహత్య చేసుకున్న వారికి చెందినవారు. ఇలాంటి డిమాండ్‌లు చాలా వరకు ఆ మధ్య కర్షకుల నుండి వచ్చేవి. ఇపుడీ వైనం అంతటికీ ప్రాకింది, అందరికీ సోకింది. ఎవరు ఏ కారణంగా ఎచట ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వానికిపుడు నష్టపరిహారం చెల్లించవలసిన ఆగత్యం ఏర్పడింది. వారి దుష్ట దుర్మార్గ, అవకాశవాద రాజకీయాలు వారి మెడలకె ఉరిత్రాళ్ళలా మారినాయి.

మున్ముందు సర్కారు వారి ఆదరాబాదరా, ఆషామాషీ పాలసీల, విచ్చలవిడి పరిపాలనల వలన మరింకెన్నో నష్టపరిహారాలు చెల్లించవలసి రావచ్చు. వాటన్నిటికీ సిద్ధంగా ఉండాలి మరి ప్రభుత్వం. అయితే సక్రమంగా నన్నా పరిపాలించాలి, లేకపోతే నష్టపరిహారాలన్నా చెల్లిస్తూపోవాలి. ఇపుడు తప్పయిందని చెంపలు వాయించుకుంటే, పోనీలే పాపం! ఊర్కునే అమాయకులెవ్వరూ మిగలలేదు ఈ దేశంలో, అలాంటివారిని ఎవరినీ మిగలనీయలేదు మన పరిపాలకులే!

తెలంగాణా వారి ఒకే ఒక పట్టణానికి సీమాంధ్రావారి ఎసరు

-డాక్టర్ కొండలరావు వెల్చాల

అసలు ప్రత్యేక తెలంగాణా, సమైక్యాంధ్ర గొడవంతా హైదరాబాద్ చుట్టూరా తిరుగుతోంది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా, లేక కేంద్రీయ ప్రాంతంగా వదిలేసి తెలంగాణా కావాలంటే తీసికోండి, మాకు అభ్యంతరం లేదని సీమాంధ్ర నేతలు ఎందరో పదే పదే అన్నారు, ఇంకా అంటూనే ఉన్నారు (అంటే, "మనం మనం తెలుగువారం" అనే సీమాంధ్రుల ప్రేమంతా హైదరాబాద్ కొరకేనని అనుకోవాలి).

హైదరాబాద్ ఎందుకు కోరుతున్నారని అడిగితే, దానికి జవాబుగా "హైదరాబాదులో లెక్కలేనన్ని పెట్టుబడులు పెట్టాం, వాటిని వదిలి ఎలా పోగలం?" అని అంటున్నారు. అలాంటి పెట్టుబడులు మద్రాసులో, బెంగుళూరులో, విశాఖపట్టణంలో, ఢిల్లీలో, కలకత్తాలో, బళ్ళారిలో ఇదువరకు పెట్టనట్లు, ఇంకా పెడతులేనట్లు. హైదరాబాదులోని వారి పెట్టుబడులు తెలంగాణా ఇస్తే, ప్రత్యేక తెలంగాణా వస్తే తెలంగాణా వారు కాదంటున్నట్లు, వారిని ముటాముల్లె సర్దుకొని వెళ్ళిపొమ్మంటున్నట్లు, ఇకముందు హైదరాబాదులో వారి పెట్టుబడులు పెట్టనీయమంటున్నట్లు, భూములు వగైరా కొనుగోళ్ళు చేయనీయ మంటున్నట్లు, ప్లాట్లు వగైరా కట్టనీయమంటున్నట్లు, కర్మాగారాలు వగైరా నెలకొల్పనీయమంటున్నట్లు, ఉద్యోగాలు వగైరా చేయనీయమంటున్నట్లు.

హైదరాబాద్ తెలంగాణా నడిబొడ్డులో ఉంది. దాని చుట్టూరా తెలంగాణా జిల్లాలే ఉన్నాయి. అందువలన, ఉమ్మడి రాజధానయితే అది అలా ఉన్నంత కాలం కలహాలు తప్పవు. ఇప్పటి కలహాలకన్నా అప్పటి కలహాలు ఇంకా ఎక్కువవుతాయి కాని తక్కువ కావు. హైదరాబాద్‌ను కేంద్రీయ ప్రాంతం చేస్తే తెలంగాణాకు ముఖ్యపట్టణం కావడానికి చెప్పుకోదగ్గ ఒక్క పెద్ద నగరం కూడా లేదు. సీమాంధ్రకు ముఖ్యపట్టణం కాగల నగరాలు చాలా ఉన్నాయి. విజయవాడ, గుంటూరు, విశాఖ పట్టణం, మచిలీపట్నం, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు, కాకినాడ, రాజమండ్రి, విజయనగరం లాంటివన్నీ తెలంగాణా జిల్లాల నగరాలన్నిటికంటే పెద్దవే. వాటితో పోలిస్తే తెలంగాణాలోని వరంగల్ కూడా చిన్నదే.

సీమాంధ్రలో వాణిజ్యరీత్యా, వసతులరీత్యా, రోడ్డు, రైలు, ఓడ, విమాన సౌకర్యాల రీత్యా బాగా అభివృద్ధి చెందినవి పది, పన్నెండు పట్టణా లున్నాయి. గుంటూరు, విజయవాడ రెండూ కలిపితే హైదరాబాద్ - సికింద్రాబాద్ లాంటివవుతాయి.

సీమాంధ్రలో విశాఖపట్టణం, మచిలీపట్నం, కాకినాడ, భీమునిపట్నం,

నిజాంపట్నం, కృష్ణపట్నం, కొత్తపట్నం, యానాం లాంటి ఓడరేవులు కల ప్రదేశాలున్నాయి. గన్నవరం, తిరుపతి, విశాఖపట్టణం, కడప, పుట్టపర్తి, దొనకొండలో ఎయిర్‌పోర్టులున్నాయి. రైల్వే జంక్షన్‌లు, రైల్వే స్టేషన్లు కోకొల్లలున్నాయి. సీమాంధ్రలో ఉన్నన్ని హైవేలు తెలంగాణాలో ఒకటి రెండు కూడా లేవు.

ఇన్ని పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలు ఉన్నా కూడా తెలంగాణా వారికున్న ఒకే ఒక్క హైదరాబాద్‌కు ఎసరు పెట్టడం అన్యాయం, అధర్మం, పేరాశ, దురాశే అవుతుంది కాని మరొకటి కాదు. హైదరాబాద్ తెలంగాణా వారు వందలేండ్ల త్యాగాలతో కట్టి పెంపొందించుకున్న ఒకే ఒక పెద్ద పట్టణం. ఆ కాస్తా పోతే వారికి మిగిలేవన్నీ చిన్న చిన్న నగరాలే. వరంగల్ కూడా అప్పటికీ ఇప్పటికీ ఏమంత అభివృద్ధి చెందలేదు, మామూలు నగరంగానే ఉండిపోయింది. దానికి ముఖ్యపట్టణం కాగల వనరులూ లేవు, వసతులూ లేవు.

ఈ మధ్య హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని సీమాంధ్రులు చెబుతోన్న ప్రభుత్వపరమైన అభివృద్ధి కూడా హైదరాబాద్‌లోని దాదాపు 50,000 కోట్ల రూపాయల భూములు అమ్మి చేయబడిందే. హైదరాబాద్‌ను తెలంగాణా ప్రాంతంగా పరిగణించి, తెలంగాణా బడ్జెట్ కేటాయింపులను తరలించి చేసిందే. అలాంటప్పుడు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలని, లేక కేంద్రీయ ప్రాంతంగా మార్చాలని కోరడం సీమాంధ్రవారికి సబబా?

వారంటున్నట్లు ప్రత్యేక తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతాలను వేరువేరు రాష్ట్రాలుగా ఏర్పరచి హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచితే తెలంగాణా వారితో సదా పోట్లాడుతూ, కీచులాడుతూ సీమాంధ్రవారు ఇచ్చటే ఉంటారా? చుట్టూరా తెలంగాణా జిల్లాలు, తెలంగాణా జనాభా ఉన్న హైదరాబాద్‌లో సీమాంధ్రవారు నాలుగేళ్ళు కాదు, నాలుగు రోజులు కూడా ఉండగలరా? (ఈ మధ్య ఏర్పడ్డ అనేకానేక మానసిక అగాధాలమధ్య, మనస్పర్థల మధ్య?) హైదరాబాద్‌ను కేంద్రీయ ప్రాంతంగా ఏర్పరిస్తే. సీమాంధ్రవారు విజయవాడ, గుంటూరులను కలిపి ముఖ్యపట్టణం అతి తక్కువ ఖర్చుతో అతి త్వరగా స్థాపించుకోవచ్చు కాని తెలంగాణా వారికి అలాంటి సౌకర్యం ఎక్కడా లేదు. ముఖ్యపట్టణంగా వరంగల్‌ను ఎన్నుకుంటే తగు వసతులు, సౌకర్యాలు కల్పించుకోవడానికి పదిలక్షల కోట్లు కావాలి. ఎవరిస్తారు అంత డబ్బు? కేంద్రమిస్తుందా లేక సీమాంధ్రులా?

ప్రత్యేక తెలంగాణా హైదరాబాద్‌ను మినహాయించి ఇస్తే సీమాంధ్రులకు కొంత 'వెకిలి తృప్తి' కలిగితే కలగొచ్చు కాని తక్కిన సమస్యలన్నీ అలాగే ఉండిపోతాయి కదా మరి? జల సమస్యలనేంచేస్తారు, త్రాగునీటి సమస్యలనేం చేస్తారు? ఉద్యోగ సమస్యలనేం చేస్తారు? విద్యా సమస్యలనేం చేస్తారు? పెట్టిన పెట్టుబడుల సమస్యలనేం చేస్తారు? ఒక్క హైదరాబాద్‌ను పట్టుకొని వ్రేలాడితే సీమాంధ్రవారికి అది త్రిశంకు స్వర్గంలాంటిది, ఇందుచెడ్డ అందుచెడ్డ కథలాంటిది, "దురాశ దుఃఖం చేటు" లాంటిదే అవుతుంది కాని మరొకటి కాదు.

తెలంగాణ కోరుతున్నది స్వపరిపాలన

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఆర్థికాభివృద్ధి కంటే ఆత్మగౌరవం ముఖ్యం. ప్రత్యేక తెలంగాణ నాదం సారాంశమిదే. తెలంగాణ ప్రజలు కోరుతున్నది స్వేచ్ఛ, స్వపరిపాలన. వారి 'సెంటిమెంటు'కు ఉపశమనం గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని తాయిలంగా ముందుకు తోస్తున్నది! ఆర్థికాభివృద్ధి తెలంగాణ వాదులను సంతృప్తిపరచదని సమైక్యవాదులే కాదు విభజనవాదులుకూడా గుర్తించాలి. తెలంగాణ ప్రజలు తమకు జరిగిన అన్యాయాలను, తెలంగాణేతర పరిపాలకులు తమ పట్ల చూపిన వివక్షను మరిచిపోయే స్థితిలో లేరిప్పుడు. సమైక్య రాష్ట్రం పట్ల వారి మనసు విరిగిపోయింది. అభివృద్ధి మాత్రమే అవమానాన్ను మరిపించగలదా? తెలంగాణ 'సెంటిమెంటు'కు అసలు సిసలైన కారణం తెలంగాణేతర నాయకత్వం తెలంగాణ ప్రజల పట్ల చూపిన నిర్లక్ష్యం, చెలాయించిన పెత్తందారీ తనం. ఈ చేదు వాస్తవాలను పట్టించుకోకుండా అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడటం, అప్పుడు చేయనిది ఇప్పుడు చేస్తామని మభ్యపెట్టడం, మాటల గారడీతో మసిపూసి మారేడుకాయ చేయడమే అవుతుంది.

నేను విద్యావేత్తను. తెలుగు భాషాభిమానిగా 'సమైక్యవాది'ని. ప్రత్యేక తెలంగాణా వాదం తొలుత నాకు విస్మయం కలిగించినా దశాబ్దాల వేర్పాటు ఉద్యమాల చరిత్ర నన్ను భిన్నంగా ఆలోచింప చేసింది. ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో తెలుగులు, కన్నడిగులు, మరాఠీలు అన్నదమ్ముల్లా సహజీవనం చేశారు. సంస్థానం మూడు భాగాలుగా విడిపోయిన దరిమిలా కన్నడిగులు కర్ణాటకలో, మరాఠీలు మహారాష్ట్రలో కలిసిపోయాక, ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోయిన తెలంగాణ వారిలాగా మానసిక ఒత్తిళ్ళకు ఎందుకు గురికాలేదు? నాకు తట్టిన సమాధానాలు : (అ) 1956లో ఏకమైన తెలుగువారు 1969వరకు కూడా 'జోడి కుదరని దంపతుల్లాగా' మాత్రమే కలిసి వున్నారు; (ఆ) ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య భావోద్వేగపరమైన పొంతన, సాంస్కృతిక సంఘీభావం కుదరలేదు; (ఇ) ఇది తెలంగాణుల్లో 'పరాయీకరణ భావాన్ని' కలుగజేసింది. న్యాయబద్ధమైన ప్రయోజనాలలో జరిగిన అన్యాయాలు, అవమానాలు వారిని విభజనోద్యమానికి నెట్టాయి. (ఈ) సొంతగడ్డపై 'పరాయీల' మవుతున్నామన్న అంతర్గత మనో కలవరం తెలంగాణవారిలో పరాకాష్ఠకు చేరింది. ప్రత్యేక తెలంగాణ మాత్రమే తమ సమస్యలకు పరిష్కారమనే దృఢ నిశ్చయానికి వచ్చేట్టుచేసింది. (ఉ) ఈ దృఢనిశ్చయమే 1969నుంచి వారిని ఉద్యమింపచేస్తోంది; (ఊ) తెలంగాణలో వనరుల కొరత లేకపోయినా పరిపాలకులుగా ఉన్న ఆంధ్రనాయకులు వాటిని తెలంగాణ ప్రాంత అభివృద్ధికి వినియోగించలేదు; (ఎ) తెలంగాణేతర నాయకులు ఎప్పుడూ తమను తాము 'ఇచ్చేవారు'గా

పరిగణించుకొని, తెలంగాణ వారిని 'అడుక్కునే' వారిగా చూచారు. (ఏ) తెలంగాణేతర నాయకత్వం చేతుల్లో తెలంగాణవారు అనుభవించిన పెత్తందారీ ఆరళ్ళు మహారాష్ట్రులు, కన్నడిగులు తమ రాష్ట్రాల్లో అనుభవించలేదు.

'ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వమే తెలంగాణ వారికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆలోచన ఉందనడానికి ఫజల్ అలీ కమీషన్ నివేదికే నిదర్శనం. ఆ నివేదిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాంఛనే కాక దాని ఆచరణ సాధ్యాన్ని కూడా సూచించింది. ఒక్క తెలంగాణను మాత్రమే కాక మరికొన్ని చిన్న రాష్ట్రాలను కూడా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. వాటి ఆర్థిక సుస్థిరతకు కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచించింది. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల వారి ఆకాంక్షలతో పాటు ఆ ప్రాంతాల ఆర్థిక సుస్థిరతకు చెందిన అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఫజల్ అలీ కమిషన్ నివేదిక పేర్కొంది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల 'మానసిక సంతులనం' లేని కలయికను ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించారు. ఆంధ్ర, తెలంగాణాల విలీనం 'పొంతన లోపించిన పెళ్ళిలాంటి'దని, వారెప్పుడు విడిపోదలచుకుంటే అప్పుడు విడాకులు పుచ్చుకోవచ్చని ఆయన బహిరంగంగానే సూచించారు. తెలంగాణవారు మున్ముందు 'ప్రత్యేక తెలంగాణ' కోరవచ్చని నెహ్రూ ఆనాడే పసిగట్టారు.

అన్యాయాలకు అంతూ పొంతూ లేకపోవడంతో 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రజ్వరిల్లింది. ఆనాటి నుంచి తెలంగాణవారు కోరుకుంటున్నది స్వేచ్ఛే కాని అభివృద్ధికాదు. అగౌరవం నుంచి, అవమానాల నుంచి, నిర్లక్ష్యం నుంచి, వివక్షల నుంచి స్వేచ్ఛ, 'స్వేచ్ఛ'లో 'అభివృద్ధి' కూడా మిళితమయి ఉంటుంది. కాని సగటు ప్రజానీకం దానినలా అవగాహన చేసుకోలేరని తెలంగాణ నేతలు, మేధావులు ఆ మహోన్నత ఆశయానికి 'ఆర్థిక ప్రయోజనాలు', 'ఆర్థిక సమస్యలు' మున్నగువాటిని ఆలంబనగా జోడించారు. తెలంగాణవారికి జరిగిన అన్యాయాలను సాక్ష్యాధారాలతో ఎత్తిచూపారు. తెలంగాణా ప్రజలు 'ఆర్థికాభివృద్ధి' కన్నా తమ 'ఆత్మగౌరవానికే ఎప్పుడూ అమిత ప్రాధాన్యమిచ్చారు. అందుకు తెలంగాణ 'సెంటిమెంట్'కు 'ఆత్మగౌరవ' కాంక్షే తీవ్రమైనదిగా పరిగణించాలి. 'ఆర్థికాభివృద్ధి'ని కానే కాదు. (స్వేచ్ఛ లేనివారికి ఆర్థికాభివృద్ధిని ఎవ్వరూ దానంగా, ధర్మంగా సమకూర్చరు).

తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోసమే ప్రత్యేక తెలంగాణను ఆకాంక్షిస్తున్నారు. అయితే రాజకీయవాదులు ఈ అంశాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకొంటున్నారు. తెలంగాణ సమస్య ఇప్పుడు తెలంగాణ వారికెంత ఉపయోగపడుతున్నదో తెలంగాణేతర ప్రాంతాల సొంత రాజకీయ ప్రయోజనాలకు కూడా అంతే ఉపయోగపడుతున్నది. అందువలన దానిని ఇరు ప్రాంతాలవారూ తమ ప్రయోజనాలకు ఉపయోగించుకొంటూనే వున్నారు. అయితే నలభై ఏళ్ళ నుంచి

బలపుతున్నవారు మాత్రం తెలంగాణ విద్యార్థులు, యువకులు, సగటు ప్రజలే.

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు 'స్వేచ్ఛ', 'స్వపరిపాలన' కారణం కాగా 'అభివృద్ధి'ని మాత్రమే ఉపశమనంగా చూపడం సమస్యకెలా పరిష్కారమవుతుంది? పాలకులు చెబుతున్న అభివృద్ధి మిథ్య కాక నిజమే అయినా కూడా అది ఆత్మ గౌరవానికెలా ప్రత్యామ్నాయమవుతుంది? తెలంగాణా సమస్య ఒక ఆర్థిక సమస్యగానే కాక ఉద్వేగపరమైన సమస్యగా కూడా పరిణమించింది. 'భుక్తి'కి చెందిందే కాక 'ముక్తి'కి చెందిందిగా రూపొందింది. అయితే ప్రభుత్వం దానిని కేవలం ఆర్థిక సమస్యగా నిర్ధారిస్తూ దానిని అలా పరిష్కరిస్తామని పదే పదే అనడం మరొకసారి తెలంగాణవారిని అవమానపరచడమే.

తెలంగాణ ఆందోళనలో 'స్వేచ్ఛ', 'స్వపరిపాలనా ఇచ్ఛ' రెండు కీలకమైన అంశాలు. తక్కినవన్నీ వాటికి కేవలం ఆలంబనలు మాత్రమే. ఇది గుర్తించనివారు తెలంగాణ ఉద్యమం వెనక ఉన్న 'ఆత్మ'ను, 'ఉపిరి'ని గ్రహించలేరు. తెలంగాణవాదుల స్వేచ్ఛ, స్వపరిపాలన ఆకాంక్షల వెనుక ఉన్న 'తాత్విక దృక్పథం'ను విస్మరించిన వారు తెలంగాణ ఉద్యమపు 'నీతి'ని గ్రహించలేదు. వారి 'స్వేచ్ఛకు చెందిన తాత్విక దృష్టే' తెలంగాణావారిని గతంలో విదేశీ ఆధిపత్యానికి, రజాకార్లకు, నిజాంకు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా పోరాడేట్లు చేసింది. ఆ తాత్విక దృక్పథమే అంటరానితనానికి, వెట్టిచాకిరీకి, దేవదాసి తనానికి, దొరతనానికి, ఇంకా ఎన్నో ఇతర పెత్తందారీ పోకడలకు వ్యతిరేకంగా పోరాడేట్లు చేసింది. అవును, ఆ తాత్విక దృష్టే వారినప్పుడు ప్రాంతీయ పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా పోరాడేట్లు చేస్తున్నది. ఈ వాస్తవాన్ని గుర్తించాలి – ముఖ్యంగా వామపక్షాల వారు, అందులోనూ కమ్యూనిస్టు పార్టీలు. ప్రత్యేక తెలంగాణ పోరాటం కూడా ఇతర పెత్తందారీ వ్యతిరేక పోరాటాలవలెనే ప్రాంతీయ పెత్తందారీ వ్యతిరేక పోరాటమని కమ్యూనిస్టులు గుర్తించాలి. ఇది బ్రిటీష్‌వారి వలసాధిపత్యానికి, ఉత్తరాదివారి భాషా పెత్తందారీ తనానికి, ఉత్తరప్రదేశ్‌వారి రాజకీయ పెత్తందారీ తనానికి, ద్రవిడులపై ఆర్యుల సాంస్కృతిక పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా జరిగిన, జరుగుతోన్న పోరాటాలకు చేరువలోనిదని గుర్తించాలి. కమ్యూనిస్టులకు సిద్ధాంతాలతోనే కాని ప్రాంతాలతో ప్రమేయముండకూడదు. సిద్ధాంతాలే వారికి ఎంతైనా ముఖ్యం. మరి వారి సిద్ధాంతాలలో అతి ముఖ్యమైనది 'పెత్తందారీ వ్యవస్థ వ్యతిరేకత' కదా. ఆ పెత్తందారీ తనాన్ని ఎవరు, ఎచటివారు చెలాయించినా, కమ్యూనిస్టులు ఉండవలసింది పెత్తందారీతనం చలాయించేవారివైపు కాక, బాధితులవైపే కాదూ?

తెలంగాణావారు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కొరకు ఎన్నో పోరాటాలు చేశారు. ప్రత్యేక తెలంగాణ పోరాటం వారి పోరాటాల పరంపరలో మరొకటి మాత్రమే. తెలంగాణావారు చేపట్టిన పోరాటాలన్నీ సామ్యవాద పోరాటాలే. ఎందుకంటే అవన్నీ

'పెత్తందారీ వ్యవస్థ'ను వ్యతిరేకించిన పోరాటాలే. ఏవో కొన్ని స్వంత లాభాల కొరకు, స్వప్రయోజనాల కొరకు ఎవరో కొందరు వ్యక్తులు, కులాలు, మతాలు, పార్టీలు చేబట్టిన పోరాటాలు కావు. వాటికి 'స్వేచ్ఛ', 'స్వాతంత్ర్యం', 'స్వపరిపాలన' అతి ప్రధానమైన లక్ష్యాలు. అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి కోసం చేసిన పోరాటాలే అయినా వాటి వెనకాల అంతర్గతంగా ప్రవహించిన ఆరాటాలు మాత్రం 'ఆత్మగౌరవం', 'అస్తిత్వం'కు చెందినవే. ఏ సమాజమైనా, దేశమైనా, ప్రాంతమైనా వాటినే కదా కోరేది! తెలంగాణ ప్రజల్లో 'సెంటిమెంటు' బలంగా ఉందనడానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలలో ఇంచుమించు అన్ని పార్టీల అభ్యర్థులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానే 'తెలంగాణావాదాన్ని' సమర్థించి గెలవడమే తార్కాణం. రాబోయే సాధారణ ఎన్నికలలో 'తెలంగాణ సెంటిమెంటు'కు వ్యతిరేకంగా ఏ పార్టీ నిలిచినా అది దానికి ఆత్మహత్యాసదృశమే అవుతుంది. ఇది స్వయానా కాలమే చేస్తున్న హెచ్చరిక. కాలం కాస్త అటు ఇటూ అయినా, తెలంగాణ వారు గతంలో అన్ని పోరాటాల్లో గెలిచారు. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో కూడా తప్పక గెలుస్తారు. గతంలో చేసిన పోరాటాల చరిత్రే ఈ చారిత్రక అనివార్యతను చాటుతోంది.

ఇది ధర్మయుద్ధం

-డాక్టర్ కొండలరావు వెల్చాల

తెలంగాణాకు ఘనమైన గత చరిత్ర వుంది. అది అచటి శాసనాల ద్వారా, సాహిత్యాల ద్వారా, అనేకానేక త్రవ్వకాలలో బయిటపడిన నాణాలు, కట్టడాలు మున్నగువాటి ద్వారా బుజువయింది.

చరిత్ర ఉండడమంటే సంస్కృతీ, నాగరీకతలుండడమన్న మాట. సంస్కృతీ నాగరీకతలు ఉండడమంటే భావాలలో, భాషలలో, వివిధ పనులలో, నిర్మాణాలలో, నిర్వహణలలో అభివృద్ధి, అభ్యున్నతి సాధించడమన్నమాట. అలాంటి సంస్కృతీ నాగరీకతలు కలవారు ఉన్నతమైన ఆచారాలు, విద్యా విజ్ఞానాలు, పరిశోధనలు, మానవీయ, ఆర్థిక, రాజకీయ, సామాజిక విలువలు, సంస్కారాలు, కళలు, శాస్త్రాలు, నాణ్యత గల పరిపాలనలు కలవారు కావడమన్నమాట. ఆనాటి చరిత్రకు చెందిన కట్టడాలలో, నిర్మాణాలలో లభించిన సామగ్రి, వాటి నిర్మాణాలకు చెందిన విధానాలు, పద్ధతులు, ఆనాటి సంస్కృతీ నాగరీకతల మెరుగుదలలకు పెరుగుదలలకు సాక్ష్యాలు, నిదర్శనాలన్నమాట.

అలాంటి చరిత్ర, సంస్కృతీ నాగరీకతలు గల తెలంగాణావారిని ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఆంధ్రాప్రాంతపు పాలకులు చిన్నచూపు చూచి చివుక్కుమనిపించారు. వారిని అనేకానేక పక్షపాతాలకు, వివక్షతలకు గురిచేస్తూ వారి అభివృద్ధినే కాదు, వారి ఆత్మగౌరవాన్ని కూడా పదేపదే దెబ్బతీశారు. వారిని వారి నేలలోనే రెండవశ్రేణికి చెందిన పౌరులుగా ట్రీట్ చేశారు. ఆంధ్రాప్రాంత పెట్టుబడీదారులు వారి ఆర్థిక సత్తాతో, ఆంధ్రాప్రాంత నాయకులు వారి రాజకీయ సత్తాతో అనేకానేక విధాలుగా తెలంగాణావారిని దోపిడీ చేశారు, అణగద్రొక్కారు.

ఆంధ్రాప్రాంతం బ్రిటీష్ వారి పరిపాలన వలన తెలంగాణా ప్రాంతం కంటే ఆర్థికరంగంలో అభివృద్ధి చెందినమాట నిజమే. అది అందరూ ఒప్పుకుంటున్నదే. కాని సాంస్కృతిక, సారస్వత, సాహిత్య పరంగా తెలంగాణావారు వారికన్నా ఎన్నడూ వెనకబడినవారు కారని వారి చరిత్రే చెబుతోంది. సంస్కారాలలో, విలువల్లో, మానవీయ సంబంధాల్లో వారెప్పుడూ ముందే వున్నారు కాని వెనకబడిలేరు. తెలంగాణావారు "అమాయకులు", అంటే మంచివారని ఆంధ్రాప్రాంతం నాయకులు ఎన్నోసార్లు అన్నారు, ఇంకా అంటూనే ఉన్నారు. అంటే ఏమిటి? తెలంగాణాప్రాంతం వారు ఆంధ్రాప్రాంతం వారికంటే "సంచిలో" తక్కువైతే కావచ్చు కాని "మంచిలో" మాత్రం తక్కువ కాదనే గదా వారి అర్థం. అలాంటప్పుడు వారు తెలంగాణా వారిని ఎందుకు చిన్నచూపుతో చూసినట్లు, ఎందుకు వారిని కించపరచినట్లు, వారి సెంటిమెంట్లను, సున్నితమైన, సుతారమైన మనస్సులను ఎందుకు గాయపరచినట్లు?

అదే తెలంగాణా ఉద్యమానికి అసలు సిసలైన కారణమయింది. దానితోటే మొదలయ్యాయి తక్కిన అన్ని అంశాలకు చెందిన ఉద్యమాలు. దానివలననే ఆంధ్రాప్రాంతపు నాయకుల ఎన్నో వివక్షలు, పక్షపాతాలు, అన్యాయాలు బయటపడ్డాయి, ఇంకా బయటపడుతూనే ఉన్నాయి. తెలంగాణాలో ఒక సామెత వుంది "త్రవ్వినాకొద్దీ పెంకలే" యని. ఇపుడు ఆంధ్రాప్రాంత పాలకుల పాలనలకు చెందిన పెంకలు అలా త్రవ్వినా కొలదీ బయట పడుతూనే ఉన్నాయి. "మా వద్ద జమాఖర్చుల లెక్కలు మీరడుగుతున్నంత మేరకు లేవూ! లేవూ!" యని ప్రభుత్వం అంటున్నప్పటికీ ఉన్నవాటితోనే ఎన్నో అన్యాయాలు బయటికొస్తున్నాయి. మొత్తం లెక్కలు తీస్తే ఇంకా ఎన్ని అన్యాయాలు బయటికొస్తాయో ఆ దేవుడికే తెలుసు.

మీరు తక్కువ, మేము ఎక్కువ, మీరు తెలియనివారు, మేము తెలిసినవారమను దృష్టి దృక్పథం, అహంతోటే కదా ఆంధ్రాప్రాంత పాలకులు పరిపాలనా యంత్రాంగాన్ని ఎన్నో విధాల వాడుకొని అన్ని రంగాల్లో తెలంగాణా వారిని త్రొక్కిపెట్టారు. రాష్ట్రంలో, కేంద్రంలో వారికున్న శాసనపరమైన మెజారిటీని వాడుకుంటూ, అదిరిస్తూ, బెదిరిస్తూ ఎన్నో కొల్లగొట్టు పోకడలు పోయి ఉద్యోగాలలో, వనరులలో, వసతిసౌకర్యాలలో, ఆర్థిక ప్రణాళికలలో, పథకాలలో, వాటికి చెందిన బడ్జెట్ కెటాయింపుల్లో పక్షపాత వైఖరి వహించి తెలంగాణా వారి నెత్తికొట్టి వారికి చెందినవెన్నో కాజేశారు.

అలా ఎంతో ధనార్జన చేసి, దానిని "speculative activities" తో ఇబ్బడిముబ్బడి చేసికొని, తెలంగాణా వారికెంతో అన్యాయం చేసి ఆ కాజేసిన ధనంతోనే హైదరాబాదులో పెట్టుబడులు పెట్టి ఇపుడు అవి మావే, మా త్యాగాల ఫలితమే అని అంటున్నారు. ఈ పెట్టుబడులన్నీ వారికి మూడు నాలుగు విధాలుగా వచ్చాయి.

పరిపాలకుల సహాయంతో భూములు చౌక ధరలకు కాజేస్తే వచ్చాయి.

పరిశ్రమల పేరట, సంస్థల వ్యవస్థల పేరట ఎన్నో ఎకరాలు పుణ్యానికి కాజేస్తే వచ్చాయి (వీటిలో వక్ఫ్ భూములుకూడా ఎన్నో ఉన్నాయి.)

భూముల కెటాయింపుల్లో అవసరమున్న వాటికన్నా ఎంతో ఎక్కువ మేరకు పరిపాలకులతో కుమ్మక్కై 'అలాట్‌మెంట్'లు చేయించుకుంటే వచ్చాయి.

నీటిపారుదల ప్రాజెక్ట్‌లు, రోడ్లు, వంతెనలు మున్నగువాటి 'ఎస్టిమేట్'లు రెండంతలు, మూడంతలు ఎక్కువ చేయించుకొని, తక్కువ మెటీరియల్‌తో వాటిని పూర్తి చేసి గడిస్తే వచ్చాయి. (అలాంటి ఎస్టిమేట్‌ల ద్వారా ఇంకా సంపాదనలు జరుగుతూనే ఉన్నాయి ఇప్పటికి కూడా.)

నకిలీ ఆస్తి యాజమాన్యతా పత్రాలు ఎన్నో సృష్టించి వాటి ద్వారా బ్యాంకులనుండి, ప్రభుత్వం నుండి రుణాలు సేకరించడం ద్వారా వచ్చాయి.

పరిపాలకులతో, బ్యాంకు యాజమాన్యాలతో కుమ్మక్కయి ఎన్నో రుణాలను, వాటికి చెందిన వడ్డీలను 'రైటాఫ్' చేయించుకోవడం వలన వచ్చాయి.

ప్రభుత్వం నుండి ఎన్నో సబ్సిడీలు, కన్సెషన్‌లు వగైరా అర్హత వున్నా లేకున్నా రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని సాంక్షన్ చేయించుకోవడం వలన వచ్చాయి.

అలా ఆంధ్రాప్రాంతపు పెట్టుబడీదారుల పెట్టుబడుల గురించి చెప్పుకుంటూపోతే ఎన్నైనా చెప్పవచ్చు.

ఇది ఆంధ్రాప్రాంతపు పెట్టుబడీదారుల పెట్టుబడి తతంగమైతే, ఆంధ్రాపాలకులు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన తతంగం అది వేరే వుంది.

హైదరాబాద్ నగరం తెలంగాణా ప్రాంతంలో అంతర్భాగం కావడం వలన, దానిని మొదటినుండి తెలంగాణా ప్రాంతంగానే 'ట్రీట్' చేస్తూ తెలంగాణా బడ్జెట్‌నే మరలిస్తూ, తరలిస్తూ, దానికి తోడు హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలోని దాదాపు 50,000 కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలను అమ్ముకుంటూ హైదరాబాదును అభివృద్ధిచేస్తూ వచ్చారు ఆంధ్రా పాలకులు, ఆంధ్రాప్రాంతపు వనరులతో కూడా కాదు.

ఇలాంటి అన్యాయాలు, దోపిడీలు ఎన్నో బయటికి వచ్చాకే తెలంగాణావారు వారి కళ్ళు తెరిచారు. అంతవరకు నిరాటంకంగా ఆంధ్రాపెట్టుబడిదారుల దోపిడీలు జరుగుతూనే ఉన్నాయి. ఇపుడు వారి బాధంతా ఇంకా అలాంటి దోపిడీలు పరిపాలకుల కుమ్మక్కులతో జరుపుకోవాలని. తిన్నది చాలక ఇంకా తినాలని. సంపాదించుకున్నది చాలక ఇంకా సంపాదించుకోవాలని. వారి ఈనాటి సమైక్యాంధ్ర నినాదమంతా అక్షరాలా దానికొరకే. వారి ప్రాంతపు పరిపాలకులది పైచేయైతే వారికి చెందిన ఏ పరిపాలనా పరమైన విషయాలైనా, అనుమతులైనా వారికి అనుకూలంగా, అతిత్వరగా జరుగుతాయని. అందుకే కదా వారు సమైక్యాంధ్ర కావాలని కోరేది, లేకపోతే మరెందుకు?

ఆంధ్రాప్రాంతపు పెట్టుబడీదారుల సమైక్యాంధ్ర నినాదమంతా పరిపాలనా యంత్రాంగాన్ని చేజిక్కించుకుని వారి ఇష్టానుసారంగా సక్రమ మార్గంగానే కాక అక్రమ మార్గంగా కూడా కావలసినంత సంపాదించు కోవడం కొరకే. దానిలో ఏ అనుమానమూ లేదు.

ఇదంతా పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన దోపిడీ సంస్కృతి. ఈ సంస్కృతి ఎన్నాళ్ళు ఆంధ్రాతెలంగాణా ప్రాంతాలు కలిసి ఉంటే అన్నాళ్ళు సాగడం తథ్యం. ఎందుకంటే, ఆంధ్రాప్రాంత నాయకులకు తెలుసు శాసనపరమైన మెజారిటీ ఉన్నంతకాలం వారి పరిపాలనే కొనసాగుతుందని. వారి పరిపాలన సాగినంతకాలం వారు నిరాటంకంగా తెలంగాణా ప్రాంతాన్ని నిలువుదోపిడీ చేయొచ్చునని.

ఇలాంటి ఆంధ్రానాయకత్వ సంస్కృతితో తెలంగాణావారు ఎలా వేగేది? ఇప్పటికి 55 యేళ్ళనుండి ఆ సంస్కృతిని భరిస్తూనే వచ్చారు. ఇంకా ఎన్నాళ్లు భరించేది? ఆంగ్ల భాషలో ఒక సామెత ఉంది. "సంస్కృతి చాలా ఆలస్యంగా

వస్తుంది, చాలా ఆలస్యంగా పోతుంది" యని. ఆంధ్రా ప్రాంతీయులకు ఐదు వందల యేళ్ళ బ్రిటీష్ పరిపాలన నుండి వారసత్వంగా వచ్చిన ఈ సంస్కృతి ఐదు వందల యేళ్లు పట్టవచ్చు పోవడానికి. అంతవరకు తెలంగాణావారు ఆంధ్రా నాయకుల నాయకత్వంతో అన్ని విధాలా సతమతం కావలసిందేనా? అంతవరకు వారి ఆత్మగౌరవం ఉస్సూరుమనవలసిందేనా? తెలంగాణావారు ఈసారి చాలా దృఢ నిశ్చయంతో ముందుకెళుతున్నారు ఇది ఇక సాగనివ్వకూడదని, తాడోపేడో తేల్చుకోవాలని, అవసరమైతే అన్ని త్యాగాలకు సిద్ధం కావాలని. ఇపుడు వారు "వాగ్దానాల వల్లకాడుకు" సిద్ధం లేరు. వారి ఓపిక నశించింది.

ఆంధ్రానాయకులు ఒకటి గ్రహించాలి. తెలంగాణా ఉద్యమం ఎన్నాళ్ళైనా బ్రతికే ఉంటుందని. ఎందుకంటే వారిది "ధర్మయుద్ధం" కనుక. తెలంగాణా వారి లాగా పాండవులు కూడా వారి "ధర్మయుద్ధం" కంటే ముందు "మా భాగం మాత్రం మాకివ్వండి" అని సవినయంగా కోరారు. "ససేమిరా ఇవ్వమన్నారు" అటువైపు వారు. దాని పరిణామం ఏమయిందో అందరికీ తెలుసు. తెలంగాణా వారిలాగా పాండవుల సంఖ్య కూడా అప్పుడు తక్కువే, అయినా ధర్మం వారివైపు వుండడంవలన, దైవం ధర్మంవైపు వుండడం వలన వారు నెగ్గారు. ఆనాటి ధర్మంయుద్ధంలో వలెనే ఈనాటి ధర్మయుద్ధంలో కూడా ధర్మమే గెలుస్తుంది, ధర్మమే తెలంగాణా వారిని గెలిపిస్తుంది, దైవం తెలంగాణా వారి వైపే ఉంటాడు. అందులో ఏ సందేహమూ లేదు. ఆనాటి పాండవులలాగే ఈనాటి తెలంగాణావారు కూడా ఇపుడు వారి భాగం మాత్రమే అడుగుతున్నారు కాని ఆంధ్రాప్రాంతం వారి భాగం అడగడం లేదు. న్యాయంగా, ధర్మంగా అడిగే దానిని కాదంటే అదృష్టం కూడా ముఖం చాటేస్తుంది, కాలం కూడా ఎదురు తిరుగుతుంది. ఇది చరిత్రనుండి మనం నేర్చుకోవలసిన అతి ముఖ్యమైన పాఠం. ఆంధ్రా నాయకులు నేర్చుకుంటారనుకుంటా.

జనులు ఎంత అమాయకులైనా, ఎంత విద్యలకు నోచుకోనివారయినా "లోకజ్ఞానం"లో నాయకులకన్నా ఎప్పుడూ తెలివికలవారు, తెలిసినవారే యని యనిపించుకున్నారు. నాయకులు వారి కళ్ళల్లో కొన్నాళ్లు దుమ్ము కొడితే కొట్టొచ్చు, వారిని కొన్నాళ్లు కల్లిబొల్లి మాటలతో ప్రక్కత్రోవ పట్టిస్తే పట్టించొచ్చు కాని చాలానాళ్లు విషయాలను మసిపూసి మారేడుకాయ చేసి చూపిస్తూ మభ్యపెట్టలేరు. వారు తెలంగాణా ప్రాంత జనులైనా, ఆంధ్రప్రాంత జనులైనా జనులు జనులే, చాలావరకు సజ్జనులే కనుక వారు ఏనాటికైనా ధర్మాన్ని గ్రహించకపోరు, ధర్మంవైపే నిలబడకపోరు. వారికి తెలుసు ధర్మాన్ని వారు రక్షిస్తే ధర్మం వారిని రక్షిస్తుందని. ఈ విషయమే కదా తిరుపతి కొండలు "ధర్మో రక్షతి రక్షితః" యని ప్రతిధ్వనిస్తాయి అడుగడుగునా, మ్రోగుతాయి "హెచ్చరికా శంఖారావాలుగా".

ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర స్థాపనకు ఈ మధ్య ముచ్చటగా సమకూరిన మరికొన్ని మురిపాల కారణాలు

-డాక్టర్ కొండలరావు వెల్చాల

కాలం చాలా నిరంకుశమైనది. ఎంతపాటి బలవంతులైనా దానిముందు తలవంచక తప్పదు. హిట్లరు, అలెగ్జాండరంతటి వారికే అది తప్పలేదు. ఇక తక్కినవారెంతటివారు దాని ముందు.

"మొదలే ముక్కు వంకరంటే దానిపై అటుకుమీది నుండి ఊడిపడిందట అడ్డమాకొకటి". అలాంటి పరిస్థితి ఎదురైంది సమైక్యాంధ్ర నేతలకిపుడు.

ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర సమితితో పోటీపడినవారందరూ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఒకెత్తైతే, అక్షరాలా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కూడా రెండవసారి ఓడిపోవడం మరొకెత్తైంది. ఇది ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వ్యతిరేకవాదుల నోర్లు మూకుమ్మడిగా మూయించినట్లైంది.

ఇదిలా జరిగిందో లేదో, నిన్న మొన్ననే కేంద్ర ప్రభుత్వం వారు విడుదల చేసిన వెనుకబడిన జిల్లాల జాబితాలో తొమ్మిది తెలంగాణా జిల్లాలు ఉండడం మరొక దెబ్బ మీద దెబ్బ తగిలినట్లైంది వారికి. ఇపుడేమంటారు 'అభివృద్ధి వాదులు'? 'తెలంగాణా వ్యతిరేక వాదులు'? నిన్న మొన్నటివరకు కూడా ఆంధ్రా ప్రాంతం కన్నా తెలంగాణా ప్రాంతమే ఎక్కువ అభివృద్ధి చెందిందంటూ అంకెలతో నిరూపిస్తామని తొడచరిచి సవాలు చేసిన సీమాంధ్ర నేతలు? వారు శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన అంకెలన్నీ ఇపుడు తారుమారైనట్లే కదా? సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం యొక్క నిర్ణయం ప్రకారం అవన్నీ తప్పుడు లెక్కలు, అబద్ధాలని తేలినట్లే కదా?

ఒకటా, రెండా, తెలంగాణాలోని పదిలో తొమ్మిది జిల్లాలు వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణింపబడితే ఇంకా అభివృద్ధిమాట మాట్లాడడానికి ముఖం మొత్తడం లేదా సీమాంధ్రనేతలకు? ఇంకెన్నాళ్ళు అబద్ధాలకు మరికొన్ని అబద్ధాలు, మోసాలకు మరికొన్ని మోసాలు జోడిస్తూ తప్పుడు లెక్కల ఆధారంగా వాదిస్తారు?

తెలంగాణా రాష్ట్ర స్థాపనకు ఈ మధ్య సమకూరిన మరొక సానుకూల కారణం సీమాంధ్ర మంత్రులు, తదితరులు శ్రీకృష్ణ కమిటీ ముందు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రవాదులు 'దేశద్రోహులు' అని బల్లగుద్ది వాదించి, బయటికొచ్చి పత్రికా విలేఖరులతో కూడా అదే భాషలో మాట్లాడి, తెలంగాణావారంతా తిరుగుబాటు ఝుండా ఎగరేసి గొంతు విప్పగానే 'మేమలా అనలేదు,అనలేదు' అని శుద్ధ అబద్ధాలు ఆడడం. ఇది ప్రత్యేక తెలంగాణా వాదులను సీమాంధ్ర నేతలు మరొకసారి ఒకేఒక త్రాటిపైకి తీసుకొచ్చినట్లయింది. అలా కొన్ని కొన్నిసార్లు తెలంగాణా వారికంటే సీమాంధ్రనేతలే వారి అప్రస్తుత, అనవసర వాగుళ్లతో తెలంగాణా వాదానికి ఊపిరి పోస్తున్నట్లవుతోంది. అబద్ధాలాడడం, అని అనలేదనడం సీమాంధ్ర నేతలకు పరిపాటైపోయింది. అందుకే ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు ఇతర ప్రాంతాలలో కూడా వారిని నమ్మేవారి సంఖ్య దినదినం తగ్గుతోంది.

ఉదాహరణకు ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతీయులు లేవదీసిన

'ఆంధ్రా గోబ్యాక్' నినాదాన్నే ఇపుడు కర్ణాటకలోని కన్నడిగులు కూడా బళ్ళారినుండి, తదితర ప్రాంతాలనుండి లేవదీస్తున్నారు. దీనికి కారణం తెలంగాణాలో వ్యాపార ఆధిపత్యాల కొరకు రాజకీయ ఆధిపత్యాలను చేజిక్కించుకున్న పద్ధతులనే సీమాంధ్ర బడా రాజకీయవేత్తలు, వ్యాపారులు కర్ణాటకలో కూడా అవలంబించడం. తెలంగాణావారు గ్రహించినట్టే కన్నడిగులు కూడా సీమాంధ్ర వారి అతి చలాకీలను అణగద్రొక్కకపోతే వారిని కూడా వారు మింగేస్తారని గ్రహించారు. అందుకే వారుకూడా ఇకమీదట మీ ఆటలు సాగనివ్వమని తిరుగుబాటు బావుటా ఎగిరేశారు.

ఒక్క కర్ణాటకలోనే కాదు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అధిష్ఠానవర్గం సీమాంధ్ర నేతలంటే 'బాబోయ్!' అని నోరు తెరచి భయపడుతున్నారు. ఎందుకంటే రాజశేఖర్‌రెడ్డి చనిపోయాక ఇంకా అంత్యక్రియలుకూడా పూర్తికాక పూర్వమే ముఖ్యమంత్రి నియామకం అధిష్ఠానవర్గం ఇష్టమేనని, తిరిగి జగన్ వర్గీయులు ఆతడే ముఖ్యమంత్రి కావాలని హడావిడిగా సంతకాలు చేపట్టడం, అటు తదుపరి అదే వర్గీయులు అధిష్ఠాన వర్గానికి వ్యతిరేకంగా జగన్ ఓదార్పు యాత్రకు మద్దతు పలకడం అధిష్ఠానాన్ని దిగ్భ్రాంత పరచింది కనుక. వాటిని అధిష్ఠానవర్గం, కేంద్రప్రభుత్వం నమ్మకద్రోహంగా భావించాయి. అలాగే తెలంగాణా ఇస్తామని చిదంబరంగారు ప్రకటించకపూర్వం, అన్ని పార్టీలకు చెందిన సీమాంధ్ర నేతలు ఏకగ్రీవంగా కేంద్ర ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తే అలాగే అందరమూ అంగీకరిస్తామని లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి ఏకగ్రీవ నిర్ణయాన్ని పంపించి అటు తదుపరి దానికి వ్యతిరేకంగా గొంతెత్తడం కాంగ్రెస్ అధిష్ఠానవర్గం, కేంద్రప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలవారూ నమ్మకద్రోహంగా భావించారు. అలా అందరూ ఇకముందు సీమాంధ్ర నేతలను, పార్టీలను విశ్వసించాలో వద్దో తెలియక తబ్బిబ్బులు పడుతున్నారు, భారతదేశ చరిత్రలోనే ఇంతపాటి రాజకీయ 'ద్రోహం' ఇంకొకటి లేదని, ప్రజాస్వామ్యానికి ఇలాంటి రాజకీయ విశ్వాసఘాతకం ఒక గొడ్డలిపెట్టులాంటిదని, అది సీమాంధ్ర వారి నొసటిపై ఎన్నటికీ దూరంకాని నల్లటి మచ్చ లాంటిదని ఢిల్లీలో వారూ వీరూ, ఆ పార్టీవారూ, ఈ పార్టీవారనకుండా అందరూ చెప్పుకుంటున్నారు.

ఇలా సీమాంధ్రనేతలను, పార్టీలను తెలంగాణావారే కాక మద్రాసు, బెంగుళూరు, ఢిల్లీ, తదితర ప్రాంతాలవారు కూడా నమ్మదగినవారు కాదని అనుకుంటున్నారు. అంతేకాదు, అమెరికాలో నివసించే తెలుగువారిలో కూడా ఇపుడు సీమాంధ్ర రాజకీయ, వాణిజ్య దురంధరుల పుణ్యమాయని కుల ప్రాతిపదికపైన, ప్రాంత ప్రాతిపదికపైన ఒక కుంపటికి బదులు మూడు కుంపట్లు ఏర్పడ్డాయి. అలా వారి అపఖ్యాతి దేశవిదేశాలలో అంతటా ప్రాకింది, ఇంకా ప్రాకుతూనే వుంది.

తెలంగాణా సంస్కృతి, సీమాంధ్ర సంస్కృతి ఒకటే అని సీమాంధ్ర నేతలు పదే పదే అంటుంటారు. ఇలాంటి 'ఆధిపత్య సంస్కృతి', 'అణగద్రొక్కే సంస్కృతి', 'విశ్వాస ఘాతక సంస్కృతి' తెలంగాణా వారిది కాదే? కాని వారి 'చాణక్యనీతి' నుండి తెలంగాణావారు విముక్తులు కావడానికి కాలం దగ్గరపడుతోంది. తెలంగాణావారు అడగకుండానే కాలమే వారికి అన్ని అనుకూలతలు సమకూరుస్తోంది.

తెలంగాణా, ఆంధ్రావారి మధ్య మానసిక విభజన ఎపుడో జరిగింది, ఇక మిగిలింది భౌతిక విభజన మాత్రమే. ఇక ఎన్ని అవరోధాలు కల్పించినా, ఎన్ని అడ్డంకులు, అనకట్టలు కట్ట ప్రయత్నించినా అది ఆగదు.

చిరంజీవి గారి నోట 'ఆత్మగౌరవం' మాటా?

-డాక్టర్ కొండలరావు వెల్చాల

ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 'ఆత్మగౌరవం', 'ఆత్మగౌరవం' అంటూ చాలామంది మాట్లాడుతున్నారు. అనేవారంతా వారి వెనుకకు వారే మరలి చూసుకోకుండా అదే పనిగా దానిగురించి మాట్లాడుతూ దాని 'డిగ్నిటీ'ని దిగజారుస్తున్నారు. అదేదో ఆషామాషీగా మాట్లాడే విషయమైనట్లు మాట్లాడుతూ దాని 'ఇజ్జత్' తీస్తున్నారు.

రిల్కే అను మహాకవి 'రోజా' గురించి రాస్తూ

"కొందరికి తెలియనే తెలియదు పసివారికి ఓ రోజా!
నీ పసేమిటో, పరువేమిటో, ప్రమాణమేమిటో, పరాకాష్ఠేమిటో,
నిన్ను వారు వారి కోటుకు ఒక కొసమెరుపుగా ధరిస్తారు
కోటుకు కూడా తగని మొరటైనవారు.
కాని పాపం! నీవు మాత్రం ఏమిచేస్తావు
అందమంటే ఏమిటో సుతరామూ తెలియని అలాంటివారు
నిన్నలా అవమానిస్తే, అతలాకుతలం చేస్తే" అంటాడు.

అతడు రోజా గురించి ఏమన్నాడో, అది "ఆత్మగౌరవానికి" కూడా అక్షరాలా వర్తిస్తుంది. ఆత్మగౌరవం కూడా రోజాలాంటి అరుదైన అందమైన పుష్పమే. అందుకే దాని గురించి వారూ, వీరూ, అందరూ అంతరార్థం తెలియకుండా మాట్లాడడం దానిని అగౌరవం పాలు చేయడం తప్ప మరొకటి కాదు.

ఇంతకూ చిరంజీవిగారు ఎవరి ఆత్మగౌరవం గురించి మాట్లాడినట్లో నాకర్థం కాలేదు. వెతకగా వెతకగా తెలుగువారి ఆత్మగౌరవం గురించి మాట్లాడినట్లు తేలింది పత్రికా వార్త నుండి. తెలుగువారందరూ ఇపుడు ఒక్కటా అలా వారు అక్కడివారినీ, ఇక్కడివారినీ కలిపి మాట్లాడడానికి? కారే? తెలంగాణా తెలుగువారి ఆత్మగౌరవాన్ని వారి అవకాశవాదంతో దెబ్బతీసిన చిరంజీవిగారికి ఇపుడెక్కడుంది ఆ అర్హత. అది వారు ఆనాడే కోల్పోయారు ఏనాడైతే సమైక్యవాదాన్ని సమర్థించారో ఆనాడే. వారు మాట్లాడితే ఆంధ్రాప్రాంత ఆత్మ గౌరవం గురించి మాట్లాడాలి కాని తెలంగాణా ప్రాంత ఆత్మగౌరవం గురించి కాదు. ఆంధ్రాప్రాంత ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత కూడా ఆంధ్రాప్రాంత నాయకులంతా ఎప్పుడో కోల్పోయారు కనుక వారికెవ్వరికీ ఆ ప్రాంత 'ఆత్మగౌరవం' గురించి మాట్లాడే అర్హత కూడా ఇపుడు లేదు.

ఇపుడు చూద్దాం వారు ఆ అర్హతను ఎలా పోగొట్టుకున్నారో.

'ఆత్మగౌరవానికి' జీవం పోసింది ఎన్.టి.రామారావు గారు. ఆ ఆయుధాన్ని చాలా చక్కగా అర్థం చేసికొని, అది తప్ప అప్పటి పరిస్థితుల్లో ఇంకొక ఆయుధం అధికారం చేజిక్కించుకోవడానికి కుదరదని, పనిచేయదని తన లోకజ్ఞానంతో,

అనుభవంతో తెలుసుకున్న ఒకే ఒక ఆంధ్రా నాయకుడు. ఎంత బాగుండును తెలంగాణా ప్రాంత నాయకులు కూడా అతడు తెలుసుకున్నట్లు ఆ ఆయుధమే ఇప్పటి పరిస్థితుల్లో కూడా తిరుగులేని ఆయుధమని తెలిసికొని, దానినే అప్పట్లో మొదటి ఆయుధంగా ఉపయోగించడం మరచిపోయినా ఇపుడైనా ఒకే ఒక తుది ఆయుధంగా ఉపయోగించి విజయాన్ని సాధించగలిగితే. ఇప్పటికైనా వేళ మీరిపోలేదు, వారు దానిని ఎన్.టి.రామారావుగారు బ్రహ్మాస్త్రంగా వాడినట్లు వాడడానికి. నన్నడిగితే తెలంగాణా రాష్ట్ర సాధనకు ఆ మార్గం తప్ప మరో మార్గం ఇప్పటికైనా ఎప్పటికైనా మరొకటి లేదు.

అతి ప్రతిభావంతుడని పేరుగాంచిన ఇంగ్లాండ్ రచయిత ఆస్కార్‌వైల్డ్ "యుద్ధం చేయడానికి ఏ ఆయుధమైతే ఆ కాలానికి, ఆ సమయానికి సరిపోతుందో దానినే వాడాలి కాని ఇంకొక దానిని కాదు. ఇంకొకదానితో విజయం సాధ్యం కాదు, సాధ్యమయినా చాలాకాలం తీసికొంటుందని" ఒక పుస్తకంలో అంటాడు. అతడేమన్నాడో అదే వర్తిస్తుంది తెలంగాణా ఉద్యమానికి. ఎన్ని కారణాలు చెప్పినా ఆత్మగౌరవ కారణాన్ని ఏదీ మించదు. దానికి స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్ అంతగా అవసరముండదు. కొన్ని ఉదంతాలు చాలు, కొన్ని ఘటనా సంఘటనలు. కొన్ని ఒప్పందాలు, వాటిని కాదని కాలరాసిన నేపథ్యాలు.

ఇక మరొకసారి ఆత్మగౌరవం అంశానికి వద్దాం. ఆంధ్రాప్రాంత నాయకత్వం ఆ ప్రాంతంలో, ఈ ప్రాంతంలో, ఏ ప్రాంతంలో కూడా ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత ఎలా కోల్పోయారో దానివైపు.

ఏ ఆత్మగౌరవం పేరట ఎన్టీ రామారావుగారు గద్దెకెక్కారో ఆ ఆత్మగౌరవాన్నే ఆ ప్రాంతం నాయకులే దెబ్బతీసి వారిని గద్దె దించారు. ఇక అలాంటివారికి ఎలా ఉంటుంది ఆత్మ గౌరవం గురించి మాట్లాడే అర్హత?

తెలంగాణాతో చేసికొన్న ఎన్నో ఒప్పందాలను పాటించకుండా తెలంగాణా వారి ఆత్మ గౌరవాన్ని ఆంధ్రానాయకులు భంగపరిచారు. తమాషా ఏమిటంటే మొట్టమొదటి ఒప్పందాన్ని 'జంటిల్‌మెన్స్ అగ్రిమెంట్' అన్నారు. ఆత్మగౌరవం ఉన్నవారు, జంటిల్‌మెన్ అనబడేవారు ఇరువురూ ఒక కోవకు చెందినవారే. "జంటిల్‌మ్యాన్" అంటే మంచివాడు, సత్పురుషుడు, మాటతప్పని వాడు, సభ్యత, సంస్కారం తెలిసినవాడని ఆంగ్లంలో అర్థం. అలాంటి అర్థాన్ని వ్యర్థం చేసి వారు కించపరచిన వారి ఆత్మగౌరవం గురించి మాట్లాడడానికి వారికి అర్హతేముంటుంది?

నిన్నగాక మొన్న ఆంధ్రాప్రాంతపు అన్ని పార్టీల నాయకులు కేంద్రానికి "మీరు ఎలా నిర్ణయిస్తే అలాగే ఒప్పుకుంటాం, తెలంగాణా ఇస్తే మాకేమీ అభ్యంతరం లేదు" అనడమే కాకుండా లిఖితపూర్వకంగా సంతకాలు పెట్టి పంపించి, "తెలంగాణా ప్రక్రియ మొదలుపెట్టా"మని కేంద్రం ప్రకటించిన వెంటనే తిరుగుబాటు చేసిన

ఆంధ్రాప్రాంత నాయకులకు ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు ఎలావుంటుంది?

ఆంధ్రానాయకులకు చెందిన ఇంకొక మరవలేని రాజకీయ చరిత్ర వారు అప్పటి ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు గారిని, మర్రి చెన్నారెడ్డిగారిని ఎలా గద్దె దించారో దానికి చెందిన చరిత్ర. దానికొరకు వారు ఎన్ని పన్నాగాలు పన్నారో, ఎన్ని ఉన్నవిలేనట్లు, లేనివి ఉన్నట్లు కల్పించి చిత్రీకరించారో, తుదకు మతకల్లోలాలను కూడా రేకెత్తించి ఎలా వారిని గద్దె దించి ఆ గద్దెపై వారు ఆసీనులయ్యారో దానికి చెందిన చరిత్ర. అది తెలంగాణా నాయకుల ఆత్మగౌరవాన్నే కాకుండా తెలంగాణావారి ఆత్మగౌరవాన్ని కూడా కించపరచిన చరిత్ర.

ఆంధ్రా నాయకులకు వారి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కన్నా ఇతరుల ఆత్మగౌరవాన్ని భంగపరచడమెలాగో బాగా తెలుసు. దానికొరకు వారు ఎంతవరకైనా పోవడానికి వెనుదీయరు. అలాంటప్పుడు చిరంజీవిగారే కాదు ఏ ఆంధ్రా నాయకులైనా వారి ఆత్మగౌరవాల గురించే కాని ఇతరుల ఆత్మగౌరవాల గురించే కానీ మాట్లాడడానికి ఎలా అర్హత గలవారు కాగలరు?

ఈ వ్యాసం ఈనాటి ఆంధ్రా నాయకత్వానికి చెందింది. ఆంధ్రా నాయకులు వేరు, ఆంధ్రా జనులు వేరు. ఆంధ్రా నాయకత్వాని కొస్తే అచటి అన్ని పార్టీల నాయకత్వాలూ ఇపుడు దొందూ దొందేలాగా దాదాపు ఒకేలాంటివై పోయాయి.

ఆనాటి ఈనాటి హైదరాబాద్

-డాక్టర్ కొండలరావు వెల్చాల

మనం హైదరాబాద్ గురించి మాట్లాడదలచు కున్నప్పుడు 'నగరీకత' గురించి మాట్లాడుతున్నామా లేక 'నాగరీకత' గురించి, 'సంస్కృతి' గురించి మాట్లాడుతున్నామా నిర్ణయించుకోవాలి. నగరమంటే "ప్రదేశం", నగరమంటే 'మనుషులు' కూడా, అందుకే మహాకవి గురజాడ, 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నాడు.

'నాగరీకత' యన్న పదం సాధారణంగా ప్రదేశాల అభివృద్ధికి, అభ్యున్నతికి వర్తిస్తుంది, 'సంస్కృతి' అచట నివసించే ప్రజల సంస్కారాలకు. నాగరీకత, వస్తు సేవా సౌకర్యాల ద్వారా, కళల, కట్టడాల, వనరుల అభివృద్ధి ద్వారా విదితమవుతుంది. సంస్కృతి సభ్యతల, సంస్కారాల, నడకల, గుణ గణాల ద్వారా. ఒకటి రూపానికి చెందిందైతే, ఇంకొకటి గుణానికి.

మనం మొహంజోదారో, తక్షశిలా, నాగార్జున, ఈజిప్ట, గ్రీకు నాగరీకతల గురించి చదువుతాం, వింటాం. వాటి ద్వారా ఆనాటి కళలు, విద్యలు, విద్యాలయాలు, వాస్తు కళలు, రహదారులు, నీటి సౌకర్యాలు, శుచి శుభ్రతలు, వినోద వికాసాలు, శిల్ప సంపదలు, పరిపాలనా సౌష్ఠవాలు మున్నగువాటి గురించి తెలిసికుంటాం. దాన్నే 'నాగరీకత' అంటాం. వాటిలో మత, తాత్విక, దార్శనిక, విద్యా, సాహిత్య వికాసాలు మున్నగునవి కూడా వస్తాయి.

సంస్కృతి అంటే ఆయా ప్రదేశాల నివాసులకు చెందిన సభ్యతలు, సంస్కారాలు, మర్యాదలు, విలువలు, మంచి చెడులు, పరస్పర సంబంధాలు. సంస్కృతి అంటే మానవుడు సాధించిన 'మానవీయతా ప్రగతి', 'మానవీయ విలువలు' యని అర్థం. కేవలం వస్తుసేవా సౌకర్యాల ప్రగతి మాత్రమే కాదు. ఒక నగరం గురించిన అంచనా వేయడానికి ఇవి రెండూ కొండ గుర్తులు.

నాగరీకత నాణ్యత గురించి అంచనా వేస్తున్నప్పుడు ఒక కాలపు, సాంకేతిక అభివృద్ధిని మరో కాలపు సాంకేతిక అభివృద్ధితో వాటి కాలాలు వేరు కనుక పోల్చగూడదు. ఉదాహరణకు ఒకప్పుడు కంప్యూటర్లు, టీవీలు, సెల్‌ఫోన్లు మరింకెన్నో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండేవి కావు, అపుడవి కనుగొనబడలేదు కనుక. అందువలన అవి లేనప్పటి కాలాన్ని అవి ఉన్నప్పటి కాలంతో పోల్చడం సరియయింది కాదు. అందువలన ఆనాటి హైదరాబాద్‌ను ఈనాటి హైదరాబాద్‌తో పోలుస్తున్నపుడు అలాంటి వాటిని మినహాయించాలి. అంటే ఏమిటి? అప్పటి హైదరాబాద్‌ను ఇప్పటి సైబరాబాద్‌తో పోల్చగూడదు.

నాగరికత :

అప్పటి హైదరాబాద్ నాగరీకతను ఇప్పటి హైదరాబాద్ నాగరీకతతో పోల్చడానికి, అప్పటి జనాభాను ఇప్పటి జనాభాను పరిగణనలోకి తీసికొని, అప్పటి నీటి వసతులను, శుచి శుభ్రతలను, విద్యా వసతులను, గ్రంధాలయ వసతులను, వైద్య వసతులను, రవాణా వసతులను, ఉద్యానవనాల వసతులను, విద్యుత్ వసతులను, వినోద వసతులను, సాంస్కృతిక వసతులను, రక్షణ వసతులను, పరిపాలనా వసతులను ఇప్పటి వసతులతో పోల్చి చూడాలి. అలా పోల్చినపుడు, తులనాత్మకం గా ఆనాటి హైదరాబాదు నాగరీకత ఈనాటి నాగరీకత కన్నా మెరుగయిందని అనవలసి వస్తుంది.

ఒకనాటి హైదరాబాద్ జనాభా ఎనిమిది లక్షలయితే ఈనాటి జనాభా ఎనభై లక్షలు. అంటే ఇప్పటి హైదరాబాద్ అప్పటి హైదరాబాద్‌కు పదంతలు. ఎలక్ట్రానిక్ పరికరాల సౌకర్యాల విస్తరతను వదిలేస్తే తక్కిన సౌకర్యాలు పదంతలు పెరిగాయా యన్నది మనం చూడవలసి ఉంటుంది. పెరగలేదని హైదరాబాద్ నగరానికి చెందిన అన్ని రద్దీల్నీ, కాలుష్యాల్నీ బట్టి తెలుస్తోనే ఉంది.

ఒకనాడు హైదరాబాద్‌లో చార్‌మినార్, హైకోర్టు, ఉస్మానియా హాస్పిటల్, సిటీ కాలేజ్, ఆర్ట్స్ కాలేజ్, ఫలక్‌నుమా ప్యాలెస్, చౌమహల్లా మున్నగునవి ఎన్నో 'హెరిటేజ్ బిల్డింగ్స్' ఉండేవి. అలాంటివి ఈనాటి హైదరాబాద్‌లో ఎన్ని కనబడతాయి మనకు? అపుడున్నవి కూడా ఇపుడు శిథిలావస్థల్లోకి వచ్చాయి. హైకోర్టు భవనం పడిపోతోంది. ఉస్మానియా దవాఖానా ఇప్పుడో అప్పుడో కూలేట్టుంది. నిజాం కాలేజ్ చెత్తకుండీ లాంటిదయింది. ఆర్ట్స్ కాలేజ్ మేంటెనెన్స్‌కు నోచుకోక క్రుంగుతోందని అంటున్నారు ఇంజనీయర్లు. అంతపాటి సిటీ కాలేజీ ఇపుడు గుంతపాటిదయింది. ఒకప్పటి సాలార్‌జంగ్ మ్యూజియం దాని కళ కోల్పోయింది. ఫలక్‌నుమా ప్యాలెస్ మెంటెనెన్స్‌కు నోచుకోక హోటల్ పాలయింది. గోల్కోండ ఖిల్లా అప్పటికీ ఇప్పటికీ ఎన్నో వసతి సౌకర్యాలు కోల్పోయింది. పబ్లిక్ గార్డెన్ అంగడిలాంటిది, గొంగడిలాంటిదయింది. ఒకప్పటి నాగరీకతకు చెందిన ఎన్నో కళా ఖండాలు వాటి కళలు కోల్పోయాయి ఈనాడు.

ఒకప్పుడు ఇందిరాగాందీ "శిలలు కావివి, శిల్పాలు" యని కొనియాడిన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ 'కొండవరసలు' అన్యాక్రాంతమయాయి, అమ్ముడుపోయాయి. ఒకప్పుడు హైదరాబాద్ నిండా, పరిసర ప్రాంతాల్లో ఎన్నో చిన్నా పెద్దా ఉద్యానవనాలు, కొలనులు, చెరువులుండేవి, వాటిలో ఎన్నో మాయమయాయి, కొన్ని ఉండి లేని పరిస్థితుల్లో ఉన్నాయి. వాటికి చెందిన ఎంతో భూమి ఎంతో మంది ఆక్రమించుకున్నారు. వాటి ఆక్రమణల వలన, కుంభ వర్షం కురిస్తే నగరమంతటా నీరు ప్రోగై వాహనాల రాకపోకలు స్తంభించే పరిస్థితి ఏర్పడింది.

పాత నీటి పారుదల వసతులు మూసుకుపోయాయి, క్రొత్తవి చాలవు. అలా రోడ్లన్నీ ఒక్క పెద్ద వర్షానికే లొందలుగా, బొందలుగా తయారవుతున్నాయి.

అప్పటి హైదరాబాద్ నగరం నిండా ఎన్నో ఖాళీ స్థలాలుండేవి. వాటిలో ప్రభుత్వ స్థలాలే ఎక్కువుండేవి. అవి విద్యార్థులకు, యువకులకు ఆట స్థలాలుగా, వ్యాయామ స్థలాలుగా, సాహిత్య సాంస్కృతిక వినోద విలాస స్థలాలుగా, బహిరంగ సభల సమావేశాల స్థలాలుగా ఉపయోగపడేవి. వాటిలో చాలా వరకు అయితే దానం చేయబడ్డాయి లేకపోతే అమ్మబడ్డాయి. ఇపుడు హైదరాబాద్‌లో ఎన్నో అవసరాలకు స్థలాలు కరువై పోయాయి. రేపటి అవసరాలకు 'గుంటలు' కాదు 'గజాలు' కూడా లేకుండా పోయాయి. ఇలా ఎన్నో చెప్పుకుపోవచ్చు ఆనాటి ఈనాటి ఈ నగర నాగరీకత గురించి. ఇపుడు హైదరాబాద్‌లో కనిపిస్తున్నది నాగరీకత కాదు 'నగరీకత' మాత్రమే, అంతటా రద్దీ, అపరిశుభ్రత మాత్రమే, అంతటా వసతి సేవా సౌకర్యాల కొరత మాత్రమే. ఇదేనా మరి క్రొత్త నాగరీకత? క్రొత్త హైదరాబాద్? ఇదేనా మరి మనం ఒకప్పటి పచ్చందనాన్ని కాలరాసి తెచ్చుకున్న వెచ్చందనం? ఇదేనా మరి మనం 'విశాలాంధ్ర' పేరట కొని తెచ్చుకున్న 'విశాలత'. ఇది 'విశాలత' కాదు కేవలం 'నిశాలత' యని యనక తప్పదు.

<u>పరిపాలన:</u> పరిపాలనకొస్తే, మనకు కనబడేది అంతటా అవినీతి, ఆలస్యం, కుల మత ప్రాంతీయ భేదం, పక్షపాతం, ధన ప్రమేయమే కదా కనబడేది. ప్రతి విషయంలో రాజకీయ ప్రమేయం, పక్షపాతం, లంచగొండితనం తప్ప, నీతి నిజాయితీ గల పరిపాలన ఏదీ? ఇష్టా రాజ్యం తప్ప Rule of Law ఏదీ? ఇపుడు 'అనుశాసనం' 'దుశ్శాసనం' తప్ప 'శాసనం' ఏదీ?

ఇపుడీ నగరంలో కనబడేది, వినబడేది అంతటా మాఫియా రాజ్యమే కదా! స్త్రీల బలాత్కారం, విచ్చలవిడి శృంగారం, పిల్లల కిడ్నాప్, యువతుల హత్యలు, ఆత్మహత్యలు, స్థలాల ఆక్రమణ, నగరం నిండా సారా కొట్టుల విస్తరణ, విచ్చలవిడి దొంగతనాలు, రాత్రుళ్ళు ఇంటికి తిరిగి రావాలంటే అడుగడుగునా భయాలు, మిట్ట మధ్యాహ్న వేళల్లో కూడా దుకాణాల దోపిడీలు, ఇలా ఎన్నైనా చెప్పుకుపోవచ్చు ఈ నగరం పరిపాలన గురించి. అంతటా భయం! భయం! భయం! 'నయా హైదరాబాద్' కాదు, 'భయ హైదరాబాద్', 'హైదరాబాద' కాదు, పత్రికలు పదే పదే వ్రాస్తున్నట్లు 'హైదరాబాధ', 'కాంతి హైదరాబాద్' కాదు, 'భ్రాంతి హైదరాబాద్', 'ప్రశాంత హైదరాబాద్' కాదు, 'అశాంత హైదరాబాద్'. ఇంకా కొన్నాళ్ళయితే ఇది 'భాగ్యనగరం' కాదు అప్పుల బరువుతో ఆసాంతం కృంగిపోయే 'నిర్భాగ్యనగరం' కాబోతోంది.

<u>కలె సంస్కృతి</u> : ఒకప్పుడు ఇచట ఎంతో మత, కుల, ప్రాంతీయ సామరస్యం ఉండేది. అందరూ ఎంతో హాయిగా కలిసి మెలిసి కలుపుగోలుగా ఉండేవారు. పండగలు, పబ్బాలు, ఉత్సవాలు వగైరా ఉమ్మడిగా చేసికునేవారు. ఒకరి పెళ్ళిళ్ళకు

ఒకరు శుభకాంక్షలు తెలుపుటకు పోయేవారు. ఇచటి ప్రజలంతా పాపం ఒకపుడు ఎంతో అమాయకంగా. సాదా సీదాగా, సహజంగా, సహృదయంగా ఉండేవారు. విద్యావంతులు ఎంతో వినయంగా ప్రవర్తించేవారు. ఆనాటి కుటుంబాలు ఎంతో పెద్దమైనా కుటుంబీకులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఆనాటి విద్యార్థులు గురువుల యెడ ఎంతో భక్తి శ్రద్ధలు కనబరిచేవారు. ఆనాటి పితృ భక్తి, మాతృ భక్తి, భాతృ ప్రేమ ఎంతో చెప్పుకోదగినవి. అలాగే ఆనాటి దేశభక్తి, పుట్టినూరు భక్తి కూడా. కాని ఏవీ అవి ఈనాడు? దీపం పట్టి వెదకినా ఎచ్చటా కనబడవు.

ఆనాటి వారు ఎంతో నిరాడంబరంగా, నీతి నిజాయితీతో జీవించేవారు. లంచమంటే పాపంగా, నేరంగా, నీచంగా భావించేవారు, భయపడేవారు. ఇపుడు అలాంటి వారేరీ? పట్టుమని పది మందైనా దొరుకుతారా?

ఈనాటి జీవితాలన్నీ అసహజంగా, కృత్రిమంగా, కుటిలంగా, కువారంగా, అసూయా ద్వేషాలతో నిండి కుటుంబ విచ్ఛిత్తికి, సాంఘిక విచ్ఛిత్తికి, స్నేహ విచ్ఛిత్తికి, బాంధవ్య విచ్ఛిత్తికి దారి తీస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈనాటి హైదరాబాద్ సంస్కృతి 'ఎవరికి వారే యమునా తీరే' లాంటిది అయిపోతోంది. ఇదేనా మరి మనం 'విశాల హైదరాబాద్' ద్వారా సాధించింది, సాధించబోతోన్నది? ఇదే 'విశాలత' అయితే, రక్షించు సర్వేశ్వరా! రక్షించు! ఈ విశాలత నుండి.

'సంస్కృతి' ప్రధానంగా 'మానవీయతా ప్రగతి', 'మానవీయ విలువల' ప్రగతికి చెందిందని కదా మనం భావిస్తున్నాం. మత సామరస్యంగా, కుల సామరస్యంగా, ప్రాంత సామరస్యంగా, కుటుంబీకుల సామరస్యంగా 'పరస్పర సత్సంబంధాలకు' చెందినదిగా కదా మనం భావిస్తున్నాం. ఈనాడు అలాంటి పరిస్థితి ఉందా? ఏవీ ఒకనాటి 'బాంధవ్య భావాలు', ఒకనాటి స్నేహభావాలు, ఒకనాటి కుటుంబ భావాలు. ఈనాటి సంబంధాలన్నీ 'వ్యాపార' సంబంధాలు' తప్ప నిజమైన ప్రేమ సంబంధాలేనా, నిజమైన స్నేహబంధాలు, బాంధవ్య సంబంధాలేనా? నిజమైన సహజ సహృదయ సంబంధాలేనా?

ఎవరు పాడు చేశారు వాటిని? ధనదాహులు కాదా? జీవితాలను సత్సంబంధా లుగా కాక ధన సమరంగా మార్చినవారు కారా? ఇపుడు 'మన' తప్ప 'మానవుడు' ఎచట కనిపిస్తాడు మన 'విశాలాంధ్ర'లో కాస్త 'స్టాండర్డ్ ఆఫ్ లివింగ్' తక్కువయినా, 'స్టాండర్డ్ ఆఫ్ లైఫ్' ఎంత బాగుండెడిది ఒకప్పటి హైదరాబాద్‌లో సంస్కృతిని 'స్టాండర్డ్ ఆఫ్ లైఫ్' తో కదా కొలవాల్సింది. ఎంత దిగజారిపోయింది ఇపుడది. నాగరికత పెరిగింది, సంస్కృతి తగ్గింది. అందుకే కాంతి పెరిగింది కాని శాంతి తగ్గింది. స్థూలంగా ఆనాటి ఈనాటి సంస్కృతుల వ్యత్యాసాలు పక్కపేజీలో 'స్థూలంగా నాటి తెలంగాణా, ఈనాటి సమైక్యాంధ్ర సంస్కృతి' యను అంశంలో పేర్కొనబడినాయి.

నాటి తెలంగాణా
ఈనాటి సమైక్యాంధ్ర సంస్కృతి
(స్థూలంగా)

నాటి సంస్కృతికి ఆశ ప్రధానమైతే
నేటి సంస్కృతికి దురాశ, పేరాశ.

నాటి సంస్కృతికి వేదం ప్రధానమైతే
నేటి సంస్కృతికి జూదం.

నాటి సంస్కృతికి మతం ప్రధానమైతే
నేటి సంస్కృతికి అభిమతం.

నాటి సంస్కృతికి నాదం ప్రధానమైతే
నేటి సంస్కృతికి నినాదం.

నాటి సంస్కృతికి విలువ ప్రధానమైతే
నేటి సంస్కృతికి నిలువ.

నాటి సంస్కృతికి మోక్షం ప్రధానమైతే
నేటి సంస్కృతికి మోహం.

నాటి సంస్కృతికి మాట ప్రధానమైతే
నేటి సంస్కృతికి మూట.

నాటి సంస్కృతికి హరి ప్రధానమైతే
నేటి సంస్కృతికి సిరి.

నాటి సంస్కృతికి రాజు ప్రధానమైతే
నేటి సంస్కృతికి భట్రాజు.

నాటి సంస్కృతికి మోతెబరు ప్రధానమైతే
నేటి సంస్కృతికి మోరుగోపు.

నాటి సంస్కృతికి మంచి ప్రధానమైతే
నేటి సంస్కృతికి సంచి.

నాటి సంస్కృతికి స్వేచ్ఛ ప్రధానమైతే
నేటి సంస్కృతికి యదేచ్ఛ.

నాటి సంస్కృతికి ప్రవోక్త ప్రధానమైతే
నేటి సంస్కృతికి భోక్త.

నాటి సంస్కృతికి స్వభాష ప్రధానమైతే
నేటి సంస్కృతికి పరభాష.

నాటి సంస్కృతికి ఆలయం ప్రధానమైతే
నేటి సంస్కృతికి వినోదాలయం,విలాసాలయం.

నాటి సంస్కృతికి సభ్యత ప్రధానమైతే
నేటి సంస్కృతికి లభ్యత.

నాటి సంస్కృతికి పెన్నిధి ప్రధానమైతే
నేటి సంస్కృతికి నిధి.

నాటి సంస్కృతికి భక్తి ప్రధానమైతే
నేటి సంస్కృతికి భుక్తి.

నాటి సంస్కృతికి సవ్యం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ద్రవ్యం.

నాటి సంస్కృతికి నిజం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఇజేం.

నాటి సంస్కృతికి బడి ప్రధానమైతే
నేటి సంస్కృతికి రాబడి.

నాటి సంస్కృతికి జ్ఞానం ప్రధానమైతే
నేటి సంస్కృతికి పచ్చి లొక్యం.

నాటి సంస్కృతికి శుద్ధి ప్రధానమైతే
నేటి సంస్కృతికి సిద్ధి.

నాటి సంస్కృతికి బుద్ధి ప్రధానమైతే
నేటి సంస్కృతికి సమృద్ధి.

నాటి సంస్కృతికి పెద్ద ప్రధానమైతే
నేటి సంస్కృతికి గద్ద.

నాటి సంస్కృతికి వర్ణం ప్రధానమైతే
నేటి సంస్కృతికి సువర్ణం.

నాటి సంస్కృతికి నివాసం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ప్రవాసం.

నాటి సంస్కృతికి ఘనం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధనం.

నాటి సంస్కృతికి అగ్రవాదం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఉగ్రవాదం.

నాటి సంస్కృతికి 'స్వామి' ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'ఆసామి'.

నాటి సంస్కృతికి పుజారి ప్రధానమైతే
నేటి సంస్కృతికి వ్యాపారి.

నాటి సంస్కృతికి గుట్టు ప్రధానమైతే
నేటి సంస్కృతికి రట్టు.

నాటి సంస్కృతికి వివేకత ప్రధానమైతే
నేటి సంస్కృతికి వికటత.

నాటి సంస్కృతికి 'పంప' ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'కంప'.

నాటి సంస్కృతికి సిద్ధాంతి ప్రధానమైతే
నేటి సంస్కృతికి రాద్ధాంతి.

నాటి సంస్కృతికి కాంతి ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధన వాంతి.

నాటి సంస్కృతికి హేతు ప్రధానమైతే
నేటి సంస్కృతికి బండ బూతు.

నాటి సంస్కృతికి రాజ్యం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఇష్టారాజ్యం.

నాటి సంస్కృతికి యోగం ప్రధానమైతే
నేటి సంస్కృతికి భోగం.

నాటి సంస్కృతికి నేటు ప్రధానమైతే
నేటి సంస్కృతికి మాటు.

నాటి సంస్కృతికి రాముడు ప్రధానమైతే
నేటి సంస్కృతికి కాముడు.

నాటి సంస్కృతికి భక్తి ప్రధానమైతే
నేటి సంస్కృతికి భుక్తి.

నాటి సంస్కృతికి మంత్రి ప్రధానమైతే
నేటి సంస్కృతికి తంత్రి, కుతంత్రి.

నాటి సంస్కృతికి సహజం ప్రధానమైతే
నేటి సంస్కృతికి కృత్రిమం.

నాటి సంస్కృతికి నీతి ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఛాతి.

నాటి సంస్కృతికి కళ ప్రధానమైతే
నేటి సంస్కృతికి వల.

నాటి సంస్కృతికి ఊరు ప్రధానమైతే
నేటి సంస్కృతికి పక్కూరు.

నాటి సంస్కృతికి 'పెడిగ్రీ' ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'డిగ్రీ'.

నాటి సంస్కృతికి ప్రేమ ప్రధానమైతే
నేటి సంస్కృతికి హేమ.

నాటి సంస్కృతికి అందం ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'గంధం'.

నాటి సంస్కృతికి రేశం ప్రధానమైతే
నేటి సంస్కృతికి వేషం, ద్వేషం.

నాటి సంస్కృతికి రక్షణ ప్రధానమైతే
నేటి సంస్కృతికి భక్షణ.

నాటి సంస్కృతికి వాణి ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధన-వాణి.

నాటి సంస్కృతికి శిష్ట ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఇష్ట.

నాటి సంస్కృతికి పారదర్శకత ప్రధానమైతే
నేటి సంస్కృతికి దాని ప్రదర్శకత.

నాటి సంస్కృతికి పరువు ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఏకరువు.

నాటి సంస్కృతికి చెలిమి ప్రధానమైతే
నేటి సంస్కృతికి కలిమి.

నాటి సంస్కృతికి వికాసం ప్రధానమైతే
నేటి సంస్కృతికి గాసం.

నాటి సంస్కృతికి ఒప్పు ప్రధానమైతే
నేటి సంస్కృతికి దప్పు.

నాటి సంస్కృతికి నమ్మకం ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'అమ్మకం'.

నాటి సంస్కృతికి మానం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఎలాగైతేనేమి ప్రాణం.

నాటి సంస్కృతికి కవిత్వం ప్రధానమైతే
నేటి సంస్కృతికి కపిత్వం, కసిత్వం.

నాటి సంస్కృతికి ఆచారం ప్రధానమైతే
నేటి సంస్కృతికి భ్రష్టాచారం.

నాటి సంస్కృతికి 'భారతం' ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'భరతం'.

నాటి సంస్కృతికి స్నేహం ప్రధానమైతే
నేటి సంస్కృతికి స్నేహాభినయం.

నాటి సంస్కృతికి భాగవతం ప్రధానమైతే
నేటి సంస్కృతికి రాజకీయ బాగోతం.

నాటి సంస్కృతికి విశ్వాసం ప్రధానమైతే
నేటి సంస్కృతికి మోసం.

నాటి సంస్కృతికి వినయం ప్రధానమైతే
నేటి సంస్కృతికి భేషజం.

నాటి సంస్కృతికి స్వధర్మం ప్రధానమైతే
నేటి సంస్కృతికి పరధర్మం.

నాటి సంస్కృతికి అస్తిత్వం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఆస్తిత్వం.

నాటి సంస్కృతికి స్వదేశం ప్రధానమైతే
నేటి సంస్కృతికి విదేశం.

నాటి సంస్కృతికి మధురం ప్రధానమైతే
నేటి సంస్కృతికి మధిరం.

నాటి సంస్కృతికి పురాణం ప్రధానమైతే
నేటి సంస్కృతికి కిరాణం.

నాటి సంస్కృతికి సాహిత్యం ప్రధానమైతే
నేటి సంస్కృతికి సాయిత్యం.

నాటి సంస్కృతికి కట్టుబాటు ప్రధానమైతే
నేటి సంస్కృతికి గిట్టుబాటు.

నాటి సంస్కృతికి ఉపచారం ప్రధానమైతే
నేటి సంస్కృతికి అపచారం.

నాటి సంస్కృతికి రహదారి ప్రధానమైతే
నేటి సంస్కృతికి రంకుదారి, బొంకుదారి.

నాటి సంస్కృతికి యథార్థం ప్రధానమైతే
నేటి సంస్కృతికి పదార్థం.

నాటి సంస్కృతికి ఉపనిషత్తు ప్రధానమైతే
నేటి సంస్కృతికి సొత్తు.

నాటి సంస్కృతికి 'సమాజం' ప్రధానమైతే
నేటి సంస్కృతికి సమూహం.

నాటి సంస్కృతికి నాగరీకత ప్రధానమైతే
నేటి సంస్కృతికి నగరీకత.

నాటి సంస్కృతికి ఈశ్వర్యం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఐశ్వర్యం.

నాటి సంస్కృతికి గుడి ప్రధానమైతే
నేటి సంస్కృతికి గుడిపేరిట అంగడంగడి.

నాటి సంస్కృతికి విందు ప్రధానమైతే
నేటి సంస్కృతికి విందు ముందు మందు.

నాటి సంస్కృతికి గుర్తింపు ప్రధానమైతే
నేటి సంస్కృతికి వర్తింపు.

నాటి సంస్కృతికి సంస్కారం ప్రధానమైతే
నేటి సంస్కృతికి కుటిలం, కువారం.

నాటి సంస్కృతికి ఆత్మీయత ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఆస్తీయత.

నాటి సంస్కృతికి ఆచార్యుడు ప్రధానమైతే
నేటి సంస్కృతికి భ్రష్టాచార్యుడు.

నాటి సంస్కృతికి సానుభూతి ప్రధానమైతే
నేటి సంస్కృతికి స్వాహానుభూతి.

నాటి సంస్కృతికి బంధుబలం ప్రధానమైతే
నేటి సంస్కృతికి రాబందుబలం.

నాటి సంస్కృతికి బాంధవ్యం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ద్రవ్యం.

నాటి సంస్కృతికి ఆనుబంధం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధనబంధం.

నాటి సంస్కృతికి సత్యాగ్రహం ప్రధానమైతే
నేటి సంస్కృతికి నిత్యాగ్రహం.

నాటి సంస్కృతికి ఆధ్యాత్మికం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఆర్థికం.

నాటి సంస్కృతికి ఆత్మగౌరవం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ఆస్తిగౌరవం.

నాటి సంస్కృతికి విద్యాలయం ప్రధానమైతే
నేటి సంస్కృతికి వినోదాలయం.

నాటి సంస్కృతికి రామాయణం ప్రధానమైతే
నేటి సంస్కృతికి కామాయనం.

నాటి సంస్కృతికి దూరాలోచన ప్రధానమైతే
నేటి సంస్కృతికి దురాలోచన.

నాటి సంస్కృతికి వ్యవసాయం ప్రధానమైతే
నేటి సంస్కృతికి వ్యవహారం.

నాటి సంస్కృతికి హుందాతనం ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధంధాతనం, గందాతనం.

నాటి సంస్కృతికి ఆదర్శవాదం ప్రధానమైతే
నేటి సంస్కృతికి పచ్చి అవకాశవాదం.

నాటి సంస్కృతికి పరిపాలన ప్రధానమైతే
నేటి సంస్కృతికి లాలన, లోలన, కరచాలన.

నాటి సంస్కృతికి 'భరం'ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'గరం' (noise).

నాటి సంస్కృతికి నిండుతనం ప్రధానమైతే
నేటి సంస్కృతికి 'బండుతనం'.

నాటి సంస్కృతికి కాంతి ప్రధానమైతే
నేటి సంస్కృతికి ధనవాంతి.

నాటి సంస్కృతికి మమేకం ప్రధానమైతే
నేటి సంస్కృతికి స్వమేకం.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం... నాయకత్వ లోపం

– కె.సి.రెడ్డి

ఉద్యోగం దొరకటం జరిగే పని కాదని ముందే తెలుసు! నిజాం రూపొందించిన ముల్కీ రూల్స్ ప్రకారం కనీసం 15 సంవత్సరాల పాటు తెలంగాణలో ఉండి ఉండాలి. అప్పటికి ఎవరూ అంతకాలం తెలంగాణలో ఉన్న ఆంధ్రులు లేరు. కాని మనవాళ్లే, మన రెవిన్యూవాళ్లే లంచాలు తీసుకుని ఫలానావాడు, ఫలానా వూళ్లోని ఫలానా నంబరు గల ఇంట్లో 15 ఏళ్లుగా ఉంటున్నాడని సర్టిఫికెట్లిచ్చేవారు. అందుకని మనకప్పుడు ఉద్యోగాలు లేవు.

గ్రాడ్యుయేట్లకున్న ఉద్యోగాలేమిటి? పోలీసు ఎస్సై, ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్‌లాంటివి. ఈ ఉద్యోగాలను డిపార్ట్‌మెంట్ వాళ్ల దగ్గర్నుంచి మంత్రులదాకా పంచుకునేవారు. ఎస్సై ఉద్యోగం బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటిది. అందుకని 1970ల్లో ఆ ఉద్యోగం రేటు పదినుంచి ఇరవై వేలు. (అప్పుడు తులం బంగారం రేటు 200 రూపాయలని మర్చిపోకండి). తలిదండ్రులు చదువుకోడానికి డబ్బు పంపిస్తున్నారు కనుక బిఎస్సీ పాసయ్యే తీరాలి. పాస్‌కావడం పెద్ద సమస్యేం కాదు. ఉద్యోగం దొరకదు కనుక ఈ నాలుగు రోజులూ ఎంజాయ్ చేస్తే ఏం? ఆ తరువాత ఎట్లాగూ కష్టాలు తప్పవు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీ మాసాబ్‌టాంక్ రోడ్డు ప్రక్క సందులో ఉంటుంది. హాస్టల్ కాలేజీ వెనకాల. ఆ సందునుండి బయటకు వస్తే మూలమలుపుమీద అల్‌జేలా కేఫ్. మూతపడిన పిక్చర్ హవుజ్ టాకీస్‌కు దాదాపు ఎదరుగా నటరాజ్ కేఫ్. చాలా సాయంత్రాలు ఆ హోటల్‌లో కూర్చుని పోటీలు పడి సినిమా రికార్డులు వేయించుకునేవాళ్ళం. పాటకు పది పైసలు. శంకర్-జైకిషన్‌ల పాటలంటే పడి చచ్చేవాళ్లం. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని డైనింగ్‌హాల్‌కు వెళ్లి, అటునుంచటే హాస్టల్ లైబ్రరీకి వెళ్ళేవాళ్లం. డక్కన్ క్రానికల్‌లో సినిమాల పేజీ చూసి ఆ రోజు మార్నింగ్ షో ఏదుందో, రెగ్యులర్ షో ఏది చూడాలో డిసైడ్ చేసుకునేవాళ్లం. ఆబిడ్స్‌లో జమ్రుద్, ప్యాలెస్ టాకీస్, సుల్తాన్‌బజార్లో రాయల్, దిల్షాద్ టాకీసులు. ప్యాలెస్‌లో 'చల్తీకానామ్ గాడీ' ఏడుసార్లు చూసిన జ్ఞాపకం. షమ్మీకపూర్ మా అందరి ఫేవరైట్ హీరో. సాయిరాబాను, సాధన, ఆశాపారేఖ్ మొదట అతడితో నటించే ఫీల్డ్‌లో స్థిరపడ్డారు.

మాసాబ్‌ట్యాంక్‌నుండి ఆబిడ్స్‌కు 9 పైసలు, కోఠీకి 12 పైసలు బస్ చార్జీ. సాయంత్రాలు కోఠీకి వెళ్లి ఉస్మానియానుండి నిజాం కాలేజీనుండి వచ్చే మిత్రులను కిషోర్‌కేఫ్ ముందు కలుసుకునే వాళ్లం. కిషోర్‌కేఫ్‌లో పొనా (చాయ్) అద్భుతంగా వుండేది. చీకటిపడేదాకా వచ్చేపోయే ఆడపిల్లల్ని చూస్తూ, మెడికల్ కాలేజీ నుండి బయటికి వచ్చే మెడికోలను చూస్తూ కామెంట్ చేస్తుండేవాళ్లం. హాస్టల్ డైనింగ్ హాల్ మూసేసే వేళయితే కోఠీ తాజ్‌మహల్ హోటల్లో భోజనం. భోజనానికి 1.25 పైసలు మాత్రమే. అన్నం రెండు ముద్దలు పెట్టేవాళ్లుకానీ పూరీలు, చపాతీలకు లిమిట్ లేదు. ఒక్కక్కరం 15 నుండి ఇరవై దాకా పూరీలు తినేవాళ్లం.

మా హాస్టల్ వెనకవైపు నుండి వెడితే బంజారాహిల్స్, అప్పుడు బంజారాహిల్స్‌లో 10-12 ఇళ్లకు మించి లేవు. సాయంత్రాలు అక్కడక్కడా ఉన్న కల్వర్టులపై కూర్చుని ఆ బంగాళాల్లోని మా వయసు ఆడా-మొగపిల్లలు ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకుని

కబుర్లు చెప్పుకుంటుండేవారు. కరీంనగర్ జిల్లాలోని మారుమూల గ్రామం నుంచి వచ్చిన నాకు ఇదంతా ఆశ్చర్యంగా కనిపించేది. వాళ్ళమీద ఈర్ష్య కూడా కలిగేది.

మా హాస్టల్‌కు మా జువాలజీ లెక్చరర్ ముజీబుద్దీన్ వార్డెన్‌గా ఉండేవాడు. ఇద్దరు కేర్‌టేకర్లుండేవారు. ఆయన జువాలజీ పాఠం చెబుతుంటే ఇంగ్లీష్ కన్నా ఉర్దూ పదాలు ఎక్కువగా 'నౌ' దొర్లేవి. మాటిమాటికీ 'అబ్' అని తడుముకుని మళ్లీ అనేవాడు. హాస్టల్‌ది మెస్ సిస్టమ్. నేను ట్రెజరర్‌గా ఉండేవాన్ని. హాస్టల్ బిల్లు రోజురోజుకీ ఎక్కువ రావటంతో ఆడిట్ చెయ్యాలని పట్టుపట్టాను. ముజీబుద్దీన్ నాకు రెండు నెలల హాస్టల్ ఫీజు మాఫీ చేస్తానని కేర్‌టేకర్ల ద్వారా చెప్పించినా వినకుండా ఆడిట్ చేయించాం. ప్రతి స్టూడెంట్‌కి 50 రూపాయల మేర మిగిలాయి దీని ఫలితంగా. ఆయన నాకు మరుసటి సంవత్సరం హాస్టల్‌లో అడ్మిషన్ ఇవ్వలేదు. సుల్తాన్‌బజార్‌కు దగ్గర్లో ఐసామియా బజార్‌లో ఓ రెండు గదుల పోర్షన్ కిరాయకు తీసుకుని మిత్రులందరం కలిసి వుండేవాళ్లం. కాలేజీకి వెళ్లే మూటేమోకాని హనుమాన్ వ్యాయామశాలకు మాత్రం క్రమం తప్పకుండా వెళ్లేవాన్ని.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలు కాబోతున్న రోజులు. హనుమాన్ వ్యాయామశాలలో నాకు ఆంధ్ర ప్రాంతానికి చెందిన రామకృష్ణ పరిచయమయ్యాడు. క్రమక్రమంగా మిత్రుడయ్యాడు. అతడి అన్న ప్రముఖ రచయిత, చిత్రకారుడైన శీలావీర్రాజు. ఆయన రాసిన 'మైనా' అనే నవల చదివి అప్పటికే ఆయన అభిమాని నయ్యాను. రాంకోట్‌లో ఒకే ఒక్క గదిలో ఆయన కుటుంబమంతా అద్దెకు వుండేది. ఆయన తల్లి, ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలు ఉన్నారని జ్ఞాపకం. ఆయనకప్పటికింకా పెళ్లి కాలేదు. ఆ తర్వాత ఎప్పుడో ఆయన నాంపల్లిలోని ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్లో క్లర్కుగా పనిచేసేవాడు.

చిన్నప్పట్నించీ నాకు పుస్తకాలు చదవడమంటే పిచ్చి. అప్పుడు 'కాలూరాయి, వాడేవీడు' లాంటి పత్తేదారు నవలలతో చదవడం మొదలెట్టి, శరత్ సాహిత్యం వరకు చదిసేశాను. విశ్వనాథ సత్యనారాయణ 'మా బాబు' 'విష్ణుశర్మ ఇంగ్లీష్ చదువు' లాంటివి కూడా చదివాను. అప్పుడే డిటెక్టివ్ నవలల ప్రభంజనం మొదలైంది. కొమ్మూరి, టెంపోరావ్ లాంటి రచయితల పాకెట్ సైజు నవలలు పావలా కొక్కటి చొప్పున కొని చదివేవాన్ని. ఇక కాలేజీరోజుల్లో ఆంధ్రప్రభ, ఆంధ్రసచిత్రవారపత్రిక మొదలైన వారపత్రికలు - యువ, జ్యోతి మాసపత్రికలు వచ్చేవి. ఆ సమయంలోనే 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' వాళ్ళు కథల పోటీ పెట్టారు. నాకు కూడా రాయాలనిపించి, ఓ కథ రాసి శీలావీర్రాజు గారికి చదవమని ఇచ్చేను. ఆయనదాన్నంత సీరియస్‌గా తీసుకోలేదు. కథల పోటీ చివరి తేదీ దగ్గరపడ్డప్పుడు నా ఒత్తిడి మేరకు నా కథ చదివాడాయన. ఇప్పటికీ ఆయన మొహం జ్ఞాపకం నాకు. ఆ కథపేరు 'నిప్పులాంటి నిజం'. అది చదివాక 'ఇది మీరే రాశారా? నిజంగా మీరే రాశారా!' అని అంటూ అనుమానంగా నావైపు చూశాడాయన. 'అమ్మతోడు సార్, నేను రాశాను' అని చెప్పాల్సి వచ్చింది. తెలంగాణవాళ్లు రాయగలుగుతారని అక్కడివాళ్లకి నమ్మకం లేకపోవడానికి ఇది ఉదాహరణ. అప్పుడాయన కథలపోటీకి పంపమని సలహా ఇచ్చాడు. దాన్ని పత్రిక వాళ్లు, సాధారణ ప్రచురణకు స్వీకరించారు. అప్పటినుండి క్రమం తప్పకుండా ఆంధ్రప్రభకు, పత్రికకు, యువకు, రాయటం మొదలెట్టాను. పత్రికవాళ్లు 35 రూపాయల మనీ ఆర్డర్ పంపేవారు. యువ వాళ్లు అడగ్గా అడగ్గా 25రూ॥లు ఇచ్చేవాళ్లు. ఈ నేపథ్యంలో 1969 ఫిబ్రవరి 28న తెలంగాణ ప్రజా

సమితి ఏర్పాటై దాని నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. చెన్నారెడ్డి నాయకత్వంలో, మల్లికార్జున్, మదన్‌మోహన్, ఎం.సత్యనారాయణ రావు పనిచేశారు. మా నాయకుడు శ్రీధర్‌రెడ్డి వాళ్లందరికీ రాజకీయ జీవితమిచ్చింది టీపీఎస్సే. శ్రీధర్‌రెడ్డి తప్ప మిగతావారంతా ఆ ఉద్యమం వల్ల లబ్ధిపొందారు. అప్పటికి మాకు కొంత కొంత అర్థమవుతూనే వుంది, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల గురించి. ముల్కీ రూల్స్ చట్టబండలైనాయి, పెద్ద మనుషుల ఒప్పందానికి సమాధి కట్టారు. తెలంగాణలో వున్న నాన్‌ముల్కీలను తిరిగి ఆంధ్ర ప్రాంతానికి పంపాలన్న వాదనతో ఉద్యమం తీవ్రతరమైంది. కవుల్లో దాశరథి, కాళోజీ లాంటి వాళ్ల ప్రోత్సాహం విద్యార్థులకు లభించింది. ఆనాడు ఎలక్ట్రానిక్ మీడియా లేదు కనుక వార్తల కోసం పత్రికలమీదే ఆధారపడేవాళ్లం. ఆ పత్రికలు కూడా ఉదయం ఎనిమిది లోపల వచ్చేవి కావు.

మనం ప్రత్యేక తెలంగాణ అన్న ప్రతిసారి వాళ్లు ప్రత్యేక ఆంధ్ర అనేవాళ్లు. కాని హైదరాబాద్‌లో వాటా కావాలనే వాదం అప్పటినుంచీ వుంది. ఎందుకంటే నిజాం పాలనలో హైద్రాబాద్ దేశంలోనే అత్యంత ధనిక రాజధానిగా మారింది. 1948లో తెలంగాణ మిగులు బడ్జెట్ 60 కోట్లయితే మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రాంతం విడివడ్డనాడు ఆంధ్రవాళ్లకు ఒక కోటి రూపాయలు ఇచ్చి పంపించేశారు. ఆ డబ్బుతో కర్నూలు రాజధానిగా చేసుకుని మిలిటరీ వాళ్ల దగ్గర టెంట్లు అద్దెకు తీసుకుని కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్న ఆంధ్రులు ఆ తర్వాత మన హైద్రాబాద్ మీద కన్నేశారు. పాకిస్తాన్‌వాడు కాశ్మీర్ మాదేనన్నట్టు లగడపాటి, టీజీ వెంకటేశ్ లాంటి వాళ్లు హైద్రాబాద్ మాదేనంటారు. విలీనం కాకముందే హైద్రాబాద్‌ను భారతదేశానికి రెండో రాజధాని అన్నారు. అత్యంత ధనిక రాజధానిగా పేరొందిన హైద్రాబాద్ 1930లో నిజాం నిర్మించిన ఆర్ట్స్‌కాలేజీ భవనం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. లోపలికి అడుగుపెడితే బయటికి వచ్చేందుకు దారి దొరకదు. మోకాళ్ల మీద పైజామా చిరిగితే కుట్టుకునే పిసినారి అయినప్పటికీ నిజాం హైద్రాబాద్‌లో చారిత్రాత్మక కట్టడాలు నిర్మించాడు. ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాడు. తెలంగాణా అంతటా జలాశయాలు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించి ఆనాడే జలయజ్ఞానికి అంకురార్పణ చేశాడు.

నిజాం చేసిన పొరపాటల్లా తనది స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకుని తన మనుగడ కొరకు కాశిం రజ్వీ ఆసరాతో రజాకార్లను విచ్చలవిడిగా వొదిలేయడం. వాళ్లు హత్యలూ, మానభంగాలూ చేస్తూ విధ్వంసం సృష్టించారు. భూస్వాముల ఇళ్లను ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఎదిరించినవారు ఎదిరించగా, కొంతమంది ఆంధ్రప్రాంతానికి ముఖ్యంగా విజయవాడకు పారిపోతే అక్కడి వాళ్లు వీళ్లకు ఆశ్రయం ఇవ్వకపోగా ఎగతాళి చేశారు, వెక్కిరించేరు. ఇవాళవాళ్లే తెలంగాణలో చొరబడి 112 గుంటూరు పల్లెలు ఏర్పాటు చేసుకున్నారు. చవకగా ఇక్కడి భూములు కొన్నారు. తెలంగాణ ప్రజలు తెలివితక్కువవాళ్లని వాళ్లకి వ్యవసాయం మేమే నేర్పామన్నారు. గోంగూర పచ్చడి, ఆవకాయ, మద్రాసునుండి తెచ్చుకున్న ఇడ్లీసాంబార్ మీద బ్రతికేవాళ్లు మన వంటకాలను వెక్కిరించారు. మన పండుగలను ఎగతాళి చేశారు. సినిమాల్లో మనవాళ్ళ మీద సెటైర్లు వేశారు.

అయితే 1969 ఉద్యమంలో ఆంధ్రులను తరిమి తరిమి కొడితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయారు. మళ్లీ మెల్లమెల్లగా చొరబడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశంతో ముల్కీరూల్స్

అమలు చేద్దామని ప్రయత్నం చేసిన పి.వి.నరసింహారావును పదవి నుంచి తప్పించారు. అంజయ్యను జోకర్‌గా, బహ్మన్‌గా కార్టూన్లు వేశారు.

1969 మే నెలలో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి మూలంగా తెలంగాణ ఉద్యమంలో 369 మంది నా అన్నలూ తమ్ముళ్ళూ ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు అతి కిరాతకంగా ప్రవర్తించి కాల్పులు జరపటంతో ఉద్యమంలో అమరులైనవారిని తల్చుకుంటే నేటికీ కళ్లనీళ్ళు వస్తుంటాయి. బంద్ పిలుపు ఇచ్చినప్పుడు రవీంద్ర హోటల్, నవయుగ హోటల్, బృందావన్‌లాడ్జి, దుర్గావిలాస్ హోటల్ బంద్‌ను పాటించలేదు. ప్రేమ్‌కిశోర్ అనే పిల్లవాడు దుర్గా విలాస్ హోటల్‌లోకి దూసుకుపోయి ఎందుకు బంద్ పాటించలేదని అడిగితే గూండాలు అతడిని కొట్టి చంపారు. ఉద్యమం ఎన్నడూ చల్లారలేదు. లోలోపల రగులుతూనే వుంది. తెలంగాణ ప్రజా సమితి మూలంగా విద్యార్థుల మరణానికి ప్రత్యక్షంగా కారణమైన చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటికీ దోపిడీ విధానంలో మార్పేమీ రాలేదు. ఆయన కాంగ్రెస్‌తో జతకట్టి ముఖ్యమంత్రి అయ్యాడు. గవర్నర్ అయ్యాడు. అన్ని పదవులు అనుభవించాడు.

తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించగానే మొదటి సంక్రాంతి పండుక్కి తమ మూలాలు వెతుక్కుంటూ ఆంధ్రులు వెళ్లిపోయారు. హైద్రాబాద్ ట్రాఫిక్ చక్కబడింది. ట్రాఫిక్‌జామ్‌లు లేకుండా పోయాయి. అలా రెండు సంవత్సరాలు గడిచాక మళ్ళీ పరిస్థితి మొదటికొచ్చింది.

వైఎస్సార్ చనిపోతే సి.ఎం. పదవినాశిస్తున్న జగన్ ఓదార్పు యాత్ర చేస్తాడు. కేంద్ర ప్రభుత్వం అప్పుడు చనిపోయిన వారి కుటుంబాలకు లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తానని ప్రకటిస్తుంది జగన్‌కు పోటీగా. కాని తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్యలు చేసుకుని అసువులు బాసిన 400 మంది విద్యార్థులకు, యువకుల కుటుంబాలకు ఏ ఒక్కరూ మద్దతు ప్రకటించరు.

అంతేకాదు, ఆత్మహత్యలు చేసుకున్నవారికి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పట్టుబట్టరు. తెలంగాణా విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీలకు, అరెస్టులకు వ్యతిరేకంగా నోరెత్తరు, అరెస్టయినవారిని విడిపించరు. కనీసం ఇప్పైనా చేయకపోతే ఎ.పి.పి.ఎస్.సి., గ్రూప్1 పరీక్షలు నిర్వహించడం మాన్పించకపోతే తాము తమ పదవులకు రాజీనామా చేస్తామని ముఖ్యమంత్రిని హెచ్చరించరు. ఇదేమి ప్రజాస్వామ్యం? వీరు ఎలాంటి ప్రజాప్రతినిధులు? ప్రజాస్వామ్యంలో ఒక శాసనసభ్యుడి మొదటి కర్తవ్యం తన నియోజకవర్గం ప్రజల అభిష్టానుసారం ప్రజాసమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడడం, దానిపై ఒత్తిళ్లు తేవడం. తక్కినవన్నీ ఆ పిదపే. అలా చేయనినాడు వారు వారి నియోజకవర్గంలో నిలదొక్కుకోలేరు. సంస్కృతిలో 'ప్రజాస్వామ్య సంస్కృతి' ఒక భాగం. ఈ సాంస్కృతిక భాగాన్ని మరచిపోవడం ప్రజాస్వామ్యాన్ని మరచిపోవడమే అవుతుంది కాని మరొకటి కాదు. ఈ ప్రజాస్వామ్య సంస్కృతిని తెలంగాణా ప్రాంత ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వారికే కాదు, తెలంగాణావారికందరికీ దురదృష్టం.

ఇకపోతే, 40 ఏళ్ల నుండి శ్రీరాంసాగర్ నిర్మాణం కొనసాగుతూనే వుంది. ఆరేళ్లనుండి శ్రీపాదసాగర్ (ఎల్లంపల్లి) ప్రాజెక్టు నిర్మాణం అవుతూనే ఉంది. నష్టపరిహారం చెల్లింపులు మాత్రం జరగవు. నిజాం సాగర్‌లో పూడిక చేరుతుంది. దేవాదుల కాలువలకి నీళ్లురావు.

మంత్రి జీవన్‌రెడ్డి హయాంలో సాంక్షనయిన నాలుగు లైన్ల రాజీవ్ రహదారి పనులు చేపట్టనేలేదు. రోజుకు సరాసరిన ఆ రోడ్డుపై కనీసం ఇద్దరన్నా చస్తున్నారు. ట్రాఫిక్ లేని పులివెందుల - ఇడుపాయల రోడ్డుకి నాలుగు లైన్ల రోడ్డు నిర్మిస్తారు. సీమాంధ్ర విద్యా

సంస్థలకు మనకన్నా నాలుగు రెట్లు నిధులు విడుదలవుతాయి. హైద్రాబాద్‌లో సీమ ఫ్యాక్షనిస్టులు భూకబ్జాలు చేస్తారు. ఎదిరించిన వారిని చంపేస్తారు. పోలీసు ఉన్నతాధికారులు అక్కడి వారే కనక వారిని సమర్థిస్తారు.

54 ఏళ్లుగా జరుగుతున్న ఈ అన్యాయానికి అంతమెప్పుడు? నిజాం పాలనలో కలిసి పీరీల పండుగ (మొహర్రం) చేసుకున్నాం. నిజాం పాలనలో మన స్త్రీలు పరదాల్లో మర్దానా కనపడకుండా ఉన్నారు. ఇవాళ చిలకలూరిపేట, పెద్దాపురం, అమలాపురం మొదలయిన చోట్ల నుండి ఆంధ్రులు మన పోలీసు స్టేషన్‌లున్న ప్రతిచోటికీ వ్యభిచారులను ఎగుమతి చేస్తున్నారు. వైఎస్సార్ చలవతో, రోశయ్య దీవెనలతో ఊరూరా బెల్టుషాపులు వెలిశాయి. ఓ చేత్తో 2 రూపాయల కిలోబియ్యం ఇస్తూ, ఉపాధిహామీ పథకాలు, పెన్షన్లు ప్రవేశపెడుతూ, మరో చేత్తో మందు పేరుతో కుటుంబాలు విచ్ఛిన్నం చేస్తున్నారు. లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ్ అన్నట్టు మనల్ని బిచ్చగాళ్లుగా మారుస్తున్నారు. కూటికి లేక గల్ఫ్‌కు వలసపోయిన తెలంగాణ కూలీలు వారానికి మూడు శవాలుగా పెట్టెల్లో తిరిగి వస్తున్నారు, ఆంధ్రప్రాంతం నుండి ఒక్కరన్నా అరబ్‌దేశాలకి వెళ్ళారా? చదువుకున్న తెలంగాణావాసులు అమెరికా, ఇంగ్లాండ్, న్యూజీలాండ్, కెనడా, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు బ్రతుకుదెరువుకు వెళ్ళుతున్నారు. ఆంధ్రప్రాంతం నుంచి ఎంతమంది వెళ్ళుతున్నారు? అభివృద్ధి జరిగితే మనవారు ఎందుకు విదేశాలకు అంతమంది వలసపోతారు? దానికి అభివృద్ధి జరిగిందని గొంతు చించుకునేవారు ఏమి జవాబు చెబుతారు?

ప్రభాకర్‌గారు నిర్మించిన 'బతుకమ్మ' తెలంగాణ సినిమాలో ఒకపాట వింటుంటే రక్తం మరిగిపోతుంది. గాయని ఆ పాటను నాభిలోంచి ఉబికి వచ్చే ఆవేశంతో పాడింది. ప్రభాకర్ గారిని ఆమె ఎవరని అడిగితే, ఆ గాయని ఖమ్మంకు చెందిన సౌజన్య అని చెప్పినట్లు గుర్తు.

"రండి కదలిరండి, పోరు దండు పిలుస్తోంది/మండుతున్న గుండెల దండోర మోగుతోంది
భూమికొరకు, భుక్తికొరకు, దోపిడీ విముక్తి కొరకు/శక్తినంత ధారబోసి చరిత్రను సృష్టించినాం
అల్లదిగో ప్రపంచానికి అన్నం పెట్టి మేము/ఆకలి అవమానాలతో అల్లాడి చస్తున్నాం
పోరాటమె బ్రతుకంతా, పోయేదేముంది మనకు/చావైనా, రేవైనా సమరానికి సై అంటూ..."

ఇంటర్నెట్‌లో 'యూట్యూబ్'కి వెళ్ళి 'Telangana Questions the Indian Nation' అని సెర్చి చెయ్యండి. ఈ పాట నేపథ్యంలో వినిపిస్తుంటే మొన్నటికి మొన్న ఉస్మానియా ఆవరణలో, వేరే చోట్లలో పోలీసులు చేసిన దౌర్జన్యాలు, లాఠీచార్జీలు ప్రత్యక్షంగా కనపడతాయి. ఆనాడు ఈశ్వరీబాయి చెప్పిందంతా ఇవాళ కూడా కళ్లకు కట్టినట్లు కనబడుతుంది. ఈ పోలీసుల హింసాకాండను పత్రికల్లో సేకరించి Wahtmahesh అనే ఆయన దృశ్యరూపం ఇచ్చేడు. అది చూస్తున్నంత సేపు మన పిల్లలు మన తెలంగాణ కొరకు ఎంతగా తాపత్రయపడుతున్నారో మనకు అవగతమవుతుంది. గుండె రగిలిపోతుంది. సీమాంధ్ర నేతలు తలపెడుతోన్న ఈ అన్యాయాలన్నిటికీ తెలంగాణావారి మధ్య, సీమాంధ్ర వారి మధ్య ఉన్న సాంస్కృతిక విభేదాలే కారణమని, సాంస్కృతిక విభేదాల వలననే తక్కిన విభేదాలు, విరోధాలని చెప్పకతప్పదు. ప్రత్యేక తెలంగాణా పోరాటానికి అసలు మూలం ఈ సాంస్కృతిక వ్యత్యాసాలలోనే ఉందన్న మౌలిక సత్యాన్ని 'తెలంగాణా సాంస్కృతిక సమాఖ్య' శ్రీకృష్ణ కమిటీ దృష్టికి ఇంతవరకే తీసుకొచ్చారు. వారన్నది అక్షరాలా నిజం. ప్రత్యేక తెలంగాణా పోరాటానికి తక్కిన కారణాలన్నీ ఒకెత్తయితే సాంస్కృతిక విభేదాల కారణం మరొకెత్తు.

18570


Kotilingala
Karimnagar Dist.
Telangana


Dhulikatta
Karimnagar Dist.
Telangana